
5/1/2011.



నూతన సంవత్సర శుభాకాంక్షలు

అఖిల

అఖిలభారత పత్రిక – జనవరి 2011

దివ్య శక్తి

విషయసూచిక

అనుబంధం

ఆగస్టు 15 దర్శన సందేశం

దేనినైనా సందేహించవచ్చు. కాని భగవంతుడ్ని మాత్రమే కాంక్షించేవారు భగవంతుడ్ని పొందడం నిశ్చయం. రెండు రెళ్ళు నాలుగు కన్నా నిశ్చయం. ప్రతి సాధకుని హృదయంలో అటువంటి అకుంఠిత విశ్వాసం ఉండాలి. ప్రతి తప్పటడుగులో, అగ్నిపరీక్షలో, విఘాతంలో అది అతనికి ఆధారంగా ఉంటుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

అట్ట మీద పుష్పానికి శ్రీమాత ఇచ్చిన ప్రాధాన్యత: '**దివ్యశక్తి**'



నిశ్చలంగా కూర్చుని అంతరంగంలోకి వెళ్లు

నవంబరు, 29, 1913

ఈ అలజడి, ఈ కదలికలు, ఈ నిష్ప్రయోజనమైన కలవరపాటంతా ఎందుకు? తుఫానులో చిక్కుకున్న కీటకాల దండువలె ఈ ఒడుదుడుకుల సుడిగాలిలో మనుషులెందుకు కొట్టుకుపోతున్నారు? ఫలితం లేని ప్రయత్నాలు, వృధా అగుచున్న శక్తిసామర్థ్యాలు చూచుటకు ఎంత విచారకరము! ఏమి ఆడిస్తున్నారో, ఎవరు ఆడిస్తున్నారో తెలియని తోలుబొమ్మలలాగ, ఈ మనుషులు ఆడటం ఎప్పుడు ఆపుతారు? నిశ్చలంగా కూర్చుని అంతర్ముఖులై, తమను తాము గుర్తించి, ఆ పరమాత్ముని యొక్క అమూల్యసంపదకు, ఆతని అనంత వరాలకు అడ్డుగానున్న అంతఃద్వారాన్ని తెరవడానికి వీరికి ఎప్పుడు సమయం దొరుకుతుంది?

అజ్ఞానము, అస్పష్టతలతో, మతిలేని ఆవేశంతో నిరుపయోగంగా చెల్లాచెదురై వున్న వీరి జీవితాలు ఎంత విచారకరంగా, ఎంత నికృష్టంగా ఉన్నాయి! ఎప్పుడు భగవంతుని మహోన్నత దివ్యతేజములోని ఒక కాంతికిరణము, ఆ దివ్యప్రేమలోని ఒక బిందువు, ఈ దుఃఖాన్ని ఆనందాంబుధిగా మారుస్తుంది!

హే భగవాన్, మీకై నా హృదయము నుండి ఎగసివస్తున్న విన్నపమది: మీ నిశ్చల ప్రసన్నత నుండి ఉదయించిన శాంతిని, ప్రశాంత ప్రబల శక్తిని జనులు తెలుసుకుందురు గాక — ఎవరి నేత్రములు ఉన్మీలతములైనవో, ఎవరు వారి తేజోమయ అంతరంగమునందు మీ పై ధ్యాసను నిలుపుకోగలరో, అట్టి వారి ప్రత్యేక హక్కు ఇది.

కాని దైవము అభివ్యక్తమయ్యే సమయము ఆసన్నమైనది.

త్వరలో ఉల్లాసభరిత విజయగీతికలు నలుదిక్కులా మార్మోగుతాయి.

ఈ ఉత్సవ వేళలో భక్తితో శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

మూలం: శ్రీమాత

అనువాదం: సిద్దులగారి త్రివేణి



ప్రీతి ఘోష్‌గారి వర్ణచిత్రం

నిన్ను నీవు తెలుసుకో — నీ కర్తవ్యాన్ని తెలుసుకో

మనలోని ప్రతి ఒక్కరి ఆత్మ మరియు ఆ అద్వితీయ విశ్వాత్మ ఒక్కటే. అస్తిత్వము కలిగి వున్న అన్నింటిలోను అనంతకాలం నుండి ఒకే మూలపదార్థం, ఒకే మూలతత్వం కొనసాగుతున్నందున, ఎందుకు మనము అస్తిత్వాన్ని మూలపదార్థానికి భిన్నంగా చూస్తున్నాం? మనకు, మన ప్రారంభానికి మధ్య ఎందుకు అంతరం ఏర్పరుస్తున్నాం?

సనాతన సాంప్రదాయం చక్కగా నిర్వచించింది 'మన మూలము, మనము, మన దైవము ఒక్కటే', అని.

ఈ ఏకత్వాన్ని ఏదో ఒక సన్నిహిత సంబంధం వలన ఏర్పడిన కలయికగా అర్థం చేసుకోకూడదు. నిజమైన ఐక్యతగా తెలుసుకోవాలి.

అందువలన, ఏ వ్యక్తయినా దైవాన్వేషణ చేస్తున్నపుడు, ఆ దైవాన్ని చేరుకొన డానికి ఒక్కొక్క మెట్టు అధిరోహించ ప్రయత్నిస్తున్నప్పుడు, తనకున్న జ్ఞానంకాని, అంతర్బుద్ధి కాని ఒక్క అడుగైన తనను ముందుకు నడిపించలేదని మరిచిపోతాడు. దానితో పాటు ఏది తాను పొందాలని కోరుకుంటున్నాడో, ఏది తనకు బహుదూరంగా ఉందని నమ్ముతున్నాడో, అది నిజానికి తన లోపలనే ఉన్నదని తెలుసుకోలేడు.

తనలోనే ఆ మూలపదార్థం ఉన్నదనే చైతన్యం కలిగేదాక, దాని గురించి ఎలా తెలుసుకోగలడు?

తన్ను తాను అర్థం చేసుకొనుట ద్వారా, తన్ను తాను తెలుసుకొనుటను నేర్చుకొనుట ద్వారా, అతను ఈ సర్వోత్కృష్టమైన సత్యాన్ని కనుక్కోగలడు. అప్పుడు, బైబిలులోని మూలపురుషుని వలె, 'దైవం యొక్క నివాసం ఇక్కడే. అది నేను తెలుసుకోలేకపోయాను' అని ఆశ్చర్యంతో కేకలు వేస్తాడు.

అందుకని, ఈ భౌతిక ప్రపంచాలకు మాతృప్రాయమగు సూచన 'సమస్త వస్తు సముదాయంలోను, సమస్త జీవకోటిలోను ఉన్నది నేనే', భూనభోంతరాలను నింపాలి, అది అందరికీ తెలిసిరావాలి.

అందరికీ ఈ విషయం తెలిసినప్పుడు, గొప్ప పరివర్తన సంభవించుననే వాగ్దానం నెరవేరే రోజు మనకు చేరువవుతుంది. పదార్థంలోని ప్రతి అణువులోను అంతర్భూతంగా వున్న దైవాన్ని గురించిన ఆలోచనను అందరూ గుర్తించినప్పుడు, సజీవంగానున్న ప్రతి ప్రాణిలోను ఈ దివ్యసంకేతాన్ని సూచనప్రాయంగా గ్రహించినప్పుడు,

ప్రతి మానవుడు తన సోదరునిలో దైవాన్ని చూడగలిగినప్పుడు, ఈ అంధకారాన్ని, ఈ అసత్యాన్ని, ఈ అజ్ఞానాన్ని, ఈ పొరపాట్లను, ప్రకృతినంతా కృంగదీస్తున్న ఈ దుఃఖభారాన్ని, ఈ దుర్భర చీకట్లను పారద్రోలే ప్రసన్న ఉషోదయం మనలను పల కరిస్తుంది. ఎందుకనగా, 'ప్రకృతి అంతా బాధతో, ఆవేదనతో ఎదురుచూస్తోంది, ఆ దైవపుత్రులు ప్రసాదించే దివ్యజ్ఞానం కోసం'.

ఇదే నిజానికి అన్ని ఆలోచనల సమాహారానికి కేంద్రబిందువుగానున్న ముఖ్యమైన ఆలోచన. ఈ ఆలోచన ఎల్లప్పుడు మన జ్ఞాపకాలలో మెదలాలి, నిరంతరం జాగృతి కావాలి — నిత్యకాంతితో జీవితాన్నంతా తేజోమయం గావించే సూర్యుని వలె.

అందుకే ఈ రోజు దాని గురించి మీకు జ్ఞాపకం చేశాను ;మన హృదయాల్లో ఈ భావనను ఒక అరుదైన రత్నం వలె, ఒక అమూల్యమైన నిధి వలె నిలుపుకొని, మనము ఈ సాధనామార్గంలో సాగినప్పుడు, అది అంతర్గతంగా మనలో కాంతిని నింపి, రూపాంతరాన్ని సంభవింపచేయటానికి సానుకూలత కనపరచినప్పుడు, అన్ని జీవులలోను, అన్ని వస్తువులలోను కేంద్రబిందువు అదేనని గుర్తించగలుగుతాము. ఆ భావనలో ఈ విశ్వమంతా ఒక్కటే అన్న అద్భుత అనుభూతిని పొందగలుగుతాము.

అప్పుడు మన చిన్న చిన్న అసంతృప్తులు, మన తెలివితక్కువ కలహాలు, మన అల్పమైన తీవ్రవాంఛలు, మన అకారణ కోపాలు, ఎంత స్వాతిశయంతో కూడుకున్నవో, మన మెంత చిన్నపిల్లల వలె ప్రవర్తిస్తున్నామో, అర్థం చేసుకుంటాము; మన చిన్న చిన్న లోపాలన్నీ అంతరించిపోవుట అవగతమౌతుంది; మన మొండి అహంతో పాటు మన పరిమిత వ్యక్తిత్వ వికసనానికి అవరోధాలుగా నున్న అడ్డుగోడలు కూలిపోవడం చూడగలము. ఏదైతే మనలను ఈ సంకుచిత పరిమితుల నుంచి, హద్దుల నుంచి విడుదల చేస్తుందో, అలాంటి నిజమైన ఆధ్యాత్మిక మహాప్రవాహంలో తేలిపోతున్నట్టి అనుభూతిని పొందగలము.

వ్యక్తిగత ఆత్మ — విశ్వాత్మ, ఒక్కటే. ప్రతి లోకంలో, ప్రతి ప్రాణిలో, ప్రతి వస్తువులో, ప్రతి అణువులో భగవంతుని ఉనికి ఉన్నది. మనిషి కర్తవ్యం దానిని అభి వ్యక్తం చేయుటయే.

అది నెరవేర్చాలంటే, అతని లోపల నున్న దైవం యొక్క ఉనికిని గురించిన ఎరుక అతనికి కలగాలి. దీనిని సాధించడానికి, కొందరు వ్యక్తులు ఒక నిజమైన తర్ఫీదును పొందాలి. అలాంటివారిలో అహంకారం అధిక మోతాదులో ఉంటుంది.

వారు ముఖ్యంగా మొండివారుగాను, మార్పును ఇష్టపడని సాంప్రదాయవాదులుగాను ఉంటారు. వీటితో వారు పడే సంఘర్షణ సుదీర్ఘమైనది మరియు బాధాకరమైనది కూడ. దీనికి వ్యతిరేకంగా ఎవరైతే వారి వ్యక్తిత్వానికి అధిక ప్రాధాన్యత నీయరో, ఎవరి స్వభావం సరళమైనదిగా, మృదువైనదిగా నుంటుందో, ఎవరు ఆధ్యాత్మికత వైపు ఎక్కువ మొగ్గుచూపుతారో, అలాంటివారు వారి అస్తిత్వములోని అక్షయమైన, దైవికమైన మూలపదార్థానికి సులువుగా దగ్గర కాగలరు. అయితే ఒక్కటి మాత్రం మరువకూడదు. వారు కూడ తమలోని స్వచ్ఛమైన చైతన్యకాంతి ప్రసరణ ఎన్నటికి మందగించకుండా జాగృతులై ఉండుట కోసం, ప్రతి నిత్యం అనుకరణకు, పరివర్తనకు అనువైన రీతిగా తమను తాము మలచుకొనుటకుగాను, అంకితభావంతో ఒక క్రమబద్ధమైన కృషి చేయవలసి ఉంటుంది.

ఒక్కసారి ఈ ఉదాత్తమైన చైతన్యస్థాయిని పొందగలిగితే, మన దృక్పథంలో ఎంత గొప్ప మార్పు సంభవిస్తుంది! అవగాహన ఎంతగా విస్తృతమౌతుంది, కారుణ్యం ఎంతగా పొంగుతుంది!

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

సింధువులో కలవలేని బిందువుగా మిగిలిపోవద్దు

మన 'యోగం' లో త్యాగం అనే దానికి స్థానమే లేదు. అసలు 'త్యాగం' అనేదాన్ని నీవు అర్థం చేసుకోవటం మీదనే అంతా ఆధారపడి ఉంది. సరిగా అర్థం చేసుకుంటే 'త్యాగం' అంటే అంకితం అయిపోవటం; దైవానికి తనను తానుగా సమర్పించుకోవటమే. కాని ప్రస్తుతం ప్రచారంలో ఉన్న అర్థం ప్రకారం 'త్యాగం' ఒక వ్యతిరేక భావన. అది వినాశనానికి దారి తీస్తుంది. అలాంటి 'త్యాగం' దేన్నీ సాధించలేదు. కాగా ఉన్నదాన్నే పోగొట్టుకుంటుంది. ఇదొక విధమైన 'ఆత్మాహుతి'! మీ కున్న అవకాశాలనన్నీ పోగొట్టుకుంటున్నారన్న మాట. వ్యక్తిత్వాన్ని భౌతికస్థాయి నుండి ఆధ్యాత్మికస్థాయికి తీసుకొనివెళ్ళే అవకాశాన్ని త్యాగం చేస్తున్నారు. త్యాగం మీ అస్తిత్వాన్ని తగ్గిస్తుంది. మీ జీవితాన్ని లేక దేహాన్ని త్యాగం చేశారనుకోండి. మీరు భౌతికాన్ని లేక వాస్తవిక (వస్తుసంబంధ) అవకాశాలను వదలుకుంటున్నారన్న

మాట. మీ ఉనికనే మీరు పోగొట్టుకుంటున్నారు!

ఇదే విధంగా నైతికజీవనాన్ని కూడా మీరు వదులుకోవచ్చు; అంతరంగానికి ఉన్న వైశాల్యాన్ని, స్వేచ్ఛను పోగొట్టుకోవచ్చు. కాని బలవంతంగా నిరోధించటంలో స్వీయనిరాకరణ, సంకుచితత్వం, వత్తిడి కూడా మిళితమై ఉంటుంది. ఇటువంటి 'ఆదర్శం' ఆత్మకు సహజంగా వుండే స్వతఃసిద్ధతకు అవకాశం ఇవ్వదు. మన ఉద్దే శ్యంలో 'సమర్పణ' అంటే అప్రయత్నంగా ఒకానొక మహత్తర దివ్యత్వంతో మమేకం అవడం (రమించడం). మనం ఆ బృహత్ చైతన్యంలో భాగమే గదా! 'సమర్పణ' దేనినీ తగ్గించదు; విశాలం చేస్తుంది. వ్యక్తిత్వాన్ని నశింపచేయదు; బలోపేతమూ, విశ్వవ్యాప్తమూ చేస్తుంది. 'సమర్పణ' అంటేనే స్వేచ్ఛగా, సంపూర్ణంగా, సంతోషంగా దివ్యత్వంతో మమేకం అవడం. సర్వం దైవానికి సంతోషంగా సమర్పించటం. ఇందులో మనం త్యాగం చేసేది ఏమీ ఉండదు. దేన్నో పోగొట్టుకున్నాము అన్న భావన ఏమాత్రం కలిగినా దాన్ని సమర్పణగా భావించగూడదు. మనది అనుకుంటూ ఉన్నదాన్ని అయిష్టంగా, ప్రయత్నపూర్వకంగా బాధతో ఇస్తున్నామనే భావనలో సంతోషం ఉండదు గదా! బలవంతంగా ఇస్తున్నామని అనుకుంటే తప్పు చేసినట్లే.

నిజమైన సమర్పణ నీ విస్తృతిని పెంచుతుంది; నీ సమర్థతను పెంచుతుంది. వాసిలోనూ, రాసిలోనూ నీలో సహజంగా ఉన్నదానికంటే ఎక్కువ అవకాశాన్ని ఇస్తుంది. ఇంతకు పూర్వం నువ్వు పొందలేనిది నీకు లభిస్తుంది. సమర్పణ కావించు కోకపోతే దీన్ని నువ్వు పొందలేవు. విశాల సముద్రంలో కలువలేని నీటిబిందువులా ఉంటావు. తన ప్రత్యేకతను అలాగే ఉంచుకుంటే ఆ బిందువు బిందువుగానే ఉంటుంది. అంతకంటే ఏమీ కాదు. ఆవరించియున్న విశాల సముద్రంలో కలిసినపుడు ఆ బిందువే ఆ విస్తృతిలో ఏకమై సముద్రమంత గొప్పతనాన్ని, శక్తినీ సంతరించుకుం టుంది.

ఈ పరిణామంలో సందేహాలు కాని, అస్పష్టతలు కాని ఏమీ లేవు. ఇది స్పష్టమైనది, దృఢమైనది, కచ్చితమైనదీ. సర్వత్రా వ్యాపించియున్న దివ్యత్వం ముందు జీవాత్మ దాని ప్రత్యేకతను వదలకుండా నిల్చొని యున్నపుడు అది దాని పరిమితికి లోబడే ఉంటుంది. ఉన్నతమైన సత్యాన్ని అది తెలుసుకోలేదు. దాని దరిదాపులకు రాలేదు కూడా. గుణంలోనూ, పరిమాణంలోనూ ఈ రెండూ భిన్న మైనవి. కాని చిన్న దైన జీవాత్మ సర్వత్రా వ్యాపించియున్న పరమాత్మకు సమర్పణ గావించుకొని దానిలో

లీనమైతే దాని స్వభావం విస్తృతమౌతుంది. ఆ విశాలతను తాను కూడా సంతరించు కుంటుంది. దాని పరిమితులు, లోపాలు అంతమైపోతాయి. దాని విస్తృతీ, వెలుగు అపరితమౌతాయి. పరిమితమైన దాని ఉనికి అపరిమితమౌతుంది. కలవబోయే ఉన్నత సత్యంలో అది అంతర్భాగమౌతుంది. ఇట్లా కాకుండా తన వ్యక్తిగతమైన ఉనికిని మాత్రమే కాపాడుకోవటానికి అది విశ్వమానసంతో ఎదురొడ్డి పోరాడితే ఘర్షణకు, వత్తిడికి లోనౌతుంది; పరిమితమై, బలహీనమవుతుంది. అలాంటిది అపరిమిత శక్తి, సామర్థ్యాలు, విస్తృతి కలిగినదానికి లొంగిపోకుండా ఉండలేదు. ఏనాటికీ అది గొప్పతనాన్ని సంతరించుకోలేదు. విశ్వమానసానికి అది సమర్పణ గావించుకోపోతే, అది బలహీనపడి అంతరించిపోతుంది కూడా. దివ్యమానసానికి సమర్పణ గావించు కున్న వ్యక్తి తన అంతరంగం పరిశుద్ధం అవుతూ ఉండటాన్ని గమనిస్తాడు; దివ్య మానసాన్ని అవగతం చేసుకుంటాడు. ఇందుకు భిన్నంగా తన ప్రత్యేకమైన ఉనికిని మాత్రమే కాపాడుకోవాలనుకునేవాడు సింధువులో కలవలేని బిందువువలె విడిగా మిగిలిపోతాడు. దివ్యమానసానికి తానుగా సమర్పించుకొని దాని వద్దకు చేరేవాడు తనలోని అస్పష్టతల నుండి పరిశుద్ధుడై ఆ దివ్య, విశ్వవ్యాప్త మానసాన్ని అనుభవించటం మొదలుపెడ్తాడు. దానికి వ్యతిరేకంగా నిలబడాలనుకునే మనసు క్రమేణా వికాసాన్ని కోల్పోతూ క్షీణించి, అంతరించిపోతుంది. ఈ స్థితి కేవలం మనసుకే గాదు, ప్రకృతిలోని అన్ని విభాగాలకూ వర్తిస్తుంది. మీ కంటే బలం కలిగినవారితో పోరాడితే ఏమవుతుంది? మీ తలే పగుల్తుంది. మీ కంటే లక్షల రెట్లు బలం ఉన్నవానితో మీరెలా యుద్ధం చేస్తారు? ఎదురుతిరిగినపుడెల్లా మీకు ఎదురుదెబ్బ తగుల్తూనే వుంటుంది. ప్రతి దెబ్బకూ మీలోని బలం కొంత హరించుకుపోతూ ఉంటుంది. ముష్టియుద్ధంలో బలవంతుని దెబ్బలకు ప్రత్యర్థి బలహీనపడుతూనే వుంటాడు. చివరకు పరాజయం పాలవుతాడు. చాలా బలమైనదానికి వ్యతిరేకంగా పోరాడితే ఇంతకంటె ఏమవుతుంది? మీ ఉద్దేశ్యం ఎలా వున్నా ఫలితం ఇంతే. మీరొక మూలన ముడుచుకొని కూర్చొని మీ పని మీరు చేసుకుంటూ వుంటే మీకేం కాకపోవచ్చు. కాని ఒక్కసారి ఆ దివ్యశక్తిని మీరు ఎదిరించారా, మీ ముందు రెండే రెండు మార్గా లుంటాయి. అందులో కలసిపోయి ఆ ఔన్నత్యం పొందటమా, లేక దాంతో పోరాడి బలహీనపడటమా, మీరే నిర్ణయించుకోండి.

'సమర్పణ' అనే విషయంలో అనేక తప్పుడు సిద్ధాంతాలు ప్రచారంలో

వున్నాయి. 'ఆత్మత్యాగమే' సమర్పణ అని చాలామంది అనుకుంటూ వుంటారు. అదొక శుద్ధతప్పు. అసలు మనం దివ్యత్వం యొక్క ఒకానొక అంశ మాత్రమే. మనం దాన్నే వ్యక్తపరచాల్సి వుంటుంది. అదే వ్యక్తి యొక్క వ్యక్తిత్వం. అందువలన 'దివ్యత్వం' యెడల సరియైన వైఖరి కలిగివుంటే మన అధోప్రకృతిని శుద్ధం చేసుకోవచ్చు. ఈ నిమ్న (అధో) ప్రకృతి వ్యక్తిత్వాన్ని సంకుచింపజేసి బలహీనపరుస్తుంది. దాన్ని చెడగొట్టి తనదైన ప్రత్యేకతనే సంతరించుకుంటుంది. అజ్ఞానంలో వుంటూ నిమ్నప్రకృతికి చెందిన అస్పష్టతలో కొట్టుమిట్టాడుతూ ఉంటే దివ్యత్వం వ్యక్తం అవదు. బృహత్తరశక్తితో కలిసినపుడే దాని మహత్తరశక్తులు పైకి వస్తాయి. అస్పష్టత, అజ్ఞానం కాలుష్యంలో పడి ఉంటే అవి ఉద్బుద్ధం కావు. దివ్యశక్తితో ఏకం అయినపుడు దాని మిరుమిట్లుగొలిపే ప్రకాశం పైకి వస్తుంది. ఈ ఉదాత్తత సాధించాలంటే తనను అజ్ఞానంలో పడేసి, సంకెళ్ళలో బంధించి అణగార్చే నిమ్నశక్తుల ప్రభావం నుండి బయటపడాలి. సాధారణ మానవుల కుంటి, గ్రుడ్డి జీవనం నుండి బయటపడాలి.

మొట్టమొదటిగా, కోర్కెలను వదులుకోవాలి. కోర్కెలు నిమ్నప్రకృతి యొక్క నీలినీడలే. అజ్ఞానము, బలహీనతల చలనములే ఈ కోరికలు. వాటితోనే నిన్ను అవి కట్టి పడేస్తాయి. మనం కోరికలతోనే పుట్టామని అందరూ అనుకుంటారు. అవి అంతర్గతం నుండి పుట్టుకు వస్తాయని వారి భావన. ఇది తప్పు. నిమ్నప్రకృతికి చెందిన అస్పష్ట తరంగాలే కోరికలు. అవి ఒకరి నుండి ఒకరికి వ్యాపిస్తాయి. కోరికల తరంగాలను మనిషి జనింపజేయడు. కాని అవి అతడిని ముంచెత్తుతుంటాయి. తనను తాను రక్షించుకోలేనివారు, ప్రతిదాన్నీ విచక్షణారహితంగా స్వీకరించేవారు, కోరికల వలయంలో కొట్టుమిట్టాడుతూ ఉంటారు. అలాంటివారిని అది ఆకర్షించి, ఆవహించి విచక్షణారహితునిగా చేస్తుంది. కోరికలు తీర్చుకోవడమే తన ప్రవృత్తి అని భావించేలా చేస్తుంది. నిజానికి అతని నిజస్వభావానికీ, కోరికలకూ సంబంధమే లేదు. ఇవి అధోప్రకృతికి చెందినవి. ఈర్ష్య, అసూయ, ద్వేషం, హింస కూడా అధోప్రకృతికి చెందినవే. ఇవన్నీ నిన్ను అటూ, ఇటూ అల్లల్లాడిస్తూనే వుంటాయి. నీ మీద దండయాత్ర చేస్తూనే వుంటాయి. అవి నీ నిజప్రకృతికి, స్వభావానికి చెందినవి కావు. కాని అవి నీ రూపురేఖలే మార్చేస్తాయి; నిన్ను చెడగొడ్తాయి. అవి నీ సహజ ప్రకృతికి సంబంధించినవి కావు. బైట ఆవరించియున్న అధోప్రకృతి యొక్క అస్పష్ట తరంగాలే. వాటికంటూ ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఏమీ లేదు. అవి కేవలం నీకే సంబంధించినవి కావు. ప్రతివారిలో

అవి అలాగే వుంటాయి. మనసులోని అస్పష్టతలూ, అనుమానాలు, దోషాలు, కష్టాలు, మన వ్యక్తిత్వాన్ని మరుగుపరుస్తూనే వుంటాయి; దాని పరివ్యాప్తిని తగ్గించి సాఫల్యతను నిరోధిస్తూనే వుంటాయి. ఇవన్నీ అధోప్రకృతి నుండే ఉత్పన్నం అవుతాయి. కాని అవన్నీ వచ్చీ, పోయే అలలే సుమా. చిక్కినవాణ్ణి పట్టి పీడిస్తాయి; లొంగేవారిని పనిముట్లలా వాడుకుంటాయి. ప్రతివాడూ ఇదంతా తనదైన స్వేచ్ఛాయుత వ్యక్తిత్వపు అమూల్య ఫలంగా భావిస్తాడు. వీటికి, ఇవి కలిగించే ఇబ్బందులకు అంటిపెట్టుకొని ఉంటూ కూడా అవే తమ స్వేచ్ఛకు సంకేతాలని, అంతస్సత్వమనీ అనుకునేవారు కూడా లేకపోలేదు.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

ఆధ్యాత్మికతకు, నైతికతకు మధ్య అంతరం

ఆధ్యాత్మికతకు, నైతికకు మధ్య చాలా అంతరం ఉంది. ఆ రెండింటి విషయంలో ఒకదాని బదులుగా మరొకటి ఎప్పుడూ తికమకచెందడం జరుగుతుంది. ఆధ్యాత్మిక జీవితంలో, యోగజీవనంలో లక్ష్యం దైవచైతన్యంలో వృద్ధిపొందడం, దానిని పొందడానికి నీలో ఉన్నదానిని పరిశుద్ధపరచి, తీవ్రతతో అత్యధికం చేసి, మహత్వపరచి, సమగ్రంచేయడమే. అది నిన్ను దైవాన్ని అభివ్యక్తం చేసే శక్తిగా చేస్తుంది. అది ప్రతి వ్యక్తి యొక్క విలక్షణమైన వ్యక్తిత్వాన్ని దాని పూర్ణత్వం అందుకునేటట్లు చేసి, అత్యధికంగా అభివ్యక్తం చేసే విధంగా తయారుచేస్తుంది. ఎందువల్లనంటే ఇదంతా దైవప్రణాళికలో భాగం. నైతికవర్తన మానసిక నిర్మాణం నుంచి రూపుదిద్దుకుంది. అది కొన్ని మంచిభావాల నుంచి, ఆ విధంగా కానివాటి నుంచి ఒక ఆదర్శమైన నమూనాను తయారుచేసి అందులో అందరూ బలవంతంగా ఇమిడిపోవాలనుకుంటుంది. ఈ నైతిక ఆదర్శం దాని సంబంధిత భాగాలలో, దాని సమిష్టిరూపంలో, విభిన్న కాలాలలో, విభిన్న ప్రదేశాలను బట్టి మారిపోతూ ఉంటుంది. అయినా అది తనది అసమానమైన పద్ధతిగా, విలక్షణమైన అప్రతిహత ధర్మసూత్రంగా ప్రకటిస్తుంది. దానికి బయట దేనినీ ఆమోదించదు. దాని లోపల ఏ తేడానూ ఆమోదించదు. అందరూ దాని ఒకే ఒక ఆదర్శమైన నమూనా పద్ధతిలో మూసలో పోతపోసినట్లుగా

తయారవాలి. ప్రతి ఒక్కరూ ఏకరీతిలో, దోషరహితంగా ఒదిగిపోవాలి. అది ఎందు వల్లనంటే నైతికత కఠిన నిష్ఠతో కూడిన అసహజ ప్రకృతి. దాని ప్రధాన సూత్రంలో, దాని పని తీరులో అది ఆధ్యాత్మిక జీవనానికి వ్యతిరేకం. ఆధ్యాత్మిక జీవితం అందరిలోని ఒక ప్రధానసారాన్ని బహిర్గతం చేయడంతో పాటు, అనంతమైన వైవిధ్యాన్ని కూడా బహిర్గతం చేస్తుంది. అది ఏకత్వంలో వైవిధ్యానికి, వైవిధ్యంలో పరిపూర్ణతకు పరిశ్రమిస్తుంది. నైతికత ఒక అసహజమైన నిర్దిష్ట విధానాన్ని ఆధ్యాత్మికతలోని వైవిధ్య జీవితానికి, ఆత్మ స్వేచ్ఛకు వ్యతిరేకంగా నిలబెడుతుంది. స్థిరమైన, పరిమితమైన ఒకానొక మానసికపరమైనదానిని సృజించి, అందరినీ దానికి అనువర్తించమంటుంది. అందరిని అవే లక్షణాలను, అదే ఆదర్శమైన ప్రకృతిని అలవరచుకోమంటుంది. నైతికత దైవం కాదు సరి కదా, దైవానిదీ కాదు. అది మనిషికి సంబంధించినది, మానవజాతిది. నైతికత మంచి, చెడు అనే ఒక స్థిరమైన విభజనను తన మూలసూత్రంగా తీసుకుంటుంది. కాని ఇది హేతుబద్ధతలేని ఊహాత్మక ప్రాతిపదిక. అది విషయాల అన్యోన్య సంబంధాలను తీసుకుని వాటినే అప్రతిహతమైనవాటిగా రుద్దాలని చూస్తుంది. కాని మంచి, చెడు అనేవి దేశకాలమాన యుగ వాతావరణ పరిస్థితుల ననుసరించి మారుతుంటాయి. నీతివర్తనం, మంచి కోరికలు, చెడు కోరిక లున్నాయనే విషయాన్ని ప్రకటిస్తూ, మంచికోరికలను ఆదరించి, చెడుకోరికలను తిరస్కరించేదాకా ప్రోద్బలం చేస్తుంది. కాని ఆధ్యాత్మిక జీవితం కోరికనే తిరస్కరించాలని గట్టిగా కోరుతుంది. దాని ధర్మం నిన్ను దైవానికి దూరంగా తీసుకుపోయే అన్ని గమనాలను నీవు తప్పక వదలివేయవలసిందే నంటుంది. నీవు తిరస్కరించాల్సింది అవి చెడువని కాదు. ఆ చెడ్డవి ఇంకొక మనిషికి మంచివి కావచ్చు లేదా మరొక కోణంలో మరేదైనా కావచ్చు. తిరస్కరించడం ఎందుకంటే అవి ప్రేరణలకు లేదా ప్రకాశహీనమైన, అజ్ఞానమైన శక్తులకు సంబంధించినవి. అవి నిన్ను దైవాన్ని సమీపించేదారిలో అడ్డుగా నిలుస్తాయి. అన్ని కోరికలు అవి మంచివైనా, చెడువైనా వాటి విధివిధానం ఈ రకంగానే ఉండి బయటకు వస్తుంటాయి. ఎందువల్లనంటె కోరిక పుట్టేది అసహజమైన ప్రాణిక అస్తిత్వం నుంచి, దాని అజ్ఞానం నుంచి, దీనికి ప్రతిగా నీవు దైవస్పర్శను అందించే అన్ని గమనాలను తప్పక ఆమోదించాలి. నీవు ఎందుకు ఆమోదిస్తావంటే అవి మంచివని మాత్రం కాదు, అవి నిన్ను దైవం వద్దకు తీసుకువెడుతున్న కారణం చేతనే. ఆ విధంగా దైవం చెంతకు చేర్చేవాటన్నింటిని ఆమోదించు. దైవానికి

దూరంగా తీసుకువెళ్ళేవాటన్నింటిని తిరస్కరించు. కాని ఇది మంచిది, అది చెడ్డది అని అనవద్దు. లేదా నీ దృక్పథాన్ని ఇతరుల మీద రుద్దాలని అనుకోవద్దు. ఎందు వల్లనంటే నీవు చెడు అని దేనిని అంటున్నావో, అదే దివ్యజీవనాన్ని సాక్షాత్కరించుకోవా లని ప్రయత్నించని నీ పొరుగువానికి బహుశః మంచిదవచ్చు.

మనం నైతిక, ఆధ్యాత్మిక విషయాల మధ్య అంతరాలపరంగా ఒక ఉదాహరణను తీసుకుందాం. సర్వసాధారణమైన సాంఘిక కట్టుబాట్లు రెండు వర్గాల మధ్య తేడా ప్రకారం మనుషులను ఉదారులుగా, లోభులుగా పేర్కొంటాయి. లోభి అయినవాడు నిరసించబడి, నిందించబడతాడు. కాని ఉదారుడు మాత్రం స్వార్థరహితుడుగా, సమాజానికి ఉపయోగపడేవాడుగా పరిగణించబడి వాని గొప్ప గుణానికి కీర్తించ బడతాడు. కాని ఆధ్యాత్మిక దృష్టికి అవి రెండూ సమానస్థాయికి చెందినవే. ఒకరి ఉదారత, మరొకరి లోభత్వం అనేవి రెండూ ఉన్నత సత్యానికి, అధికతరమైన ఒక దివ్యశక్తికి వికృతులే. ఒక శక్తి, ఒక దివ్యగమనం ఉంది. అది వ్యాపిస్తుంది, విస్తరిస్తుంది. శక్తులను, విషయాలను, ఇంకా ఇతరములు ఏవేవైతే ఉన్నాయో ప్రకృతిలోని భౌతికం నుంచి, ఆధ్యాత్మిక అంతస్తు వరకూ ఉండే అన్ని స్థాయిలలో తన వశంలో ఉన్న వాటన్నింటిని ఏ ఆటంకం లేకుండా వెదజల్లుతుంది. ఉదారుడైనవానికి అతని ఉదా రత్వం వెనుక ఈ గమనాన్ని అభివ్యక్తం చేసే ఒక ఆత్మ విలక్షణత ఉంది. అతడు విస్తృతకు, విస్తృత వ్యాప్తికి ఒక శక్తి. మరొక శక్తి, మరొక దివ్యగమనం ఉంది. అది శక్తులను, విషయాలను, ఎన్ని తన వశంలో ఉండవచ్చునో అన్నింటిని, అవి నిమ్న లేదా ఉన్నతస్థాయిలకు చెందినవేమైవా కాని సేకరిస్తుంది, కూడబెడుతుంది, సమీకరి స్తుంది, పోగుచేస్తుంది. నీవు లోభి అని ముద్ర వేసిన మనిషి, ఈ గమనానికి పనిముట్టుగా తెలుసుకోవాలి. రెండూ ముఖ్యమైనవే. రెండూ అఖండ ప్రణాళికలో అవసరమైనవే. జాగ్రత్తగా దాచిపెట్టి, శ్రద్ధగా కూడబెట్టి పోగుచేసే గమనం, వ్యాపించి, విస్తరించే గమనపు అవసరం కంటే తక్కువైనదేమీ కాదు. రెండింటినీ, నిజంగా దైవానికి అర్పణ కావిస్తే దైవకార్యానికి ఒకే స్థాయిలో సమాన విలువతో పనిముట్లుగా వాడు కోబడుతాయి. కాని అవి సమర్పించబడకపోతే రెండూ ఒకే రకమైన అజ్ఞానభూయిష్ట ప్రేరణలకు కదలిక లవుతాయి. ఒకరు వెదజల్లటానికి నెట్టబడగా, మరొకరు దాచి ఉంచుకోవటానికి వెనుకకు లాగబడతారు. కాని ఇద్దరూ వారి చైతన్యానికి కనపడని అస్పష్ట శక్తులతో బలవంతంగా తోయబడినవారే. వారిద్దరిలో ఎవరినీ పరిగ్రహించలేం.

ఉన్నతమైన యోగదృష్టితో చూసి, అమితంగా కీర్తించబడే ఉదార మనిషితో ఈ విధంగా అనవచ్చు, "నీ ఉదారతా ప్రేరణలన్ని ఆత్మశక్తి ప్రమాణాల ననుసరించి ఎందుకూ కొరగానివి. ఎందువల్లనంటే అవి అహం నుంచి, అజ్ఞానమయమైన కోరికల నుంచి వచ్చినవి". అదే లోభులనబడి, దూషించబడినవారిలో, అప్పుడప్పుడు కూడ బెడుతూ అవసరాన్ని మించి దాచిపెడుతూ ఉండే మనిషిలో పూర్తి ప్రశాంతతతో, ఆ పని చేసితీరాలనే కచ్చితమైన ఏకాగ్రతతో, తన ప్రకృతి తనకు అప్పగించిన పనిచేస్తుండడాన్ని చూడవచ్చు. వారే కనుక ఒకసారి చేతనాపరంగా మేల్కొలుప బడితే, దైవానికి మంచి పనిముట్టు కాగలరు. కాని సాధారణంగా లోభి అయినవాడు తనకు వ్యతిరేకంగా వర్తించే ఉదారుడైనవాని వలెనే తాను కూడా అహం నుంచీ, అజ్ఞానం నుంచే ప్రవర్తిస్తాడు; అజ్ఞానానికి అది మరొక పక్షం. ఇద్దరూ తమను తాము పరిశుద్ధపరచుకోవలసినదే. ఇద్దరూ తమ వెనుక నున్న ఒకానొక అధికతరమైనదానితో సంపర్కం పెట్టుకోవాలనుకుని తమ ప్రకృతి తమను ఆదేశించిన విధంగా తమ వైఖరితో బహిర్గతం చేయదలచితే, దానికి ముందు తమను తాము పరిశుద్ధపరచుకుని, మారిపోవలసినదే.

ఇదే విధంగా ఇంకా ఇతర లక్షణాల విషయంలో, దివ్యశక్తిలో అవి ఏదో ఒక మౌలికమైన ఉద్దేశాన్ననుసరించి ఉన్నాయని గుర్తెరుగుతూ వాటి జాడలను కని పెట్టవచ్చును. ప్రతిదీ దైవం ఏ నమూనాకు ఉద్దేశించిందో దానికి తరుగు లేదా వ్యంగ్యం. అధికతరమైన ఆధ్యాత్మిక విలువకు మానసికమైన, ప్రాణికమైన వికృతత్వమే ఆ విషయాలు. ఒక దోషగమనమే వికృతత్వాన్ని లేదా వ్యంగత్వాన్ని సృజించింది. ఒకసారి ఈ అసత్యప్రేరణను స్వాధీనపరచుకుని దాని మీద ఆధిపత్యం సంపాదించితే, సరయిన వైఖరి కలిగి, సరయిన గమనం తెలుసుకుంటే, అన్నీ వాటిలోని దివ్యమైన విలువలను బహిర్గతం చేస్తాయి. అన్నీ వాటి యుందున్న సత్యంతో ధర్మబద్ధమైనవే. అన్నీ సమానంగా ముఖ్యమైనవే. సమానంగా అవసరమైనవే. దైవసృష్టిలో అవి విభిన్నమైనప్పటికి ఆవశ్యకమైన పనిముట్లు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఎవరు?

నింగి నీలిమలో, అరణ్య హరితంలో
ఏ హస్తం అద్దింది చిత్రకాంతుల్ని?
ఆకాశంలో నిద్రించే సమీరాలను
ఎవరు మేల్కొలిపి కదిలించారు నలు దిక్కులకు?

హృదయసీమలో, ప్రకృతి గర్భంలో
ఎవరు అంతర్నిహితమయ్యారు?
ఆలోచనను సృజించే మెదడులో ఉన్నాడు.
పుష్పమాలికల అందాలలో అల్లుకుపోయాడు.
నక్షత్రరాశుల కాంతివలలో చిక్కుకున్నాడు.

పురుషుని బలంలో, వనిత సౌందర్యంలో
బాలుని చిరునవ్వులో, బాలిక సిగ్గుదొంతరలలో...
నీలాకాశ వీధిలో బృహస్పతిని పరుగెత్తించిన హస్తం
కురులను తీర్చిదిద్దే టక్కరి విన్యాసం

ఇవి అతని అద్భుతాలు, అతని యవనికలు, అతని నీడలు
కాని ఎక్కడ, ఎక్కడ అతను? ఏ పేరు అతనిది?
అతడు బ్రహ్మ? విష్ణువా? పురుషుడా, స్త్రీయా?
రూపమా? రూపరహితమా? జంటా? ఒక్కడా?

నీలిమేఘశ్యాముడైన బాలునిపై అతిప్రేమ మనకు.
అనాచ్ఛాదిత భయానక స్త్రీమూర్తి మనకు మహారాణి.
హిమశిఖరాలలో దివ్యసమాధిలో మునిగిన అతనిని దర్శించాం.
విశ్వాంతర లోకాల నిర్మాణంలో నిమగ్నమైన అతనిని వీక్షించాం.

సర్వప్రపంచానికి అతని లీలాఖేలన ఇంద్రజాలాన్ని చాటుదాం,
మన చిత్రహింసలో, కాంక్షలో, బాధలో అతనికి విచిత్రానందం ఉంది.
మన క్లేశాలలో అతనికి వినోదం, బాధాగ్నికి మనల్ని గురిచేస్తాడు.
తిరిగి తన అలౌకిక ఆనంద సౌందర్యాలతో మనల్ని మురిపిస్తాడు.

సంగీతమంతా అతని దరహాస రసధుని, ప్రియరవళి.
సౌందర్యమంతా అతని కాంక్షా పారవశ్య ప్రాభవం.
మన జీవితాలు అతని హృదయస్పందనలు,
రాధాకృష్ణుల ప్రణయ సమాగమం మన ఆనంద అమృత రసధార.

మన ప్రేమ వారి అరుణాధరాల మధుగీతం.
విజయశంఖారావంలో ప్రతిధ్వనిస్తుంది అతని శౌర్య ప్రకంపనం.
స్వర్ణరథంపై విహరిస్తాడు, ఆయుధ ప్రహారం అనన్య సామాన్యం
అప్రయత్నంగా హతమారుస్తాడు, అమిత కరుణామూర్తి
ప్రపంచ పురోగమనం కొరకు, కాలం చివర
మహితావిష్కరణకై పోరాడుతాడు.

అనంత గోళాల పరిభ్రమణంలో, యుగయుగాల ప్రస్థానంలో
మహిమోజ్వల విశుద్ధ అవర్ణనీయ వైభవం...
క్రాంతదర్శుల అంతిమ జ్ఞానశిఖరాల కావల
చిరంతన సువర్ణ సింహాసనంపై ఆశీనుడై వున్నాడు.

మనిషికి రారాజు, అతని అనంత ప్రణయేశ్వరుడు.
మన గుండెల్లోనే వున్నాడు, కళ్లు తెరిస్తే కనిపిస్తాడు.
విలాస జీవన కాంక్షలతో, గర్వాహంకారాలతో మనం అంధుల మయ్యాం.
మన ఆలోచనలలో ఖైదీలం, అక్కడే విముక్తి ద్వారం.

యుగాలు, మరణాలు వేధించని సూర్యతేజోబింబం అతడు.
నడిరాత్రివేళ అతని నీడ కదలాడుతుంది.
పెనుచీకటిలో చీకటి మునిగిన వేళ
అక్కడ భాసిస్తాడు అనంతుడై, ఒక్కడై.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

శరీరానికి కూడా దైవస్మృతి ఉండాలి

శరీరానికి, జీవకణాలకు, సూక్ష్మకణాలకు, రక్తకణాలకు కూడ అవ్యక్తమైన మనసు ఒకటి ఉంటుంది. జర్మన్ భౌతికవాది హెగెల్, ఒక చోట అణువులోని సంకల్పం గురించి ప్రస్తావించాడు. ఇటీవలి విజ్ఞానశాస్త్రి అధ్యయనంలో ఎలక్ట్రాన్స్ యొక్క ప్రత్యేకమైన అనిశ్చిత ఆకారపరిణామానికి ఆకృతి ఉండదని, అది కేవలం ఒక నిగూఢమైయున్న మూలవస్తువు యొక్క ఛాయరూపమని నిర్ధారణ దాదాపుగ ఖారారయింది. ఈ దైహిక మనసు ఒక అనుభవైకవేద్యమైన సత్యము; అది అవ్యక్తమైనందువలన, పూర్వగమనాలకు యాంత్రికంగ కట్టుబడి ఉన్నందున, కొత్త విషయాలను, తేలికపరచి ఉపేక్షించి, తిరస్కరించడం వలన, దివ్యచైతన్య వ్యాప్తికి అలాగే శరీరం యొక్క పనితీరులో పరివర్తన కలుగుటకు ప్రధాన ఆటంకంగా ఉన్నదని అర్థమౌతుంది. అలా కాకుండ, ఫలప్రదమగునట్లుగ మార్పుచెందగలిగితే, భౌతిక ప్రకృతి యందు దివ్యచైతన్యకాంతిని, దివ్యశక్తిని స్థిరపరచడానికి అత్యంత విలువైన సాధనమౌతుంది.

*

మన అస్తిత్వంలోని ప్రతి భూమికలో — మానసిక, ప్రాణిక, భౌతిక — తనదైన చైతన్యము ఉంటుంది; వేర్వేరుగ నున్నా కూడ, పరస్పర సంబంధం, పరస్పర ప్రభావం కలిగి ఉంటాయి. కాని, మన బాహ్య మనసుకు, బుద్ధికి మరియు మన జాగ్రదావస్థలో అన్ని కలసి భ్రాంతిని కలుగుజేస్తాయి. ఉదాహరణకు, శరీరం తనదైన చైతన్యాన్ని కలిగి ఉంటుంది; దాని ప్రకారమే పనిచేస్తుంది. అందుకని దానికి మన మానసిక సంకల్పంతో అవసరం లేదు. దానికి వ్యతిరేకంగా కూడ పనిచేయవచ్చు. మన

బాహ్యమనసుకు ఈ శరీర చైతన్యము గురించిన అవగాహన అతి స్వల్పము, అనుభూతి అసమగ్రము. దాని దృష్టి కేవలం ఫలితాలపై మాత్రమే. అయినా వాటి కారణాలను కనుగొనటానికి ముప్పతిప్పలు పడుతుంది. ఈ ప్రత్యేకమైన శరీర చైతన్యంపై అవగాహన ఏర్పడుట, దాని గమనాలను గమనించి అనుభూతిని పొందుట, దానిని ప్రభావితం చేసే బాహ్య మరియు అంతరంగశక్తుల గురించి తెలుసుకొనుట, అది ఎంత అత్యంత గోప్యమైన (మనకు) మరియు అవచేతనాగతమైన పద్ధతులను పాటించినా, దానిని ఏ విధంగ కట్టడి చేసి నిర్దేశించాలో నేర్చుకొనుట మొదలగునవన్నీ యోగములో భాగమే. శరీరచైతన్యం వ్యక్తిగతమైన భౌతికచైతన్యంలో భాగమే. విశ్వగతమైన భౌతిక ప్రకృతి యొక్క గుప్త చైతన్యశక్తుల నుండి దీనిని సమీకరించి రూపొందిస్తాము.

*

నేను శరీరానికి ఒక ప్రధానమైన ధర్మసాధనా ఉపకరణంగా విలువనిస్తాను. సమగ్రంగా, అది కార్యనిర్వహణ కోసం అభివ్యక్తమైన వ్యక్తిత్వ కేంద్రము. నా ప్రకారము లోకంలోని సమస్త జీవజాలానికి, కార్యకలాపాలకు శరీరం మూలాధారమైనట్లుగ ఆధ్యాత్మిక జీవితానికి, కార్యకలాపాలకు కూడ శరీరం మూలాధారము. దానితో పాటు మనసు, ప్రాణము కూడ పరమాత్మునిలో ఒక భాగమే, జీవాత్మ యొక్క ఒక ఆకృతియే. అందువలన, ఆధ్యాత్మికంగా ఉపయోగపడదని కాని, ఆధ్యాత్మికానుభూతికి పనికిరానిది, అశక్తమైనది అని కాని ఉపేక్షించకూడదు, తిరస్కరించకూడదు. పదార్థము దాని మట్టుకు అది ఆత్మ యొక్క రహస్య రూపము. ఆ విధంగా దాని కదే వెల్లడి కావాలి. చైతన్యానికి జాగృతమై ఆత్మను అందులోని దివ్యాంశను వికసింపజేసి అనుభవం లోనికి తేవాలి. నా దృష్టిలో శరీరంతోపాటు మనసు, ప్రాణం కూడ దైవానుభూతిని పొందటానికి తగిన పనిముట్టుగానో లేక నిల్వచేసే పాత్రగానో ఉండటానికై ఆధ్యాత్మికతను సంతరించుకోవాలి — దివ్యత్వం పొందాలి అని కూడ అనవచ్చు.

*

ఈ సందర్భంలో అనుసరించిన యోగమార్గానికి ఉన్న ప్రయోజనం ఇతర మార్గాలకున్న వాటికి భిన్నమైనది — ఎందుకనగా, దీని లక్ష్యం సాధారణ అజ్ఞానంతో కూడిన విశ్వచైతన్యం నుండి విడివడుటయే గాక, ఆ దివ్యచైతన్యము యొక్క

దివ్యశక్తిని అజ్ఞానభరిత మనసు, ప్రాణము మరియు శరీరం లోనికి తెచ్చుటతో పాటు, దైవాన్ని అచట అభివ్యక్తపరచి పదార్థం మందు ఒక దివ్యచేతనను కలిగించుట.

*

ఇవి ఉన్నతతర చేతన భౌతికంలోకి అవరోహించుట వలన సంభవించే కొన్ని పరిణామాలు. ఇది వెలుగును, చైతన్యాన్ని, శక్తిని, ఆనందాన్ని జీవకణాలలోకి, అన్ని భౌతిక గమనాలలోకి తీసుకువస్తుంది. ఉన్నతతర సంకల్పము యొక్క ఆదేశాన్ని అనుసరించుట ద్వారా లేదా తనలోకి ప్రవేశించిన శక్తి ద్వారా శరీరానికి చైతన్యము కలిగి అది జాగృతి చెందుతుంది. దాని కదలికలు సక్రమంగా ఉంటాయి. శరీరం నిర్వర్తించే కర్మలను నియంత్రణలో నుంచుటయే గాక ఏదైనా లోపమున్నట్లయితే దానిని సరిచేసి అస్వస్థత, బాధ మొదలగువాటిని సులభంగా నయం చేయవచ్చు. శారీరక చర్యలపై అదుపు ఇనుమడించుటతో పాటు శరీరాన్ని ప్రభావితం చేసే బాహ్యసంఘటనలపై కూడ నియంత్రణ పెరుగుతుంది. ఉదాహరణకు, ప్రమాదాలను, చిన్న చిన్న దురదృష్టకర ఘటనలను తగ్గించవచ్చు. కార్యాచరణకు శరీరం ఒక శక్తివంతమైన పనిముట్టు అవుతుంది. అలసటను తగ్గించవచ్చు. శారీరక వ్యవస్థ అంతా శాంతి, సంతోషం, బలంతో నిండిపోతుంది. మనసు తేలికపడుతుంది. చైతన్య వికసనంతో పాటు ఇటువంటి సాధారణ ఫలితాలు కూడ వృద్ధిచెందుతాయి. వీటికి తోడు మరెన్నో సత్ఫలితాలను పొందే అవకాశం కలుగుతుంది. అంతేగాక భూచైతన్యంతో ఐక్యత, భౌతిక ప్రకృతిలో నిరంతర దైవచింతన మొదలగునవెన్నో సంపన్నమౌతాయి.

సహజంగానే, ఈ మార్గంలో శరీరాన్ని చైతన్యపరచటం అంత సులభమేమీ కాదు — కారణం, అది అచేతనకు, అస్పష్టతకు, మాంద్యానికి ఆలవాలం — పాక్షికంగానైనా తగినంత ఫలితాన్నిచ్చే ఉన్నతతర చైతన్యాన్ని కేంద్రంగా స్థిరపడనివ్వాలి. దాని ప్రభావం శరీరంపై అధికమైనప్పుడు, తదుపరి కార్యక్రమమంతా విజయవంతంగా సాగిపోతుంది.

*

శరీరం చాలా మేరకు అచేతనమైనది, లేక ఒక విధంగా అవచేతనాగతమైనది — దానిని చైతన్యవంతం చేయాలి.

ఏ విధంగా చైతన్యవంతం చేయాలి?


నిజచైతన్యాన్ని దానిలోకి అవరోహణ గావించుట ద్వారా చేయవచ్చు. మానసిక మందు, ప్రాణికమందు నిశ్చలంగా మెలకువతో ఎరుక గలిగి ఉండటం ద్వారా చేయవచ్చు.

*

శారీరకసాధన చేయడం ఉన్నతతర వెలుగును, శక్తిని, శాంతిని, ఆనందాన్ని తీసు కొచ్చుటకు, శరీరము యొక్క మందకొడితనాన్ని అనుమానాలను, పరిమితులను, భౌతికమనసు యొక్క బాహ్య పోకడను, ప్రాణిక మరియు శారీరక సంబంధమైన (నరములు) దోషభూయిష్టశక్తులను వదిలించుకొనుటకు అవసరము. వాటి స్థానే శరీరము దైవసంకల్పము యొక్క చక్కని పనిముట్టుగా నుండుటకు నిజచైతన్యాన్ని అచట ప్రతిష్టించాలి.

*

చివరిగా, శరీరం మనసుకు స్వచ్ఛందంగ లొంగి నడుచుకునేది ఏ విషయాలలో అనగా, అది వేటిలోనైతే రూపొందించబడిందో లేక లొంగి ఉండుటకు తర్ఫీదు పొందిందో ఆ విషయాల్లోనే. కాని, శరీరానికి మనసుతో నుండే సంబంధం అన్ని విషయాల్లోను యాంత్రికంగా ఉండదు. శరీరానికి కూడ తనదైన స్వంత చైతన్యం ఉంది. అది మనసుకు చేతిలో నుండే పనిముట్టు లాంటిదైనా లేక సేవాస్వభావం కలదైనా కూడ, దాని ఆదేశాన్ని ఉల్లంఘించనూ వచ్చు, లేదా అసలు పాటించకపోనూ వచ్చు. చాలా విషయాల్లో, ఉదాహరణకు, ఆరోగ్యానికి, అస్వస్థతకు సంబంధించిన విషయాల్లో యాంత్రికంగా జరిగిపోయే పనులలో అది స్వచ్ఛందంగ ఇష్టప్రకారం పనిచేస్తుంది. కాని, మనసుకు బానిసగా కాదు. అలసట చెందినట్లయితే మనోసం కల్పానికి ఉదాసీనతతో దూరంగా ఉంటుంది. తమస్సు, జడత్వము, నిస్పృహ, అవచేతనల ఆవిరులు మనసును ఆవరించి నిరర్థకం గావించవచ్చు. సూచన అందగానే చేయి లేస్తుందనుట నిస్సందేహం. కాని నడవమని కాళ్లకు ఆదేశమందినా కూడ, అవి ముందు నిరాకరించవచ్చు. నెమ్మదిగా పాకే వైఖరిని, కదలికను విడిచి నిటారుగ నడిచే అలవాటును వాటికి నేర్పాలి. చేతికి ఒక సరళరేఖ గీయమనో, లేక ఒక వాయిద్యాన్ని వాయించమనో మొదటిసారి ఆదేశిస్తే అది చేయలేదు, చేయదు కూడ. దానికి పాఠాలు నేర్పాలి, శిక్షణ నివ్వాలి. నేర్పించాలి. అటు తరువాతనే అది తాను చేయవలసినదేదో తనంతట తానే చేస్తుంది. ఇదంతా మానసిక ఆదేశాను



సారం పనులు నిర్వర్తించే శరీరచైతన్యం ఒకటి ఉన్నదని నిరూపిస్తుంది. అయినా కూడ దాన్ని మేల్కొల్పాలి, శిక్షణ నివ్వాలి, ఒక చైతన్యవంతమైన పనిముట్టుగా తీర్చిదిద్దాలి. దానికి ఎలాంటి శిక్షణ నివ్వాలంటే అది ఒక మానసిక సంకల్పంతోనో లేక సూచనతోనే శారీరక అస్వస్థతను నయం చేయగలగాలి.

*

శరీర చైతన్యంలో అధికభాగము అవచేతనాగతమైనది. శరీరచైతన్యము మరియు అవచేతన ఒక దానితో నొకటి అతి సన్నిహితంగా కలసి ఉంటాయి.

శరీరము మరియు భౌతికము మధ్య సామ్యత ఉండదు — శరీరచైతన్యము భౌతికచైతన్యంలో ఒక భాగం మాత్రమే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఆధ్యాత్మిక శక్తితో అస్వస్థత నివారణ

దైవకృపతో

దైవకృప గురించి కొంచెం చెప్పాలనుకుంటున్నాను. మానవుల తెలివితేటలు పనిచేసే పద్ధతి కంటె ఎక్కువ తేడా లేకుండా భగవంతుని తర్క వివేచన ఉంటుందని నీ వనుకుంటున్నట్లు కనిపిస్తోంది. కానీ అది కానే కాదు. అట్లాగని అది పక్షపాతరహితంగా సమీపించినవారందరి పైనా, అందరి ప్రార్థనల ప్రకారంగా పనిచేసే సార్వత్రిక దివ్యకారుణ్యం కాదు. అది మంచివారిని మాత్రమే ఎంచుకొని పాపాత్ములని తిరస్కరించేదీ కాదు. అది క్రూరుడైన సాల్ అనే వాడి (Saul of Tarsus) రక్షణకూ వచ్చింది; దుర్మార్గుడైన సెయింట్ ఆగష్టీన్ (St. Augustene) చెంతకూ వచ్చింది. ఇంకా అపకీర్తిపరులైన జగ్గాయ్, మధాయ్‌లకూ, బుద్ధిమంతులైన మానవుల పవిత్ర ఆచారాన్ని అప్రతిష్టపాలు చేసేటువంటి బిల్వమంగళుని వంటి ఎంతోమంది రక్షణకై ఆ దివ్యకరుణా కటాక్షం ప్రసరించింది. అది ధర్మపరులైనవారికీ లభిస్తుంది. అలా వచ్చి ధర్మపరమన్యత్వమనే వారి డాంబికాన్ని నివారించి వాటన్నటినీ మించిన

స్వచ్ఛచైతన్యం వైపుగా వారిని మళ్ళిస్తుంది. అది అన్ని ధర్మాలనూ, చివరికి సార్వత్రిక ధర్మాన్ని కూడా మించినటువంటి శక్తి. — ఆధ్యాత్మిక ద్రష్టలందరూ కూడా ధర్మాన్ని, దైవకృపనీ ప్రత్యేకంగానే చూశారు. అది విచక్షణారహితంగా మాత్రం పనిచేయదు. మనస్సుగానీ, మరో సాధారణశక్తిగానీ చూసి అర్థం చేసుకున్నట్లు గాక తనదైన దృష్టితో చూసి విషయాలను, వ్యక్తులను, సమయాలను, కాలాలనూ ప్రత్యేకంగా గుర్తిస్తుంది. మనస్సుతో గుణింపటానికి వీల్లేని ఇతర సాధనం ద్వారా వ్యక్తి లోపల చిక్కన తెరల మాటున దివ్యకారుణ్యానికి అనువైన స్థితిని తయారు చేస్తుంది. దైవకృప దిగివచ్చినప్పుడు ఆ దివ్యకారుణ్యమే పనిచేస్తుంది. మూడుశక్తులు అక్కడ ఉంటాయి:

1) కర్మ యొక్క విశ్వధర్మం కానీ మరొకటి గానీ 2) తన నియమ జాలాలలో ఎంతమందిపై పనిచేయగలదో అంతమందిపై పనిచేస్తూ వారి అవకాశాలు కల్పించే దివ్యకరుణ, 3) అగణితంగానూ మిగతావాటి కంటే అనివార్యంగాను పనిచేసే దివ్యకారుణ్యము. అయితే జీవితపు ఒడిదుడుకులకు అతీతంగా నిలబడి పిలుపు నందుకొని ఏ కష్టం వచ్చినా తట్టుకొని దివ్యకృప వచ్చి ప్రకాశించేవరకూ తనకు తాను తెరుచుకొని తయారుగా సంసిద్ధమయేది ఏదైనా ఉన్నదా అనే ప్రశ్న వస్తుంది. అది ఒక మానసిక చలనంగానీ, ప్రాణిక చలనంగానీ కాక అంతర్నేత్రానికి గోచరించే ఆంతరంగిక స్థితి కావాలి. అది అక్కడ ఉన్నట్లయితే అది ఎప్పుడైతే ముందుకొచ్చి క్రియాత్మకంగా అవుతుందో అప్పుడు, ఈ దైవకారుణ్యం పనిచేయగలదు. అది అక్కడ వేచి యుండి నిర్ణయాత్మక నిశ్చయంగానీ, మార్పుగానీ వచ్చినప్పుడు తన సంపూర్ణ కృపతో పనిచేస్తుంది. అది భవిష్యత్తుకు వాయిదాపడినా పడవచ్చు. ఏదైనా జీవిలోని ఒక భాగమో లేదా మరేదో కృపను గ్రహించే సంసిద్ధత లేనిది ఉండి అడ్డుపడి అలా జరగవచ్చు.

కానీ నీకు ఆ దైవానికీ మధ్య ఏ ఆలోచనగానీ సంఘటనగానీ అడ్డుపడటానికి అవకాశమెందు కివ్వాలి? నీ ఆకాంక్ష, ఆనందాలతో నీవు నిండారినప్పుడు దేన్నీ లెక్కచేయకు. నీకు నీ ఆకాంక్షా, ఆ దైవమూ తప్ప ఏదీ ముఖ్యం కాదు. దైవం శీఘ్రంగా, సంపూర్తిగా, సమగ్రంగా కావాలనుకున్నపుడు ఉండవలసిన వైఖరి ఇదే. ఆ భావన నిరపేక్షంగా, సాకల్యంగా నిన్ను ఆక్రమించినప్పుడు ఇక ఏదీ అడ్డు రాకూడదు.

ఇంకా భగవంతుని గురించి నీ మనసులో మెదిలే భావాలకు విలువేం ఉంటుంది? భగవంతుడు ఎలా ఉంటాడు? ఏం చేస్తాడు, ఏమి చేయకుండా ఉండాలి మొదలైన అడ్డుదిడ్డ ఆలోచనలు రావచ్చు. కానీ నీకు దైవమే ముఖ్యము. నీ చైతన్యం భగవంతుని ఆలింగనం కావించుకున్నప్పుడు నీకు దైవమంటే ఏమిటో తెలుస్తుందిగానీ ముందుగా తెలియదు. కృష్ణుడంటే కృష్ణుడే కాని ఆయన ఏం చేశాడు, ఏం చేయలేదు అనేది ముఖ్యం కాదు. ఆయనను చూడాలి, కలుసుకోవాలి. ఆ తేజస్సును, సన్నిధిని, ప్రేమను, ఆనందాలను అనుభవించాలి అనేదే ముఖ్యం. ఆధ్యాత్మిక ఆకాంక్ష అంటే అది. అదే ఆధ్యాత్మిక జీవితసూత్రము.

*

ఆధ్యాత్మిక శక్తి, దాన్ని గ్రహించగలగడం ద్వారా

ఆధ్యాత్మికశక్తి గనుక ఉన్నట్లయితే అది ఆధ్యాత్మిక ఫలితాలను ఉత్పన్నం చేయగలగాలి. ఆధ్యాత్మికశక్తే అసలు మూలమై మిగిలినవన్నీ దాని ఉత్పత్తులైతే ఆధ్యాత్మికశక్తి మానసిక, ప్రాణిక, దైహిక ఫలితాలను చూపించగలదని అనుకోవడంలో ఏ విధమైన అసమంజసమూ లేదు. అది మానసిక, ప్రాణిక, దైహిక సామర్థ్యాలతోనూ లేదా అవి ఉపయోగించే సాధనాల ద్వారా పనిచేయవచ్చు. లేక తన ప్రత్యేక శీఘ్ర చర్యకు క్షేత్రంగా మనస్సు, జీవితం, పదార్థాల పైనే సూటిగా పనిచేయవచ్చు. ఏ విధంగానైనప్పటికీ అది అనుకోగానే సాధ్యమవుతుంది. అస్వస్థతానివారణ తీసుకుంటే ఒక రోగి జ్వరంతో ఒళ్ళు నొప్పులతో బాధపడుతూ, ఏ మందూ వాడకుండా నీరసపడి, రెండ్రోజుల తర్వాత తగ్గించమని గురువుగారిని వేడుకుంటాడు. మర్నాడు ఉదయమే అంతా తగ్గి సుఖంగా, దృఢంగా నిద్ర లేస్తాడు. ఇతని విషయంలో అత నిపై ఒక శక్తి ప్రయోగం వల్ల ఆ ఆధ్యాత్మిక బలం పనిచేసిందని అనుకోవచ్చు. ఇంకొక సందర్భంలో మందులు ఉపయోగిస్తూ, అదృశ్యశక్తిని కూడా మందులతో పాటు తనకు సహాయం చేయమని పిలుచుకుంటే — మందులు పనిచేయవచ్చు, చేయకపోవచ్చనేది అందరికీ తెలిసిన విషయమే — చూసేవారికి (శక్తిని పంపించినవారు కానీ, వైద్యుడు కానీ, రోగి కానీ కాకుండా) బయటవారికి సందిగ్ధంగానే ఉంటుంది, మందులు వల్ల తగ్గిందా, లేక మందులొక సాధనంగా చేసుకుని ఆధ్యాత్మిక శక్తి పనిచేసి నివారణ జరిగిందా అని. ఏదైనా జరగవచ్చు. మందులు వాడాము కాబట్టి

ఆధ్యాత్మికశక్తి ఏమీ లేదు అని ప్రత్యక్ష ప్రమాణము లేనిది అనకూడదు; పైపెచ్చు వైద్యునికే తనలో ఏదో శక్తి పనిచేసి తనను నడిపించినట్లు భావన కలగవచ్చు, ఇంకా రోగి చాలా త్వరితగతిలో వైద్యశాస్త్రానికే అపురూపంగా కనిపించేటట్లు కోలుకోవటం అతనికి తెలియవచ్చు.

*

నీ కిదివరకే అంతా వివరించి చెప్పాను. నీకు వదిలిపెట్టేస్తే నీవేమీ చేయలేవనేది కూడా నిజము: ఇలా నీవు చేయలేనిది చేయడానికే నీవు ఆ శక్తితో సంబంధం పెట్టుకోవాలి. నీవు చేయవలసిందల్లా దాని పక్షాన్నుండి దాన్ని పనిచేయనివ్వాలి. అంటే దానిపై పూర్తి నమ్మకంతో, దాని పైనే ఆధారపడి, నిన్ను నీవు రొష్టు పెట్టుకో కుండా ప్రశాంతంగా దాన్ని తలచుకొని నిశ్శబ్దంగా పిలిచి నిశ్చలంగా చేయనివ్వాలి.

*

దైహిక చైతన్యాన్ని వివృతం చేసుకోవడం ద్వారా

...ఎల్లప్పుడు సరైన అంతర్గత సంతులత, బాహ్యంగానూ ఆంతరంగికంగానూ ప్రశాంతత, విశ్వాసము, శ్రీమాతకు, ఆమె శక్తికీ దైహిక చైతన్యాన్ని విప్పార్చుకొని యుండటం, ఇవే ఆరోగ్యం చేకూర్చుకోడానికి సరైన మార్గాలు. మిగిలినవన్నీ కొద్దిపాటి సాయానికి పనికివచ్చే ఉపాయాలు.

*

ఇంతకీ నేను చెప్పేదేమంటే దైహికచైతన్యం తన పాత చైతన్యపు అలవాటుకొద్దీ రోగశక్తికి తావిస్తుంది, దానితో బాటున్నవాటన్నిటినీ అనుభవిస్తుంది. ఉదాహరణకు ఛాతీలో కఫం పేరుకొని ఉక్కిరిబిక్కిరి అయి ఊపిరందకపోవటం వంటివి. దాన్నుంచి బయటపడాలంటే తన శరీరంలోనే సంకల్పాన్ని, చైతన్యాన్ని జాగృతంచేసి వాటి ద్వారా వీటి దుష్ప్రభావం పడకుండా ఆపుకోవాలి. అలా పూర్తిగా చేయాలంటే కష్టమే. ఆ దిశగా పనిచేయాలంటే మొదటగా నీ ఆంతరిక చైతన్యాన్ని దేహం నుంచి వేరు చేయాలి. అంటే జబ్బు పడింది నీవు గాదని అనుకోని, నీలో ఏదో చేరి నీ చైతన్యాన్ని బాధిస్తున్నట్లుగా భావించాలి. అలా చేసినప్పుడు ఈ దైహికచైతన్యాన్ని విడిగా చూసి, అది ఎలా బాధపడుతోందో, ఎలాంటి ప్రతీకార చర్యలు తీసుకుంటుందో, అది ఎలా పనిచేస్తోందో తెలుసుకోవచ్చు. అలా ప్రత్యేక చైతన్యాన్ని చూసి దానిపై

పనిచేసి దాన్ని దాని ప్రతిచర్యలనూ మార్చవచ్చు.

ప్రశ్న: చాలామంది నిష్క్రియత్వాన్ని, స్తబ్ధతగా పొరబడతారు. నేనూ చాలా కాలం అలాగే అనుకున్నాను. నాకు సుస్తీ చేసినప్పుడలాగే ఊరక ఉండిపోయాను. అప్పుడు నాకు తెలిసింది, నేను దానిని ఆమోదిస్తున్నానని.

శ్రీఅరవిందులు: నిష్క్రియత్వంగా ఉండటమంటే ఉన్నతశక్తికి విప్పారటమేగానీ స్తబ్ధత కాదు.

*

నిష్క్రియత్వం నిశ్చేష్టతకు దారి తీయకూడదు — కాకపోతే అది జీవిలో స్తబ్ధతకు దారి తీస్తుంది. పై నుంచి వస్తున్నదానికి మాత్రం లోలోపల నిశ్చేష్టితంగా ఉండటమే మంచిది — స్తబ్ధతతో కూడి నిష్క్రియత సరైనది కాదు.

*

ఆకాంక్ష, పిలుపు, ప్రార్థన ద్వారా

దివ్యప్రభావానికి వివృతులమై యుండటమే ఈ యోగంలోని ప్రధాన సూత్రము. అది నీకు పైనే ఉంది. నీవు దాన్ని తెలుసుకొని చైతన్యవంతుడవై, దాన్ని నీలోకి ఆహ్వానించుకోవడమే నీ పని. అది ఒక శాంతిగా, ఒక జ్యోతిగా, ఒక పనిచేసే శక్తిగా, స్వరూపంగానో లేక రూపరహితంగానో భగవంతుని ప్రత్యక్షతగా, ఆనంద రూపంగా, నీ దేహంలోకీ, నీ మనస్సులోకీ దిగివస్తుంది. ఈ చైతన్యం కలిగే లోపునే వివృతం కావటానికై విశ్వాసంతో ఆకాంక్షించాలి. ఆకాంక్ష, పిలుపు, ప్రార్థన ఏదైనా అర్థం ఒకటే కాబట్టి అన్నీ ఫలప్రదమైనవే. నీకు సులభంగా ఉండేదాన్ని నీవు స్వీకరించవచ్చు.

*

అదేమీ సిద్ధాంతం కాదు గానీ, ఒక నికరమైన అనుభవము. అది అలా పైభాగాన వచ్చినప్పుడు భౌతికదేహంలోని చైతన్యానికి పైగా శాంతి, కాంతి, శక్తి, ఆనందాల విస్తృతి, సమృద్ధి ఏర్పడతాయి. అది మనకి తెలిసిపోతుంది. దాన్ని క్రమంగా భౌతికచైతన్యంలోకి తెచ్చుకోవచ్చు. మొదట్లో అప్పుడప్పుడే అయినా, క్రమంగా వెంటవెంటనే తెచ్చుకొని చివరకు స్థిరంగా చేసుకోవచ్చు. అది ఇంకా పూర్తిగా నిలిచిపోయి మన నిత్యకృత్య చైతన్యపు మూలాన్నే మార్చేయగలదు. అది పైన

ఉన్నప్పుడు నీవు గమనించటానికి ముందే నీలో ప్రవేశిస్తున్న భావన కలుగుతుంది. చేయవలసినందల్లా దాని కోసమై ఆకాంక్షిస్తూ, మనస్సును నిశ్చలంగా చేసుకుంటే వివృతమనేది సాధ్యపడుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామశాస్త్రి

ఆంతరంగిక మార్గాల ద్వారా అనారోగ్య నివారణ

సంకల్పబల ప్రయోగము

వ్యక్తి తన అనారోగ్యాన్ని అంతరంగిక చర్య ద్వారా తప్పక కుదుటపరచుకోవచ్చు. కాని, అన్ని వేళల అది సులభ సాధ్యము కాదు; కారణము, భౌతిక పదార్థములో నిరోధకతత్వము అధికంగా ఉంటుంది. జడత్వకారక నిరోధక తత్వము. ఇందుకు అలసత్వము లేని పట్టుదల అవసరము; మొదట్లో చేపట్టిన ప్రయత్నము విఫలము కావచ్చు లేక రోగలక్షణాలు ముదరవచ్చు, కాని, క్రమక్రమంగా శరీరము పైన మరియు వ్యాధి పైన అదుపు అధికమౌతుంది. మరో మాట, అప్పుడప్పుడు సోకే వ్యాధిని అంతరంగిక సాధన ద్వారా నయము చేయుట ఇతర చికిత్సల కన్నా సులభము. కాని, మున్ముందు శరీరానికి దానిని నిరోధించే శక్తిని కలిగించుట చాలా కష్టము. ఒక దీర్ఘకాలిక వ్యాధితో తలపడుట కష్టముతో కూడుకున్న పని. అప్పుడప్పుడు సంభవించే శరీరవ్యాకులతను కుదుటపరుచుట కన్న దీర్ఘకాలిక వ్యాధిని పూర్తిగ కుదుటపరచుట చాలా కష్టము. శరీరంపై అదుపు దోషభూయిష్టమై ఉన్నంతకాలము ఇట్టి ఆటంకాలతోపాటు మరెన్నో అవాంతరాలు, ఒడుదొడుకులు ఉంటూనే ఉంటాయి.

అంతరంగిక చర్య ద్వారా వ్యాధి తీవ్రతను నివారించగలిగితే, అది కూడ కొంత మెరుగే. అప్పుడు అభ్యాసము ద్వారా నిరోధకశక్తిని పూర్తి స్వస్థత చేకూర్చే స్థాయికి బలోపేతం చేయవచ్చు. ఆ శక్తి పూర్తిగ సమీకృతము కానంతవరకు, భౌతికసాధనాల సహాయమును, పూర్తిగా నిరాకరించకూడదని గమనించాలి.

ప్రశ్న: శారీరక అస్వస్థత పట్ల సాధకుని వైఖరి ఎలా ఉండాలి?

అన్నిటి కన్నా ముందు ప్రాణికసత్తాలోను మరియు మానసికంగాను అతడు



నిర్లిప్తుడై ఉండాలి. అస్వస్థత ప్రకృతిశక్తుల యొక్క ప్రభావ ఫలితము. అతను తన సంకల్పాన్ని అస్వస్థతను తిరస్కరించుటకు వినియోగించాలి. ఆతని సంకల్పము దైవసంకల్పానికి ప్రత్యామ్నాయంగా వాడబడాలి. ఎప్పుడైతే దైవసంకల్పం ఆధారములోకి అవరోహిస్తుందో అప్పుడది సాధకుని సంకల్పము ద్వారా పరోక్షంగా పనిచేయుటకు బదులు ప్రత్యక్షంగా వ్యవహరించి అస్వస్థతను నిర్మూలిస్తుంది.

*

అస్వస్థతపై సంకల్పము అని అనుటలోని ఆంతర్యము, శరీరములో అస్వస్థతను అంగీకరించేది ఏదో ఉన్నదని, దానిని అమలుపరచే కొన్ని స్పందనలు కూడా దానికి కలవని — అందువలన ఈ అత్యంత శారీరక లొంగుబాటును అధిగమించుటకు గాను జీవి యొక్క చైతన్యభాగాలలో ఒక ప్రతికూల సంకల్పము ఎల్లప్పుడు మెదులుతుండాలి.

*

సంకల్పము మానసిక ప్రయత్నము కాదు. వ్యక్తులు వారి కోరికలను తీర్చుకొనుటకు చేసే సాధారణ ప్రాణిక ప్రయత్నమూ కాదు. తీవ్ర ఆకాంక్ష కూడ కాదు; ఒక పోరాటము గాని, పెనుగులాట గాని, ఆందోళన గాని కాదు. అది నిశ్చలమైనది. నిశ్చలస్థితిలో నున్నప్పుడు, నిజానికి అది ఒక అనంతశక్తి అవతరించి కార్యాచరణ గావించుట కోసం ఇచ్చే పిలుపు. స్వభావాన్ని అదుపులో ఉంచి పనిచేసే సంకల్పము ఒకటి ఉంది. అదుపు చేయుట కన్న అనంతశక్తి అవతరణ కొరకు ఎంతో ప్రార్థనాపూర్వకంగా ఆకాంక్షించే సంకల్పము మరొకటుంది. దైవసంకల్పమే మహోన్నతమైన సంకల్పము. అన్ని విజయాలకు ఆవశ్యకమైనది అదే. అది స్వయంచాలకమైనది.

*

భావనాశక్తి మరియు విశ్వాసము

అస్వస్థతను లేక అనారోగ్యాన్ని కలిగించే భావసూచనలు సాధారణంగా అవచేతన ద్వారా సంక్రమిస్తాయి. దీనికి కారణము దేహంలో అధికభాగము — భౌతిక ప్రధానమైన భాగము — అవచేతనను అనగా ఒక అస్పష్ట చైతన్యమును కలిగి వుంటుంది. అది ఎంత అస్పష్టముగ, ఎంతగా తనలో తాను మూయబడి వుంటుందంటే, దాని కదలికల గురించిగాని లేక అక్కడ జరిగేదేమిటనిగాని మనస్సుకు తెలియదు. ఏమైనప్పటికి

అదొక చైతన్యము. మానసిక, ప్రాణమయ కోశముల మాదిరిగ బాహ్యాశక్తుల నుండి భావసూచనలను అందుకోగలదు. అలా కానట్లయితే, అది దివ్యశక్తికి తెరుచుకొని ఉండే సంభావ్యత గాని, ఆ శక్తి స్వస్థత చేకూర్చే అవకాశము గాని ఉండేది కాదు. ఎందుకనగా చైతన్యము లేకుండ అది ప్రతిస్పందించలేదు. ఇప్పుడు యూరపు మరియు అమెరిగా దేశాలలో ఎందరో జనులు ఈ వాస్తవాన్ని గుర్తించి వారి వ్యాధులను చైతన్యపూరితమైన మానసిక సూచనలను శరీరానికి అందించుట ద్వారా అవచేతనలో అస్వస్థతను కలిగించే అస్పష్టమైన, గోప్యమైన సూచనలను వమ్ముచేసి స్వస్థత పొందేవారున్నారు. ఫ్రాన్స్‌లో గొప్ప పేరుపొందిన డాక్టరు ఒకరుండేవారు. అతడు చైతన్యపూరితమగు మానసిక సూచనలను జనుల శరీరాలపై ఎడతెగకుండ ప్రయోగింపజేసి, తద్వారా వేలమందికి స్వస్థత చూకూర్చగలిగాడు. దీని వలన అనారోగ్యము కేవలము ఒక భౌతికకారణము వలన కలుగదని, అది శరీరంలోని గుప్తచైతన్యము, అలజడికి లోనగుట వలన కలుగుతుందని రుజువగుచున్నది.

*

ఈ స్వయం సూచనలు — నిజానికివి మానసికరూపంలో వున్న విశ్వాసము — అంతఃచేతనపైన మరియు అవచేతనపైన వాటి ప్రభావము చూపిస్తాయి. అంతః చేతనలో అంతఃస్సత్తా శక్తులను కార్యోన్ముఖము గావిస్తాయి. దాని అతీంద్రియ శక్తి, ఆలోచన, సంకల్పము సాధారణ చైతన్యశక్తి శరీరానికి ప్రయోజనము చేకూరుస్తాయి. అవచేతనలో ఆరోగ్యము తిరిగి పుంజుకొనుటను అడ్డుకునే మారక మరియు అనారోగ్య సూచనలను (వ్యక్తములు, అవ్యక్తములు) నిర్వీర్యపరుస్తాయి, లేదా నిరోధిస్తాయి. దీనికి తోడు మానసిక, ప్రాణిక మరియు శారీరక చైతన్యములో పొడ చూపే ప్రతికూల సూచనలను కూడ ప్రతిఘటించుటలో తోడ్పడతాయి. ఎక్కడైతే ఇది పూర్తిగ లేక కొద్దిపాటిగనైన నిర్వర్తించబడుతుందో అక్కడ చెప్పుకోదగిన ప్రయోజనాలు చేకూరుతాయి.

*

విశ్వాసము కలిగించుట ద్వారా జీవకణాలలో వ్యాధిని నయము చేయవచ్చుననుట వాస్తవము. అది ప్రకృతి ధర్మము. యోగప్రక్రియ ప్రమేయము లేని ఎన్నో సందర్భాలలో ఇది నిరూపించబడింది. విశ్వాసం కలిగించుటకు మరియు ఇతరములైనవాటికి కూడ పొందుటకు మార్గము. వాటిని చేజిక్కించుకునేవరకు పట్టు విడువకపోవటమే.

వాటిని పొందేంతవరకు నిరుత్సాహాన్ని, నీరసాన్ని, ఓటమిని తిరస్కరించాలి. ఆలోచన, ఆకాంక్ష కలిగిన జీవుల ఉనికి ఈ కరుడుగట్టిన ప్రపంచంలో ప్రారంభమైన నాటి నుండి, అన్నీ ఈ మార్గంలోనే పొందబడ్డాయి. వ్యక్తి అన్ని వేళలా అరమరికలు లేకుండ వివృతంగ వుండాలి. ఎల్లప్పుడు దివ్యతేజానికి తెరచుకుని అజ్ఞాన తిమిరానికి పరఙ్ముఖుడై ఉండాలి. "నీవు చేయలేవు, నీవు చేయకూడదు, నీకు చేత కాదు, నీవు కలలో కీలుబొమ్మలాంటి వాడివి", అని ఎడతెగకుండ వినిపించే స్వరాలను పెడచెవిని పెట్టాలి. కారణం అవి కఠోర శత్రుస్వరాలు. వ్యక్తికి అందుబాటులోకి వచ్చిన ఫలితాన్ని దూరము చేసి, విజయగర్వముతో ఆ నిష్ఫలితాన్ని తమ సిద్ధాంతానికి తార్కాణంగా ఎత్తి చూపుతాయి. ఈ కృషి ఎంత కష్టముతో కూడుకున్నదో తెలిసిన విషయమే కాని అసాధ్యమైనది మాత్రం కాదు — కష్టమే సర్వదా సాధించబడింది. ప్రపంచ చరిత్రలో కంతా అత్యంత విలువైనది. కష్టాలపై గెలుపు సాధించుటయే.

*

శారీరక బంధము నుండి విముక్తి

ఒక్కసారి మన మేధలో 1) కనిపించేదంతా సత్యము కాదు 2) ఆత్మ శరీరముగాని, ప్రాణముగాని, మనస్సుగాని కాదు — కారణము, ఇవన్నీ ఆత్మయొక్క ఆకృతులు మాత్రమే — అనే నిర్ధారణకు వచ్చినట్లయితే, మన మొట్టమొదటి చర్య మనస్సు జీవాత్మతో సరైన సంబంధము ఏర్పరచుకొనుటకు వీలుగ ప్రాణముతోను, దేహముతోను దానికున్న క్రియాశీల సంబంధాన్ని సరిచేసుకొనుట కావాలి. మనకు ఇదివరలో సుపరిచితమైన ప్రక్రియతో దీనిని అతి సులభముగ సాధించవచ్చు. అది ప్రకృతి పురుషుల మధ్య వియోగము ఏర్పరచుట. ఎరుక కలిగి శాసించగల పురుషుడు అనబడే ఆత్మ, తాను స్వయంగ క్రియాశీల చైతన్యశక్తియొక్క కార్యకలాపాలలో చిక్కుకున్నందువలన, భౌతికకార్యములను నిర్వర్తించే శరీరముగ పిలువబడేది తానేనని పొరబడతాడు. ఎరుక గలిగి శాసించగల ఆత్మయే తన స్వంతప్రకృతి అని మరచిపోతాడు; తన మనస్సు, తన ఆత్మ, శారీరక ధర్మానికి, దాని కార్యాచరణకు బద్ధులని నమ్ముతాడు. తన భౌతిక ఆకృతి కన్న తాను అధికుడనని, మరెన్నో ఇతర లక్షణాలను కూడ కలిగి ఉన్నవాడినని మరచిపోతాడు. మనస్సు వాస్తవానికి

భౌతిక పదార్థానికన్న ఎంతో గొప్ప దైనందున దాని అస్పష్ట, అర్థరహిత చర్యలకు, ప్రతి స్పందనలకు మందకొడి అలవాట్లకు, అసమర్థపు అలవాట్లకు లోబడి ఉండకూడదనే విషయం మరచిపోతాడు; తాను మానసికసత్తాను తన కన్న మిన్నగ చేయగల అనంతశక్తి కన్నా ఉన్నతుడనని మరచిపోతాడు; తాను యజమానినని, సర్వాతీతుడ నని, యజమాని తన స్వంత కార్యకలాపాలకు తానే బానిసగ మెలగుట సరి కాదని, తన అస్తిత్వమునందే తానొక విలువ లేని బందీగ నుండుట సబబు కాదనే విషయాన్ని విస్మరిస్తాడు. పురుషుడు తన శరీరము ఒక కార్యాచరణకు సాధనమేనని మరియు అది ప్రకృతి కుండే ఏకైక సాధనమని ముందుగ జ్ఞప్తి యందుంచుకుని, తన నిజ స్వభావాన్ని కూడ జ్ఞప్తికి తెచ్చుకుని, ఈ మతిమరుపునంతటిని నయం చేసుకోవాలి.

*

చైతన్యపు ఒత్తిడి కేంద్రీకరణ

చైతన్యము తనకై తాను ఎచ్చట నిలుస్తుందో, ఎచ్చట కేంద్రీకృతమౌతుందో అనే దానిపైన ఇది ఆధారపడి ఉంటుంది. చైతన్యము తనకై తాను అహము నందు నిలచి దానియందే కేంద్రీకృతమైనట్లయితే, నీవు అహముతో తాదాత్మ్యము ఏర్ప రచుకున్నట్లు భావించాలి. అదే విధంగా మనస్సునందు జరిగినట్లయితే, మనస్సు తోను దాని కార్యకలాపాలతోను తాదాత్మ్యము ఏర్పరచుకున్నట్లు భావించాలి. చైతన్యము ఒత్తిడిని బహిర్భాగమునందు నిలిపినట్లయితే అది బాహ్యసత్తలో జీవి స్తున్నట్లుగ పరిగణించాలి. అప్పుడు దానికి తన అంతర్మానసము, ప్రాణికము మరియు లోనున్న ఆత్మశక్తి యొక్క స్మృతి ఉండదు. అంతర్భాగము లోనికి ప్రవేశించి ఒత్తిడిని అక్కడ కేంద్రీకరించినట్లయితే అప్పుడు స్వయంగ తానే అంతః స్సత్తాననే అవగాహన దానికి ఏర్పడుతుంది. మరింత లోతుగ చొచ్చుకొనిపోతే తానే చైత్యపురుష సత్తానని తెలుసుకుంటుంది. చైతన్యము శరీరము నుండి బహి ర్గతమై, ఏ భూమిక లందైతే ఆత్మ సహజంగ తన వైశాల్యతను స్వేచ్ఛను గురిం చిన అవగాహన పొందగలుగుతుందో, ఆ భూమికలకు ఎదిగినట్లయితే అప్పుడు తానే జీవాత్మనని మరియు మనస్సుగాని, ప్రాణముగాని, శరీరముగాని కానని తనకై తాను తెలుసుకుంటుంది. ఈ చైతన్యపు ఒత్తిడియే వ్యత్యాసము లన్నింటిని సృష్టించేది.

అంతర్ముఖులమై జీవించుట నేర్చుకోగలిగితే తప్పక మనలోని అసలైన నిజ ఆత్మ ఉనికికి ప్రేరితులమౌతాము. ఈ ఉనికి అపారమైనది, ప్రశాంతమైనది, ఆనం దమయమైనది, అత్యంత శక్తివంతమైనది, లోకానికి కట్టబడనిది — స్వయంగా తానే పరమాత్మ కాకపోవచ్చు గాని అంతరంగంలో అపార దివ్యతేజముతో విరా జిల్లుతున్న అంతర్యామి యొక్క కాంతికిరణ ప్రసరణ. అంతరంగమందుంటూ పైకి ప్రస్ఫుటంగా కనిపించే జీవికి ఆసరాగా సహాయపడుతూ దాని కష్టసుఖాలను, ఒక పసిపాప పొరపాట్లను, ఆరడిని చిరునవ్వుతో ఎలా గమనిస్తామో ఆ విధంగా గమనిస్తూండే ఆ భగవంతుని ఉనికి మనకు అవగతమే. మనలోకి మనం అంతర్ముఖంగా పోగలిగి, బాహ్య అనుభవాలతో గాక పరమాత్మ యొక్క తేజోమయ ఉపచ్ఛాయతో తాదాత్మ్యము ఏర్పరచుకోగలిగితే, లౌకిక సంబంధాల పట్ల కూడ అదే వైఖరితో మెలగవచ్చు. శారీరక, మానసిక మరియు ప్రాణికసత్తాలకు కలిగే సుఖదుఃఖాలకు మన చైతన్యమునందు స్పందించుట మాని, వాటిని అనుభవాలుగ స్వీకరించాలి. వాటి ప్రభావము పైపైన కలిగేదే కాబట్టి, మన అంతరంగాన్ని గాని, నిజసత్తాను గాని అవి అంటలేవు. మరియు ప్రభావితం చేయలేవు. భావప్రకటనను సమగ్రంగా వ్యక్తపరచగలిగే సంస్కృత పరిభాషలో మనోమయ కోశము వెనుక ఆనందమయ కోశము ఉంది. పరిమితుడైన మానసికజీవి వెనుక అత్యంత పరమానందమయుడైన జీవి ఉన్నాడు. ఇందులో మొదటిది రెండవదాని యొక్క ఛాయారూపము. ఒక అస్థిరమైన ప్రతిబింబము. మనలను గురించిన సత్యము మన అంతరంగములోనే ఉన్నది గాని, బాహ్యమునందు కాదు.

*

శాంతి మరియు సహజజ్ఞానము, చైత్యపురుష సత్తాలో ఉపస్థితమై ఉండి, అక్కడ నుండి మానసిక, ప్రాణిక మరియు శారీరక సత్తాలకు విస్తరిస్తుంది. బాహ్యభౌతిక చైతన్యమునందు ఏర్పడిన ప్రతిబంధకము మాత్రం, మరింతగా కొనసాగే ప్రయ త్నంలో కొన్నిసార్లు భౌతికమానసములోను, కొన్నిసార్లు నరాలలోను, కొన్నిసార్లు శారీరక రుగ్మతరూపంలోను, దేహంలోను, అస్థిరతను కలుగజేస్తుంది. ఈ ప్రతి బంధకాలన్నీ తొలగగలవు, తొలగిపోవాలి కూడ. కడుపు నొప్పులు, కంటిజబ్బులు,

మొదలగు అనారోగ్య లక్షణాలన్నీ, ప్రశాంతత మరియు శక్తి నరాలలోను, జీవకణా లలోను పుంజుకొనుటతో పూర్తిగ నయం కాగలవు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదము: అందుగులపాటి కైలాసపతి, జానకి

అనుబంధం:

భయం ఎందుకు కలుగుతుంది?

మన అహంకారం వల్లనే, ముఖ్యంగా యిందుకు మూడు కారణాలు కనిపిస్తాయి. మొదటిది మన భద్రత పట్ల అతి జాగ్రత్త, రెండవది మనకు తెలియనిదెపుడూ అభద్ర తాభావాన్ని కలిగిస్తుంది. అది మన చేతనలో భయంగా అనువదించబడుతుంది. అన్నింటినీ మించి భగవంతునిలో స్వచ్ఛందమైన నమ్మకం లేకపోవటం, విషయాలను తగినంత లోతుగా తరచి చూచినపుడు యిదే అసలైన కారణంగా కనిపిస్తుంది. ఆ తత్త్వ మొకటి ఉన్నదనే దృష్టి లేనివారు కూడా కొందరుంటారు. వాళ్ళకిలా చెప్ప వచ్చు, "మీకు విధిపైన నమ్మకం లేదు లేదా భగవంతుని కృప గురించి మీకేమీ తెలియదు". ఏది ఏమైనా మీ కిష్టమైన ఏ రీతిలో భావించినా విషయం యొక్క మూలం మాత్రం నమ్మకం లేకపోవటమే. అన్ని పరిస్థితులలోనూ మంచి జరుగుతుం దనే భావన ఎప్పుడూ కలిగి ఉంటే మీకు భయం ఉండదు.

*

భయం అచేతన యొక్క లక్షణం. ఇది అజ్ఞానం నుండి వచ్చే ఆందోళన. ఒక విషయం యొక్క స్వభావం తెలియనప్పుడు దాని ఫలితం ఏమిటి? మన చేతన పరిణామాలు ఏమిటి? ఇలా ఎన్నో విషయాలు మనకు తెలియవు. ఈ అజ్ఞానం భయాన్ని కలిగిస్తుంది. మనకి తెలియని విషయాలు భయాన్ని కలిగిస్తాయి. ఒక పసి బిడ్డను పరిచయంలేని వ్యక్తి ముందు ఉంచినపుడు (నేను జాగృతమైన చేతన కలిగిన బిడ్డ గురించి కాక, ఒక సాధారణమైన బిడ్డ గురించి చెప్పుచున్నాను.) మొదట కలిగే స్పందన భయమే. చాలా అరుదైన పిల్లలు ప్రత్యేకమైన చేతన కలి గినవాళ్ళు మాత్రమే చాలా ధైర్యంగా ఉంటారు. అది కూడా ఒక విధమయిన

ఆందోళన, భయం, కీడు శంకించే నైజం. జన్మతః ఉండే ప్రమాదాన్ని పసిగట్టగలిగే సంవేదన కలిగి, అందుకు పరిష్కారం తెలియనపుడు, తనను తాను ఆ విపత్తునుండి కాపాడుకోలేకపోయినపుడు — అప్పుడు భయం కలుగుతుంది. భయానికి అసంఖ్యాకమయిన కారణాలున్నాయి. కానీ ప్రతి సందర్భంలో అది అచేతనాజనితమే.

అన్నీ తెలిసిన చోట భయం లేదు. పూర్తిగా జాగృతమైన అన్నీ విదితమయిన పరిపూర్ణ చేతనలో భయానికి అసలు తావు లేదు. తమోమయమయిన దానిలోనే ఎపుడూ భయం ఉంటుంది.

క్రైస్తవమతంలో ఈడెన్ తోటలోని యాపిల్ తినటం వలన — జ్ఞానంతో భయం వచ్చిందని చెప్తారు. ఈ భయమే మానవాళి జీవితాలను పాలిస్తోంది. ఈ సందర్భంగానే, జంతువులకు కూడా భయం ఉంటుందని, నేను మళ్ళీ మళ్ళీ వాదిస్తాను. మరి జంతువులు యాపిల్ తినలేదు, ఏ పాపం చెయ్యలేదు, మరి వాటికి ఏ రకమైన భయం ఉండకూడదు. అవి తమ పరిమితమైన చేతన, మూఢమైన అంతర్బుద్ధితో కలిసి ప్రమాదాన్ని పసిగట్టగలుగుతాయి, కాని దానికి పరిష్కారాన్ని తెలుసుకోలేవు. ప్రాణమయ భూమికలో కొన్ని వినాశకర శక్తులు దైవకార్యానికి వ్యతిరేకంగా పోరాడటానికి భయాన్ని అమితంగా ఉపయోగించుకుంటాయి. భయం ద్వారానే మానవులను తమ గుప్పెట్లో ఉంచుకుంటాయి, ఉపయోగించుకుంటాయి. ఈ శక్తులే కాక అన్ని రాజకీయ, మతసంబంధమైన విధానాలన్ని ఆ రకమైనవే. చాలా మతసంబంధమయిన శక్తులు కూడా యిలానే పనిచేస్తాయి. తాము విధించిన నియమాలను మూఢంగా నమ్మ నట్లయితే మరణభయంతోనో, ఆ తర్వాత జరిగే పరిణామాలతోనో, మరణానంతరం పడే బాధలతోనో భయపెడుతూ ఉంటారు.

ఈ భయం వ్యతిరేకభావన వలన లేదా దేనిపట్ల అయినా విముఖత, అయిష్టత, ఉన్నపుడు కూడా కలుగవచ్చు. కొంతమందికి నీళ్ళంటే భయం, కొంతమందికి నిప్పు అంటే భయం. మరికొంత మందికి ఏదో ఒక జంతువు అంటే భయం ఉంటుంది. ఇది ప్రాణిక ప్రకంపనల అపశృతి వలన కలుగుతుంది. తరువాత అది శరీరం యొక్క అచేతనలో భయంగా అనువదించబడుతుంది. అది స్వతహానే ఉండి అలవాటుగా మారుతుంది. భయంకరమైన అచేతన అది. స్వల్పంగా అందులో చేతనను నింపాలంటే ఎంతో శ్రమించాల్సి ఉంటుంది.

భయం నివారణకి పలుమార్గాలు

ప్రశ్న: శ్రీమాతా ఎవరికైనా భయం వేసినపుడు ఏం చెయ్యాలి?

జ: అది నువ్వెవరివి?, అనే దానిపై ఆధారపడి ఉంటుంది. భయాన్ని నివారించటానికి అనేక మార్గాలున్నాయి. మీకు మీ చైత్యపురుషచేతనతో అనుబంధం ఉన్నట్లయితే వెంటనే దానిని పిలవండి. ఆ అంతరాత్మ వెలుగులో అన్నిటినీ సక్రమం చేసుకోండి. ఇది ఎంతో శక్తివంతమయిన మార్గం.

ఒక వేళ అంతరాత్మలో అనుబంధం లేనట్లయితే మీ వివేచనాశక్తిని వినియోగించండి. నీకు నీవే, నచ్చచెప్పుకోవాలి. భయం చాలా చెడ్డదనీ, ప్రమాదం సంభవించినప్పటికీ, భయంతో ఆ ప్రమాదాన్ని ఎదుర్కోవటం తెలివితక్కువ అనీ వివరించి చెప్పాలి. నిజంగా ప్రమాదం ఉన్నట్లయితే ధైర్యంతో మాత్రమే దాని నుండి బయటకు రావటానికి అవకాశం ఉంటుంది. మీలో ఏమాత్రం భయం ఉన్నా మీరు దొరికిపోయినట్లే. ఈ విధమైన తర్కంతో మీలో ఏ భాగం అయితే భయానికి లోనవుతుందో దానిని అనునయించి భయం లేకుండా చెయ్యాలి.


మీకు భగవంతుని పట్ల విశ్వాసం ఉండి పరిపూర్ణ సమర్పణ చేసికొని ఉంటే మరొక సరళమయిన మార్గం ఉంది. "నీ సంకల్పానుసారమే కానివ్వు. నా జీవితాన్ని నడిపించేది నీవే అయినపుడు మరేదీ నన్ను భయపెట్టలేదు. నేను నీ వాడను — నీ దానను. నాకు మార్గం చూపేది నీవే", అని అంటే, అది వెంటనే పనిచేస్తుంది. అన్నింటికన్నా సర్వశక్తివంత మయిన పద్ధతి యిదే. కాకపోతే మీరు దైవానికి నిజంగా అధీనులై ఉండాలి. అప్పుడు భయం ఒక కలలా కరిగిపోతుంది. మీపై దుష్ప్రభావాన్ని చూపే ఆ విషయం కూడా భయంతో పాటు అంతర్ధానమయిపోతుంది. అది ఎంతో వేగంగా పరిగెత్తిపోవడాన్ని మీరు చూస్తారు.

అధికమైన ప్రాణశక్తిని కలిగి ఉన్నవాళ్లని చూస్తూ ఉంటాం. వీళ్ళు మంచి యోధులు. ప్రత్యర్థి ఎదురైన వెంటనే తలలు ఎత్తి 'ఇక్కడ శత్రువు వున్నాడు, మనం అతనిని క్రింద పడగొడదాం' అంటారు. కానీ అందుకు ఎంతో పరిజ్ఞానం అవసరం, దానికి తోడు అనంతమయిన శక్తి కూడా. ఇలా ఎన్నో విభిన్నమయిన మార్గాలున్నాయి. నీ స్వభావానికి తగిన మార్గమేదో ఎంచుకొని ఉపయోగించుకోవటం తెలుసుకుంటే అన్నీ మంచివే.

ఇప్పుడు చాల సులభమైన చిన్న చిట్కా చెప్తాను. ఇది మన వ్యక్తిగతమైన లౌకిక జ్ఞానంతో ముడిపడి ఉంటుంది. మిమ్మల్ని మీరు గమనించుకోండి. మీరు భయపడినపుడు, ఆ భయం మీరు దేనిని గురించి భయపడుతున్నారో దానిని ఆకర్షిస్తుందనే విషయాన్ని గమనించండి. మీరు ఏదైనా వ్యాధి గురించి భయపడుతుంటే, మీరా వ్యాధిని ఆకర్షిస్తున్నారని తెలుసుకోండి. మీరు ఒక ప్రమాదం గురించి భయపడుతుంటే, ఆ ప్రమాదాన్ని ఆకర్షిస్తున్నట్లే. మీరు మీలోకి, మీ చుట్టూ చూసుకున్నట్టయితే అది నిలకడయిన సత్యంగా మీరు గ్రహిస్తారు. మీకు ఈ కనీసజ్ఞానం ఉన్నట్లయితే మీరే అంటారు దేని గురించయినా భయపడటం తెలివితక్కువతనం అని, అలా చేయటం వలన దానిని చేతులారా ఆహ్వానించినవారమవుతాం. ఎవరైనా శత్రువు మనల్ని చంపాలనుకున్నపుడు — అతని దగ్గరకు వెళ్ళి, 'నువ్వు నన్నే చంపాలనుకుంటున్నావు' అని చెప్పం కదా. ఇదీ అలాంటిదే. భయం మంచిది కాదు. కాబట్టి మనం దానిని కావాలనుకోం. మీరు మీ వివేచనతో దానిని నివారించలేకపోతే మీ మీద మీకు నియంత్రణ లేదనే అర్థం. అందుకు మీరు కొంత పరిశ్రమించాలనే విషయాన్ని సూచిస్తుంది. అంతే.

*

తాత్త్వికచింతన కలవారికి ఏ విషయం వలననైనా భయం కలిగినవుడు అన్నిటికన్నా ఉత్తమమయిన మార్గం భగవంతుణ్ణి తలచుకోవటమే. ఆయన బాహువులలో ఒదిగిపోవటమో లేదా ఆయన పాదాల చెంత అన్నీ విడిచి బాహ్యాంతరాలలోను సర్వత్ర సంభవించే అన్నింటికీ ఆయనే బాధ్యుడుగా భావించటంవలన వెంటనే భయం మటుమాయమయిపోతుంది. తాత్త్వికులకు అదే చికిత్స. అన్నిటికన్నా సులభమయినది. కానీ తాత్త్వికులు కాగలిగే సదవకాశం అందరూ పొందలేరు.



అఖిల

అఖిల భారత పత్రిక - ఫిబ్రవరి 2011

భవిష్యత్తు

విషయసూచిక

గమనిక


జనవరి 2011 సంచికలోని విషయసూచికపైన శీర్షిక 'దివ్యశక్తి' అని ఉండాలి. కాని తప్పుగా 'ఆహారము — తిండి' అని ప్రచురించడమైనది. క్షమించాలి.

ఆధ్యాత్మిక జీవితాన్వేషణకి పరమాత్మని కనుగొనడం మాత్రమే ప్రథమ కర్తవ్యం. అదొక్కటే అత్యంతావశ్యకమయిన విషయం. అది తప్ప మిగిలినవన్నీ వ్యర్థమే. దైవాన్ని ఒకసారి కనుగొన్నాక, ఆయన అభివ్యక్తీకరణం అంటే – ముందు వ్యక్తితన పరిమిత చైతన్యం నుండి, దివ్యచైతన్యంలోకి పరిణామం చెందడం, అనంతమైన శాంతి, దివ్యకాంతి, దివ్య ప్రేమ, దివ్యశక్తి దివ్యానందంలో జీవించడం పర్యవసానంగా అందుకు తగిన పాత్ర, వాహిక, ఉపకరణం కావటం — ఇదీ.

కవరు మీద పుష్పం

భవిష్యత్తు

(శ్రీమాత ఇచ్చిన ఆధ్యాత్మిక ప్రాధాన్యత)



శ్రీమాతను గురించి శ్రీఅరవిందులు

పెరుగుతున్న ప్రపంచంలోకి
దిగివచ్చితివి నీవు
బాధిత, అంధ మానవజాతి
సహాయార్థమే కదా!
చూడలేని కళ్ళను తెరిపించి
వెలుగును దర్శింపచేయటానికే
దుఃఖిత హృదయాల్లోకి
ఆనందానుభూతి నింపటానికే
గగనానికీ భూమికీ మధ్య
నీ జీవితాన్నే వారధి చేయగా...

(శ్రీఅరవిందుల సావిత్రి నుండి)

ప్రార్థనలు — ధ్యానములు

ఫిబ్రవరి, [illegible] 1914.

ప్రభూ! దివారాత్రాలలో ఎన్నోసార్లు నేను, కాదంటే నా చైతన్యమంతా, నా ఎదలో, అది భౌతికమైన గుండె కాదు, నా హృదయం లోపల కేంద్రీకృతమై ఉన్నట్లుగా అనిపిస్తుంది. అది కేవలం భావన కూడా కాదు, అది అకర్తృకం, అవ్యయము అగు దివ్యప్రేమ; ఆ ప్రేమమయంగా అయిపోయి యావద్భూప్రపంచంలోని ప్రతి వస్తువులో కేంద్రస్థంగా ఉన్న భావన. అంతే కాక నా భూరి అనంత బాహువులను చాచి సమస్త జీవులను పట్టి ప్రోవుచేసి చుట్టి అమిత ఆర్ద్రితతో ఈ జగతిని మించి ఉన్న నా విశాల వక్షస్థలంపై హత్తుకుంటున్న భావన. ఓ దివ్యప్రభూ! మాటలు మరీ నిస్సారమై వికారంగా ఉంటాయి. మనస్సులోని వ్యాఖ్యలు గూడా మరీ చిన్నతనంగా ఉంటాయి.... కానీ నీ కొరకై నా ఆకాంక్ష నిత్యమైనది. నిజం చెప్పాలంటే సర్వసాధారణంగా ఈ శరీరంలో నిన్ను వ్యక్తం చేయవలసిన ఈ అపరిపూర్ణ సాధనంలో నివాసముంటున్నది మాత్రం నీవే.

నీ దివ్యప్రకాశ ప్రశాంతతలో జీవులంతా సంతోషించెదరు గాక!

మూలం శ్రీమాత
అనువాదం: డా. అమరవాది ప్రభావతి,
ప్రొ. అమరవాది వేంకటరామ శాస్త్రి

భవిష్యద్దృష్టి

(ఇది ఒక అంకనాటిక. దీనిని ఏ దేశంలోనైనా ఆ దేశ పద్ధతుల కనుగుణంగా స్వల్ప సవరణలతో ప్రదర్శించవచ్చును.)

పాత్రధారులు

ఆమె, కవి, దివ్యదృష్టి కలిగిన కన్య, చిత్రకారుడు, చిన్ననాటి స్నేహితురాలు (పాఠశాలలో కలసి చదువుకున్న చిన్ననాటి స్నేహితురాలు)

(తెర తీయగానే, ఆమె, చిన్ననాటి స్నేహితురాలు సోఫాలో పక్క పక్కన కూర్చుని ఉంటారు.)

ఆమె:
నీవు చాలా రోజుల తరువాత నన్ను చూడడానికి రావడం చాలా సంతోషంగా ఉంది.... నన్ను మర్చిపోయావనుకున్నాను.
చిన్ననాటి స్నేహితురాలు:
అలా ఎన్నటికీ జరగదు. నీవు ఎక్కడ ఉంటున్నావనే సమాచారం నా దగ్గర లేకుండా పోయింది, దానితో నిన్ను ఏ విధంగా కలవాలో తెలియలేదు. ఇప్పుడు కనిపించావు. ఆశ్చర్యం! పెళ్ళి అయిందా. ఎంత విచిత్రం! నమ్మశక్యం కావడం లేదు.
ఆమె:
నాకూ అది నమ్మశక్యంగా లేదు.
చిన్ననాటి స్నేహితురాలు:
నేను అర్థం చేసుకోగలను.... నీవు వివాహాన్ని ఎంతో వ్యంగ్యంగా 'సహకార పద్ధతిలో

ఖర్చు, ఉత్పత్తి లక్ష్యంగా పనిచేసే ఒక వ్యాపారంగా' ఎగతాళి చేసేదానివి, అంతేనా, దానిని ఎంతో అసహ్యంగా మానవజాతి చేసే జంతుచేష్టలుగా, మనిషిని పశువుగా పోల్చేదానివి. అప్పుడు నీవు ఎప్పుడూ చెప్పే మాట నాకు గుర్తు ఉంది, 'మనం పాలిచ్చే జంతువులం కావద్దు'. అని.

ఆమె:

అవును, నేను ఎప్పుడూ వర్తమాన భావాలను, సామాజిక ఆచారాలను గురించి హాస్యంగా ఎగతాళి చేసేదాన్ని. కాని నేనెప్పుడూ నిజమైన ప్రేమకు వ్యతిరేకిని కాననే విషయం నీవు మనస్ఫూర్తిగా నమ్ముతావనుకుంటాను. ఎంతో లోతునుంచి అనురాగంతో వచ్చిన ప్రేమను, భావాల, ఆకాంక్షల ఐక్యతను నేనెప్పుడూ వ్యతిరేకించలేదు. పరస్పరం ఇచ్చిపుచ్చుకునే గొప్ప ప్రేమను గురించి నేను కలలు కన్నాను. అది పూర్తిగా జంతువుల క్రీడకు భిన్నంగా, భౌతికత ఆధారంగా ఈ ప్రపంచాలకన్నింటికీ మూలమైన ఒక గొప్ప ప్రేమను చూపించేదిగా ఉండాలనుకున్నాను. నా కలే నన్ను వివాహానికి ప్రోత్సహించింది. కాని ఆ అనుభవం అంత సంతోషదాయకంగా లేదు. నేను చాలా లోతుగా, ఎంతో నిజాయితీగా, ఎంతో తీవ్రతతో ప్రేమించాను, కాని నా ప్రేమ ఏమి ఆశించిందో, దానిని అందుకోలేక పోయింది.

చిన్ననాటి స్నేహితురాలు:

అయ్యో, ఎంత కష్టం వచ్చింది!

ఆమె:

వద్దు, ఇది నీకు నీపై జాలి చూపించడానికి చెప్పడం లేదు. నాకు జాలి అక్కర లేదు. నా కల ఈ ప్రపంచంలో సాధ్యం అయ్యేది కాదు: ఇది సాధ్యం కావాలంటే మానవప్రకృతి చాలా మార్పుకు లోనవవలసి ఉంటుంది. అది అలా ఉంచు, నా భర్త, నేను చాలా మంచి స్నేహితులం, అయినప్పటికి అది మమ్మలను ఏకాకులం కానీయకుండా ఆపలేదు. గౌరవం, ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోలు సామరస్యతను కలుగజేసి జీవితానికి ఎక్కువ తృప్తిని కలుగజేస్తుంది. కాని అది సంతోషం అనగలమా?

చిన్ననాటి స్నేహితులురాలు:

చాలమందికి అది సంతోషం కలుగచేస్తుండొచ్చు.

ఆమె:

నిజమే, కాని అప్పుడప్పుడు నా జీవితంలో ఏదో శూన్యత; ఈ శూన్యత పోగొట్టుకొనటానికే నేను పూర్తిగా, ఎంతో చిత్తశుద్ధితో ఆ మహత్కార్యానికి అంకిత మయ్యాను. అది ఏమిటంటే, దుఃఖితమానవజాతి దుఃఖాన్నంతా తొలగించటానికి, జాతిని దాని సమర్థతలకు, దాని లక్ష్యానికి తట్టి లేపి అంతిమంగా పరివర్తనను కలుగజేయటం.

చిన్ననాటి స్నేహితురాలు:

అది చాలా గొప్ప పని, నీ సాధారణ జీవితాన్ని మించినది, కాని అది నాకు అంతు బట్టటం లేదు, నా కది చాలా మార్మికంగా అనిపిస్తున్నది.

ఆమె:

నీకు అర్థం అయేటట్లు వివరించి చెపుతాను. కాని దానికి కొంత సమయం పడుతుంది. నీ వద్దకు వచ్చి చెప్పమంటావా?

చిన్ననాటి స్నేహితురాలు:

చాలా మంచి ఆలోచన! నీవు వస్తే ఎంతో సంతోషిస్తాను. ఎప్పుడు వస్తావు? ఈ రోజు వస్తావా?

ఆమె:

అవును, ఈ రోజే వస్తాను. మన జీవితాలకు మార్గం చూపిస్తూ, మన ఇచ్ఛను సరైన దిశకు ప్రోద్బలం చేసే అద్భుతమైన బోధనను గురించి మాట్లాడుకోవడంలో నేనెప్పుడూ అంతులేని ఆనందాన్ని పొందుతాను. ఇప్పుడు నాకు, ఆయన ఉదయపు వ్యాహ్యాళి నుంచి వచ్చేటప్పటికి, ఆయనకు కొన్ని వస్తువులు సర్ది తయారుగా ఉంచే పని ఉంది. ఆయన తన పని మొదలుపెట్టగానే, నేను బయటకు రాగలను. అప్పుడు నీ దగ్గరకు వస్తాను.

చిన్ననాటి స్నేహితురాలు:

అలాగయితే సరే, నేను వెళ్ళి వస్తాను.

(ఆమె తన స్నేహితురాలిని తన తెర వెనుకనున్న తలుపు వరకు సాగనంపుతుంది. ఆమె అక్కడే ఉన్న వ్రాసుకునే మేజా బల్ల వద్దకు తిరిగి వచ్చి, అక్కడ కొన్ని కాగితాలు, పుస్తకాలు, వ్రాతకు ఉపయోగించే వస్తువులను సర్ది పెడుతుంది. తరువాత ఆమె కొన్ని పూలను పూలజాడీలో పెట్టి బల్ల మీద ఉంచి, అన్నీ సరిగా ఉన్నాయో

లేవోనని అటూ ఇటూ అన్ని వైపులా చూస్తుంది. ఆ సమయంలో తలుపు తాళం తీస్తున్న చప్పుడవుతుంది.)

ఆమె:

అదుగో ఆయన వచ్చారు.

(కవి లోపలికి వస్తాడు. ఆమె ఎంతో ప్రేమతో అతనికి ఎదురువెడుతుంది.) నడక బాగా జరిగిందా?

కవి: (పరాకుగా)

ఆ బాగా జరిగింది. (తన తల మీది టోపీని కుర్చీపై ఉంచుతాడు.) నా కవితకు ముగింపు దొరికింది. నేను నడుస్తున్నప్పుడు నా కది తట్టింది. బయట చల్లని గాలిలో నడక అంతఃస్ఫూర్తిని కలిగిస్తుంది. ఇదుగో ఇది బాగుంటుందనుకుంటున్నాను. నేను గెలుపును సూచించే పాటతో ముగిస్తాను. తన చైతన్యంతో పాటుగా తనకు మూలమైనదానిని కనుగొన్న పరిణతి చెందిన మానవుడి విజయాన్ని కీర్తించే పాట. అది ఎంత జ్ఞానంతో సమర్థవంతంగా చేయగలిగినది, ఎంత శక్తితో దానిని సాక్షాత్కరించుకున్నది అందులో ఉంటుంది. అతను భూమి మీద అమృతత్వం సాధించే దిశగా ఎంత ఉల్లాసంతో, వైభవోపేతంగా అనుసంధానించటానికి ముందుకు పయనించినది అందులో వర్ణిస్తాను. అది ఎంతో అందంగా, నిజంగా విశ్వజనీనమైనది, అవునంటావా? ఇప్పటిదాకా అసహ్యంగా, ఓటమి పాలవటానికే అని నిర్ధారించబడిన కళ ఇంక ఎంతమాత్రమూ ఆ విధంగానే ఉండనక్కర లేదు.... ఈ రోజు ఎంత సుదినం. కవిత్వం, చిత్రలేఖనం, సంగీతం, సౌందర్యాన్ని మాత్రమే వర్ణిస్తూ, భవిష్యత్తును సాక్షాత్కరించుకునేందుకు దారి చూపిస్తూ, అసత్యం, దుఃఖం, అసహ్యం, మృత్యువు లేని కొత్త ప్రపంచంలోకి అడుగిడే రోజు ఎంత ఆనందమయమైన రోజు.... కాని ఇంకా ఇప్పుడు మనిషికి ఎంత దుఃఖం, ఎంత బాధ, ఎంత ఆందోళన, భరించలేని ఏకాంతత.... అది ఎంత దుర్భరం! ప్రతి వ్యక్తి తాను కావాలన్నా, ఒద్దన్నా ఏమయినా కాని తాను మోయవలసిన బరువు ఒకటుంది.

(అతను దీర్ఘాలోచనతో నిలబడతాడు)

ఆమె: (అతని వద్దకు ప్రేమతో వెళ్ళి అతని భుజం మీద చేయి వేస్తుంది.)

రా, వచ్చి పని మొదలుపెట్టు, దుఃఖానికి సరైన మందేమిటో నీకు తెలుసు. నీ అంతఃస్ఫురణకు నిన్ను ఏకాంతంగా వదిలివేస్తున్నాను. నేను నా స్నేహితురాలికి

ఈ మధ్యాహ్నం ఆమెతో గడుపుతానని, మన జీవితాలకు మార్గదర్శనం చేసే అద్భుతమైన బోధనలను ఆమెకు వివరించి చెప్తానని మాట ఇచ్చాను. బహుశా మేమిరువురం సంపూర్ణంగా సమగ్ర సత్యంతో కూడిన కొన్ని పేజీలను కలిసి చదువు తాము. వాటి మీద ధ్యానం చేయడం మా కిద్దకరికీ ఎంతో ఆనందాన్ని కలుగజేస్తుంది. అది చాలామంది మగవారి భావాలను తలకిందులు చేస్తుంది, అవునంటావా? వారంతా ఆడవారు బట్టల గురించి మాట్లాడటం తప్ప మరేమీ చేయలేరు అని నిర్ధారించు కున్నారు. మొత్తం మీద వాళ్ళు అనుకున్నదానిలో తప్పేమీ లేదు. చాలామంది ఆడవారు అత్యంత అల్పత్వంతో నిష్ప్రయోజకులుగా లేదా కనీసం ఆ విధంగానైనా కనపడతారు. ఎందువల్లనంటే, తరచు బాహ్యంలోని ఈ అల్పత్వం ఒక బరువైన హృదయాన్ని కనపడనీయదు, ఒక అసంతృప్త జీవితాన్ని మరుగుపరుస్తుంది. ఎంత దయనీయస్థితి! నాకు చాలామంది తెలుసు, నిజంగా వారిని చూసి జాలిపడాలి.

కవి:

నీవు చెప్పింది సత్యం. స్త్రీలు దయకు అర్హులే. తుఫానులో ఒడ్డు దొరకక చిక్కుకు పోయిన నావ లాగా ఆడవాళ్ళందరకూ, చాలా మటుకూ వారికి అవసరమైన రక్షణ కరువయింది. అదంతా వారు వారికి రక్షణ కల్పించే విద్యాబోధన నందుకోక పోవటం మూలంగానే.

ఆమె:

అది నిజమే. దానికి తోడుగా చాలా శక్తివంతులైన ఆడవారిలో కూడా అనురాగం, రక్షణ అనేవాటి ప్రగాఢమైన అవసరం ఉంది. ఎలాగంటే, సర్వశక్తివంతమైన బలిమి ఆమె మీదకు ఒంగి, మాధుర్యంతో అనునయిస్తూ, తనను చుట్టివేయాలనుకుంటుంది. ప్రేమలో ఆమె దాని కోసం చూస్తుంది. అది పొందిన అదృష్టవంతురాలైతే, ఆమె జీవితంలో ఆత్మస్థైర్యాన్ని నింపి, కొత్త ఆశలు చిగురింపజేస్తుంది. అంతే కాకుండా ఆమెకు జీవితం బీడుపడిన ఎడారిలాగా హృదయాన్ని రగిలిస్తూ, వణికిస్తూ ఉంటుంది.

కవి:

ఇవన్నీ ఎంత బాగా చెపుతున్నావు! ఎంతో ప్రగాఢమైన అనుభవజ్ఞురాలిలాగా మాట్లాడుతున్నావు. నా తదుపరి పుస్తకరచనకు దీనిని గుర్తుపెట్టుకుని వ్రాసుకుంటాను, ఇది స్త్రీల విద్యకు సంబంధించినది. సరే నేను నా పని మొదలుపెడతాను.

ఆమె:
సరే, నేను వెళ్ళి వస్తాను, నీ పని పూర్తి చేసుకో.

(ఆమె ఒక పుస్తకాన్ని తీసుకుని, బయటకు వెడుతుంది.)

కవి: *(తన మేజాబల్ల వద్ద కూర్చుని, తన పనికై అన్నీ తయారుగా అమర్చి ఉండడాన్ని చూస్తుంటాడు.)*
ఎప్పుడూ అదే విధమైన అనురాగపూరిత స్నేహతత్పరత. ఆమె నా మీద చూపించే శ్రద్ధలోను, మాధుర్యంలోను ఏమాత్రం లోటు చేయదు. ఆమె వంక చూస్తే ఒక జ్యోతిని చూస్తున్నట్లుగా ఉంటుంది, ఆమె మేధస్సు, వాత్సల్యం, ఆమె చుట్టూ ఎంతో కాంతితో ప్రకాశిస్తూ తన వద్దనున్న వారందిరి మీదా విస్తరిస్తుంటుంది. ఉదాత్తమైన సుదూర భావతీరాలకు వారిని మార్గదర్శనం చేస్తుంది. నేను ఆమె అభిమానిని, ఆమె మీద నాకు అపారమైన గౌరవం ఉంది.... కాని అదంతా ప్రేమ కాదు,... ప్రేమ! అది ఎటువంటి కల! అది ఎప్పటికయినా నిజమయేనా?
(ఒక శ్రావ్యమైన పాట, ఒక అద్భుతమైన గొంతులో వినబడుతుంది. కని ఒక్కసారిగా గంతేసి, తెరచివున్న కిటికీ చెంతకు వెడతాడు.)
ఎంత అద్భుతమైన గొంతు. *(అతను నిశ్శబ్దంగా, ఆ పాటను, ఆ మాధుర్యం అయిపోయేదాకా వింటాడు. అది అయిపోయిన వెంటనే, ఒక నిట్టూర్పుతో, అతను తన మేజాబల్ల వద్దకు తిరిగి రాబోతుండగా, తలుపు కొట్టిన చప్పుడవుతుంది.)*
ఎవరండీ, ఎవరక్కడ?

(అతను తలుపు తెరుస్తాడు, చిత్రకారుడు లోనికి వస్తాడు.)

కవి:
నీవా! స్నేహితుడా! ఏమిటి గాలి ఇటు మళ్ళింది?
చిత్రకారుడు:
నీకు చెప్పవలసిన విషయం ఒకటుంది. నీ భార్యను కలిసాను. ఆమె నీవు నీ 'దేవాలయం' లో ఉన్నావని చెప్పింది. అందుకని వచ్చాను.
కవి:
చాలా మంచి పని చేసావు.... సరే, నీవు అన్న 'దేవాలయం' లోకి వచ్చి మాట్లాడు. నన్ను చాలా సేపు సందిగ్ధంలో ఉంచకు. అది చిత్రకళ గురించేనా?

చిత్రకారుడు:

దాని గురించి కాదు, నా చిత్రలేఖనం బాగానే జరుగుతున్నది. దాని గురించి మరొక రోజు చెపుతాను. ఇప్పటి విషయం సంగీతం. (కవి కుతూహలం చూపిస్తాడు) నిన్న సాయంత్రం, స్నేహితులను చూడటానికి వెళ్ళినప్పుడు, నేను ఒక అద్భుత గాత్రాన్ని ఆలకించాను. నాకు తెలిసిందేమంటే, ఆమె మీ పొరుగునే ఉంటుందని. (కవి చాలా ఆశ్చర్యాన్ని, కుతూహలాన్ని ప్రదర్శిస్తాడు.) నీ కామె తెలుసునా?

కవి:

తెలియదు, కాని నేను తరచు ఆమె పాడుతుండగా ఇక్కడ నుంచి వింటుంటాను. ఆమెది గొప్ప గాత్రం. అది నా లోని తంత్రులన్నింటినీ మీటుతుంది. మొదటిసారి నా చెవులను తాకినప్పుడు అది ఎక్కడో విన్నట్లు, ప్రాచీన కాలం నుంచి వచ్చిన ధ్వని కెరటంలా అనిపించింది. గత ఆరు నెలలుగా నేను ఈ గొంతును వింటున్నాను, అది ఒక రకంగా నా పనికి ఉల్లాసాన్నిస్తూ తోడుగా ఉంటున్నది. ఆ మాధుర్యమైన గొంతు కలిగినవారిని కలవాలని ఎన్ని మారులో అనుకున్నాను.

చిత్రకారుడు:

ఎంత అద్భుతమైన కాకతాళీయం! నిన్న సాయంత్రం నాకు ఆమె పరిచయం అయింది. చాలా ఆకర్షణీయంగా ఉంది. మేమిద్దరం కలసి చాలాసేపు మాట్లాడుకు న్నాము. ఆ మాటలలో ఆమె నీ కవిత్వాన్ని ఎంతో ప్రశంసించింది. ఎంతో ఉత్సా హంగా నీ కవిత్వాన్ని చదువుతుందట. ఇంకా ఏం చెప్పిందంటే, తను ఒంటరిదానినని, తన కెవరూ లేరని అందువల్ల తనకు కావలసినది తానే సమకూర్చుకోవలసి ఉంటుందని, ఒక్కొక్కప్పుడు అది చాలా కష్టం అవుతున్నదని అంటూ ఇంకా చాలా చెప్పింది. ఆమె ఒక బృంద-గాయని కావాలని కలలు కంటున్నది. నేను వెనువెంటనే నిన్ను గుర్తు చేసుకున్నాను. నీకు చాలామంది తెలుసు కదా, అందరికీ నీవు చేసే సహాయం గురించి తెలుసును. అందుకని, నీ దగ్గరకు నా అంతట నేనే పనిగట్టుకుని వచ్చాను. ఆమె గురించి నీతో మాట్లాడుదామని, నీవేమైనా ఆమెను ప్రముఖ సంగీత విద్వాం సులకు కాని లేక సంగీతం సమకూర్చేవారితో కాని పరిచయం చేయగలుగుతావని వచ్చాను.

కవి:

నీవు సరైన పనే చేశావు. ఆమెకు ఏదయినా సహాయం చేయడం నాకు ఎంతో

సంతోషాన్నిస్తుంది. సరే, మీరిద్దరూ ఆ విషయంగా ఏమి నిర్ణయించారు?
చిత్రకారుడు:
ఈ విధంగా అనుకున్నాము. నీవు ఒప్పుకుంటే నేను వెంటనే ఆమెను తీసుకుని వస్తాను. ఆమె ఎంతో దూరంలో లేదు. నేను వెంటబెట్టుకుని వస్తాను. మీ కిద్దరికీ పరిచయం అవుతుంది.
కవి:
చాలా బాగుంది. సరే వెళ్ళి తీసుకురా. నిరీక్షిస్తుంటాను.

(చిత్రకారుడు బయటకు వెడతాడు)

కవి:
(ముందుకు వెనుకకు అసహనంగా పెద్ద పెద్ద అంగలతో నడుస్తూ) ఎంత ఆశ్చర్యం, ఎంత ఆశ్చర్యం.... యాదృచ్ఛికం అంటూ ఏదీ లేదు, అన్నీ మన వశంలో లేని అంతుబట్టని కారణాల ఫలితంగా జరుగుతాయి. ఎంత ఆకర్షణశక్తి — ఎవరికి తెలుసు? ఆమె గాత్రంలాగ ఆమె కూడా అందంగా ఉంటుందా? అది తెలుసుకోవాలని ఎంతో ఆతృతగా ఉంది. అదుగో వాళ్లు రానే వచ్చారు.

(దగ్గరకు వేసి ఉన్న తలుపు, బయటనుంచి నెట్టి తెరవబడుతుంది.)

అబ్బ! ఎంత నాజూకుగా ఉంది! *(దివ్యదృష్టి కలిగిన కన్య లోపలికి నవ్వుతూ వస్తుంది, వెనుక చిత్రకారుడు కూడా వస్తాడు.)*
చిత్రకారుడు:
అమ్మాయి, ఇదుగో ఇతను నా స్నేహితుడు, నీవు అభిమానించే ప్రముఖ కవి.
కవి:
అమ్మాయీ, నిన్ను కలుసుకోవడం నాకెంతో సంతోషంగా ఉంది, నీ అద్భుతమైన గాత్రాన్ని ఎంతగా అభిమానిస్తానో చెప్పలేను, నీవు ఎంతో కళాత్మకంగా పాడతావు.
దివ్యదృష్టి కలిగిన కన్య:
కవిగారూ! మీ దయకు పాత్రురాలినైనందుకు కృతజ్ఞురాలిని. అతి తక్కువ సమయంలో, ముందే చెప్పకుండా, వచ్చినందుకు మీరు నన్ను క్షమించాలి. అయినా మనం ఇరుగుపొరుగువారమే కదా. మీరు పరిచయం కాకముందే నాకు తెలుసు. మీరు తరచు నా పాటను కిటికీ వద్దకు వచ్చి వినేవారు. మీరు చప్పట్లు కొడుతుంటే మొదట్లో నా కది అంత బాగా అనిపించలేదు. నన్ను ఆటపట్టిస్తున్నారనుకున్నాను.

కవి:

ఎంత తప్పుగా అర్థం చేసుకున్నావు? అతి తప్పకుండా ప్రశంసే. నీవు నాకు అందించిన అలౌకిక ఆనందానికి నేనే నీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

చిత్రకారుడు:

నా కర్తవ్యం నేను నిర్వర్తించాను. ఇక నేను సెలవు తీసుకుంటాను. నాకు ఒక చిత్రాలు కొనే వ్యాపారిని కలుసుకోవలసిన నిర్దేశిత సమయం అయింది. వాడొక నీచుడు! వాడు నన్ను అసందర్భంగా పిచ్చిబొమ్మలు వేయమంటాడు, దానికి ఏమంటాడంటే, వాటినే అందరూ ప్రస్తుతం ఇష్టపడుతున్నారని, నేనేమో దానిని అడ్డుకుంటున్నాను.

కవి:

నిజమే, అడ్డుకో, ఏం చెప్పినా వినకు. గట్టిగా అడ్డుకో. ఈ రోజుల్లోని ఆధునిక పోకడలు అధోగతిపాలయి దిగజారిపోతున్నాయి. వాటిని ప్రోత్సహించవద్దు. ఇప్పుడు ప్రస్తుతం, మన తోటివారందరిలో మానవ సృజనాత్మకత లన్నింటా ఈ రకమైన అసత్యం చైతన్యంలోకి పాకి ఇంకిపోతున్నది.

చిత్రకారుడు:

స్నేహితుడా, చాలా బాగా చెప్పావు. సరే, నీవు కూర్చి దట్టించిన ధైర్యంతో సత్యం కోసం యుద్ధానికై వెడుతున్నాను. సెలవు.

కవి, దివ్యదృష్టి కలిగిన కన్య:

వెళ్లిరా, సెలవు.

కవి:

మధురగాయనీ, కూర్చో.

దివ్యదృష్టి కలిగిన కన్య:

(కూర్చుంటూ) అయితే, మీరు నన్ను కొంతమందికి పరిచయం చేయబోతున్నారా? నేను నా పాటను అందరికీ వినిపించబోతున్నానా?

కవి:

తప్పకుండా, మనకు తెలిసి గొప్పగా సంగీతం సమకూర్చేవారిలో నా స్నేహితుడొకరున్నారు, నీకున్న కౌశలానికి అన్ని తలుపులు నీకు స్వాగతం పలుకుతాయి.

దివ్యదృష్టి కలిగిన కన్య:
అది నాకు ఎంతో మేలు చేస్తుంది, మీకు నా కృతజ్ఞతలు.
కవి:
ఎంత మాట, నాకు కృతజ్ఞతలు చెప్పవద్దు. (అతను కన్య ప్రక్కన కూర్చుంటూ) నాకు నీవు ఒసగిన ఆనందాన్ని నీవు తెలుసుకుంటే,... ప్రతి రోజూ నా పనికి నీ కర్ణ పేయమైన గానం సామరస్యతాపూర్వకంగా తోడై ఆనందదాయకమౌతున్న సంగతి నీకు తెలిస్తే, నీకు నేను చాలా సుఖం, ఆనందం పొందిన ఘడియలను ఋణపడి ఉన్నాను. అవును, నేనే నీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి.
దివ్యదృష్టి కలిగిన కన్య:
ఇదంతా చెప్పటం మీ గొప్పతనాన్ని చూపిస్తున్నది.

(*ఆమె తన చుట్టూ చూసి, తిరిగి కవి వైపు నవ్వుతూ తిరుగుతుంది.*)

ఎంత ఆశ్చర్యం. ఇక్కడ ప్రతిదీ నాకు ఎంతో పరిచయమున్నవాటిలా ఉన్నాయి. బహుశా అది అన్నీ వస్తువులను ఆవహించి ఉండే గాలి, వాతావరణాన్ని మించిందేమీ కాదు. నా ధైర్యానికి మీరు క్షమించాలి. నాకు నా ఇంట్లో ఉన్న అనుభూతి, నేను ఇక్కడికి తరచు వస్తున్న అనుభూతిని పొందుతున్నాను. నాకు ఇప్పుడు అన్ని విధాల ఎన్నో అద్భుత విషయాలు జరుగుతాయనే అనుభూతి కలుగుతున్నది.
కవి:
దానికి మొదట సంతోషించేవాడిని నేనే.
దివ్యదృష్టి కలిగిన కన్య:
మీకు నేను ఆశ్చర్యాని కలిగించే ఓ వింత సంఘటనను చెప్పాలి. నేను, నా తల్లి చనిపోయిన తరువాత, ఆరునెలల క్రితం నా జీవనానికి కొంత సంపాదన దొరుకుతుం దనే విశ్వాసంతో, ఈ నగరంలో స్థిరనివాసం ఏర్పరచుకోవడానికి వచ్చినప్పుడు, ఎన్నో ఇళ్ళను చూసాను, వాటిలో కొన్ని వసతిగా ఉన్నవి, మరి కొన్ని వసతులు సరిగాలేనివీ. ఇప్పుడు అద్దెకుంటున్న ఇల్లు మిగతావాటికంటె అంత బ్రహ్మాండంగా ఏమీ లేదు. ఈ ఇంట్లో నేను సంతోషంగా ఉండగలనని, నాకు ఇక్కడ ఎన్నో మంచి సంగతులు జరగబోతున్నాయనే ఒక విధమైన అంతఃస్ఫురణతో ఇక్కడ ఉండటానికి నిశ్చయించుకున్నాను. ఇది చాలా ఆశ్చర్యం కలిగించే విషయం కాదా!

కవి:

(ఆలోచిస్తూ) అవును, చాలా ఆశ్చర్యంగా ఉంది.... (పక్కకు తిరిగి, స్వగతం బయటకు) ఇష్టపడటమంటే ఇదేనా? ఎవరికి తెలుసు? (దివ్యదృష్టి కలిగిన కన్య వైపు తిరిగి) నీకు తెలుసా, ఈ విషయం కూడా నీకు ఆశ్చర్యం కలిగిస్తుంది. నేను ప్రతి రోజు నీ గొంతును వింటున్నప్పటి నుంచి, మరింత ప్రశాంతతను, ఎక్కువ సంతృప్తిని పొందుతున్నాను. దానితో నీవెవరో తెలుసుకోవాలనే మక్కువైన కోరిక నాలో మిక్కుటమయింది.

దివ్యదృష్టి కలిగిన కన్య:

మిమ్ములను నేను ఒక గ్రంధకర్తగా మాత్రమే ఎరిగి ఉన్నాను. మీలోని పాండిత్యాన్ని ఎంతో అభిమానించాను. మిమ్ములను నేను ఒక రోజు కలవగలననే విశ్వాసం ఏమాత్రం లేదు. జీవితంలో కొన్ని అసాధారణమైన, మార్మికమైన విషయాలున్నాయి.... మార్మికం ఎందువల్లనంటే వాటికి కారణాలు మనకు తెలియవు; లేకపోతే అన్నీ స్వల్ప విషయాలై, సహజంగానే ఉంటాయి. చూడండి, ఇప్పుడు నాకు ఈ క్షణంలో ఎంతో ప్రశాంతత, చాలా బాగా ఉన్న అనుభూతిని పొందుతున్నాను. అది నాకు కొండంత బలాన్నిస్తుంది. నా కెంత బలం, ఉత్తేజం అవసరమౌతుందో మీకు తెలియాలి. ఒంటరిగా, స్వతంత్రంగా తన కాళ్ళ మీద తాను నిలబడి సంపాదించుకుని జీవించవలసివచ్చిన, నిస్సహాయి అయిన, రక్షణ కరువైన అనాధకు తన సంఘర్షణలో తనకు సహకారం అందించేవారెవరూ తెలియని ఆమె జీవితం ఎంత దుర్భరం. కాని ఇప్పుడు నేను మిమ్ములను కలిశాను కాబట్టి నా కష్టాలన్ని తొలగిపోతాయనే అనుకుంటున్నాను.

కవి:

హామీ ఇస్తున్నాను. ఇక హాయిగా, భద్రంగా ఉండు. నా శక్తి కొలది సహాయం చేస్తాను. ఇది నాకు విధాయకం. ఒక కళాకారునికి, నీ లాంటి స్త్రీకి ఉపయోగపడగలగటం చాల ఎక్కువ ఆనందం కలిగించే విషయం.

దివ్యదృష్టి కలిగిన కన్య:

(తటాలున అతడి చేతిని తీసుకుంటూ) కృతజ్ఞతలు. మనం ఈ విధంగానే ఎప్పుడూ పక్కపక్కన కలసి కూర్చుంటున్నామనే అనుభూతి కలుగుతున్నది. మనం స్నేహి

తులం. చాలా పురాతన కాలం నుంచే స్నేహితులం.... మనం స్నేహితులం. కాదంటారా?

కవి:

(గంభీరంగా) అవును. మన స్నేహం హృదయపు లోతుల నుంచి వచ్చినది.

దివ్యదృష్టి కలిగిన కన్య:

నేను ఇక్కడ ఎంతో హాయిగా ఉన్నాను. సంప్రదాయాలన్నింటిని మరచిపోతున్నాను. ఇప్పుడు నా అమర్యాదకు పరాకాష్ఠ అన్నట్లుగా, నన్ను భరించనలవికాని నిద్ర ఆవహిస్తున్నది. చాలా రోజులుగా నేను మా ఇంట్లో మంచి నిద్ర పోవడం లేదు. నాకు హాని తలపెట్టే అదృశ్యశక్తుల గూఢచర్యల వలన నేను అసౌకర్యానికి గురవుతున్నాను. కావలసిన విశ్రాంతిని, ప్రశాంతతను నేను పొందలేకపోతున్నాను. కాని ఇక్కడ నాకు ఏదో ఒక విధమైన ఆదరణతో కూడిన వెచ్చదనం, ధైర్యం లాంటి ఒక వస్త్రాం నన్ను చుట్టుముట్టి కప్పివేస్తున్న అనుభూతితో, నాకు మెల్లమెల్లగా నిద్ర ముంచుకు వస్తున్నది.

కవి:

(ఆమె వంక వాత్సల్యంతో చూస్తూ) ఈ మెత్తల మీద పడుకో. ఏ ఆలోచనలూ దగ్గరకు రానీయకుండా, ప్రశాంతంగా ఉండు. అంతకు మించి ఆచారాలు, సాంప్ర దాయాలను గురించి ఆలోచనలను ఏ క్షణాన కూడా లోనికి రానీయవద్దు. అవి మనిషి తాను దీనావస్థలో పడిపోవటానికి తనకు తాను కాళ్ళకు తగిలించుకున్న ఏ మాత్రం విలువలేని సంకెళ్ళ లాంటివి.

దివ్యదృష్టి కలిగిన కన్య:

నాకు నిద్ర ఎంతో అవసరం. నన్ను పట్టుకుని వదలకుండా తలనొప్పి చాలా బాధపెడుతు న్నది. ఒక ఫలితం పొందడం కోసం నేను చాలా కష్టపడి పని చేసాను. దాని వల్ల విపరీతంగా అలసిపోయాను.

కవి:

నీవు ఒప్పుకుంటే.... నేను నీకు తేలికగా స్వాంతనం కలిగించాలనుకుంటున్నాను. *(అతను తన చేతిని ఆమె తల మీద చాలాసార్లు అటూ ఇటూ ఒత్తి, ఒక క్షణం ఆపి ఆమె తల మీద ఉంచుతాడు. మెత్తల మీద పడుకున్న దివ్యదృష్టి కలిగిన కన్య ఎంతో ఆనందాన్ని, హాయిని ప్రకటిస్తూ గాఢనిద్రలోకి జారుకుంటుంది.)*

దివ్యదృష్టి కలిగిన కన్య:
(మగత నిద్రలో) ఇప్పుడు చాలా బాగుంది, నొప్పి పోయింది.... నాకెంతో సంతోషంగా ఉంది.
కవి:
(ఆమె హాయిగా పడుకోవటానికై మెత్తలను అమర్చుతూ; ఆమె పక్కనే కూర్చుని, ఆమె చేతిని తన చేతిలోనికి తీసుకుని, స్వగతంగా) పాపం పిచ్చిపిల్ల. ఎంత నాజూకు. కాని ఎంత ఏకాకితనం.
దివ్యదృష్టి కలిగిన కన్య:
(నిద్రలోనే మాట్లాడుతుంది) అబ్బ! ఎంత అందంగా ఉంది!
కవి:
(మృదువుగా) ఏమిటది, అంత అందంగా ఉంది?
దివ్యదృష్టి కలిగిన కన్య: (నిద్రలోనే)
మీ చుట్టూ ఒక ఊదా కాంతి — అది నిజంగా యదార్థమైన పద్మరాగమణి ప్రకాశంలా ఉంది. అది నా చుట్టూ కూడా ఉంది. అది నాకు బలాన్నిస్తున్నది. అది రక్షణను.... అవును. నిశ్చయంగా రక్షణ నిస్తుంది.... నాకు హాని తలపెట్టేదేదీ నా వద్దకు రాలేదు. (పారవశ్యంతో) మీ చుట్టూ ఆ ఊదా కాంతి ఎంత అందంగా ఉంది!
కవి:
నీ కిప్పుడు హాయిగా ఉంది కాబట్టి, ఇప్పుడిక ప్రశాంతంగా నిద్రపో. ఏమీ చూడవద్దు.
దివ్యదృష్టి కలిగిన కన్య: (చాలా దూరం నుంచి మాట్లాడుతున్నట్లుగా)
నేను గాఢనిద్రలోకి పోతున్నాను, గాఢనిద్రలోకి పోతున్నాను. ఎంత ప్రశాంతత, ఎంత హాయి.
కవి: (ఆమె వంక వాత్సల్యంగా చూస్తూ)
హాయిగా నిద్రపో అమ్మాయీ, — బాధలను నయం చేసే నిద్ర. నీ జీవితం కష్టాల కడలి. నీకు విశ్రాంతి ఎంతో అవసరం. (కొంత నిశ్శబ్దం తరువాత) నన్ను నేను మోసం చేసుకొనవలసిన అవసరం ఏముంది? నేను ఒప్పుకుని తీరాలి. ఆమె గొంతు నా శరీరాన్నంతా పులకింపచేసినట్లుగా, ఆమె సమక్షంలో ఉంటే నేను ప్రశాంతతతో, అపారమైన ఆనందంతో పొంగిపోతున్నాను. ఇప్పుడు ఆమె నా రక్షణలో గాఢనిద్రపోతున్నది. మొదటిసారిగా, తెలిసి, ఆమె నిద్రపోతున్నది. ఆమె

నా మీద ఉంచిన నమ్మకమే నాలో బాధ్యతను ఉంచుతున్నది. ఆ బాధ్యత నా కెంతో ప్రీతకరమైనది. కాని నా భార్య! ఆమె ఎంతో ధృఢమైనది, ధైర్యం కలది. నాకు ఆమెపై ఒక స్నేహితురాలు లాంటి అనుభూతే ఉంది కాని మరేమీ లేదనే సంగతి చాలా కాలం క్రితమే ఆమెకు అనుభవైకవేద్యం. ఆమె దానితో సంతృప్తి చందలేకపోతున్నది. ఆమెలోని లోతైన ప్రేమ అనాదరణీయంగా అలాగే ఉండిపోయింది. అయినప్పటికి ఆమె విషయంలో కూడా నాకు బాధ్యతలున్నాయి. ఇంకొకరి మీద నా అస్తిత్వం అంతా లగ్నం అయిందని ఎలా చెప్పగలను? అయినా, నా అనుభూతులను నేను దాచలేను. కేవలం అసత్యమే హానికరమైనది. అదలా ఉంచితే, దాని గురించి ఆలోచించటం నిష్ప్రయోజనం. అటువంటి స్త్రీ మోసగించబడలేదు. హతవిధీ! జీవితం మరీ ఎంత క్రూరమైనది!

దివ్యదృష్టి కలిగిన కన్య: (ఇంకా నిద్రలోనే పక్కకు తిరిగి, అతని మీద చెయ్యి వేసి)

నేను సంతోషంగా ఉన్నాను.... సంతోషంగా....

(ఆమె ఒక్కసారిగా ఒక చిన్నపిల్ల భద్రతను పొందుతున్నట్లుగా కవి ఒడిలో తల పెట్టి పడుకుంటుంది.)

కవి:

ప్రియమైన అమ్మాయీ! నేను ఏం చేయగలను?

(అతను ఆమె వంక రెప్పవాల్చకుండా చూస్తూ, ఆలోచనామగ్నుడవుతాడు. దివ్యదృష్టి కలిగిన కన్య ఆవులిస్తూ, ఒళ్ళు విరుచుకుని, మేల్కొంటుంది.)

దివ్యదృష్టి కలిగిన కన్య: (కొంత ఆశ్చర్యంగా తన చుట్టూ చూసి)

నేను నిద్రపోయాను. ఎంత బాగా నిద్రపోయాను. నేను ఇంత బాగా జీవితంలో ఎప్పుడూ నిద్రపోలేదు.

కవి:

నేనెంతో సంతోషిస్తున్నాను.

దివ్యదృష్టి కలిగిన కన్య: (అతని వంక ప్రేమతో చూస్తూ)

మీకు తెలుసా, మిమ్ములను చుట్టినదీ, నన్ను కూడా కప్పివేసిన ఆ కాంతి ఒకేసారి పుష్టిని, రక్షణను ఇచ్చింది. అది ఎంతో అందంగా ఉంది, ఎంతో స్వాంతన నిచ్చింది. ఇప్పటికీ, మేల్కొని ఉన్నా కూడా అది నా చుట్టూ ఉన్న అనుభూతిని నేను పొందగలుగుతున్నాను.

కవి:

అవునా, అది ఇప్పటికీ నీ చుట్టూ ఉన్నదన్న మాట. ఈ విధంగా రంగుల కాంతులు చూడటం నీకు మొదటిసారా?

దివ్యదృష్టి కలిగిన కన్య:

నేను కాంతులు లేదా రంగుల పొగమంచును కొంతమంది చుట్టూ చూసిన గుర్తు ఉన్నది. ఇప్పుడు మీ చుట్టూ చూసినంత అందంగా నెనెక్కడా చూడలేదు, లేక, ఇంత సమీపంగా చూసిన అనుభూతీ లేదు. తరచుగా, ఇతరుల చుట్టూ, బురదలాగా, కలుషితమైన పొగమంచులాగా కనపడుతుంది. అది ఏమిటి?

కవి:

దానికి సరైన సమాధానం ఇవ్వాలంటే చాలా పెద్దదే అవుతుంది. అయినప్పటికీ నాకు సాధ్యమైనంత వరకు క్లుప్తంగా చెప్పటానికి ప్రయత్నిస్తాను. నిన్ను విసిగిస్తే నన్ను ఆపటానికి వెనుకాడవద్దు. పలువిధాలైన స్థితులతో మన అస్తిత్వం కూడుకుని ఉన్నది. వాటిని భూమి, నీరు, గాలి, అగ్ని అనే వాటితో పోల్చవచ్చును. అర్థం అవుతున్నదా?

దివ్యదృష్టి కలిగిన కన్య:

తెలుస్తున్నది. ఇది చాలా ఆసక్తిదాయకంగా ఉంది.

కవి:

నీరు ఆవిరయి సూక్ష్మరంధ్రాలు కలిగి ఉన్న గొట్టం ద్వారా పాత్రలోకి ప్రవేశించినట్లే, తక్కువ మందస్థితి లోనిది ఎక్కువ మందం కలదాని ద్వారా చొచ్చుకుని ప్రవహిస్తుంది. దానివల్ల ఏ విధమైన పదార్థనష్టమూ ఉండదు. అదే విధంగా, మనలో ఎక్కువ సూక్ష్మ మైనది మన శరీరం చుట్టూ ఒక పొర లేక ఆవరణలాగా తయారవుతుంది. ఆ సూక్ష్మ ఆవరణను మనం 'ఆరా' (aura) అని అంటాము.

దివ్యదృష్టి కలిగిన కన్య:

చాలా స్పష్టంగా అర్థం అయింది. ఈ విధంగా ఆరాలను చూడటం ఉపయోగకర మేమో?

కవి:

సరిగా చెప్పావు. అది చాలా ఉపయోగకరం. ఆరా మనలో ఏముందో, మన అను భూతుల, మన ఆలోచనల కచ్చితమైన ప్రతిబింబంగా, తేలికగా అర్థం చేసుకోవచ్చు.

మన ఆలోచనలు, అనుభూతులు ప్రశాంతంగా, సామరస్యంలో ఉంటే 'ఆరా' కూడా ప్రశాంతంగా సామరస్యంగా ఉంటుంది. మన అనుభూతులు అల్లకల్లోలంగా, అస్థిరంగా ఉంటే 'ఆరా' దానిని అల్లకల్లోలంగా, అస్థిరంగా ఉన్నట్లు స్ఫుటంగా బహిర్గతం చేస్తుంది. అది నీవు చెప్పిన విధంగా కొంతమంది చుట్టూ పొగమంచులాగా కనపడుతుంది.

దివ్యదృష్టి కలిగిన కన్య:

అర్థం అయింది. ఈ 'ఆరా'లు ఎంతో వివరంగా బయటపెట్టి చూపుతాయనే విషయం తెలుస్తున్నది.

కవి:

ఎవరైతే 'ఆరా' ను చూడగలరో, వారిని మోసం చేయడం అసాధ్యం. ఉదాహరణకు, దుష్టబుద్ధికలవాడు ప్రకాశించే దేవతలాగా కనపడటానికి ప్రయత్నం చేసినా అది జరగని పని. అతని 'ఆరా' అతని ఆలోచనలనూ, ఉద్దేశాలనూ దుష్టమైనవిగా బహిర్గతం చేసి చూపిస్తుంది.

దివ్యదృష్టి కలిగిన కన్య: (ప్రశంసాపూర్వకంగా)

పరమాద్భుతం! ఈ జ్ఞానంవల్ల ప్రపంచంలో ఎంత ఉపయోగం ఉన్నది! కాని, ఇంత అందమైన విషయాలు మీరెక్కడ నేర్చుకున్నారు? ఎందువల్లనంటే, చాలామందికి ఈ విషయాలు తెలుసునని నేను అనుకోను.

కవి:

తెలియదు. ఎందువల్లనంటే, ఈ ఆధునిక కాలంలో, మనం ఉన్న ప్రస్తుత పరిస్థితులలో ఏది జయాన్ని, భౌతికసంతృప్తిని ఇస్తుందో దానినే పరమావధిగా భావిస్తున్నారు. అయినప్పటికీ అసంతృప్తికీ లోనయినవారి సంఖ్య ఎక్కువెక్కువవుతూ, వారు ఈ జీవిత ఉద్దేశం, ధ్యేయం ఏమిటనేదానిని తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. మరొక పక్క, తెలిసినవారు, దుఃఖిత మానవజాతికి సహాయం చేయటానికి నడుంకట్టిన వారున్నారు. తరతరాలుగా ఒకరి నుంచి మరొకరికి అందజేయబడుతూ, మనిషి స్వస్వరూపమేమిటో, అతనేమి చేయగలడో అనే దానిని అతనికి తెలియజేస్తూ, అతని చైతన్యాన్ని తట్టి మేల్కొలిపే ధ్యేయంతో పని చేస్తూ, ఆత్మ-పురోభివృద్ధి అనే విధానానికి ఆధారమవుతున్నటువంటి పరమోత్కృష్ట జ్ఞానానికి వారు సంరక్షకులు.

దివ్యదృష్టి కలిగిన కన్య:
ఈ బోధ ఎంత బాగుంది! నాకు దీనిని కొద్ది కొద్దిగా వివరించి చెప్తారు కదా! ఏమంటారు? ఎందువల్లనంటే, మనం తరచు ఒకరి నొకరు కలుసుకొనబోతున్నాం, అవునంటారా? మనం ఇక ఎప్పుడూ విడిపోగూడదనుకుంటున్నాను.... నేను నిద్ర పోతున్నప్పుడు మీరే సమస్తం అని, నేను ఎప్పటికీ మీ దానినే అనే అనుభూతిని పొందాను. నేనింకా ఏమనుకున్నానంటే ఇక ఇప్పటి నుంచి మీ రక్షణ నా చుట్టూ ఎప్పుడూ అంటిపెట్టుకుని ఉంటుందని. ఎంతో భయంతో, ఎంతో మంది శత్రువుల బారిన పడి బాధపడిన నేను, ఇప్పుడు ప్రశాంతంగా, నిశ్చలంగా, ధైర్యంతో ఉన్నాను. అందువలన దానితో నాకు హాని తలపెట్టేవారితో ఈ విధంగా చెప్పగలను, "మీకు ఇక నేనేం భయపడను, నేను అమోఘమైన రక్షణలో ఉన్నాను, ఆ రక్షణ నన్నెప్పటికీ వమ్ము చేయదు." నేను సరిగానే మాట్లాడుతున్నానంటారా?
కవి:
అవునవును, నీవు మాట్లాడేది సత్యం.
దివ్యదృష్టి కలిగిన కన్య:
చిట్టచివరికి మిమ్ములను కలుసుకున్నందుకు చాలా సంతోషిస్తున్నాను. నేను మీ కోసం చాలా నిరీక్షించాను. మరి మీరు, మీరు సంతోషంగా ఉన్నారా?
కవి:
అవును... ఇప్పుడే ఇంతకు ముందే నీవు అదమరచి గాఢంగా నిద్రపోతున్నప్పుడు నాకు నిశ్చలత, ప్రశాంతత, సంతోషం కలిగాయి; అది ఇంతకు ముందు నేనెప్పుడూ అనుభవించలేదు. (ఆలోచనామగ్నంగా) అవును, ఇది నిజమైన ప్రేమ. అది ఒక శక్తి. కొత్త సంభావ్యతలను సాక్షాత్కరించుకోవటానికి ఈ ఐక్యత దోహదం చేస్తుంది... కాని...
దివ్యదృష్టి కలిగిన కన్య:
అయితే ఏమిటి? మనిద్దరం కలసి ఇంత ఆనందంగా ఉంటే మనలను ఏది అడ్డుకోగలదు?
కవి: (ఒక్కసారిగా నిలబడి)
అయ్యో! నీకు తెలియదా! (అతను ఇంతకు ముందు చాలాసేపటి నుంచి తెర వెనుక నిలబడి ఉన్న, తన భార్య దృష్టిలో పడి ఆగిపోతాడు.) అయ్యో!
(ఆమె నవ్వుతూ చాలా ప్రశాంతంగా ముందుకు వస్తుంది.)

దివ్యదృష్టి కలిగిన కన్య:

మీకు పెళ్ళయిందనే విషయం నాకు తెలియదు!

ఆమె: (దివ్యదృష్టి కలిగిన కన్యతో)

నీవేమీ స్థిమితం కోల్పోవద్దు. (కవివైపు తిరిగి) నీవు కూడా. అవును, నేను మీ సంభాషణను చివరలో ఆలకించాను. నేను ఈ అమ్మాయి మేల్కొంటుండగా వచ్చాను. మిమ్మల్ని కలవరపరచుకుండా వెనుకకు వెళ్ళిపోదామనుకున్నాను. కాని ఏమి ఆలోచించానంటే, నేను వింటే మనందరికీ ఎక్కువ ఉపయోగం అని భావించాను. అందువల్ల నేను వెళ్ళిపోకుండా ఉన్నాను. నేను సరిగానే ఆలోచిస్తున్నాననుకుంటాను. అమ్మాయీ, నాకు తెలుసు, నీవు అతిక్రూరమైన, బాధాకరమైన విషమస్థితిలో పడిపోతున్నావు. నీ ముక్కు సూటి వ్యవహారం, నీ విశ్వాసపాత్రత నాకు తెలుసు. నీవు రెండు వ్యతిరేకదారుల మధ్య ఎంత బాధాకరంగా దిశానిర్దేశంలేక ఉన్నావనే సంగతి నాకు తెలుసును. బోధనలో చెప్పబడినదాని లోనిదే మనకు సత్యమనే సంగతి నీకు తెలుసును. ప్రేమ మాత్రమే ఐక్యతకు న్యాయబద్ధమైన బంధం. ప్రేమ లేకపోవటమనేదే చాలు ఐక్యతను ఎందుకూ కొరగానిదిగా చేయడానికి. నిజమే ప్రేమ లేకుండా కొన్ని అనుబంధాలున్నాయి. గౌరవం, పరస్పరం ఒప్పుకోలు ఆధారంగా దానిని కొంతమేర సహించవచ్చును, కాని నేనేమనుకుంటున్నానంటే ఒకసారి ప్రేమ కలిగితే, ప్రతిదీ దానికి దారి నొసగాలి. ఓ స్నేహితుడా! మన మధ్యనున్న ఒప్పందం నీకు గుర్తు ఉందా? మనిద్దరిలో ఎవరిలోనైనా ప్రేమ మేల్కొన్న క్షణాన ఇద్దరం ఒకరికొకరు స్వేచ్ఛను కలిగి ఉంటామని ప్రమాణం చేసుకున్నాము కదా! అందువల్ల నేను మీ మాటలు విన్నాను. ఇప్పుడు నేను మీకు ఏమి చెప్పటానికి వచ్చానంటే మీరు స్వతంత్రులు, సంతోషంగా ఉండండి.

కవి: (ఎంతో కదలిపోయి)

మరి నీవు, నీ సంగతి? నీవు చైతన్యం పరాకాష్ఠలో, పరిశుద్ధమైన, నిర్మలమైన కాంతిలో నివసిస్తుంటావని నాకు తెలుసు. కాని ఒంటరితనం ఒక్కొక్కప్పుడు చాలా దుర్భరం. కాలం కదలక విసుగు పుట్టిస్తూ, బాధాకరం అవుతుంది.

ఆమె:

ఓ, నేను ఒంటరిగా ఉండను. ఎవరి ద్వారా అయితే మనం మన దారిని కనుగొన్నామో, ఎవరికైతే సనాతనజ్ఞానం ఉందో, ఎవరైతే సుదూరాల నుంచి ఇప్పటిదాకా మన

అడుగులకు మార్గదర్శనం చేశారో, నేను వెళ్ళి వారితో కలుస్తాను. తప్పకుండా వారు నాకు ఆశ్రయం ఇస్తారు. (ఆమె దివ్యదృష్టి కలిగిన కన్య వైపు తిరిగి, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని) రా, స్థిమితం కోల్పోవద్దు, స్త్రీలలో సున్నిత మనస్కులైనవారికి, చిత్తశుద్ధి కలిగినవారికి, రక్షణ నందించి, జీవితంలో మార్గదర్శనం చేసే వ్యక్తిని స్వేచ్ఛగా ఎంచుకునే హక్కు ఉంది. నీవు సహజమైన న్యాయంతో ప్రవర్తించావు, అంతా సవ్యంగా జరుగుతుంది. విషయాలను మేము చూసే విధానం, మా ప్రవర్తన నీకు ఆశ్చర్యం కలిగించవచ్చు. అవి నీకు కొత్తవి. దానికి కారణాలు నీకు తెలియదు. (కవివంక చూస్తూ) వీటన్నింటిని ఇతను నీకు తెలియజేస్తాడు. నేను వెళ్ళిపోతున్నాను, కాని వెళ్ళేముందు నేను మీ ఇద్దరి చేతులు కలుపుతాను (ఆమె దివ్యదృష్టి కలిగిన కన్య చేతిని కవి చేతిలో పెడుతుంది) ఏ ఆశీస్సులూ, ప్రేమ ఆశీస్సులకు సరికావు. అయినప్పటికీ, నేను నా ఆశీస్సులు ఇస్తాను. అవి మీకు ఎంతో ప్రియమైనవనే విషయం తెలిసిందే. మీరు ఒప్పుకుంటే ఒక సలహాను, అది విన్నపమే అనుకోండి, ఇవ్వాలనుకుంటున్నాను. మీ ఐక్యతను పశువాంఛలు లేదా ఇంద్రియలోలత్వానికి మాత్రం ఒక నెపంగా కాకుండా చూసుకోండి. దానికి బదులుగా, ఒక ఆకాంక్షతో, మీ అస్తిత్వపరిపూర్ణతావృద్ధికై, నిరంతరం పురోగమించడానికై మిమ్ములను మీరు మించిపోయేటందుకై ఒకరికొకరు ఆలంబనగా దీనిని అర్థవంతంగా తీర్చిదిద్దుకోండి. మీ కలయిక ఒకేసారి ఉదాత్తంగాను, ఉదారంగాను, ఉదాత్తత గుణసముదాయంలోను, ఉదారత చేసే పనిలోను ఉండాలని కోరుకుంటున్నాను. ప్రపంచానికి ఒక ఉదాహరణగా, మానవజీవితపు నిజమైన లక్ష్యాన్ని ఆదరించే మంచి మనసున్న మనుషులందరికీ చూపించండి.

దివ్యదృష్టి కలిగిన కన్య: (ఎంతగానో కదలిపోయి)

నీవు మా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా మాకు చేతనయినంత మేము చేస్తామని, నీ గౌరవమర్యాదలకు యోగ్యులమయే విధంగా మేము ఉంటామని హామీ ఇస్తున్నాము. కాని నీ నోటి నుంచి ఒక మాట వినాలనుకుంటున్నాను, అది నేను మీ ఇంటికి రావడం, దాని మూలంగా జరిగిన సంఘటన నీకు సరిదిద్దుకోలేనంత దురదృష్టం తీసుకువచ్చిందా అని.

ఆమె:

ఏ భయమూ వద్దు. కేవలం ఒక ప్రేమ మాత్రమే నా అస్తిత్వాన్ని సంతృప్తిపరచగలదనే


విషయం ఇప్పుడు నాకు కచ్చితంగా తెలుస్తున్నది. అది దైవం కొరకైన ప్రేమ, దివ్యప్రేమ. ఎందువల్లనంటే అది మాత్రమే ఎప్పటికీ అంతరించదు. పరమాత్మ సాక్షాత్కారం సాధ్యం చేసుకోవటానికి అవసరమైన సహాయాన్ని, ప్రపంచాన్ని పూర్ణ సామరస్యంతో, ప్రకాశంతో, శాంతి, సౌందర్యాలకు ఆలవాలం చేయటానికీ, పరివర్తనతో శరీరాన్ని దివ్యత్వంగా మార్పుచేయటానికీ అనుకూలమైన పరిస్థితులను బహుశా ఒక రోజు కనుగొంటాను.

(దివ్యదృష్టి కలిగిన కన్య, ఎక్కువెక్కువగా మరింత బరువైన హృదయంతో కదలిపోయి, నిశ్శబ్దంగా ఉండి, ప్రార్థనలో నమస్కారం చేస్తున్నవిధంగా రెండు చేతులు జోడించి నిలబడి ఉంటుంది. కవి గౌరవపురస్కారంగా ఆమె వద్దకు వెళ్ళి మునిగాళ్ళ మీద వంగి, తెర పడుతుండగా ఆమె చేతిని తీసుకుని తన నుదురును ఆమె చేతిమీద ఉంచుతాడు.)

మూలం: శ్రీమాత

తెలుగుసేత: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఆధ్యాత్మిక జీవితాన్వేషణకి పరమాత్మని కనుగొనడం మాత్రమే ప్రథమ కర్తవ్యం. అదొక్కటే అత్యంతావశ్యక మయిన విషయం. అది తప్ప మిగిలినవన్నీ వ్యర్థమే. దైవాన్ని ఒకసారి కనుగొన్నాక, ఆయన అభివ్యక్తీకరణం అంటే – ముందు వ్యక్తితన పరిమిత చైతన్యం నుండి, దివ్యచైతన్యం లోకి పరిణామం చెందడం, అనంతమైన శాంతి, దివ్యకాంతి, దివ్యప్రేమ, దివ్యశక్తి దివ్యానందంలో జీవించడం పర్యవసానంగా అందుకు తగిన పాత్ర, వాహిక, ఉపకరణం కావటం – ఇదీ.



SRI AUROBINDO

సుందర భవితవ్యం

అంతా మారుతుంది, ఈ యాంత్రిక ప్రపంచాన్ని
తలక్రిందులు చేసే ఇంద్రజాల సువ్యవస్థ అలరారుతుంది.
ఈ మానవలోకంలో మహనీయ అతిమానవవ జాతి పరిఢవిల్లుతుంది.
ప్రకృతి జ్యోతిర్నివహ శిఖరాలలో, పరమాత్మ
భూమికపై జీవనసామ్రాజ్య చక్రవర్తిగా
దివ్యమానవుడు అభిషిక్తుడవుతాడు
ఈ భువనాన్ని స్వర్గధామంగా మారుస్తాడు.
మనిషి అజ్ఞాన హృదయాన్ని, దైవం వైపు,
సత్యమహత్వం వైపు సముద్ధరిస్తాడు.
మనిషి మర్త్యత్వాన్ని దివ్యత్వ దిశగా నడిపిస్తాడు.
పరిమిత సరిహద్దుల నుండి ఒక మహాశక్తి విముక్త మవుతుంది.
మృత్యుదేవత కరాళ హస్తాలకు అందని ఔన్నత్యాలపై మర్త్యత్వం తేజరిల్లుతుంది.
సమున్నత జీవన శిఖరాలు అమృతత్వపు మహాలోచనలతో ప్రదీపిస్తాయి.
జీవన పునాదులలోని చీకట్లను భగవత్ రోచిర్నివహం మటుమాయం చేస్తుంది.
పరిణమించే కాలప్రస్థానంలో సృష్టి సర్వస్వం
ఒకే దివ్యప్రణాళికగా విరాజిల్లుతుంది.
ఒక దివ్యసామరస్యం భువన నియతిగా మారుతుంది.
సౌందర్యం, ఆనందం జీవన సంవిధానాన్ని పునర్నిర్మిస్తాయి.
పార్థివ శరీరం సైతం భగవంతుడ్ని స్మరిస్తుంది.
మర్త్యత్వం నుండి ప్రకృతి ఉపసంహరించుకుంటుంది.
పరమాత్మ అగ్ని శిఖలు తమోమయ జగత్తును నడుపుతాయి.
ఆకాంక్షించే ఆలోచనాతీరాలను ఒక మహావిజ్ఞానం తాకుతుంది.
మహాసత్యం, భగవంతుడు మరింత చేరువ కాక తప్పదు.
అతిమనస్సు ఈ లోకంలో భగవత్ కాంతిని ప్రసరింప చేస్తుంది.
సమాకర్షిత హృదయం భగవత్ ప్రణయ సుధారస పారవశ్యం చెందుతుంది.
ప్రకృతి మహోన్నత శీర్షంపై కాంతి కిరీటం మెరుస్తుంది.

ప్రకృతి సుస్థిర భూమికలో కాంతి సామ్రాజ్యం భాసిస్తుంది.
భూమిని మించిన ఒక మహనీయ సత్యం భూమిని ఆవహిస్తుంది.
మానవ రహదారులపై తన సూర్యరశ్మిని విరజిమ్ముతుంది.
ఒక అప్రతిహత చిచ్ఛక్తి ఆలోచనను నడుపుతుంది.
భవిష్యత్తులోకి వీక్షించే ఒక అనంతశక్తి మానవ జీవితాన్ని శాసిస్తుంది.
మానవహృదయాలలో అమృతత్వ అగ్నిజ్వాల రగులుతుంది.
నిశ్చేతనా మందిరంలో ఒక ఆత్మ మేలుకుంటుంది.
మనస్సు భగవత్ దర్శన దేవాలయ మవుతుంది.
శరీరం అంతస్ఫూర్తి ప్రజ్వలిత ఉపకరణం అవుతుంది.
జీవితం భగవంతుని దృశ్యమాన శక్తి స్రవంతిగా మారుతుంది.
ఈ భువనమంతా భగవంతుని అభివ్యక్త మంత్ర ధామంగా వెలిగిపోతుంది.
మనస్సులోని అజ్ఞానం, జీవన శరీరాలు ఇంక ఎంత మాత్రం ఆ వెలుగును దాచలేవు.
ఒక పరిపూర్ణత్వపు తేజోహస్తం ప్రతిసంఘటనను, ప్రతి చర్యను తీర్చిదిద్దుతుంది.
ప్రకృతి నేత్రాల గుండా పరమాత్మ నేత్రాలు వీక్షిస్తాయి.
పరమాత్మశక్తి ప్రకృతి శక్తిని ఆవరిస్తుంది.
ప్రపంచం భగవానుని దృశ్యమాన బృందావనం అవుతుంది.

మూలం: శ్రీఅరవిందుల 'సావిత్రి' నుండి
అనువాదం: కె. యజ్ఞన్న

స్వేచ్ఛ బాహ్యపరిస్థితులలో నుంచి రాదు. అంతరంగ విముక్తి నుంచి అది సమకూడుతుంది. నీ అంతరాత్మను తెలుసుకో. దానితో సమైక్యమవు. అది నీ జీవితాన్ని నిర్దేశించనీ. అప్పుడు నీవు స్వతంత్రుడవు అవుతావు.

లౌకిక జీవితాలను కలిసి గడపాలి. లౌకిక ప్రయోజనాలపై ఆసక్తులు ఒకటిగ నుండాలి. కష్టాలను, సాఫల్యాలను, ఓటమి, విజయాలను కలసి పంచుకోవాలి. వివాహానికి అసలు పునాది అదే కాని, అంతమాత్రమే సరిపోదని మీకు తెలిసిన విషయమే.

అనుభూతుల్లో సామ్యత ఉండాలి. అభిరుచులు ఒకే రకమైనవిగ ఉండాలి. వేడుకలు, వినోదాల పట్ల మక్కువ సమానంగా ఉండాలి. ఒకే రకమైన విషయాల పట్ల ఒకే విధంగ స్పందించాలి. ఒకరి గురించి ఒకరు, ఒకరి ద్వారా ఒకరు అన్నట్లు — అది మంచిది, అది అవసరం. కాని అంతమాత్రమే సరిపోదు.

జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, ఎలాంటి బాధాకరమైన, చికాకుగొలిపే, నిరాశ కలిగించే సంఘటనలు ఎదురైనా తట్టుకోగలగాలి. మనోభావాల్లో మార్పు రాకూడదు. పరస్పర అనురాగం, ఆత్మీయత చెదరకూడదు. సర్వకాల సర్వావస్థలలో సంతోషంగా నుండాలి. జతగా ఉండాలి. ఏ పరిస్థితిలోనైన ఒకరిలో ఒకరు మనశ్శాంతిని, సంతోషాన్ని పొందగలగాలి. అది చాలా మంచిది. కాని అంత మాత్రమే సరి పోదు.

మనసులు కలవాలి. ఆలోచనలను మేళవించాలి. వాటిలో అన్యోన్యత చోటు చేసుకోవాలి. మేధోపరమైన ప్రవృత్తులను, అనుభవాలను కలసి పంచుకోవాలి; క్లుప్తంగా, మానసిక భూమికలను సమానంగా విస్తృతపరచి, సుసంపన్నం గావించి ఏకోన్ముఖం చేయాలి. అది మంచిది. అత్యంత ఆవశ్యకమైనది. కాని అంత మాత్రమే సరిపోదు.

వీటన్నిటిని మించి జీవియొక్క అంతరంగపు లోతుల్లోను, కేంద్రంలోను మరియు శీర్షము పైన, పుట్టుకతోను, చదువుసంస్కారాలతోను, దేశకాల పరిస్థితులతోను సంబంధములేని అస్తిత్వానికి సంబంధించిన పరమ సత్యం (Supreme Truth) ఒక నిత్య సత్య జ్యోతి విరాజిల్లుతుంటుంది. అదే మన ఆధ్యాత్మిక అభ్యున్నతికి మూలము, కారణము, యజమాని కూడ. మన జీవితాలకు ఒక శాశ్వత దిశానిర్దేశం చేసేది అదే, మన భవితవ్యాన్ని నిర్దేశించేది కూడ అదే; ఆకాంక్షలోను, అభ్యున్నతి దిశగ ఎదుగుట లోను, ఆధ్యాత్మిక మార్గంలో ఇద్దరు కలిసి అడుగులు వేయుటలోనే ఉంది, ఆజన్మాంతం కొనసాగే జీవితబంధం యొక్క రహస్యం.

*

'Z' అనే వ్యక్తికి అతని కుమార్తె, తాను బొంబాయికి చెందిన ఒక వ్యక్తిని వివాహమాడబోతున్నానని తెలియపరచింది. 'Z' కు ఆ వ్యక్తిని గురించి ఏమీ తెలియదు. ఆ అమ్మాయి, ఆమె తల్లి , 'Z' కు తెలియకుండ అత నికి బొంబాయిలో ఒక ఇంటిని ఏర్పాటుచేయాలని రు. 18,000/- పంపించారు. 'Z' ఈ వ్యవహారమంతా విషాదాంతమౌతుందేమోననే అనుమానంతో దానిని తప్పించమని శ్రీమాతను ప్రార్థించాడు.

అమ్మ స్పందన:

ప్రతి ఒక్కరికి, ఆడగాని, మగగాని వారి జీవితం గురించి నిర్ణయించుకునే స్వేచ్ఛ వారి కుండాలి.

*

మధురమాతా,

వివాహము యొక్క పరమార్థమేమిటి?

దానికి 'పరమార్థము' అంటూ ఏమీ లేదు. అది మానవజాతి మనుగడ కలకాలం కొనసాగటానికై పాటించే ఒక సామాజిక ఆచారం.

*

ప్రియమాతా,

లేదు, నేనా పనులన్నీ చేయలేను. మీరెందుకలా అనుకున్నారు? ప్రత్యేక కారణమేమైనా ఉన్నదా? ఒక్క విషయం చెప్పగలరా! — ఇప్పుడు మీరు ఎందుకని నా కింత దూరమయ్యారు?

ప్రియమైన బిడ్డా,

నీవనుకునే 'పనులు' ఏమిటో నాకు ఏ మాత్రము తెలియదు. నేను నీకు చెప్పిందల్లా, నీ కళానైపుణ్యం పెంచుకోటానికి వేరొక చోట ఉండేకన్నా ఇక్కడే నీకు బాగుంటుందని. దీనికి తోడు నీవు వివాహమాడాలని అనుకున్నట్లయితే ఆశ్రమాన్ని వదలవలసి వుంటుందని.

కాని, నీకు తెలుసు, నేనెవరినీ వివాహమాడమని సలహా ఇవ్వనని; అది ఒక ఘోరమైన బంధనం.

నీకు నిజంగా వివాహమాడాలనే కోరిక వుందని నేనెప్పుడూ అనుకోలేదు. కాని

అప్పుడప్పుడు నీవు స్వతంత్రురాలవని, నిర్ణయం తీసుకోవలసింది నీవేనని గుర్తుచేయడం మంచిది; అంతే.

నీవు నాకు దూరంగ ఉన్నావని నేననుకోను; నా వరకు నీ వెల్లప్పుడు నా చేతుల్లోనే ఉన్నావు. అందుకని దూరంగా ఉన్నావని నీ వనుకుంటే అది ఒక అపోహ, సత్యదూరము.

ప్రేమతో
శ్రీమాత

*

నీ పిల్లలను సరైన రీతిలో పెంచలేకపోయావని, అందుకు కారణం, నీవు బాగా చదువుకున్నవాడవు, సంస్కారంగల వాడవయిన కూడ వారికివ్వవలసిన సమయం నీకు లేదని, నీ భార్యకు సమయం ఉన్నా, ఆమె చదువులేనిది, సంస్కారం లేనిది, ఎందుకు పనికిరానిది అంటున్నావు. ఆమె స్థితికి ఎవరు బాధ్యులో చెప్పగలవా? పాతిక సంవత్సరాలు పైగా ఆమె నీతో కలసి జీవించింది. ఈ పాతిక సంవత్సరాలలో ఆమెకు చదువు నేర్పడానికి లేదా నీ 'సంస్కారం' ఆమెకు అబ్బటానికి నీవు చేసింది ఏమిటి? ఆ ఆలోచన కూడ నీకు కలుగలేదు. ఆమె చదువు కోసం రోజు కనీసం ఒక గంటైనా నీవు కేటాయించి ఉన్నట్లయితే, ఈ పాతికేళ్ళలో ఆమెలో గొప్ప మార్పు వచ్చేది. నీకు ఆమె ఉన్నది కేవలం ఒక యంత్రంలా నీకు సుఖజీవనం అందించటానికి, నీకు బిడ్డలను కనడానికి. ఆమెపై నీకు విశ్వాసం కుదరలేదు. ఆమె అభ్యున్నతికై నీవేమీ చేయలేకపోయావు. కాని స్వాతిశయం మూర్తీభవించి, ఆమెకు చదువు లేదని, సంస్కారం లేదని నిందిస్తున్నావు.

ఆమె లోపాలన్నింటికి నేను నిన్నే బాధ్యుడిగా నిలుపుతాను.

*

ప్రాణిక మరియు భౌతిక చైతన్యానికి పురుషుల కన్నా స్త్రీలు అధికంగా బద్ధులై ఉండరు. ఇందుకు వ్యతిరేకంగా, మామూలుగానే వారికి పురుషుల కుండే అహంకార పూరిత మానసిక డాంబికత్వం ఉండదు గనుక వారికి తమచైత్యపురుష సత్తాను కనుగొని దాని ప్రకారం నడచుకొనుట సులభమౌతుంది.

సాధారణంగా, మాటల్లో వ్యక్తపరచగలిగినంత మానసిక చైతన్యం వారికి లేకపోయినా వారి మనోభావాలు మాత్రం చైతన్యవంతంగా ఉంటాయి. వారిలో

ఉత్తములైనవారి చేష్టలు కూడ చైతన్యవంతంగా ఉంటాయి.

*

స్త్రీలు, వారికై వారు, స్వేచ్ఛను పొందలేకపోతే ఏ చట్టం కూడ వారికి స్వేచ్ఛ నీయలేదు. వారిని బానిసలుగ చేసేదేమిటనగా:

1) పురుషని పట్ల, అతని బలం పట్ల, ఆకర్షణ.

2) గృహస్థజీవితం పైన, దాని వలన పొందే భద్రత పైన, ఆసక్తి.

3) మాతృత్వంపై ప్రేమ.

ఈ మూడు బానిసత్వపు లక్షణాల నుండి విముక్తి పొందితే వారు నిజంగా పురుషులతో సమానమౌతారు.

పురుషులకు కూడ మూడు బానిసత్వపు లక్షణాలున్నాయి:

1) స్వాధీనపరచుకునే స్వభావం, ఆధిక్యత, అధికారం పైన ఆశ.

2) స్త్రీలతో లైంగిక సంపర్కముపై కోరిక.

3) వైవాహిక జీవితంలో లభించే అల్ప సంతృప్తులపై మక్కువ.

ఈ బానిసత్వపు లక్షణాల నుండి విముక్తిపొందితే, వారు నిజంగా స్త్రీలతో సమానమవగలరు.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

నీవు బలమైన సచేతనమైన ఇచ్ఛాశక్తి కలిగి ఉండి నీ ఇచ్ఛాశక్తి చైత్యపురుషకేంద్రంగా ఉన్నపుడే నీవు స్వేచ్ఛను చవి చూడగలుగుతావు. లేకపోతే బాహ్యప్రలోభాలకి బానిసవు అయిపోతావు.



అఖిల

అఖిలభారత పత్రిక

మార్చి 2011

ప్రత్యేక సంచిక — పద్యకవితపై శ్రీఅరవిందులు

విషయసూచిక



కవిత్వ వ్యక్తీకరణ — దాని సారము, మూలము

ఏ విధంగా అయితే వేదాంతులకు, భేదనిరూపణను చేయగల ఆలోచనా పటిమ అత్యావశ్యకమైన వరదాయినో, శాస్త్రజ్ఞులకు విశ్లేషణాత్మకపరిశీలన, అసమానమైన సహజ ప్రతిభ అయి ఉంటుందో, అదే విధంగా దర్శనం అనేది కవికి ఉండే విలక్షణమైన శక్తి వైశిష్ట్యత. ప్రాచీనుల ధోరణిలో కవి[1] అంటే దార్శనికుడు, సత్యాన్ని బహిర్గతం చేసేవాడు. కాని మనం ఆ విధమైన ఆలోచనా ధోరణి నుంచి చాలా దూరంగా జరిగిపోయి, వీనుల కింపైనదానిని, ఇంద్రియాలనబ్బురపరిచే సౌందర్యాత్మక కళనే విధిగా అతని నుంచి కోరుకుంటున్నాం; అయినప్పటికి గొప్ప కవిత్వాలన్నీ ఎంతో కొంత స్వతహాగ దానికున్న మహోన్నత లక్ష్యాన్ని, ప్రాధాన్యాన్ని ప్రకృతిసిద్ధంగా వాటిలో పదిలంగా దాచి ఉంచుతూనే ఉన్నాయి. నిజానికి కవిత్వమనేది కళ కనుక, మనలను అది తప్పకుండా చూడగలిగేటట్లు చేయాలి. అది అంతరేంద్రియాల నుద్దేశించింది కాబట్టి, భౌతికంగా చెవి వినికిడికి మార్గమైనా అక్కడ కూడా అది నిజంగా ప్రభావితం చేసేది లోవినికిడినే. దాని లక్ష్యం కవి దేనిని తన పంక్తులలో నిర్దుష్టంగా రూపధారణ చేశాడో దానిని మనం మన లోపల జీవించేటట్లు చేయడానికే. అతను మనలో ఒక అంతర్దృష్టిని జాగృతం చేస్తాడు. అతను దానిని మనలో జాగృతం చేయాడానికి ముందే అతనిలో ఆ అంతర్దృష్టి మిక్కుటంగా తప్పక ఉండి ఉండాలి.

కనుక గొప్ప కవులందరూ విశ్వప్రకృతి, జీవితం, మనుషుల విషయంలో సవిస్తరమైన, శక్తివంతమైన వ్యాఖ్యానంతో అర్థం చెప్పగలిగి, అంతఃస్ఫూర్తిని అందించే దృష్టిని కలిగి ఉండి, దాని నుంచి వెలువడే కవిత్వంతో వాటిని మహోన్నతంగా బహిర్గతం చేసే పలుకులను చెప్పినవారే. హోమర్ , షేక్‌స్పియర్ , డాంటే, వాల్మీకి, కాళిదాసు మిగతా విషయాలలో ఎంతగా వ్యత్యాసం కలిగి ఉన్నా, వారి మహత్వానికి

[1] కవి అనే పదం సంస్కృత శబ్దం. సంస్కృత భాషలో ఎవరైనా పద్యరచన, వచన రచన చేసినవారికి అది వర్తిస్తుంది. కాని వేదకాలంలో అది కవిని దార్శనికుడిగా, సత్యాన్ని చూసేవాడుగా, తాను ఏ దర్శనం వల్లనైతే పదస్ఫూర్తిని పొందాడో సూక్ష్మేంద్రియముల ద్వారా ఆ సత్యవాణిని అందుకున్నవాడుగా వర్ణించింది.

నిదర్శనంగా ఇది వారందరూ కలిగి ఉన్న ప్రథమ లక్షణం. ముఖ్యంగా వారి గొప్పతనం వారికి ఉన్న అధికాధిక ఆలోచనా శక్తిలోను, లేదా అధికతరమైన పుష్కలమైన దృష్టాంతముల రూపకల్పనలోను, లేదా ఎక్కువగా చొచ్చుకొనిపోయే శక్తి కలిగిన గాఢావేశం, మానసిక ఉద్వేగాలలోను లేదు. ఇవన్నీ వారికి ఉండవచ్చును. ఒకరు ఎక్కువగా ఒక దిశలో ఒకదానిని వరంగా పొంది ఉండవచ్చును, మరొకరికి మరొక దిశలో మరొకటి లభించి ఉండవచ్చును, కాని ఈ ఇతర శక్తులన్నీ వారి కవిత్వ వ్యక్తీకరణకు దోహదం చేసే అంగాలే కాని దాని సారం, దాని మూలం కావు. దృష్టి అనేది కవిత్వానికి అత్యావశ్యకమైన వరం. మౌలిక భావప్రపంచపు ఆదర్శవంతుడగు మూలకవిని ఈ విధంగా మనం చెప్పుకోవచ్చును; అతనిలోని ఆత్మ తనలో ఈ ప్రపంచాన్నీ, ఇతర లోకాలనూ, భగవంతుడిని, ప్రకృతిని, జీవులను, మరియు సముదాయాల జీవితాలనూ తన కేంద్రబిందువు నుంచి ఉప్పొంగి ఎగసే సృజనాత్మక లయగా, పద ధ్వనిగా, దర్శనంలో వ్యక్తీకరించబడుతుండే రూపాలుగా అతి సన్నిహితంగా చూస్తుంది. మహాకవులందరూ తమ రచనలలో ఈ ఆదర్శవంతమైన సృజనాత్మక భావనను కొంత మేరైనా పునశ్చరణ గావించినవారే, కవయః సత్యశ్రుతః, కావ్యం యొక్క సత్యాన్ని దర్శించిన ద్రష్టలు, దాని పదశబ్దాన్ని శ్రవణం చేసినవారు.

ప్రస్తుత కాలపు ఆధునిక పోకడలను పరికిస్తే కవిత్వంలో ఆలోచనకే పెద్ద పీట వేస్తున్నట్లుగా అనిపిస్తున్నది. మనం ఇంకా మేధస్సుతోటే తంటాలుపడే కాలంలో నివసిస్తున్నాం. జీవితం మరియు ప్రపంచంతో మమేకమై, ఉద్రేకపూరితమై మానవ మేధస్సు ఇతోధికంగా వృద్ధి చెందుతున్నది. జీవితంతో తలపడి పెనుగులాడి, దానిపై ప్రభుతను సంపాదించటానికి అవసరమైన ఆత్మజ్ఞానానికి ఏమాత్రం తీసిపోనటు వంటి ఇతర శక్తులను తరచు తోసిరాజనటం జరుగుతున్నది. మనం విషాయల మర్మంలోని గుప్తసంకేతాలను మన పరిభాషలో తెలుసుకోవటానికి ఎల్లప్పుడూ ప్రయాసపడుతూ, దానికై ఎన్నో దిక్కులను అన్వేషిస్తుంటాం. లోకాల గూఢలిపిని చదవాలనేది మన ప్రయత్నం. దానిని మేధోసాయంతో విడమరచి అవగతం చేసుకోవాలని అనుకుంటాం, కాని చాలా సమయం మనం మన జీవనంలోను, ఆలోచనలలోను క్షణం తీరిక లేకుండా గడుపుతూ, నిశ్శబ్దానికి, దర్శనానికి ఏమాత్రం విశ్రాంతి లేనివారమవుతున్నాం. ఈ ప్రయత్నంలో మనం కవిని అతని అపారమైన భాషాపాండిత్యప్రకర్షతో మనకు సహాయం చేయాలని కోరుకుంటాం కాని,

చిక్కుముడులతో సందిగ్ధమై, వెతుకులాడే మేధస్సులకు అతని నుంచి అంతగా పరిపూర్ణ సౌందర్యభరిత కవిత్వాన్ని, లేదా విస్తృతర సృజనాత్మకదృష్టిని అందివ్వాలని మనం అడగం.

వేదాంతి, ప్రవక్తల కంటె కవి-ద్రష్ట చూపు భిన్నంగా ఉంటుంది, ఆలోచించే పద్ధతి ఇంకొక విధంగా ఉంటుంది, తాను చెప్పదలచుకున్నది పూర్తిగా మరొక విధంగా ఉంటుంది. ప్రవక్త సత్యాన్ని దైవాజ్ఞగాను, ధర్మంగాను, శాశ్వతుని శాసనంగాను ప్రకటిస్తాడు. అతను సందేశాన్ని అందించేవాడు, కాని కవి సత్యాన్ని దాని సౌందర్యశక్తిలో చూపిస్తాడు. దాని ప్రతీకగా, లేదా, బింబంగా, లేదా, ప్రకృతి కార్యకలాపంగా లేదా, జీవనంలోని కార్యకలాపాలుగా బహిర్గతం చేస్తాడు. అతనా పనిచేయగానే అతను చేయవలసిన మొత్తం పని అయిపోయినట్లే. అంతేకాని అతను దానికి సవిస్తరంగా భాష్యం చెప్పేవాడు కాని, లేదా, సాధికారికంగా సందేశాన్ని అందించేవాడుకాని కాదు. వేదాంతి సత్యాన్ని వివేచన చేసి చూపుతూ, దాని అంగాలను, వివిధ కోణాలను మేధస్సుతో ఒకదానితో మరొకదానికి గల పరస్పర సంబంధాన్ని తెలియచెప్పుతాడు. కవి సత్యాన్ని బలంగా వశం చేసుకుని, సత్యం యొక్క వివిధ కోణాలను అవి ఏ విధంగా జీవనంలో పెనవేసుకుని ఉన్నాయోనని (అది కూడా వేదాంత పరిభాషే అవుతుంది) చెపుతాడు, లేదా, సత్యపు రూపురేఖలను చూస్తూ, దాని దర్శనంతో భావోద్రేకంతో, ఆ సౌందర్యరూపానికి సృష్టి చేస్తాడు.

రోమను కవులు చేసిన పొరపాటును దూరం చేయడానికి ప్రస్తుతకాలంలో మేము మన సౌందర్యాత్మక మానసికానుభూతులను చాలా మటుకు స్పష్టపరిచాము; కాని సూక్ష్మరూపంలో ప్రమాదభూయిష్టంగా మేధోపరమైన ఆక్రమణ ఇంకా కొనసాగుతూనే ఉన్నది. కాని మనకు బోధించే మానసిక ప్రేరణ బలంగా ఉంది. జీవితాన్ని పరిశీలించి, విమర్శించటానికీ మనం మొగ్గు చూపుతాము. ఆవిధాన మనం తెలుసుకోవలసినది ఆర్నాల్డు మహాశయుడు కవిత్వం గురించి సిద్ధాంతీకరించిన 'జీవితం మీద విమర్శ'. అందులో, నష్టనివారణ నుంచి తప్పించే కొన్ని విశేషణాలున్నప్పటికి, విపరీత పరిస్థితులకు దారితీసే దానిని మించినటువంటి రాతలు మరేవీ ఉండబోవు. మన దార్శనికతకు ఏమాత్రం విలువ నివ్వకుండా, దానికి హాని కలిగిస్తూ, కవిత్వం జీవితాన్ని వేదాంతిక ధోరణిలో రూపధారణ చేస్తూ, విమర్శించేదిగా ఉండాలనేది వారి ఉద్దేశం. భావాలను మరొక విధంగా ప్రతీకలతో వర్ణన చేస్తూ,

మేథోపరమైన పన్నుగడలతో నిగూఢభావాలను, నిర్దుష్టరూపాలను తేలికగా కలుపుతుండటం చూస్తుంటే, కావ్యప్రపంచం మీద మరొకసారి ముట్టడిచేసే ఉద్దేశం కనపడుతున్నది. ఇవేకాక, ఇతర మేథోపరమైన వ్యాధి లక్షణాలున్నాయి. వాటికి ఇంచుమించు మనమందరం బలిపశువులమే. కనుక, గట్టిగా నొక్కి చెప్పగలిగినదేమంటే, కవిత్వం సహజశక్తి అది దర్శించగలగడంలో ఉంది; దాని మేథోపరమైన ఆలోచనాప్రక్రియ — సారాంశంలో లేదు, దాని భద్రత సహజతత్వమైన దాని దర్శనానికి అంటిపెట్టుకుని ఉండడమే. దాని భావం, దాని చింతన, దాని ఉద్వేగం, అది వెలువరించే పద్ధతి, దాని సమగ్రరూపం పరిపూర్తి అయ్యేముందు దాని నుంచి తప్పక ఊర్ధ్వదిశగా బయటపడి ఉన్నతస్థితిని పొందాలి, అధవా అందులోనే ఉన్నతస్థితిని పొందాలి. కవిత్వదృష్టి జీవితాన్ని విమర్శించడం కాదు, వేదాంతిక దృక్పథం కాదు, అది ఆత్మదృక్పథం, అంతరేంద్రియం స్వాధీనం చేసుకునేది. మంత్రం కూడా విషయంలోను, లేదా దాని రూపంలోను వేదాంతిక వాస్తవాలకు సంబంధించిన కవిత్వ ఉచ్చారణ కాదు, కాని అది లయబద్ధంగా బయటకు వచ్చేది లేదా ఆత్మదృష్టిలో దేవుడు, ప్రకృతి, తనది, ప్రపంచానిది అయిన అంతరంగ సత్యాలను దాని ఏలుబడిలో ఉండే జనబాహుళ్యం, వారి జీవితరహస్యాలు, వారి అస్తిత్వాలను అంతఃస్ఫురణంగా ప్రదర్శించుకునేటటువంటిది. అవి బాహ్యదృష్టికి మార్మికమైనవి.

జీవనదృక్పథంలో కళ ఏ విధంగా ఉండాలనే ఆలోచనతో దానిని నియంత్రించే ప్రయత్నంలో దానికి ప్రత్యేక లక్షణాలను నిరంతరం ప్రస్తావిస్తూ నిర్ధారించడం జరుగుతున్నది; అంతర్ముఖంగాను, బహిర్ముఖంగాను ఏ విధంగా రూపకల్పన చేయాలనే అవసరాన్ని లేదా వాస్తవికతా చిత్రణావిధానం లేదా, ఆదర్శ దృక్పథం అనేవాటిని ప్రస్తావించే ఈ నియంత్రణ, జ్ఞానవికసనం చేయడానికి బదులుగా ఎక్కువగా తప్పుదారి పట్టించేవే. కచ్చితంగా, ఒక కవి యదార్థ విషయాలను తన కవిత్వంగా మలచటంలో అతిశయించి ఉండవచ్చును, కాని అంతర్లీన విషయాలలో తొట్రుపాటు లేక వాటి విషయాలలో ఎక్కువగా సత్యాన్ని గ్రహించలేకపోవచ్చును. మరొకరు అంతరంగలోకాలలో ఎక్కువ స్వేచ్ఛగా పరిభ్రమిస్తూ, వాస్తవికతా చిత్రణలో పేలవంగా ఉండవచ్చును; ఇద్దరూ ఉన్నతశ్రేణికి చెందినవారు కావచ్చును. కాని మనం విషయాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే కావ్యం సజీవంగా ఉండటానికీ, మనం దర్శించింది మన కళ్ళ ముందు వాస్తవికంగా గోచరమవడానికీ కొంత బహిర్ముఖత్వం

అవసరమనే విషయం తెలుసుకోగలుగుతాం. అదే మరొక విధంగా, పూర్తిగా బాహ్యప్రపంచం మీద ఆధారపడి చేయబడిన కవిత్వం కూడా అంతర్దర్శనంతోను, అంతరంగంలో రూపుదిద్దుకోబడడం లేదా, కనీసం దర్శించినదానికి వ్యక్తిత్వపరంగా అర్థాన్ని విడమరచి చెప్పడంతోను, ఆకృతి పరివర్తనాలతోను ఆరంభమవుతుంది. కవి తనలో నుంచి సృష్టి చేస్తాడు కాని, బాహ్యంలో చూసేదానితో కాదు; బాహ్యంలో చూసింది అంతరంగదృష్టికి భావోద్వేగాన్ని కలిగించి కవిత్వరచనకు పురికొల్పుతుంది. ఆ విధంగా కాకపోతే, అతని రచన యాంత్రికంగా నిర్మాణమై, ఒక దాని పక్కన మరొకటి కూర్చబడినదిగా అవుతుందే కాని, జీవంకల రససృష్టి కాదు.

పూర్తిగా బాహ్యం మీద ఆధారపడిన కవిత్వం మనలను కళాత్మకత నుంచి ఛాయాచిత్రానికి దిగజారుస్తుంది. అంతరంగ దృక్పథాన్ని తగ్గించి, క్రమక్రమంగా కనుమరుగు చేస్తూ నిర్దుష్టమైనదానినే అందించాలనే ప్రయత్నం విజ్ఞానశాస్త్రానికి సరిపోతుంది కాని కవిత్వానికి కాదు. అటువంటి నిర్దుష్టత వలన మనకు అధికతరసత్యం, లేదా, వాస్తవికత అందుబాటులోనికి రాకపోవచ్చు, కాని దానికి వ్యతిరిక్తం మటుకు అయి తీరుతుంది. శాస్త్రజ్ఞానానికి సంబంధించిన విషయరచన, విజ్ఞానశాస్త్ర ప్రపంచంలో అది ఎంతగా ప్రామాణికమైనప్పటికి, ఇంద్రియాలకు, హేతుబద్ధ పరిశీలనకు యదార్థమైనప్పటికి, ఆత్మకు మటుకు అది సత్యదూరం. అది సమగ్ర సత్యం కాదు, లేక అంతటికి సంబంధించిన విషయదృష్టి కాదు. ఎందువల్లనంటే అది వాటి ప్రక్రియలను, యంత్రసామగ్రిని, యాంత్రికమైన ధర్మాలను వివరిస్తుంది కాని, వాటి అంతరంగ జీవితాన్ని, ఆత్మశక్తిని కాదు. ఇటువంటి విచక్షణలలో భద్రత లేదు, పైగా కవికి ఏవిధమైన సూత్రాలను పాటించమని నిర్దేశించలేము. ఎందువల్లనంటే, అతనేమిటో, అతనేమి దర్శించాడో అనేదానిలోనే అతడు తప్పక తన పనిని కొనసాగించవలసి ఉంటుంది. అంతకు మించి అతనిలో జీవించే కావ్యకేంద్రం నుంచి పనిచేయవలసి ఉంటుందేగాని, కృత్రిమ పద్ధతుల నవలంబించి తనకు తాను నిర్వాసితుడవటము కాదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

పాటకు పద్యానికి తేడా

పాట పద్యం లాంటిది కాదు, కానవసరం లేదు. మంచి పాటలు కొన్ని ఉన్నాయి కాని అవి అసలు పద్యాలు కావు. యూరప్‌లో గేయరచయితలుగాని, గొప్ప సంగీత రూపకాల పాటల రచయితలు గాని కవులుగ పరిగణింపబడలేదు. ఆసియాలో పాట తీరును కవిత్వ నాణ్యతతో జోడించే ప్రయత్నము సర్వసాధారణంగా కనిపిస్తుంది. ప్రాచీన గ్రీసు దేశంలో కూడ గేయ కవితారచన తరచుగా సంగీతానుబద్ధంగా సాగింది. అయినప్పటికి పద్యకవిత, గేయరచన ఒకే కోవకు చెందినట్టు కనిపించినా, అవి రెండు వెర్వేరు కళలు. కారణం, వాటి నిర్మాణ లక్ష్యము, లక్షణము ఒకటి కావు. పద్య కవితను అర్థం చేసుకోవాలి, సంగీతాన్ని లేక గానాన్ని అనుభూతి చెందాలి అనుటలో కాదు వీటి మధ్యన తేడా. వ్యత్యాసం ఎక్కడ అంటే, ఒకటి నిర్దిష్టమైన వ్రాతపూర్వక భావన ద్వారా అంతరాత్మను చేరితే, మరొకటి శబ్దరూపంలో హృదయతంత్రులను మీటుతుంది. కేవలం పద్యంలోని మేధోతత్వం, దానిలోని పదాలు, భావము మాత్రమే నీకు అర్థమైనట్లయితే, ఆ పద్యము యొక్క ఔన్నత్యాన్ని అంచనా వేయలేకపోయావన్న మాట. ఏ పద్యమైతే కేవలం పైవాటిని మాత్రమే కలిగి ఉండి, ఇతరమైనదేదీ లేనట్లయితే అది అచ్చమైన పద్యకవిత కాదు. నిజమైన పద్యకవితలో పైవాటిని మించి మరేదో ఒకటి అధికంగా ఉండాలి. అది సంగీతం ఇచ్చే అనుభూతిని కలిగించాలి. అదే దానిలోని విశిష్టమైన ఆవశ్యకమైన లక్షణము. సంగీతానికి వలె పద్యకవితకు కూడ ఒక లయ ఉంటుంది. కాని అది విభిన్నమైన లయ. 'మరేదో ఒకటి' అనుదానిని పదరూపంలో వెల్లడి చేయుటకు ఈ లయ తోడ్పడుతుంది. అది పదాలలో స్వతహాగ ప్రతిబింబించలేదు, లేక పూర్తిస్థాయిలో వెల్లడి కాలేదు. ఆ పదాలనే లయబద్ధంగా కాక వేరొక క్రమంలో వ్రాసినట్లయితే లేక సక్రమమైన లయలో అమర్చకపోతే అవి నిన్ను అసలు కదిలించలేవు, పైగా అదే మాదిరి ప్రభావాన్ని నీపై చూపలేవు. ఈ 'మరేదో ఒకటి' అంతర్గతంగా నిక్షిప్తమై ఉన్న విషయం లేక సూచన, ఒక ఆత్మానుభూతి లేక ఆత్మానుభవం, ఒక జీవితానుభూతి లేక జీవితానుభవం, ఒక మానసిక భావోద్వేగం, దర్శనం లేక అనుభవం (కేవలం భావన కాదు). నీవు దీనిని అందుకుని ఆ అనుభవ

స్పందనను కొంతవరకైన తిరిగి పొందగలిగితే — పూర్తి అనుభవాన్ని కాకపోయినా — ఆ పద్యం ఇవ్వగలిగినదేదో నీవు అందుకున్నట్లుగ భావించాలి, మరో విధంగా కాదు.

పద్యానికి, పాటకు మధ్య నున్న నిజమైన తేడా ఏమిటంటే, పాట స్వరబద్ధతా దృష్టితో వ్రాయబడుతుంది, కాని పద్యం ఛందోబద్ధంగా సంగీత మొలకించే పదధ్వనులు వీనులకు విందు చేసేలా వ్రాయబడతుంది. ఈ రెండింటి లయలు పూర్తిగ భిన్నమైనవి. అందువలన పద్యానికి స్వరం కూర్చుట వీలు కాదు. అది రెండు రకాల లయలను దృష్టిలో ఉంచుకొని వ్రాయబడినప్పుడు లేక స్వరకల్పనకు అనువైన విధంగ దాని పదబంధం కూర్చబడినప్పుడే అది వీలుపడుతుంది. ఇతర రకాల కవితా రచనలకన్న గేయకవిత రచనల్లోనే తరచు ఈ విధంగ జరుగుతుంది. మామూలుగ గీతం యొక్క లక్షణం ఏమిటంటే దాని వస్తుతత్వం సామాన్యమైనదిగ ఉండి, ఒక భావాన్ని లేక అనుభూతిని వెల్లడి చేయుటతో సరిపెట్టుకుని దాని యందు నిక్షిప్తమైన ఉన్న విలువలను మెరుగుపరచుటను సంగీతానికి వదలివేస్తుంది. కాని ఈ పట్టువిడుపు అన్ని సందర్భాలలోను అనుసరించబడదు. కొన్నిసార్లు పదం స్వతహాగ అధిక ప్రాధాన్యతను పొందుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: సిద్ధులగారి త్రివేణి

చైత్యపురుష ప్రేరణ — ఊర్ధ్వ ప్రేరణ

మనోరంజకమైన ఆధ్యాత్మిక పద్యకవితా రచనకు మూలమైన చైత్యపురుష శక్తి ఒకటి ఉన్నది. ఇది రెండు విధాలు. ఒకటి, జీవాత్మ తత్వానికి చెందినది — జీవాత్మకు గల సకల సంభావ్యతల సమాహారము. రెండవది, గతజన్మల వరుస క్రమంలో ఒనగూడిన లేక మన ప్రస్తుత జన్మలో చేపట్టవలసిన కార్యాచరణ నిమిత్తం ముందుంచబడిన ఆత్మశక్తికి ప్రతీక. మామూలుగ చైత్యపురుషసత్త తనకు తానుగ తన మానసిక, ప్రాణిక, శారీరక సాధనాల ద్వారా వ్యక్తపడుతుంది. వాటిపై తన ప్రభావాన్ని వీలైనంత అధిక మోతాదులో ప్రయోగింప ప్రయత్నిస్తుంది, అయినా

సంపూర్ణ సాఫల్యతను సాధించలేదు. అన్నింటికి దూరంగా మెదిలే దాని పరోక్ష వైఖరిని విడనాడి ప్రత్యక్షంగ వ్యవహరించే తీరుకు అలవాటు పడినప్పుడే అది సాధ్యపడుతుంది. అప్పుడే దానికి ఆధ్యాత్మిక అనుభవాలను, అనుభూతులను అన్నింటిని తనకు అనువైన రీతిలో పొందటానికి, తనదైన శైలిలో వ్యక్తపరచడానికి సాధ్యమౌతుంది. ఎందుకనగా, చైత్యపురుషస్థాయి ఊర్ధ్వభూమికల స్థాయికి భిన్నం. దాని విశిష్టత, శక్తి, విశాలత తక్కువ మోతాదులో ఉంటాయి గాని, దాని చిరు మధురిమ, సుకుమార సౌందర్యము అపారమైనవి. ఒక అత్యంత మనోరంజకమైన భావనా పటిమ, ఒక సత్యమైన దివ్యజ్ఞాన సూక్ష్మాలను గురించిన అవగాహన, ఒక సన్నిహిత వ్యవహారశైలి అక్కడ చోటు చేసుకుంటాయి. 'మాధుర్యము', 'ప్రకాశము' అనే వర్ణనా పదబంధం చైత్యపురుష స్వాభావికతకు బీజమనుట సమంజసము. ఆధ్యాత్మికస్థాయిలో ఈ విషయాలకు ఒక విస్తృతమైన ప్రచారము, శోభాయమానమైన ఉజ్వలకాంతి, శక్తియుతమైన అధికారము, బలము, వ్యాప్తి ఒనగూరుతాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

మంత్రము

వేదకాలానికి చెందిన కవులు మంత్రమును ఒక అంతః ప్రేరణతో, ఒక దివ్యావేశంతో దర్శనీయమైనదిగాను, అంతర్దృష్టికి తట్టిన భావన యొక్క రూపకల్పనగాను వర్ణించారు. కాస్త లోతుగ ఆలోచించి ఆధునిక పదజాలంలో నిర్వచించాలంటే అది దైవానికి, ఆత్మకు, మానవునికి, ప్రకృతికి, బ్రహ్మాండానికి, జీవితానికి, వస్తువుకు, ఆలోచనకు, అనుభూతికి, కార్యాచరణకు చెందిన ఒకానొక అంతర్గత సత్యము. ఒక మహోన్నతమైన అంతరాత్మ యొక్క స్వరతాళలయవిన్యాసాల, ఛందోబద్ధ చింతన. ఎందుకనగా కన్నది విన్నది వేర్వేరుగ పరిగణించబడలేవు; అది ఒకే చర్య. ఒక వ్యక్తిలో సజీవంగ వెలుగొందుతున్న సత్యము — మనం అనుకునే సాక్షాత్కారం — ఈ రెంటికి చెందినది, ఈ రెంటిలో దేని నుంచి కూడ విడదీయ వీలుపడనిది. ఇందుకు కారణం అంతరాత్మయందు దాని ఉనికిగాని, మనసు దానికి

స్వాధీనపడుటగాని, దాని కర్తలోనో లేక మానవ మాధ్యమంలోనో అంతర్దృష్టికి కనిపించునది, అంతరాత్మ వినగలిగినది అగు ఒక ప్రదీప్త పదంగా రూపొందే ప్రక్రియ కన్న ముందుగానో లేక ఏకకాలంలోనో చోటు చేసుకోవాలి. మంత్రం హృదయం ద్వారా జన్మనెత్తుతుంది. ఆలోచించగలిగే మనసు దానిని ఆ పరమాత్ముని దివ్యత్వానికి వాహనంగానో, ఆతని వాస్తవికతను ప్రతిబింబించే ముఖారవిందంగానో లేక ఆకృతిగానో మలుస్తుంది. ఆ కవిద్రష్ట యొక్క వాక్కు నిజమైన మంత్రమే అయితే దానిని బాహ్యము నుండి విన్న అర్హులైనవారి మనసుల్లో ఈ మూడు జత కూడాలి; 1) అంతరంగంలో దర్శనమైన సత్యం, వినిపించిన వాక్కు రెండూ జత కూడాలి. 2) మనసు దాని యొక్క అంతఃస్ఫూర్తిని వశపరచుకోవాలి. 3) అంతరాత్మ దానిని ఆకళింపు చేసుకొనుటతో పాటు ఛందోబద్ధమైన ఆ మంత్రవాక్కు యొక్క సందేశము మరియు మనసుకు ఆ పరమ సత్యము యొక్క దర్శనము రెండున్ను ఒకేసారిగాని లేక ఒకదాని తరువాత ఒకటిగగాని చోటు చేసుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

యోగసాధన — కవితా వ్యాసంగం

కవిత్వము, కావ్యరచన యోగసాధనకు మారుగా ఎన్నడూ కానేరవు అనుట సుస్పష్టము. ఈ ప్రక్రియలు కేవలం యోగసాధనకు దోహదము చేయగలవు. సాధకునికి భక్తి, ఆత్మనివేదన వంటి భావము లున్నట్లయితే వాటిని వ్యక్తము చేయుటకు ఉపకరించును. సాధకునకు కల్గిన ఆధ్యాత్మికానుభవములను కవిత్వరీత్యా వెలువరించి వాటిని బలపరచవచ్చు. గీతోపనిషత్తుల అధ్యయనం, సంకీర్తనాదుల వలె ఈ ప్రక్రియలు కూడ ఏదో ఒక దశలో యోగసాధనకు సాయం చేయగలవు. అంతేకాక, బాహ్యచైతన్యానికి అంతరంగంలోని మనస్సుకు గాని లేక ప్రాణికానికి గాని ఒక సంబంధ మేర్పరచే మార్గాన్ని తెరుస్తుంది. ఇంతటితో ఆగిపోతే ప్రయోజనం శూన్యం. యోగసాధన ఒక్కటే ప్రధానమైనదిగా వుండాలి. యోగసాధన అనగా,

మానవ ప్రకృతి ప్రక్షాళణ, అస్తిత్వ పవిత్రీకరణ, చైత్యపురుషసత్తాను, అంతరంగాన్ని, ప్రాణికాన్ని తెరిచి వుంచుట, దైవసాక్షాత్కారము, దైవానుసంధానము, అన్నింటిలోను దైవానుభూతిని పొందుట, ఆత్మార్పణ, దైవభక్తి, మానవ చైతన్యం విశ్వచైతన్యంలో విలీనమగునంతగా విస్తృతపరచుట, పరమాత్మను అందరిలోను అంతటనూ దర్శించుట, మానవ ప్రకృతి యొక్క మానసిక మరియు ఆధ్యాత్మిక పరివర్తన. వీటిని నిరసిస్తూ, కేవలం కావ్యరచనాదులతోను, మానసిక పరివర్తనతోను, సాంఘిక సంబంధాలతోను కాలయాపన చేయటం యోగసాధన కానేరదన్నది కఠోర సత్యము. పద్యరచన ఒక నిజస్ఫూర్తితో సాగాలి. కీర్తిప్రఖ్యాతులను ఆశించో, లేక స్వయంసంతుష్టి కోసమో కాకూడదు. గతంలో మన భారతదేశంలో భక్తి, ఆధ్యాత్మిక చింతనలతో కూడిన పద్యగీతాలను రచించి మన కందించిన మహామహులైన కవులలాగ, దైవానుసంధానాన్ని పొందాలనే ఆకాంక్షను అంతరంగ ఆవేదనను వ్యక్తపరచే మాధ్యమంగా పద్యకవిత రచించబడాలి. పాశ్చాత్య సంగీత కళాకారుల ధోరణిలోనో లేక సాహితీవేత్తల పోకడలనో అనుకరించి రచన కొనసాగినట్లయితే, ప్రయోజనముండదు. ఏ పనిగాని, ధ్యానంగాని, జీవితసర్వస్వాన్ని కూడగట్టి, నిజమైన ఆత్మార్పణాస్ఫూర్తితోను, ఆధ్యాత్మిక ఆకాంక్షతోను నిర్వర్తించితే తప్ప, అవి సఫలీకృతం కానేరవు.

*

ప్రతి కళాకారుడికి, ఏ ఒక్కరికో తప్ప అతని ప్రాణిక శారీరక కోశాలలో జనాదరణ పొందుటకై ప్రాకులాడే తత్వం ఎంతో కొంత ఉంటుంది. అది అతనిలో అభిమాన శ్రోతల కోసం, ప్రజాభినందనల కోసం, ప్రతిష్టల కోసం, స్వాతిశయ సంతృప్తి కోసం, ప్రశంసల కోసం, ఆరాటాన్ని అధికం చేస్తుంది. నీవు ఒక యోగిగా మనగలగాలంటే ఆ తాపత్రయం పూర్తిగా తొలగిపోవాలి. నీ కళను నీ స్వప్రయోజనానికి గాని, ఇతరుల సేవకు గాని, అలాంటి మరేదానికైనా గాని ఉపయోగించకుండా, ఒక్క ఆ భగవంతుని సేవకు మాత్రమే వినియోగించాలి.

*

సాధకుడవైన నీవు, కావ్యరచన, కవిత్వము విరమించ నవసరం లేదని, నేను అనేక పర్యాయములు సూచించాను. వైరాగ్య, తపోభావనలతో ఈ ప్రక్రియలందు నిరాశక్తత చూపుట తప్పు. అప్రయత్నంగానే ఈ ప్రక్రియలు రాలిపోవాలి. సాధకుడు ఒక

మహోన్నత అపురూప యోగస్థితికి చేరుకొన్నప్పుడు, ఇతర వ్యాపకాలు అతని దరికి చేరవు. అయినప్పటికీ కావ్యరచన, చిత్రలేఖనము వంటి ప్రక్రియలకు స్వస్తి పలకాలని నియమమేదీ లేదు. ఇవి కూడా యోగసాధనలో సోపానాలే. అయితే ఈ ప్రక్రియలు సాగుతున్నపుడు స్వాభిజాత్యం కీర్తికాముకత్వం మొదలైన పోకడలకు తావు లేదు.

*

అనంతమైన నిత్యసత్య స్వరూపము యొక్క ప్రాభవము, వైశిష్ట్యములకు అశాశ్వతమైన మానవుల ప్రాపంచిక కీర్తిప్రతిష్ఠలు ఏమాత్రం కూడా కొరగావు. ఎన్నటికీ సాటి రావు. ఇది నిక్కము.

ఈ ఉన్నత యోగస్థితికి చేరువగుటకు రెండు మార్గాలున్నాయి. విరాగియై ఐహిక జీవితము నుండి నిష్క్రమించుట యొకటి కాగా, తాను అహంకారాది వాసనలకు అతీతుడై, సర్వోహంభావయుక్తుడై ఏదో ఒక రోజున తన సహజ ప్రకృతి ననుసరించి తానాచరించిన కర్మలన్నీ నిత్యమైన ఆ అనంతమూర్తి ఆదేశానుసారం జరిగేవే అను చైతన్యం పొందుట రెండవది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: శ్రీశరణ్

పద్యకవితా ప్రయోజనము

దివ్యపదము శక్తిభరితము. మామూలుగ వ్రాయబడిన పదమునకు కూడ శక్తి ఉంటుంది. ఆ పదము ప్రేరణతో వెలువడినదైతే దాని శక్తి ద్విగుణీకృతమౌతుంది. అది ఏ విధమైన శక్తి లేక ఎందుకోసం అనేది ఆ ప్రేరణ యొక్క లక్షణం పైన దానికి మూలమైన విషయం పైన, అస్తిత్వము యొక్క ఏ భాగంపై అది ప్రభావం చూపుతుంది అనేదాని పైన ఆధారపడి ఉంటుంది. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతలాంటి స్మృతుల యందు ప్రవచించబడిన రీతిగ, దివ్యపదము స్వతహాగ ఒక ఆధ్యాత్మిక ప్రచోదనము, ఒక అభ్యున్నతిని, కొన్ని దివ్యానుభూతులను కూడ మనుషులలో ఉదయింపజేసే శక్తిని కలిగి ఉంటుంది.

వేదకాలానికి చెందిన కవులు వారి పద్యకవితలను మంత్రాలుగ పరిగణించారు. అవి వారి స్వీయ అనుభూతులకు వాహికలుగ నుండుటతో పాటు ఇతరులకు కూడ అట్టి అనుభూతులను సిద్ధింపజేసే మాధ్యమం కాగలిగాయి. సహజంగానే ఇవి చాలా మటుక అక్కడక్కడ ప్రకాశించే కాంతుల వంటివే గాని యోగానికి అంతిమ లక్ష్యమగు స్థిరమైన శాశ్వత వాస్తవానుభూతులు కాలేవు. అయినా కూడ అవి కనీసం గమ్యం చేరడానికి వేసే అడుగులుగా గాని, వీధి దీపాలుగా గాని ఉపయోగపడగలవు. ఉపనిషత్తులు లేక భగవద్గీత శ్లోకాలపై చింతన జరిపేవారిలో చాలా మందికి ఇలాంటి వికసనం సమకూరుతుంది. ఆ దివ్యపదాన్ని గాని దాని యందు ప్రజ్వరిల్లే కాంతినిగాని ఇమిడి ఉన్నదేదైనా, అది వాగ్రూపములో నున్నా లేక వ్రాతపూర్వకంగా నున్నా, అంతరంగంలో ఈ అగ్నిని రగిలించగలదు. ఆకాశానికున్నంత విస్తృతిని కలిగించగలదు. దివ్యపదమునే దేహంగ చేసుకున్న ఆ మహత్తరమైనదానిని దర్శింపజేయగలదు. అన్ని కాలాలలోను ఆధ్యాత్మికతను అర్థించేవారందరు వారి ఆకాంక్షలను, అనుభూతులను పద్యకవితా రూపంలోనో లేక ప్రేరణాత్మక పదజాలంలోనో వ్యక్తపరచారు. అది వారికే గాక ఇతరులకు కూడ ప్రయోజనము చేకూర్చింది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

భవిష్యత్ కవిత్వము

ఆత్మలో జీవించుట అంటే క్షణ క్షణం మారుతుండే రూపాల నుండి మారకుండా, నిత్యమై ఉన్నదానిని గుర్తించగలుగుట; ఈ రూపాలలో ఆత్మయొక్క అధిక ప్రాముఖ్యతలను దర్శించుట. ఈ దర్శనం — వర్తమానం యొక్క అన్ని కోణాలను అన్వేషిస్తుంది; విశ్లేషిస్తుంది నిగూఢంగా; దేనివల్ల మనిషి తయారుకాబడుతున్నాడో, దేనిని మనిషి తయారుచేస్తున్నాడో, దాని అనుభూతినిస్తుంది; ఎరుకపరుస్తుంది, దివ్యత్వము యొక్క ముసుగులన్నిటిని ఎదుర్కొంటుంది; అసహ్యాకరమైన, భయంకరమైన,ఆందోళనకరమైన వాటన్నిటిని నిజమానవ జీవితంలో అవగాహనకు

దుర్లభమైన వాటన్నిటిని అది కనుక్కొంటుంది. జీవితంలో గుప్తంగా ఉన్న సౌందర్యాన్ని — ఏదైతే బాహ్యానికి మార్పుచెందకుండా, వ్యక్తమవటానికి పోరాటం చేస్తోందో ఆ సౌందర్యాన్ని ఆధ్యాత్మిక సౌందర్యాన్ని, దానికి సంబంధించిన విషయాలను కవితా సానుభూతితో వెలుపలకుక తీసిచూపుతుంది, ఈ దర్శనం.

కవితాసృష్టిలో ఇది ఒక శ్రమ; ఈ మధ్యకాలంలో ఈ శ్రమ పెరుగుతూ వస్తోంది. ఎక్కువ తరచుగా, ఈ శ్రమ ఇంకా సరిపోని సున్నితమైన అంతర్దృష్టితోను, మితిమీరిన మొరటు నిర్వహణతోను, అపరిపక్వంగా ఉంటోంది. కాని, ఒక మారు ఈ అపరిపక్వతను అధిగమించినప్పుడు, తప్పనిసరిగా అది గొప్ప కవితాధ్యేయాలతో, ఒక విశాలమైన, భద్రమైన స్థానాన్ని పొందుతుంది. కాని, ఇంకా స్వచ్ఛమైన, ఉత్తేజకరమైన దర్శనం మనిషిలోని ఆత్మగమ్యత యొక్క దర్శనం. అదే భవిష్యత్ కవిత్వంలో ఎక్కువ భాగంగా ఉంటుంది.

ఎందుకంటే, మనిషిలోని అధ్యాత్మిక నేత్రం, అతడు ఇప్పుడున్న స్థితిలో, అతని దివ్యత్వాన్ని చూడగల్గడం మాత్రమే గాక, అతని పోరాటంలో, గెలుపులో, ఓటమిలో, ఇంకా అతని పాపంలో, అపరాధంలో, అల్పత్వంలో కూడ దివ్యత్వాన్ని చూడగల్గుతుంది. ఎందుకంటే, మానవునిలో ఆత్మ అతని భవిష్యత్తుకు, గతానికి, వర్తమానానికి కూడ అధిపతి. ఇంకా రాబోయే తరాలకు అతడు సగం మాత్రమే ఆకృతి పొందిన పదార్థం (ప్రతిమ) మాత్రమే కాదు: ఒక విశాలమైన, విస్తృతమైన అర్థంలో, భవిష్యత్తు యొక్క పిలుపు, ఆకర్షణే గతాన్ని, వర్తమానాన్ని తయారుచేస్తాయి. మనిషిలో దైవశీర్షం యొక్క పెరుగుదలలోనే భవిష్యత్ ఎక్కువగా ఏర్పడుతున్నట్లు కన్పిస్తుంది: తన పరిపక్వత కొరకు, ఆలోచించి, సంకల్పించి, శ్రమించే జాతి యొక్క గొప్ప విధివిధానమే, మనిషిలో దైవశీర్షపు పెరుగుదలగా కన్పిస్తుంది.

ఇది ఒక శ్రమ, ఒక గీతం, భవిష్యత్తులో మనం ఎక్కువగా వింటుండే పాట — పెరుగుతూ ఉండే దైవశీర్షపు పాట — జాతి దైవశీర్షపు పాట, మానవ ఐక్యత, ఆధ్యాత్మిక స్వేచ్ఛ కొరకు శ్రమించే దైవశీర్షపు పాట; ఇంకా రాబోయే మనిషియొక్క అతిమానసత్వం, భూమి జీవితంలో వ్యక్తమవడానికి అన్వేషిస్తున్న దివ్యాదర్శపు పాట; వ్యక్తి దైవంగా మారే అవకాశం కొరకు ఎదగమని చెప్పే దైవశీర్షపు పిలుపు యొక్క పాట; ఏ గొప్పదనాన్ని మానవత్వం తనలో ఆత్మశక్తిగా అనుభూతి

చెందుతుందో, ఏ గొప్పదనాన్ని మానవత్వం, ఇంకా ఊహకందని, స్పష్టమైన, పరిపూర్ణమైన రూపంలో జాతికి అందజేయాలని అనుకుంటుందో, ఆ గొప్పదనంలో జీవించమని జాతికి చెప్పే దైవశీర్షపు పిలుపు యొక్క పాట. జీవితాన్ని అందంగా అలంకరించడం కవిత్వానికి, కళకు, మిక్కిలి బాహ్యమైన పని; జీవితాన్ని ఇంకా ఎక్కువ అందంగా, సన్నిహితంగా, గొప్పగా, ఉదారంగా, పూర్తి అర్థవంతంగా చేయడమే వీని ఉన్నతతర కార్యము; కాని కవి ద్రష్ట అయినపుడు, నిత్యమైన మనిషి ఆత్మను, దాని అభివ్యక్త దైవశీర్షాలను, అతడు మనిషికి సాక్షాత్కరింపజేసినపుడు, కవిత్వం నుండి, కళ నుండి ఇంకా మిక్కిలి ఉత్కృష్టమైనది వెలువడ్తుంది.

ఫలితంగా అది ఒక విశాలతర విశ్వదర్శనం; విశ్వంలోను, మనిషిలోను గల దైవశీర్షాన్ని, దాని దివ్యసంభావ్యతలను, అతడిప్పుడున్న స్థితిలో అతని నుండి వ్యక్తమవుతున్న శక్తి గొప్పదనాన్ని, అతడి ఆలోచనలు, అనుభూతులు, అనుభవాలు, చర్యలు వీటన్నిటి యొక్క ఆధ్యాత్మిక పురోన్నతి; ఇంకా అభివృద్ధి చెందిన పురుష బుద్ధి, హృదయం; అతని నైజంలో, ప్రపంచం యొక్క అర్థంలో మరింత సత్యమైన, లోతైన అంతర్దృష్టి; మనిషి జీవిత ధ్యేయం, దాని నిర్మాణశిల్పం, మానవజీవితం, దానికి కావల్సిన దివ్యతర దక్షతలు, ఆధ్యాత్మిక విలువలు, వాటి కొరకు దైవశీర్షపు పిలుపు; నెమ్మదిగా విచ్చుకొంటున్న, ఇప్పుడు ఇంకా స్పష్టంగా తెలియబడ్తున్న విశ్వాత్మ, అది మానవాళికి అందించే భవిష్యత్ దృశ్యం; వీటి అన్నిటి అవగాహన, దర్శనం.

పై అంశాలలో అత్యధిక భాగాన్ని, తమ జీవితంలోను, సంస్కృతిలోను కలుపుకుని, వాటిని ఆచరణలో నిజం చేసే దేశాలే, రాబోయే ఉషస్సులో ఉండే దేశాలు; అలాగే కవులు — వారి భాష, జాతి, ఏది ఏమైనప్పటికి — ఎవరైతే ఈ అంశాలను, ఈ విశాల దృష్టితే దర్శిస్తారో, మాట్లాడుతారో, ఉచ్చరిస్తారో ఉత్తేజంతో, వారే తప్పనిసరిగా సృష్టికర్తలు భవిష్యత్ కవిత్వానికి, కళలకు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

దైవశ్రామికుడు

రజితరాగ మారుతాలలో
నీలి బంగరు మేలికాంతిలో,
నీకై కన్న స్వప్నాలను
వజ్రాల మూటలా మృదువుగా కప్పి వుంచా.

భూనభాలకు వారధిగా
హరివిల్లు నిర్మించాలని వుంది;
నర్తిస్తున్న ఈ గ్రహసీమలో
అనంతత్వ బీజాలు నాటాలని వుంది.

స్వర్గం సుదూరంలో
వీక్షించలేనంత వెలుగులా వుంది;
నిలుపుకునే అవకాశం లేదు,
మూలాలకు పట్టు దొరకటం లేదు.

చిన్మయాన్ని కొనితెచ్చేవాడు
మృణ్మయాన్ని కాదనగలడా?
ఇహలోకపు భారం మోస్తూ
క్లేశాలను దాటాల్సిందే!

దైవాన్ని వత్తిడి చేస్తూ,
అజ్ఞానపు శ్రామికుడిలా
భూమ్మీద ఉన్నా నేను;
జీవ మరణ ద్వారాల మధ్య.

అఖిల భారత పత్రిక

పదార్థపు బురదగుంటలో
లోతెంతో అన్వేషిస్తా;
స్వర్ణనదీ ప్రవాహానికి,
స్వర్గలోకపు వెలుగు బాటకు

పదార్థపు కాళరాత్రిలో
పవిత్రాగ్నిని వెతికా నేను;
కాని కాలుని కోపం నరుని శాపం
చివరకు నీ కందిన బహుమానం.

మనిషి మనసు, పశువు మనసే;
పశుప్రవృత్తి గెలవాలని
పాపతాపాల ప్రీతిగ చూచే,
ఒక భూత మందు దాగున్నది.

దివ్యతేజం 'భూతాలకు' దూరం;
శుద్ధమైన అందాలను కాదని,
సంతోష భయోద్రేకాల
నాటకంలో పాత్రధారివి.

చుట్టూ తిమిరంతో సమరం;
మనం చూచే 'సౌర' గోళాలు
ఈ అస్థిర ప్రపంచానికి
సగం కాంతి మాత్రమే సమకూరుస్తూ వున్నాయి.

ఆశలనే దీపాల వెలుగులో,
అఖాతపు అంచుల దాపున,

పాక్షిక సత్యాలు చూపే
పాంథశాల జీవయాత్ర.

సత్యమైన సత్యాన్ని కాదని, భయంతో
అజ్ఞానపు దైవాలను, అసుర 'శక్తులనూ'
ఆరాధిస్తున్నాము మనం;
వెలుగుల వెలుగును కాదని.

కన్నదంతా కావాలని మళ్ళీ మళ్ళీ కోరాలి,
చనిపోయిన వాళ్ళంతా మరల పుట్టి తీరాలి,
చేసిన యుద్ధాలన్ని మరల మరల చేయాలి,
ఫలమున్నా, లేకున్నా జీవయాత్ర సాగాలి.

నా వంటిన గాయాలు వందలైనా, వేలైనా,
అప్రతిహత యుద్ధవీరు లెంతమంది ఎదురైనా,
అనుకున్నది జరగాలి, ఆగకుండ సాగాలి;
'అతిమానస' ఆనందం అందరకూ అందాలి.

చీదరించుకున్నవారు ఎవరైనా దానవులే;
"నీ భావి ఎండమావి, నీ స్వప్నం పగటికల.
ఆకసాన ఏవిధంగ అగ్నిశిఖను అద్దుతావు,
పతనమైపోతావు, నీ పని పనికిరాని దవుతుంది.

"ఎందుకలా స్వర్గసుఖం పలవరిస్తూ పోతావు
ఆ బంగారు భవనమేది, ఆనందం ఎక్కడుంది?
అజ్ఞానపు చీకటిలో అటూ ఇటూ కొట్టుకునే
మనుగడయే మనకున్న అయోమయపు విధివ్రాత.

"నిశీధిలో మసలుకొనే భూతలమే మనకున్నది,
మిణుగు, మిణుగు దీపాలే మన ముందున్నవి కాదా?
ఆ దివ్యకాంతి నెలా భరియించగలం మనం;
దేవుని ఆకాంక్షనెలా తీర్చగలదు మానవాళి?

"అందులకే ఆ 'దేవుని' హతమారుద్దామా మనం!
ఆ తేజం, ఆ భారం పటాపంచలౌతుంది;
అంతులేని ఆ కాంతి అదృశ్యం అవుతుంది,
మానవ హృదయం ఎంతో తేలికపడిపోతుంది."

కాని మానవహృదిలోనే ఆ దైవం నివశించేది;
ముప్పులతో, తప్పులతో తడబాటుల గమనంతో
అనామకం అని పిలిచే ఆ ఆనందం కోసం
ఎడారిలో, బుడుగుల్లో నిరంతరం పయనించేది.

ఎవరో అంటున్నారు, ఎలిగెత్తి పిలిచారు;
"సాగిపో, సాగిపో ఎవరూ చేరని చోటికి;
గట్టివైన మూలాలకు చిట్టచివర చేరాలి,
బంధించిన కవాటాన్ని తట్టి మనం తెరవాలి."

విషయాల మూలల్లో ఒదిగి ఒదిగి కూర్చున్నది.
నాకు కనపడిందొక నారీముఖ ఆసింగం;
దైవరహస్యాన్నంతా దాస్తూ చూస్తూ వున్నది;
విచ్చుకున్న రెక్కలపై నిద్రాణం అయివున్నది.

మనసులోని ఆటంకా లందులకే వదిలేశా,
తీరని కోరికలనే అఖాతాలు దాటేశా;

శారీరపు దారుల్లో, సందులేని గొందుల్లో,
ఆవలి గట్టున వుండే మార్మిక లోకం చేరా.

మూగదైన భూలోకపు భీతావహ గుండియల
చీకటి లోతుల మ్రోగే ఆ ఘంటిక విన్నాను;
ఆవేదన మూల కారణమేదో కాక
ఆ నరకపు లోగుట్టును సైతం కనుగొన్నాను నేను.

పై నున్నది డ్రాగన్ల ఘోష,
ప్రక్కన 'దయ్యాల' మోత;
ఆలోచన జనియించిన శూన్యంలో పరికించా,
అంతులేని లోతుల్లో అలుపెరుగక నే నడిచా.

ఆశ నిరాశల మధ్యన అందిందొక సోపానం,
అనంతమైన శాంతాన్నే కవచంగా ధరియించి,
ఆ దేవుని సొంతమైన దివ్యకాంతి పుంజాలను
మానవ అగాధంలోనికి మరలించా, కొనితెచ్చా.

నేనైన నా వాడు నాతోనే ఉన్నాడు
కప్పియున్న మాయంతా మటుమాయం అయ్యింది;
ఆ దేవుని సుస్వరాన్ని, ఆతని సంకల్పాన్ని విన్నా
ఆతని ఇచ్ఛను నా నుదుటన దాల్చా.

ఊర్ధ్వ, అధో లోకాలకు నిర్మించా నొక వారధి;
సేంద్రచాప శంపావృత శిఖరంపై
వెల్లివిరిసె స్వర్ణధార;
జగాలెల్ల ప్రకాశించె, ఆ కాంతుల మిలమిలలో

భూలోకపు హృదయంలో వెలిగిందొక దివ్యజ్యోతి;
వెలుగుతాయి ఇక నుంచీ అమరభాను దీప్తిశిఖలు;
జన్మయొక్క అవధుల్లో, ఆ అద్భుత కుహరంలో
రూపొందిన ఆ శక్తులు ఎదురు చూస్తు వుంటాయి.

సత్యం దివ్యానందం దర్శించే దీపాలై
వెలుగును మున్ముందొక స్వర్ణశిఖర సోపానం;
అజ్ఞానపు తిమిరాలను అంతం చేయాలని
దివ్యశిశువు లొస్తారు, దివ్యకాంతి దీధితితో.

వినూత్న కాంతిపుంజాల వెండి వెలుగుల్లో
నవజీవన ద్వారాలకు నగిషీలను చెక్కాలి
పైన కప్పు పసిడి కాంతి, క్రింది నేల తళ తళలు
జగమంతా వెలుగుతుంది, ఆచ్ఛాదన లంతరించి.

నూత్న రజత కాంతులతో
నా స్వప్నం ఫలిస్తుంది.
స్వర్ణ లీల దుస్తులతో
సజీవ సత్యం గమిస్తుంది.

మౌన శిఖరాగ్రాలకు

అంతులేని జలధి దాటి మౌని శిఖర అగ్రాలకు,
వచ్చెనతడు, స్వర్ణమయుడు,
తెచ్చెనతడు వెలుగు దివ్వె,
అతని ఘనత, ఆవేశం మన లోకపు ముక్తి కొరకు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. ఆర్. యల్. నరసింహారావు

పరిణామం (1)

ఒక ధవళ ప్రశాంత శిఖరాన్ని చేరుకున్నాను.
ఒక స్ఫటిక దర్పణంలో వలె — నేను చూశాను
వలయాలుగా నెమ్మదిగా తిరుగుతున్న యుగాల బాటలో
సర్పాకారంలో అధిరోహిస్తున్న ఒక ప్రాచీన మహాశక్తిని
రానున్న దేవతకు ఈ భూమి ఒక బంగరు ఊయల.
పదార్థ సుషుప్తి నుండి, అజ్ఞాన జీవన మరణాల
భారం, చిత్రహింసల నుండి పరమాత్మ తేజస్సు వైపు
కదిలే రహస్య దివ్యత్వపు సగం వెలుగు, సగం చీకటి నిండిన సూచిక మనిషి.
విముక్తమైన మనస్సు అనంత కాంతి మహార్ణవాలలో ప్రయోగించింది.
బాధాగ్నిమయ చీకటిరేఖల నుండి జీవితం బయటపడింది.
పదార్థం తన జన్మకు కారణమైన నిశ్చేతన నిశీధిని కాంతిమయం చేసింది.
ఆత్మ అనంతంలోకి దూకింది.
కాలరహిత భగవధానందావేశంతో
హృదయం అరుణారుణమైంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: యజ్ఞన్న

పరిణామం (2)

భగవంతుని అదృశ్య శాసనంలో ఇంకా అంతా పూర్తి కాలేదు.
జ్ఞానతీరాలు మనసుపైన మరో మనస్సును కాంక్షిస్తున్నాయి.
అలౌకిక సామరస్య మాధుర్య మహాజీవనం
ఇంకా జన్మించని మనుష్యుల కోసం రహస్యంగా ఎదురుచూస్తున్నది.
నిర్జీవ భువనంపై తొలి మొరటు దశలు
మొక్కలు, చెట్ల మానసరహిత చలనాలు
మన ఆలోచనలను తీర్చిదిద్దాయి.

దేవతలాగా జన్మించాలన్న ఆలోచన
మన మర్త్యత్వపు పరిధిని సువిశాలం చేస్తున్నది.
మానవ సంకల్పం, మానవ శక్తి పొందలేని ఒక మహత్వం
చిరంతన సీమలలో సుస్థిరమైన ఒక మహాజ్ఞానం
మన శ్రమకు, బాధకు అతీతమైన ఒక ఆనందం —
మన జీవన భవితవ్యపు మహోజ్వల శిఖరాలు
నిరామయశిల నుండి మనస్సు వరకు అధిరోహించిన నువ్వు —
ఇంకా జయించని అద్భుతావహ ఔన్నత్యాలు
అవిగో, అటు చూడు!

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: యజ్ఞన్న

నీవున్నందున

నువ్వు అఖిల సౌందర్య మనోజ్ఞ మూర్తివి,
అఖిల ఆనందమయుడివి కాబట్టి
నా ఆత్మ కన్నులు లేనిది, నిన్నే కోరింది.
నీకై పరితపించిపోతున్నది.
సృష్టి సర్వత్రా నీ అమృత స్పర్శను అనుభవిస్తున్నది.
ఆ ఆనంద పెనుభారంతో పరవశించిపోతున్నది.
సకల నేత్రాల వెనుక నీ రహస్య వీక్షణం కనుగొన్నాను.
ప్రతి పలుకులోనూ నీ మైమరపు గానం వింటున్నాను.
ప్రకృతి బాటలలో నీ మాధుర్యం నా హృదయాన్ని వేటాడుతున్నది
నీ వల కందని హృదయం వేరెక్కడ స్పందించదు.
సర్వ జీవరాశులలో నీ పార్థివ శరీరాన్ని ప్రేమిస్తున్నాను.
ప్రతి ఆకు, ప్రతి రాయిలో నీ ఆనందం తాండవిస్తున్నది
క్షణాలన్నీ అగ్ని పక్షాలపై నిన్ను మోసుకొస్తున్నాయి
అనంత కళామయ విశ్వదర్శన తీరాలలో నీవే మెరుస్తున్నావు.

నీతో పాటే కాలప్రవాహం ముందుకు సాగిపోతున్నది.
బంగారు భవిష్యత్తులో ఆకాంక్షా దీప్త ఆశాకిరణం నీవే, నీవే,

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: యజ్ఞన్న

ఓహో! మనోహర వదనం

ఆకుపచ్చని కుచ్చుల పట్టు చీరలో
కదలాడిన ఆమె వదనం మనోహరం, సుమనోజ్ఞం –
పచ్చలు మెరిసే తరువులలో,
నీలి నీలి సాగరాలలో,
సూర్యమణి కుండల మొకటి,
చంద్రమణి కుండలం మరొకటి
ఆమె వీనుల క్రింద మెరిసాయి, కదిలాయి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: యజ్ఞన్న

ఆర్. కి జన్మదిన సందర్భమున

ఎన్ని సుమనోజ్ఞ సంవత్సరాలు పునరావృతమయాయో!
ఇదిగో ఇటు మళ్లీ తెచ్చింది నీ జనన మధుమహోదయం!
నీ యౌవ్వన ఉజ్వల శిఖరాన నీ జీవితం
ఉత్తుంగమై ఎగసిన ఓ తరంగం.

మహార్ణవం అట్టడుగున ఎన్నెన్ని అలలో,
క్రిక్కిరిసిన సంద్రంపై ఓ కెరటం.

శ్రుతిలయలతో దూర తీరాల వైపు
తరలిపోయే జీవితం మనది.

కదిలేది, కదిలించేది మహాసాగర శక్తి
అది అజేయం, నిత్యం, స్వేచ్ఛా ప్రదీప్తం
అనివార్యమైన నిర్దేశిత మార్గంలో
పయనమై గమ్యం చేరుతుంది.

ఒక చిరంతన మహాచిచ్ఛక్తి మనల్ని
ఏ లక్ష్యం వైపో నడిపిస్తున్నది.
అదంతా ఆ దివ్యశక్తి సంకల్పం.
దైవం చేతిలో మన చుక్కాని సురక్షితం,
దైవం ఉచ్ఛ్వాస బలంతో, ఔదార్యంతో
కదులుతున్నాయి మన జీవన నౌకల తెరచాపలు

యౌవ్వన సౌందర్య బలావేశాలలో
మహార్ణవ, కాంతితీరాల వైపు కదిలి పో,
విశ్వప్రభువు కారుణ్యం చుట్టు ముట్టగా
విశ్వనావికుని వాక్కులు విశ్వసిస్తూ

ఉప్పొంగే తరంగాలు చూసి భీతిల్లకు, పరవశించు
ప్రళయ భీకర గర్జనలకు, ప్రచండ పవనాలకు
తల్లడిల్లకు — ఆనందించు
మన నావికుడు నౌకను రక్షిస్తూ నడిపిస్తాడు నిర్నిద్రాణమై.

కడలేని కల్లోలిత కడలిలో
ఎగిరే నురగలలో ఆకాశం కనిపించదేమో.

భయమెందుకు,
రేయంబవళ్లు రోచిర్మయ సూర్యుడు నీతో ఉన్నాడు.

వరదలే విజయం సాధించినా, నీట
మునిగినవారు, ఎటు మునుగుతారు?
దైవం హృదయం లోతులలో వారు సుభద్రం.
కొందరికి విజయానంద శుభాలు ఇస్తాడు
మరి కొందరికి విశ్రాంతి ప్రసాదిస్తాడు.

తుఫానులు, జడివానలకు దూరంగా
అదిగో చూడు, మెరిసే దినాలు.
నీ రూపాన్ని తేజోమయం చేసే
ఆనంద భవితవ్య సాక్షాత్కారం వీక్షిస్తున్నా.

విశ్వసించు అతని అనుగ్రహాన్ని
నిరీక్షించు అతని సంకల్పాన్ని

మనల్ని నడిపేది అతనే
అనంత తీరాలు కనుమరుగైనా
సంఘటనలన్నింటిలో అతనినే సందర్శించు
దేని కోసం జన్మించావో
దానిని సఫలీకృతం చేసుకో.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: యజ్ఞన్న

దృశ్యాదృశ్య ఉషస్సులో

దృశ్యా దృశ్య సూర్యోదయంలో
అస్పష్ట మసక సంధ్యా సమయంలో
వెలుగు చేతులెత్తి పిలిచినట్లు
ఆనంద స్వాప్నిక రూపిణివై
నా చెంతకు, మరింత చేరువకు
నువ్వు వస్తున్నావు, వస్తున్నావు!

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

అర్ణవ ఏకత్వం

నా చుట్టూ నిశ్శబ్దం, అవర్ణనీయ విశాలత్వం,
నీలిసముద్రంపై శ్వేత విహంగాలు విహరిస్తున్నాయి
నిశ్శబ్ద స్వర్గసీమ వైపు నీరవ సాగరం
వీక్షిస్తున్నది — ఒక నీలిమ మరో
నీలిమను మౌనంగా పరికిస్తున్నట్లు!

నిశ్శబ్దంతో, అనంతత్వంతో
సాయుజ్యం చెందిన నా ఆత్మ —
కనిపించేదంతా వాస్తవమై మారిపోయేంతవరకు
విశాలమై ఈ విశ్వాన్ని కౌగలించుకుంటున్నది.
— ఒకే ఒక అనంతత్వం, ఏకం సత్ ...

నామరహితుడై, దేహరహితుడై ఎవరో ధ్యాన నిమగ్న మైనాడు.
అనంతుడు, ఏకాంతుడు, మృత్యుంజయుడు, చైతన్యమయుడు —

సుప్రశాంత చిరంతన ఆనంద అమృతరూపమై —
సృష్టి సర్వస్వాన్ని ఎల్లప్పటికీ
తన గుండెకు అదుముకొన్నాడు

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న

అతిసూక్ష్మ అనంతం

నిశ్చల అనంతాల నుండి మనం ఏతెంచాం.
ఈ శతకోటి ప్రపంచాలన్నీ అనంతత్వం
ఆడుకునే చిన్న కాంతి బుడగలు
అనంతంలో క్షణకాలం మెరిసే మెరుపులు

ఆ అనంతంలో దానికి తన ఆత్మ కనిపించ లేదు.
అది ఒక చిన్న అణువు లోకి చేరింది.
భూమిపై మట్టి నుండి విచిత్రంగా మేలుకొన్నది.

అనాలోచితంగా ఆవిర్భవించిన గోళంపై ఒక చిన్న జీవకణం —
మరుగుజ్జు సూర్యుని చుట్టూ తిరిగే
మట్టిగ్రహంపై మాంసాంబరాన్ని ధరించిన చిన్న జీవం.
విశాల, గగనంలో తిరిగే ఒక చిన్న మనస్సు.

అది జీవించింది, అది తెలుసుకున్నది.
అది తన మహోజ్వల ఆత్మను చూసింది.
అమరమై, అంతరిక్షాన్ని దాటిపోతూ, కాలాన్ని అధిగమిస్తూ!

మూలం శ్రీఅరవిందులు
అనువాదం: యజ్ఞన్న

కురచ నెపోలియన్

(హిట్లర్ , అక్టోబర్ 1939)

చూడు! చూడు మాయ తన సంకల్పంతో చేసిన వైపరీత్యము
ఒక హింసాత్మక ఉత్పాతం జనించింది,
వాస్తవం కూడా విడ్డూరంతో ఏకమై పెరిగింది,
ఆమె మంత్రదండపు ఆధిపత్యంలో
చిన్నదైనా గొప్ప విషయాలు సాధిస్తుంది,
హీనమైన విషయాలు కులీనతను పొందుతాయి.
ఈ చిరుజీవి పృథ్వి కిటునటు పాదములు మోపు
గతకాలపు మహాకాయుడి భూరి విగ్రహము మాదిరి.
నేపోలియన్ మనస్సు అతి విశాలం, ధీరం, వేగవంతము,
ఆతని హృదయం సాగరం మాదిరి నిశ్చలమూ, ఉద్రేకపూరితము
అతని సంకల్పం ముష్టిలో, పట్టులో బలిష్టమే.
అతని కంటిచూపు ప్రపంచాన్నే చేత పట్టగలదు
పెద్ద, చిన్న విషయాలపై సార్వభౌమ్యత చూపగలదు.
అంచనా కందని చలనం, దానికున్న అవకాశం
విడువక చేజిక్కించుకొని కలిపించెను సంసర్గత.
ఎక్కడో అధోలోక పదార్థంతో తయారైన ఈ జీవి,
ఏ రకమైన వైభవమూ లేక ఆటాడే భూతం మాదిరి,
ఇనుము, బురద కలిసిపోయినట్లున్న ప్రకృతి పదార్థం,
కుటిలత, కుశలత కూడిన కుంచిత నరాలతో
పరిమితమై ఉన్న చిన్న స్వాప్నిక మస్తిష్కం గల
దీన, దుర్బల రసాత్మక అహంభావి, అతడు మొరటువాడు.
ఆతని హృదయం ఎరుగదు ఏనాడూ మాధురీయ, నవ్యప్రాయాన్ని,
ఆశలతో, భయాలతో సంప్రేరితమైన దురుసు మనిషి,
కేకలు, కన్నీళ్ళతో గడిపే తీవ్రనాడీ వ్యాధి పీడితుడు,
కఠినాత్ముడు, నిర్దయుడు, దుష్టుడు, చిరుతడు, పాశవికుడు,

కర్ణకఠోర గాత్రంతో గావుకేకల ప్రవక్త,
ఇదమిద్ధ భావాలు కొరవడ్డ ప్రబుద్ధుడు,
మన మానవ ప్రస్థానంలో నాయకునిగా నటిస్తున్నాడు.
ఆతని భుజబలమే భవిష్యత్తు విజయతోరణం కాగలదట.
ఆతని ఆరగింపుకు ప్రపంచమొక పరిపక్వ ఫలమట.
ఆతని ఛాయ లండన్ నగరం నుంచి కొరియా దాకా పడుతున్నది.
పట్నాలు, దేశాలు అతని పాదల క్రింద తుత్తినియలైపోతాయి.
ఒక భీతాహం తన గుప్పిటలో ప్రజను బంధిస్తున్నది.
నురగలు గ్రక్కే ఆ నోటి దగ్గర ప్రపంచ భవిత నిరీక్షిస్తున్నది.
ఒక రాక్షస శక్తి ఈ కురుచ మానవుని ఆదుకుంటున్నది
ఒక భూరిశక్తి చేతిలోని చిన్న మొరటు పరికరము.
స్వేచ్ఛాయుత ఆత్మానందాన్ని, కాంతినీ గర్హిస్తూ,
బలము, నేర్పు, రాక్షసశక్తులతో కూడినదై.
మానవత్వాన్ని నేలకూల్చు దృఢసంకల్పంతో
ఒక ఉక్కుపాదం కింద భూమి నంతటినీ ఏకం చేయాలని,
తన భయానక, దుర్మార్గ ప్రణాళిక అమలుకు నడుం కట్టింది.
మానవుని మనస్సునూ, సంకల్పాన్నీ ఒక్కసారిగా అణగద్రొక్కుతూ
సాధుత్వాన్నీ, కౌశల్యాన్నీ ఒక భయంకర పట్టులో బిగించి,
జనసమూహాల్లో రాక్షస నినాదాలు కురిపిస్తున్నది.
దాని అంధసామ్రాజ్యాల ననుమతిస్తే,
ఆ పాలన ఘోరమైన ఘడియను సిద్ధం చేసి
అచేతన తన హక్కును తిరిగి పొందనిస్తుంది.
పరాప్రకృతి చైతన్యశక్తిగా వెలువడిన మానవుడు
తొలుతటి నిశీథిలో కూరుకుపోగలడు.
పూర్వపు సృష్టి వెళ్ళిపోయినట్లుగానే
భూరి జంతువులు డైనాసార్‌లతో పాటు శిక్షను పంచుకుంటాడు.
అదంతా ఆ రాక్షసుని కట్టువస్త్రిపు ఛాయయే
భయకంపిత భూగోళంపై అలుముకున్నది.

ప్రాణాంతక మిట్టపై నున్న ఆతని ఉన్నత భవనంలో
ఒంటరిగా ఆ అధికార స్వరాన్ని ఆలకిస్తాడు,
ఆతని చర్య అకస్మాత్తుగా ఎంచుకొన్న నియంత,
రాక్షస చాతుర్యంతో విసిరే పులిపంజా.
ఆతని శరీరం వినియోగించలేని ఒక మహాశక్తి —
అల్ప మానవుడైన కారణాన ఆ భయంకర అభ్యాగతిని భరించలేని
కల్లోల జలధి యందు దురదృష్టపు నావలాగ —
ప్రేరేపించినది, ఆలోచించి, లంఘించి, ఘోషించి, పోరాడమని,
ప్రేరేపితుడై బెదరించి, భయపెట్టి, సడిచేసి, పాశవికుడై,
లంఘిస్తూ, గెలుపొందుతూ, అజేయుడై
ఆ సంక్షుభిత రహదారిపై కలిసెను చివరికి
అంతకు మించిన పైశాచిక శక్తిని — భగవానుని పిడుగుపాటుని.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డా. అమరవాది ప్రభావతి, ప్రొ. అమరవాది వేంకటరామ శాస్త్రి

ఆశ్చర్యకర మీ జన్మ

చూచితి నేను కాలవాహినిలో ఒక సంచారకునిగా నా ఆత్మను;
జన్మ నుంచి జన్మకు విశ్వగతులలో దాని నడక తీరును,
అగాధ ప్రదేశాలలో అస్పష్టంగా, ఉన్నత దేశాలలో ఉత్కృష్టంగా,
కీటకము నుంచి దైవత్వం దాకా పరిణమించిన తీరును.

వచ్చింది నిత్యాగ్ని లోని ఒక విస్ఫులింగం
పుట్టుక లేనివాని కొక గృహవసతి ప్రకృతిలో నేర్పాటు చేయ
ఆ నిశ్చైతన్య సూర్యరహిత నిశీధి అందుకున్నదా అగ్నిని,
దీనమైన మూగ పదార్థ పశుత్వ బీజము లోనికి.

జీవం కదిలి ఆలోచనాక్రమమొక ఆకృతిని రచన చేసింది.

కృషి చేసింది కేవల నిశ్చేతనాత్మక పృథ్వి చలించగలందుకై,

స్వప్నచారి ప్రకృతికి నిద్రలో పుట్టి

ఆశించడం, ప్రేమించటం నేర్చిన ఒక ఆలోచనాజీవి.

ఇంకా మందగమనంతో, అద్భుతం కొనసాగుతోంది,

పంక, పాషాణాల మధ్య అమర్త్యుని క్రమానుగత ఆవిర్భూతము.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. అమరవాది ప్రభావతి, ప్రొ. అమరవాది వేంకటరామ శాస్త్రి

క్షణములు

పదార్థ శిఖరాలపై పరిపూర్ణ క్షణాలున్నట్లైతే,

ఈ విజ్ఞాన, మహత్త్వ, దివ్యానంద పరాకాష్టలు,

కేవలం క్షణమాత్రలే, ఇది మాత్రమే చాలునేమో.

ధరించితేను ఝురీవేగ జ్వలిత పక్షములు

అవి అమాయక నలుపు వలువల ప్రకృతి తెచ్చిన ఆత్మల రెక్కలు

మర్త్యుల అస్థిర అల్పత్వం

వారిని కట్టి ఉంచలేదు. ఒక ఉన్నత ప్రభుత్వం

చేయగలదు క్షణంలో వారిని సృష్టి విరాజమాన చక్రవర్తులుగా.

ఈ క్షణ భంగుర ఆత్మోద్ధరణలు

ఆత్మ కొక విశిష్ట స్థిరత్వాన్ని సిద్ధం చేస్తాయి.

భగవానుని ప్రశాంతతత, ఒక ప్రబల అస్థిరత

అదే ఇప్పటి నా ఆత్మకి అవధుల్లేని అంతరిక్షం.

విభాగాలన్నీ ఒక కాలాతీత సంపూర్ణత;
క్షణాలన్నీ ఒక అవ్యయ వత్సరంలో ప్రకాశిస్తాయి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అమరవాది వెంకటరామ శాస్త్రి, అమరవాది ప్రభావతి

శ్రీకృష్ణుడు

స్వర్గానికి మిన్న నైన శ్రీకృష్ణుని పదసన్నిధి
గాఢంగా కాంక్షించే పుడమి గుండె సవ్వడిని
విన్న నాకు తుట్టతుదకు అర్థం అవగతమయింది
దుర్భరమగు ఈ సుందర లోకమందు
ఆత్మ జన్మనందుటలో పరమార్థం ఏమిటని.
దివ్య చక్షువుల అందం కళ్లారా కన్నాను
అమర ప్రేమికుడి వేణువు ఆవేశం విన్నాను
అజరామర పారవశ్య సంభ్రమాన్ని పొందాను
ఎదలో ఉబికిన శోకం అంతరించిపోయింది.

మధుర సుధాగానరవళి దాపుల వినిపిస్తున్నది
అనూహ్య ఆనందంతో ప్రాణం త్రుళ్ళి త్రుళ్ళి పడుతున్నది
ప్రకృతి అంతా ఒక ప్రగాఢ ముగ్ధ స్తబ్ధతలో మునిగి
తన ప్రభువు తనను తాకి కౌగలించ వేచి వుంది.

తరతరాల నిరీక్షణ ఈ ఒక్క క్షణం కోసం
నాలో ఈ లోకం సంతృప్తి చెంది స్పందిస్తున్నది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

శిలాదేవత

అది దేవాలయాల పురం, అక్కడ ఒక మందిరం
మలచబడిన దేవత కనుదోయి నన్ను కాంచింది
అది జీవంతో తొణికిసలాడే అమరదివ్య సమక్షం
అనంతత్వమంతా అవధరించిన దివ్యస్వరూపం.

ఆద్యశక్తి జగన్మాత, ఆమె దివ్యసంకల్పం
అజ్ఞానం ఆవరించి గాఢనిద్ర నున్న లోకంలో
నింగిలోన నేలపైన కడలి లోతుల్లోన
అనంతశక్తివంతమై అగ్రాహ్యాకృతిని దాల్చి మౌనంగా వసిస్తుంది.

మనసు ముసుగులో నున్నది మాటైనా పలుకకుండ
మౌనంగా, అర్థమవక, సర్వజ్ఞత పరిఢవిల్ల
చిత్రమైన ఆమె రూపురేఖ రహస్యాన్ని
ఆత్మ తెలుసుకునే వరకు ఆమె మరుగుపడే ఉంటుంది.

ఆరాధకుడిలో ఆమే, నిశ్చల ఆకృతిలో ఆమే
శిలాప్రతిమ రూపంలో కనిపించే దేవరహస్యం,
శరీరధారణ చేసిన అత్యద్భుత సౌందర్యం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

మాండవ్యుని ఆలోచనలు

నింగిలోన పొంగిపొర్లు మేఘాలను అదుపుచేయు
ఫెళ ఫెళ మని గర్జించే ఉరుముల గొంతుకలను మూయు
కనులకు మిరుమిట్లుగొలుపు మెరుపులకు పగ్గాలు వేయు
శక్తి ఒకటి ఉన్నదనే నమ్మిక నా కేర్పడింది, కాని
తన సృష్టికి తను లోబడి ఆకర్షణలకు లొంగి
బందీయై ప్రలోభాలు ప్రేమలలో తేలియాడు
మనలోని ఆ భగవంతుని మున్ముందుగ లేపాలి.
అధికారంపై మానవునికి అందుకనే అంత ప్రేమ, కాని
ఆ అధికారానికి సైతం హద్దు ఒకటి ఉంటుంది.
అధిగమించి అడుగేస్తే అందమైన విశ్వమంతా
ఆధీనం అవుతుందని, అమరత్వం, అజేయత
సిద్ధిస్తాయనుకుంటే, హద్దెందుకు? అందులకై
అంతరించుటకైనా సిద్ధమనుటకు వెరపెందుకు?
అలలు చిందులాడుతుండు అల్లరి సింధువులు గాని
తుఫాన్ల తాకిడికి పొంగు మహోదధులు గాని
కాలేవు మనం కోరుకునే ఆదర్శాలకు సామ్యం.
ఆలోచనా పరంపరల ఆఖరి అవధులను కూడ
మానవ భావ విశాలత అధిగమించగలదు గాన
స్వర్గసీమ మాళిగ దానికి తుల్యం కానేరదు.
ఊర్ధ్వలోకాలపైన అలముకున్న పెంజీకటికి కూడ
వెరవక గాలులు సోకని తెరచాపలతో
పయనించే లంగరు చుక్కాని లేని నావవోలె
ఊహలు జ్ఞానేంద్రియాలు చేరలేని తీరాలకు
చేరగలుగునదేదో అంతరంగమందున్నది.
ఆ సుదూరతీరాల కావల నిబిడీకృతమై
మనం తప్ప ఎవరు లేని నిరాకార శూన్యంలో

అడుగిడి అదరక తిరోగమన మిష్టపడక
స్థిరముగ నిలుచుండగలదు జీవాత్మ ఒక్కటే.
ఆతడు నిర్దేశించిన ఆ అవధికి కట్టుబడే
జీవులు ఏమున్నవి, పశుపక్ష్యులు, చెట్టుచేమ జడపదార్థాలు తప్ప?
అన్ని ఎల్లలను మీరి లోకమంత మన చేతికీలుబొమ్మగ జేసి
సంతృప్తిగ ఇట నుంటే, అంతకంటె ఏమున్నది?
అయినా ప్రపంచాన్ని కదిలించే శక్తి ఒకటుంది గనుక,
ఇప్పటికిది చాలు, ఓ ప్రభూ, నాకు తెలుసు నేలమీద
ఆట విడిచి, సూర్యచంద్రమండలాల పైకెగసి
గత గతిక్రమాలు తీరుతెన్నులన్ని పరిణతి పొందించినపుడు
బాధలు వైషమ్యాలు లోకంలో అంతరించిపోతాయి.
బీడుపడ్డ నేలల్లో గులాబీలు పూస్తాయి.
నిశ్శబ్దపు ఎడార్లలో మధుర స్వనాలు వినిపిస్తాయి.
'దైవం మానుష రూపేణ' అన్నది ఋజువౌతుంది మరో మారు.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

సమర్పణ

నా లోపల నివసించే ఓ ప్రకృతి పురుషా!
నా అంతరంగమందు గుప్తంగా దాగిన ఓ పరమాత్మా!
నీ సాధనమైన నా భౌతిక కాయమంతా
నీ దివ్యత్వపు నిశ్చల తేజంలో మిళితమవనీ.

నీ మనసుకు వాహికగా నా మనసును మలచాను
నా సంకల్పము నీదగుటకు దానిని అర్పించాను

ఈ మన మార్మిక అనభివ్యక్త సంయోగంలో
నాదన్నది ఏది కూడ ఏమాత్రం మిగలనీకు.

నీ ప్రేమ తాళధ్వనులు నా హృదయంలో మ్రోగాలి
నా దేహం లోకార్థం నీ సాధనమై పోవాలి.
నరనరాలలోన పారవశ్యం ఝురులై పారాలి
నీ విశృంఖల శక్తి వెలుగును వెంటాడే
జాగిలములు కావాలి నా ఆలోచనలు

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఇదేనా ముగింపు?

అంత జీవితం, ఇంతలో ముగిసిపోతుందా,
కన్న కలలకు, చేసిన చేతలకు అర్థమే లేదా
నిలవని నామం, నశించె రూపం
ఇదే నా ముగింపు?

పాతిపెట్టిన రాతిపలక క్రింద శరీరం కృశిస్తుంది
లేదా మండే కట్టెల్లో పిడికెడు బూడిదగా మారుతుంది
కరిగిన మనసు మరచిన జ్ఞాపకాలను కోల్పోతుంది
ఇదేనా ముగింపు?

బ్రతుకంతా ఒక్క క్షణంలో ముగిసినట్టు, కాలం గడిచిపోయింది
ఒకప్పటి ఎగిసిపడిన గాఢవాంఛలు

చలించని భూమి, చల్లబడిన సూర్యకాంతిలో వంచించబడి మరణిస్తున్నాయి
ఇదేనా ముగింపు?

దైవం వైపు మానవుడు చేసే అధిరోహణ కోసం
మా పరితాపాలు అందరి హృదయాలను చేరకనే, మోసపోయాయి
ఈ ప్రపంచం మాత్రం మృత్యువు వైపు, నరకం వైపు దిగజారుతోంది
ఇదేనా ముగింపు?

తీగలు తెగి, మూగవోయి, నేలకూలింది వీణ
ఆ అదృశ్య వైణికుడు మరణించాడా?
పిట్టపాడిన చెట్టు కూల్చారని
పాట ఆగిపోవాలా!

ఆలోచనా, సంకల్పాల కాధారభూతమై మనసున నిలిచిననాడు
పృథ్వి విధికే నూతనాకృతి నీయగల నిత్యయత్నశీలుడు
హృదయంలో కొలువున్న ఆ ఒక్కడూ
అతడే ప్రేమించి, పరితపించి, ఆశపడినవాడు...
అతడి కథా ముగిసిపోవాలా?

మనిషిలోని అమరత్వమే అతని నామం
ఇదే ఆ దైవకళాకారుని నిత్యనివాసం
తనని తాను మళ్ళీ మళ్ళీ దివ్య ఆకృతులుగా
మెరుగైన పోత పోస్తాడు...
ఆ నిరంతర శ్రామికుడు, విశ్రాంతి నిచ్ఛగించడు.

ఆ నింగి లక్ష్యం సిద్ధించేవరకు
హృదయంలో దైవదర్శనం పొందేవరకు

ఆత్మజ్ఞానం వికసించేవరకు ... అప్పటికి
ఈ లీల ఆగదు ... ఇది ముగిసిపోని పయనం.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డి. సత్యవాణి

ఒక రోజు — ఇంకా కొంచెం

ఒక రోజు, సగం సగం మరణానికి కాలం చెల్లిపోతుంది
ఒక రోజు, నూతన అస్థిత్వంతో అంతా ప్రారంభమౌతుంది

ఓ చిన్న బాట — ఆ గొప్ప లక్ష్యం
ఆ దివ్య పరిపూర్ణతను తెచ్చిపెట్టె ఒక స్పర్శ

శిఖరం తరువాత శిఖరం ఎక్కాం, మరిప్పుడు
గమనించు ఆ చిట్టచివరి వాలు...
ఇంకా ఎవ్వరూ అడుగుపెట్టని మహోన్నత శిఖరం:
ఒక్క అడుగు — అంతా నింగి, దైవమూ.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డి. సత్యవాణి

సావిత్రిలోని కొన్ని వాక్యాలు


ముందుగా కొన్ని తెల్సుకోవలసిన విషయాలు:

శ్రీఅరవిందులు మహాభారతంలోని వనపర్వంలో చెప్పబడిన సావిత్రి గాథను మరింత ఉన్నతమూ, ఉదాత్తమూ, విస్తృతమూ చేశారు. వారి కావ్యానికి దీటుగా, వారి కావ్య అల్లికకు అనువుగా మలుచుకున్నారు. సావిత్రి గాథను పునః సృష్టిస్తూ, ఆమెను అసాధారణ వ్యక్తిగా, తేజస్వినిగా, దివ్యప్రేమ అన్న ఆయుధంతో మృత్యువుని జయించగల సర్వశక్తి సంపన్నురాలిగా, మన ముందు సాక్షాత్కరింపచేశారు. ఆకాంక్షాపరుడైన అశ్వపతి అద్భుతమైన తాంత్రిక భూమికల యొక్క అసాధారణ సాహసయాత్రలో, సావిత్రి, యమధర్మరాజుల సంవాదంలో, ఇంకా కావ్యమంతా నిండిన అనేక అత్యద్భుత సందర్భాలలో ఈ కావ్యం పాఠకునికి ఊహించలేని వాస్తవాలకు తలుపులు తీస్తుంది.

శ్రీఅరవిందులు బరోడాలో ఉండగానే (1893-1905) ఈ కావ్యరచన చేపట్టారు. అయితె ఇప్పుడు మన ముందున్న ఈ కావ్య సమగ్రరూపం పాండిచ్చేరీలో రూపొందింది. అనేక సంవత్సరాలు ఈ అద్భుత గ్రంథరచన సాగింది.

ఒక పాఠకుడు ఆశ్చర్యంతో శ్రీఅరవిందుల్ని ప్రశ్నించాడు 'స్ఫూర్తిని మీరు నిర్దేశించగల్గినపుడు సావిత్రిలోని భాగాలు మళ్ళీ మళ్ళీ ఎందుకు వ్రాయాల్సి వచ్చింది అని దానికి శ్రీఅరవిందు లిచ్చిన సమాధానం:

"అది చాలా మామూలు విషయం. నేను సావిత్రి కావ్యాన్ని నా ఆరోహణా కార్యక్రమంలో ఉపయోగించుకున్నాను. ప్రారంభం ఏదో ఒక మనోస్థాయి నించె ఆరంభించాను. ప్రతిసారి నేను మరింత ఉన్నతస్థితికి చేరినపుడు, నేను ఆ స్థాయి నించి తిరిగి వ్రాశాను. నాకు ముఖ్యమైన మరో విషయం ఉంది — అది ఏదైనా కొంత భాగం నిమ్నస్థితుల నించి వచ్చినట్టు నా కనిపిస్తే, నేను తృప్తిపడేవాడిని కాదు. అది కవిత్వపరంగా మంచిదైనా, ఆ విధంగా వదిలేవాడిని కాదు. అంతా ఒకే స్థాయిలో సాగాలి సాధ్యమైనంతవరకు. నేను సావిత్రిని ఏదో ఒక కావ్యంగా వ్రాసి పూర్తి చేయాలని భావించలేదు. ఎంతవరకు కవిత్వం వ్యక్తి యొక్క స్వీయ యోగచైతన్యం నించి వ్రాయవచ్చు, దాన్ని సృజనాత్మకంగా కవిత్వీకరించవచ్చు... అన్న అనుభవానికి సావిత్రి ఒక ప్రయోగాత్మక క్షేత్రంగా భావించాను. ఆ విధంగానే



Savitri

నా ప్రయత్నం కొనసాగింది. నేను 'రోజ్ ఆఫ్ గాడ్' కాని 'సానెట్స్' కాని తిరిగి వ్రాయలేదు, ఏవో చిన్న భాషాపరమైన మార్పుల కోసం తప్ప".

సావిత్రి మహాపద్యకావ్యం లోని కొంత భాగం

మన ఉనికికే కారణమైన ఆతడు అంతర్యామియై మనలోనే దాగాడు
తన శక్తితో తానే దోబూచులాడతాడు
ఈ ప్రకృతి పనిముట్టులో రహస్యంగా సంచరిస్తాడు దైవం.
మనిషినే తన నివాసమని తలచి కొలువుంటాడు
తన క్రీడాస్థలిగా ఈ విశ్వాన్ని మలిచాడు
అతడి శక్తివంతమైన కార్యాలకు విశాల వ్యాయామశాల విశ్వం
ఆ సర్వజ్ఞుడు మన ఈ అంధకారస్థితిని కావాలని వరించాడు
దివ్యుడై... మనిషిగా, మృగంగా వేషధారణ చేశాడు
శాశ్వతుడై... విధిని, కాలాన్ని సమ్మతించాడు
అమరుడై ... మరణంతో మేలమాడాడు...
సమగ్రమూ, పరిపూర్ణమూ అయిన ఆ ఒక్కటి
ఏ చిహ్నము లేక, సద్దుచేయని నిరాకార శక్తి...
కాలానికి చిక్కకుండా, చలనరహితమైన గాఢనిద్రలో... ఉన్న ఆ నిశ్శబ్దశక్తికి...
ఆ తనలోని మూగశక్తికి పిలుపు నిచ్చాడు.
అతడి ఏకాంతం యొక్క ఆ అనిర్వచనీయ సమృద్ధి
ఆ సమగ్రమూ, పరిపూర్ణమూ అయిన ఆ ఒక్కటి
అతని నిశ్శబ్దంతోపాటుగా శూన్యంలో ప్రవేశించింది
ఒక ఆత్మను అనంత రూపాలుగా మలిచాడు
తన శక్తిని కోట్ల ఆకృతులుగా తీర్చిదిద్దాడు
ఆ విశాల సీమల్లో ఏకాంతంగా ఉండే అతడే అందరిలో నివసిస్తాడు.
అతడే కాలమూ, అతడే శూన్యమూ
అతడే సమగ్రమూ, పరిపూర్ణము అయిన రక్షకుడు

అతడే మనలో రహస్యంగా ఉన్న అంతరాత్మ
మన అపరిపక్వ వేషం తాను వేసుకున్నాడు
ఈ మాంసభరిత శరీరాన్ని తన నివాసస్థలం చేసుకున్నాడు
మానవరూపంలోకి తాను ఒదిగాడు
అతని దివ్య ఎత్తులకు మన్ని పెంచాలన్న ఔదార్యంతో
దివ్యలక్షణాలతో కొత్త మనిషికి మూసపోస్తాడు
మర్త్యనమూనాపై దివ్యప్రణాళికను అమలుపరుస్తాడు.
మన పరిమిత మనస్సును అనూహ్యామైన అనంతాలకు ఎత్తుతూ...
ఆ క్షణాన్ని శాశ్వతత్వంతో స్పర్శిస్తూ.

ఈ పరివర్తన భూమి స్వర్గానికి చెల్లించాల్సిన ఋణం
ఓ పరస్పర ఋణం చేత మనిషి, దైవం బంధితులు
మన మానవత్వాన్ని ఆతడు అవధరించినట్టె
ఆతడి స్వభావాన్ని మనం ఆలింగనం చేసుకోవాలి
మనం దైవం యొక్క బిడ్డలం.... దైవంగా మారాలి
అతడు సహించిన మానవ భాగం... దివ్యంగా ఎదగాలి
మన జీవితం విరోధాభాసం, దైవమే దానికి బీగం

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డి. సత్యవాణి

ముఖ్య గమనిక

అఖిల భారత పత్రిక 'చిన్న పుస్తకాలు' తెలుగులో (8-20 పుటలు) శ్రీమాతారవిందుల ప్రవచనములు ప్రస్తుతం లభ్యమగుచున్నవి.

1) శ్రీఅరవిందులు — ఒక దీపిక
2) శ్రీమాత — ఆమె జీవితము — కార్యదీక్ష
3) గ్రంథపఠనం గురించి
4) భారతీయ సంస్కృతి — నాలుగు విశిష్ట లక్షణాలు
5) జీవిత లక్ష్యం
6) యువకులకు — వారి శరీరం గురించి
7) భయం — కారణము — నివారణ

ఇంకనూ 11 పుస్తకాలు వేరు వేరు శ్రీమాతారవిందుల ప్రవచములతో ముద్రణ అగుచున్నవి. అల్పవ్యవధిలో లభ్యమగును.

పుస్తకం వెల — రూ 3-00

Statement about ownership and other particulars concerning Akhila – Akhila Bharata Patrica

Form IV

(1) *Place of publication:* Sri Aurobindo Society, 1, Rangapillai street, Pondicherry - 605 001; (2) *Periodicity of publication*: Monthly; (3) *Printer's name, nationality and address*: Swadhin Chatterjee, Indian, Sri Aurobindo Ashram Press, Pondicherry - 605 002; (4) *Publisher's name, nationality and address*: Pradeep Narang, Indian, Sri Aurobindo Society, 1, Rangapillai street, Pondicherry - 605 001; (5) *Editor's name, nationality and address:* Karra Venkateswarlu, Indian, Plot No. 11/A, Oppt. No. 87, MSN Colony, Vizianagaram (AP), PIN: 535 002; (6) *Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital*: Sri Aurobindo Society, Pondicherry - 605 001.

I, Pradeep Narang hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd

21 February 2011 — Pradeep Narang, Publisher

ఏప్రిల్ 2011

అఖిల

అఖిలభారత పత్రిక



పదార్థం పరమాత్మ తత్త్వాన్ని ప్రదర్శించాలి
శ్రీఅరవిందులు

శ్రీమాతారవిందుల వ్యాఖ్యలు

విషయసూచిక

వ్యాధి పూర్తిగా నయమై, మళ్ళీ తిరిగి రాకుండా ఉండటమనేది మనసులో, ప్రాణికంలో, శరీరచైతన్యంలో అడ్డంకులు తొలగించుకోవటంలోను, వ్యాధిని కలుగజేసే శక్తికి అధోచేతన ప్రతిస్పందన చేయకుండా చేసుకోవటం మీదను ఆధారపడి ఉంది. వ్యాధి నుంచి పూర్తి రోగరక్షణ కలిగించడానికి మన యోగం చేసే ప్రయత్నం నిమ్నచేతన పైనుంచి సంపూర్ణంగా శ్వాశ్వతంగా జ్ఞానవికసనం పొంది, దాని ఫలితంగా వ్యాధి కలుగజేసే మానసికపరమైన మూలలన్నీ తొలగించబడినప్పుడే సఫలీకృతం అవుతుంది. మరొక విధంగా చేయడం సాధ్యపడదు.

శ్రీఅరవిందులు

ముఖచిత్రం చిత్రకారిణి: రీతం (రత్లామ్)

సత్యారోహణ

(నాటిక)

(నాంది ప్రస్తావన, ముగింపు వాక్యంతో కూడిన ఏడు అంకాల జీవిత నాటకం)

ఇందలి పాత్రలు: పరహితాభిలాషి, నిరాశావాది, శాస్త్రవేత్త, కళాకారుడు, విద్యార్థులు (ముగ్గురు), ప్రేమజంట, సన్యాసి, జిజ్ఞాసువులు (ఇద్దరు)

నాంది

నాంది: కళాకారుడి గదిలో ప్రారంభపు సమావేశం

ఏడు మజిలీలలో అధిరోహణ — ఏడవది శిఖరాగ్రం

ముగింపు: నూతన ప్రపంచం

ముందుమాట (కళాకారుడి గదిలో)

అది సాయంసమయం. చీకటి పడుతూ వున్నది. సత్యాన్వేషకులైన కొద్దిమంది సమావేశమై చర్చించుకుంటూ ఉంటారు.

హాజరైన సభ్యులు: 1. సహృదయుడైన పరిహితాభిలాషి 2. జీవితంలో సుఖం మృగ్యం అని నిర్ధారణకు వచ్చిన నిరాశావాది 3. ప్రకృతి సహజమైన సమస్యలకు పరిష్కారాలను అన్వేషించాలని ప్రయత్నించే శాస్త్రవేత్త. 4. ఆదర్శవంతమైన అనంత సౌందర్యాన్ని అన్వేషిస్తూ కలలు కనే కళాకారుడు. 5. ఆదర్శజీవనం సాధ్యమని నమ్ముతూ తమపై తమకు నమ్మకమున్న ముగ్గురు విద్యార్థులు. (ఇద్దరు యువకులు, ఒక యువతి) 6. మానవ ప్రేమలో పరిపూర్ణతను సాధించాలని ఆశించే ప్రేమికుల జంట 7. సత్యాన్వేషణలో ఎలాంటి కఠిన నియమాన్నైనా పాటించడానికి సిద్ధపడే సన్యాసి. 8. అనంతుడికై పరితపిస్తున్న దైవప్రచోదితులైన ఇద్దరు జిజ్ఞాసువులు.

(తెర తొలగిపోతుంది)

కళాకారుడు: మిత్రులారా, మన సమావేశం ముగుస్తున్నది. ఈ అన్వేషణలో మనల నందరనూ ఐక్యంగా ఉంచగలిగిన సంతృప్తికరమైన పరిష్కారం మనం కనిపెట్టాలి. మీరు ఇప్పటిదాకా సూచించిన భావాలకు తోడుగా ఇంకేమైనా చెప్పదలిచారా?

పరహితాభిలాషి: నేను నా జీవితమంతా మానవసేవకే అంకితమైనాను. వీలయినన్ని విధాలలో సేవలను అందించాను. కాని అవేవీ నాకు సంతృప్తి కలిగించలేదు. నా కృషి నెరవేరాలంటే అసలు సత్యమేదో కనిపెట్టాలని అనుకున్నాను. జీవితానికి అసలు అర్థం ఏమిటో తెలియకపోతే, మానవాళికి ఏ విధంగా సహాయపడాలో ఎలా తెలుస్తుంది? మన ప్రస్తుత పరిష్కారాలన్నీ తాత్కాలికమైనవే. సత్యచేతన మాత్రమే మానవాళి సమస్యలకు సరియైన పరిష్కారం.

నిరాశావాది: జీవితంలో తీవ్రమైన బాధ అనుభవించాను. నాకు దేని మీదా నమ్మకం లేదు. జీవితంలో చాలా నిరాశనూ, అన్యాయాన్ని, బాధనూ చూసాను. ఈ లోకం నుండి, మనుషుల నుండి నేనేమీ ఆశించటం లేదు. నా చివరి కోరిక అసలైన సత్యాన్ని కనుక్కోవాలని. అది సాధ్యపడే ప్రయత్నమేనని అనుకొంటాను.

మొదటి జిజ్ఞాసువు: సత్యాన్ని కనుగొనటమే మనందరి ఏకైక జీవితాశయం. ఇదే మనందరినీ కలిపింది. మా వరకు మాకు శారీరకమైన వాంఛలు, మానసిక ఉద్రేకాలు ఏమీ లేవు. మా మనుగడలోని ప్రధాన కర్తవ్యం ఒక్కటే: సత్యాన్వేషణ.

ప్రేమికుడు: (ఇతర జిజ్ఞాసువులను ఉద్దేశించి) వీళ్ళలాగా కాకుండా మేము కేవలం ఒకరి వల్ల ఒకరము, ఒకరి గురించి ఒకరము జీవిస్తున్నాము, పరిపూర్ణమైన అవగాహనతో ప్రేమైకజీవులం కావాలనుకుంటున్నాము. మావి దేహాలు రెండైనా ఒకే హృదయంతో మెసలాలనుకుంటున్నాము. మా హృదయాలు ఒకటిగా స్పందించాలి. ప్రేమ కోసం ప్రేమించుకుంటూ ప్రేమలో నిరంతరం బ్రతకాలి. అసలైన ప్రేమను మేము సాధించాలి. అదే మా జీవితాశయం. మా జీవితాలు దానికే అంకితం.

సన్యాసి: సత్యాన్ని చేరటం అంత సులభం కాదు. ఆ మార్గం కష్టనష్టాలతో, అపాయాలతో, భయానకంగా, మోసపూరితమైనది. అంతటి ప్రమాదాలను ఎదుర్కోవటం ఒక భ్రమ. అందుకు అచంచలమైన పట్టుదల కావాలి. ఉక్కులాంటి నరాలు ఉన్నవారే అడ్డంకులను ఎదుర్కోగలుగుతారు. నేనైతే ఏ త్యాగానికైనా సిద్ధంగానే ఉన్నాను. దేన్నయినా పరిత్యజిస్తాను. నా ముందున్న ఉదాత్తమైన లక్ష్యసాధనకై ఏదైనా వదులుకుంటాను.

కళాకారుడు: (ఇతరుల వైపు తిరిగి) ఇంత కంటె మీరు చెప్పేది ఏమీ లేదా? పోనీలే, మనం దాదాపు ఏకాభిప్రాయానికి వచ్చాం. సత్యాన్వేషణలో మార్గమైన ఈ పవిత్ర శిఖరాన్ని అధిరోహిద్దాం. ఎంత క్లిష్టమైనా, సంఘటితంగా మనం ఆ సాహసం చెయ్యాల్సిందే. ఆ సమున్నత శిఖరాన్ని ఒక్కసారి చేరామా సర్వం మనకు గోచరిస్తుంది. మన సమస్యలన్నీ తప్పక పరిష్కారింపబడతాయి.

ఇక, రేపు మనమంతా ఆ పర్వతపాదం వద్ద కలుద్దాం. అంతా ఒకటిగా ఆరోహణ ప్రారంభిద్దాము. ఇక సెలవు.

(ఒకరికి ఒకరు అభివాదం చేసికొని ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతారు)

ఆరోహణలో ఏడు మజిలీలు


మొదటి మజిలీ

ఇదొక పచ్చని పీఠభూమి. ఇక్కడ నుంచి లోయ అంతా కనిపిస్తుంది. ఇంతవరకు విశాలంగా, అనువుగా ఉన్న మార్గం ఉన్నట్లుండి ఇరుకుగా వంపులు వంపులుగా మారి ఎడమ వైపు ఉన్న పెద్ద బండరాళ్ళ పర్వతం చుట్టూ సాగిపోతుంది.

అందరూ శక్తిభరితంగా, ఉత్సాహంగా చేరుతారు. క్రింద లోయ కనిపిస్తుంది. పరహితాభిలాషి వాళ్ళను సైగ చేసి పిలుస్తాడు.

పరహితాభిలాషి: మిత్రులారా, నేను మీతో ఒక ముఖ్య విషయం చెప్పవలసి ఉంది. (అంతా మౌనంగా, శ్రద్ధగా వింటారు) ఇంతవరకు మనం సులువుగా కొండను ఎక్కగలిగాము. ఇక్కడ నుండి పరికిస్తే జీవిత సమస్యలపై, మానవాళి బాధలపై మంచి అవగాహన కలుగుతుంది. మనలో విజ్ఞానం విస్తృతం అవుతూ ఉన్నది. నేను అన్వేషిస్తున్న పరిష్కారానికి మనం దగ్గరలోనే ఉన్నామని అనిపిస్తున్నది.... (మౌనం)

కాని ఇక్కడే ఒక కీలకం ఉన్నది. ముందు ముందు ఎక్కడానికి నిటారుగా కష్టంగా ఉంటుంది. మనం పర్వతానికి ఆవలి వైపుకు వెళ్ళుతాము. అక్కడ నుండి ఇక లోయ కనపడదు; మనుషులూ కనపడరు. కనుక మానవాళికి సహాయం చేయాలనే నా ప్రతిజ్ఞ భంగం అవుతుంది. అందువలన నా కార్యక్రమం వదులుకోవాల్సివస్తుంది. మీతో ఉండమని నన్నిక మీరు అడగకండి. నా పని మీద నేను వెళతాను. (తిరుగు



ముఖం పడతాడు. మిగతావారు ఆశ్చర్యంతో, నిరాశతో ఒకళ్ళ ముఖం ఒకళ్ళు చూసుకుంటారు.)

సన్యాసి: పాపం, వెళ్ళిపోయాడు. బాహ్యప్రపంచమూ, దాని భ్రమలలోనూ పడి తన కర్తవ్యం నెరవేర్చుకుంటాడట! జంకూ, గొంకూ లేకుండా మనం ముందుకు సాగుదాము. ఏ శక్తీ మన వేగాన్ని నిరోధించలేదు. (మళ్ళీ ప్రయాణం కొనసాగిస్తారు)

రెండవ మజిలీ

(కొంతవరకు దారి నిటారుగా ఉంటుంది. మలుపులు లంబకోణాల్లా ఉండటం వలన, ఎటు దారి తీస్తుందో చెప్పటం కష్టం. క్రిందకు చూస్తే దట్టమైన తెల్లని మబ్బు, క్రిందుగా ఉన్న ప్రపంచాన్ని కనబడనీయటం లేదు. కొద్దో గొప్పో ఉత్సాహంతో వాళ్ళు ముందుకు సాగుతారు. నిరాశావాది మాత్రం కాళ్ళీడ్చుకుంటూ దారి ప్రక్కన కూలబడతాడు. తల పట్టుకొని అచేతనంగా కూర్చొనిపోతాడు. ఆయన వెనుకబడటాన్ని గమనించి మిగతావారు వెనుకకు తిరిగి చూస్తారు. వాళ్ళలోని ఒక విద్యార్థి వెనుకకు వచ్చి, అతని భుజం తట్టి ఈ విధంగా అంటాడు:

మొదటి విద్యార్థి: మీకు ఏమయింది? అలసిపోయారా?

నిరాశావాది: (*పొమ్మని సైగ చేస్తూ*) లేదు, నన్ను వదిలేయ్. ఒంటరిగా వదిలేయ్. నడిచింది చాలు. ఇక నా వల్ల కాదు.

మొదటి విద్యార్థి: ఏమయింది? ధైర్యం తెచ్చుకోండి.

నిరాశావాది: వద్దు, నా వల్ల కాదు. నేను అలసిపోయాను. ఇదొక అర్థంలేని అసాధ్యపు ప్రయత్నం. (*క్రిందుగా నున్న మేఘాన్ని చూపిస్తూ*) అటు చూడు మనకు ప్రపంచం కనబడకుండా పోయింది. ఇక అర్థం చేసుకోవటానికి ఏమి మిగిలింది? (*వెనక లంబకోణంలా మలుపులు తిరిగే దారి వైపు చూస్తాడు*) ఎటు పోతున్నామో కూడా తెలియటం లేదు.

ఇదొక మాయ లేదా భ్రమ. లేదా రెండూ. మనం అన్వేషించాల్సిన సత్యం ఏమున్నది గనుక! ఈ ప్రపంచం, ఈ జీవితం గమ్యం లేని దారి వంటివి. ఈ నరక కూపంలో బంధింపబడ్డాము. నేను మీతో రాను. పోతే మీరు పొండి.

(చేతుల్లో తలను పెట్టుకుంటాడు. ఆయన్ను ఒప్పించటం ఆ విద్యార్థి చేతకాక ఆయన కర్మకు ఆయనను వదలి, మిగిలినవారిని చేరుకుంటాడు. వారంతా ఆరోహణ కొనసాగిస్తారు.)

మూడవ మజిలీ

(శాస్త్రవేత్త, కళాకారుడు ఇద్దరూ మాట్లాడుతూ, వెనుకబడ్డట్టుగా మిగతావారి వెనుక అనుసరిస్తున్నారు. వారి సంభాషణ ముగుస్తున్నది)

శాస్త్రవేత్త: నేను చెపుతూనే వున్నాను. కొంచెం తొందరపాటులో ఈ సాహసం చేశాము.

కళాకారుడు: నిజమే. ఫలితం లేకుండానే మన ప్రయాణం ఇంతవరకూ సాగింది. అయినా కూడ, కొన్ని ఆసక్తికర విషయాలు మాత్రం మన పరిశీలన లోనికి వచ్చాయి. అయితే ఇవి మనకు అంతగా ప్రతిఫలం ఇవ్వలేదు.

శాస్త్రవేత్త: అవును. నా విధానాలే మంచివి. ఇంత కంటె హేతుబద్ధంగా వుంటాయి. నిరంతరం ప్రయోగానికి అనుకూలంగా హేతుబద్ధంగా వుంటాయి. అయిపోయినదాని విలువను రూఢిగా అంచనావేసి గాని ముందుకు అడుగు వేయను. మన మిత్రులకు ఒక విషయం చెప్పాలి.

(వాళ్ళను సైగ చేసి పిలుస్తాడు. వాళ్లు ఆయనను సమీపిస్తారు. వారితో ఆయన ఇలా అంటాడు.)

మిత్రులారా, తోటి ప్రయాణీకులారా, ప్రపంచం నుంచి, దాని నిర్దిష్టమైన వాస్తవికత నుండి మనం దూరంగా పోతున్నామంటే పసిపిల్లల వలె ప్రవర్తిస్తున్నామని అనుకుంటున్నాను. ఇంతకు ముందు ఎవరూ ఎక్కని నిటారుగా ఉన్న ఈ పర్వతం ఎక్కితే సత్యాన్ని చేరుకోగలమని మనం అనుకున్నాము. ముందూ వెనుకా చూసుకోకుండా, మార్గం తెలుసుకోకుండా ప్రయాణం ప్రారంభించాము. అసలు మనం దారి తప్పలేదనే నమ్మకం ఏమైనా ఉందా? మనం క్షమించరానంత దుడుకుగా ప్రవర్తించామని అనిపిస్తున్నది. మన కృషి ఫలిస్తుందనీ, ఆశయం నెరవేరుతుందనే హామీ ఏమైనా ఉన్నదా? మన ప్రయత్నం అశాస్త్రీయం. అందువలన నేనిక్కడ

ఆగిపోవాలని నిర్ణయించుకున్నాను. క్షమించండి — మన స్నేహబంధం ఇలాగే ఉంటుంది — నేనిక్కడ ఆగిపోయి, సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, మనలను గమ్యం చేర్చే సరియైన మార్గాన్ని అన్వేషిస్తాను. (కొంచెం ఆగి) అంతే కాదు. సృష్టిలో ఎంత చిన్న విషయానికైనా; ఉదాహరణకు ఈ చిన్న రాయికైనా, దాని అమరిక కనిపెట్టగలిగితే మనం అన్వేషిస్తున్న సత్యాన్ని కనిపెట్టినట్లే. ఇక నేను ఇక్కడే ఆగుతాను. మళ్ళీ కలసుకునే వరకు సెలవు. కలుసుకుంటామని ఆశిద్దాం. మీరు ఎప్పటికైనా శాస్త్రిబద్ధమైన విధానాలు ఆశ్రయిస్తారని ఆశిస్తున్నాను. ఇకపోతే, నేను అన్వేషించేది నాకు లభ్యం ఐతే మీకు ఆ శుభవార్త చెప్పటానికి వస్తాను.

కళాకారుడు: నేనూ మిమ్మల్ని విడిచిపోవాలనే అనుకుంటున్నాను. అయితే ఆ శాస్త్రివేత్త కారణాలు వేరు; నా కారణాలు వేరు. కాని, అవి కూడా అంత ప్రాముఖ్యమైనవే.

ఉత్సాహంగా సాగిన మన ఆరోహణలో నాకు కొన్ని అనుభవాలు కలిగాయి; క్రొత్త అందాలు తోచాయి. ఇంకా చెప్పాలంటే ఆనందం విషయంలో ఒక నూతన భావం జనించింది. నా అనుభూతులు అందరికీ అర్థం అయ్యేలా చెప్పాలనే తృష్ణ నాలో బలపడసాగింది. దీనికి 'పదార్థపు' రూపం ఇస్తే ప్రపంచానికి వెలుగును ఇచ్చినట్లవుతుంది. నా అభిప్రాయాలకు రూపకల్పన చేసేదాకా ఇక్కడే ఉండిపోతాను. అందుకు నాకు బాధగా ఉంది కూడా. నేను చెప్పదల్చుకున్నది చెప్పగలిగినపుడు, మీరు ఎక్కడున్నా మళ్ళీ మిమ్మల్ని కలుస్తాను. క్రొత్త విషయాలు అన్వేషిద్దాం. మీకు భగవదనుగ్రహం, అదృష్టం వెంట ఉంటుంది.

(మిగతావాళ్ళంతా దిగులుగా ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకుంటూ ఉంటారు. రెండవ విద్యార్థి (యువతి) బిగ్గరగా అంటుందిలా:)

ఈ ఫిరాయింపులు మనకెందుకు! ఎవరి కర్మ వారిది. ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు చేస్తారు. ఏదీ మన ప్రయత్నాన్ని ఆపలేదు. సాహసంతో ధైర్యంగా ముందుకు సాగిపోదాము. బలహీనత వద్దు.

(శాస్త్రివేత్త, కళాకారుడు తప్ప మిగతావారంతా బయలుదేరుతారు.)

నాలుగవ మజిలీ

(ఇద్దరు జిజ్ఞాసువులూ, సన్యాసి ఎక్కడా ఆగకుండా ధైర్యంగా క్రమబద్ధంగా ముందుకు సాగిపోతారు. వాళ్ళ వెనుకనే చెట్టాపట్టాలేసుకుంటూ ఆ ప్రేయసీ ప్రియులు దేనినీ లెక్కచేయకుండా అనుసరిస్తారు. వెనుక నున్న విద్యార్థులు మాత్రం అలిసిపోయినట్లు ఆగిపోతారు.)

మొదటి విద్యార్థి: మిత్రులారా! ఎక్కటం అంటే ఇదేనా? ఎలాంటి దారి ఇది? ఎక్కడా ఆగటం లేదు. ఊపిరి పీల్చుకోవటానికి కూడా వ్యవధి లేకుండా ఉన్నది. నాకు నీరసం వస్తున్నది.

రెండవ విద్యార్థి: ఏం, నువ్వు కూడా మానేస్తావా? నువ్వు ఇలా చేస్తే బాగుండదు.

మొదటి విద్యార్థి: అబ్బే, అట్లాంటిది ఏమీ లేదు. ఎందుకు మనం కాసేపు ఆగి ఊపిరి పీల్చుకోకూడదు. కాళ్ళు నొప్పి పుడుతున్నాయి. కొంచెం విశ్రమిస్తే ఇంకా బాగా ఎక్కగలుగుతాము. కొద్దిసేపే. తర్వాత ఇంకా ఉత్సాహంగా ఎక్కగలుగు తాము. చూస్తావుగా.

మూడో విద్యార్థి: సరే, అలసిపోతే నిన్నిక్కడ ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోలేముగా! నాకూ అలసటగానే వున్నది. కాసేపు కూర్చుందాం. పిచ్చాపాటి మాట్లాడుకుందాం.

రెండవ విద్యార్థి: (*కాసేపు తటపటాయించి తానూ కూర్చుంటుంది*) సరే, నేనూ మీతోనే. మిమ్మల్ని వదలాలని లేదు. కాని ఇక్కడ ఎంతోసేపు జాగు చేయకూడదు. ప్రమాదం కూడా.

(*ప్రేమికుల జంట ఒకసారి వెనుకకు తిరిగి వాళ్ళను చూచి మళ్ళీ ముందుకు సాగుతారు.*)

ఐదవ మజిలీ

(*ప్రదేశం చాలా ఎత్తుగా వుంటుంది. దారి ఇరుకు. అక్కడ నుండి చూస్తే భూమి, ఆకాశాలు కలుస్తున్నట్లే కనబడుతుంది. లోయ ఏమీ కనబడటం లేదు. దిగువన తెల్లని మబ్బులు అడ్డంగా వున్నాయి. ఎడమ ప్రక్కన దారికి కొంచెం దూరంగా*

ఒక చిన్న ఇల్లు ఉంది. మొదటి ముగ్గురూ ఆగకుండా సాగిపోతారు. (ప్రేమికుల జంట మాత్రం చేతిలో చెయ్యి వేసుకొని ఊహా లోకంలో మునిగిపోయి చేరుకుంటారు.)

యువతి: (ఏకాంతంగా ఉన్నట్లు గ్రహించి) చూడు, ఎవరూ లేరు. మనం మాత్రమే ఉన్నాం. మిగతావాళ్ళ గొడవ మన కెందుకూ? మనం హాయిగానే ఉన్నాంగా!

యువకుడు: (ఎదురుగా ఉన్న ఇల్లు చూస్తూ) ప్రియా! ఆ యిల్లు చూడు. మనలను పిలుస్తున్నట్లుగా లేదూ? ఇంతకంటె మరేం కావాలి! మనకు ఒక అనువైన ఆశ్రయం దొరికింది. మన అన్యోన్యతకు ఏ అడ్డంకీ లేనట్లు నాకు అనిపిస్తుంది. మనది మచ్చలేని జంట. మిగతావారు ఎక్కితే ఎక్కుతారులే. ఆ కఠోర సత్యాన్ని వాళ్ళనే కనిపెట్టనివ్వు. మన సత్యమేదో మనం కనిపెట్టాంగా!

యువతి: ప్రియతమా, మనం ఆ ఇంట్లో విశ్రమిద్దాం. దేన్నీ పట్టించుకోకుండా ప్రేమనే ఆస్వాదిద్దాం.

(చేతిలో చెయ్యి వేసుకుంటూ ఆ ఇంటి వైపు నడుస్తారు)

ఆరవ మజిలీ

(మార్గం పోను పోను అతి ఇరుకుగా వుంటుంది. పోయి పోయి ఒక పెద్ద బండరాయి వద్ద ఆగిపోతుంది. ఆ రాయి ఎత్తు చెప్పటం కష్టం. దాని పై భాగం చూపులకు అందదు. ఎడమ ప్రక్కగా ఒక విధమైన పీఠభూమి. దాని చివరన ఒక చిన్న కుటీరం కనబడతాయి. అంతా నిర్మానుష్యం. బృందంలోని సన్యాసి ఆగి, ఇతరులను ఆగమని సైగ చేస్తాడు.)

సన్యాసి: చూడండి, మీకో ముఖ్యవిషయం చెప్పాలి. వింటున్నారా? మీకే చెప్పేది. మన ఆరోహణలో నాకు ఆత్మసాక్షాత్కారం కలిగింది. నా ఆత్మను నేను దర్శించాను. అనిర్వచనీయమైన శాశ్వతత్వంలో ఐక్యమైపోయినట్లు నా కనిపించింది. మిగతాదంతా నాకు ఉన్నట్లే అనిపించటం లేదు; అవసరం లేదు కూడా. దానికి భిన్నంగా ఉన్నదంతా ఒక భ్రమ; అనవసరం. కనుక నేను గమ్యం చేరాననే భావిస్తున్నాను. (ఎడమన ఉన్న సమతలం వైపు చూపిస్తూ) ఇక్కడే వుంది దివ్యమైన ఏకాంతం. ఇక నుంచి గడిపే జీవితానికి అనువైనది. శేషజీవితం ఇక్కడే గడుపుతాను. జీవించవలసిన అవ

సరం నుండి విముక్తి పొంది కాలం గడుపుతాను.

(మరో మాట లేకుండా, కనీసం ఎవరికీ వీడ్కోలు చెప్పకుండా, తిరిగి చూడకుండా తన వ్యక్తిగత లక్ష్యసాధనకై సూటిగా ముందుకు సాగిపోతాడు. అతని విశిష్ట సంకల్పాన్ని గమనించి చలించిపోయిన మిగతా జిజ్ఞాసువులు ఇద్దరూ ఒకళ్ళ ముఖాలు ఒకళ్లు చూచుకుంటారు, కాని త్వరలోనే తేరుకుంటారు. ఇంతలో వాళ్ళలో ఉన్న యువతి గట్టిగా అంటుంది)

రెండవ జిజ్ఞాసువు: కాదు, కాదు; అది సత్యము కానే కాదు. పరిపూర్ణ సత్యం కాదు. విశ్వసృష్టి కేవలం తప్పించుకోవలసిన ఒక భ్రమ కాదు. అసలు మనం గమ్యాన్ని ఇంకా చేరుకోనే లేదాయె. మన ఆరోహణ పూర్తి కాలేదు కూడా.

మొదటి జిజ్ఞాసువు: (నిటారుగా ఉన్న శిఖరం మొదట్లో ఆగిపోయిన దారిని చూపిస్తూ) ఇక్కడ దారి ఆగిపోతుంది. ఇంత కంటె ముందుకు పోయిన వారెవరూ ఉన్నట్లు లేదు. అసాధ్యమైన ఈ శిఖరాన్ని అధిరోహించాలంటే ఒక్కో మెట్టూ మనంతట మనంగా — ఏ మార్గదర్శి లేకుండా — మన మార్గాన్ని మనమే అన్వేషించుకోవాలి. మన మార్గం మనమే నిర్మించుకోవాలి.

రెండవ జిజ్ఞాసువు: దానికేంలే. సర్వదా ముందుకు సాగిపోదాం. మనం అన్వేషించాల్సింది ఇంకా మిగిలే ఉన్నది. ఈ సృష్టికి వెనుకన ఉన్న పరమార్థాన్ని అన్వేషించాలి.

(వాళ్ళు మళ్ళీ ప్రయాణం ప్రారంభిస్తారు)

ఏడవ మజిలీ

శిఖరాగ్రం

(ఇద్దరు జిజ్ఞాసువులూ అన్ని పరీక్షలూ ధైర్యంగా తట్టుకొని పట్టుదలతో శిఖరాగ్రం చేరుకుంటారు. ఆ చోటు అంతా దేదీప్యమానమైన కాంతిపుంజాలతో నిండి ఉంది. వాళ్ళు నుల్చొని ఉన్న చాలీ చాలని శిఖరాగ్రం తప్ప మిగతా ఎక్కడ చూచినా కాంతిపుంజమే గోచరిస్తుంది.)

మొదటి జిజ్ఞాసువు: ఎట్టకేలకు శిఖరాగ్రం చేరుకున్నాము. అంతటా మిరుమిట్లు గొలిపే సత్యతేజస్సు! ఇది మినహా ఏమీ కనబడడం లేదు.

రెండవ జిజ్ఞాసు: అంతా అదృశ్యం అయింది. అతి కష్టంగా మనం ఎక్కిన మెట్లు కూడా కనబడటం లేదు.

మొదటి జిజ్ఞాసువు: అంతా శూన్యమే. కేవలం నిలబడే స్థలమే మిగిలి వుంది.

రెండవ జిజ్ఞాసువు: ఇప్పుడు ఎటు పోవాలి; ఏమి చేయాలి?

మొదటి జిజ్ఞాసువు: సత్యము ఇక్కడ ఉన్నది. కేవలం సత్యం మాత్రమే. అంతటా సత్యమే ఆవరించి ఉన్నది. అంతా సత్యస్వరూపమే!

రెండవ జిజ్ఞాసువు: దీన్ని తెలుసుకోవాలంటే ఇంకా ముందుకు పోవాల్సిందే. అందుకోసం ఇంకో రహస్యాన్ని కనుగొనాలి.

మొదటి జిజ్ఞాసువు: స్పష్టంగా ఇక్కడతో మన వ్యక్తిగత కృషి పరిసమాప్తి అవుతుంది. మరో శక్తి జోక్యం చేసుకోవాల్సిందే.

రెండవ జిజ్ఞాసువు: దైవకృప! దైవకృప మాత్రమే పని చేస్తుంది. ఈ అద్భుత కార్యం దైవకృప వల్లనే సాధ్యం.

మొదటి జిజ్ఞాసువు: (దిక్చక్రం వైపు చేతులు చాపి) చూడు, అటువైపుగా చూడు, దూరంగా! ఈ అంతులేని అఖాతం ఆవలివైపున దేదీప్యమానంగా అద్భుతకాంతితో అపురూపమైన ఆకారాలు! దేవుని కృపావృష్టి జాలువారిన ఆ దివ్యభూమి. అదో నూతన ప్రపంచం.

రెండవ జిజ్ఞాసువు: అవును, అదే! అక్కడకే మనం చేరాలి! కాని ఎలా?

మొదటి జిజ్ఞాసువు: మన గమ్యం అదే కాబట్టి మార్గం అదే అవగతం అవుతుంది!

రెండవ జిజ్ఞాసువు: అవును. దానికి అచంచల విశ్వాసం అవసరం. దైవకృపపై అనంతమైన విశ్వాసం ఉండాలి. మనం దైవానికి పూర్తిగా సమర్పించుకోవాలి.

మొదటి జిజ్ఞాసువు: అవును, దైవేచ్ఛను పూర్తిగా విశ్వసించి దానికి పరిపూర్ణంగా సమర్పించుకోవాలి. అదీ గాక, మనకు తెలిసిన మార్గాలన్నీ అదృశ్యమైనాయి కాబట్టి జంకూ గొంకూ లేకుండా పూర్తి విశ్వాసంతో ముందుకు దూకాలి.

రెండవ జిజ్ఞాసువు: అప్పుడే మనం చేరవలసిన గమ్యం చేరగలం.
(ముందుకు దూకుతారు)

ముగింపు మాటలు

సాఫల్యత
దివ్యకాంతుల ప్రపంచం

మొదటి జిజ్ఞాసువు: చివరకు ఇక్కడకు చేరగలిగాము. ఏదో అద్భుతశక్తి అదృశ్య హస్తాలతో మనలను ఇక్కడకు చేరవేసింది.

రెండవ జిజ్ఞాసువు: (అంతటా కలయజూస్తూ) ఎంతటి అత్యద్భుత కాంతి! మనం ఒక దివ్యజీవనం సాగించటం ఎలాగో నేర్చుకోవాలి!

(తెర పడుతుంది)

మూలం: శ్రీమాత
అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

నవయుగానికి భవిష్యద్దర్శన మార్గము

ఒక అసాధారణ మలుపు: ఒక నూతన జాతి ఆగమనము

ప్రపంచ చరిత్ర ఒక అసాధారణమైన మలుపు తిరిగే తరుణంలో మనం ఉంటున్నాము. ఎన్నడూ మానవజాతి ఇంతటి రక్తపాతం, గందరగోళ పరిస్థితి, ద్వేషపూరిత వాతావరణం అనుభవించి యుండలేదు. అయితే ఎన్నడూ కూడా మానవహృదయంలో ఇంత తేజోవహమైన ఆశాకిరణమూ ఉద్భవించలేదు. మన గుండె చప్పుళ్ళు వింటే మనకు అర్థమవుతుంది. న్యాయం, ధర్మం, సౌందర్యం, సహృదయ సౌభ్రాతృత్వాలతో వెల్లివిరిసే నూతన సామ్రాజ్యం ఏర్పడాలని ప్రతి హృదయం ఆరాటపడుతోందని. అయితే ప్రస్తుత పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. ప్రాతః కిరణాలు వెలువడే ముందుండే చీకటి గాఢాధికంగా ఉంటుందని మనకు తెలుసు కదా! రాబోయే అరుణోదయానికి ఇది చిహ్నం కావచ్చు. ఈ అంధకారం ఎన్నడూ

లేనంత దట్టంగా, భయంకరంగా ఉన్నట్లే, రాబోయే ఉషోదయం కూడా ఎప్పటికంటే ఎక్కువ వెలుగుతో, స్వచ్ఛంగా, తేజోమయంగా ఉంటుందేమో... ఈ దుస్వప్నాల రేయి గడిపేస్తే ప్రపంచం ఒక నూతన చైతన్యానికి మేల్కొనగలదు.

ఇప్పటి దాకా మనోశక్తితో ముడిపడి ఉన్న ఈ నాగరికత నాటకీయంగా ముగియనున్నది. పదార్థాన్నీ, జీవాన్నీ కూడా ఇంతదాకా శాసిస్తూ వచ్చిన మనస్సువల్ల ప్రపంచానికి ఒరిగిందేమిటని మనం ఇప్పుడు చర్చించటం లేదు. ఇక మీద ఒక నూతన పరిపాలన రాబోతున్నది — అదే, మానవ పరిపాలన ముగింపు; దైవపాలన ఆరంభం.

ఇటువంటి అత్యద్భుతమైన, అపురూప సమయంలో మనం భూమ్మీద నివసిస్తున్నా మంటే అది ఎంతటి అదృష్టమో! అయితే ఇటువంటి అపూర్వ పరిణామాలను ప్రేక్ష కులుగా చూస్తూంటే సరిపోతుందా? ఎవరైతే తనూ, తన కుటుంబంవరకే కాక విశాల హృదయంతో వ్యవహరిస్తారో, తన ఆలోచనలను తన స్వంతానికీ, సంప్రదాయ వ్యవహారాలకీ పరిమితం కాకుండా విస్తరిస్తారో, ఇంకా చెప్పాలంటే ఎవరైతే తమకూ, తమ కుటుంబానికీ, తమ దేశానికి మాత్రమే కాక, ప్రపంచం మొత్తం మానవుల రూపంలో ఉన్న ఆ సర్వవ్యాపక పరమేశ్వరునకే చెందినవారమని భావిస్తారో, వారు తెలుసుకుంటారు — తాము మానవత్వం కోసం, దివ్యమైన ఆ అరుణోదయం కోసం లేచి ఉద్యమించాలని.

అపరిచితము, కష్టము అయిన మార్గాన్వేషణలో మన పురోగమనాన్ని సాధ్య మైనంత స్పష్టతరం చేయటానికి ప్రయత్నిద్దాము.

భావి మానవుడు, అంటే అతీతమానవుడు ఏ విధంగా ఉంటాడోనని మనం రూపకల్పన చేసుకొనటంలో జాగ్రత్త పాటించాలి. ఎందువల్లనంటే ప్రస్తుత మానవునే మచ్చుగా తీసుకొని, మరింత పరిపూర్ణతతో అభివృద్ధి చేయటం కాదు. ఈ పొరపాటు చేయకూడదనుకుంటే జీవన పరిణామక్రమం చెప్పే పాఠాలను అధ్యయనం చేయాలి.

భూమ్మీద, ఏదైన ఒక కొత్త జీవరాసి ఉత్పన్నమైనదంటే, దాని అర్థం ఒక నూతన సూత్రము, నూతన చైతన్యస్థాయి, ఒక నూతన శక్తి ప్రకటితమౌతుందనే విషయం మనం లోగడ తెలుసుకున్నాము. ఎప్పుడైతే ఈ నూతన జీవరాసి ఇంతవరకూ అవ్యక్తంకాని చైతన్యాన్ని, శక్తిని సంతరించుకుంటుందో, గతంలోని తన పరిపూర్ణ ప్రత్యేక లక్షణాలను కొంతగానీ, చాలావరకు గానీ కోల్పోవచ్చు. ఉదాహరణకు

ప్రకృతి పరిణామంలోని చివరి దశలో మానవునికీ, అతని ముందున్న జాతి కోతికీ మధ్య నుండే గొప్ప భేదం ఏమిటి? కోతికుండే ప్రాణికశక్తి, బలము, పరిపూర్ణప్రాణ ప్రొత్త జీవరాశియైన మానవుడు వదులుకున్నాడు కదా! అత్యద్భుతంగా చెట్లెక్కడం, మొగ్గలు వేయడం, పెద్ద పెద్ద గోతులను అవలీలగా దాటడం, శిఖరాల మీద గెంతటం మానవుడు చెయ్యలేడు కదా! అయితే దానికి బదులుగా అతనికి మేధాశక్తి, తార్కికంగా ఆలోచించడం, సంయోగపరచడం, ప్రయోగాత్మకంగా ఉండటం సొంతమైంది. నిజానికి మానవునితోనే మనోమయ జీవనం భూమ్మీద ఆవిర్భవించింది. ముఖ్యంగా మానసికజీవిగా ఉన్న మానవుడు తనకు శక్యమైనవి తనతో ఆగకుండా తనలో ఇంకా ఇతర లోకాలు, శక్తులు, ఇతర చైతన్యస్థాయిలు ఉన్నట్లు భావిస్తున్నాడంటే అవి భవిష్యత్తుకు సంబంధించిన వాగ్దానాలే. ఏ విధంగా కోతిలో మానసికశక్తులు గుప్తంగా దాగి ఉన్నాయో, అదే విధంగా మానవునిలో భవిష్యత్ మానవుని సంభావ్యతలు కూడా ఉన్నాయి.

మన లోకానికి అతీత ఆధ్యాత్మిక ప్రపంచంలో నివసించే మనుష్యులు కొంతమంది మన మధ్యే ఉంటారు. అటువంటివారు కొద్దిమందే అయినా వారు అపురూపంగా ఉన్నప్పటికీ మానవజాతికి మార్గదర్శకులై భవిష్యత్పరిణామ దిశగా కొంతమందిని నడిపిస్తారు. కాలగతిలో అక్కడా అక్కడా కొద్దిమందిలో మాత్రమే మూర్తీభవించి ఉన్న ఆ గుణగణాలు ఆవిర్భవించనున్న నూతనజాతికి ప్రధాన లక్షణాలు కాగలవు.

ప్రస్తుత మానవుని జీవనవిధానం తర్కానికి లోబడి నడిచేది. మనస్సు ప్రధానంగా అతని చర్యలు సాగుతాయి. అన్నిటినీ పరిశీలిస్తూ, జ్ఞానాన్ని పొందుతూ, నిర్ణయాలు చేస్తూ తనకి కావలసిన విధంగా జీవితాన్ని గడుపుతాడు. కానీ భవిష్యత్తులో అలా కాకుండా ఉపజ్ఞ (అంతర్బుద్ధి) జాతిని నడిపిస్తుంది. అంటే మనస్సు, ఆలోచనలతో నిమిత్తం లేకుండా అంతరంగ దైవసూత్ర నిబద్ధమై జాతి నడుస్తుంది. ఇప్పుడు కూడా కొంతమంది ఆ విధంగా అంతర్బుద్ధి అనుభవమునకు నిబద్ధులైన వారున్నారు. — కొన్ని రకాల అడవి గొరిల్లాలకు కొద్దికొద్దిగా తార్కికమైన ప్రవర్తన ఉండటం నిస్సందేహమైన విషయమే కదా!

అంతర్గతంగా ఆత్మాభివృద్ధి చేసుకున్న కొద్దిమంది మానవులు తమ సర్వశక్తులతో కృషిచేసి వారి సత్తాయొక్క నిజసూత్రాన్ని కనుగొన్నవారు, కొంతవరకు అంతర్బుద్ధి కలిగి ఉంటారు. గాలిలేక స్తంభించినప్పుడు నిశ్చలమైన కొలనులో ఏ విధంగా

నక్షత్రకాంతి ప్రదీప్తమౌతుందో అలానే మనస్సు నిశ్శబ్దంగానూ, బాగా శుభ్రపరచిన అద్దం మాదిరి స్వచ్ఛంగానూ ఉన్నప్పుడు అతిమానసకాంతి, అందలి సత్యము దానిపై పడి, ఆ అలజడిలేని మనస్సులో దీపించి, అంతర్బుద్ధిని జనింపచేస్తుంది. ఆ నిశ్శబ్దంలో ఆ స్వరాన్ని ఎవరైతే వినగల్గుతారో వారు దానిని తమ చర్యలకు తగిన ప్రేరణగా భావిస్తారు; సాధారణ మానవులు వారి తర్కాన్ననుసరించి గజిబిజి మార్గంలో ఇటూ అటూ తిరుగుతూండగా, వీరు మాత్రం అంతశ్చేతన చూపే మార్గంలో తిన్నగా వెళ్ళగలుగుతారు. ఈ అంతర్బుద్ధి ఒక వరంగా లభించే ఉపజ్ఞ. అది ఒక సుస్థిరమైన, అమోఘమైన చేయూత.

ఈ అమోఘమైన శక్తి ప్రస్తుతం అస్వాభావికంగా కనుపించినా, భవిష్యత్ జాతికిది సాధారణం, స్వాభావికం కాగలదు. అయితే నిరంతరం దాని వాడుక సాధారణ మనో తర్కసామర్థ్యానికి నష్టకారి అవుతుందేమో! కోతికున్న శారీరకసామర్థ్యం మానవునికి లేకుండాపోయినట్లే, మానవుని మానసిక సమర్థత అతిమానవుడు పోగొట్టు కుంటాడు. అయితే ఇప్పుడున్న ఆ మానసిక సామర్థ్యం తననూ, తన తోటివారినీ మోసగించుకోటానికే గదా!

ఎప్పుడైతే మానవుడు ఇప్పటిదాకా తాను అభివృద్ధి చేసుకున్నాననుకుని గర్వ పడుతూ చెప్పుకుంటున్న తన సామర్థ్యాలన్నీ — తన మేధస్సుతో సహా సరిపోవని గ్రహించి ధైర్యంగా వెల్లడి చేస్తాడో, అప్పుడే అతిమానసత్వానికి మార్గం అతనికి సుగమమవుతుంది. ఇక అప్పటి నుంచీ తన అంతర్గత పేటిక తెరిచి అందులో నిగూఢమై యున్న గొప్ప శక్తుల నన్నిటినీ ఆవిష్కరించుకొని విడుదల చేయటమే అతని ముఖ్య కార్యక్రమం అవుతుంది. అంతవరకూ తాను అధ్యయనంచేసిన కళలు, తత్త్వశాస్త్రాలు, విజ్ఞానశాస్త్రం, నీతిశాస్త్రం, సాంఘికజీవనం మొదలైన ప్రముఖ సాధనాలన్నీ తన జీవితానికీ, తన మనస్సు తృప్తికీ పరిమితమై పోకుండా ఒక మహాసత్యాన్ని ఆవిష్కరించడం కోసమే వినియోగపడాలి. మానసిక జీవితపరిధుల వెనక మరుగైయున్న ఈ మహాసత్యంయొక్క శక్తిని మానవజీవితంలో ప్రవేశపెట్టాలి. ఈ ఆవిష్కరణమే మన ఉన్నత సత్తకీ, ప్రకృతికీ సరిపడిన కార్యక్రమము.

అయితే మనం ఇంకా ఆత్మోపజీవులం కాము; కాని కావాలి — అంటే నీషే కీర్తించిన బలమైన ప్రాణిక ఇచ్ఛాజీవులు కాకూడదు. ఆధ్యాత్మిక ఆత్మబలసంపన్నులు కావాలి. అతిమానస మానవత్వమును ప్రస్తావించినపుడు నీషే రూపకల్పన చేసిన

దృఢమైన, కాని, అసమగ్ర బాహ్య అతిమానస భావనకి సంబంధించిన గందరగోళం నుంచి బయటపడాలి.

నీషే పొరపాటు చేశాడు. దానిని మనం తిరస్కరించాలని అంటున్నాము. నీషే అతిమానవుడు అధిక బలాఢ్యుడు. ప్రబలమైన శక్తి. ఆ శక్తి బరువుకి మనిషిలోని ఇతర ప్రత్యేక లక్షణాలు అన్నీ అణగిపోతాయి. ఆలాటి అతిమానవవుడు మన ఆదర్శం కాదు. ప్రస్తుతం ఆరాధింపబడే ఆ అతిమానసశక్తి, ఇప్పుడు వెర్రితలలు వేసి వినాశకరశక్తిగా దేశాలను ఎలా నాశనం చేస్తున్నదో చూస్తూనే ఉన్నాము.

అది కానే కాదు; సంతతత పరిపూర్ణ ఆత్మవికసనమే అతీత మానవత్వానికి మార్గము. మనిషి ఆధ్యాత్మీకరణకు ఒదిగి ఉంటే, అంతా మారుతుంది, సుగమమవుతుంది. ఆధ్యాత్మిక మార్గాన్ననుసరిస్తూ ఆత్మసిద్ధిని పొంది, తనలోని సత్యాన్ని, తన సత్యస్వరూపాన్ని గుర్తించి, స్వతస్సిద్ధంగా దాని ముందు వినమ్రుడైనపుడు మానవుడు అధికాధిక పరిపూర్ణతను పొందగలడు. ఈ స్వతస్సిద్ధత అనేది జంతుప్రకృతి మాదిరిగా అంతర్బుద్ధి, సుప్తచేతనా కాదు, అంతర్ జ్ఞానము, ఒక సమగ్రమైన అంతర్వాణి.

దీనిని బట్టి నూతన యుగంలో భావిమానవతకు సహాయపడగలిగే వారెవరంటే ఆధ్యాత్మిక పరిణామమే మానవ భవితవ్యమనీ, అదే ముఖ్యావసరమనీ గుర్తెరిగినవారే. ప్రస్తుత మానవజాతి, ఆధ్యాత్మిక మానవజాతిగా మారిపోవాలనీ, ఏ విధంగా ఆది మానవుడు పశుస్వభావం నుంచి పూర్తి మానసికవికాసం పొందిన మానవునిగా పరిణామం చెందాడో అదే మాదిరి ఈ పరిణామం కూడా కొనసాగాలని గుర్తించినవారే ఆ వ్యక్తులు.

అటువంటివారు జాతిమతాలను ఎక్కువ పట్టించుకోకుండా ఎవరి నమ్మకాలను వారికి వదలిపెడతారు. కానీ ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్ళటానికే ఎక్కువ ప్రాధాన్యత నిస్తారు. ముఖ్యంగా బాహ్యవ్యవస్థలు, యంత్రాంగాల ద్వారా ఈ మార్పు తేవచ్చనే తప్పుడు ఆలోచన మాత్రం వారు చేయరు. ఎవరికి వారు అనుసరిస్తే తప్ప ఇది కార్యరూపం దాల్చదని వారికి పూర్తిగా తెలుసు.

ఈ విధంగా ఉన్న వ్యక్తులు అహంకారజనిత ప్రేరణలను, ఆచారవ్యవహారములను, స్వార్థపూరిత గమ్యాలను పూర్తిగా వదిలిపెట్టేస్తారు. పరిపూర్ణ నిష్కామకర్మయే వారిది. ఇహలోక పరలోకాలకు సంబంధించిన స్వలాభాపేక్షతో పనిచేయడం వారి

ఊహ కందనిది. ప్రతిఫలాపేక్ష లేకుండా ఏ పనినైనా భగవన్నిర్దేశితంగా, సంపూర్ణంగా, భేషజమేమీ లేకుండా ఆనందంగా చేస్తారు. ఆ విధంగా భగవత్ప్రేరణతో పనిచేస్తే, ఆ చేయడంలోని ఆనందమే వారికి పారితోషకము. తమ చైతన్యంతో, తమ సంకల్పంతో తమ లోని దివ్యతత్వంతో ఏకత్వాన్ని పొందటమే వారికి దక్కే ప్రతిఫలము.

ఈ విధమైన ఏకత్వంలోని అతీతమానవుడు తన సాంఘికస్థాయిని తెలుసుకుంటాడు. తనలోని దివ్యత్వాన్ని గుర్తెరిగినప్పుడు అదే దివ్యతత్త్వాన్ని అందరిలోనూ కూడా గుర్తుపట్టగలడు. తనలో తాను ఏకత్వాన్ని పొందినట్లు అందరిలో ఉండేది ఒకటిగా చూసి అందరితోనూ ఏకత్వాన్ని పొంది అంటే వారి తత్త్వంతోనే కాక అంతర్బాహ్యస్థాయిలలోనూ, ఆకృతులలోనూ కూడా ఏకత్వాన్ని పొందుతాడు. అతను ఒక మనస్సు, ప్రాణం, శరీరము కాకుండా ఎరుక కలిగి ఆధారభూతమైన ప్రత్యగాత్మే. అదే మౌనంగా, ప్రశాంతంగా ఉండే మనఃప్రాణదేహాలను పాలించే శాశ్వతతత్త్వము. ఆ తత్త్వమే సకల జీవరాసులను పోషిస్తూ, పాలిస్తూ ఉండటాన్ని అతడు దర్శిస్తాడు. తనలోని ఆ పరతత్త్వమే సృష్టికి మూలాధారమై సర్వప్రాణులలోనూ కర్తగా ఉండి వారిని నడిపిస్తోందనీ తెలుసుకుంటాడు. ఈ విశ్వంలో అభివ్యక్తమైన సకల ఆకృతులూ ఆ దైవస్వరూపాలనే విషయం గ్రహిస్తాడు. అలా గ్రహించి ఆ పరమాత్మలో లీనమై, తన తనువూ, మనసూ, ప్రాణం ఆయన ప్రకటనలేననీ, ఆ విధంగా ఇతరులుగా కనబడేవారు కూడా తన మనసూ, ప్రాణం, దేహంగానే ఉన్నట్లు, అనుభూతిని పొందుతాడు. వారితో సమంగా ఉంటాడు. అందరిలోని ఏక చైతన్యాన్ని గుర్తిస్తాడు. పదార్థమంతా ఒకటిగా అనుభూతి పొందినప్పుడు తన శరీరానికీ, ఇతర శరీరాలకీ తేడా అతనికి తోచదు. సర్వజీవకోటి యొక్క మనస్సుతో, హృదయంతో ఏకత్వాన్ని పొందుతాడు. ఇంతెందుకు, తననే అందరిలోనూ, అందరినీ తనలోనూ దర్శిస్తూ, పరిపూర్ణ ఏకత్వంలోనే నిజమైన ఐకమత్యముందనే విషయం గ్రహిస్తాడు.

అతీత మానవుని గురించిన మొట్టమొదటి వివరాలన్నిటినీ వర్ణించాము కాబట్టి ఇంతటితో ఆపటం మంచిది. ఇంతకంటే ఎక్కువ వివరించడం నిరర్థకమే కాక నిరుపయోగమని కూడా తెలిసింది. మనం ఎన్ని రకాలుగా నిర్దుష్టమైన ఊహాగానాలు చేసినప్పటికీ ఆ భావిమానవుని రూపొందిచలేము. మనం ఏం చేయాలంటే పరమోత్సాహంతో మనస్ఫూర్తిగా ఆకాంక్షించడం వల్ల కలిగే అప్రతిహత ప్రేరణ క్రియాశీలత

లను మనస్సులోను, హృదయంలోను నిలుపుకొని, పృథ్విపై ఆవిర్భవించనున్న నూతన జాతిని గురించిన ఉన్నత భావన పొందగలిగే స్థితిలో ఉండాలి. అప్పుడు మనం నూతన మానవుల రూపకల్పనలో నిర్ణయాత్మకంగా ముందుకు సాగగలము; మానవత్వాన్ని పరిరక్షించగల జాతిని సృష్టించడంలో మధ్యవర్తులుగా మన వంతు సేవచేయగల అర్హతను సంపాదించగలము.

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

ఔషదంతో వ్యాధి నివారణ

(మొదటి భాగం)

ఆలోచనలు — సూక్తులు

385. రోగి యొక్క మనసు అతని శరీరంలోని జబ్బు మీదే లగ్నం అయి ఉండడం వల్ల, ఆ రోగం అనవసరంగా సుదీర్ఘకాలం పొడిగింపబడి, ఆ పరిస్థితి అంత ప్రమాదకరం కాకపోయినా, చివరకు మృత్యువుకు గురిచేస్తుంది.

386. మానవాళికి వైద్యవిజ్ఞానం ఒక ఆశీర్వాదం కన్న శాపంగా పరిణమించింది. అంటువ్యాధుల తీవ్రత యొక్క ప్రభావాన్ని తగ్గించి, అద్భుతమైన శస్త్రచికిత్సను ప్రాచుర్యంలోకి తెచ్చింది. కాని, దానితోపాటు మనిషి యొక్క సహజ ఆరోగ్యాన్ని బలహీనపరచి మనిషి రోగాలను అధికతరం చేసింది. మనసులోను, శరీరంలోను భయం, అన్యాధీనత అన్న విత్తులను నాటింది. మనలోని సహజమైన ఆరోగ్యశక్తి మీద కాక సత్తువ, రుచి లేని ఖనిజ, వృక్షాలపై ఆధారపడుటను నేర్పింది.

387. ఓ రోగానికి ఓ మందుని లక్ష్యంగా పెట్టుకుంటాడు వైద్యుడు. ఒక్కోసారి అది పనిచేస్తుంది, ఒక్కోసారి పనిచేయదు. ఆ నయం చేయని మందులను లెక్కలోకి తీసుకోకుండా, కుదిర్చినవాటిని మాత్రం సమీకరించి ఒక శాస్త్రంగా క్రమబద్ధం చేస్తారు.

388. నాటువైద్యుణ్ణి నమ్ముతున్నారని ఆదివాసుల్ని గేలి చేస్తాం, కాని వైద్యుల్లో నమ్మకమున్న నాగరికులు మాత్రం మూఢనమ్మకాలు తక్కువగా వున్న వారెలా అవుతారు? ఆ ఆదివాసి ఒక మంత్రోచ్చారణ చేయడంవల్ల ఓ రకమైన జబ్బు నయమౌతుందని తెల్సుకుని, దాన్ని నమ్ముతాడు. ఈ నాగరికుడైన రోగి వైద్యుడు నిర్ధారించిన ప్రకారం మందు వేసుకుంటే, ఓ రకం జబ్బు నుంచి తేరుకుంటానని తెలుసుకుంటాడు. అతడూ నమ్ముతాడు. తేడా ఏముంది?

389. ఉత్తర భారతదేశంలోని ఓ గోవుల కాపరికి జ్వరం వచ్చినపుడు, అతడు చల్లని నదీప్రవాహంలో ఓ గంట కూర్చుని, సేదతీరి, ఆరోగ్యంతో లేస్తాడు. అదే చదువుకున్నవాడు ఆ విధంగా చేస్తే, ఇక ఈ భూమ్మీద ఉండడు. ఆ ఔషదం యొక్క గుణం ఒకరిని చంపి, మరొకరిని బాగు చేస్తుంది అని కాదు కాని మన శరీరాలు తీవ్రమైన మానసిక ప్రబోధాలతో తప్పుడు అలవాట్లకు ప్రభావితమయినందువల్ల.

390. నిజానికి రోగాన్ని నయం చేసేది మందు కాదు; రోగికి వైద్యుడిచ్చే మందు కన్నా ఆతని మీద విశ్వాసమే. ఈ రెండూ, వారంతటవారే నాశనం చేసుకున్న సహజమైన స్వీయ ఆత్మశక్తికి, వికృతమైన ప్రత్యామ్నాయాలు.

391. మానవాళికి అత్యంత ఆరోగ్యకరమైన యుగాలు — అతి తక్కువ భౌతికమైన నివారణలున్న కాలాలే.

392. ఈ భూమ్మీద దృఢమైన మంచి ఆరోగ్యంతో ఉన్న జాతి ఆఫ్రికాలోని ఆది వాసులు. అయితే వాళ్లు కూడా, వారి భౌతికచైతన్యం నాగరికుల మానసిక భ్రంశం వల్ల కలుషితమైనప్పుడు, ఎంత కాలం ఆ విధంగా నుండగలరు?

393. మనలో నున్న దివ్య ప్రదాత ఇచ్చిన ఆరోగ్య సంపదనే మన రోగాలు నయం చేసుకునేందుకు ఉపయోగించుకోవాలి. అయితె గాలెన్, హిప్పోక్రట్స్ (Galen & Hippocrates) మరియు వారి అనుయాయులు దానికి బదులుగా

మందులనే రక్షణ కవచాన్ని మరియు మూర్ఖమైన ప్రాచీన లాటిన్ భాషాంతర మంత్రతంత్రాలను, మన శారీరక స్వస్థతకు ప్రామాణికంగా అందించారు.

394. వైద్యశాస్త్రం యొక్క ఉద్దేశ్యం మంచిదే, దాన్ని వృత్తిగా చేపట్టినవారు తరుచుగా దయకల్గినవారే. ఆత్మ త్యాగానికి కూడ అప్పుడప్పుడు వెనుదీయరు. కాని అజ్ఞానుల మంచిభావన వారికి హాని కలిగించకుండా ఎప్పుడు కాపాడింది?

395. అన్ని వైద్యసిద్ధాంతాలు పటిష్ఠమైనవిగా ఉండి, అన్ని చికిత్సలు స్వతహాగా ఫలవంతమైనవే అయినా, సహజ ఆరోగ్యాన్ని, జీవశక్తిని కోల్పోయిన మన్ని అవి ఎలా ఊరడించగలవు? ఉపాస వృక్షం యొక్క అన్ని భాగాలూ ధృడంగా ఉంటాయి, అయినా అది నిలువునా విషమే నింపుకుని ఉంటుంది.

396. మనలోని ఆత్మశక్తి ఒక్కటే అత్యంత నైపుణ్యంగల వైద్యుడు. ఈ శరీరం దానికి విధేయతతో ఉండడమే నిజమైన సర్వరోగ నివారిణి.

397. మనలో ఉన్న దైవం అనంతమూ, స్వయం సాఫల్యమైన దివ్యసంకల్పమూ. ఈ మృత్యుభయం చేత బాధపడకుండా, ఏదో ఒక ప్రయోగంలా కాకుండా, ఒక నిశ్చలమైన సంపూర్ణ విశ్వాసంతో, మన బాధలన్నీ అతడికి వదిలిపెట్టగలమా? కోటాను కోట్ల డాక్టర్లకి మించిన నైపుణ్యత అతడిదని చివరికి మనకి తెలియకపోదు.

398. ఇరవైవేల జాగ్రత్తలతో ఆరోగ్యం రక్షింపబడుతుందన్నది వైద్యుల సిద్ధాంతం. అయితే, అది దైవం కాని, ప్రకృతి కాని, ఈ శరీరం కోసం నిర్దేశించిన సూత్రం కాదు.

399. ఒకప్పుడు మనిషి సహజంగా ఆరోగ్యవంతుడు. బాధను సహించగలిగితే అతడు తిరిగి ఆ ప్రాథమిక స్థితికి వెళ్ళగలిగేవాడు. అయితే వైద్యవిజ్ఞానం మన శరీరాన్ని లెక్కలేనన్ని మందుల కట్టలతో వెంటాడి క్షుద్రార్తమైన సూక్ష్మజీవుల గుంపులతో భావనాశక్తి పై దాడి చేస్తుంది.

400. ఆ భూతం లాంటి సూక్ష్మజీవుల ముట్టడి నుంచి రక్షించుకుంటూ ఈ జీవితాన్ని గడుపుట కంటే, మరణించి ఈ గొడవ నించి తప్పించుకోవటమే మంచిదనుకుంటాను. అది మూర్ఖమూ, అజ్ఞానమూ అనుకన్నా సరే, ఆ దట్టమైన అంధకారాన్ని ఆనందంగా కౌగలించుకుంటాను.

401. శస్త్రచికిత్స వైద్యులు శరీరాన్ని కోసి, వికలాంగులను చేసి, రక్షించి, నయం చేస్తారు. అంతకన్న ప్రకృతిలో ప్రత్యక్షంగా ఉన్న అత్యంత శక్తివంతమైన ఔషధాలను, చికిత్సలను కనుక్కొనే ప్రయత్నం ఎందుకు చేయకూడదు?

402. మందులకు బదులుగా తన్ను తాను నయం చేసుకోడానికి చాలా కాలం పడుతుంది. ఆ భయంచేత, తన మీద తనకు నమ్మకం లేక, అసహజమైన మందుల మీద ఆధారపడటం మన శరీరాలకు మరియు మన మనసులకు, ఈ వైద్యవిజ్ఞానం బాగా అలవాటు చేసింది. అదే మన రెండవ ప్రకృతిగా తయారు చేసింది.

403. మందులు లేకుండా ఆరోగ్యంగా ఉండే ఆ కళని మన శరీరాలు నేర్చుకోకపోవడం వల్లనే, మనకు అనారోగ్యం వచ్చినపుడు మందుల అవసరం తప్పదు. అప్పుడు కూడా, ఒక్కొక్కసారి డాక్టర్లు ఆశ వదిలి చేతులు దులుపుకున్నప్పుడు, ప్రకృతి సహకరించి ఆ క్షణంలో ఆ ప్రాణాన్ని నిలబెట్టడం మనం చూస్తాం.

404. మనలోని ఆ రోగనిరోధక శక్తిని నమ్మకపోవడమే మనం భౌతికంగా స్వర్గం నుంచి పతనమవడం. వైద్యవిజ్ఞానం, దురదృష్టకర వారసత్వం, అనబడే ఇద్దరు దైవదూతలు మన పునఃప్రవేశాన్ని అడ్డుకునేందుకు స్వర్గద్వారం దగ్గర నిలిచి వుంటారు.

405. వైద్యవిజ్ఞానం శరీరానికి ఎలాంటిది అంటే, ఒక మహాశక్తి అల్పజీవికి రక్షణ కల్పించుట ద్వారా దానిని నిర్వీర్యపరచినట్లుగానో లేక దయాళువైన దొంగ తన బాధితుడిని ముందుగా చావబాది, అమితంగా గాయపరచి తదుపరి వాడి గాయాలకు చికిత్స చేస్తూ, వాడికి స్వస్థత చేకూర్చడానికై తన జీవితకాలం సేవ చేయబూని నట్లుగానో ఉంటుంది.

406. దేహాన్ని కేవలం కష్టపెట్టలేనపుడు, కేవలం విషతుల్యం చేయలేనపుడు మాత్రమే మందులు తరచుగా నయం చేస్తాయి. అది కూడా వ్యాధి పైన వాటి భౌతికమైన దాడికి ఆత్మశక్తి తోడైనపుడు అది ఫలిస్తుంది. మరి అదే శక్తిని సర్వస్వతంత్రంగా పనిచేయనిస్తే, మందులు ఒక్కసారిగా అవసరం లేనివిగా కనిపిస్తాయి.

*

381. నా శరీరతత్వం బలహీనమైనదని వాళ్లు చెప్తే, నలభై ఏళ్ళు నమ్మాను. పెద్ద, చిన్న అనారోగ్యాలతో ఎప్పుడూ బాధపడుతూ ఉండేవాడిని. అది ప్రకృతి ఏదో శాపవశాత్తు నా మీద వేసిన భారంగా భావించేవాడిని. నేను మందుల సహాయన్ని పూర్తిగా త్యజించాక, అప్పుడవి నిరాశపడ్డ పరాన్నభుక్కుల్లాగ నన్ను వదిలి వెళ్ళడం ప్రారంభించాయి. అప్పుడే నాలో ఉన్న ఆ సహజమైన ఆరోగ్య సంపద ఎంత శక్తివంతమైనదో , దైవం మన శరీరానికి, ప్రాణానికి ఆలంబనగా భావించి పంపిన మనసు నధిగమించిన ఆ సంకల్ప విశ్వాసాలు ఎన్ని రెట్లు శక్తివంతమైనవో, నా కర్థమయింది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

ఔషధంతో వ్యాధి నివారణ

(రెండవ భాగము)

జబ్బు, అపరిపూర్ణతకు లేదా బలహీనతకు లేదా హానికరమైనవాటితో సంసర్గానికి భౌతికప్రకృతి ఉన్మీలనమై ఉన్నదనటానికి చిహ్నం. తరచుగా అది కొంత అస్పష్టంగా దాగివున్న దానితో సంబంధం పెట్టుకోవడం లేదా నిమ్నప్రాణికం లేక భౌతికమనస్సు లేక మరెక్కడైనా కాని వైరస్యానికి కూడా కారణం కావచ్చును.

పూర్ణవిశ్వాసంతోను, యోగశక్తితోను లేదా దివ్యశక్తి ప్రవాహంతోను ఎవరైనా వ్యాధిని దూరం చేసుకోగలిగితే అది మంచిదే, కాని తరచుగా అది మొత్తం మీద సాధ్యం అయ్యే పని కాదు, ఎందువల్లనంటే ప్రకృతి సమస్తం ఉన్మీలనం అయి ఉండదు, లేదా శక్తికి స్పందించగలిగి ఉండదు. మనస్సు విశ్వాసం కలిగి ఉండి స్పందించవచ్చును, కాని నిమ్నప్రాణికం, శరీరం దానిని అనుసరించకపోవచ్చు.

లేక, మనస్సు, ప్రాణికం తయారుగా ఉంటే శరీరం స్పందించకపోవచ్చును, లేదా, పాక్షికంగా స్పందించవచ్చును. ఎందువల్లనంటే దానికి అటువంటి వ్యాధిని కలుగజేసే శక్తులకు ప్రతిస్పందించే అలవాటు ఉంటుంది. ప్రకృతిలోని భౌతికతకు ఉండే ఆ అలవాటు మొండితనంతో కూడుకుని లొంగని శక్తి. అటువంటి సందర్భాలలో భౌతిక పద్ధతుల ననుసరించవచ్చును; పూర్తిగా దానినే అసలైన నివారణ మార్గంగా కాకుండా, దైవశక్తి పనిచేయడానికి సహాయకారిగా లేదా భౌతికతకు ఆలంబనగా వాడుకోవచ్చును. ఔషధాలు బలమైనవి, తీవ్రమైనవి కాకుండా, శరీరాన్ని కలవరానికి గురిచేయకుండా ఉపయుక్తమైనవిగా ఉండాలి.

*

అల్లోపతి వైద్య సిద్ధాంతం ప్రభావవంతమైనదేగాని, తీరా దానిని వాడే సమయంలో ఎంతో తడబాటు, ఊహాపోహలు చోటు చేసుకుని దానినే సిసలైన శాస్త్రజ్ఞానంగా ఆమోదించలేని పరిస్థితి ఉంది. ఎంతో మంది విజ్ఞానశాస్త్రవేత్తలు (తదితరులు కూడా) వైద్యాన్ని విజ్ఞానశాస్త్రంగా పేర్కొనడాన్ని విని ఖిన్నులవుతారు. శరీరనిర్మాణ శాస్త్రం, శరీరధర్మ శాస్త్రం అనేవి సహజంగానే విజ్ఞానశాస్త్రాలు.

*

ఇంజక్షన్లు ఒక ఫాషన్. ప్రతిదానికీ "ఇంజక్షనివ్వండి, ఇంజక్షనివ్వండి, మళ్ళీ ఇంజక్షనివ్వండి" అనే మాటే వినపడుతుంది. వైద్యం ఈ ఆధునిక కాలంలో మూడు దశల గుండా ప్రయాణం చేసింది, మొదటిది (మోలియర్ రోజులలో మొదలయింది) 'కలుషిత రక్తాన్ని కార్చి తీసివేయడం, శరీరభాగాల శుద్ధిప్రక్రియ', తరువాత 'ఔషధం, ఆహారం', ప్రస్తుతం 'గడ్డకట్టని రక్తశోధన, ఇంజక్షను'. హతోస్మి, ఎంత గొప్ప వైద్యం! వ్యాధుల కోసమా? కాదు వైద్యుల కోసం. అయినప్పటికీ ప్రతి విధానంలో కొంత పాక్షిక సత్యం దాగి ఉంది. దేని లాభనష్టాలు దానికున్నాయి. ఏ విధంగా అయితే మతాలు, వేదాంతాలన్నీ వివిధ మార్గాలలో పరమాత్మ వైపే దృష్టి సారించుతుంటాయో, అదే విధంగా వైద్యవిధానాలన్నీ ఆరోగ్యానికి మార్గాలే, కాని అవేవీ ఎల్లప్పుడూ తమ లక్ష్యాన్ని అందుకోలేవు.

*

ధగద్ధగాయమానంగా వెలిగిపోతూ పట్టపగ్గాలు లేకుండా యున్న అల్లోపతి వైద్యానికి ఏమాత్రం విలువ నివ్వకుండా నేను కొన్ని వ్యాఖ్యలు చేసి ఉన్నాను. కాని ఇటువంటి

ప్రబలమైన వివాదాలు ఇప్పుడు నాకు ఏ మాత్రం ఉపయోగంగా అనిపించటం లేదు. నేను ఈ రెండు పద్ధతులు (అల్లోపతి, హోమియోపతి) పనిచేసే విధానాన్నీ, ఇంకా ఇతర విధానాల పనితీరునూ చూశాను. దేనిలోనూ ఏకైక సత్యం ఉన్నదనే దాని మీద నాకు విశ్వాసం లేదు. సాంప్రదాయ దృష్టికి ఎందుకూ కొరగానివై, పూర్తిగా వ్యతిరేకించబడినవి కూడా, వాటికి సంబంధించిన స్వీయసత్యంతో ఫలితాల నిస్తాయి. సాంప్రదాయ విధానాలు, సంప్రదాయ విరుద్ధమైన విధానాలు రెండూ కూడా విఫలమైపోతుంటాయి. సిద్ధాంతం అనేది ఒక ఉద్దేశాన్ని తెలుపుతూ ప్రకృతి అనుసరించే లేదా ప్రకృతి అనుసరించగలిగే విధానాలను మానవులు తమ అపరిపూర్ణ పరిశీలనాత్మక పద్ధతుల ద్వారా విశ్లేషించి రచించిన భావ-లేఖిని; అదే విధంగా, మరొక సిద్ధాంతం, మరొక విధమైన ఉద్దేశంతో ప్రకృతి అనుసరించే లేక అనుసరించగలిగే ఇతర విధానాలను కూడా పేర్కొంటూ వ్రాయబడిన భావ-లేఖిని. అల్లోపతి, హోమియో పతి, ప్రకృతి చికిత్స, ఎముక చికిత్స, కవిరాజి లేక ఆయుర్వేదం, అరబ్బీ వైద్యవిధానం (యునానీ) అనేవన్నీ ప్రకృతిపరంగా ఉండి, కొన్ని పద్ధతులను అనుసరించేటట్లుగా రూపొందించారు. ప్రతిదానిలోనూ జయాలూ ఉన్నాయి, అపజయాలూ ఉన్నాయి. ప్రతిదానిని దాని దోరణిలోనే పనిచేయనిద్దాం. నేను ఎటువంటి తగాదాలు, పరస్పర దూషణలు అవసరం అని అనుకోను. నా ఉద్దేశంలో అన్నీ బాహ్యంలో అనుసరించే విధానాలే. నిజంగా పనిచేసేవి మనకు అగోచరమైన తెర వెనుక శక్తులే; వాటి పని తీరులో, బాహ్య విధానాలు ఫలించనూవచ్చు, ఫలించకపోనూ వచ్చు. ఎవరైనా సరే, సరైన శక్తిని తమ పద్ధతికి సరైన వాహకంగా చేయగలిగితే అప్పుడు ఆ పద్ధతి సంపూర్ణంగా ప్రాణశక్తి కలిగినదై బలిష్టమవుతుంది; అంతకు మించి మరేమీ లేదు.

*

ప్రస్తుత కాలానికి నీవు చాలా వెనుకబడి ఉన్నావు. మందులూ ఒక మూలకమేననీ, అందులో మానసికతే ముఖ్యం కాగా, దాని ప్రభావమే అత్యధికంగా ఉంటుందనీ ఇప్పుడు వైద్యులు ఒప్పుకుంటూ, బాహటంగానే పత్రికాముఖంగా తెలియజేస్తున్నారనే సంగతి నీకు తెలియదా? నేను దానిని వైద్యులనుంచే తరచుగా విన్నాను, గొప్ప పేరుగల వైద్యులు వ్రాసినవి చదివాను. ఆ మానసికధర్మాలలో చాలా ముఖ్యమైనది వైద్యుని ఆశావహ దృక్పథం, తన మీద తనకు ప్రగాఢమైన నమ్మకం అని ఆ వైద్యులంటారు (ఆ మాటలన్ని అతని విశ్వాసానికి మరో పేరు, అవునా?) అతను

రోగిలోనూ, లేదా, అతని చుట్టూ నమ్మకం, ఆశ, అతని మానసికతకు పుష్టినిచ్చే వాతావరణాన్ని ప్రేరేపించగలడు. నేను దానిని చూశాను. సీదాసాదాగ చెప్పాలంటే, అది చేయగలిగిన వైద్యుడు, వైద్యం బాగా తెలిసి ఆ విధంగా చేయలేనివారికంటె ఎక్కువెక్కువగా సత్ఫలితాన్నందుకుంటాడు. ఔషధాలతో దానిని సాధించలేమనే విషయాన్ని నేను అనటం లేదు. కాని అది ఔషధాల సాయంతో చేయవలసివస్తే, సరైన ఔషధం సహాయకారి. కాని ఔషధం సరైనది కాకపోతే అది ప్రమాదాన్ని కలుగజేస్తుంది. అతని జ్ఞానం అంతఃస్ఫురణను కాదంటుందా? అల్లోపతి వైద్యుడు కూడా ఏ ఔషధం లేక ఏ రసాయనాలను కలిపి ఇవ్వాలనేది తరచు అంతఃస్ఫూర్తితోనే చేయవలసివస్తుంది. ఎవరైతే అంతఃస్ఫూర్తిని బాగా పొందగలరో, వారే బాగా సత్ఫలితాలనొందుతారు. సంప్రదాయశాస్త్రంలో కూడా అంతా ఒకే ఒక సూత్రం మీదను, లేదా, గ్రంథం మీదను, లేదా అలవాటు ప్రకారం దానిని చేసితీరాలనే నియమం మీదను చేయడం జరగదు.

*

ప్రశ్న: మేము వైద్యులం వాహకాలవలె ముఖ్యమైనవనారమైతే, రోగితో మేము వ్యవహరించేటప్పుడు మా వైఖరి ఏ విధంగా ఉండాలో మీరు తెలపాలి.

జవాబు: విశ్వాసం, నూతనత్వాన్ని ఆహ్వానించే తత్వం, అప్రమత్తత, ఏ మార్పునైనా ఆమోదించే మేధస్సు. విశ్వాసం అని నేను దేనిని అంటున్నానంటే, ఆ విశ్వాసం ముఖ్యంగా ఏ రకమైన ఫలితం పొందాలి, లేదా, సిద్ధించుకోవాలి అనే దానికి పనిచేసే క్రియాశీల విధానాల మీద ఉండాలి.

ప్రశ్న: మేము రోగి కోసం ఆకాంక్షిస్తూ అతనికి సహాయపడగలమా? దివ్యశక్తి అతనిపై అంతకు ముందే పనిచేస్తుండడం మూలాన, నా ఆకాంక్ష అతనికి ఏ విధంగా తోడ్పడగలదు?

జవాబు: చేయవచ్చును. స్వల్పమైన ప్రతిదీ సహాయపడుతుంది.

ప్రశ్న: వైద్యులు, ఆసుపత్రుల అవసరం అసలుందా అని నా కింకా ఆశ్చర్యంగానే ఉంది. దైవం తన శిష్యులను మానవజాతికి రోగనిదానం చేసేవారి వద్దకు పంపటమనేది చాలా విపరీతంగా లేదా?

జవాబు: ఎంత తెలివితక్కువ మాట! శక్తుల క్రీడతో నిండిన ప్రపంచమిది, వైద్యుడు ఒక శక్తి. అటువంటప్పుడు దైవం అతనిని ఎందుకు వాడుకోకూడదు?

దైవమే అంతా చేసేస్తే, ప్రపంచమే ఉండదని, కేవలం కీలుబొమ్మలతో ప్రదర్శన మాత్రం ఉంటుందనే విషయం నీకు తెలుస్తున్నది కదా!

ప్రశ్న: ఆంత్రపుచ్ఛం (అప్పెండిక్స్) లేదా శుక్లాన్ని కోసి తీసివేయడంలో వైద్యుడు శిక్షణ పొందనివాడైనా, యోగశక్తి అతనిని ఆ పని చేయడంలో సమర్థుణ్ణి చేస్తుందని మీరు అనుకుంటున్నారా?

జవాబు: పరమేశ్వరా! అది కాదు, వారి కళ్ళని బాగానే ఉండనీ. శక్తి ముందుగా తన పనిముట్టును తయారుచేయాలి. అదేమీ ఇంద్రజాలం మీద ఆధారపడింది కాదు. నీవు తగినంత ఉన్మీలుడవై ఉంటే, శక్తి నీలో అంతఃస్ఫూర్తిని, పనితనాన్ని వృద్ధిచేయగలదు. అవి ముందు నీలో లేకపోయినప్పటికి వృద్ధిచెందుతాయి. అదే లేకపోతే ఏమీ కాదు, అటువంటివి ఎప్పుడో ఒకసారి జరుగుతాయి. కాని అది అదే విధంగా పనిచేయాలనే నిర్దుష్ట విధానం దైవానికి ఏమీ లేదు.

*

సహజంగా ఎవరి పని వారికి తప్పక తెలిసి ఉండాలి. తాను చేయవలసిన పని ఏమిటో తెలిసి, దానితో పాటుగా గట్టి నమ్మకం, అంతఃస్ఫురణ ఉన్నవానికి, అది లేకుండా కేవలం తన పని మాత్రమే తెలిసినవానికీ, సహస్రం తేడా ఉంటుంది. నాకు తెలిసిన వైద్యులు కొంతమంది ఉన్నారు. వారికి అద్భుతమైన శాస్త్రజ్ఞానం ఉన్నా, అంతకంటె తక్కువ శాస్త్రజ్ఞానం ఉండి సాహసంతో నిర్ణయం తీసుకోగలిగి, చొరవ కలిగినవారి కంటె వారు తక్కువ ఫలితాలను చవి చూశారు....

తన మీద తనకు గట్టి నమ్మకం ఉన్న వైద్యుడు, తనకున్న శాస్త్రజ్ఞానం ప్రకారం అత్యుత్తమైనదానిని ఎంచుకుని పని చేస్తాడు; ఒక వేళ తాను ఎంచుకున్న మార్గం సరైనది కాదని తెలిసిన క్షణాన, వెంటనే విషయాన్ని సింహావలోకనం చేసుకుని తనను తాను సరిచేసుకుంటాడు. కేవలం హేతువు మీదనే ఆధారపడకుండా విషయాన్ని తరచి చూడగల దక్షతను తనలో పెంపొందించుకుంటాడు. ఆ విధంగా అనేక సందర్భాలలో అంతిమంగా తన పనిని సమర్థంగా చేయడంలో కృతకృత్యుడవుతాడు. నీవనేది అతను చేసే పని తప్పైతే చికిత్స పొందే రోగులను చంపుతాడనా. కాని సంశయాత్మకుడైన వైద్యుడు కూడా తన సంశయంతో అదే పనిని చేస్తాడు. ఉదాహరణకు, అత్యవసరమైన నిర్ణయం తీసుకోవలసిన సమయంలో తీసుకోలేకపోవటం.

ఇవన్నీ సర్వసాధారణమైన విషయాలు. నేను నిన్ను సత్వర నిర్ణయాలు తీసుకుని

ఆచరించేవారిని అనుకరించమనటం లేదు, ఎందువల్లనంటే వారికుండే సమయోచిత కార్యవిచక్షణ, నైపుణ్యం లేకపోతే నీవు అంతా అస్తవ్యస్తం చేస్తావు. 'స్వధర్మే నిధనం శ్రేయః (అది రోగి విషయంలోనే అనుకో), పరధర్మో భయావహః! [1]

ప్రశ్న: శ్రీమాత ఒక సందర్భంలో యోగం వల్ల నయం కాని జబ్బంటూ ఉండదు అని అన్నారు. దాని వల్ల కాన్సరు వ్యాధి నయం అవుతుందా?

జవాబు: తప్పకుండా నయమవుతుంది, కాని విశ్వాసం, లేదా, నూతనత్వాన్ని ఆహ్వానించే తత్వం, లేదా, రెండున్నూ ఉండే షరతు మీదనే. మానసిక సూచనలు సైతం కాన్సరును నయం చేయగలవు. అది సహజంగానే వారి అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది; ఒక స్త్రీ విషయంలో జరిగినదే దానికి ఉదాహరణ. వైద్యులు ఆమెకు చేసిన శస్త్రచికిత్స విఫలం కాగా, వారు ఆమెకు అంతా సవ్యంగా జరిగిందని అబద్ధం చెప్పారు. ఫలితం, కాన్సరు రోగలక్షణాలేవీ లేకుండాపోయినై. ఆమె చాలా సంవత్సరాల తరువాత పూర్తిగా వేరొక వ్యాధితో మరణించటం జరిగింది.

*

ప్రశ్న: శ్రీమాత ఒక పెద్ద ఆసుపత్రి కట్టిస్తున్నట్లు నేను కలగన్నాను. రాబోయే నూతన యుగానికి చెందిన కల ముందే వచ్చిందా?

జవాబు: ఆసుపత్రుల అవసరమే లేని, వైద్యులు తమ ఇంజక్షను సిరంజులను, ఇతర వాడి పరికరాలను ఫౌంటెన్ పెన్నులుగా మార్చుకోగలిగినప్పుడు, వాటిని కూడా దుర్వినియోగం చేయకుండా ఉండగలిగితే, అప్పుడది నిజంగా నూతన యుగానికి చెందిన కలే అవుతుంది.

ప్రశ్న:ఇంజక్షను పరికారాల మీద ఎందుకంతగా ఉగ్రులవుతున్నారు ప్రభూ ? అవి చాలా సమర్థవంతమైనవనే భావం ఉన్నది కదా!

జవాబు: అంతమాత్రాన ఆసుపత్రులు, వ్యాధులు, ఇంజక్షన్ల వృద్ధి నూతన యుగానికి ఆదర్శం.కాకూడదు.

ప్రశ్న: కాని ఆ పరికరాలన్నీ ఫౌంటెన్ పెన్నులుగా మార్చాలనే చతురత ఏమిటో?

జవాబు: నేను యేషయ ప్రవక్త "కత్తులు నాగేటి కర్రులుగా మారిపోగలవు"

---

[1] *స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః: 'స్వధర్మంలో మృత్యువైనా శ్రేష్ఠమే, పరధర్మాన్ని ఆచరించడం ప్రమాదభూయిష్ఠం' (గీత: 3, 35)*

అని చెప్పినదానినే తీసుకుని కొద్దిగా మార్పుచేసి చెప్పాను. వైద్యుల పరికరాలు నాగేటి కర్రులంత పెద్దవి కాదు కాబట్టి నేను వాటిని ఫౌంటెన్ పెన్నులుగా మార్చాను.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

బాధ, ఆవేదన నిర్మూలన

మనస్సు, శరీరం అనుభవించే భాధ ప్రకృతి తన ప్రయోజనం కోసం వాడుకుంటున్న ఒక కీలక సాధనం. ప్రకృతి తన ఊర్ధ్వ పరిణామ దిశ వైపు చేసే ప్రయాణంలో, నిర్దిష్టమైన రూపాంతర ప్రయోజనకు ఉపకరించే శక్తి బాధను వాడుకుంటుంది. ప్రకృతి కార్యకలాపాలలో దాగిన ఒక నిగూఢ శక్తి చేసే విలాసం అది. వ్యక్తి దృక్కోణంలో ఈ ప్రపంచం అనేకానేక శక్తుల సంక్లిష్ట సంఘర్షణ, ఖేలనం. ఈ సంక్లిష్టతల నడుమ పరిమితమైన శక్తితో పరిమితమైన అస్తిత్వరూపం వ్యక్తి. అనేక శక్తులు మనిషిని గాయపరుస్తాయి. ఛిన్నాభిన్నం చేస్తాయి. క్షీణింపచేస్తాయి. ప్రమాదకరమైన, హానికరమైన శక్తుల స్పర్శతో భౌతికంగా వెనుతిరిగిన ఒక ఆఘాతం నరాల ద్వారా వ్యక్తమవడం బాధ. ఉపనిషత్ పరిభాషలో అది జుగుప్సలో ఒక భాగం. తాను కానిది, తనలో సామరస్యంగా లేనిది అయిన తత్త్వం నుండి తన పరిమిత అస్తిత్వం కుంచించుకుపోవడమే బాధ. 'ఇతరుల' నుండి ఆత్మరక్షణ కోసం పుట్టిన ఒక ప్రేరణ. దీనిని ఎలాగో వదిలించుకోవాలి. జయప్రదంగా వదిలించుకోలేకపోతే రూపుమాపాలి. ఈ దృష్టితో చూస్తే, ప్రకృతి చేసే సూచన ఇది. జీవితం దానిలోకి ప్రవేశించనంత కాలం, ఈ ప్రపంచంలోకి అది అడుగుపెట్టలేదు. అప్పటివరకు యాంత్రికమైన పద్ధతులు సరిపోతాయి. జీవితం తన బలహీనతతో, అపరిపూర్ణతలతో భౌతిక ప్రపంచంలో ప్రవేశించినప్పుడు, బాధ తన ప్రతాపం చూపించడం ప్రారంభిస్తుంది. మనస్సు ఎదుగుదలతో ఈ బాధ కూడా పెరుగుతుంది. జీవ, శరీరాలతో మనస్సు బంధింపబడినంత కాలం, తన జ్ఞానం కోసం, కర్తృత్వం కోసం వాటిపై ఆధారపడినంత కాలం, వాటి పరిమితులకు లోబడివున్నంత కాలం, ఆ పరిమితుల నుండి పుట్టిన అహంకార ప్రేరణలకు, లక్ష్యాలకు లోబడివున్నంత కాలం, బాధ విశృంఖలంగా చెలరేగుతూనే వుంటుంది.

మనస్సు స్వేచ్ఛ పొందితే, అహంకారాన్ని త్యజిస్తే, అందరితో సామరస్యంగా వుంటే, విశ్వాంతర శక్తులతో సమరసభావంతో వుంటే, బాధ వినియోగం తగ్గుతుంది. దాని ప్రయోజనం చివరికి స్తంభించిపోతుంది. అది ప్రాచీన తరాల లక్షణంగా కొన సాగుతుంది. తన ప్రయోజనం దాటి బ్రతికే అలవాటుగా మారుతుంది. ఉన్నతశ్రేణి అపరిపూర్ణ నిర్వాహక వ్యవస్థలో నిమ్నస్థాయి చిహ్నంగా నిలిచిపోతుంది. భౌతికపదార్థానికి బానిసగా కాకుండా, మనస్సులోని అహంకార పరిమితులకు లోబడకుండా ఆత్మ అంతిమ విజయ ఆరోహణలో నెమ్మదిగా ఈ బాధ సమసిపోవడం ఒక ముఖ్యమైన విశేషమై తీరుతుంది.

ఇది సంభవమే. ఎందుచేతనంటే, బాధ సుఖం అన్నవి ప్రవాహాలు. ఒకటి అపరి పూర్ణం, మరొకటి వైకల్యం. కాని అది అస్తిత్వ మహానంద సాగరంలో ప్రవాహాలు. ఈ అపరిపూర్ణత్వానికి, వైకల్యానికి కారణం పరిమితం చేసే మాయ మనిషి జీవన చైతన్యంలో స్వీయ విభజనకు పాల్పడుతుంది. దీని పర్యవసానంగా వ్యక్తి విశ్వ జనీనంగా స్పర్శలు పొందకుండా అహంకారమయమైన, ముక్కలుగా మారిన స్పర్శలు స్వీకరించవలసి వస్తుంది. విశ్వజనీనమైన ఆత్మకు అన్ని వస్తువులలో, అన్ని స్పర్శలలో రసానందానుభూతి కలుగుతుంది. దీనినే సంస్కృతంలో రసభావం అంటారు. ఒక వస్తువులోని సారం, రుచి అని అర్థం. మనం ఆ వస్తువులోని సారాన్ని గుర్తించము. అది మన కోరికలను, భయాలను, ఆకాంక్షలను, మనలోని లోపాలను ప్రభావితం చేస్తుంది. అందువల్ల రసమయ అనుభూతి మనకు అందకుండా బాధ, ఆవేదన, తాత్కాలిక సుఖాలు, నిర్లక్ష్యం, రసభావాన్ని పొందలేని అశక్తత వంటి రూపాలు ధరిస్తుంది.

మన మనస్సు, హృదయాలలో నిరాసక్తత (విరాగ భావం) పెంపొందించుకుని, ఆ భావాన్ని మనలోని నాడీమండల అస్తిత్వానికి వర్తింపచేస్తే, అపరిపూర్ణ, వైకల్య రసరూపాలు నెమ్మదిగా రాలిపోతాయి. అది సాధ్యమే. అప్పుడు వివిధ రూపాలలోని అస్తిత్వ నిజ ఆనందం, నిజమైన రుచి మనకు తెలుస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. యజ్ఞన్న



అఖిల

అఖిలభారత పత్రిక

వేం 2011

కోరికల నుండి విముక్తి

విషయసూచిక

శ్రీమాత ప్రవచనాలు

శ్రీఅరవిందుల ప్రవచనాలు

అట్ట మీద పుష్పము

శ్రీమాత యొక్క ఆధ్యాత్మిక సంకేతము: జీవనశక్తి

బహుళార్థకమై శక్తివంతంగా అన్ని అవసరాలను నెరవేరుస్తుంది.

మనుషులు నిరంతరమైన కోర్కెలతో జీవిస్తుంటారు

శ్రీమాత: నా కొక వ్యక్తి జ్ఞాపకం వస్తున్నాడు. అతను చాలా కాలం క్రితం ప్రభుత్వ కార్యం మీద యిక్కడకు వచ్చాడు. అతనిని నాకు పరిచయం చేసి, అతనిపై నా అభిప్రాయం అడిగారు. అతను కూడా ఆశ్రమం గురించి, ఆశ్రమజీవితం గురించి నన్ను కొన్ని ప్రశ్న లడిగాడు. నా దృష్టిలో జీవితంలో అత్యంత ఆవశ్యక మయిన క్రమశిక్షణ ఏమిటని అడిగాడు. అతను రోజంతా పొగపీలుస్తూ అవసరమయిన దాని కన్నా ఎక్కువ మద్యం తాగుతూ ఉండేవాడు. అందువలన త్వరగా అలసిపోయి, తనపై తనకి నియతి లేకపోవటము వలన ఎప్పుడూ ఏదో ఒక ఫిర్యాదు చేస్తూండేవాడు. 'ముందుగా పొగపీల్చటం, మద్యం తాగటం మానెయ్యాలి' అని చెప్పాను. అతను నివ్వెరపోయి నమ్మలేనట్లుగా నా వైపు చూసాడు. 'మరి పొగతాగకుండా, మద్యం తీసుకోకుండా ఇంక జీవించటం ఎందుకు?' అన్నాడు. 'ఇంకా నువ్వు ఆ దశలోనే ఉంటే నేను చెప్పవలసినదేమీ లేదు' అని అన్నాను.

ఇలా మనమూహించిన దానికన్నా ఎక్కువ సార్లే జరుగుతుంది. మనకది చాలా అర్థరహితంగా కనిపిస్తుంది. ఎందుకంటే మనకి జీవితంలో ధూమపానం, మద్యపానాల కన్నా ఆసక్తికరమయిన, ఉన్నతమయిన ఆదర్శాలున్నాయి. కానీ అతి సాధారణమయిన వ్యక్తులకు జీవితపరమార్థమంటే కోరికలను సంతృప్తిపరచుకోవటమే. అదే వారి జీవితలక్ష్యం. స్వతంత్రతకు తార్కాణం.

*

ప్రశ్న: మధురమయీ, కొంతమంది పిల్లలు ఎప్పుడూ ఏదో ఒకటి, చూసినదల్లా కావాలని అడుగుతుంటారు?

శ్రీమాత: ఎందుకంటే వాళ్ళు కోరికలతో నిండి ఉంటారు కనుక. కామనా తరంగాలతో నిండి, ఆపై తమపై తమకి నియతి లేకపోవటం వలన, సులభంగా వ్యక్తం చేస్తారు. పెద్దవాళ్ళలో కూడా కోరికలుంటాయి. వాళ్లు తమ కోరికలని పైకి చెప్పటానికి సిగ్గుపడటం వల్లనో, లేదా ఎదుటివారు నవ్వుతారనే భయం వల్లనో బయటకు వ్యక్తం చెయ్యరు. పిల్లలలో ఈ అరమరిక లుండవు. చాలా కొద్ది మినహాయింపులతో ఎక్కువ శాతం వ్యక్తులు నిరంతరం ఎడతెగని కోరికలతో జీవిస్తుంటారు.

వాళ్లు పైకి వ్యక్తం చేయరు అంతే. తమలో తాము తెలుసుకోవటానికి కూడా సిగ్గు పడతారు. కానీ ఏదో కావాలనే కోరిక మాత్రం ఉంటుంది. ఏదయినా ఒక అందమయిన వస్తువును చూసినపుడు తక్షణమే దానిని పొందాలనే కోరికగా అనువదించబడుతుంది.

ఇది పూర్తిగా చిన్న పిల్లల మనస్తత్వమే. ఇది అపరిపక్వతే కాకుండా, అర్థరహితం కూడా, ఎందుకంటే నూటికి తొంభైసార్లు ఆ వస్తువును పొందిన తరువాత కనీసం ఆ వస్తువు వైపు చూడటం కూడా జరగదు. ఒకసారి వస్తువు స్వంతమయ్యాక అది ఎటువంటిదైనా దానిపై ఆసక్తి పోకుండా ఉండటం అరుదు.

*

కోరిక అనేది చాలా గూఢమయినది. నిమ్న ప్రకృతి యొక్క అగోచరమయిన చర్య ఇది. కోరికలు — అజ్ఞానము, బలహీనతల యొక్క చలనాలు. ఇవి మీ అజ్ఞానానికి, బలహీనతలకు మిమ్మల్ని కట్టి బంధిస్తాయి. కోరికలు తమలోంచే ఉత్పన్నమవుతాయని అందరూ అనుకుంటారు. అవి తమలోంచే వస్తున్నాయని, తమలోనే జనిస్తున్నాయనీ అనుకుంటారు. కానీ అది సత్యం కాదు. ఇవి నిమ్న ప్రకృతి అనే అస్పష్ట మహాసాగరం నుండి ఉద్భవించి ఒకరి నుండి ఒకరికి సంక్రమిస్తూ ఉంటాయి. ఇవి వ్యక్తిలో జనించవు. వ్యక్తులే ఈ కోర్కెల తరంగాలచే చుట్టుముట్టబడి, ఎవరైతే సుముఖంగా ఉంటారో, ప్రతిఘటించరో, వాళ్లు ఈ వెల్లువలో కొట్టుకుపోతారు. కామం వారిని ఆవరించి, అధీనపరుచుకొని, విచక్షణను పోగొట్టి, దానిని ప్రదర్శించడం వారి సహజ ప్రకృతే అనే భావనను కలిగిస్తుంది. నిజానికి వ్యక్తి నిజస్వభావానికి, కోరికలకు సంబంధం లేదు.

మూలము: శ్రీమాత

అనువాదం: డా. సరోజా ప్రసాద్

కోరికల నివారణ

కోరికలను సంతృప్తి పరచడం ద్వారా

"మనస్సు తన స్వంత ఆలోచనలనే అంటిపెట్టుకుంటుంది! ప్రాణికం తన స్వంత కోరికలకే ప్రాధాన్యమిస్తుంది!"* అలాంటప్పుడు, మనస్సు ప్రాణానికి భాగస్వామిగా మారి, తార్కికంగా, వివరణ ద్వారా సమర్థిస్తూ, కోరిక లుండటానికి అద్భుతమైన సంజాయిషీని ఇస్తుంది. కోరికలను సంతృప్తిపరచడమే వాటి నుండి విముక్తి పొందే పద్ధతు లన్నిటి కంటె విశిష్టమైనదని జనం చెప్పడం నేను విన్నాను. వాళ్లు దాన్నొక సిద్ధాంతం చేసేసారు. మీరు మీ కోరికల్ని తీర్చుకోడం మొదలుపెడితే అప్పుడు సహజంగానే మరి కొన్ని కోరికలు పుట్టుకొస్తాయి. కోరికల విషయాలకొస్తే ఒకటి తీరితే మరొకటి దాని స్థానంలో సులభంగా పుట్టుకొస్తూనే వుంటుంది. ఆ కోరిక తీర టానికి ప్రయత్నిస్తే మరొకటి. ఇలా మీరు ఈ పద్ధతిలో వంద జన్మ లెత్తాలి.

కోరికలకి లోబడిపోవడం వాటి నుంచి విముక్తికి మార్గం కాదు. వాటికి అంతుండదు. ప్రతి ఒక్క కోరిక తీరిపోగానే ఆ స్థానంలో మరొకటి. ఇలా అవి ఎడతెగకుండా గోల చేస్తూనే వుంటాయి.

కోరికలను జయించడం ద్వారానే వాటి నుంచి విముక్తి పొందగలం. నిమ్నప్రకృతి చైతన్యం నుండి ఉన్నత ప్రకృతి చైతన్యానికి యెదగడం ద్వారా మాత్రమే కోరికల్ని జయించి వాటినించి విముక్తి పొందగలం.

కోరికలను అణచిపెట్టడం ద్వారా

కోరికల్ని అణచివెయ్యడానికి ఆత్మనిగ్రహం బాగా ఉపయోగపడుతుందని చాలా పద్ధతుల్లో ఆ దిశగా ప్రయత్నిస్తారు. చాలా కాలం వరకు ఈ అణచివేతను కొనసాగిస్తే కోరికల్ని చంపడం సాధ్యం కావచ్చు. కేవలం భౌతిక ప్రపంచానికి సంబంధించిన

---

*శ్రీఅరవిందులు వ్రాసారు, "పరివర్తనామార్గంలో అడ్డుగా నున్నవి మూడు ప్రధానమైన అడ్డంకులు" అని. అందులో ఒకటి "స్వార్థపరత్వం – మనస్సు తన స్వంత ఆలోచనలకే కట్టుబడి ఉండటం, ప్రాణికం నిజమైన ఆత్మసమర్పణకన్నా స్వంత కోరికలకే ప్రాధాన్య మీయటం, భౌతికం స్వంత అలవాట్లకే అంటిపెట్టుకొని ఉండటం".

సమస్య అయినట్లయితే అది నిజం కావచ్చు. కాని భౌతిక ప్రపంచం వెనుక ఉపచేతనా ప్రపంచం వుంటుంది. ఉపచేతనా ప్రపంచం వెనుక గాఢనిశ్చేతన ఉంటుంది. మీకు తెలియనిదేమంటే మీ కోరికని మీలోనే సమూలంగా నాశనం చెయ్యకపోతే అది పెరిగి రూపం ఏర్పడటానికి బీజం అవుతుంది. అలాంటి రూపాన్ని దేనినైతే మీరు అభివ్యక్తం కాకుండా నిరోధించాలని చూస్తారో, అది ఉపచేతనలో అణగద్రొక్కబడి, అట్టడుగునకు తరమబడి, మీరు జాగ్రత్తగా వెతికినట్టయితే ఉపచేతనలో దాని పని అది చెయ్యడానికి సమయం కోసం వేచివుండటం చూస్తారు. అందుచేత ఎంతోమంది సాధకులు, ఏళ్ళ తరబడి అదుపులో వుంచగలిగిన ఒక పనికిమాలిన ప్రయత్నాన్ని అది ఎంత సుదీర్ఘ కాలం అదుపులో ఉందో, అంతకు మించిన వేగంతో విపరీతమైన తీవ్రతతో హఠాత్తుగా వురకలు వేస్తూ బయటపడటాన్ని చూసి విస్తుపోతారు.

కోరికల నివారణ అన్నిటి కంటె శ్రేష్టమైన పద్ధతి

సాధారణంగా సహజవాంఛలు, కోరికలు, ఉద్రేకాల నివారణ,ఇవన్నీ ఇంద్రియాలకి, జీవాత్మకి సంబంధించిన విద్య, సంస్కృతి సంస్కారాల ద్వారా సాధించగలగడం ఒక మంచి పద్ధతి. సహజవాంఛలు, కోరికలు, ఉద్రేకాలు వీటిని తొలగించుకోడానికి వాటిని నిరోధించకూడదు. వాటిని మచ్చికచేసి, జ్ఞానవంతం చేసి సంస్కరించాలి. ఇది కోరికల నివారణకి సరియైన, శ్రేష్ఠమైన పద్ధతి. జీవి యొక్క పురోగతికి, ఎదుగుదలకి సామరస్యపూర్వకమైన స్పందనకు, స్ఫూర్తికి పాటించవలసిన అత్యంత పరిణతి చెందిన విధానం, ఆ జీవి సంస్కారంలో, యెదుగుదలలో, విద్యలో ఒక భాగం. ఇది మనుషులు వారి మేధను వృద్ధిపరచి, నేర్చుకుని, చదివి, యోచించి, సరిపోల్చి అధ్యయనం చేయనట్లుగా ఉంటుంది. అలాంటివారి మనసులు విశాలమవుతాయి. వారు మానసికపరమైన విద్యగాని, అవగాహనగాని లేకుండా జీవించేవారి కంటె, అల్పమైన, సంకుచితమైన అభిప్రాయాలు కలిగినవారి కంటె ఎంతో విశాలదృక్పథంతో అర్థం చేసుకోగలుగుతారు. ఈ సంకుచిత స్వభావుల చైతన్యంలో ఒక్కొక్కసారి వైరుధ్య భావాలు పొడసూపి, వారు వాటికి పూర్తిగా లోబడతారు. ఎందుకంటే వాళ్ళ ఆలోచనలు అంత మాత్రమే. అవే సాటిలేని మేటివని, వారి జీవితాల్ని నడిపించవల సినవని అనుకుంటారు. బాగా శిక్షణ పొందిన అధ్యయనపరుల కంటె వీరు పూర్తిగా

సంకుచితమైనవారు, పరిమిత స్వభావులు. అయితే శిక్షణ పొందినవారు, అధ్యయనం చేసినవారు వారి మనసులు బాగా విశాలం చేసుకోవాలి. వారు విషయాల్ని సరిపోల్చి చూసి ఇవన్నీ ప్రపంచంలో ఉండడమన్నది సహజమేనని తెలుసుకుంటారు. పరిమితమైన ఆలోచనలకే అంటిపెట్టుకుని ఉండి, అవి మాత్రమే ప్రత్యేకంగా సత్యం యొక్క అభివ్యక్తమని అనుకొనుట అల్పత్వం.

ఉన్నతమైన అభివృద్ధికి చైతన్యాన్ని సిద్ధం చేయడంలో విద్య కచ్చితంగా అన్నిటికంటె శ్రేష్ఠమైన మార్గం.

*

ప్రశ్న: ప్రియమాతా, కోరికల్ని, మమకారాన్ని జయించడానికి అన్నిటి కంటె ప్రభావం కలిగిన మార్గం యేది? పూర్తిగా భగ్నమయే ప్రమాదం వున్నప్పటికీ, నెమ్మదిగా, జాగ్రత్తగా వాటిని ఒక్కొక్కటిగా తొలగించాలా?

శ్రీమాత: రెండు పద్ధతులూ నిష్ప్రయోజనమైనవే. సాధారణంగా ఈ పద్ధతుల వల్ల కలిగే ఫలితం ఆత్మవంచనే. కోరికల్ని అధిగమించామని మిమ్మల్ని మీరు మభ్యపెట్టుకుంటారు. కాని, కేవలం వాటి మీద బలంగా కూర్చోడం వల్ల ఆ వత్తిడికి అవి పేలి బయటపడేవరకు ఉపచేతనలో అణిచిపెట్టబడి వుంటాయి. ఒక్కసారిగా జీవిలో ఉవ్వెత్తుగా యెగిసిపడి కల్లోలం రేపుతాయి.

అన్ని కోరికలకి, మమకారాలకి అతీతమైన దృఢమైన క్షేత్రంలో మీ చైతన్యాన్ని స్థాపించడం ద్వారా మీరు మీ నిమ్న ప్రకృతి మీద అధిపతులు కావాలి. ఎందుకంటె అది దివ్యకాంతి, దివ్యశక్తి ప్రభావం క్రింద పనిచేస్తుంది. అది ఒక సుదీర్ఘ మైన, సమగ్రమైన పరిశ్రమ. తిరుగులేని చిత్తశుద్ధితో, అలుపులేకుండా ఫలితం సాధించేవరకు వదలని సాధన, దీక్ష కావాలి.

ఏ సందర్భంలో కూడా మీరు ఉన్నదాని కంటే సమగ్రంగా ఉన్నట్టు నటించకూడదు, సరి కదా, ఉన్నదానికి విరుద్ధంగా కనిపించడానికి ప్రయత్నించకండి.

*

బుద్ధుడు సకారణంగా చెప్పాడు ఎంతకాలం మీలో కోరిక స్పందన ఉంటుందో అంత కాలం ఆ స్పందన విశ్వవ్యాప్తమవుతుంది. దీనిని స్వీకరించడానికి సిద్ధంగా

ఉన్నవాళ్ళందరూ స్వీకరిస్తారు. అదే మాదిరిగా, మీలో కోరిక స్పందనను స్వీకరించే ఏ కొద్ది మాత్రం సుముఖత ఉన్నా, మీరు ఆ కోరిక యొక్క అన్ని స్పందనలకి తెరుచుకుంటారు. అవి నిరంతరం విశ్వంలో వ్యాపిస్తూనే వుంటాయి. అందుకే అతను కృతనిశ్చయంతో ఈ భ్రాంతి నించి బయటపడండి, పూర్తిగా విడుదలకండి, హాయిగా వుంటారు అని అన్నారు. ఇది చాలా స్వార్థపూరితమైనదని నా కనిపిస్తుంది. కాని అతని దూరదృష్టిలో అదొక్కటే మార్గం కనిపించింది. కాని ఇంకొకటి కూడా ఉంది. ప్రపంచమంతటా వ్యాప్తిచెంది ఉన్న స్పందనలన్నింటిపైన చైతన్యవంతంగా నిరంతరం ప్రభావం చూపగలగేటంతగా దివ్యశక్తితో తాదాత్మ్యం చెందాలి. అప్పుడు అవాంఛనీయ స్పందనల ప్రభావం మీ మీద ఏమాత్రం ఉండదు. కాని వాటి మీద మీ ప్రభావం వుంటుంది. అవాంఛితమైన స్పందన మీకు తెలియకుండా మీలో ప్రవేశించి పనిచేయుటకు బదులు, దాని రాకను గ్రహించి వెంటనే దాని పరిణామం కోసం మీరు పనిచేయాలి. అది పరిణామం చెంది విశ్వంలో వెనక్కి పోతుంది. దాని ప్రయోజనం అది నెరవేర్చి ఇతరుల్ని అదే విధమైన గుర్తింపుకి సిద్ధం చేస్తుంది. శ్రీఅరవిందులు చేయదలచింది సరిగ్గా ఇదే. అంత కంటె స్పష్టంగా చెప్పాలంటే, మిమ్మల్ని చెయ్యమని అడిగింది అదే. మీరు చెయ్యవలసినదేదో నిశ్చయించినదీ అదే. పరుగెత్తి కోరికల నుండి పారిపోవడానికి బదులు, వాటిని జయించగలిగే శక్తిని మనలోకి తెచ్చుకోవాలి.

*

ఎవడైతే తన మీద తాను ఆధిపత్యం సాధించాడో, ఎవడైతే తన చైత్యపురుష సత్తాను కనుక్కున్నాడో, దాని చైతన్యంలో నిరంతరం జీవిస్తాడో, ఆంతర్యంలోని దివ్యశక్తితో ఒక సమగ్రమైన సంబంధం లేక నిరంతర అనుబంధం కలిగి ఉంటాడో, అతడు జ్ఞానము, కాంతి, సౌందర్యము, స్వచ్ఛతల ఆచ్ఛాదనతో ఉంటాడు. అదే కోరికల మీద అన్నిటినీ మించిన రక్షణ అవుతుంది. కాని ఆ విధంగా తాను నిరంతరం తన రక్షణలో తాను లేనట్టయితే ఆ కోరిక తనలోకి ప్రవేశించే అవకాశం ఉంది. ఎందుకంటే అది బయట నుండి వస్తుంది గనుక. మనిషి తనలో కోరికని అధిగమించ వచ్చు, అయినప్పటికీ అది అంటురోగంలా బయటి నుండి రావచ్చు. కాని ఈ కాంతి, జ్ఞానం, స్వచ్ఛతల ఆచ్ఛాదన ద్వారా కోరిక తన తీవ్రతను కోల్పోతుంది.

గుడ్డిగా సత్యమే స్పందించే ఉద్యమంలాగ రావడానికి బదులు, ఏమి జరుగుతున్నదీ ఆ వ్యక్తి గ్రహించి జాగ్రత్తపడతాడు. అది కోరదగినది కానప్పుడు ఆంతర్యం లోంచే ప్రయత్నించి లోపలికి వస్తున్నదానిని అక్కడినించే తిరస్కరిస్తాడు. ఇది మాత్రమే నిజమైన భద్రత. మేలుకున్న, స్వచ్ఛమైన, అప్రమత్తమైవున్న చైతన్యం. ఒక విధంగా చెప్పాలంటే నిద్రపోనిది. ఏ విషయం గురించయినా జాగ్రత్తపడంది ప్రవేశించనివ్వదు. అయితే మనుషులలో ఉన్న అతి చెడ్డ అలవాటేమిటంటే అంటురోగం తగిలేదాకా దానిని గుర్తించరు. అందువల్ల ప్రతిస్పందించడం ఆలస్యమవుతుంది. అది అసాధ్యం కాదు కానీ, కష్టం ఎక్కువవుతుంది. అది వచ్చేటప్పుడు మనిషి చూడగలిగినా, అది ఒక రకమైన నల్లటి మచ్చగా ఆ పరిసర వాతావరణంలోకి ప్రవేశించినా, అంగీకరించలేనిదేదో వచ్చిందని గ్రహించి తరమగలడు.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

అధిక సంతోషానికి మార్గం

ఉదాహరణకు, మీరు ఒకదానిని చూస్తారు. అది అందమైనది, లేక మీకలా అనిపిస్తుంది — అది సుందరమైనది, ఎంతో పొందికగ నున్నది, అత్యంత ఆహ్లాదకరమైనది. నిజమైన చైతన్యం మీకున్నట్లయితే, చూడటంలో ఉన్న ఈ సంతోషాన్ని, ఒక అత్యంత సుందరమైన, ఎంతో పొందికగానున్న దానితో చైతన్యవంతమైన సంబంధం ఏర్పడినందువలన కలిగే సంతోషాన్ని అనుభవించగలుగుతారు. అంతే, అక్కడితో అది ఆగిపోతుంది, అక్కడే ఆగిపోతుంది. చూశావూ, అలాంటిదొకటి ఉన్నదనే సంతోషం నీవు పొందావు. ఈ విధమైన అనుభవం సౌందర్యపిపాసులగు కళాకారులలో సర్వసాధారణం. ఉదాహరణకు, కళాకారుడు ఒక సుందరమైన ప్రాణిని చూసి దాని అందము, సొగసు, కదలికలలోని సామరస్యత మున్నగువాటిని గమనించుటలో గల ఆనందాన్ని పొందవచ్చు. అంతే, అక్కడితో అది ఆగిపోతుంది. అతడికి సంపూర్ణ ఆనందం కలుగుతుంది, పరిపూర్ణ సంతృప్తిని పొందుతాడు. కారణం, అతను ఏదో ఒక అందమైనదానిని చూశాడు గనుక. ఒక సాధారణ చైతన్యం, సర్వసాధారణమై

నది, ఇతర సాధారణ చైతన్యాలవలె మందమైనది, ఒక అందమైనదానిని చూసిన వెంటనే, అది ఒక వస్తువుగాని లేక మనిషిగాని, అబ్బ! 'నా కది కావాలి'. ఎంత శోచనీయమో, తెలుసా. ఈ వ్యవహారంలో కనీసం అది ఆ అందం అందించే సంతోషాన్ని కూడ పొందలేదు, కారణం, దానికి కోరిక అనే తాపం సోకింది. అది ఆ సంతోషాన్ని కోల్పోయింది. దానికి బదులుగ ఏమీ పొందలేదు. అందుకు కారణం, దేనినైనా వాంఛించటంలో సంతోషదాయకమైనది ఏదీ లేదు. కేవలం అది నిన్ను ఒక అసహ్యకర మైన స్థితికి నెట్టుతుంది. అంతే.

బుద్ధుడు ఇలా అన్నాడు — ఒక కామనను తృప్తిపరచుటలో కన్న దానిని అధి గమించుటలోనే అధిక ఆనందముంటుందని. ఇది ప్రతి ఒక్కరు పొందగలిగిన అనుభవం. నిజంగా ఆసక్తికరమైనది, అత్యంత ఆసక్తిదాయకమైనది.

ఒకరెవరో ఆహ్వానించబడ్డారు. ఇది పారిస్ నగరంలో జరిగింది. మాసెనెట్స్‌లో జరిగే ఒక సంగీతరూపక ప్రథమ ప్రదర్శనానికి ఆహ్వానించారు. అది ఎవరిదో నా కిప్పుడు జ్ఞాపకం లేదు. కథాంశం బాగుండింది, ప్రదర్శన కూడ బాగుండింది. సంగీతం అంత అసంతృప్తిగ లేదు. ప్రభుత్వ ప్రదర్శనశాలల్లో ప్రథమ ప్రదర్శన దర్శించవచ్చిన లలితకళల మంత్రిగారు కూర్చుని తిలకించడానికి, ఒక ప్రత్యేక ఆవరణ ఉంటుంది. ఆ చోటికి వారు ఆహ్వానింపబడ్డారు. మంత్రిగారు ఒక సామాన్య వ్యక్తి. గ్రామీణ ప్రాంతానికి చెందిన పాతకాలపు మనిషి. పారిస్ మహానగరంలో ఎక్కువగ నివసించినవాడు కాదు. మంత్రిత్వశాఖకు క్రొత్త. నూతనమైన వాటిని చూడడానికి చిన్నపిల్లాడిలా సంతోషపడేవాడు. అయినా కూడా సభ్యత కలవాడు. ఆహ్వానితులు ఒక పెద్దింటి స్త్రీ అయినందున ఆమెకు ముందు కుర్చీ నిచ్చి తాను వెనుక కుర్చీలో కూర్చున్నాడు. అందువల్ల రంగస్థలం మీది ప్రదర్శన పూర్తిగా కనిపించనందున చాలా అసంతృప్తి చెందాడు. బాగా చూచుట కోసం, ఇతరులు గమనించకుండా, కొంత ముందుకు వంగాడు. ముందు కూర్చున్న స్త్రీ మూర్తి ఇది గమనించింది. ఆమె కూడ ప్రదర్శనను ఆసక్తిగానే తిలకిస్తున్నది, ఆనందపడు తున్నది. కాని మంత్రిగారు సరిగ్గా చూడలేనందుకు ఎంత అసంతృప్తిగా ఉన్నారో గమనించింది. అందుకని నెమ్మదిగా తన కుర్చీని కొంత వెనుకకు నెట్టి కొంచెం ప్రక్కకు జరిగింది. పరధ్యానంగా చేసినట్లుగ ప్రవర్తించి మంత్రిగారు ప్రదర్శనను బాగా తిలకించే వీలు కల్పించింది. ఈ స్త్రీ మూర్తి, ప్రదర్శనను తిలకించే కోరికను

వదులుకున్నందుకు, లోలోన ఆనందంతో నిండిపోయింది. విషయాల పట్ల నుండే మమకారం నుండి విముక్తి పొందింది. ఒక విధమైన శాంతిని పొందింది. తనను తాను సంతృప్తిపరచుకునే బదులు వేరొకరి గురించి ఎంతో కొంత చేశానని సంతృప్తి చెందింది. ఆ విధంగా, ఆ సాయంకాలం సంగీతం విన్నందువలన పొందిన సంతోషాని కన్న ఎక్కువ సంతోషాన్ని పొందింది. ఇది ఒక నిజమైన అనుభవం. ఏదో పుస్తకంలో చదివిన చిన్న కథ కాదు. ఆవిడ సరిగ్గా ఆ సమయమందే బౌద్ధ నైతికశిక్షణకు సంబంధించిన వాఙ్మయం అధ్యయనం చేస్తున్నది. బుద్ధుడు ప్రవచించిన సూత్రాలకు అనుగుణంగ ఈ ప్రయోగం చేసింది.

నిజంగా ఇది ఎంత గట్టి అనుభవమో తెలుసా. ఎంత వాస్తవమైనదంటే, రెండు క్షణాల తరువాత, ఆ రూపకం, ఆ సంగీతం, ఆ నటీనటులు, ఆ రంగస్థలం, ఆ చిత్రాలు అన్నీ పూర్తిగ అప్రధానమైన విషయాలుగ ఎగిరిపోయాయి, కాని, ఈ ఆనందం, — తనలో ఒక దానిపై నియంత్రణ సాధించానన్న ఆనందం, ఒక నిస్వార్థమైన పని చేశానన్న ఆనందం — ఆమె అస్తిత్వాన్ని సాటిలేని స్వచ్ఛమైన ప్రశాంతతతో పూర్తిగ నింపివేసింది. అది ఒక ఆహ్లాదకర అనుభవం. సరే కాని, అదొక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగతమైన అనుభవం కాదు. ప్రయత్నించేవారందరు ఈ అనుభవాన్ని పొందవచ్చు.

ఇష్టపూర్తిగ కోరికను విసర్జించినప్పుడు, చైత్యపురుష సత్తాతో ఒక విధమైన అంతర్గతమైన సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. దీని వలన వ్యక్తికి కోరిక తీర్చుకున్నప్పుడు కలిగే సంతోషం కన్నా ఎక్కువ సంతోషం కలుగుతుంది. అదీగాక, అతి మామూలుగ దాదాపు ఎలాంటి మినహాయింపు లేకుండ, ఎప్పుడైతే వ్యక్తి కోరికను తృప్తిపరుచుకుంటాడో అది ఎక్కడో ఒక చోట ఒక చేదు రుచిని మిగులుస్తుంది.

బాగా తియ్యగా వున్న మిఠాయి తిన్నప్పుడు నోరు కొంత చేదయినట్లుగ, ఏదో ఒక విధమైన చేదు అనుభవాన్ని కలిగించకుండా, ఏ ఒక్క కోరిక తీరడమంటూ ఉండదు. ఆ విధంగానే ఉంటుంది. నీవు శ్రద్ధతో ప్రయత్నించాలి. కోరికను వదిలి దానిని ఒక మూలకు నెట్టినట్టుగా నటించకూడదు. అలా చేస్తే తీవ్ర అసంతృప్తిని చెందుతావు. ఏది చేసినా నిజాయితీతో చెయ్యాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

కార్యకర్మను కోరికకు బంధించే ముడిని వదులుచేయుట

ప్రశ్న: ప్రియమైన మాతా, ఇందులో ఈ విధంగా వ్రాసి ఉంది, "కర్మ యోగ మార్గంలో కార్యకర్మ అనే ముడిని మనం మొదట వదులు చేయాలి" (శ్రీఅరవిందుల యోగ సమన్వయం) ఏ విధంగా కర్మ ముడి అయింది?

ఎవరికైనా కర్మతో ఉండే అనుబంధం వల్ల అది ముడి అవుతుంది.

కర్మ చేసేవారు దానితో అనుబంధం కలిగి ఉంటారు, కాబట్టే అది ముడి అయింది. ఆ ముడి అహం ముడి. నీవు కోరికతో కర్మ చేస్తావు. అదే శ్రీఅరవిందులు చెపుతున్నారు. అవునా? సాధారణ పద్ధతిలో చేసే కర్మలు ఏదో ఒక రూపంలోగాని, మరో రూపంలోగాని కోరికతో పెనవేసుకుని ఉంటాయి, అది కోరిక కావచ్చు, అవసరం కావచ్చు. అందువల్ల అది ముడి అయింది. నీవు కోరికను సంతృప్తిపరచటానికే కర్మ చేస్తే — ఆ కోరికను నీవు ఒక అవసరం అని లేదా తప్పనిసరి అయినది అని లేక మరేదైనా కాని అని అంటావు. కాని, నిజానికి నీవు దాని మూలంలోకి తొంగిచూస్తే నీకు అది కోరిక నుంచి వచ్చిన ప్రేరణగా కనపడుతుంది. ఆ విధంగా నీవు కేవలం, కోరిక నుంచి తలెత్తే ప్రేరణతో కర్మను చేయడం మొదలుపెడితే, కోరికనే లేకుండా చేసిన తరుణాన నీవు ఏమాత్రం కూడ కర్మను చేయలేవు.

అందరి నుంచి నీకు మొదట వచ్చే సమాధానం ఇదే. వారికి "కర్మఫలాన్ని ఆశించకుండా కర్మ చేయి, కర్మను ఆచరించేది నీవు కాదు, దానిని దైవమే చేస్తున్నాడు అనే భావనను కలిగి ఉండు" అని చెపితే ఒకటీ అరా తక్కువగా అందరూ ఏమని చెపుతారంటే, "నేను ఆ విధంగా తలిస్తే నాలో ఏమాత్రం కదలిక ఉండబోదు! నేనే పనినీ చేయను, ఎప్పుడూ ఒక అవసరం, ఒక కోరిక, నాలో కలిగే ఒక ప్రేరణ నన్ను పని చేయమని ప్రోత్సహిస్తుంది". కనుకనే శ్రీఅరవిందులు, నీవు గీతలోని ఈ విషయం అనుభవంలోనికి తీసుకుని రావాలనుకుంటే, మొదట చేయవలసిన పని ఈ ముడిని, కర్మను కోరికకు బంధించే ముడిని, వదులుచేయాలి, అవి ఎంత గట్టిగా పెనవేసుకుని ఉంటాయంటే నీవు ఒక ముడిని వదులుచేస్తే మరొకటి కూడా వదులవుతుంది అని చెపుతున్నారు. కోరికను లేకుండా చేయడంతోపాటు, కర్మను

వదిలివేయకుండా చేస్తూనే ఉండటానికి ఆ ముడిని తప్పక వదులుచేయాలని శ్రీఅరవిందులు చెపుతున్నారు.

ఇది సత్యం, ఇదే తప్పక చేయవలసినది. ముడి తప్పక వదులుచేయబడాలి. అది అంతరంగంలో జరికే చిన్న పని, దానిని నీవు చాలా తేలికగా చేయవచ్చు; అదే గనుక చేయడం జరిగితే, నీవు ఏమాత్రం వ్యక్తిగత ఉద్దేశం లేకుండా కర్మను చేస్తుండడాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటావు. కాగా, నీ అహం శక్తికి మించిన శక్తితో, ఒక మహాబలవంతమైన శక్తితో కర్మలు చేయబడటం నీవు చూస్తావు. ఆ విధంగా నీచేత కర్మ కొనసాగుతుండగా, దాని పర్యవసానాలు నీ దరిదాపులకు కూడా రావు.

ఇది చైతన్యంలోని అద్భుతమైన క్రియావిధానం, పూర్తిగా నిర్దుష్టమైనది. జీవితంలో కొన్ని పనులు చేస్తుంటావు, అవి మంచి, చెడు, ఉదాసీనతతో చేసే పనులు, అవి ఏ రకమైనవైనాగాని, అవి ఎటువంటివైనాగాని, వెనువెంటనే వరుసగా వాటికి పర్యవసనాలుంటాయి. వాస్తవంలో, నీవు ఫలితం ఆశించి కర్మ చేస్తావు. అందుకోసమే ఆ కర్మ చేయడం జరుగుతుంది — ఫలితం మీద దృష్టితోనే. ఉదాహరణకు, నేను మైకుని తీసుకోవటానికి నా చేతిని చాచాననుకో, నేను దానికి ఒక ఫలితాన్ని ఆశిస్తాను, అది ఆ మైకులో శబ్దాలను చేయడానికి. ఆ విధంగా ప్రతిదానికీ ఎప్పుడూ, ఎల్లవేళలా ఒక పర్యవసానముంటుంది. కాని నీవు ఆ ముడిని వదులుచేసి, పైనుంచి గాని, లేక మరెక్కడనుంచి కాని ఒక మహాశక్తిని రానిచ్చి, అది నీ ద్వారా పనిచేస్తూ, నీ చేత ఆ కర్మను చేయిస్తుంటే, ఆ చేతల వలన పర్యవసానాలున్నప్పటికీ, అవి నీ చెంతకు ఏమాత్రం రావు. ఎందువల్లనంటే ఆ కర్మను ఆరంభించింది నీవు కాదు కాబట్టి, మరియు పైనుంచి వచ్చిన మహాశక్తి వలన జరగబడుతుండడం వల్లనే. ఆ కర్మ పర్యవసానాలన్నీ పైపైనే వెళ్ళిపోతాయి లేదా ఏ శక్తి అయితే కర్మలను నియంత్రిస్తున్నదో ఆ శక్తి అధీనంలో మార్గదర్శకత్వాన్ని, ఆజ్ఞను, దిశానిర్దేశాన్ని పొందుతుంటాయి. నీవు పూర్తి స్వతంత్రతను అనుభవిస్తావు. నీవు చేసినదాని పర్యవసానమేదీ నీ దరికి రాదు.

ఇటువంటి అనుభవాలు పొందిన వ్యక్తులు కొంతమంది ఉన్నారు. కాని ఇవి మొదట ఒక మెరుపులాగా, ఒక క్షణంపాటు వచ్చి, వెంటనే వెనుకకు మరలిపోతాయి;

ఎవరైనా పూర్తిగా పరివర్తనకు సిద్ధంగా ఉంటే, అప్పుడవి వచ్చి, స్థిరంగా వారిలో నిలిచిపోతాయి.

నిజంగా నాకు ఏమి చేయాలో తెలియడం లేదు అని ఎవరైనా చెప్పడం మొదలుపెడితే, దాని అర్థం ఎప్పుడూ ఒకటే, వారికేవో ఇష్టాయిష్టా లున్నాయనేదే.

శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ప్రాధాన్యత లేని ఎంపిక — కోర్కె లేని నిర్వహణ

సత్యమైన చైతన్యం, ఆత్మనిగ్రహం పెంపొందించుకొనుటకు మూలంలో ఉండే గొప్ప కష్టం, ప్రాధాన్యత లేకుండా ఎంపిక చేయటం, కోర్కె లేకుండా (పనిని) నిర్వహించడమే. ఈ భావనలో, ఎంపిక అంటే ఏది సత్యమో దానిని గమనించి, దానికి అస్తిత్వం తెచ్చిపెట్టడమే. సాధారణ మానవసత్తాకు, కచ్చితంగా మిక్కిలి కష్టమైనదేమంటే, కనీస వ్యక్తిగత అభిమానం లేకుండా, దేనిపైనైనా, ఏ వ్యక్తి, ఏ చర్య లేదా ఏ పరిస్థితి పైనైనా, మక్కువ లేకుండా ఎంపిక చేయగల్గడం. ఐనప్పటికీ, ప్రతి ఒక్కరు నేర్చుకోవాలి, వ్యక్తిగత కష్టాలు, ఆకర్షణలు, ప్రాధాన్యతలు లేకుండా పనిచేయడం; కేవలం మనకు దారిచూపే 'సత్యం' పై మాత్రమే ఆధారపడి పని చేయడం. ఈ విధంగా సత్యానికి అనుగుణంగా ఏ కోర్కె లేకుండా అవసరమైన చర్యను ఎంపిక చేసి అమలుచేయాలి.

నిన్ను నీవు నిశితంగా పరిశీలించుకుంటే, నీవు ఏదైనా పని చేసే ముందు, ఒక అంతరంగ ఉద్వేగం, ఏదో నిన్ను ముందుకు త్రోసేది, నీకు అవసరమని గమనిస్తావు. సాధారణంగా ఇది సాధారణ వ్యక్తులలో ఒక కోర్కెగా ఉంటుంది. ఈ కోర్కెకు బదులు ఒక కచ్చితమైన, స్వచ్ఛమైన, స్థిరమైన శాశ్వత సత్యం చోటు చేసుకోవాలి.

కొందరు దీనిని 'దైవేచ్ఛ' లేదా 'దైవవాక్కు' అంటారు. కాని, ఈ పదాల వెనుక ఉన్న 'అర్థం' వక్రీకరింపబడింది. అందువలన నేను 'అసలు సత్యం' గురించి మాట్లాడుటకు ఎక్కువ ఇష్టపడ్తాను. దేనిని పేరుపెట్టి పిలువలేమో, ఏది అంతటి అస్తిత్వానికి మూలమో లేక గమ్యమో, దానిలో చాల పరిమితమైన అంశం మాత్రమే

ఈ 'సత్యం' అనే పదం సూచిస్తుంది. 'దైవం' అనే పదాన్ని ప్రయత్నపూర్వకంగా నేను వాడడం లేదు. ఎందుకంటె, సృష్టికి ఆవల వేరుగా ఉండే ఒక శక్తివంతమైన సత్తాకు మతాలు ఈ పేరు పెట్టాయి. ఇది సరి కాదు.

ఐనప్పటికీ, భౌతికస్తరంలో ఈ తేడా స్పష్టము. మనము ఎలా ఉండకూడదని కోరుకుంటామో, ఇప్పటికీ అలాగే ఉంటున్నాం; ఎలా ఉండాలని కోరుకుంటామో అదంతా 'అతడే'.

ప్రశ్న: దైవేచ్ఛ ఎలా ఉందో ఎలా తెల్సుకోగలం?

జవాబు: ఎవ్వరికీ తెలియదు; దానిని అనుభూతి చెందుతారు. ఇలా అనుభూతి చెందడానికి, ప్రతి ఒక్కరు, ఎంత తీవ్రంగా, ఎంత మనస్ఫూర్తిగా, ఆకాంక్షించాలంటే, అడ్డుగా ఉండే ఆటంకాలన్నీ అదృశ్యమవాలి. నీకు ఒకదానిపై అధిక ప్రాముఖ్యత, కోర్కె, ఆకర్షణ, ఇష్టం ఉన్నంత కాలం, అది నీ నుండి 'సత్యాన్ని' మరుగుపరుస్తుంది. అందుచే నీవు చేయవల్సిన మొదటి పని ఏమంటే నీ చైతన్యంలో ఉన్న చాంచల్యాలన్నిటిని నియంత్రించి, సరిదిద్ది వాటిలో మార్చబడలేనివానిని తొలగించాలి. ఇవి ఒక పరిపూర్ణమైన, శాశ్వతమైన, 'సత్యాన్ని' ప్రకటించేవిగా మారేవరకు, ఈ పని చేస్తుండాలి.

ఐతే, ఇలా 'ఇచ్ఛ' చేయడం కూడ సరిపోదు; ఎందుకంటే, తరచుగా, ఇచ్ఛ చేయడం ప్రతి ఒక్కరు మరుస్తారు.

కావల్సిందేమంటే, సత్తాలో ఒక స్థిరమైన, జ్వాలవలె మండే ఒక ఆకాంక్ష. నీకు ఒక కోర్కె, ఒక ఆకర్షణ, ఒక ఆధిక్యతగల ఎంపిక కల్గిన ప్రతిసారి, దానిని ఈ అగ్నిలో – ఆకాంక్ష అనే అగ్ని జ్వాలలో పారేయాలి. ఇలా పట్టు విడువకుండా చేస్తూ పోతే, సత్యచైతన్యపు వెలుగురేఖలు, నీ సాధారణ చైతన్యంలో ఉదయించనారంభమవడం నీవు గమనిస్తావు. మొదట్లో ఇది చాల కాంతిహీనంగా ఉంటుంది. కోర్కెలు, ఆధికత్యలు, ఆకర్షణలు, ఇష్టాల రణగొణ ధ్వనులకు చాలా వెనుకగా ఉంటాయి. నీవు తప్పనిసరిగా, ఈ రణగొణ ధ్వనుల వెనుక వైపుకు వెళ్ళవల్సిందే; సత్యచైతన్యాన్ని కనుగొనేందుకు; నిర్మలం, ప్రశాంతం, ఇంచుమించు నిశ్శబ్దంగా ఉండే సత్యచైతన్యాన్ని కనుగొనేందుకు.

ప్రశ్న: ఆకాంక్షకు, కోర్కెకు మధ్య తేడా ఏమిటి?

జవాబు: నీకీ రెండింటి అనుభవం కలిగినపుడు, వాటి తేడా సులభంగా తెల్సుకోగలవు. ఆకాంక్షలో ఒక నిస్వార్థమైన జ్వాల ఉంటుంది. అది కోర్కెలో ఉండదు. నీ ఆకాంక్ష, నీ అహంకారంపై ఆధారపడి ఉండదు; కోర్కె ఎల్లపుడు అహంకారంపై ఆధారపడ్తుంది. మానసిక దృష్టితో చూచినపుడు, ఆకాంక్షలో ఎల్లపుడూ ఒక ఆత్మసమర్పణ ఉంటుంది; కాని కోర్కెలో ఎల్లప్పుడు తన వైపుకు (అహంకారం వైపుకు) లాగుకునేదేదో ఉంటుంది. ఆకాంక్ష తనను తాను సమర్పించుకొనుట. అది ఆలోచ రూపంలో మాత్రమే ఉండనవసరం లేనప్పటికీ కదలికలు, స్పందనలు, ప్రాణిక ఉద్వేగాల రూపంలో ఉంటుంది.

నిజమైన ఆకాంక్ష శిరస్సు నుండి రాదు. అది ఆలోచనలలో రూపుదిద్దుకున్నప్పటికీ, ఒక జ్వాలవలె, హృదయం నుండి ఎగసి పడ్తుంది.

మూలం; శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు

యోగసాధనలో ఎలా పురోగమించాలి

ప్రప్రథమంగా సాధకుడు స్వయం పరిశీలనతో ఐహిక వాంఛల వల్ల ప్రాప్తించే సుఖ భోగాదులు తాత్కాలికమేనని శాశ్వతానందం కలుగజేయవని గ్రహించటం అవసరం.

అందువల్ల సాధకుడు ఈ ఐహిక వాంఛల వల్ల కలుగు దుష్ఫలితాలను ఎప్పటి కప్పుడు నెమరువేసుకొంటూ వాటికి దూరంగా ఉండటం ఉత్తమం. భోగవాంఛను పూర్తిగా నిరసించటం అలవరచుకోవాలి. గౌతమ బుద్ధుడు తలచినట్లు, ప్రాపంచిక సుఖభోగాదులను త్యజించటం, నిరసించటంలో ఉన్న ఆనందానికి భోగప్రాప్తి ఎన్నటికి సాటిరాదని గుర్తుంచుకోవాలి. ఈ విషయము నిర్వివాదాంశమని, కఠోర సత్యమని సాధకుడు శీఘ్రముగానే గ్రహించగలడు. ఐహిక వాంఛలను జయించటంలో నున్న ఆనందం క్షణికమైన దుఃఖభూయిష్టమైన ప్రాపంచిక సుఖభోగాల ప్రాప్తికి సాటిరాదని గ్రహించటం రెండవ ఘట్టం.

ఈ నిరంతర కృషితో ఐహిక వాంఛలు దగ్ధమై, సాధకునికి అలజడి కల్గించవు.

ఈ ప్రక్రియ ఆనందస్వరూపుడు, కరుణాసముద్రుడైన సర్వేశ్వరునికి చేరువ కావటానికి దోహదం చేస్తుంది. సాధకుడు శ్రద్ధతో తాను భగవద్దత్తమైతే, ఇక సాధకునికి ఆనందస్థితి, ప్రశాంతస్థితి కరతలామలకం.

ఇక ముమ్ముందు సాధన పూలబాటే.

యోగమార్గంలో ఏమాత్రం ప్రగతి సాధించినా, అనుభూతులకు లోటు లేదు. ఈ సాధన రాటుదేరితే ఈ జగమంతా రామమయమేనని గ్రహిస్తాడు. ఆనందామృత వర్షబిందువులు యోగసాధనలో భాగమై, నిత్యజీవితం సార్ధకమౌతుంది. దేహాత్మ భావనలో నున్న జీవునికి ఈ ఆనందస్థితి అందని ద్రాక్షపండు. ఈ అద్వితీయమైన, అద్వైత, తురీయ ఆనందస్థితికి చేరుకొన్న సాధకుడు దేహాత్మ భ్రాంతిస్థితికి జారుకొనడం అసాధ్యం.

మరొక మాట. దేహాత్మ భ్రాంతిలో నున్నపుడు ఆనందప్రాప్తి ఊహింపతరం కాదు. వాంఛనీయము కూడ కాదు. రాగద్వేషాలు, సుఖదుఃఖాలు మొదలగు ద్వంద్వా లకు అతీతుడు గావటం అవసరం. ఈ సాధకునికి ఆనందప్రాప్తి చేతిలోని అరటిపండు. అయితే విచిత్రమేమంటే దేహాత్మభ్రాంతి నశించినపుడు ప్రాపంచిక సుఖభోగాదులే ఆనందస్థితియని తలచితే ఇంతకన్న దురదృష్టమేముంది. ఆనందస్థితికి ఈ ఐహిక సుఖభోగాదులు సహస్రాంశము కూడా కానేరవు గదా. కాబట్టి సాధకుడు నిత్యజీవిత ములో ప్రాపంచిక వాంఛలు, సుఖభోగాల ప్రాప్తి నుండి విముక్తి పొందటమే ప్రశాంతస్థితి, శాశ్వతానంద స్థితులకు దోహదము చేయగలదని గ్రహించవలెను.

మూలం: శ్రీమాత

అనువాదం: శ్రీశరణ్

కోరిక అంటే ఏమిటి

(సంకల్పాన్ని ఆనందమనే తక్కువ స్థాయికి మార్చేది)

కోరిక మానవునికి నిజమైన ప్రోత్సాహకశక్తి. దానిని విసర్జించినట్లయితే, జీవనధారలను ఆపివేయటమే అనే భావన ఉంది. కోరికను సంతృప్తిపరచుటలోనే మానవునికి ఆనందానుభూతి కలుగుతుంది. దానిని విడిచివేస్తే, జీవితంలో ఉండే ఉత్సాహాన్ని ఒక పరివ్రాజక నైరాశ్యతతో ఆర్పివేసినట్లవుతుంది. కాని సంకల్పం జీవాత్మ యొక్క వాస్తవమైన ప్రోత్సాహకశక్తి. శారీరక జీవితము, భౌతిక మనస్సుల ప్రాధాన్యత ఉన్న జీవనశైలిలో, కోరిక కేవలం సంకల్పం యొక్క వికృతరూపం.

ప్రపంచాన్నంతా స్వంతం చేసుకోవాలి, దాన్నంతా అనుభవించాలి అనే దిశగా అంతరాత్మ మళ్ళుటం, ఆనందం అనుభవించాలనే సంకల్పం ఏర్పడినందువలన. ఆ వాంఛను సంతృప్తిపరచుటలో పొందే ఆనందానుభూతి కేవలం సంకల్పాన్ని ప్రాణిక మరియు, భౌతిక ఆనందస్థాయికి వక్రీకరించడమే. స్వచ్ఛమైన సంకల్పం మరియు కోరిక మధ్యన ఉండే వ్యత్యాసాన్ని, ఆనందం కోసం అంతరంగమందు కలిగే సంకల్పం మరియు బాహిరమైన ఇంద్రియ, మానసిక, శారీరక అపేక్షల మధ్యన ఉండే వ్యత్యాసాన్ని గుర్తించుట చాలా అవసరం.

మన అస్తిత్వానుభవంలో ఈ తారతమ్యాన్ని గుర్తించలేకపోతే, ప్రాణాంతకమైన విరక్తిభావం కావాలో లేక జీవించాలనే దృఢసంకల్పం కావాలో తేల్చుకోవాలి. లేనట్లైతే, ఈ రెంటి మధ్యన ఒక అసంబద్ధ, అనిశ్చిత, అపాయకర రాజీమార్గానికై ప్రయత్నించాలి. వాస్తవానికి ఎక్కువ శాతం మనుషులు ఇదే చేస్తారు. అతి కొద్దిమంది వారి సహజజీవిత ప్రవృత్తిని అణగద్రొక్కి, పరివ్రాజక పరిపక్వతను సాధించడానికి ప్రయాసపడతారు. చాలామంది దృఢసంకల్పంతో సమాజం సామాన్య పౌరుడికి విధించిన, లేదా ఒక సామాజిక పౌరుడుగా తన మనస్సు పైన, చర్యల పైన తాను విధించుకున్న మార్పులను, కట్టుబాట్లను పాటిస్తూ జీవనం కొనసాగిస్తారు. మిగతా వారు, కోర్కెలమయమైన మానసిక, ప్రాణికజీవి యొక్క కఠోర నైతిక నియమావళికి, సంయమనంతో కూడిన సంతృప్తికి మధ్య సమన్వయం కుదిర్చి, తద్వారా వివేకవంతమైన బుద్ధి, ఆరోగ్యవంతమైన జీవనశైలిని, ఆమోదయోగ్యమైన మధ్యే మార్గంగా ఎన్నుకుంటారు.

కాని, ఈ విధానాలేవీ మన మాశించిన పరిపూర్ణతనుగాని, జీవితంలో సంకల్పబలం యొక్క దివ్యాధికారతనుగాని సమకూర్చలేవు. ప్రాణమును, ప్రాణికసత్తాను పూర్తిగా కాలరాయటమనగా మానవజీవి లోని అంతరాత్మ యొక్క అధికతర కార్యాచరణకు ఆధారమైన జీవశక్తిని చంపివేయడమే. సంకల్పాన్ని తృప్తిపరచి జీవించుట అనగా అసమగ్రతను ఆమోదించుట అవుతుంది. ఈ రెంటి మధ్యన రాజీ కుదుర్చుట అంటే, సగం దారిలోనే ఆగిపోయి, అటు భూలోకాన్నిగాని, ఇటు స్వర్గలోకాన్నిగాని పొందలేకపోయినట్లవుతుంది.


దుందుడుకు స్వభావం కలిగి, ఊపిరి ఆడనీయకుండా అలసటచెందే, రెపరెపలాడు జ్యోతిలాంటి కోరికకు బదులు, స్వతంత్రమైన, ప్రశాంతమైన, స్థిరమైన, సమర్థమైన శక్తి కలిగిన కోరికతో, కలుషితం కానటువంటి స్వచ్ఛమైన సంకల్పాన్ని పట్టుకోగలగాలి. అదే విధంగా, ప్రశాంతమైన, ఆనందమయమైన అంతరంగ సంకల్పం — తీవ్ర ఆకాంక్ష అనే వ్యాకులతతో బాధ చెందనిది, పరిమితం కానిది — పట్టుకోగలగాలి. అప్పుడు జీవశక్తిని ఒక నిరంకుశమైన, విరోధియైన మనస్సుపై దాడిచేసే శక్తిని అత్యంత విధేయత కలిగిన ఉపకరణంగా పరివర్తన గావించవచ్చు. కావాలంటే, ఈ గొప్ప విషయాలను కూడ కామన అనే పేరుతో పిలవవచ్చు. అలాంటప్పుడు, ప్రాణిక ఆకాంక్ష కానటువంటి దివ్యకామన, దైవంపై కోరిక, అనేది ఒకటున్నదని ఊహించాలి. దీనికి, ఇతర నిమ్నస్థాయి ఇంద్రియగ్రాహ్య విషయాలు మసకబారిన నీడల్లాంటివి. వీటిల్లోకి అది రూపాంతరం చెందాలి. స్వభావరీత్యా మరియు అంతరంగ కర్మాచరణ వల్ల భిన్నంగా కనిపించే విషయాలకు ప్రత్యేకమైన పేర్లు పెట్టడం మంచిది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

రెండు అంతరాత్మలున్నాయి మనలో

భగవద్గీత, పురుష మరియు ప్రకృతి ధర్మాలను వర్గీకరిస్తూ, ప్రకృతి కార్యనిర్వాహక పాత్రను పోషిస్తుంటే, పురుషుడు సర్వదా అధిపతిగ వ్యవహరిస్తుంటాడని, అనగా, ఈశ్వరపాత్రను పోషిస్తాడని నిక్కచ్చిగ నిర్వచిస్తుంది. ఆత్మను అహంకారం విభ్రాంతికి గురిచేస్తుంది కాని, వేదాంతి దృష్టిలో ఆత్మ పరబ్రహ్మ స్వరూపం, నిత్యముక్తము, స్వయంప్రకాశితము. ఆలాంటప్పుడు ప్రకృతిచే విభ్రాంతి నొందే ఆత్మ ఎవరు? ఆ ప్రకృతికి ప్రభావితమయ్యే పురుషుడు ఎవరు? దీనికి సమాధానం ఇది. ఇక్కడ విషయాలను మన నిమ్న లేక మానసికదృష్టితో ఏ విధంగ దర్శిస్తామో, దానిని సామాన్య పరిభాషలో ప్రస్తావిస్తున్నాము. పైపైకి ప్రస్ఫుటమయ్యే ఆత్మను గురించి, పురుషుని గురించి ప్రస్తావిస్తున్నాముగాని, నిజమైన ఆత్మను గురించి, నిజమైన పురుషుని గురించి కాదు. వాస్తవంగ, ఆహంకారం ప్రకృతి ప్రభావానికి లోబడుట తప్పదు. అందుకు కారణం, స్వయంగ అది ప్రకృతిలో ఒక భాగం, ప్రకృతి యంత్రాంగం యొక్క ఒక చర్య కనుక. కాని, మానసికచైతన్యం లో స్వయంప్రకాశితంగ ఉన్నది అహంకారంతో తాదాత్మ్యం చెందినప్పుడు అది ఒక నిమ్నస్థాయికి చెందిన ఆత్మ, ఒక అహంకారపూరిత ఆత్మసాక్షాత్కారానికి తావిస్తుంది. ఆ మాదిరి గానే మనం మామూలుగ దేనినైతే పురుషుడిగ భావిస్తామో, నిజానికి అది సహజ వ్యక్తిత్వము; పురుషుడు అనబడే అసలు వ్యక్తి కాదు — అది మనలోని కామన పురుషుడు, ప్రకృతి గమనంలోని పురుషచేతన యొక్క ప్రతిబింబము. వాస్తవానికి అది కేవలం ఒక త్రిగుణాత్మక చర్య. ఆ కారణంగా ప్రకృతిలో ఒక భాగం. ఆ విధంగ మనలో ఇద్దరు పురుషులు ఉన్నారని అనవచ్చు. ఒకటి, బాహ్యంగ వ్యక్తమయ్యే పురుషుడు లేక కామన పురుషుడు — గుణాల పరివర్తనతో పాటు మార్పుచెందునది, గుణముల చేతనే పూర్తిగ రూపొందింపబడి, వాటి చేతనే నిర్ధారించబడునది. రెండవది, ప్రకృతిచేతగాని లేక దాని గుణాలచేతగాని పరిమితంగాని స్వతంత్ర ప్రతిపత్తిగల శాశ్వత పురుషుడు. అలాగే మనలో రెండు ఆత్మలున్నాయి. ఒకటి బాహ్య ఆత్మ, కేవలం అహంకారం — ప్రకృతి యొక్క పరివర్తనా క్రియను, పరివర్తన చెందే వ్యక్తిత్వాన్ని నిర్వహించే మనలో నున్న మానసిక కేంద్రం. ఇది అంటుంది. 'నేనే ఈ వ్యక్తిత్వాన్ని, ఈ పనులను నిర్వర్తిస్తున్న సహజ సత్తాను నేనే'. కాని, ఈ



రెండు సందేశాలు

సర్వాన్ని పరిత్యజించటం, ఈ క్షణం వరకు అనుభవంలోకి రానటువంటి ఒక అధికతర ఆనంద లబ్ధికి అవసరం. కొందరు బాధ్యతా నిర్వహణలో పొందే ఆనందం కోసం, కొందరు శాంతియుత వాతావరణం కలిగించే ఆనందం కోసం, కొందరు దివ్యానందానుభూతిలో లభించే ఆనందం కోసం, మరి కొందరు తమను తాము శిక్షించుకొనుటలో వైకల్పిక ఆనందం పొందే నిమిత్తం, పరిత్యజిస్తారు. వీటిని గురించి కాక, ఒక అతీతమైన స్వేచ్ఛను, నిశ్చలమైన ఆనంద పారవశ్యాన్ని అనుభవించటానికి పరిత్యజించాలి.

*

కోరిక గాదు, మమకారం కాదు, ఒకరిని కార్యోన్ముఖుడిని చేయడానికి. ఒక పారమార్థిక ప్రశాంతతలో, ఒక సర్వాతీతమైన దివ్యజ్ఞానము నుండి వెలువడే వెలుగులో, పారలౌకిక ఆనందం కలిగించే ఆనందమయ ప్రచోదనలో కదలాడే దివ్యసంకల్పం, వ్యక్తిని ఆ దిశగా నడిపించాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

సహజ సత్తా కేవలం ప్రకృతియే, గుణముల సంకీర్ణస్థితి. రెండవది, నిజ ఆత్మ. ఇది నిజంగ ప్రకృతికి ఆధారభూతమైనది, ప్రకృతిని అధీనపరచుకున్నది, ప్రకృతికి ప్రభువు, ప్రకృతియందే రూపుదిద్దుకున్నది, స్వయంగ పరివర్తనకు లోనయ్యే సహజ వ్యక్తిత్వము కలది. అందువలన, స్వేచ్ఛను పొందే మార్గం కామన పురుషుడి యొక్క కోరికలను, అహంకారం యొక్క బూటకపు స్వార్థదృష్టిని వదిలించుకొనుటయే.

ఈ ద్వంద్వార్థత, ఈ విషయ గాంభీర్యత మరియు అజ్ఞానముల వైవిధ్య దర్శనములకు కారణం జీవి యొక్క మానవ సహజమైన ఆవేశాత్మక ద్వంద్వ వైఖరి. ఎందుకనగా, మనిషిలో కూడా పశువులో మాదిరిగానే, ప్రాణికమైన ఉద్రేకంతో స్పందించే హృదయం ఉంటుంది, కాని అది వివిధ రకాలుగ వికసనం చెంది యుండవచ్చు. ఆ హృదయం అహంకారపూరిత భావావేశాలతోను, అందమైన అంతర్బుద్ధి యొక్క మానసికోద్వేగాలతోను, ప్రాణిక ప్రేరణల ఖేలనతోను ప్రభావితం చెందుతుంది. వీటికి అనుసంధానమైన అసమగ్రతలు, వక్రగతులు, నీచమైన, భ్రష్టమైన అలవాట్లు తోడగుట పరిపాటి. అంతేగాక, హృదయం ఒక మసకబారిన, దిగజారిన జీవశక్తికి, ప్రతి ఒక్క మానసికోద్వేగానికి, బానిస అవుతుంది. దీనికి తోడు ఇంద్రియలాల సత్వం, కోరికలు, కోపతాపాలు, తీవ్రమైన భయంకరమైన ఆకాంక్షలు, అల్పమైనవాటిపై అత్యాశలు, తుచ్ఛమైన లోభగుణాలు కూడ హృదయాన్ని వశపరుచుకుంటాయి. ఈ ఉద్రేకపూరిత హృదయం మరియు భావోద్రేకంతో అలమటిస్తున్న ప్రాణికం యొక్క కలయిక, మనిషిలో ఒక నకిలీ కామన పురుషుని సృష్టిస్తుంది. ఈ కామన పురుషుడే అసలు అపరిపక్వమైన, అపాయకరమైన మూలం. దీనిని వివేచనా జ్ఞానం విశ్వసించనీయదు, సరి కదా, తన నియంత్రణలో నుంచుకొన చూస్తుంది. ఇది సమంజసమే. అసలైన నియంత్రణ ద్వారా లేక ఒక విధమైన నిర్బంధ విధానం ద్వారా మన అపరిపక్వమైన మొండి ప్రాణిక ప్రవృత్తిని అదుపుచేయుటలో సఫలమైనా కూడ, అది సర్వదా అస్థిరంగాను, మోసపూరితమైనదిగాను ఉంటుంది. కాని, మానవుని నిజమైన అంతరాత్మ అక్కడ ఉండదు. మానవ ప్రకృతిలోని ఒక తేజోమయమైన గూటిలో దాగివున్న నిజమైన హృదయంలో అది ఉంటుంది; అక్కడ ఒక దివ్యకాంతి ప్రసరణలో వెలుగొందుతూ మన అంతరాత్మ ఉంటుంది. ఒక మౌనముద్ర వహించిన అంతర్గత జీవిగా ఎవరికీ అంతు చిక్కకుండ ఉంటుంది. ఎందుకనగా, అందరికీ అంతరాత్మ ఒకటి ఉన్నప్పటికి ఎవరికి కూడ వారి నిజ ఆత్మ చైతన్యం ఉండదు,

లేక దాని ప్రత్యక్షానుభూతి కలుగదు. మరుగై ఉన్న మానవప్రకృతి సముదాయానికి ఆధారమైన ఆ పరమాత్ముని విద్యుజ్జ్యోతి కణం అక్కడ ప్రకాశిస్తుంటుంది. దానిని ఆవరించుకొని చైత్యపురుషసత్తా విస్తరిస్తుంది. అదే మన ఆకృతి దాల్చిన అంత రాత్మ,లేక మనలోని వాస్తవ పురుషుడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఇదే జీవిత పరమావధి

అజ్ఞానాత్మకమైన 'జీవితేచ్ఛ' తన కార్యార్థం ఒక కాముకమైన ఆత్మను సృష్టించు కొని, దానినే అసలైన దివ్యతేజంగా, పరమాత్మ స్వరూపంగా భావించటం వలననే 'ఆధ్యాత్మిక జీవనానికి' లేనిపోని చిక్కంతా వచ్చిపడుతున్నది.

జీవితంలోని కార్యక్రమాలన్నీ దాదాపుగా ఈ 'కాముకమైన ఆత్మ' వలననే సంభవించి, కలుషితం అవుతున్నాయి. మతానికి సంబంధించినవీ, త్యాగబుద్ధితో మానవశ్రేయస్సు కోసం చేసేవీ, నిరపేక్షంగా జరిగేవీ కూడా దీనికి అతీతం కావు. భిన్నత్వ భావాన్ని కలిగించే కోరికలకు మూలమైన 'అహం' అనే విచ్ఛిన్నకర భావన, దానికి సహజమైన స్వీయ సమర్థన, వ్యక్తి ప్రాధాన్యానికి సంబంధించినవే. వ్యక్తిగత అభివృద్ధినే అవి కోరుకుంటాయి. అంతా తన అధీనంలోనే ఉండాలనీ, అంతా తానే అనుభవించాలనీ, ఈ ప్రపంచాన్నంతా జయించి రాజ్యాధికారం చేయాలనీ మనస్సు ఉవ్విళ్ళూరుతుంది. జీవితంలో ఉండే సమస్యలను, అపశ్రుతు లను, అసంబద్ధతలను మట్టుపెట్టాలంటే అసలైన ఆత్మకు (చిత్ చేతన) తగిన ప్రాధా న్యత కల్పించి, అహంకార, మమకారాల వలన ఉద్భవించిన భ్రమలను అంతం చేయాలి. దీని ఉద్దేశ్యం జీవితాన్ని, దానికి సహజంగా వుండే ధోరణిలో అభివృద్ధి చెందకుండా, బలవంతంగా నిరోధించాలని కాదు. కాముకమైన ఆత్మకు, దాని సహజ, బాహిర కాంక్షల వలయం వెనక దాగివున్న అంతర్గతమైన, సత్యమైన నిత్యమైన చిదాత్మను వెలికితెచ్చి, తనదైన దివ్యశక్తులను ప్రకటింపజేసే అవకాశమూ, స్వేచ్ఛ దానికి కల్పించాలి. జీవశక్తికి సహజమైన దివ్యత్వం తన కార్యక్రమాలు



శ్రీమాత సందేశం

నీకు నా ప్రేమానుగ్రహాలు, ఆశీస్సులు

నీవు వాటి అనుభూతిని పొందాలనుకుంటే, నీవు తప్పక నియమపాలన కలిగి, శ్రద్ధతో సదా జాగరూకుడవై, ఏకాగ్రతను కలిగి యుండాలి. అన్నింటిని మించి ఎటువంటి నీ కోరికలకూ, ఇష్టాయిష్టాలకూ ఎంతమాత్రమూ తల ఒగ్గకూడదు.

ఈ జీవితంలో రెండు పక్షాలున్నాయి, ఒకటి అస్తవ్యస్తమై, పనికిరాని కోరికలతో నిండిన జీవితం, మరొకటి ఆకాంక్ష అనే జ్యోతి లోనికి ఆరోహించడం, తన నిమ్నప్రకృతి మీద ఆధిపత్యం వహించడం. ఈ రెండింటిలో ఏదో ఒక దానిని ఎంచుకోవలసినదే.

నిర్వహించుకోవాలంటే ప్రాణికసత్తకు అంతర్గతంగా ఉండే దాని 'దివ్యత్వపు ఆధిపత్యంలో' జీవనకార్యక్రమాలు కొనసాగాలి. ప్రాణికసత్త యొక్క లక్ష్యం దీనిని మార్చటం కాదు; అది ఆలాగే ఉండవచ్చు. కాని దాని స్వరూపస్వభావాలు మాత్రం మారిపోవాలి.

'దివ్యజీవనశక్తి' కూడా అభివృద్ధిని కాంక్షించేదే; స్వయంశక్తిపై ఆధారపడేదే! కాని ఆత్మలో అంతర్గతంగా ఉన్న దివ్యత్వంపై అది ఆధారపడుతుంది. తాత్కాలికమైన, బాహిరమైన వ్యక్తిత్వంపై మాత్రం ఆధారపడదు. దాని ఎదుగుదల వ్యక్తియొక్క అంతర్గత దివ్యత్వం దిశగా ఉంటుంది. అనశ్వరమై, శాశ్వతమైన అంతర్గత దివ్య వ్యక్తిత్వానికి అది దర్పణం పడుతుంది. 'అహం' అనేదాన్ని అంతం చేసినపుడే దివ్యత్వం బయటకు వస్తుంది. ఇదే జీవితపు అసలైన లక్ష్యం. ఇదే అభివృద్ధి: ఆత్మ సహజమైన అభివృద్ధి. దైహిక, మానసిక వికాసం కోసం ప్రతిదీ అనుభవించాలనీ, సొంతం చేసుకోవాలనీ పడే ఆరాటం కాదిది; తామసికశక్తులపై విజయం కోసం చేసే పోరాటం. అంతర్గత, బాహ్య ప్రకృతుల స్వయంపాలన, ఆధిపత్యము, దివ్య ప్రేమలతో, ఇచ్ఛాశక్తితో అజ్ఞానంపై జరిపే సమరం.

ఇది కేవలం తర్కంతో సమర్థించుకోవటం కాదు; నీతులు వల్లించటం కాదు. అతీత మానసస్థితిని సాధించటం. యోగానికి లక్ష్యమైన 'ఆధ్యాత్మికత' ఇదే. కేవలం పైపైన కనపడే ఉద్దేశ్యాలను చక్కపెట్టుకోవటం కాదిది.

మరుగునపడి ఉన్న దివ్యత్వాన్ని పునః ప్రతిష్ఠించి, ఆ అతీత దివ్యశక్తి ద్వారా నేరుగా పరిపాలన సాగించటం ఇదే. ఈ విధంగా జీవనాన్ని 'దివ్యజీవనం' గా మార్చవచ్చు. ప్రస్తుతం ఆ నిత్య నర్తకుడు ధరించిన మారువేషపు ముసుగు కాదిది. తర్కంతో మసిపూసి మారేడు కాయ చెయ్యటం కాదిది. లోనున్న నిజచైతన్యాన్ని, ఆధ్యాత్మికతనూ సంతరించుకోవటం. ఈ విధంగా చేయటం వలన మాత్రమే జీవితాన్ని ఈనాటి అయోమయస్థితి నుండి కాపాడి దాని స్పష్టమైన లక్ష్యాన్ని చేరుకోగలం.

*

పూర్ణత, ప్రసన్నత, సమత, భోగసామర్ధ్యము అనే నాలుగు గుణములు జీవాత్మ యొక్క నాల్గు తత్వములు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

నేటి మన సహజ జీవనము — ఆధ్యాత్మిక జీవనము

సాధారణంగా సాగిపోయే మన సహజ జీవనాన్ని అధికంగా ప్రభావితం చేసేవి భౌతిక ప్రకృతి యొక్క విభిన్న రూపాలు, మరియు వస్తువుల యొక్క బాహ్యస్పర్శలు. వాటంతట అవి ఇంద్రియాల ద్వారా ప్రాణానికి ప్రత్యక్షమౌతాయి. వెనువెంటనే ప్రాణం తిరిగి ఇంద్రియాల ద్వారానే వీటి వైపు మళ్ళి వాటిని స్వంతం చేసుకొనుటకు, వాటితో వ్యవహరించుటకు, వాటిని వాంఛించుటకు, వాటిని అంటిపెట్టుకుని ఉండుటకు, ఫలితాలను పొందుటకు ఉబలాడ పడుతుంది. మనస్సు దాని అంతర్గత సంవేదనలలోను, ప్రతిస్పందనలలోను, గ్రహించే పద్ధతులలోను, ఆలోచనా విధానాలలోను, అనుభూతులలోను ఇంద్రియాల చర్యలకే కట్టుబడి ఉంటుంది. తార్కిక జ్ఞానం కూడ మనస్సుకు లోబడి, ఇంద్రియగతమైన జీవనానికి అధీనమౌతుంది. ఈ జీవనశైలిలో, అంతస్సత్తా వస్తువుల బాహ్యపోకడలకు ప్రభావితమై, క్షణమాత్రమైన దాని నుండి విడిపోలేదు. మన కార్యాచరణ పరిధినిగాని, తన్మూలంగా ఒనగూరే మానసిక ఫలితాలను గాని, మనలో ఏర్పడే ప్రతిస్పందనలనుగాని, అధిగమించలేదు. ఇందుకు కారణం అహంభావ తత్వం, దీని వలన తార్కికజ్ఞానం మన మనస్సు మీద, ఇచ్ఛ మీద, బావన మీద, శరీరం మీద ప్రకృతి యొక్క సమిష్టి కార్యాచరణ మీద చూపే ప్రభావం ఇతర మనస్సుల మీద, సంకల్పాల మీద, నాడీవ్యవస్థ మీద, శరీరాల మీద చూపే ప్రభావం మధ్యనున్న తారతమ్యాన్ని సూచిస్తుంది. ప్రకృతి మన అహంకారంపై చూపే ప్రభావం పైన, మన అహంకారం ప్రకృతి స్పర్శలకు స్పందించే విధానం పైన, జీవితంపై మనకు కలిగే అవగాహన ఆధారపడి ఉంటుంది. అంతకు మించి మనకు తెలియదు. అంతకు మించి మనమేమీ కాదని అనిపిస్తుంది. అప్పుడు అంతరాత్మ కూడ మనస్సు, సంకల్పం, భావోద్రేకాల పరిగ్రహణ మరియు ప్రతిస్పందనల సంకలనంగా తోస్తుంది. మనం మన అహంకారాన్ని విస్తృతపరచవచ్చు; కుటుంబం, వంశం, వర్గం, రాజ్యం, దేశంతోనే కాక సమస్త మానవజాతితో సైతం తాదాత్మ్యం చెందవచ్చు. అయినప్పటికి, అహంకారం ఈ ప్రచ్ఛన్న రూపాలలో మన చర్యలకు మూలకారణమై ఉంటుంది. బాహ్యవస్తు విషయాలతో విస్తృతంగా వ్యవహరించుటచేత తనకు ఒక ప్రత్యేక సత్తా ఉన్నదనే సంతృప్తిని మాత్రం పొందగలుగుతుంది.

అప్పటికీ, మనలో పనిచేసేది సహజ సత్తా యొక్క సంకల్పమే. తన వ్యక్తిత్వం

యొక్క వివిధ కోణాలను తృప్తిపరచుట కోసం బాహ్యప్రపంచ స్పర్శలను సంగ్ర హిస్తుంది. ఇలా చేయుటలో దాని సంకల్పం యెల్లప్పుడు కామన, తీవ్రవాంఛ, మనం చేసే పనులకు, ఫలితాలకు చెందినదై ఉంటుంది. మనలో ప్రకృతి యొక్క సంకల్పానికి సంబంధించినదై ఉంటుంది. 'మా వ్యక్తిగత సంకల్పం' అని అంటుంటాం కాని, ఈ అహంకారపూరితమైన వ్యక్తిత్వం మనలో ప్రకృతి యొక్క కల్పన. అది స్వేచ్ఛాయుత ఆత్మ కాదు, కానేరదు కూడ. అది స్వతంత్ర సత్తా కూడ కాదు. అది అంతా ప్రకృతి లక్షణాల చర్యయే. అది తామసిక చర్య అయ్యుండవచ్చు. అలాంటప్పుడు మనకొక అచేతనావృతమైన వ్యక్తిత్వం కలుగుతుంది. అది స్వతం త్రంగా వ్యవహరించడానికి గట్టి ప్రయత్నం చేయలేదు. యాంత్రికంగా జరిగిపోయే కర్మకాండతో సంతృప్తి చెందుతుంది. ఒకవేళ అది రాజసికచర్య అయినట్లయితే, మనకు సంతత కర్మాచరణకై తహతహలాడే వ్యక్తిత్వం ఏర్పడుతుంది. ప్రకృతిని శాసించే తీరుగా వ్యవహరించి తన ప్రయోజనాలను, కామనలను తీర్చుకొనుటలో ఆ ప్రకృతినే వాడుకొనుటకు ప్రయత్నిస్తుంది కాని, తాను పెత్తనం చెలాయిస్తున్నాననే భావన కేవలం ఒక భ్రమ మాత్రమేనని, నిజానికి తాను చేసేది ఊడిగం అని గ్రహిం చలేదు. ఎందుకనగా, దాని అవసరాలు, కోరికలు ప్రకృతిపరమైనవి. వాటి ప్రభావాలకు మనం లోబడి ఉన్నంతవరకు మనకు స్వేచ్ఛ ఉండదు. ఇక ఆ ప్రకృతి చర్య సాత్వికమైనదైతే, అప్పుడు మన కొక ప్రదీప్త వ్యక్తిత్వం అలవడుతుంది. హేతుబద్ధంగా జీవించే ప్రయత్నం చేస్తాం లేదా మంచితనము, సత్యములతో కూడిన ఒక సుందరమైన ఉన్నత ఆదర్శాన్ని సాధించే దిశగా జీవనం కొనసాగిస్తాము. అయినప్పటికి, ఈ కారణం కూడ ప్రకృతిలో చోటు చేసుకొనే మార్పులకు ప్రభావితమయ్యేది కావున, ఈ ఆదర్శాలు కేవలం మార్పుచెందే వ్యక్తిత్వం యొక్క వివిధ దశలుగ మిగిలి పోతాయి. ఆ కారణంగా చివరకు ఒక నిర్దిష్టమైన ప్రమాణం చిక్కదు, శాశ్వత సంతృప్తి సమకూరదు. మనమింకా నిరంతర మార్పు అనే చక్రభ్రమణంలో చిక్కుకుని, దాని పరిభ్రమణంలో కొట్టుకుపోతూ అహంకారం ద్వారా మనలోను, అంతటిలోను నిక్షిప్తమై ఉన్న ఒకానొక శక్తికి లోబడి ఉంటాము కాని మనమే ఆ శక్తి మాత్రం కాలేము. దానితో తాదాత్మ్యం చెందలేం సరికదా, సంపర్కము కూడ ఏర్పరుచుకో లేము. అప్పటికీ, మనకు స్వేచ్ఛ గాని యదార్థమైన అధికారంగాని లభించవు.

అయినప్పటికి, విముక్తి సాధ్యమే. ఇందుకుగాను ముందుగ మన ఇంద్రియాలపై

బాహ్యప్రపంచము చూపే ప్రభావము నుండి దూరం కావాలి, అంతర్ముఖులం కావాలి. అనగా, మన అంతరాలలో జీవించగలగాలి. బాహ్యవస్తు విషయాల వెంట పరుగులు తీసే మన సహజ ఇంద్రియచాపల్య ధోరణికి అడ్డుకట్ట వేయాలి. ఇంద్రియాలను అదుపులో పెట్టాలి. వేటి వెంట అవి పరుగెడతాయో వాటి అవసరం లేకుండా వ్యవహరించ గలగాలి. యదార్థమైన జీవనానికి ఇవి పాటించవలసిన ప్రధానమైన నియమాలు. ఆ విధంగా చేయగలిగినప్పుడే మనలో ఆత్మ ఒకటి ఉన్నదనే అనుభూతి కలుగుట ఆరంభమౌతుంది. బాహ్యవస్తువుల స్పర్శలను గ్రహించుటలో ఈ ఆత్మ మనస్సు యొక్క పరివర్తనల కన్న భిన్నంగా స్పందిస్తుందని తెలుసుకుంటాము. ఈ ఆత్మ లోతుల్లోకి పరిశీలించినట్లయితే అదొక స్వయంభువు అని, మార్పుచెందని ప్రశాంతమైన, స్వయంసిద్ధమైన, వైభవోపేతమైన, స్వచ్ఛమైన, మహనీయమైన, స్వయంనియంత్రణ కలిగిన బాహ్యప్రకృతి యొక్క ఆతురతతో కూడిన పరుగులతో చలించనిదని అవగతమౌతుంది. కాని, కోరికలకు దాసులమై ఉన్నంతకాలం ఇది సాధ్యపడదు. ఎందుకనగా, కోరిక మన బాహ్య జీవనశైలికి మూలాధారం. ఇంద్రియాగత జీవనంతోనే మన బాహ్య జీవనశైలి సంతృప్తిచెందుతుంది. తీవ్రకామనల ఖేలనలోనే దాని ఉనికిని వెతుక్కుంటుంది. అందువలన మనం కోరికను త్యజించాలి. ఆ విధంగా మన సహజ సత్తా యొక్క ఉన్ముఖతను రూపుమాపితే, దాని భావోద్వేగ ఫలితాలగు తీవ్రకామనలు శాంతిస్తాయి. ఎందుకనగా వీటిని ఆదరించే లాభనష్టాలు, జయాపజయాలు, సుఖదుఃఖాలు, సంతోషవిచార స్పర్శలు, మన అంతరాత్మ నుండి తొలగిపోతాయి. అప్పుడు ఒక ప్రశాంతమైన సమానత్వం సమకూరుతుంది. ఈ ప్రపంచంలో మనుగడ కొనసాగిస్తూ, కర్మాచరణ గావిస్తూ తద్వారా సమకూరే కర్మఫలాలను ఆశించుట స్వాభావికం కావున, ఆ స్వభావాన్ని మార్చుకోవాలి. ఫలాపేక్ష లేకుండ కర్మను ఆచరించాలి. లేనట్లయితే కోరికలు, వాటి ననుసరించి సంభవించే ఫలితాలు అలాగే నిలబడిపోతాయి. కాని, మనలో కార్యాచరణగావించే ఆ నిర్వాహకుడి ప్రకృతిని ఎలా మార్చగలం? మార్చాలంటే, కర్మలను అహంకార పూరిత వ్యక్తిత్వపరిధుల నుండి వేరుచేయాలి. ఇదంతా కేవలం ప్రకృతి గుణముల ఖేలనా పర్యవసానమని తార్కిక దృక్పథంతో గమనించగలగాలి. ఈ ఖేలనకు మన ఆత్మకు ఎలాంటి సంబంధం లేకుండా చేయాలి. ముందుగా మన అంతరాత్మను ప్రకృతి కర్మాచరణకు ఒక సాక్షిగ నిలిపి, ఆ కర్మలను నిజంగా వాటి వెనుక నున్నది,

మనకన్నా మిన్నయైనది ఏది ప్రకృతి యందున్నదో, ఆ దివ్యశక్తికే విడిచిపెట్టాలి; మన వ్యక్తిత్వానికి గాదు, ఆ విశ్వనాథుడికే వదిలెయ్యాలి. కాని, మనస్సు దీని కంతటికి సమ్మతించదు. ఇంద్రియాల వెంట పరుగులు తీస్తూ, తర్కాన్ని సంకల్పాన్ని కూడ దానితోపాటు కొనిపోవటం మనస్సు యొక్క స్వభావం. కావున మన మనస్సును నిశ్చల పరచాలి. ఎలాంటి పరిపూర్ణ ప్రశాంత నిశ్చలస్థితిలోనైతే మనలోని సచ్చిదానందమయమైన, నిశ్చలమైన, శాంతమైన ఆత్మ, సర్వకాల సర్వావస్థలలోను వస్తువిషయ స్పర్శలతో ప్రభావితంకాని, కలత చెందని ఆత్మ యొక్క ఉనికి మనకు అవగతమౌతుందో అప్పుడే అది స్వయంతృప్తిని పొందుతుంది. అందులో మాత్రమే దానికి శాశ్వత సంతృప్తి లభిస్తుంది.

ఈ ఆత్మయే మనలో స్వయంభువుగ నెలకొని యున్న సత్త. ఇది మన వ్యక్తిగత ఉనికికి పరిమితమైనది కాదు. అన్ని అస్తిత్వాలలోను సమానంగ ఉంటుంది. అంతటా నిండి ఉంటుంది. అన్ని వస్తుసముదాయాలకు సమానంగ వర్తిస్తుంది. తన అనంతత్వముతో సర్వజగత్కార్యాచరణకు ఆధారభూతమై నిలుస్తుంది. పరిమితమైనదానికి మాత్రమే పరిమితం కాదు. ప్రకృతిలోని మార్పుల వలన, వ్యక్తిత్వ మార్పుల వలన పరివర్తన చెందదు. ఎప్పుడైతే ఈ ఆత్మ మనలో ఆవిష్కరిస్తుందో, దాని యొక్క ప్రశాంతత, నిశ్చలతల అనుభూతి మనకు కలుగుతుందో, అప్పుడు ఆ స్థితిలోకి మనం ఎదగగలము. ప్రకృతి యొక్క నిమ్నలోతుల్లోకి దిగజారిన మన అంతరాత్మస్థాయిని తిరిగి ఆత్మస్థాయికి పునరాగమనము అగునట్లుగ చేయగలము. మనకు సంప్రాప్తించిన ప్రశాంతత, సమత్వము, ఉద్వేగముడిగిన భావాతీతశక్తితో ఇది సాధ్యపడుతుంది. కారణం, ఈ లక్షణాల దిశగ మనం ఎలా పురోగమిస్తుంటామో, ఎంతటి పరిపూర్ణతను పొందగలుగుతామో, ఎంత మేరకు మన ప్రకృతి వాటికి ప్రభావితమౌతుందో అంతమేరకు, ఈ ప్రశాంత, సమత్వ, ఉద్వేగరహిత భావాతీత, విశ్వవ్యాప్త ఆత్మస్థాయికి ఎదగగలుగుతాము. మన ఇంద్రియాలు కూడ నిశ్చలస్థితికి చేరుకుంటాయి. ఒక పరమ ప్రశాంతస్థితిలో ప్రాపంచిక స్పర్శలను స్వీకరించగలుగుతాము. మన మనస్సు నిశ్చలమై ప్రశాంతమైన విశ్వసాక్షి అవుతుంది. మన అహంకారము తనకైతాను ఈ నిస్వార్థ ఉనికిలో లీనమైపోతుంది. ఈ లక్షణా లన్నింటిని జీర్ణించుకున్నందున, అన్ని విషయాలను ఈ ఆత్మదృష్టితోనే చూడగలము. ఈ

ఆత్మనే అందరిలోను చూడగలము. జీవుల ఆధ్యాత్మిక స్థాయి ప్రాతిపదికన అన్ని జీవులలో ఒకరం కాగలము.

*

కోరిక ఒకదానికి లోబడి ఉంటే, దానిని అనుసరించి ఉండే వైషమ్యము, దుఃఖమునకు కూడ లోబడి ఉంటుందనటానికి చిహ్నము. ఏది స్వతంత్ర సత్తా కలిగి ఉంటుందో, ఏది ఒక్కటిగ నుండి స్వీయప్రభుతను కలిగి ఉంటుందో, అది కాంక్షించదు, కాని, దేనిని కూడ పరాధీనం కానీయకుండ ఇముడ్చుకుంటుంది, స్వాధీనపరచుకుంటుంది, అనుభవిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: అందుగులపాటి కైలాసపతి, జానకి

బాహ్యవిషయాలతో నిష్కామమైన సంబంధం ఎలా సాధ్యం?

ఈ కామనారహిత సంబంధం ఎలా సాధ్యం, ఇలా భోగాసక్తి లేకుండా ఇంద్రియాలను వినియోగించడం ఎలా? అది సాధ్యమే, పరమమైన దృష్టి ఉంటే అది సాధ్యము — అంటే ఆత్మ, పరమపురుషుని వల్ల యోగమార్గంలో జీవితం సాగిస్తూ, మనసా కర్మణా దానితో ఏకత్వాన్ని పొందితే జ్ఞానయోగం ద్వారా అతి సుసాధ్యమవుతుంది. ఎందువల్లనంటే చిదాత్మ పరమ ప్రశాంతమైనది; అది ఆత్మానందపూరకమైనది. మనం ఆ పరమ పురుషుని మనలో దర్శించుకోగలిగితే మన కామపూరిత వస్తుగత సుఖాలు, ఏవగింపుల స్థానంలో ఆత్మయొక్క ద్వంద్వాతీత ఆనందాతిశయం చోటు చేసుకోగలదు. ముక్తికి ఇదే సరియైన మార్గము.

క్రమశిక్షణ, ఆత్మసంయమనము, అంత తేలికైనవి కావు. తమపై తమకు ఏదో కొంత స్వయం నియంత్రణ ఉండాలని మేధావంతులందరికీ తెలిసిన విషయమే. ఇంద్రియనిగ్రహం పాటించాలని చెప్పటం సర్వసాధారణమే. కానీ ఆ సలహా అసంపూర్ణంగా ఉండి ఆచరణలో లోపభూయిష్టంగా, అస్తవ్యస్తంగా తయారవుతుంది. చివరకు

జితేంద్రియత్వం కోసం కష్టపడే సన్యాసి కూడా, ఎంత విజ్ఞత కలిగినవాడైనప్పటికీ, ఇంద్రియాలకు లోబడక తప్పటం లేదు. దానికి కారణం మనస్సు ఇంద్రియాలకు అమ్ముడుపోవటమే. అది అత్యంత ఆసక్తితో ఇంద్రియ విషయాలను పరిశీలిస్తూ వాటిపైనే కేంద్రీకృతమై యుండి బుద్ధికి ఆలోచనంతా అదే అనేటట్లుగా చేసి సంకల్పానికి అత్యంతాసక్తి కలిగేటట్లు చేస్తుంది. దానితో వ్యక్తికి ఇంద్రియ విషయాలపై మక్కువ, మక్కువ వల్ల కోరిక, కోరిక వల్ల వ్యాకులత, అది తీరకపోయినా, వ్యతిరేకత ఎదురైనా కోపమూ కలుగుతాయి. ఉద్రేకం వలన ఆత్మ మసకబారుతుంది. దాని వల్ల బుద్ధి, సంకల్పమూ కూడా పరిశీలకాత్మలో స్థిరంగా ఉండి చూడలేవు; అంతరాత్మ జ్ఞాపకశక్తి కొంచెం క్షీణిస్తుంది. దాని వల్ల బౌద్ధిక సంకల్పం కూడా మసకబారటం కానీ నశించటం కానీ జరుగుతుంది. ఆ కాస్సేపూ మన ఉనికి మనకే తెలియకుండా అయిపోతుంది; ఉద్రేకపు పొరలలో అది అదృశ్యమైపోతుంది. మనమే ఆ ఉద్రిక్తతతగా, కసిగా, సంతాపంగా అయిపోయి, తాను, బుద్ధి, సంకల్పం అనేవి మాయమైపోతాయి. దీన్నంతా నిరోధించి ఇంద్రియాలను పూర్తిగా స్వాధీనంలోకి తెచ్చుకోవాలి. సంపూర్ణమైన ఇంద్రియనిగ్రహం ద్వారా మాత్రమే వివేకవంతమైన ప్రశాంతబుద్ధిని దాని స్థానంలో దానిని స్థిరంగా స్థాపించగలము.

ఇది కేవలం బుద్ధిపూర్వకంగానో, మనోనిగ్రహంతోనో, పూర్ణంగా సాధ్యపడదు. అది యోగం ద్వారా, అంతకంటె ఉన్నతమైన నిశ్చల ఆత్మనిగ్రహం, స్వతస్సిద్ధంగా ఉండే దివ్యానుగ్రహం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. భక్తితత్పరతతో, సమర్పణా భావంతో 'నాకు' నివేదించుకున్నప్పుడు మాత్రమే యోగం సఫలీకృతమవుతుందని కృష్ణ భగవానుడు చెప్పి ఉన్నాడు. ఆ విముక్తి కలిగించేవాడు మనలోనే ఉన్నాడు. అయితే అది మన మనస్సూ కాదు, మన బుద్ధీ కాదు, మన స్వసంకల్పమూ కాదు — అవన్నీ ఉపకరణాలు మాత్రమే. మనం ఆశ్రయించవలసింది మనలో నున్న ఆ పరమ పురుషుని మాత్రమే. దానికిగాను మనం సంపూర్ణంగా ఆయనను ధ్యేయంగా చేసుకొని ఆయనతో ఆత్మసంస్పర్శను పొందుతూ ఉండాలి. "దృఢంగా యోగములో ఉపస్థితులై నాకే సమర్పించుకోండి" అనటంలో అర్థమిదే. అయితే ఇప్పటిదాకా అది కేవలం యథాలాపంగా గీతార్థానికి చెప్పిన సూచన మాత్రమే. ఇంకా విశదీకరించ వలసిన భగవద్గీత ఉత్కృష్ట రహస్యసారమంతా బీజరూపకంగా మూడే మూడు మాటల్లో ఇమిడి ఉంది. "యుక్తాసీత మత్పరః"

ఈ విధంగా జరిగినట్లయితే ఇంద్రియ విషయాలతో మసలడం, వాటితో అనుబంధం పెట్టుకోవడం, వాటి మీద పనిచేయడం సాధ్యపడుతుంది. అయితే ఇంద్రియాలు అంతరాత్మకు లోబడి ఉండాలి కానీ ఇంద్రియ విషయాలకూ, వాటి సంబంధాలకూ, వాటి ప్రతిస్పందనలకూ కాదు. ఆ అంతరాత్మ కూడా మళ్ళీ ఉత్కృష్ట ఆత్మకు అంటే లోపలి పరమ పురుషునికి, విధేయుడై యుండాలి. ఆ విధంగా ప్రతిస్పందనల నుంచి విముక్తి పొందిన ఇంద్రియాలు ఇష్టానిష్టాలకు, ప్రేమానురాగాలకు అతీతమవుతాయి. ఇంకా అనుకూల ప్రతికూల కోరిక ద్వయాన్ని కూడా తప్పించుకోగలుగుతాయి. దానితో నిశ్చలత, ప్రశాంతత, స్వచ్ఛత, ఆనందకరమైన నిరాకులము, ఆత్మానుగ్రహము వ్యక్తిలో స్థిరపడతాయి. స్వచ్ఛమైన ఆ నిరాకులమే ఆత్మానందానికి మూలము; నిరాకులాత్మను కలతపరిచే దుఃఖము శక్తిహీనమవుతుంది; ఆ ప్రశాంతచిత్తములో బుద్ధి పునఃస్థాపితమవుతుంది. బాధా నిర్మూలన జరుగుతుంది.

అయినప్పటికీ అతను కర్మాచరణ మానడు. భగవద్గీతలో ఉన్న ఉపజ్ఞ, (నూతనత్వం) శక్తి ఇది; ఈ విధమైన స్థిరత్వం రూఢిపరచుకున్న తర్వాత కూడా, ప్రకృతిపై ఆధిక్యత తర్వాత కూడా, జీవన్ముక్తునిలో పరాప్రకృతిపై ఆధిక్యత తర్వాత కూడా, జీవన్ముక్తునిలో పరాప్రకృతికి చర్యలు జరిగే స్థానం శూన్యమైనా కూడా దాని పద్ధతే కొనసాగించుతుంది. కర్మాచారణ కొనసాగాలనే అంటుంది. ఆ విధంగా సన్యాసుల మెట్టవేదాంత దోరణిలోని లోపాలను అధిగమించవచ్చు — ఆ లోపాన్నించి ఇప్పుడు వారు కూడా తప్పించుకోవాలనే చూస్తున్నారు. — "నీకు కర్మ చేసే హక్కు ఉన్నది, కానీ దాని ఫలానికి గాదు. ఫలితాల నాశించి ఫలితం కోసమే పనిచేయాలని అనుకోవద్దు. అట్లాగని పనిచేయకుండా ఉండటంలో ఆసక్తిపెట్టకు". కాబట్టి అది వేదానుయాయులు ఆచరించే చర్యలూ కాదు, నిరంతర కార్యకలాపాల కోసం వెంపర్లాడే ఆతృతతో నిండిన, గట్టి మనస్సుగల మానవుల నుద్దేశించిందీ కాదు. ఆచరణాత్మకంగా, చలాకీగా ఉండే వ్యక్తులకే విధించబడింది. "యోగవిధానంలోనే ఉంటూ నీ పనులు నీవు చేయి, ఫలాపేక్ష వదిలి గెలుపు ఓటమిలను సమభావంతో స్వీకరిస్తూ చేస్తుంటే ఆ సమభావననే యోగానుష్ఠానం" అంటారు. మంచిచెడుల సాపేక్ష నిర్ణయం, పాపభీతి, పుణ్యం కోసం పడే యాతన, వీటి వల్ల కార్యాచరణ కష్టసాధ్యమవుతోంది. హేతువునూ, సంకల్పాన్నీ కూడా భగవంతుని యందే అర్పించిన జీవన్ముక్తుడు ఈ ద్వైత ప్రపంచంలో కూడా సత్కర్మలకూ, దుష్కర్మలకూ అతీ

తంగానే ఉంటాడు. ఎందువల్లనంటే అతను ఆత్మజ్ఞానంతో ఏర్పడిన ఒక ఉత్తమ ధర్మానికి, మంచిచెడులకతీతమైన ఉన్నత ధర్మానికి కట్టుబడి ఉంటాడు. అటువంటి కామనారహిత కర్మలలో ఒక దృఢత్వముండదు, అది ప్రయోజనకారి కాదు, ఒక సిసలైన ఉద్దేశం ఉండదు, పటిష్టమైన సృజనాత్మకశక్తి ఉండదు, అవునా? అది కాదు. యోగవిధానంలో చేసిన పని ఉత్కృష్టమైందే కాక ప్రాపంచిక విషయాల్లో కూడా చాలా వివేకవంతంగా, ఫలప్రదంగా, అత్యంత శక్తివంతంగా తయారవుతుంది. ఎందువల్లనంటే అది సకల కర్మలకు అధినేత అయిన విధాత తెలిపిన, సంకల్పాల ననుసరించే జరుగుతుంది. "పనిలో నేర్పరితనమే యోగము". లోకరివాజు ననుసరించి యోగి ఆదర్శం ఈ బాధిత, దుఃఖిత మానవ జీవితం నుంచి తప్పించుకోవడమే అయితే జీవితంలో చేసే కార్యాచరణమంతా ఆతని విశ్వాత్మక ఆదర్శాల నుంచి వెనక్కి లాగేది గానే ఉంటుంది. అదీ కాదు. ఫలాపేక్ష లేకుండా దైవయోగంలో ఉండి పనిచేసే ఋషులు జన్మరాహిత్యాన్ని పొందుతున్నారు. ఈ పీడిత మానవాళి మనసునూ, జీవితాన్నీ దుఃఖపెట్టే జాడ్యాలేవీ అంటని పరిపూర్ణ స్థితిని వారు చేరు కుంటారు.

ఆ పరిపూర్ణ స్థాయి బ్రాహ్మీస్థితి. అక్కడ వారు స్థిరత్వాన్ని పొందుతారు. అక్కడి స్థితి పృథ్వీజీవుల దృక్పథానికి పూర్తి వ్యతిరేకం. వీరి అనుభవాలు, విలువలు, దృక్కోణాలూ అక్కడ తల్లక్రిందైపోతాయి. ద్వంద్వాలతో కూడిన జీవితంలో వీరి జాగృతి, చైతన్యం, ఉజ్జ్వలమాన చర్యలు, విజ్ఞానం, ఆత్మయోగికి కలత నిద్రతో కూడిన తిమిరము. వీరిలో ఉన్నతస్థాయి జీవి యొక్క విజ్ఞానం, సంకల్పం స్థంబించి పోయే రాత్రి ఏదైతే ఉందో అది ఆత్మసంయమనం పొందిన యోగికి యదార్ధ జ్ఞానం, శక్తితో కూడిన ప్రకాశమాన దివసము. బురద నీటి వంటి వీరు ప్రతి చిన్న పిల్లకెరటం లాంటి కోరికకు కలత చెందుతారు. అతి విశాలత్వము, చైతన్యము కల యోగి మాత్రం సాగరం వలె ఎప్పుడూ నిండుతున్నప్పటికీ చలించకుండా ఆత్మప్రశాంతతో స్థిమితంగా ఉంటాడు. సముద్రంలోకి నీరు ప్రవహిస్తున్నట్లు ప్రపంచం లోని కోరికలన్నీ అతనిలో ప్రవేశించినప్పటికీ అతనికి ఏ కోరికా కలగదు, ఏ విధంగానూ కలత జెందడు. వారు సంకటకారియైన అహంకారం నిండి నీవు, నేను అని వ్యాకులపడు తుంటే, అందరిలోనూ ఉన్న ఆత్మతో మమైక్యాన్ని పొందిన అతనికి మాత్రం తాను, పరము అనే విషయమే ఉండదు. అందరూ పనిచేసినట్లే పనిచేస్తాడు కానీ

వారకుండే కోరికలను, ఇచ్ఛలను వదిలివేస్తాడు. బాహ్యవిషయాల మెరమెరలకు దిగ్భ్రాంతి చెందని సుస్థిర ప్రశాంతిని పొందుతాడు. తన వ్యక్తి అహంకారాన్ని ఆ ఏకత్వంలో విలీనం చేసి ఆ ఏకత్వంలోనే చివరిదాకా ఉండి పరబ్రహ్మలో ఐక్యం చెందుతాడు. ఆ నిర్వాణం బౌద్ధులు చెప్పే అభావమైన ఆత్మోన్మూలనం కాదు. అది ఎంతో ఉత్కృష్టమైన నిమజ్జనం. భిన్నంగా ఉండే తన ఆత్మను అనంతమైన సత్యంతో ఏకైక భావాతీత అస్తిత్వంలో విలీనం చేయడమే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

కోరికలపై విజయం

అన్ని సాధారణ ప్రాణిక కదలికలు నిజమైన అస్తిత్వానికి చెందినవి కావు. అవి బయట నుండే వస్తాయి. అవి ఆత్మకు చెందినవి కావు. ఆత్మ నుండి అవి పుట్టవు. ప్రకృతి నుండి వచ్చే తరంగాలు.

కోరికలు బయట నుండే వస్తాయి. అవచేతనా ప్రాణికంలోకి ప్రవేశించి, ఉపరితలా నికి వస్తాయి. అవి ఉపరితలానికి వచ్చినప్పుడు, వాటి గూర్చి మనస్సుకు తెలిసి నప్పుడు, మనకు కోరిక ఉన్నట్లు స్పృహ కలుగుతుంది. ప్రాణికం నుండి మనస్సులోకి కోరికి ఉత్పన్న మైనందున అది మనదే అని అనిపిస్తుంది. అది బయట నుండి వచ్చిందని మనకు తెలియదు. ప్రాణికానికి చెందినదేదో, అస్తిత్వానికి చెందినదేదో దానిని బాధ్యురాలిగా చేసినదేదో, అది కోరిక కాదు, విశ్వజనీన ప్రకృతి నుండి వచ్చే తరంగాలకు సూచనాత్మక ప్రవాహాలకు ప్రతిస్పందించే అలవాటు.

*

కోరికను పూర్తిగా వదిలించుకోవటానికి చాలా కాలం పడుతుంది. దానిని నీ స్వభావము నుండి నెట్టివేసి, బయటనుండి వచ్చే శక్తి అని, తన పంజాలను ప్రాణికంలోనూ, భౌతికశరీరంలోనూ, బిగించుతోందని తెలిసిననాడు దానిని వదిలించుకోవడం తేలిక.

నీ అలవాటు ఎంత ప్రబలమైనదంటే, అది నీలోని భావం అని గాని నీలో మొల కెత్తిందని గాని నీవు అనుకోవు. అందువల్ల ఆ కదలికలను రూపుమాపడం, దాని నియంత్రణను తొలగించడం మరింత కష్టం.

*

కోరికను త్రోసిపుచ్చడమంటే ప్రగాఢమైన వాంఛను త్రోసిపుచ్చడమే. అది ఆత్మకు చెందినది కాదు. అంతః ప్రకృతికి చెందినది కాదు. ఒక విదేశీ వస్తువులా దానిని చైతన్యం నుండి నెట్టివేయాలి. కోరిక చేసే సూచనలకు లొంగిపోవడాన్ని కూడా తిరస్కరించాలి. కోరిక సరియైన చర్యను సూచించకపోతే, దానికి దూరంగా వుండడం, యోగశిక్షణలో ఒక భాగం. మానసిక పరివ్రాజక సూత్రంతో కానీ, కఠిన నైతిక నియమాలతోకాని, తప్పు పద్ధతిలో ఈ పనిచేస్తే, అది నిగ్రహం అంటారు. అణచివేతకు, అంతర్గత తిరస్కృతికి తేడా వుంది. మానసిక, నైతిక నిగ్రహానికి, ఆధ్యాత్మిక పవిత్రీకరణకు గల తేడా అది.

*

నిగ్రహానికి, సంయమానికి తేడా వుంది. "కోరిక కోరకుండా వుండలేను. కాని ఆ కోరికను సంతృప్తిపరచను. అని ఒకరు అంటే — మరొకరు నేనా కోరికను, దానిని సంతృప్తిపరచడాన్ని కూడా తిరస్కరిస్తాను" అని అంటారు. ఆ తేడా గమనించాలి.

*

నీ సిద్ధాంతం తప్పు. కాంక్షను స్వేచ్ఛగా వ్యక్తం చేయడంవల్ల , ప్రాణికం కొంతకాలం పాటు 'అమ్మయ్య' అని అనుకుంటుంది. కాని అది తిరిగివచ్చే హక్కును పొందుతుంది. అది తగ్గదు. సూక్ష్మరూపాలలో లోపల చెలరేగే కోరిక ప్రకోపనాన్ని అణచివేయడం నివారణ కాదు. ఉపరితల ప్రకోపాలను వెళ్ళగ్రక్కడం కూడ నివారణ కాదు. పూర్తి నిగ్రహాన్ని అలవర్చుకొంటే కోరిక అసలు పూర్తిగా మాసిపోతుంది. అది పూర్తిగా సంభవమే. అయితే కోరికను అణచివేయడం కాకుండా, అంతర్గతంగాను, బాహ్యంగాను దానిని తిరస్కరించాలి.

*

నువ్వు ఏ పని చేసినా అందులో కోరిక కలిసే వుంటుంది. సాధనకు చేసే ప్రయత్నాలలో కూడా అది కలిసి వుంటుంది. అదే ఇబ్బంది. ఆ కష్టం ఎదురైనప్పుడు, వెంటనే ఫలితం లేకపోతే, కోరిక వల్ల అసహనం, గందరగోళ భావాలు చెలరేగుతాయి. ఆకాంక్ష అన్నది కోరిక రూపంలో ఉండకూడదు. ఆత్మకు అవసరం అన్న భావన ఉండాలి. భగవంతుని వైపు తిరిగి, అన్వేషించడానికి ప్రోద్బలం చేసే ప్రశాంత సుస్థిర సంకల్పం వుండాలి. పనిలో, సాధనలో కోరిక కలిసిపోవడాన్ని పూర్తిగా తొలగించడం కష్టం. ఎవరికీ తేలిక కాదు. కాని సంకల్పం కనుక ఉంటే, సుస్థిరమైన ఆత్మశక్తితో దీనిని సాధించవచ్చు.

*

మంచి కోరికలే కాదు. చెడు కోరికలు కూడా కలుగుతుంటాయి. సంకల్పం, ఆకాంక్షకు స్థానం ఉంది కాని కోరికకు కాదు. కోరిక వున్న చోట బంధమేర్పడుతుంది. దానితో పాటు వాంఛ, వేదన, సమస్థితిని కోల్పోవడం, వస్తువుల కోసం బలంగా కోరడం ఇవన్నీ పెరుగుతాయి. ఇదంతా యోగపద్ధతికి వ్యతిరేకం.

*

భగవంతుని కోసం కోరిక, భగవంతుని పట్ల భక్తి — ఇది అన్ని కోరికల నుండి విముక్తం చేస్తుంది. లోలోపల మూలంలో అది కోరిక కాదు. ఆకాంక్ష. అది ఆత్మ ఆవశ్యకత, అస్తిత్వ ఉచ్ఛ్వాసం. దానిని కోరికలతో పాటు లెక్కపెట్టకూడదు.

*

ప్రతి భూమికలో సత్యాలు ఉన్నాయి. ఉన్నత భూమికలో కొన్ని మాత్రం సత్యాలు కావు. ఉదాహరణకు కోరిక, అహం అన్నవి మానస, ప్రాణిక, భౌతిక అజ్ఞాన భూమికకు చెందిన సత్యాలు. కోరిక, అహం లేని మనిషి తామసిక మరమనిషి అవుతాడు. మీరు ఉన్నత భూమికలో ఆలోచిస్తే ఈ అహం, కోరిక సత్యాలు కావు. అవి అసత్యాలు అవుతాయి. నిజమైన వ్యక్తిత్వాన్ని, నిజమైన సంకల్పాన్ని అవి వక్రీకరిస్తాయి. కాంతి శక్తులకు, చీకటి శక్తులకు మధ్య పోరాటం భూతలంలో సత్యం. కాని మనం భూమికలు

ఆరోహించే కొలదీ దాని సత్యరూపం మారుతూ వస్తుంది. అతిమానస స్థాయిలో అది సత్యం కానే కాదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

మనిషికి మృగానికి మధ్యన ఉన్న తేడా

మృగం ప్రాణిక మరియు సంవేదనలతో కూడిన అస్తిత్వం కలది. అయితే మనిషి హేతువును పొంది ఉండటంవల్ల మృగం నుంచి ప్రత్యేక స్థాయిని పొందినట్టు చెప్పబడ్డాడు. అయితె అది విషయాన్ని క్లుప్తంగా, అసమగ్రంగా వ్యక్తపరచి తప్పుదారి పట్టించడమే. ఎందుకంటె హేతువు అన్నది ఒక తరహాకి చెందిన, పరిమితమైన సాధనం యొక్క క్రియాచరణ. అది దానికన్న మరింత గొప్ప శక్తి నించి వస్తుంది. ఆ శక్తి పరిమితిలేని విస్తృతమూ, ప్రకాశవంతమూ అయిన ఊర్ధ్వ ఆవరణ నించి వస్తుంది. మన పరిశీలన, తార్కికదృష్టి, విచారణ, విచక్షణా వివేకముల ప్రాముఖ్యత యొక్క నిజమైన అంతిమ లక్ష్యం — సత్వరము, మధ్యంతర లక్ష్యము కన్నా భిన్న మైనది — మనిషిని ఆ ఉన్నత కాంతి నించి అందుకున్న ప్రకాశంతో, సరైన అవగాహనకు, సరైన కార్యాచరణకు ప్రోద్బలపరచి, ఆ మృగాన్ని నడిపించె అస్పష్ట కాంతిని క్రమంగా ఊర్ధ్వ ఆవరణ మంచి ప్రసరించే ప్రకాశంతో నింపుట.

మృగంలో కూడా ఒక మూలాధారమైన హేతువు ఉంటుంది. అది ఒక ఆలోచ నగా, అంతరాత్మగా, సంకల్పంగా స్పష్టమైన భావోద్వేగంగా ఉంటుంది. అయితే వాటి అభివృద్ధి తక్కువస్థాయిది. దాని మనస్తత్వం కూడా మనిషిని పోలినదే. కాని మృగంలోని ఈ సామర్థ్యాలన్నీ స్వయంచాలకమైనవి, అవి ఖచ్చితమైన పరిమితిని కల్గి ఉంటాయి. చాలా వరకు నిమ్న నాడీ వ్యవస్థ చేత రూపొందించబడినవి.

మృగం యొక్క గ్రహణశక్తి, ఇంద్రియజ్ఞానం, కార్యకలాపాలు, నాడీ మరియు ప్రాణిక సహజాతాలు, కోరికలు, అవసరాలు, తృప్తుల మధ్యన ఉన్న అనుబంధం, జీవ, ప్రాణిక ప్రేరణ. మనిషి కూడా ఈ ప్రాణిక ప్రకృతి (స్వభావం) యొక్క యాంత్రికతకు లోబడే ఉంటాడు, కాని తక్కువగా మాత్రమే!

మనిషి తన సంకల్పాన్ని, ఆలోచనను, బావోద్వేగాలను ప్రకాశింప చేసుకోవటం ద్వారా ఆత్మాభివృద్ధి అన్న కష్టమైన పనిని సాధించుకోవచ్చు. తక్కువ స్థాయిలో పనిచేసే కోరికను కొంచెం ఎక్కువ ఎరుకతో, విచక్షణతో మార్గాన్ని చూపగలిగే స్థాయికి చేర్చవచ్చు. తాను ఎంతగా తన నిమ్నస్థాయిని ప్రకాశింపచేసి, దానిపై ఆధిపత్యం వహిస్తే, అదే నిష్పత్తిలో అతడు మృగం నించి పూర్తి మనిషిగా మారుతాడు. అతడు కోరిక స్థాయిని మరింత ఉన్నతమూ, ప్రకాశవంతమూ అయిన ఆలోచన, దృష్టి, అనంతత్వాన్ని స్పర్శించగల సంకల్పంతో నింపాలి. ఎరుకతో తన సంకల్పాన్ని వీడి దైవసంకల్పం వైపు నడవాలి, మరింతగా విశ్వభావాతీత జ్ఞానంతో ముడిపడాలి.... అప్పుడు అతడు అతీత మానవుడి వైపు తన ఆరోహణను ప్రారంభించాడని, అతడు దైవం వైపు అధిరోహణా యాత్రలో ఉన్నాడని అర్థం.

అప్పుడు ఆ ఉన్నత మానసంలోని యోచనలో, ప్రకాశంలో, సంకల్పంలో లేదా అంతర్ హృదయం యొక్క లోతైన భావజాలంలో, ఉద్వేగంలో, మనం ముందుగా మన చైతన్యాన్ని కేంద్రీకృతం చేయాలి — వాటిలోని ఏదో ఒకదానిలో లేదా మనకి సమర్థత ఉంటే ఆ రెంటితో కలిసి దానిని మన స్వభావాన్ని సంపూర్ణంగా దైవం వైపు తిప్పే సాధనంగా ఉపయోగించాలి. ప్రకాశవంతమైన యోచన, సంకల్పాల ఏకాగ్రతతో, హృదయాన్ని కలిపి, ఒకే ఒక విశాల లక్ష్యంతో జ్ఞానం వైపు, మన కార్యాచరణ యొక్క అనంత కాంతి జన్మస్థానం వైపు సాగే నశించని ఆవేశం మన లక్ష్యం కావాలి. అదే మన యోగానికి తొలి మెట్టు.

మొట్టమొదటి అవసరమైన, సహజమైన విప్లవాత్మకమైన తొలి అడుగు, — నిమ్న ప్రకృతికి సంబంధించిన వాటన్నిటి నించి మరలిపోవడం, ఏకాగ్రతతో సంకల్పాన్ని, తెలివిని, వాటి కన్న ఉన్నతమైన స్థానం మీద నిలపడం, మనసు, హృదయం, ఇంద్రియాలు, శరీరం, వీటిని కూడ ఉన్నతస్థితుల వైపు మళ్ళించడం.

నువ్వు అహంకారంతో, మానసికమైన వ్యక్తిగా జీవిస్తున్నంత కాలం, నీవు అదే వలయంలో ముగింపు లేకుండా తిరుగుతూ ఉంటావు. నిజానికి అప్పుడక్కడ నీవు చేయగలిగిందేమీ లేదు. నీ సంకల్పాన్ని అంతర్ముఖం చేసి, హృదయంలోని కోరికలను దాటి, ఇంద్రియాల ఆకర్షణలను దాటి, మనసు నించి, దాని తాలూకు బంధనాలు, సంబంధాల నించి, దానికి లోబడిన కోరిక, ఆలోచన, ప్రేరణల నించి విడిపడి ఆ సంకల్పాన్ని ఒక్కసారి 'ఆవలి విశాల ఉన్నత ఎత్తులకు' ఉద్ధరించాలి.

ఎన్నటికి మారని, నిశ్చలమైన, చెదరని, సమానత్వంతో అన్ని వస్తువులకు, వ్యక్తులకు, సంభవాలకు, నిష్పాక్షికంగా ఉంటూ, క్రియాకర్మల వల్ల చెక్కుచెదరక, ప్రకృతి వైవిధ్యాల వల్ల తన స్థితిలో మార్పునొందక, నీ లోనే ఉండే, ఆ ఒకే ఒక శాశ్వతమైనదాన్ని కనుగొని, దాన్ని చేరుకోవాలి. అదే నీవు కావాలి, ఆ శాశ్వత ఆత్మవు నీవు కావాలి. ఆ బ్రహ్మపదార్థానివి నీవు కావాలి. ఎన్నడూ నిన్ను వీడని ఆ ఆధ్యాత్మిక అనుభవం వల్ల నీవు దాన్ని సాధించగలిగితే నీకు సురక్షితమైన పునాది ఏర్పడుతుంది. దానిపై నీవు స్థిరంగా నిలిచి ఈ మనోమయమైన వ్యక్తిత్వపు పరిధుల నించి విముక్తుడవై, శాంతి, జ్ఞానాల నుంచి జారిపోని రక్షణని పొందగలవు. అహం నుంచి విడుదల కాగలవు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

కాంతికిరణాలు

ఉన్మీలనము:

చైతన్యానికి విముక్తి. తద్వారా దివ్యకాంతి, శక్తుల ప్రవర్తనలను తన లోనికి ఆవహింపచేసుకుంటుంది.

*

ఔదార్యం (Benevolence)

వ్యక్తిగతంగా ప్రతిక్రియకి అవకాశం లేని, సర్వతోముఖ సమ్యక్ దృష్టి కలిగిన అలుపెరుగని ఔదార్యం — ఇదీ ఈ భూమి మీద భగవంతుని ప్రేమించి, సేవించుకునే ఉత్కృష్ట మార్గం.

అంటే నా అభిప్రాయం మనసా, వాచా, కర్మణా త్రికరణశుద్ధితో కూడిన ఔదార్యం. అంతేకాని మానవసహజమైన ఆధిక్యతను, భయంకరమైన దిగజారుడు ఔదార్యంతో కూడిన కర్మలను ప్రదర్శనకు వేదికగా ఉపయోగింపబడేది కాకూడదు.



అఖిల

అఖిలభారత పత్రిక

జూన్ 2011

20/6/20

శ్రీమాతారవిందుల ప్రవచనాలు

విషయసూచిక



మానవుల వైఖరి: జీవన స్థితిగతులు

చాలామంది మనుష్యులు జన్మిస్తుంటారు. ఎందుకో వారికి తెలియదు. కొన్ని దశాబ్దాల పాటు తాము జీవిస్తామని వారికి తెలుసు. కాని ఎందుకో తెలియదు. ప్రతి వ్యక్తీ చనిపోతున్నాడు కాబట్టి తామూ చనిపోతామని వారు భావిస్తారు. ఎందుకో తెలియదు. ఎక్కువ కాలం వారు జీవితం పట్ల విసుగుచెందుతారు. కారణం వారు శూన్యజీవులు. శూన్యం కన్నా విసుగు పుట్టించేది మరొకటి లేదు. ప్రక్కదారులు తొక్కుతూ ఈ శూన్యాన్ని నింపాలని చూస్తారు. కాని బ్రతకటం పూర్తిగా నిరుపయోగం. చిట్టచివరికి వారు తమ జీవితాన్ని వృథా చేసుకుంటారు. అన్ని సంభావ్యతల్ని కోల్పోతారు. సమస్తం పోగొట్టుకుంటారు. వెయ్యిమందిలో తొమ్మిదివందల తొంభై తొమ్మండుగురు ఈ స్థితిలో ఉంటారు. వారు కొన్ని నిర్దిష్ట పరిస్థితులలో జన్మిస్తారు. తాము ఎంత బాగా గడపాలో అంత బాగా తమ కాలాన్ని వెళ్లబుచ్చాలని ప్రయత్నిస్తారు. అతి తక్కువగా విసుగుచెందాలని సాధ్యమైనంత తక్కువ బాధనొందాలని కాలాన్ని సాధ్యమైనంత వరకు బాగానే వెళ్లబుచ్చాలని ప్రయత్నిస్తారు. కాని ప్రతి సంఘటన నిర్జీవంగా, నిరుపయోగంగా, నిరామయంగా, తెలివిహీనతగా జరుగుతుంది. దాని వల్ల ఫలితం ఉండదు. అధిక సంఖ్యాకులు అలాగే బ్రతుకులు ఈడుస్తుంటారు. వారు అసలు ఆలోచించరు. వారు తమలో తాము ప్రశ్నించుకోరు... "నేను ఎందుకు ఇక్కడ వున్నాను? ఈ భూమి ఎందుకు వున్నది? ఇక్కడ మనుష్యులు ఎందుకున్నారు? నేనెందుకు జీవిస్తున్నాను?" ఇవన్నీ ఆసక్తి కలిగించని విషయాలు. బాగా తినడం, బాగా ఆనందించడం; మనస్సు భిన్నదారులలో పరుగెడుతుంది. పెళ్లి చేసుకుని పిల్లల్ని కంటారు. డబ్బు సంపాదిస్తారు. కోరికలు తృప్తిపరచుకోడానికి అన్ని ప్రయోజనాలు పొందుతారు. అన్నింటికీ మించి ఆలోచించరు. అంతర్వివేచన ఉండదు. ఏ ప్రశ్నలూ అడగరు. ఈ సమస్యలను పట్టించుకోరు. ఔను... చివరికి ఎలాగో బయటపడడం. పెద్ద విపత్తులలో చిక్కుకోకుండా తప్పించుకోడం. ఇది మానవాళి సాధారణ జీవన స్థితి. దీనిని మనుష్యులు హేతుబద్ధం అనుకుంటారు. ఈ విధంగా ప్రపంచం అనంతకాలం పాటు పరిభ్రమిస్తుంది. పురోగతి ఉండదు. అందువల్లనే వారంతా చీమలు లాంటి వారు. వారు వస్తారు, నేలపై ప్రాకుతారు, చచ్చిపోతారు. తిరిగి పుడతారు, చనిపోతారు. అనంతకాలాలు, అనంతయుగాలు

ఇలా సంభవిస్తుంటుంది. అదృష్టవశాత్తు ఇతరుల పనిని చేసేవారు కొందరుంటారు. ఏదో ఒక రోజున ప్రపంచాన్ని మార్చేది వారే.

ఏ పక్షాన ఉండాలి అన్నది తెలుసుకోడం మొదటి సమస్య. ప్రపంచం కోసం ఏదో మేలు చేస్తున్నవారి పక్షాన ఉండాలా, ఏమీ చెయ్యనివారి పక్షాన ఉండాలా అన్నది తేలాలి. జీవితం అంటే తెలుసుకున్నవారు, ఈ జీవితం ఒక నిర్దిష్ట గమ్యం వైపు ప్రయాణించడానికి అవసరమైన పని చేసేవారి పక్షాన ఉండాలా? దేనినీ అర్థం చేసుకోకుండా విశృంఖలంగా తిరిగేవారు, జీవితాన్ని ఆషామాషీగా గడిపేసేవారి పక్షాన ఉండాలా? ఇది తేల్చుకోవాలి. అసలు ఏ చింతా లేకుండా గడిపేసేవారు ఎక్కువ!

అది మనం ఆలోచించాలి. ఇది మొదటి నిర్ణయం. ఇంకా ఎన్నో ఉన్నాయి.

మీకు ధ్యానం కావాలనిపిస్తోందా? చెప్పండి. ఔనా, కాదా? అవునా? మంచిది! నిరుపయోగంగా బ్రతకాలన్న ఇచ్ఛను మీ చైతన్యం నుండి తుడిచిపెట్టండి.

*

చైతన్యంలో మార్పు. ప్రస్తుతానికి అదే చాలా ముఖ్యమైనది. ఇది చాలా తేలిక అని అనుకోవద్దు. నిన్ను నువ్వు పరిశీలించుకుంటే, నువ్వు మానవ మృగంలాగా ఆలోచిస్తావు, సంవేదన చెందుతావు, అనుభవం పొందుతావు, నిర్మాణాలు చేస్తావు. నువ్వు రోజులో మూడొంతులు అవచేతనలో గడుపుతుంటావు. కొన్ని క్షణాలు నువ్వు ఈ స్థితి నుండి తప్పించుకుంటావేమో, కాని దీని నుండి పూర్తిగా తప్పించుకోడానికి నీవు ప్రయత్నించాలి. కొన్ని సార్లు ఏదో భగవంతుని కారుణ్యమో అన్నట్లుగా అది సహజంగా సంభవించవచ్చును. ఇది కాని మరేదో పట్టుకోడానికి నువ్వు ప్రయత్నించి తీరాలి. ఒక రోజులో ఏదో సమయంలో ఒక అడుగు వెనక్కువేసి, నిన్ను నివ్వు పరిశీలించుకో. నిన్ను నువ్వు పట్టుకోగలవు. అప్పుడు చూడు. హఠాత్తుగా నేను ఇప్పుడు "నిన్ను నువ్వు చూసుకో!" అన్నాననుకో. నీకు హెచ్చరిక లేకుండా, నేను అలా అన్నాననుకో. నీ చైతన్యభూమికలో ఏముంది? దానిని నువ్వు పట్టుకుంటే అప్పుడు నీవు గమనిస్తావు. వంద పర్యాయాలలో తొంభైతొమ్మిది సార్లు అలా జరిగితే నీలో వున్నది మృగం మాత్రమే. కొద్దిగా మెరుగైన జంతువు. పూర్తిగా కుక్కా కాదు, కోతీ కాదు. అంతకన్నా మెరుగైనది కాదు.

చాలా లక్షణాలను మనుష్యులు అద్భుతమైన సుగుణాలుగా మార్చివేశారు.

జంతువులలో అవి సహజ కదలికలు, వాటికి గర్వం లేదు. వ్యర్థపటాటోపం లేదు. భక్తి, దూరదృష్టి, పరిత్యాగం, నేర్చుకోవడం మున్నగు విషయాలలో అద్భుతంగా సహజ సిద్ధంగా ప్రవర్తిస్తాయి. అవి వాటిని స్వతస్సిద్ధంగా జరుపుతాయి. వాటిపై అవి పుస్తకాలు రాయవు. గొప్పలు చెప్పుకోవు. మేము అద్భుతాలు చేసామని చాటి చెప్పుకోవు. మృగదశ నుండి పురోగమనం ఇంకా చాలా సాధించాలి. మామూలు స్థాయిలో ఆలోచన చాలదు.

*

చెట్టు నుండి మృగం వరకు, మృగం నుండి మనిషి వరకు జరిగిన పరిణామం మనిషిలో అధోమానవ దశ నుండి ప్రారంభమవుతుంది. మనిషి జంతుదశను, ఖనిజ, వృక్ష లక్షణాలను తనలోకి లీనం చేసుకోవాలి. అవి అతని భౌతిక ప్రకృతి నిర్మాణంలో భాగం. అతని ప్రాణికాన్ని అవి ప్రభావితం చేస్తాయి. అతని మనస్తత్వాన్ని తమ ప్రాబల్యంలోకి తీసుకొంటాయి. ఆతనిలోని స్తబ్దత, ఏ సంఘటనలు లేని చెట్ల లాగా, పొదలలాగా పెరగడానికి సన్నద్ధత, నేలతో బంధం, తన వ్రేళ్ళను అంటిపెట్టుకోవడం, అన్ని రకాల భద్రత, అతని సంచార, దోపిడీ స్వభావం, గ్రుడ్డిగా ఆచారాలకు కట్టుబడి వుండడం, కలిసికట్టుగా జీవించాలన్న నియమం, జనసమూహంతో పాటు కదలికలు, జనసమూహ ఆత్మ నుండి వచ్చే అవచేతనా సూచనలను స్వీకరించడం, కోపాలు, భయాలు, శిక్ష యొక్క అవసరం, శిక్షపై ఆధారపడడం, తన కోసం ఆలోచించలేకపోవడం, పని చేయలేకపోవడం, నిజమైన స్వేచ్ఛ పొందలేకపోవడం, నవ్యత్వం పట్ల అపనమ్మకం, తెలివిగా విషయాలను పట్టుకోలేకపోవడం, జీర్ణించుకోవడంలో నెమ్మదితనం, నిమ్నస్థాయి వైపు ఉన్ముఖత, నేలచూపు, తన వారసత్వానికి ప్రాణికమైన, భౌతికమైన రీతిలో లోబడి వుండడం, — ఇవన్నీ, జీవితపు, శరీరపు, భౌతిక మానసికపు అధో మానవ మూలల నుండి వచ్చిన వారసత్వ లక్షణాలు. ఈ వారసత్వం వల్ల మనిషి తనను తాను అధిగమించ లేకపోతున్నాడు. అవి చాలా కష్టమైన పాఠాలుగా, బాధాకరమైన ప్రయత్నాలుగా అతను భావిస్తున్నాడు. అయినా, ప్రకృతి నిమ్న ఆత్మశ్రేణిని అధిగమించుట వలన పరిణామ క్రమంలో పెద్ద ముందడుగు వేస్తుంది. మనిషి గతంలో తానేమిటో నేర్చుకోవాలి.

అంతే కాదు భవిష్యత్తులో తన స్థాయిని తెలుసుకోవడం, ఆ స్థాయికి పెరగడం — ఇదే మనోగత జీవికి నిర్ణయించబడిన లక్ష్యం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యజ్ఞన్న

మూడు దశల పురోగతి — ఎలా సాగిపోవాలి?

"మన యావత్ నైజం, దాని పర్యావరణం, మన యావత్ వ్యక్తిగత ఆత్మ, విశ్వాత్మ, అన్నీ కూడ మన ఆధ్యాత్మిక పునర్జన్మను వ్యతిరేకించే అలవాట్లు, ప్రభావాలతో నిండి ఉన్నాయి."

(శ్రీఅరవిందులు: యోగసమన్వయం)

తరచుగా చెప్పా నేను, చెప్పలేదా? — మొదటి దశలో, నీ సత్తా అంతా ఇంచు మించుగా బాహ్యం నుండి వచ్చి చేరిన వివిధ విషయాల మిశ్రమమనీ, దానిలో వ్యక్తిగతమైనదేదీ దాదాపు లేదనీ; అంటే, నిన్ను వేరే సత్తాగా చేసే ప్రత్యేకత ఏదీ లేదనీ. నీవు కదల్చబడ్డావు లేదా ప్రాభావితం చేయబడ్డావు — నీ భౌతిక సత్తా యొక్క ఒక రూపం కదల్చబడ్డుంది — అన్ని విశ్వశక్తుల చేత, ప్రాణికశక్తుల చేత, మానసికశక్తుల చేత, ఏవైతే నీ రూపం లోకి చొచ్చుకుపోయి, దాన్ని గమనంలో ఉంచుతాయో, ఆ శక్తుల చేత.

ఈ సాధారణ అపరిణిత చైతన్యం యొక్క సారం ఏమంటే, ఇంతో, అంతో తన ఎరుకను తాను కల్గి, తన సొంత లక్షణాలు గల ఒక స్వతంత్ర వ్యక్తిగత సత్తాగా నీవు స్ఫటికీకరణం చెందినవాడివి. ఈ వ్యక్తిగత సత్తా సాధారణ జీవిత పరి మితులతోనూ, అస్పష్టత, అచేతనలతో కూడిన కదలికలతో నిండి ఉన్నది. వీటినే క్రమక్రమంగా దైవప్రభావానికి తెరవాలి; తద్వారా, విషయాలపై చైతన్యాన్ని అవ గాహనను పెంపొందించాలి. ఇదే శ్రీఅరవిందులు చెప్పినది.

వాస్తవానికి, ఒక వ్యక్తిత్వాన్ని సృజించడమే మొదటి గెలుపు. ఈ వ్యక్తిత్వాన్ని దైవానికి సమర్పించడమే రెండవ గెలుపు. దైవం నీ వ్యక్తిత్వాన్ని, దైవసత్తాగా పరి వర్తన చేయడమే మూడవ గెలుపు.

ఇలా మూడు దశ లున్నాయి. మొదటిది వ్యక్తిగా అవడం; రెండవది, వ్యక్తిని అంకితం చేయడం — అంటే — తనను తాను దైవానికి సంపూర్ణంగా సమర్పించుకొని, ఆతనితో తాదాత్మ్యం చెందడం. మూడవది — దైవం వ్యక్తిని తన అధీనంలోకి తీసుకుని, తన రూపంలోకి అతన్ని మార్చడం; వ్యక్తి దైవంగా మారడం.

సాధారణంగా అన్ని యోగాలు రెండవ దశలో ఆగిపోతాయి. మానవుడు తన వ్యక్తిత్వాన్ని, అరమరికలు లేకుండా, దైవానికి సమర్పించడంలో సఫలుడై, దైవంతో తాదాత్మ్యం చెందినప్పుడు, తన పని పూర్తి అయినట్లు, అన్నీ సాధింపబడినట్లు, భావిస్తాడు.

కాని, మనం ప్రారంభించేది ఇక్కడే. మన లక్ష్యం "లేదు — ఇది ఆరంభం మాత్రమే. ఏ దైవాన్ని మనలో ఒకటిగా భావిస్తున్నామో, ఆ దైవం మన వ్యక్తిత్వంలోకి ప్రవేశించి, దానిని దివ్యప్రపంచంలో పనిచేయగల దైవవ్యక్తిత్వంగా తయారు చేయాలి." దీనినే మనం పరివర్తనం అని అంటాం. కాని రెండవ దశ తప్పనిసరిగా, మూడవ దశ ముందు జరగాలి. రెండవది, జరుగకపోతే, మూడవది జరిగే అవకాశం లేదు. మొదటి దశ నుండి ఎవరూ మూడవ దశకు పోలేరు. తప్పనిసరిగా రెండవ దశ ద్వారా వెళ్ళవల్సిందే.

ప్రశ్న: మాతా! మూడవది పూర్తిగా దైవంపై ఆధారపడి ఉంటుంది; దైవం తన అధీనంలోకి తీసుకొనుటకు ఇచ్ఛగించినా లేకపోయినా.

జవాబు: నిజానికంతా దైవంపై ఆధారపడ్తుంది. దీనిపై నీకున్న ఎరుకే వేరుగా ఉంటుంది. అందుచే, మూడవ దశలో, నిస్సందేహంగా, అంతా చేస్తున్నది దైవమే అనే ఎరుక నీకు కల్గుతుంది. అందుచే ఆధారపడ్తున్నదంతా దైవం పైనే.

ఇలా నీవు అనుకున్నప్పుడు, తన ఉనికికి ప్రత్యేకత ఉన్నదని, తాను వేరని, నీ చైతన్యంలోని ఏ భాగమైనతే నిశ్చయం పొందిందో, అది రెండవదానిపై తిరిగి అంటుంది — "ఆ! మంచిది. నేనింకెంత మాత్రం పనిచేయ నవసరం లేదు". కాని అది తన ఉనికిని కోల్పోతే, దానికి తానే దైవం అనే ఎరుక కల్గితే, దానికి వేరు భావన ఉండజాలదు. అది పని చేస్తుంది, చేస్తూనే ఉంటుంది, నిజచైతన్యంలో వక్రించిన చైతన్యానికి బదులుగా.

మూలం: శ్రీమాత

అనువాదం: యస్. వై. సోమయాజులు

మనం ఎంత మటుకు ప్రత్యేక వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్నాం?

"శరీర పరిమితులు ఒక మూస ఆకృతిలో ఉంటాయి. ఆత్మ, మనస్సు, తమకు తాముగా వాటిలోకి ప్రవించి, వాటి హద్దులను బద్దులు చేసి, వాటి కిపుడున్న పరిమితికీ, సంభవింపబోయే అపరిమితికి మధ్య అంగీకార యోగ్యమైన సూత్రం దొరికేదాకా, విస్తృత మందే అవధులకు అనుగుణంగా నిరంతరం కొత్త మూసను పోతపోస్తుండాలి."

(*Thoughts and Glimpses*, SABCL Vol. 16, p. 386)

ప్రశ్న: ప్రియమైన మాతా, "శరీర పరిమితులు ఒక మూస" అనేదానిని మేము ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

మీకు స్పష్టమయిన రూపంతో ఒక శరీరం లేకపోయినా, సంపూర్ణ చైతన్యంతో మీ కంటూ ప్రత్యేక గుణాలుగల ప్రత్యేక వ్యక్తిత్వం తయారుకాకపోయినా, మీరందరూ ఒకరిలో మరొకరు కలిసిపోయి ప్రత్యేకత అనేది లేనివారైపోతారు. మనం, ఏమాత్రమైనా కొంత అంతరంగంలోకి, అత్యంత భౌతిక ప్రాణిక అస్తిత్వం లోనికి పోయినట్లయితే, అక్కడ రకరకాల మనుషుల ప్రకంపనలు ఎంతగా కలగాపులగంగా కలిసిపోయి ఉంటాయంటే, మీలో ఎవరినీ విడదీసి ప్రత్యేకంగా చూపించటం చాలా కష్టం అవుతుంది. దానికి తోడు శరీరం కూడా లేనట్లయితే, అది ఒక రకమయిన విడదీయలేని గుజ్జులాగా వుంటుంది. కనుక, ఈ స్పష్టమైన, రూపురేఖలు గల శరీరాకారమే మిమ్మలను ఒకరి నుంచి మరొకరిని విడదీసి వేరువేరుగా చేస్తున్నది. అందువల్లనే ఈ రూపం ఒక మూసలాగా పనిచేస్తున్నది. (*ఒక పిల్లవాని వైపు తిరిగి*) నీకు మూస అంటే తెలుసా? ఆహా, తెలుసన్నమాట! ఒకదానిలో, ఏదో ఒకటి పూర్తిగా ద్రవంగా ఉన్న దాన్నిగాని లేక ద్రవించిన గుజ్జుగా నున్న దాన్నిగాని పోసి, అది చల్లబడిన తరువాత, ఆ మూసను పగులగొట్టి కావలసిన చక్కని స్ఫుటమైన రూపాన్ని పొందవచ్చును కదా. అదే పద్ధతిలో, శరీరపు విగ్రహం మూసలాగా పనిచేస్తుంది. అందులో ప్రాణిక,

మానసికశక్తులు స్ఫుటమైన రూపాన్ని పొందుతాయి. ఈ విధంగా నీవు ఇతరుల కంటె భిన్నంగా ప్రత్యేక వ్యక్తిగా తయారుకాగలవు.

జీవితంలోని స్థితిగతుల వలన, క్రమంగాను, నెమ్మదిగాను, కొంత అటు ఇటుగా శ్రద్ధతో, లోతుగా అభ్యసించిన విద్యతోను, నీకే ప్రత్యేకమైన సంవేదనలు, నీకే ప్రత్యేకమైన అనుభూతులు, భావాలు కలగటం మొదలవుతుంది. ప్రత్యేక వ్యక్తిత్వంతో కూడిన మనస్సు సామాన్యంగా ఉండటం అరుదు. అది ఎంతో అభ్యాసం వల్లనే వస్తుంది. లేని పక్షంలో, ఆలోచనలన్నీ ఒక రకమైన ఆలోచనా ప్రవాహంగా నీ మెదడు ద్వారా ప్రవహించి, తరువాత మరొకరి మెదడు, అటు పిమ్మట ఎంతో మంది మెదడుల ద్వారా అనంతకాలం పాటు, ఏ ప్రత్యేక వ్యక్తికీ చెందని విధంగా, తిరుగుతూ ఉంటాయి. ఒకరు ఇతరులు ఆలోచించినట్లుగాను, వారు ఇంకా ఎంతో మంది ఆలోచించినట్లుగాను ఆలోచిస్తూ, ప్రతివారూ ఆ విధంగా ఒక గొప్ప కలగా పులగపు మిశ్రమంలో ఆలోచిస్తూ ఉంటారు. ఎందువల్లనంటే ఇవన్నీ ప్రకంపనలు, ఆలోచనా ప్రకంపనలు, ఒకరి ద్వారా మరొకరికి ప్రవహిస్తుంటాయి. నీవు నీలో జాగ్రత్తగా పరిశీలిస్తే, నీలో చాలా తక్కువ ఆలోచనలు, నీవి మాత్రమే అనుకోగలిగినవి, ప్రత్యేకమైనవి, కలిగి ఉన్నావనే సంగతిని వెంటనే తెలుసుకుంటావు. అవి నీ కెక్కడి నుంచి వస్తున్నాయి? నీవు విన్నవాటి నుంచి, నీవు చదివిన వాటినుంచి, నీవు నేర్చుకున్న వాటినుంచి. వీటిలో ఎన్ని ఆలోచనలు, నీవి మాత్రమే అయిన అనుభవాలు, నీవి మాత్రమే అయిన ప్రతిస్పందనలు, ప్రత్యేకించి నీ వ్యక్తిగత పరిశీలనా ఫలితంగా వచ్చినవి అని ప్రశ్నిస్తే, అందులో లెక్కపెట్టటానికి ఎక్కువ ఏమీ ఉండవు.

కేవలం తీవ్రమైన మేధోపరమైన జీవనం గడిపేవారు, ఆలోచన, పరిశీలన భావాల నన్నింటిని క్రోడీకరించే అలవాటు గలవారు మాత్రమే క్రమక్రమంగా వారికే ప్రత్యేకమైన మానసిక వ్యక్తిత్వాన్ని తయారు చేసుకోగలుగుతారు.

చాలామంది చదువుకోనివారు మాత్రమే కాకుండా, బాగా చదువుకున్నవారు కూడా పూర్తిగా పరస్పర విరుద్ధమైన ఆలోచనలు కలిగి ఉండవచ్చును. వారికి, ఆ విధంగా పూర్తిగా ఒకదాని నొకటి వ్యతిరేకించే భావాలతో కూడిన ఆలోచనలు పరస్పర విరుద్ధంగా వారి తలలలో తిరుగాడుతున్నాయనే సంగతి ఏమాత్రం తెలియదు. నేను ఆ విధమైనటువంటి భావాలను పెంచి పోషించేవారిని అనేకులను చూశాను. అంతే కాదు, మానవ మేధస్సుకు సంబంధించిన అత్యున్నతమైన అన్ని క్షేత్రాలలోను

రాజకీయ, సాంఘిక, మతపరమైన అభిప్రాయాలను వారు కలిగి ఉంటూ, ఆ విషయాల మీద పూర్తిగా పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలను, వారి కున్నాయనే సంగతి ఏమాత్రం తెలియకుండా ఉంటారు.

నిన్ను నీవు బాగా పరిశీలించి చూసుకుంటే, నీలో చాలా భావాలు ఉన్నాయనీ, వాటన్నింటినీ నీ ఆలోచనను విస్తృతపరచిన ఫలితంగా, మధ్య మధ్య వచ్చే భావాలతో ఒక క్రమపద్ధతిన సంధానపరచాలనే విషయాన్ని గ్రహిస్తావు. లేనట్లయితే, అవి అసంబద్ధమైన రీతిలో నీ యందు సహజీవనం కొనసాగిస్తాయి.

కనుక, ప్రత్యేకతతో కూడి, తనవే అయిన తన గుణాలతో యదార్థంగా ప్రత్యేక వ్యక్తి అయ్యే ముందు ఆ గుణాలన్నీ ఒక పాత్రలో ఇమడాలి. అలా కాని పక్షంలో అవి నీళ్ళ లాగా అంతటా పరచుకుని ఏ రూపమూ ఉండే అవకాశం ఎంత మాత్రమూ ఉండదు. కొంత తక్కువస్థాయిలో ఉన్న వ్యక్తులు, వారి కున్న పేరుతో వారికి వారు తెలియబడతారు. వారు వారి పొరుగువారి పేరుతో తప్ప వారికి తమకు భేదం చూపించలేరు. వారిని 'నీ వెవరు' అని అడిగితే 'నా పేరు ఇది' అనే సమాధానం వస్తుంది. కొంత సమయం తరువాత, వారు ఏ పని చేస్తారో చెపుతారు లేదా వారి ప్రధాన లక్షణాన్ని కాని చెపుతారు. వారిని 'నీ వెవరు' అని అడిగితే 'నేను చిత్రకారుణ్ణి' అనే సమాధానం వస్తుంది.

కానీ ఒక స్థాయిలో వచ్చే సమాధానం కేవలం పేరు మాత్రమే. పేరు అంటే ఏమిటి? అది ఒక పదం మాత్రమే కదా? ఆ పదం వెనుక ఏమున్నది? ఏమీ లేదు. అది కొన్ని అసంగత విషయాల సమాహారాన్నంతా ధ్వనింపచేస్తూ ఒక వ్యక్తికి అతని పొరుగువానికి మధ్య తేడాను ఏమాత్రం సూచించదు. మరొకరితో అతని తేడాను చెప్పేదల్లా అతనికి మరొక పేరుండటం వల్ల మాత్రమే. అందరికీ ఒకటే పేరున్నట్లయితే, ఒకరి నుంచి మరొకరిని వేరుపరచి చెప్పడం చాలా కష్టం!....

ఎవరైనా అలవాటు ప్రకారం జీవిస్తుంటారు. చెప్పాలంటే దానిలో సగం చైతన్యం మాత్రమే ఉంటుంది. వారి జీవనం వారు చేసే దానిని సైతం బయటపెట్ట లేదు; ఎందుకు చేస్తున్నామో, ఏ విధంగా చేస్తున్నామో అనే విషయం కూడా తెలియకుండా జీవిస్తుంటారు. అవన్నీ అలవాటు ప్రకారం చేస్తుంటారు. ఒకే విధమైన పరిసరాలలో, ఒకానొక దేశంలో జన్మించినవారంతా, తమకు తెలియకుండానే యాంత్రికంగా ఆ పరిసరాల లోని అలవాట్లనే కాక, తాము చేసే పనిపాటల అలవాట్లను, ఆలోచన,

అనుభూతి, కర్మాచరణ అలవాట్లను పుణికి పుచ్చుకుంటారు. అది వారు ఆ విధంగా చేస్తున్నామనే సంగతి తమను తాము పరిశీలించి చూసుకోకుండా చేస్తుంటారు. ఎవరైనా ఆ సంగతిని వారి దృష్టికి తీసుకువస్తే, వారు ఆశ్చర్యచకితులైపోతారు.

యదార్థానికి, ఎవరికైనా నిద్రపోవడంలో, మాట్లాడటంలో, భుజించడంలో, చరించడంలో అలవాట్లుంటాయి. అవన్నీ చాలా సహజంగా చేస్తుంటారు. ఇవన్నీ ఎందుకు, ఏ విధంగా అనే సంగతిని పట్టించుకోరు. ఇటువంటివే ఇంకా చాలా ఉన్నాయి. జీవితకాలమంతా వీటన్నింటిని తమ ప్రమేయం ఏమీ లేకుండా యాంత్రికంగా, అలవాటు ప్రకారం, తమను తాము పరిశీలించుకోకుండా చేస్తుంటారు. ఈ విధంగా ఎవరైనా ఒక ప్రత్యేక నాగరిక పద్ధతులతో కూడిన సమాజంలో ఉంటే, అక్కడ సర్వసాధారణంగా జరిగేవాటన్నింటినీ, తమ ఎరుక, ప్రమేయం ఏమాత్రం లేకుండా యాంత్రికంగా చేసేస్తుంటారు. అటువంటప్పుడు, ఒకరెవరైనా తమను తాము పరిశీలించుకోవటం మొదలుపెడితే, తమ అనుభవాలను, ఆలోచనాసరళిని పరిశీలించి, తమ పరిసరాలతో పోల్చి చూసుకుంటే, వారికి వారు ఒక రకంగా అసాధారణ రాకాసిజీవిగా కనపడతారు.

కనుక, ప్రత్యేక వ్యక్తిత్వమనేది తప్పనిసరిగా ఉండదని, అది కొంతమందికే పరిమితం అని తెలుస్తున్నది. నీకు రూపధారణకు ఆ విధమైన విగ్రహం లేకపోతే, నీ బాహ్యశరీరం కనపడే నీ తీరును చూపించే ఒక ఆకృతి లేకపోతే, నిన్ను మరొకరి నుంచి విడదీసి ఎంతమాత్రం చెప్పలేము.

ప్రత్యేక వ్యక్తిత్వం ఒక విజయగాథ. శ్రీఅరవిందులు చెప్తున్న విధంగా, ఈ మొదటి గెలుపు మొదటి మెట్టు మాత్రమే: ఒకసారి గనుక నీలో నీదంటూ వ్యక్తిగత స్వేచ్ఛ, చైతన్య అస్తిత్వం అనుభవసిద్ధమైతే, నీవు చేయవలసినదల్లా ఆ రూపాన్ని బద్దలు చేసుకుని ముందుకు వెళ్ళడమే. ఉదాహరణకు, నీవు మానసికంగా పురోగతిని పొందాలనుకుంటే, నీ మానసిక రూపాలన్నింటిని, నీ మానసిక నిర్మాణాలను తప్పనిసరిగా తునాతునకలు చేసి, కొత్తవాటితో తీర్చిదిద్ద గలగాలి. కనుక, తమను తాము ప్రత్యేక వ్యక్తిత్వంతో మలచుకోవాలంటే, దానిని మొదలుపెట్టడమే అధిక శ్రమతో కూడిన పని. అంతే గాక, పురోగతి సాధించాలంటే, ఇంత వరకు చేసినదానింతా కూలదోయాలి. కాని, నీవు చేసే పనులను నీలో నీవు పరిశీలించుకోవు కాబట్టి, ఆ పనులు విధాయకం కాబట్టి — అది ప్రతి చోటా కాకపోయినా, ముఖ్యంగా ఇక్కడ

ఆశ్రమంలో — నీకు విధాయకమైన పనిచేయడం, చదవడం, నిన్ను నీవు అభివృద్ధి పరచుకోవడం, ఏదో ఒకటి చేయడానికి ప్రయత్నించడం, కొంత నిన్ను నీవు తీర్చి దిద్దుకోవడం అనేవి ఉంటాయి. అవన్నీ నీవు ఎంతో ప్రశాంతంగా, సహజంగా నిన్ను నీవు ఏమాత్రం పరిశీలించుకోకుండా చేసేస్తుంటావు.

ఎప్పుడైతే ఈ బాహ్యరూపాలు పరస్పరం ఘర్షణతో ఒరిపిడికి లోనవుతాయో అప్పుడే నీకు ఇతరుల కంటె భిన్నంగా ఉన్నట్టు అనుభూతి మొదలవుతుంది. లేకపోతే, మీరంతా ఫలానా, ఫలానా అనే మీ పేర్లతో మాత్రమే తెలియబడతారు. ఒరిపిడి ఉన్నప్పుడు మాత్రమే. ఏదైనా సవ్యంగా సాగనప్పుడే, నీకు తేడా తెలుస్తుంది. అప్పుడు నిన్ను నీవు వేరుగా చూస్తావు, లేకపోతే నీకా విషయమే గుర్తింపుకు రాదు, నీవు వేరు కాదు. వాస్తవానికి, మీరంతా ఒకరి కొకరు అంత భిన్నంగా నుండరు.

మీ జీవితంలో, ఏ ప్రత్యేకతా లేకుండా అందరూ చేసే విధంగానే ఎన్ని విషయాలు చేస్తున్నారు? ఉదారహణకు, నిద్ర, కదలికలు, తినడంతో పాటు అటువంటివే ఎన్నో. నిన్ను నీవు ఎప్పుడైనా, ఇది ఈ విధంగానే ఎందుకు చేయాలి, ఇంకొక విధంగా ఎందుకు చేయకూడదు అని ప్రశ్నించుకున్నావా? నీవు చెప్పలేవు. నేను నిన్ను "ఈ విధంగా ఎందుకు చేస్తున్నావు, మరొక విధంగా ఎందుకు చేయడం లేదు" అని ప్రశ్నిస్తే, నీకేం సమాధానం చెప్పాలో తెలియదు. దానికి కారణం ఏమిటంటే, నీవు కొన్ని పరిస్థితులలో జన్మించావు, ఆ పరిస్థితులలో అలా ఉండటం అలవాటు. అలా కాకుండా, నీవు మరొక కాలంలో, వేరే పరిస్థితులలో జన్మించి ఉంటే నీవు పూర్తిగా విభిన్నంగా ప్రవర్తిస్తావు, నీవు తేడాను ఏమాత్రం తెలుసుకోలేవు, అది అంతా నీకు చాలా సహజంగా కనపడుతుంది.... ఉదారణకు, చిన్న ఉదాహరణ, కుట్టడం అనే చిన్న విషయాన్నే తీసుకుందాం. పశ్చిమ దేశాలలోను, కొన్ని తూర్పుదేశాలలోను, ప్రజలు కుడి నుండి ఎడమకు కుడతారు, జపానులో ఎడమ నుంచి కుడికి కుడతారు. కాని, నీకు కుడి నుంచి ఎడమకు కుట్టుడం చాలా సహజంగా ఉంటుంది కదూ? నీకు ఆ విధంగా నేర్పబడింది, నీవు దానిని గురించి ఆలోచించవు, నీవు ఆ విధంగానే కుడతావు. నీవు జపానుకు వెడితే నీవు కుట్టే విధానం వారు చూస్తే, వారికి నవ్వు తెప్పిస్తుంది, ఎందువల్లనంటే వారికి ఇంకొక విధంగా కుట్టడం అలవాటు. ఇదే వ్రాతకూ వర్తిస్తుంది. నీవు ఎడమ నుంచి కుడికి వ్రాస్తావు,

కాని పైనుంచి క్రిందికి వ్రాసేవాళ్ళు కొంతమంది ఉన్నారు, మరి కొంతమంది కుడి నుంచి ఎడమకు వ్రాస్తారు, వారు దానిని అత్యంత సహజంగా చేస్తారు. నేను ఇదంతా చదువుకున్నవారి గురించి, వివిధ రకాల రచలనలను పోల్చి చూచేవారి గురించి చెప్పడం లేదు, కొద్దో గొప్పో జ్ఞానం కలవారి గురించి కూడా చెప్పడం లేదు, నేను పూర్తిగా సామాన్య జనానీకం గురించి మాట్లాడుతున్నాను. అందులో నూ, ముఖ్యంగా పిల్లలు వారి పరిసరాలలో జరిగేవాటిని పూర్తిగా ఏ ప్రేరణా లేకుండా తటాలున చేస్తూ, వారి చుట్టూ జరిగేవాటిని ఏ ప్రశ్నలు వేయకుండా ఉండటం గురించి చెప్తున్నాను. కాని ఇంకొక విధంగా చేసేవారు తారసపడితే, అప్పుడు వారు చేసేదాని కంటె మరొక విధంగా కూడా వాటిని చేయవచ్చుననే అద్భుత మైన జ్ఞానోదయం వారికి కలుగుతుంది.

మీ గుర్తింపుకు వచ్చే ఇవన్నీ పూర్తిగా చిన్న విషయాలు అవచ్చు, కాని అత్యంత స్వల్పమైన అప్రధానమైన విషయాల వివరాలలో కూడా ఇది సత్యమే. మీరు అన్నింటినీ ఆ విధంగానే చేస్తున్నారంటే దానికి కారణం మీరు జీవించే చోటు, మీ పరిసరాలలో అవి ఆ విధంగానే చేయబడుతుండడం వల్లనే. మీరు ఆ విధంగా చేస్తున్నట్లు మీకే తెలియదు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్న కృష్ణ

సంపూర్ణమైన ప్రత్యేక వ్యక్తిత్వం పొందుట అంటే ఏమిటి?

బాహ్యప్రభావాలన్నిటినీ నిరోధించగలిగే సమర్థతగల సంపూర్ణమైన ప్రత్యేక వ్యక్తిత్వం కలిగి యుండుట అంటే ఏమిటో మీకు తెలుసా?

కొన్ని రోజుల క్రిందట నేనొక జాబును అందుకున్నాను. ఆ జాబు వ్రాసిన వారు చెప్పిన దేమంటే మామూలు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను చదు వుతున్నప్పుడు తానొక అనిశ్చిత స్థితికి గురవుతున్నానని. ఉదాహరణకి, నవలలు, నాటికలు లాంటివి. అదేమిటంటే అతడి స్వభావం చాలా వరకు ఆ పుస్తకాల లోని పాత్రల స్వభావాన్ని అధిగమించ లేనిది. ఆ పాత్రల ఆలోచనలను, అనుభూతు లను, అందులోని మనుషుల స్వభావాలను తనకన్వయించుకుని జీవించడం మొద

లుపెడతాడు. ఈ స్వభావం అతడి కొక్కడికే కాదు. చాలామంది అలాగే వుంటారు. వాళ్ళు ఒక పుస్తకం చదువుతూ వుంటే ఆ చదువుతున్నంత సేపూ వాళ్ళలో వాళ్లు అన్ని రకాల ఉద్రేకాలు, ఆలోచనలు, కోరికలు, ఉద్వేగాలు, ప్రణాళికలు, చివరికి ఆశయాలతో సహా అనుభవిస్తూ తమకన్వయించుకుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే వాళ్ళు ఆ పుస్తకంలో లీనమయిపోతారు. కనీసం అది గుర్తించరు కూడా. ఎందుకంటే నూటికి తొంభై తొమ్మిది పాళ్ళు మనిషి స్వభావం మెత్తని వెన్నలా చేయబడింది — తినడానికి పనికి రాదనుకోండి. కాని దాని మీద బొటన వ్రేలితో నొక్కితే చాలు వెంటనే ఆ ముద్ర పడిపోతుంది. ఇప్పుడు ప్రతి ఒక్కటీ 'బొటన వ్రేలు' గా నుంటుంది. ఒక భావప్రకటన, ఒక చదివిన వాక్యం, చూసిన వస్తువు, ఎదుటి మనిషి చేసినదాని పరిశీలన, పక్కింటి వ్యక్తి సంకల్పం, మనిషి జాగ్రత్తగా గమనించినట్టయితే, ప్రతి ఒక్కటీ ఆ వేలిముద్ర వంటివే. అవన్నీ ఒకదానితో ఒకటి కలగలిసిపోయి వుంటాయి తెలుసా? (శ్రీమాత తన చేతివ్రేళ్ళను పెనవేసి చూపుతారు) ప్రతి ఒక్కరు శిఖరాగ్రాన్నందుకోవాలనే ప్రయత్నిస్తారు. అదే మనిషికి బాహ్యాంతరాలలో నిత్యసంఘర్షణకి కారణమవుతున్నది. చూడండి. అదే మనిషికి లోపలా బయటా విద్యుత్ప్రవాహంలా తిరుగుతూ వుంటుంది. ఇదంతా మనిషి తెలుసుకోలేడు. అది అన్ని సంకల్పాల నిత్యపోరు. అవన్నీ వేటికవే వాటి గురించి ప్రకటించుకోవాలని ప్రయత్నిస్తూ వుంటాయి. వాటన్నింటిలో బలమైనదేదో అది నెగ్గుతుంది. కాని ఆ ఒక్కటీ మిగిలిన వాటన్నిటితో ఒంటరి పోరాటం చెయ్యవలసి వుంటుంది. అందుకే ఆ పోరాటం అంత తేలిక కాదు.

సముద్ర కెరటాల మీద ఒక బెండు బిరడా విసిరితే, ఎలా ఇటూ అటూ కొట్టుకుంటుందో, అలా ఉంటుంది. మనిషి ఒక రోజు ఇది కోరుకుంటాడు, మర్నాడు అది కావాలంటాడు. ఒక క్షణం యిటు తొయ్యబడతాడు. మరొక క్షణం అటు తొయ్యబడతాడు. అప్పుడు ముఖం పైకెత్తి ఆకాశం వైపు చూస్తాడు. (శ్రీమాత అదంతా చేసి చూపుతారు.) ఇప్పుడు ఒక కలుగులో దూరిపోతాడు. మనిషి అస్తిత్వం ఇలా ఉంటుంది.

మొదట మానవుడు చైతన్యవంతుడై, పరిణతి చెందిన ప్రత్యేక వ్యక్తిత్వము గలవాడు కావాలి. అటువంటివాడు తనలో పరిసర ప్రభావాలన్నిటినించి స్వతంత్రుడైన అస్తిత్వం కలిగినవాడై తనలోనే జీవిస్తాడు, తనకు తానుగానే జీవిస్తాడు. ఏదైనా

వినగలడు, ఏదైనా చదవగలడు, ఏదైనా చూడగలడు. కాని దానివల్ల అతడిలో ఏ రకమైన మార్పు కాని, మనోవికారం గాని కలగదు. బాహ్యం నుండి ఏమి స్వీకరించాలనుకుంటాడో అదే స్వీకరిస్తాడు. తన ప్రణాళికకి సంబంధించనిదానిని అప్రయత్నంగానే తిరస్కరిస్తాడు. అతడు అంగీకరిస్తే తప్ప ఏ ముద్రా అతనిపై పడే అవకాశం వుండదు. అప్పుడు అతనికి ప్రత్యేక వ్యక్తిత్వం కలగటం ఆరంభమవుతుంది. ఎప్పుడైతే ప్రత్యేక వ్యక్తిత్వం కలిగినవాడవుతాడో, అప్పుడు దానిని సమర్పించుకోగలుగుతాడు.

ఏదైనా మనిషి తాను కలిగి వుంటే తప్ప దానిని అర్పించలేడు. ముందు తను తయారుకావాలి. ఆ తరవాత తనని తాను సమర్పించుకోగలుగుతాడు.

ఎంతకాలం మనిషి తన అస్తిత్వాన్ని గుర్తించలేడో అంత కాలం తాను సమర్పించగలిగేదేదీ వుండదు. వేర్పాటు భావం మాయం కావడానికి, మనిషి తనని తాను సంపూర్ణంగా ఆత్మార్పణ చేసుకోవడానికి, ఏ కొంచెం మినహాయింపు లేకుండా సమర్పించుకో గలగాలి. అలా అర్పించుకునే ముందు తనకు అస్తిత్వం ఉండాలి. అస్తిత్వం కోసం తప్పనిసరిగా ప్రత్యేక వ్యక్తిత్వం గలవాడు కావాలి....

(కొంత మౌనం తర్వాత) అప్పుడు, ఆ తరువాత మనిషి ఇదంతా దైవానికి సమర్పిస్తాడు. మీరు, కేవలం (మౌనం) మీ వరకే చైతన్యవంతం కావడం కాదు, అన్ని విషయాలలోను చైతన్యవంత మవాలి. కాని మీరు దేనినైతే మీ చైత్య కేంద్రం చుట్టూ వున్న మీ ఆత్మగా చెప్తున్నారో, మీ జీవాత్మ యొక్క దివ్య కేంద్రం ఏదైతే వుందో, దానిని మీరు వ్యవస్థీకరించాలి. అందుచేత అది ఒక్కటైన, పొందికైన, పూర్తి చైతన్యవంతమైన జీవాత్మగా తయారవుతుంది. ఈ దివ్య కేంద్రం దానంతటదే అప్పటికే సంపూర్ణంగా దైవానికి అర్పించబడినందువల్ల, (శ్రీమాత సమర్పణ భంగిమ), ప్రతి విషయం సామరస్యంగా దాని చుట్టూ వ్యవస్థీకరించినట్టయితే, ప్రతి వస్తువూ దైవానికి సమర్పితమవుతుంది. అందువల్ల దైవం అది తగినది అనుకుంటే, తగిన సమయం వచ్చిందనుకుంటే, ప్రత్యేక వ్యక్తిత్వం రూపొందే ప్రక్రియ పూర్తయిందనుకున్నప్పుడు, అప్పుడు దైవం మీ అహాన్ని తనలో ఐక్యం చెయ్యడానికి అనుమతిస్తాడు. అక్కడి నించీ కేవలం దైవం కోసమే జీవిస్తాం.

కాని దైవం మాత్రమే ఈ నిర్ణయం తీసుకుంటాడు. ముందు మీరు ఈ పనంతా చేయాలి. ఏమిటంటే, జీవాత్మ చైతన్యవంతం కావడం, పూర్తిగా, ప్రత్యేకంగా

దైవం చుట్టూ మాత్రమే దృష్టిని కేంద్రీకరించడం, మరియు ఆ దైవం చేత పాలింపబడడం.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

తనకు తాను ప్రత్యేక వ్యక్తిత్వం పొందడం ఎలా?

నీవు వివేకం కలిగిన ఒక అంతరాత్మవు — చైతన్యవంతమైన ఒక సంకల్పానికి

ప్రశ్న: అమ్మా, తప్పులున్నాయి.... అవి తప్పని తెలిసినప్పటికీ ఆ తప్పు చేసేటట్లు ఎవరో ప్రేరేపిస్తున్నట్లు ఉంది. అలా అయితే?

అలా ప్రేరేపిస్తున్నది ఏది? జరిగేది ఏమిటంటే అది అధః ప్రకృతి నీపై అధికారం చెలాయిస్తూ చేయకూడని పనులు నీ చేత చేయిస్తున్న ఉపచైతన్యపు సహజాత ప్రవృత్తి. ఈ విధంగా నీ సంకల్పం నిలుపుకుంటావా లేక దానికి లొంగిపోతావా అనేది నిర్ణయించుకోవాలి. నిర్ణయించుకునే ఘడియ ఒకటి ఉంటుంది. చివరకు నీవు జబ్బు పడడమా, పడకపోవడమా అని నిర్ణయించుకోవలసిన క్షణం కూడా వస్తుంది.

అయితే సాధారణ విషయాల్లో మాత్రం ఒక ప్రేరణ కలిగినప్పుడు దానికి ఒడబడటానికీ, లేదా తిరస్కరించడానికీ మధ్య వ్యవధి చాలా ఉంటుంది. చాలా నిమిషాలుంటుంటుంది. నీరసమైన లొంగుబాటుకీ, నిగ్రహించగల సంకల్పానికీ మధ్య ఎంపిక చేసుకోవాలి. ఇంకా సత్యంపై ఆధారపడ్డ నిర్మలమైన సంకల్పమే ఉంటే దానికి తప్పుడు చలనాలను అడ్డుకోగలిగిన ధాటి ఉంటుంది. నీవు గనక "అడ్డుకోలేకపోయాను".అని చెప్పావంటే అది నిజం కాదన్న మాట. అదొక సాకు; అది సన్మార్గంలో ఉండటం నీకు నిజంగా ఇష్టం లేదనే అర్థం. అవుననీ, కాదనీ అనటం మధ్యన నీ ఒప్పుదల ఉంటుంది కదా! కానీ నీవు అసమర్థంగా ఉండటానికే ఇష్టపడి ఆ తర్వాత "నా తప్పేమీ లేదు, అది నా కన్నా చాలా బలీయమైంది" అని సర్ది

చెప్పుకుంటావు. అది నీ కంటే బలంగా ఉందంటే అది నీ తప్పే అవుతుంది. ఎందుకంటే ఈ ప్రేరణలు నీవు కావు. నీ వొక చైతన్యాత్మవు, ఒక వివేకవంత సంకల్పానివి, నిన్ను నడిపించేవి ఇవే గానీ అధోసీమల్లోని ప్రేరణలు కావని గమనించడం నీ విధి.

సంకల్పించడం ఎలాగో తెలుసుకోవాలి

ప్రశ్న: మన నిర్ణయాన్ని దృఢతరం చేసుకోడం ఎలా?

బాగా దృఢంగా ఉండాలని కోరటమే! (అట్టహాసం).

ఇది చమత్కృతి కాదు, పూర్తిగా నిజం. అందరూ నిజంగా కోరుకోరు. అది ఎప్పుడూ అంతే. నీకే తెలుస్తుంది; చిత్తశుద్ధి లేనట్లు. నీవు దృఢంగా నిశ్చయించుకున్నప్పుడు, దాని మరుగున అసలు నిశ్చయం లేనిది ఒకటి దాక్కొని ఉండి, నీ నిశ్చయం ఎప్పుడు సడలుతుందా అని ఎదురు చూస్తూ, ఆ క్షణం వచ్చినప్పుడు గబుక్కున ముందుకొచ్చి నీవు చేయవద్దనుకున్న పనిని నీ చేత చేయించాలని ఎదురు చూస్తూ ఉంటుంది. నీవు మనస్ఫూర్తిగా తలుచుకుంటే దానిని పట్టుకోగలవు.

నీవు నిజంగా తలుచుకున్నట్లయితే ప్రపంచంలో ఏదీ కూడా నిన్ను ఆపలేదు. అదంతా ఎలా సంకల్పించాలో తెలియకపోవడం వల్లనే జరుగుతుంది. సంకల్పం భిన్నమై యుండటం వల్ల జరుగుతుంది. నీ సంకల్పంలో విభజన లేనట్లయితే ప్రపంచంలో ఎవ్వరూ నీ సంకల్పాన్ని మార్చలేరు. ఇది నేను గట్టిగా చెప్పగలను.

కానీ సంకల్పించడమే తెలియదు. నిజానికి దృఢ సంకల్పంతో ఉండాలనే అనుకోరు. అదంతా బూటకమే. “మనం అలా ఉంటే బాగుంటుంది... ఇలా ఉంటే ఇంకా బాగుంటుంది. ఇలా ఉండటం మంచిది” అనుకోవడమంటే అది సంకల్పించడం కాదు. వెనకాల మెదడులో ఎక్కడో ఒక మూలగా చూస్తున్నది ఒకటుండి ఇలా అంటుంది, “నేను అలా ఎందుకు కావాలనుకుంటున్నాను? నిజానికి దానికి భిన్నంగా ఉండేదే కోరుకోవచ్చు గదా!” ప్రయత్నించవచ్చు. వేచి చూడవచ్చు. కాని దానికి భిన్నమైంది చేయడానికే వెయ్యి వంకలు దొరుకుతాయి. అంత అక్కర లేదు, ఏ చిన్న ఊగిసలాట ఉన్నా అది అమాంతం వచ్చి వాలుతుంది. అంతే... కానీ సంకల్పముంటే, చేయవలసింది కచ్చితంగా తెలిసి ఉంటే, సంకల్పం మీద

పూర్తిగా శ్రద్ధ పెడితే, అది చేయకుండా ప్రపంచంలో ఏదీ కూడా ఆపలేదని చెప్పగలను. చేయటమా లేక చేయడానికి కట్టుబడి ఉండటమా అనేది కూడా దాని మీదే ఆధారపడుతుంది....

ఎలా సంకల్పించాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. వాస్తవంగా సంకల్పించాలంటే ఏకోన్ముఖుడవై యుండాలి. నీలోని వివిధ భాగాలన్నీ ఐక్యతతో ఉండాలి. అలా కాక పరస్పర విరుద్ధ వైఖర్లు అతన్ని అటూ ఇటూ లాగేస్తుంటే, మూడు వంతుల జీవితం తన చైతన్యం లేకుండా, ఏది ఎందుకు చేస్తున్నాడో తెలియని స్థితిలో ఉంటే, అతను నిజమైన జీవియేనా? అతనికి అస్తిత్వం లేనట్లే. అతను అనేక ప్రభావాలకి, చర్యలు ప్రతి చర్యలకి, శక్తులకీ నిలయమే కానీ వ్యక్తి కాదు. తన సంకల్పాన్ని కలిగినప్పుడే ఒక సత్తాగా ఉండటం ప్రారంభిస్తాడు. ఇంకా జీవి మొత్తం సమీకృతంగా ఉంటే కానీ సంకల్పించలేడు.

సమీకృతంగా ఉండాలంటే:

జీవిని మొత్తం సమీకృతం చేయాలంటే:

1. చైత్యపురుషుని ఎరుక కలిగి ఉండాలి.
2. తన ఎరుకలో నున్న తన చలనాల నన్నిటినీ, ప్రచోదనలను, సంకల్పపు ఆలోచనలనూ, చర్యలనూ, చైత్యపురుషుని ముందు పెట్టాలి. వాటిలో చైత్యపురుషుడు అంగీకరించినవాటిని అనుసరించవచ్చు. వేటినైతే చైత్యపురుషుడు అంగీకరించడో వాటిని మళ్ళీ తిరిగి రాకుండా చైతన్యం నుంచి తొలగించివేయాలి.

తనను తాను తెలుసుకోడం, నియంత్రించుకోవడము;

తన లోని అంతర్గత సత్యపు చైతన్యాన్ని పొందటం, తన యొక్క వివిధ భాగాలు, వాటి వాటి విధుల చైతన్యాన్ని పొందడం. ఇదెందుకు చేస్తున్నావు, అదెందుకు చేస్తున్నావు అనేది నీకు తెలియాలి, నీ ఆలోచనలు, నీ భావాలు, నీ చర్యలు, ఇంకా నీ శక్తిసామర్థ్యాలు మొదలైనవన్నీ నీకు తెలిసి ఉండాలి. నిన్ను నీవు తెలుసుకోవడము చాలదు. ఈ తెలివి నీకు చైతన్యపూరితమైన నిగ్రహం కలిగించాలి. తనను తాను పరిపూర్ణంగా తెలుసుకోవడమంటే తనను పరిపూర్ణంగా నియంత్రించుకోవడమే.

అయితే అనుక్షణం ఒక ఆకాంక్ష ఉండాలి. మొదలు పెట్టడానికి వేళ కాలేదనీ అనుకోనక్కర్లేదు, కొనసాగించటానికి ఆలస్యమనీ అనుకోనక్కర్లేదు. అంటే నీకు చిన్న వయసే అయినా నిన్ను నీవు పరిశీలించుకోడం మొదలుపెడితే క్రమంగా నిన్ను నీవు తెలుసుకొని నియంత్రించుకోగలవు. ఇంకా నీవు 'ముసలి' గా అయి వయసు మీరినప్పటికీ నిన్ను నీవు చక్కగా తెలుసుకొని తద్వారా ఇంకా ఇంకా, బాగా నిన్ను నీవు నియంత్రించుకొనే ప్రయత్నం చేయటానికి, సమయం మించి పోదు. అదే జీవించే శాస్త్రవిధానము.

తనను తాను పరిపూర్ణునిగా చేసుకోవాలంటే మొట్టమొదట తన చైతన్యం తాను పొందాలి. నీ జీవితంలో చాలా సార్లు ఇటువంటి సందర్భం ఎదురయ్యే ఉంటుంది: ఉన్నట్లుండి ఎవరో ఒకరు "అదెందుకు చేశావు?" అంటే "నాకు తెలియదు" అని వెంటనే బదులిస్తావు. ఎవరైనా "ఇప్పుడేమి ఆలోచిస్తున్నావు" అంటే "నాకు తెలియదు", "నీ వెందుకు అలసిపోయావు?" "నాకు తెలియదు", "నీ వెందుకు సంతోషంగా ఉన్నావు?" "నాకు తెలియదు". ఇలా ఉంటాయి. ఇంకా నేనొక యాభై మందిని పిలిచి ఏమీ తయారు కాకుండా అదాటుగా "అదెందుకు చేశావు" అని అడిగితే వారు అంతర్గతంగా జాగృతులై యుండకపోతే "నాకు తెలియదు" అనే అందరూ జవాబిస్తారు. (అయితే ఆత్మజ్ఞాన క్రమశిక్షణను అనుసరిస్తూ, చివరిదాకా తమ చలనాలను పరిశీలించుకుంటున్నవారి గురించి నేను మాట్లాడడం లేదు; వారైతే కూడ తీసుకుని ఏకాగ్రచిత్తంతో ఆలోచించి సరైన సమాధానం చెపుతారు, కొంచెం సమయం తీసుకుంటారనుకో.) ఒక రోజు పూర్తిగా నిన్ను నీవు చూసుకుంటూ ఉంటే అది అలాగే ఉన్నట్లు నీకు తెలుస్తుంది. ఏదో అంటావు, తర్వాత అలా ఎందుకు అన్నావో నీకే తెలియదు. అవి నీ నోటి నుంచి వచ్చాకనే నీవు చెప్పదలచుకున్నది అది కాదని నీకు తెలుస్తుంది. ఉదాహరణకు నీ వెవరినైనా చూడాలని వెళ్ళే ముందు వారితో ఏం మాట్లాడాలో ఆలోచించుకున్నప్పటికీ తీరా వాళ్ళ దగ్గరకు వెళ్ళినప్పుడు చూస్తూ ఉండిపోవటమో లేక ఏదో ఇంకోటి నీ నోటి వెంట రావటమో జరుగుతుంది. ఆ విధంగా నీవు చెప్పాలనుకున్నది చెప్పకుండా చేసిన వాతావరణం ఆ మనిషి దగ్గర ఏముందో నీవు చెప్పగలవా? అలా ఎంతమంది చెప్పగలుగుతారు? నిజానికి అతను ఏ పరిస్థితిలో ఉండటం వల్ల వీరు ఆ విధంగా అనుకున్నది చెప్పలేకపోయారో పరిశీలించరు. అలా వికల

మైన మనఃస్థితి ఉండి నీ వేమీ అడగలేని సందర్భాలు తప్పకుండా ఉంటాయి. అయితే ఇటువంటి సందర్భాలను నేను ఉటంకించడం లేదు. పరస్పరం స్పష్ట మైన ప్రభావాలుండి గ్రహింపు ఉన్న సందర్భాలే నేను చెబుతున్నాను. నీ స్వభా వంపై ఏది పని చేస్తున్నదీ, ఏది ప్రతిస్పందన కలుగచేస్తున్నదీ తెలుసుకోవడం గురించి చెపుతున్నాను. అది అందరికీ తెలియదు. ఎవరైనా ఉన్నట్లుండి చికాకుగా గానీ, సంతోషంగా గానీ అయినప్పుడు కారణం ఇదీ అని ఎంతమంది చెప్పగ లరు? అది తెలుసుకోవడం కష్టం. దానికి పూర్తి 'మెలుకవ (జాగృతి)' ఉండాలి. నిరంతరంగా పరిశీలనా దృష్టితో ఉండాలి.

చాలామంది రోజుకి పన్నెండు గంటలు నిద్రపోతూ "నేను మిగతా కాలమంతా మెలకువగా ఉన్నాను" అంటారు. కొంతమంది ఇరవై గంటలు నిద్రపోయి మిగతా కాలం అర్థ జాగృతంగా మాత్రమే ఉంటారు.

ఈ విధమైన పరిశీలనా ధ్యాస ఉండాలంటే ఎక్కడికక్కడ ఏంటెనా (antennae) లుండి నీ నిజచైతన్య కేంద్రానికి నిరంతరంగా తెలియచేస్తుండాలి. ఆ విధంగా నీవు గ్రహించుకుంటూ అన్నిటినీ వ్యవస్థీకరించుకోగలవు. అప్పుడు ఎవరూ నిన్ను ఏమార్చలేరు, మోసగించలేరు, పెడర్థాలు తీయలేరు; ఇక నీవు చెప్పదలచుకున్న దానికి భిన్నంగా ఏమీ చెప్పవు. అయితే మామూలుగా ఎంతమంది ఇటువంటి స్థితిలో ఉంటారు? దీన్నే నేను 'చైతన్యవంతంగా' ఉండటం అంటాను. నీవున్న పరిస్థితులు, సందర్భాలలో నీవు పూర్తిగా లబ్ధి పొందాలనుకుంటే నీవు ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. నిన్నెవ్వరూ నివ్వెరపరచ నట్లుంటాలి. ఎందుకు చేస్తున్నావో తెలియకుండా ఏ పనీ చేయకూడదు, కారణం తెలియకుండా ఏదీ మాట్లాడకూడ దు. ఎల్లవేళలా జాగృతంగా ఉండాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

వ్యక్తిని దైవార్పణం చేయడం

(1914 జూలై 4 న దివ్యమాత ప్రార్థన)

సమస్తాన్నీ శాసించే ఓ క్రియాశక్తీ, ఓ దిగ్విజయ మహాశక్తీ, దివ్య పరిశుద్ధతా మూర్తీ, దివ్యసౌందర్యమా, సర్వోన్నత దివ్యప్రేమా! సమగ్రంగా ఈ జీవి, మొత్తంగా ఈ దేహం, నీ వైపు ఆకర్షించబడి సంపూర్ణంగా, అత్యంత విధేయంగా తనను తాను నీకు, నీ అభివ్యక్తి సాధనోపకరణాలైన వీటిని నీ దైవేచ్ఛకు, పరిపూర్ణంగా, ప్రతిజ్ఞా పూర్వకంగా నివేదన మొనరించుకొనునట్లు, పరిపూర్ణంగా గాకపోయినా ఈ సాక్షాత్కారానికవి సంసిద్ధమయ్యేటట్లు అనుగ్రహించు....

మేము ఎదురు చూస్తున్న ఈ మహిమ ఏదో ఒకనాడు మాలో ఫలించి, నీ మహోన్నత వైభవం పూర్ణంగా మాలో అభివ్యక్తం అవుతుందని ప్రశాంత, మరియు దృఢమైన నిశ్చితత్వంతో మేము అపార హర్షోల్లాసంతో నీ వైపు తిరిగి నిశ్శబ్దంగా నిన్ను ప్రార్థిస్తున్నాం.

*

దైవానికి ఆత్మసమర్పణ: “శుభాశుభాలు, వివేకావివేకాలు, నానావిధ లక్షణాలు గల ఒక జీవిగా ఇచట ఉన్నాను. నేనేమై వున్నానో, దానినంతా యథాతథంగా నీకు నివేదన చేస్తున్నాను, నా లోని నిమ్నోన్నతాలు, పరస్పరం సంఘర్షణ పడే ప్రేరణలు, వైఖరు లన్నింటితో సహా నన్ను స్వీకరించు — నన్నేం చేయాలనుకుంటున్నావో దాన్నంతా చెయ్యి.” ఇలా నీ ఆత్మ-నివేదన కొనసాగుతున్నపుడు తొలుదొల్త ఈ నిర్ణయం తీసుకొన్న — కేంద్రీయ చైత్యసంకల్పం — దాని చుట్టూ నీ అస్తిత్వమంతా ఏకం గావడం మొదలవుతుంది.

నీ ప్రకృతి యొక్క సంఘర్షణాయుతమైన మౌలికాంశా లన్నింటినీ సమన్వయం చేయాలి. వాటిలో ఒకొక్కదానిని స్వీకరించి దానిని కేంద్రీయసత్తాతో ఏకం చేయాలి. అప్రయత్నంగా, ఉన్నవానివి ఉన్నట్లుగా, నిన్ను నీవు దైవానికి అర్పణ చేసుకోవచ్చు. కాని ఈ విధమైన ఏకీకరణ లేకుండా నీ పై ప్రభావం చూపే విధంగా నిన్ను నీవు అర్పించుకొనడం సాధ్యం కాదు. ఎంతెంతగా నీలో ఈ ఏకీకరణ జరిగితే

అంతంతగా నీ ఆత్మార్పణం వాస్తవరూపం దాలుస్తుంది. సంపూర్ణ ఆత్మార్పణం ఒకసారి జరిగితే, దాన్ననుసరించి పరిపూర్ణ దైవార్పణం జరుగుతుంది. సాక్షాత్కార సంవిధాన మంతటి యొక్క పతాకస్థాయి ఇది, సంవిధానపు చివరి మెట్టు. ఆ పిదప ఏ యిబ్బందీ వుండదు. అంతా సునాయాసంగా సాగిపోతుంది. పరిపూర్ణ దైవార్పణం అనేది వెంటనే సమగ్రంగా సాధ్యం కాదనే విషయం మరచిపోవద్దు. అటువంటి భ్రమ కలిగించే నమ్మకంలో పడే ప్రమాదం తరచుగా యెదురుకావచ్చు. ఎందుకనంటే ఒకటి రెండు రోజుల వరకు ఏదో ఒక ప్రత్యేకత కలిగిన బలమైన చలనం నీలో అనుభవానికి రావచ్చు. ఆ అనుభవ పర్యవసానంగా తక్కినదంతా దానంతటదే జరిగిపోతుందనే ఆశ నీలో తలెత్తేందుకు దారితీయవచ్చు. ఒకవేళ నీవు నిజంగా ఏ కొంచెమైనా ఆత్మ-సంతృప్తికి లోనైతే నీ పురోగతిని నీవే కుంటుపరచుకొంటావు. ఎందుచేతనంటే నీ అస్తిత్వం అంతా ఒక దానితో మరొకటి పోరు సలుపుతుండే అసంఖ్యాక వైఖరులతో నిండి వుంది — వాటిని దాదాపు విభిన్న మూర్తిత్వాలని చెప్పవచ్చు. వాటిలో ఒకటి తనను తాను దైవాని కర్పించుకొంటే, ఇతరమైనవి పైకొచ్చి అందుకు అంగీకరించక "మమ్మల్ని మేము దైవాని కర్పించుకోలేదు" అని గొంతు చించుకొంటూ తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొంటూ అలజడి చేయ ఆరంభిస్తాయి. అప్పుడు నీవు వాటిని శాంతింపజేసి, పరమ సత్యాన్ని వాటికి చూపించు. అంతరాత్మ నుండి పైకి రావడానికి సమయం ఎప్పుడు దొరుకుతుందా అని వేచి చూస్తున్న అరాచక అంశాలన్నింటినీ యెదుర్కొంటూ సందుగొందులను, మూల మూలలను అన్నింటినీ పరిశోధిస్తూ నీ సమస్త అస్తిత్వం చుట్టూ తిరగాలి. నీ మానసిక, ప్రాణిక, భౌతిక స్వభావం మొత్తాన్ని ఆ విధంగా చుట్టి వచ్చిన తరువాత ప్రతిదాన్నీ దైవాని కర్పణమయ్యే విధంగా నచ్చచెప్పి, ఒప్పించడం ద్వారా ఏకీకృత దైవార్పణను సాధించిన పిమ్మట నీ యిబ్బందు లన్నింటికీ నీవు మంగళం పాడగలుగుతావు. అప్పుడు అది రూపాంతరీకరణ వైపు సాగే విజయోపేతమైన నీ నిజమైన నడక అవుతుంది. ఎందుకనంటే అపుడు నీవు అంధకారంలో నుండి జ్ఞానం లోనికి గాక, జ్ఞానం నుండి మరింత జ్ఞానం లోనికి, వెలుగు నుండి మరింత వెలుగు లోనికి, సుఖం నుండి మరింత సుఖస్థితి లోనికి పురోగమిస్తావు. సంపూర్ణ దైవార్పణ తేలికైన విషయం గాదు, అనేదాన్లో ఎట్టి సందేహం లేదు. నీ అంతట నీవే స్వప్రయత్నంతో మొత్తం సాధించాలంటే ఇదమిత్థంగా

చెప్పలేని ఎంతో కాలం పట్టవచ్చు. కాని నీపై దైవకృప వుంటే అంత యెక్కువ కాలం పట్టదు. అప్పుడప్పుడు దైవం నిన్ను కొంచెం ఇటూ అటూ నెడ్తుంటే ఆ పని చెప్పుకోదగినంతగా తేలికౌతుంది. ఎంత కాలం అనేది ఆయా వ్యక్తుల మీద ఆధారపడి వుంటుంది. కానీ నీవు గనుక దృఢనిర్ణయం తీసుకొంటే తక్కువ కాలమే పట్టవచ్చు. కావలసింది దృఢనిర్ణయం, దృఢనిర్ణయమే సమస్తానికీ కీలకం.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. వి. రావు

త్రివిధమైన సమగ్ర ఆత్మనివేదన

భగవంతునికి సమగ్రమైన ఆత్మనివేదన మూడు విధాలుగ ఉంటుంది:

1. అహాన్ని పూర్తిగ త్యజించి, పరిపూర్ణ వినయవిధేయతలతో ఆతని పాదాల వద్ద సంపూర్ణ సమర్పణా భావంతో సాష్టాంగపడుట.
2. అస్తిత్వాన్ని భగవంతుని ముందు తెరిచి ఉంచుట; శరీరాన్ని నఖశిఖ పర్యంతం ఒక పుస్తకం తెరిచిన విధంగ ఆతని ముందు వివృతం చేయుట; అన్ని శరీర కేంద్రాలను, వాటి కదలికలను దాపరికం లేని సంపూర్ణ నిష్కాపట్యంతో కంటికి కనుపించు విధంగ ప్రకటించుట.
3. ప్రేమపూరితమైన ప్రగాఢ విశ్వాసంతో భగవంతుని కౌగిలిలో కరగిపోవుట, ఆతనిలో లీనమైపోవుట.

ఈ మూడు ప్రక్రియలకు మూడు సూత్రాలను లేక వాటిలో ఒక సూత్రాన్ని, సందర్భానుసారంగ జోడించవచ్చు:

1. దైవసంకల్పమే నెరవేరాలి, నాది కాదు.
2. దైవేచ్ఛగానే, దైవసంకల్పానుసారమే.
3. నేను శాశ్వతంగ నీ వాడనే.

సాధారణంగా, ఎప్పుడు ఈ ప్రక్రియలు సత్యస్ఫూర్తితో చేయబడతాయో, వెనువెంటనే ఒక పరిపూర్ణమైన తాదాత్మ్యం ఏర్పడుతుంది, అహంకారం అంతరిస్తుంది, ఒక మహోన్నతమైన ఆనందం సంప్రాప్తిస్తుంది.

తన కన్నా మిన్నయైన దానికి సంపూర్ణంగ అర్పించుకొనుటలో నున్న ఆనందాని కన్న సమగ్రమైన ఆనందం వేరొకటి ఉండదు. భగవంతుడు, ఆదిపురుషుడు, దివ్య ఉనికి, పరమ సత్యం — అని ఏ పేరునా పిలిచినా, ఆతని దరి సులభంగా చేరటా నికి ఏ పద్ధతిని పాటించినా, ఫరవాలేదు — ఒక సమగ్ర సమర్పణా భావనలో తనను తాను పూర్తిగ మరచిపోగలగటం, ఆత్మ సాక్షాత్కారానికి నిశ్చయమైన మార్గం.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

'సర్వ ధర్మాన్ పరిత్యజ్య' — శ్రీఅరవిందుల వివరణ

మానవునిలో భగవంతుణ్ణి తెలుసుకోవాలి, అతడిని అందుకోవాలి అనే తీవ్ర ఆలోచన, ఒక దృఢ సంకల్పం ముందుగా ఉదయిస్తుంది. అలా ఆరంభించి క్రమేణా అతడు తన సామాన్య వ్యక్తిగత భావనలను, కోర్కెలను, మమకారాలను, కర్మాచరణమును, తత్సంబంధిత అలవాట్లను దైవానికి సమర్పించుకుంటాడు. అలా చేసినట్లయితే ఆ దైవమే సర్వకార్యనిర్వహణను స్వయంగా చేపడతాడని అతని నమ్మకం. ఆత్మసమర్పణ అనగా మన అల్పమైన బుద్ధిని, మనోభావనలను, ఇష్టాయిష్టాలను ఒక దివ్యతేజంలో, ఒక దివ్యజ్ఞానంలో విలీనం చేయుట; మన అత్యల్పమైన, వ్యక్తిగత, పీడిత, అంధ, అవరోధాత్మక సంకల్పాన్ని ఒక ఉన్నత, ప్రశాంత, నిశ్చల, దేదీప్యమానమైన దివ్యశక్తిసమన్వితా సంకల్పంగా ఉద్ధరించుట; మన అల్పమైన, చంచలమైన, బాధాతత్వ భావనలను ఒక విశాలమైన, ప్రగాఢమైన దివ్యప్రేమగ, దివ్యానందంగ మార్చుట; మన దుర్బల, దుఃఖభాజిత వ్యక్తిత్వం ఏదైతే ఆ దివ్య పురుషుని అస్పష్ట అభివ్యక్తియో, దానిలో లయం చేయుట.

*

తనను తాను తెరిచి ఉంచుకొనుటకు ఆత్మసమర్పణ మేలైన మార్గము. ఆత్మసమర్పణ జరగనంత వరకు మాత్రమే ఆకాంక్ష, నిశ్చలత కొంతవరకు తెరుచుకొనుటకు దోహదపడతాయి. ఆత్మ సమర్పణ అనగా వ్యక్తి తన సర్వస్వాన్ని దైవానికి

నివేదించుట; తనకు తానుగానే కాక తనదైనదాని నంతా సమర్పించుకొనుట; తన స్వంత ఆలోచనలు, స్వంత కోరికలు, అలవాట్లు మొదలగు వాటికే ప్రాధాన్యత నీయకుండ, దివ్యసత్యాన్ని గురించిన జ్ఞానము, సంకల్పము, కార్యాచరణమును ఎల్లెడల ప్రతిష్ఠించుట

గీతా సందేశము:

ఆధ్యాత్మిక పురోగమనంలోని ఒకానొక దశలో మన ప్రయత్నము, మన కార్యాచరణము అంతా మన లోపల, మన చుట్టూ ఆవరించి ఉన్న ఒక మహోన్నత దివ్య ఉనికి యొక్క నిగూఢ ఒత్తిడి వలన కలిగే మానసిక మరియు ప్రాణిక ప్రతిస్పందన పర్యవసానమని తెలియవస్తుంది. మన యోగము, ఆకాంక్ష, ప్రయాస, అన్నీ ఒక అసమగ్ర, సంకుచిత పద్ధతులని అర్థమౌతుంది. కారణం, అవి వైకల్యం చెందినందువలన లేక మనస్సు ఇతర విషయాలతో సంసర్గం చెందినందు వలన, దాని అభ్యర్థనలు, అపోహలు, పక్షపాత ధోరణులు, ఒక గొప్ప సత్యం గురించిన అపార్థాలు మొదలగువాటితో పరిమితమైనందు వలన. మన ఆలోచనలు, అనుభవాలు, ప్రయత్నాలు అన్నీ అత్యున్నత విషయాల మానసిక ప్రతిబింబాలు మాత్రమే. వాటిని సమగ్రంగ, సూటిగ, స్వతంత్రంగ, విస్తృతంగ, విశ్వగతమైన శాశ్వత సంకల్పానికి సన్నిహితంగ మనలో నున్న ఆ దివ్యశక్తి సహాయంతో నిర్వర్తించవచ్చు. అయితే, మనకుగా మనం ఒక మహోత్కృష్టమైన, నిర్దిష్టమైన శక్తియుక్తుల చేతుల్లో పనికివచ్చే పరికరాలుగ మారినప్పుడు మాత్రమే అది సాధ్యపడుతుంది. ఆ దివ్య శక్తి మన నుండి వేరైనది కాదు; అది మన జీవాత్మ, అందరి జీవాత్మలతో ఒకటైనది. అంతేగాక, అది ఒక మహనీయమైన దివ్యసత్తా, ఒక సర్వవ్యాప్త దివ్యపురుషుడు. ఈ మహోన్నత దివ్యస్థితిలో మన ఉనికి, మన కార్యశీలత విలీనమైపోతే, ఆ పైన, మన మిప్పుడు భావించినట్లుగ, అవి ప్రత్యేకంగ మన స్వంతమైనవిగ ఉండవు. మానసిక వియోగమందుతాయి. ఇదంతా అనంతత్వము యొక్క గొప్ప ఉద్యమం, ఒక సన్నిహితమైన, అనిర్వచనీయమైన దివ్యసాక్షాత్కారము: మనలో ఒక లోతైన విశ్వగత ఆత్మ, ఆత్మశక్తి యొక్క స్వతస్సిద్ధమైన రూపకల్పన, అభివ్యక్తత. గీత సూచించిన ప్రకారం, ఇది సంపూర్ణంగా సాధ్యపడాలంటే, ఆత్మ సమర్పణ ఎలాంటి మినహాయింపులు లేకుండ జరగాలి. మన యోగం, మన జీవితం, మన అంతఃసత్త

యొక్క స్థితిగతులు ఈ సజీవ అనంతత్వము యొక్క స్వతంత్ర నిర్ణయానికి అనుగుణంగా నుండాలి గాని మన మనస్సు ముందుగానే కట్టడి చేసినట్లుగా ఏదో ఒక ధర్మానికి కట్టుబడి ఉండకూడదు. అప్పుడు దివ్యయోగాచార్యుడు, 'యోగేశ్వర కృష్ణుడు' మన యోగాన్ని తన హస్తగతం గావించుకొని, మనం ఎదగ గలిగినంత మేరకు పరిపూర్ణతను పొందేటట్లుగ చేస్తాడు. ఆ పరిపూర్ణత ఏదో ఒక బాహ్య లేక మానసిక ప్రమాణానికో లేక ఒక పరిమిత నియమానికో చెందినదై ఉండదు. అది అపారమైనది, సమగ్రమైనది, ఊహాతీతమైనది. ఒక పరమ సత్యానికి అనుగుణంగా సమస్తాన్ని ఆకళింపు చేసుకోగల దివ్యజ్ఞానం ద్వారా వికసన మొందిన పరిపూర్ణత. ముందుగా మానవ స్వభావానికి దోహదపడి, తదుపరి ఒక ఉన్నతమైనదాని లోకి విస్తృతమౌతుంది — ఒక అధి ఆత్మలోకి, అపరిమిత శక్తిలోకి, అజరామరమైన, స్వతంత్రమైన, సర్వాన్ని మార్పుచెందించగల, దివ్యమైన, అనంతమైన ఉజ్జ్వల ప్రకాశంలోకి, వైభవం లోకి.

అట్టి మార్పుకు గురి అయ్యే పదార్థంగ మన సర్వస్వాన్ని అర్పించాలి. ఒక సర్వజ్ఞతగల చైతన్యము మన జ్ఞానాన్ని, అజ్ఞానాన్ని, మన సత్యాన్ని, లోపాన్ని, తాను స్వీకరించి వాటి అయోగ్యతలను అంతమొందించి — 'సర్వధర్మాన్ పరిత్యజ్య' — తన అనంతమైన దివ్యజ్ఞానంలోకి మార్చివేస్తుంది. ఒక సర్వశక్తి సమన్వితమైన దివ్యశక్తి మన నైతికతను, అనైతికతను, మన తప్పొప్పులను, మన బలాలను, బలహీనతలను తన పరం గావించుకొని పరస్పరం ముడిపడిన వాటి తత్వాన్ని విసర్జించి – 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య' — వాటిని సర్వోత్కృష్టమైన స్వచ్ఛత, విశ్వగతమైన మంచితనం, నిర్దుష్టమైన శక్తిగ మారుస్తుంది. మన అల్ప సంతోష విచారాలను, సుఖదుఃఖాల ప్రయాసలను, ఒక అనిర్వచనీయమైన ఆనందం తనలో ఇముడ్చుకొని వాటి వైపరీత్యాలకు, అపశృతులకు స్వస్తి పలుకుతుంది – 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య' — వాటిని మహోన్నతమైన, విశ్వవ్యాప్తమైన ఊహకందని, మహదానందంగ పరివర్తింప జేస్తుంది. అన్ని యోగసాధనలు సిద్ధింపజేయగలిగిన దానికన్న మిన్న నైనదానిని అందించుటయే గాక, దానిని ఒక పారదర్శక మార్గంలో మానవమాత్రుడైన ఏ ఆచార్యుడుగాని, ఋషిగాని, జ్ఞానిగాని బోధించ గలిగిన దాని కన్న ఉన్నతమైన వివేకమును, జ్ఞానమును సమకూరుస్తుంది. ఏ అంతరంగ ఆధ్యాత్మిక స్థాయికి ఈ మహాయోగం, మనలను కొనిపోగలదో, అది మన కిక్కడ

అందుబాటులో నున్నదాని కన్నా ఉన్నతమైనది. అంతేగాక, ఈ లోకము మరియు పరలోకాలను గురించిన అవగాహనను అందించి, అన్నింటిని పరిధులు లేని, బంధములు లేని, ఆధ్యాత్మిక పరివర్తనకు లోను చేస్తుంది. — 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య'. ఆ దివ్యత్వము యొక్క అపారమైన ఉనికి, చైతన్యము, ఆనందము, ప్రశాంత మౌనము, కాంతివంతమైన అపరిమిత క్రియాశీలత అక్కడ పరిఢవిల్లుతాయి. అవియే దాని ప్రధానమైన, మూలాధారమైన విశ్వగత వస్తుతత్వము, ఆకారము, స్వభావము. అట్టి అనంతాకృతిలో యోగమాయచే కప్పబడని దైవం ప్రస్ఫుటంగా ఉంటాడు. అతను ఎప్పుడు ఏ విధంగా సంకల్పిస్తాడో, ఆ విధంగా మనలో భగవంతుని వివిధ రూపాలను, జ్ఞానము యొక్క పారదర్శక కోణాలను, ఆలోచనలను, ప్రేమను, ఆధ్యాత్మిక ఆనందాన్ని, శక్తిని, కార్యశీలతను మనలో సృష్టిస్తాడు. ఇదంతా ఆతని స్వయంతృప్తికి, అక్షయమైన ఆనందానుభూతికి అనుగుణంగా కొనసాగుతుంది. ఇందులో స్వేచ్ఛాయుతమైన అంతరాత్మను గాని, నిష్కల్మష ప్రకృతినిగాని కట్టడిచేసే ప్రభావం లేదు. ఏదో ఒక నిమ్నస్థాయికి చెందిన సూత్రానికి తప్పించుకోలేనంతగా బద్ధుడై ఉండనవసరం లేదు. కారణం, కార్యాచరణ అంతా ఈశ్వరశక్తితో ఒక దివ్యమైన స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహింపబడుతుంది — 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య'. ఆ అమోఘమైన దివ్యశక్తి యందు, 'పరమ ధర్మ' మందు నిశ్చలమైన నిలకడ ఈ ఆధ్యాత్మిక స్థితికి పునాది. విశ్వగత జీవుడితోను సమస్త జీవరాశితోను ఒక అన్యోన్యమైన ఏకీకృత అవగాహన, మనస్సు యొక్క విభిన్న పోకడల నుండి, బాధ నుండి విముక్తమై అంతరాల మధ్య నుండే వాస్తవ తారతమ్యాలను వివేకవంతంగ గమనించగలిగే అవగాహన, దీని నిర్ధారిత శక్తి. ఈ సమగ్ర విముక్తి యొక్క ఫలితం ఒక అనర్గళమైన ఆనందమయ స్థితి; అనంత కాలం పాటు కొనసాగే వ్యక్తి ఆ పరమాత్మునితో ఏకత్వము నొంది సామరస్య సంబంధం నెలకొల్పుట. మానవుని ఉనికిని భంగపరచే సమస్యలు — ఉదాహరణకు అర్జునుడి ఉనికికి సమస్యాత్మకమైనటు వంటివి — అజ్ఞానంలో కూరుకుపోయి భిన్నమార్గాలను అనుసరించే మన వ్యక్తిత్వం చేతనే సృష్టించబడతాయి. ఈ యోగం మానవుని అంతరాత్మను భగవంతునితోను, విశ్వజీవనమ తోను సరి అయిన సంబంధం నెలకొల్పి, మన కర్మాచారణను దైవదత్తం చేస్తుంది. దానికి రూపకల్పన చేసి చలనం కలిగించే జ్ఞానాన్ని, సంకల్పాన్ని దైవపరం గావిస్తుంది.

మన జీవితాన్ని సామరస్యపూర్వక దివ్యమైన ఆత్మాభివ్యక్తతగ తీర్చిదిద్దుతుంది. భంగపరచే సమస్యలు ఈ విధంగా సమసిపోతాయి.

*

"అయితే ఇప్పుడిదొక మహత్తరమైన ఉద్యమం — ఈ నీ జీవాత్మ యొక్క, నీ ప్రకృతి యొక్క సంపూర్ణ సమర్పణ; నీ ఆత్మకు అతీతుడైన ఆ పరమాత్మునికి సర్వధర్మాల పరిత్యక్తత; ఒక మహోన్నతమైన ఆధ్యాత్మిక ప్రకృతి కొరకు నీ సర్వేంద్రియాల సమగ్ర ఆకాంక్ష. ఒక్కసారి దీనిని ప్రారంభ దశలోనైన, లేక మార్గాంతర దశలోనైన, సాధించగలిగితే, అప్పుడు నీ బాహ్య ప్రకృతి స్తరంలో, నీవు ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నా లేక ఇతఃపూర్వం ఏ స్థాయిలో ఉండినా సరే, నీ మార్గం నిశ్చితమౌతుంది, నీ పరిపూర్ణత అనివార్యమౌతుంది. నీ అంతరంగంలోని ఒక దివ్య ఉనికి నీ యోగాన్ని చేపట్టి, నీ స్వభావానికి అనుగుణమైన మార్గంలో దానిని వడివడిగ ఒక సమగ్రమైన అంతిమ దశకు కొనిపోతుంది. ఆ తరువాత నీ జీవితశైలి, నీ కార్యాచరణ తీరు ఎటువంటిదైనప్పటికి, నీవు ఆతనిలో చైతన్యవంతంగ జీవిస్తావు, కర్మాచరణ గావిస్తావు, ఆతనిలోనే మెదులుతుంటావు. ఆ దివ్య శక్తి నీ ద్వారా నీ అంతరంగ మరియు బాహ్య కదలిక లన్నింటిలో పని చేస్తుంది. ఇది ఒక మహోత్కృష్టమైన మార్గము ఎందుకనగా, ఇది అతి గోప్యమైనది మరియు మార్మికమైనది. అయినా కూడా ఇది అంచెలంచెలుగ అందరికి అనుభవైకవేద్యమైన అంతరంగ చలనము. నీ వాస్తవికతకు, నీ ఆధ్యాత్మిక ఉనికికి సంబంధించిన ఒక లోతైన ఆంతరంగిక సత్యము.

మూలము: శ్రీఅరవిందులు

అనువాదము: అందుగులపాటి కైలాసపతి, జానకి

కావలసిన దేమిటంటే ఏకాగ్రత — దైవంపై ఏకాగ్రత; ఆతని సంకల్పానికి ప్రయోజనానికి ఒక సమగ్రమైన, సంపూర్ణమైన, ఆత్మార్పణా దృష్టితో కూడిన ఏకాగ్రత.

శ్రీమాత

ఉదాసీన సమర్పణ — శ్రద్ధాన్విత సమర్పణ

నీవు దైవానికి సమస్తం అర్పణ చేస్తే నీ ప్రయత్నాన్ని వదలివేయాలి, అన్నంత మాత్రం చేత నీ సంకల్పంతో కూడిన అన్ని పనులను త్యజించమని అర్థం కాదు. దానికి వ్యతిరిక్తంగా నీ ఇచ్ఛను పరిపూర్ణతను ఆశించి దైవేచ్ఛకు అర్పించి నీ సాక్షాత్కారానుభవాలను వేగిరపరచుకోవచ్చు. అది కూడా ఆత్మసమర్పణకు మరొక రూపం.

నీ వద్ద నుంచి కోరుకునేది ఉదాసీనతతో నీవు ఒక మొద్దులాగా అవరోధం అయిపోయే సమర్పణ కాదు, దాని బదులుగా నీ ఇచ్ఛను దైవేచ్ఛ అధీనంలో ఉంచడం.

ప్రశ్న: కాని, దైవంతో సంయోగం సఫలీకృతం కావడానికి ముందే దీనిని ఎవరైనా ఎలా చేయగలరు?

నీకు ఒక ఇచ్ఛా బుద్ధి ఉంది, దానిని నీవు నివేదన చేయవచ్చును. రాత్రులందు నిద్రలో ఎరుకతో ఉండటం అనే విషయాన్నే ఉదాహరణగా తీసుకుందాం. నీవు ఉదాసీన వైఖరితో సమర్పణ కావిస్తే అప్పుడు నీవు "నేను ఎరుకను కలిగి ఉండాలనేది దైవేచ్ఛ అయితే, అప్పుడు నేను ఎరుకను కలిగినవాడ నవుతాను" అని అంటావు. దానికి బదులుగా, నీవు నీ ఇచ్ఛను దైవానికి నివేదించడం జరిగితే, సంకల్పించడం ప్రారంభించి, "నేను నిద్రలో ఎరుకను కలిగి ఉంటాను" అని అంటావు. నీకు చేయాలనే ఒక ఇచ్ఛ ఉంది. దానికి నీవు సోమరిగా కూర్చుని నిరీక్షించవు. సమర్పణ సవ్యంగా ఎప్పుడు జరుగుతుందంటే, దానికి నీ వైఖరి ఈ విధంగా ఉండాలి, "నేను నా ఇచ్ఛను దైవానికి అప్పగిస్తున్నాను, నాకు చాలా తీవ్రంగా రాత్రులందు నిద్రలో ఎరుకను పొందాలని ఉంది, నాకు దానికి తగిన జ్ఞానం లేదు, దైవేచ్ఛ నాకు దానిని తెలియజేయు గాక." నీ ఇచ్ఛ తప్పకుండా నిరంతరం నిలకడగా ఉండాలి. ఒక పనిని ఫలానా విధంగా జరగాలని అనుకోవడం గాని లేక ఒకదానినే హక్కు భుక్తంగా కోరుకోవడం గాని కాకుండా, ఆ ఆకాంక్ష తీవ్రమైనదిగా, కార్యసిద్ధికై ఏకాగ్రతతో ఉండేదిగా ఉండాలి. ఇది మొదటి అడుగు. నీవు జాగరూకతతో ఉంటే, నీవు అప్రమత్తతతో కూడిన శ్రద్ధను కలిగి ఉంటే, నీవు ఏం చేయాలనేది ఒక స్ఫూర్తి రూపంలో ఎంతో కొంత తప్పకుండా అందుకుంటావు. నీవు దానిని వెనువెంటనే

ఆలస్యం చేయకుండా ఆచరణలో పెట్టాలి. నీవు కేవలం, తప్పనిసరిగా జ్ఞాపకం పెట్టుకోవలసిన దేమిటంటే, దైవార్పణానంతరం, నీవు చేసే చేతల మూలంగా ఏ ఫలితం వచ్చినా దానిని స్వీకరించడం; ఆ ఫలితం నీవు అనుకున్నదానికి పూర్తిగా భిన్నంగా ఉన్నా సరే. దీనికి మారుగా, నీది ఉదాసీన సమర్పణ అయితే, నీవు ఏమీ చేయవు, ఏ ప్రయత్నమూ ఉండదు, హాయిగా నిద్రలోకి జారుకుని, ఒక అద్భుతం కోసం నిరీక్షిస్తుంటావు.

ఇప్పుడు నీ ఇచ్ఛ లేదా కోరిక దైవేచ్ఛకు అనుగుణంగా అంగీకారయోగ్యమైనదా, కాదా అని తెలుసుకోవాలన్నా, సమాధానం దొరికిందా లేదా, నీవు అనుకున్నదానికి తగిన ఆసరాతో ప్రోత్సాహం దొరికిందా లేక ఖండించబడిందా అని తెలుసుకోవాలన్నా మనస్సుతోటి లేక ప్రాణికంతోటి కాకుండా, హృదయంలోని అస్తిత్వ అంతరం లోలోతులలో ఎల్లప్పుడూ ఉంటూ ఉన్న ఆ సద్వస్తువేదో దానితోనే తప్పకుండా చూసి తెలుసుకోవాలి.

*

పని చేస్తుండటం అనేది మంచి నియమం. కాని ఆలోచన మాత్రమే సరిపోదు, ఉదాసీన భావన, జడచేతన, సంకల్పరహితమై చాల మటుకు యాంత్రికమైన సమర్పణ వలన ప్రయోజనం లేదు. ఇది కేవలం పని చేయటంలోనే ఉండదు.

సమర్పణలో అత్యంత ముఖ్యమైనది నీ స్వభావాన్ని, నీ జీవితవర్తనను సమర్పించుకోవడం. ఫలితంగా అది మార్పుకు లోనవవచ్చును. నీదైన నీ ప్రకృతిని నీవు సమర్పించకపోతే, ఈ ప్రకృతి ఎప్పటికీ మారదు. ఇక్కడ ఇదే చాలా ముఖ్యమైనది. నీవు కొన్ని రీతులలో అవగాహన చేసుకుంటావు, కొన్ని విధాలుగా ప్రతిస్పందిస్తావు, కొన్ని విధాలుగా అనుభూతిని పొందుతావు. చాలా మటుకు కొన్ని పద్ధతులలో పురోభివృద్ధి నొందుతావు, అన్నింటినీ మించి, జీవితాన్ని ఒక ప్రత్యేక దృష్టితో చూస్తావు, దాని నుంచి కొన్నింటిని ఆశిస్తావు. ఇదే, దీనినే నీవు సమర్పించవలసినది. దానర్థం, నీవు నిజంగా దివ్యప్రకాశం అందుకొని, పరివర్తన చెందాలని కోరుకుంటే, నీ మొత్తం జీవితవర్తననంతా తప్పక నివేదించాలి; దానిని ఉన్మీలనపరచి నివేదించాలి, అది ఎంత మటుకు గ్రహించగలదో, అంత మటుకు దానిని తయారుచేయాలి, దాని వలన దివ్యచైతన్యం నీవు ఏ విధంగా ఉండాలో అవధరించి, సరాసరి పనిచేస్తూ ఈ గమనాలన్నింటిని మార్పు చేసి, వాటిని ఇంకా సత్యగమనాలుగా మార్చి,

ఇంకా ఎక్కువగా నీదైన సత్యంలోనికి అనుగుణంగా ఉండేటట్లుగా చూస్తుంది. ఇది తాను చేసేది సమర్పించేదాని కంటే, అపారంగా అధికాధికంగా ముఖ్యమైనది. వ్యక్తి ఏం చేస్తున్నాడు కాదు ముఖ్యం. (ఎవరైనా చేసే పని ఎంతో ముఖ్యమైనదే, అది సుస్పష్టమే), ఆ వ్యక్తి అసలు తత్వతః ఏమిటి అనేది అత్యంత ముఖ్యమైన విషయం అవుతుంది. పని ఎటువంటిదైనా, పూర్తిగా అది ఏవిధంగా చేస్తారనేదే కాదు, ఏ చైతన్యస్థితిలో చేయబడుతున్నదనేదే ముఖ్యమైనది.

మూలం శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

మూడవ దశ: దైవం వ్యక్తిత్వాన్ని దివ్య అస్తిత్వంగా మార్పు చేయటం

నిర్వాణము — అస్తిత్వం యొక్క ప్రయోజనము

సామాన్యంగా, అన్ని యోగాలు ఆ రెండవ స్థితి దగ్గర ఆగిపోతాయి. తనని తాను సంపూర్ణ సమర్పణ చేసుకుని ఆ దైవంతో ఐక్యత సాధించటంలో సఫలీకృతం అయిన తరువాత మన పని అంతా పూర్తయిందని భావిస్తాం. అంతా సాధించాం అని తృప్తి చెందుతాం.

కాని, ఇక్కడే మనం ప్రారంభిస్తాము.

"కాదు, ఇది ఒక ప్రారంభం మాత్రమే. మనం ఐక్యత పొందిన ఆ దైవం ప్రత్యేకమైన మన వ్యక్తిత్వంలో ప్రవేశించి, దాన్ని ఈ దివ్య ప్రపంచంలో కార్యాచరణ చేసే దివ్య అస్తిత్వంగా తయారు చేయాలి" అని అంటాం. దీన్నే మనం రూపాంతరీకరణం అని పిలుస్తాం.

— శ్రీమాత

ఆత్మకు స్వేచ్ఛ కల్పించుట కేవలం ఒక కాంతివంతమైన అడుగే;
ఇక్కడ దైవం కోరేది మాత్రం మానవ దేహంలో తనను తాను సఫలీకృతుని చేసుకొనుట.

— 'సావిత్రి'

*

(ఒక శిష్యునికి): పూర్ణయోగంలోని రెండు ముఖ్య విషయాలని నువ్వు సరిగ్గా వ్యక్తపరిచా

వనుకుంటాను — మొదటిది, ఈ ప్రపంచాన్ని ఒక భ్రమగానో, ఒక పొరపాటుగానో భావించి తిరస్కరించకుండా, ఈ ప్రపంచాన్ని ఒక దివ్యశక్తి అభివ్యక్తిగా అంగీకరించడం; రెండవది ఈ అభివ్యక్తి యొక్క లక్షణాన్ని యోగంతో సాధ్యపడిన ఆధ్యాత్మిక పరిణామం ద్వారా, మనోప్రాణదేహాలను, ఆధ్యాత్మికమైన అతిమానస సమగ్రతను సాధించే పనిముట్లుగా రూపాంతరం చెందుటకు ఉపయోగపడే సాధనాలుగా అభివర్ణించడం. ఈ విశ్వం భౌతికమైన వాస్తవం మాత్రమే కాదు, ఒక ఆధ్యాత్మిక సత్యం కూడా. జీవితం కేవలం ఏవో కొన్ని శక్తుల క్రీడావినోదమో లేదా ఒక మానసిక అనుభవమో కాదు, అది రహస్యాత్మ పరిణామ క్షేత్రం. ఆ సత్యాన్ని పట్టుకుని, ఆ సత్యాన్ని సాక్షాత్కరింపచేసుకుందుకు, ఆ సత్యాన్నే ప్రేరణాశక్తిగా చేసుకున్నపుడు, మానవజీవితం అంతకు మించిన అతీతస్థితికి రూపాంతరం చెంది సఫలీకృతమౌతుంది. ఆ సాక్షాత్కారాన్ని పొందడానికి సాధనా మార్గం పూర్ణయోగంలోనే లభిస్తుంది. మన అస్తిత్వంలోని అన్ని భాగాలు దైవంతో ఐక్యతను పొందాలి. తద్వారా వాటిలో ఇప్పుడున్న లోపాలు, వక్రతలు పరివర్తన చెంది క్రమంగా ఒక సమగ్ర ఉన్నత దివ్యచైతన్య సత్తగా రూపాంతరం చెందుతాయి.

*

పరమాత్ముని ఉనికిని గురించి, దివ్యచైతన్యము గురించి, దివ్యానందం గురించి మనలో మెదులుతున్న భావనలకు అతీతమైన నిశ్శబ్ద ఆత్మ యొక్క స్వచ్ఛమైన దివ్య అస్తిత్వము, చైతన్యము, పరమానందములతో కూడిన పరిపూర్ణానుభవమే అమూర్త సాక్షాత్కారం. అందువలన అది నిర్వాణదిశగా దారితీస్తుంది. పూర్ణజ్ఞానంలో ఆత్మసాక్షాత్కారము, అమూర్తమైన సచ్చిదానందము ఒక మెట్టు మాత్రమే, కాని చాలా ముఖ్యమైన మెట్టు, లేదా పూర్ణ జ్ఞానంలో ఒక భాగం. అది ప్రారంభం మాత్రమే. ఓ ఉత్కృష్ట సాక్షాత్కారం యొక్క చరమస్థితి కాదు.

*

దివ్యంగా చేయడం అంటె మానవ స్థితులు అంతరించిపోవడమని అర్థం కాదు, వాటిని పవిత్రీకరించి, ఉన్నతం చేసి పరిపూర్ణత్వాన్ని సాధించే మార్గం చూపడం. వాటి పూర్తి శక్తిని, ఆనందాన్ని సంపూర్ణంగా సిద్ధింప చేసుకోవడం. అనగా ఈ మొత్తం పృథ్వీ జీవితాన్ని దాని సంపూర్ణశక్తి, ఆనందాలకు ఉద్ధరించడం.

ప్రాణిక మానవ స్వభావమును, అసమగ్రమైన వికృతమైన మార్పుకు ఇష్టపడని

శక్తులు అడ్డుకోకపోతే, ఈ మార్పు ఏ కష్టం లేకుండా సహజంగా, ఏ బాధా లేకుండా వికసిస్తుంది. ఉదాహరణకి, నీ లోని కవిత్వం, సంగీతం ఏ విధంగా ఈ ఆధ్యాత్మిక, చైత్యపురుష ప్రభావ వృష్టి వల్ల వేగంగా, సునాయాసంగా పుష్పించాయో ఆ విధంగా అన్న మాట. అది సంభవించడానికి కారణం, నీలోని మొత్తం అంతా ఆ మార్పుని కోరడమే. దానితో బాటు నీ ప్రాణికం తనలోని అసమగ్రతలను గుర్తించడానికి అంగీకరించడం, తన దృక్పథంలోని పొరపాట్లని వదలుకోడం అన్న మాట. ఉదాహరణకి, కీర్తికాంక్షను త్రోసివేసి సమగ్రతను, అంకిత స్వభావాన్ని కలిగి ఉండడం. జీవితాన్ని దివ్యమయంగా చేయడమంటె నిజానికి జీవితాన్నే ఒక ఉన్నతమైన కళగా భావించి జీవించడం. ఇప్పటి జీవనకళ అహంచేత, అజ్ఞానంచేత ఉత్పన్నమైనది. అంచేత దానితో పోలిస్తే అల్పమైనది, మొరటుది, అసమగ్రమైనది , (సంగీత, సాహిత్యాల యొక్క నిమ్నస్థితులే సామాన్య మానసిక, ప్రాణిక స్థితులకు మరింత ఆకర్షణీయంగా ఉంటాయి.) అది ఆధ్యాత్మిక, మరియు చైత్యపురుష ఉన్మీలనం వలన, సునిశితత్వం వలన తన నిజమైన సమగ్రతను చేరుతుంది. అది సంభవం కావాలంటే, భౌతిక స్వభావంలోని అల్పమైన, తామసికమైన స్థితులను సంపూర్ణంగా తొలగించి, ఆ దివ్య ప్రకాశంలో వాటిని తడిపి, ఆ జ్వాలలో శుద్ధి చేసి తమ నిజస్థితికి మార్చి తేజోవంతం చేయాలి. అప్పుడు ఈ సామాన్య స్వభావం పవిత్రమై, తేజోవంతమై, స్వచ్ఛంగా మారుతుంది.

అయితే, దురదృష్టకరమైన విషయం ఏమిటంటే మనలోని మొండివైఖరి, అస్పష్టమైన మొండితనం, తిరస్కారం. అదే మన యోగంలో బలవంతం, నిర్బంధం అన్న వ్యతిరేకతలకు కారణం. అడ్డుగా ఉన్న విషయాలను మొండిగా, మొరటుగా, నిరుపయోగమైన ఒత్తిడిని కలిగించేవాటిని తిరస్కరించడం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డి. సత్యవాణి

ఆరోహణ — అవరోహణ

ఈ యోగసాధన ద్వివిధమైనది — ఒకటి, చైతన్యము ఊర్ధ్వభూమికలకు ఆరోహణ, మరొకటి, దుష్ట అజ్ఞానశక్తులను పారద్రోలి ప్రకృతిని పరివర్తించుటకై ఊర్ధ్వభూమికల శక్తి భూచైతన్యములోకి అవరోహణ.

*

ఈ యోగంలో చైతన్యము (కొంత మానసిక — ఆధ్యాత్మిక — అతీంద్రియ అనుభవాలతో ఒక ప్రాథమిక భూమిక ఏర్పాటైన తదుపరి) బ్రహ్మరంధ్రానికి పై నుండే యదార్థ ఆధ్యాత్మిక చైతన్యానికి చెందిన స్తరాల లోకి ఆకర్షింపబడుతుంది. ఆ స్తరాల నుండి కేవలం పరిగ్రహించుటతో సరిపెట్టుకొనక, అక్కడ స్థిరంగా నిలచి నిమ్న చైతన్యాన్ని పూర్తిగ మారుస్తుంది. ఎందుకనగా, ఆధ్యాత్మిక చైతన్యానికి యుక్తమైన క్రియాశీల శక్తి ఒకటి ఉంది. దాని లక్షణం దివ్యతేజం, దివ్యశక్తి, దివ్యానందం, దివ్యశాంతి, దివ్యజ్ఞానం, అనంతమైన విస్తృతత్వం. ఆ లక్షణాలన్నీ పరిగ్రహింపబడి అస్తిత్వమంతా వాటి అవరోహణతో నిండాలి.

*

కెరటాలు ఉప్పొంగి ఎగిసిపడుతూ శిరస్సును తాకుతున్నటు వంటి అనుభూతి కలుగుతుంది. ఫలితంగా బాహ్యం అచేతనావృతమౌతుంది. అంతరంగం మేల్కొంటుంది. ఇది మూలాధార మందున్న నిమ్న చైతన్యము ఉన్నత చైతన్య దిశగా ఎదిగే ఆరోహణ. ఇది తాంత్రిక ప్రక్రియలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఒక చలనానికి సామ్యమైనది; కుండలినీ శక్తిని జాగృతపరచుట; శరీరంలో ముకుళితమై నిగూఢంగా నున్న దివ్యశక్తి మూలాధారం నుండి, వెన్నెముక గుండా ఇతర చక్రాలు మరియు బ్రహ్మరంధ్రము ద్వారా ఊర్ధ్వముఖంగా ఎగసి అక్కడ ఉపస్థితుడై ఉన్న పరమాత్మతో అనుసంధానము చెందుట. మన యోగంలో ఇది ఒక ప్రత్యేకమైన ప్రక్రియ కాదు; స్వతఃస్సిద్ధంగా అధోచైతన్యమంతా ఊర్ధ్వదిశగా ఎగిసే సహజ క్రియ. ఆ పొంగు కొన్నిసార్లు ఒక ప్రవాహంలాగా, కొన్నిసార్లు తరంగాల్లాగా, మరికొన్ని సార్లు వాటికన్న తక్కువ స్థాయి కదలికలలాగా ఉంటుంది. మరొక ప్రక్కన దివ్యచైతన్యము దాని దివ్యశక్తితో పాటు, శరీరంలోకి అవరోహణ చెందుతుంది. ఈ అవరోహణ ఒక దివ్యసత్తా యొక్క నిశ్చలత్వం, ప్రశాంతత, శక్తిసామర్థ్యాలు,

ప్రకాశం, సంతోషపారవశ్యకతల విశాలత, స్వేచ్ఛ, జ్ఞానముల వెల్లువ జాలువారినట్లుగ ఉంటుంది; కొన్ని సార్లు వీటిలో ఒకటిగాని, కొన్నిసార్లు వీటిలో కొన్నిగాని, మరికొన్ని సార్లు అన్ని కలసికట్టుగ గాని క్రిందికి దిగినట్లుగ ఉంటుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

మన తీవ్ర ఆకాంక్ష — మన అనివార్య గమ్యం

పసిడి వన్నె దివ్యకాంతి

నా మతియందవతరించె నీ పసిడి వన్నె దివ్యకాంతి
మసకేసిన మది గదులన్నీ భానుకిరణ రంజితమై
దివ్యజ్ఞాన భూమికలకు దీటైన స్పందనలా
నిశ్చల వెలుగును జిమ్మే దివ్యకాంతి దివిటీయాయె.

నా గళమందవతరించె నీ పసిడి వన్నె దివ్యకాంతి
దివ్యశ్రావ్యగీతికాయె నా పదవల్లరి స్వర మధురిమ
నా స్వరఝురిలో ప్రతి బిందువు నీ విజయగీత ఆలాపన
అమరుల మధువుని గ్రోలి మత్తెక్కను నా మాటలు

నా యెదయందవతరించె నీ పసిడి వన్నె దివ్యకాంతి
నీ నిత్య సత్యతత్వంతో జీవితం ప్రణీతమాయె
నేడది నీ నిలయంగ దేవాలయమై పోయెను
నా ఆవేశం ఆవేదన నీకే అంకితమై పోయెను.

నా పాదయుగళ మవతరించె నీ పసిడి వన్నె దివ్యకాంతి
నా భౌతిక క్షేత్రమాయె నీ ఖేలావని, నీ పీఠం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగుల్లపాటి కైలాసపతి, జానకి

రూపాంతరీకరణం

ఉన్నత చేతనలో ఎల్లప్పుడూ ఉండిపోగలిగనట్లైతే, అదెంతో ఉత్తమస్థితి అవుతుంది. అయినపుడు అక్కడే ఎందుకని ఎల్లపుడూ ఉండలేకపోతున్నాడు? ఎందుకనంటే నిమ్నస్థితి అతని ప్రకృతి లేక స్వభావంలో ఒక భాగంగా ఇంకా ఉండిపోవడం, అది అతనిని తన వైపు ఆకర్షించుతూండడం కారణం. అలా కాక నిమ్నస్థితి గనుక రూపాంతరం చెందడం జరిగితే, ఉన్నత స్థాయి లాగా తయారైతే, అప్పుడతనిలో క్రిందికి లాగే నిమ్నస్థాయి ఏదీ వుండదు.

రూపాంతరీకరణం అంటే మనస్సు, ప్రాణికం, దేహం లోనికి ఉన్నత చేతనను లేక ప్రకృతిని తీసుకువచ్చి, నిమ్నం యొక్క స్థానాన్నది ఆక్రమించడం. ఆధ్యాత్మికానికి సంబంధించిన యదార్థ ఆత్మ యొక్క ఉన్నత చేతన ఒకటున్నది. కాని అది ఊర్ధ్వంలో వుంది. ఊర్ధ్వాన ఉన్న దాని లోనికి అతడు ఎదగగలిగి, అచట ఉన్నంత కాలం అతడు స్వేచ్ఛామయుడై వుంటాడు. అతడు క్రిందికి, మనఃప్రాణ దేహాల లోనికి దిగిపోయి, లేదా వాటి నుపయోగించితే, జీవితంతో యెటువంటి సంబంధమైనా — ఆలా సంబంధం పెట్టుకొనక తప్పదు — కొనసాగించడానికి అతడు క్రిందికి దిగవలసి వచ్చినపుడు, వచ్చి సాధారణ చేతన నుండి కర్మ చేయవలసి వచ్చినా లేదా ఆత్మస్థితుడై, మనస్సును, జీవనాన్ని, దేహాన్ని ఉపయోగించవలసి వచ్చినా ఈ ఉపకరణాల అపరిపూర్ణతల నెదుర్కొని వాటిని సరిచేయవలసి వస్తుంది. రూపాంతరీకరణ వలననే ఆ అపరిపూర్ణతలను సరిచేయడం జరుగుతుంది.

*

మనస్సుకు, అతిమనస్సుకు మధ్యగల అగాధాన్ని పూడ్చివేసి సేతువును నిర్మించాలి. ప్రస్తుతం నిశ్చల నీరవతా శూన్యాలున్న చోట, మూసుకుపోయిన మార్గాలను తెరచి, ఆరోహణావరోహణలకై రహదారులను క్రొత్తగా నిర్మించాలి. త్రివిధ రూపాం తరీకరణం వల్లనే ఇది సాధ్యమౌతుంది. ప్రప్రథమంగా చైత్యపరివర్తన జరగాలి. మన ప్రస్తుత సమస్త ప్రకృతి, అంతరాత్మ యంత్రాంగంగా మార్పిడికి లోను గావాలి. దానికి పైన లేదా దానితో పాటు ఆధ్యాత్మిక పరివర్తన జరగాలి. అంటే ఒక ఉన్నత దివ్యవెలుగు, దివ్యజ్ఞానం, దివ్యశక్తి, దివ్య క్రియాశక్తి, దివ్య ఆనందం, దివ్య పరిశుద్ధత సమస్త అస్తిత్వం లోనికి, ప్రాణ, దేహాల ఆత్యంతిక నిమ్నభాగాల అంతరాంతరాల లోనికి

కూడా, మన ఉపచేతన యొక్క అంధకారం లోనికి సైతం దిగిరావాలి. చివరకు, అతిమానస రూపమార్పిడి హఠాత్తుగా సంభవిస్తుంది. వీటన్నింటికీ మకుటాయమానమైన ఉద్యమంలా అతిమనస్సులోనికి ఆరోహణ, రూపాంతరీకరణ గావించు అతిమానసిక దివ్యచేతన యొక్క అవరోహణ మన సమస్త అస్తిత్వంలో మరియు ప్రకృతిలో పాదుకొనాలి.

*

మనఃప్రాణ దేహాలకు ఆధారభూతమౌతూ హృదయం వెనుక చైత్యసత్తా లేక చైత్య పురుషుడున్నాడు. చైత్యరూపాంతరీకరణంలో మూడు ప్రధానాంశాలున్నాయి. 1. ఉపరితల మనఃప్రాణదేహాల వెనుక నున్నదంతా అతని యెరుకలోని కొచ్చే విధంగా గుహ్యమైన ఆంతర మనస్సు, ఆంతర ప్రాణికం, ఆంతర భౌతికాలు ఉన్మీలనం గావడం. 2. చైత్యసత్త లేక అంతరాత్మ ఉన్మీలనం వల్ల, అది ముందుకు వచ్చి మనఃప్రాణదేహాలను తన అధీనం చేసుకొని నియంత్రించుట. 3. సమస్త నిమ్న అస్తిత్వం, ఆధ్యాత్మిక సత్యం కోసం ఉన్మీలనం గావడం. ఈ చిట్టచివరి అంశాన్ని చైత్య ఆధ్యాత్మిక పరివర్తనలో భాగంగా చెప్తాం.

*

సమ్యగ్ దృష్టిని మనస్సు లోనికి, సమ్యగ్ ప్రేరణను, అనుభూతిని ప్రాణికం లోనికి, సమ్యగ్ కదలికను, నడతను, భౌతికం లోనికి తీసుకొని వస్తూ వ్యక్తి యొక్క నిమ్న ప్రకృతిని పరివర్తనం చేయడమే చైత్యీకరణం అంటే — ప్రేమ, ఆరాధన, భక్తి మీద ఆధారపడ్తూ సమస్తమూ దైవం వైపు తిరగాలి — చివరగా ప్రతి చోటునా, సమస్తంలోనూ, ఆలాగే హృదయంలోనూ దివ్యమాత దర్శనం కలగాలి, స్పృహ నెలకొనాలి. ఆమె దివ్య క్రియాశక్తి తన అస్తిత్వంలో, విశ్వాసం, భగవదర్పణ, శరణాగతి రూపాల్లో పనిచేస్తున్నట్లు సంవేదించడం, చైత్యీకరణం అంటే.

*

హృదయకేంద్రంలోని ఏకాగ్రతాశక్తి ఆ కేంద్రాన్ని తెరుస్తుంది. ఆకాంక్ష, ప్రేమ, భక్తి, సమర్పణా శక్తి వల్ల అంతరాత్మను మరుగుపరచే తెరను తొలగించి, మనస్సు, ప్రాణం,దేహాలను నియంత్రించేందుకు, వాటిని దైవం వైపు మరల్చి సమస్తాన్నీ సంపూర్ణంగా ఉన్మీలనం చేసేందుకు ఎదురు నిలిచే సమస్తాన్నీ తొలగిస్తూ, అంత రాత్మను లేదా చైత్యపురుషుని ముందుకు తీసుకువస్తుంది.

ఈ యోగంలో దీనిని చైత్యరూపాంతరీకరణం అంటారు. శాంతి నిశ్చలనీరవత, దేహభావన నుండి, మనస్సు, ప్రాణాలతో తాదాత్మ్య భావన నుండి విముక్తి కలిగించి (నిమ్న మానసిక, ప్రాణిక, భౌతిక) చేతనకు ఊర్ధ్వంలో వున్న ఉన్నత చేతనతో మమేక మయ్యేందుకు తగినట్లు ఉద్ధరించబడేందుకు ఉన్నత చేతన యొక్క శక్తులు (ఆధ్యాత్మిక స్వభావం కలవి) మనస్సు, ప్రాణం, దేహాల లోనికి దిగి రావడానికి మార్గాన్ని తెరవడాన్ని ఈ యోగంలో ఆధ్యాత్మిక రూపాంతరీకరణం అంటారు.

*

ఆధ్యాత్మకీకరణ అంటే ఉన్నత మనస్సు నుండి అధిమనస్సు వరకూ గల ఉన్నత భూమికలలో దేనికి సంబంధించిన దాని నుండైనా ఉన్నత శాంతి, క్రియాశక్తి, వెలుగు, జ్ఞానం, పరిశుద్ధత దివ్యానందాలు వగైరా దిగిరావడం. అది వ్యక్తికే ప్రత్యేకమైన విషయగత రూపాంతరీకరణాన్ని సాధిస్తుంది. ఉపకరణాత్మకమైన ప్రకృతి లేక స్వభావం యొక్క సంపూర్ణ రూపాంతరీకరణం, అతిమానసిక పరివర్తనం చోటు చేసుకొన్నపుడు మాత్రమే సంభవమౌతుంది.

*

రెండు రకాల అనుభూతు లున్నాయి. రెండూ సరైనవే. అవి సాధనయొక్క రెండు ఆవశ్యకతలను సూచిస్తున్నాయి. ఒకటి లోపలకి పోయి చైత్యపురుషునికి, బాహ్యప్రకృతికి మధ్య పూర్తి సంబంధాన్ని నెలకొల్పడం. మరొకటి పై వైపుకు అంటే దైవశాంతి, దైవ క్రియాశక్తి, దైవ వెలుగు, దైవ ఆనందం వైపు, ఊర్ధ్వానికి తెరచుకొనడం, దాని లోనికి ఉద్ధరించబడి, దానిని క్రింద నున్న ప్రకృతి, దేహాల లోనికి తీసుకొనిరావడం. ఈ రెండింటిలో అంటే చైత్య మరియు ఆధ్యాత్మికాల రెండింటిలో ఏ ఒక్కటీ మరొకటి లేకుండా సంపూర్ణం కానేరదు. ఆధ్యాత్మిక ఆరోహణ, అవరోహణ, కనుక సాధించబడకపోతే, ప్రకృతి యొక్క ఆధ్యాత్మిక రూపాంతీరకరణం సంభవం కాజాలదు. సంపూర్ణమైన చైత్య ఉన్మీలనం, మరియు దానితో సంబంధం లేకపోయినట్లైతే, రూపాంతరీకరణం సంపూర్ణం కాజాలదు. ఈ రెండు ఉద్యమాల మధ్య అసంగతత్వం అంటూ ఏదీ లేదు. కొంతమంది చైత్య అనుభవంతో మొదలు పెట్టారు, ఇతరులు ఆధ్యాత్మికంతో మొదలుపెట్టారు. మరి కొంతమంది రెండింటినీ కలిపి సాధన కొనసాగిస్తుంటారు. ఉత్తమమైన మార్గం రెండింటి కోసమూ ఆకాంక్షిస్తూ, స్వభావాన్ననుసరించి, స్వభావపు మొగ్గుదల ననుసరించి దివ్యమాతనే పనిచేయ వదలివేస్తారు.

చైత్యపురుషుడు పరిణామంలో ఉన్నాడు. అది మానవ అస్తిత్వం లోని ఒక అంశం, దైవాంశం. అందుచేత చైత్యీకరణం అతనిని ప్రస్తుత పరిణామాని కావలకు తీసుకుపోలేదు. కాని దైవం నుండి, లేదా, ఉన్నత ప్రకృతి నుండి వచ్చేదాని నంతటికీ ప్రతిస్పందించడానికి తగిన విధంగా అతనిని తయారుచేస్తుంది. అంతే గాదు, అతని అస్తిత్వంలోని అసురుని, రాక్షసుని, పిశాచిని, లేదా జంతువును లేదా దివ్య పరివర్తనా మార్గంలో అడ్డునిలిచే నిమ్న ప్రకృతి యొక్క ఏ విధమైన ప్రతిరోధాన్నైనా అది సహించనిష్టపడదు.

*

నీ విషయంలో అతి ముఖ్యమైన దేమిటంటే, నీ హృదయంలో, చైత్యాగ్ని పెంపొందాలి. సాధనను నడిపించే నాయకునిగా చైత్యపురుషుడు ముందుకు రావాలనే ఆకాంక్షను అభివృద్ధి చేసుకోవాలి. అలా చైత్యపురుషుని అభివృద్ధి జరిగిన పిదప అప్పటి వరకూ "కంటపడని — అహం ముడులను" అది నీకు చూపిస్తుంది. చూపించి వాటిని విప్పడం గాని లేదా చైత్యాగ్నిలో భస్మం చేయడంగాని చేస్తుంది. ఈ చైత్యాభివృద్ధికి, మరియు మనస్సు, ప్రాణికం, భౌతిక చేతనలో కలిగే చైత్య పరివర్తనానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఎందుచేతనంటే, ఉన్నతతర చేతన క్రిందికి దిగిరావడాన్ని, ఆధ్యాత్మిక రూపాంతరీకరణను అది సురక్షితంగా సునాయాసంగా జరిగేటట్లు చేస్తుంది. అలా గాక పోయినట్లైతే అతిమానసం యెప్పటికీ దూరదూరంగానే ఉండిపోతుంది.

*

అతిమానసిక రూపాంతరీకరణం అంటే, సమస్తమూ దైవం యొక్క దివ్యచేతనలో అతిమానసీకరించబడడం.

*

చేతన అతిమానసీకరణం అంటే మనస్సు కంటె పైకి, అతిమనస్సు లోనికి ఉద్ధరణ, మరియు ప్రకృతి లోనికి అతిమనస్సు అవరోహణ.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె. వి. రావు

Vol. 41, No. 6 **Rs. 15.00** Registered: TN/PMG(CCR)/39/09-11
June **2011** WPP No. 35/09-11

AKHILA - Akhila Bharat Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)
Published on 1st day of every month.

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Flower on the cover:
Progress
Spiritual significance and explanation given by the Mother

Editor: A. Kailasapati
Published by Pradeep Narang on behalf of Sri Aurobindo Society,
No. 1, Rangapillai Street, Puducherry - 605001
Printed by Swadhin Chatterjee at Sri Aurobindo Ashram Press,
38, Goubert Avenue, Puducherry - 605001

Single copy: Rs. 15 **Annual Subscription: Rs. 150 (in India)**

A Monthly Published by
SRI AUROBINDO SOCIETY, PUDUCHERRY - 605002

అఖిల



అఖిలభారత పత్రిక

జూలై 2011

16/7/20

శ్రీమాతారవిందుల ప్రవచనాలు

విషయసూచిక

సాధకులకు శ్రీఅరవిందుల మార్గదర్శకాలు

సాధకులకు శ్రీమాత మార్గదర్శకాలు

సంసిద్ధత అంటే సమర్థత అని నేను అనను. కాని సమ్మతము అని అర్థం. జీవితంలో అన్ని కష్టాలను ఎదుర్కోడానికి, ముందుకు పురోగమించడానికి సంకల్పం ఉంటే, ఎంతకాలం పట్టినా ఫరవాలేదు. అప్పుడు ఆ మార్గాన్ని చేపట్టవచ్చు.

*

సామాన్య సంసారికి జీవితం పట్ల శాంతిరహిత అసంతృప్తి, పూర్ణయోగపథంలో ప్రవేశించడానికి చాలినంత సంసిద్ధత కానే కాదు. ఆధ్యాత్మికజీవితంలో విజయం పొందాలంటే, నిర్దిష్టమైన అంతర్గత ఆదేశం, దృఢసంకల్పం, స్థిరత్వం అవసరం.

శ్రీఅరవిందులు



బరోడా మహారాణికి శ్రీఅరవిందుల లేఖ

(ఆమె ప్రశ్నలకు జవాబులు)

యోగసాధనవల్ల ఉన్నతమైన ఆధ్యాత్మికచైతన్యం నాకు సిద్ధించిన మాట నిజమే. యోగసాధనవల్ల ఈ చైతన్యం సిద్ధిస్తుంది. దీనివల్ల కొంత యోగశక్తి లభిస్తుంది. ఆధ్యాత్మికజీవనానికి సంసిద్ధంగావున్న వారితో అంతర్గత సంబంధాలు పెట్టుకోవడానికి గల శక్తి ముఖ్యంగా లభిస్తుంది. అంతేకాదు. మార్పు చెందని ఆంతరంగిక ప్రశాంతి, శక్తి, ఆనందము నిండివున్న పరిపూర్ణత్వ శ్రేణికి చెందిన ఆధ్యాత్మికస్థితి వైపు సాధకులకు తోడ్పడే శక్తి లభిస్తుంది. కాని ఈ ఆధ్యాత్మిక ప్రశాంతి, ఆనందములు, మానసప్రశాంత్యానందముల కన్నా పూర్తిగా భిన్నమైనవి. ఆధ్యాత్మిక సాధన లేకుండా ఈ స్థితిని అందుకోలేము.

ఈ విషయం మహారాణివారికి సుబోధకం అయిందో లేదో నాకు తెలియదు. చైతన్యానికి రెండు శ్రేణులున్నాయి. ఏదో ఒక శ్రేణిలో ఎవరైనా జీవించవచ్చును. జీవనఖేలనకు అతీతమైన ఉన్నతచైతన్యం ఒకటి. అది జీవితాన్ని నిర్దేశిస్తుంది. నియంత్రిస్తుంటుంది. దీనినే ఆత్మ అని, పరమాత్మ లేక దైవం అని రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. మరొకటి సాధారణ చైతన్యం. మనుషులంతా ఈ స్థాయిలోనే జీవిస్తుంటారు. ఇది ఉపరిభాగంలో ఉంటుంది. జీవనలీలార్థం అది ఆత్మకు ఉపకరణంగా ఉంటుంది. ఈ సాధారణ చైతన్యంలో నివసించేవారిని, పనిచేసేవారిని మనస్సు యొక్క సాధారణ కదలికలే నడుపుతుంటాయి. వారు సహజంగా సుఖదుఃఖాలకు, ఆందోళన, కోరికలకు గురి అవుతుంటారు. సర్వసాధారణమైన జీవనవ్యాపారాలకు గురి అవుతుంటారు వారికి మానసికశాంతి, ఆనందం లభించవచ్చు. కాని అది ఎప్పటికీ శాశ్వతం కాదు. భద్రంగా ఉండబోదు.

కాని ఆధ్యాత్మిక చైతన్యం సదా కాంతి, శాంతి, శక్తి, ఆనందాలతో నిండివుంటుంది. ఆ చైతన్యస్థాయిలో ఎవరైనా జీవించగల్గితే, కాంతి, ఆనందం, శాంతి, శక్తి అతని సొంతం అవుతాయి. నిక్షేపంగా అతనిలో నిలిచి వుంటాయి. కాని ఎవరైన పాక్షికంగా అయినా ఆ స్థాయిలో జీవిస్తే, ఆ చైతన్యం వైపు మన ద్వారాలు తెరిచి వుంచితే, ఆధ్యాత్మిక కాంతి, శక్తి, శాంతి, ఆనందం చాలా వరకు అతనికి

లభిస్తాయి. జీవితంలో ఎదురయ్యే విధివిఘాతాలను ఎదుర్కొని భద్రంగా ముందుకు వెళ్ళగలుగుతాడు.

ఈ ఆధ్యాత్మిక చైతన్యం వైపు తిరిగినవారు దాని నుండి ఏమి ఆశిస్తారో అదే లభిస్తుంది. శాంతి కావాలని కోరితే శాంతి లభిస్తుంది. శాంతి, జ్ఞానం కోరుకుంటే, ఒక మహాశాంతిలో జీవిస్తారు. మనిషికి సాధారణమనస్సు పొందలేని ప్రగాఢమైన, నిజమైన జ్ఞానం లభిస్తుంది. వారు శక్తికాని, బలంకాని కోరుకుంటే, అంతర్గత జీవితానికి ఆధ్యాత్మికబలం లభిస్తుంది. బాహ్యమైన కార్యాలు, పనులు నిర్వర్తించడానికి యోగశక్తి లభిస్తుంది. ఆనందం కోరుకుంటే, మామూలు మానవజీవితం ఇచ్చే సుఖసంతోషాలకు మించిన ఆనందపారవశ్య లోకాలలోకి వారు ప్రవేశించగలరు.

ఈ దివ్యచైతన్యం వైపు మనస్సును తెరిచి వుంచడానికి, ఆ చైతన్యంలోకి ప్రవేశించడానికి చాలా మార్గాలు వున్నాయి. నిరంతర సాధనతో నేను ఇతరులకు చూపే నా మార్గం ఏమిటంటే, ఏ వ్యక్తి అయినా లోపలికి, చైతన్యపు లోతులలోకి ప్రయాణించడం, ఆకాంక్షతో దైవత్వం వైపు మనస్సును తెరిచివుంచడం; దైవం, దైవకార్యాలను గురించిన జ్ఞానం కలిగినట్లైతే, దానికి సంపూర్ణంగా తనను తాను సమర్పించుకోవడం.

ఈ ఆత్మసమర్పణం అంటే భగవంతుని సమీపించి కోరికలు కోరడం కాదు. దివ్యచైతన్యంతో నిరంతరం సాయుజ్యం, నిరంతర సంబంధం కొనసాగడం, ఆ చైతన్యపు శాంతి, శక్తి, కాంతి, ఆనందాన్ని ఆకాంక్షించడం, మరేమీ కోరకపోవడం. ఈ ప్రపంచంలో ఆ చైతన్యం దేనిని అప్పగించితే దానికి జీవితంలోనూ, కార్యాచరణలోనూ ఉపకరణంగా ఉండడం మాత్రమే. ఏ వ్యక్తి అయినా దైవశక్తి వైపు, మనస్సు, హృదయం, శరీరంలో పనిచేసే పరమాత్మశక్తి వైపు తన చైతన్యాన్ని తెరిచి వుంచి, ఆ శక్తిని అనుభూతికి తెచ్చుకుంటే, ఇక మిగిలిందల్లా ఆ చైతన్యానికి బద్ధుడై, విశ్వాసపాత్రుడై జీవించడం, నిరంతరం ఆ చైతన్యాన్ని ఆవాహన చేస్తుండడం, ఆ చైతన్యాన్ని తన పనిని తాను చేసుకునేటట్లు చూడడం, నిమ్న చైతన్యానికి, నిమ్నప్రకృతికి చెందిన ఇతర అధమమైన శక్తిని తిరస్కరించడం ముఖ్యం.

నా పరిస్థితిని, యోగశక్తి స్వరూపాన్ని గూర్చి వివరించడానికని ఇదంతా వ్రాశాను. కాని ఈ యోగసాధన చేయమని నేను సాధారణంగా ఎవరినీ కోరను. ఎందుకంటే, సాధన చేయాలన్న ఒక స్థిరసంకల్పం, ఒక అంతరాదేశం మొదటి నుండి వున్నవారికి,

లేదా మధ్యలో అటువంటి పటిష్ఠమైన ఆదేశం అభివృద్ధి చేసుకున్నవారికి మాత్రమే ఇది సాధ్యం. ఇతరులు చివరి వరకు ఈ మార్గంలో పయనించలేరు. బాహ్యప్రకృతికి సంబంధించి ప్రశాంతత కావాలని కోరేవారికి సహాయపడడానికి నేను తరుచు నా మార్గం నుండి తప్పుకుని వెళ్ళడం జరగదు. అయితే కొందరు వ్యక్తుల విషయంలో అటువంటి సాయం చేయడానికి తిరస్కరించబోను. ఒక ఉన్నతచైతన్యాన్ని భూమ్మీదికి అవరోహింపచేయడానికి ఉపకరించే ఒక ఆధ్యాత్మిక కేంద్రాన్ని సృష్టించడమే నా లక్ష్యం. కేవలం 'ముక్తి' కోసం కాకుండా, భూమిపై దివ్యజీవనాన్ని తీర్చిదిద్దే శక్తిగా ఆ కేంద్రం ఉండాలని నా అభిమతం.

ఈ లక్ష్యంతోనే నేను సామాజిక జీవనరంగం నుండి దూరమై, పుదుచ్చేరిలో ఒక ఆశ్రమం నెలకొల్పాను. (ఆశ్రమం అనే మాట కన్నా మరో మంచి పదం లేనందున ఆ పదం వాడాను. అయితే ఇది సన్యాసుల ఆశ్రమం కాదు. మామూలు జీవితాన్ని వదిలి ఈ నియమానికి సంసిద్ధులై వున్నవారికి మాత్రమే ఇది ఉద్దేశించబడింది.)

కాని భారతదేశం అంతటా కూడా నాకు కొద్దిమంది శిష్యులు ఉన్నారు. వారు వారి కుటుంబాలతో జీవిస్తున్నా, దూరంగా ఉన్నా, ఆధ్యాత్మికభూమికల నుండి నా సహాయం పొందుతుంటారు.

ప్రస్తుతానికి ఇదే మహారాణిగారికి నా సమాధానం. మీరు దేనిని అన్వేషిస్తున్నారో దానికి, నేను ఈ లేఖలో వివరించిన విషయాలకు సంబంధం ఉందో లేదో నిర్ణయించుకోవలసింది మీరే.

అనువాదం: యజ్ఞన్న

శ్రీఅరవిందులతో మార్గరెట్ విల్సన్ ఉత్తరప్రత్యుత్తరాలు

(శ్రీ ఉడ్రో విల్సన్ మొదటి ప్రపంచయుద్ధకాలంలో అమెరికా అధ్యక్షుడు. మార్గరెట్ విల్సన్ వారి కుమార్తె. ఈమె 1932 లో న్యూయార్క్ గ్రంథాలయంలో శ్రీఅరవిందుల 'గీతావ్యాసాలు' చదివి ఆధ్యాత్మికంగా ఎంతో ఉత్తేజితురాలైంది. మార్చి, 3, 1936 న తన సాధనను గైడ్ చెయ్యమని శ్రీఅరవిందులవారిని అర్థించింది. ఆశ్రమంలో శిష్యురాలిగా వచ్చి ఉండటానికి అనుమతి కోరగా 1938 లో అది లభించింది. శ్రీఅరవిందులు ఈమెకి

'నిష్ఠ' అని నామకరణం చేశారు. ఈమె అస్వస్థురాలై 1948 లో మరణించారు. వారిరువురి ఉత్తరప్రత్యుత్తరాలు ఇక్కడ ప్రచురిస్తున్నాము.)

హొటల్ సైమోర్
50 వెస్టు, 45 వ రోడ్డు
న్యూయార్కు. మార్చి 3, 1936

ప్రియమైన శ్రీఅరవిందులకు.

మీ 'గీతావ్యాసాల' ను గురించి మొదటిసారిగా 1932 వేసవిలో తెలుసుకొన్నాను. అప్పటినుంచి నాకు అవి ఎంతగానో ఉపకరిస్తూ, స్ఫూర్తిని ఇస్తూనే ఉన్నాయి. నేరుగా ఇపుడు మీ సహకారాన్ని, ప్రేరణని కోరుకుంటూ వినమ్రంగా మీకు ఇది వ్రాస్తున్నాను. ఆ మాత్రం, ఈ మాత్రం జ్ఞానదీపికలైన వ్యక్తులెవ్వరు నాకీ దేశంలో కనిపించటం లేదు. నేనెవ్వరి దరికీ విశ్వాసంతో వెళ్ళలేకపోతున్నాను. పోనీ 'రామకృష్ణ కేంద్రం' లాంటి ఏ ఆధ్యాత్మిక కేంద్రంలోనైనా చేరుదామంటే, అక్కడ పాటించవలసిన నియమనిబంధనలు విముక్తిమార్గంలో నడిపే బదులు మనిషిని కట్టిపడవేసేటంత భయంకరంగా ఉంటున్నాయి. మీ ఆశ్రమం తాలుకు వివరాలతో కూడిన కరపత్రం ఒకటి నా దగ్గర ఉంది. ఆత్మ చైతన్యంతో మీరు నిర్దేశించిన విముక్తిమార్గంలో పయనించాలని, ఆత్మోన్నతి పొంది అతీతుడైన పురుషోత్తముని సంసర్గానుభవం పొందగలగాలని ఆశ. ఇది సాహసోపేతమే కావచ్చు. అయినా దైవానుగ్రహంతో, మీ మార్గదర్శకత్వంలో, స్వచ్ఛందంగా, క్రమశిక్షణ పాటిస్తూ, సాధించగలనని ఆశిస్తున్నాను. ఈ సాధనలో గమ్యం ఎంత దూరమో, క్లిష్టతరమో నాకు తెలియకపోలేదు. అయినా సరే ఈ దారిన పయనిస్తాను. గమ్యాన్ని వీలైనంత త్వరగా చేరుకుంటాను. ఆత్మోన్నతి మార్గంలో లభింపచేసుకున్న శక్తిసంపదలను (నా భోగభాగ్యాల కోసం, స్వప్రయోజనాలకి) వెచ్చిస్తూ కాలయాపన చేస్తూ, అసలు లక్ష్యాన్ని విస్మరించను. దివ్యజీనవ సాధనలో ఒక సచేతనమైన ఉపకరణంగా మలుచుకొని దైవకార్యాలే నిర్వహిస్తూ, ప్రక్కదారి పట్టకుండా పురోగమిస్తాను.

ప్రస్తుతం నేను భయంకరమైన శూన్యంలో దిక్కుతోచక ఉన్నానని తెలుసు. త్రికరణశుద్ధి లేకుండా ఏమి చేసినా వ్యర్థమని తెలుసు. పైవాడు అనుగ్రహించి నడిపించాలే తప్ప ఈ అల్పజీవి ఎందుకూ కొరగాదనీ తెలుసు. నాపై నాకు ఎలాటి

భ్రమలూ లేవు. దారి తప్పిన నావికుడువలె ఉన్నాను. గమ్యం అయితే కనిపిస్తోంది. కాని దారిచూపే దిక్సూచి కొరవడింది.

శిష్యుడు సంసిద్ధుడై ఉన్నప్పుడు 'గురువు' తటస్థపడతాడని విన్నాను. నా సంసిద్ధత ఏపాటిదో నాకు తెలియదు. నా యోగ్యత ఎంతో నాకు తెలియదు. మిమ్ముల నెంతవరకు అనుసరించగలనో తెలియదు. ఒక్కటి మాత్రం నిజం. పరమోన్నతమైన దివ్యసత్యముతో సచేతనంగా సమైక్యం కావాలనేది నా ఆకాంక్ష. అదే నా గమ్యం. నేనిది హృదయపూర్వకంగా మనవిచేసుకునే సత్యం. ఇందుకే నా కృషి ఎంతైనా! ప్రియమైన ప్రభూ! మిమ్ముల నందులకే వేడుకుంటున్నాను. నిర్భయంగా మీరూ చూపే వెలుగులో పయనిస్తాను. నాలోని ఉన్నతచైతన్యానికి ప్రతినిధులు మీరే కదా! కాకపోతే ఆ ఉన్నతచైతన్యమేదో నాకు ఇంకా ఎరుక లేదు. ఆత్మసాధనలో నా ఆకాంక్ష అంత గాఢము, స్థిరము, చిత్తశుద్ధితో కూడినది కాకపోతే, ఆ లోపాలను తామే సరిదిద్ది, నన్ను బలోపేతం చేసి, నా ఆకాంక్షను గాఢతరం కావించండి. ఎంత ప్రయాసకైనా వెరువను. విడిచి పారిపోను.

ఆశ్రమవాసులు కానివారు కూడా మీ శిష్యులుగా ఉన్నారని విన్నాను. అమెరికాలో ఉన్నవారిని శిష్యులుగా స్వీకరిస్తారా? మీరు పిలిచినపుడు భగవదనుగ్రహంగా భావించి సర్వమూ విడిచి మీ ఆశ్రమానికి వస్తాను. వినమ్రంగా మీ సమాధానం కోసం ఎదురుచూస్తూ ఉంటాను.

ఇంతవరకు తాము అందించిన సహాయానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ.

చిత్తశుద్ధితో
మీ
మార్గరెట్ ఉడ్రో విల్సన్

కుమారి మార్గరెట్ విల్సన్‌కు శ్రీఅరవిందుల సమాధానము

పాండిచ్చేరి
సెప్టెంబరు 7, 1936

మార్గరెట్ ఉడ్రో విల్సన్‌కు,

ఆధ్యాత్మిక జీవనానికి, సత్యాన్వేషణకి, భగవంతుని కనుగొనాలనే జిజ్ఞాస అత్యంత ఆవశ్యకం. ఇది లేకుండా ఏదీ సంభవం కాదు. దైవాన్ని తెలుసుకోవడం, అభివ్యక్తీకరించు కోవడం అంటే నీ పరిమిత చైతన్యాన్ని అపరిమిత దివ్యచేతనగా రూపాంతరీకరించు కొని, అనంతమైన శాంతి, క్రాంతి, ప్రేమ, శక్త్యానందాలతో మనుగడ సాగించడం. ఫలితంగా నీవు దైవోపకరణంగా, దివ్యవాహికగా పరివర్తన చెందడం. అంతర్నిహితమైన దైవాన్ని దర్శించగలిగిననాడే దివ్యాత్మప్రబోధంతో పని చేయగలుగుతావు. నీవు ఆధ్యాత్మికంగా రూపాంతరీకరించుకోకుండా నీ పరిమిత బుద్ధిబలంతో మానవాళిలో ఐక్యతను, సమతను సాధించాలనే ప్రయత్నం మూలసత్యాన్ని వక్రీకరించడమే అవుతుంది. అంతరంగంలో దివ్యచైతన్యం పెంపొందించుకునే కొలదీ క్రమేపీ దివ్యశక్తి, ప్రశాంత, సత్యకాంతులు అనుభవంలోకి వస్తాయి. భౌతిక వ్యక్తిత్వం, దివ్యవ్యక్తిత్వంగా పరిణామం చెందుతుంది. పదార్థం పరార్థంగాను, మానవుడు మాధవుడుగాను వెలుగొందుతాడు. నీలో దివ్యచైతన్యం తొణికిసలాడుతూ ఉన్నప్పుడే లోకంలో దైవాన్ని అభివ్యక్తీకరించ గలుగుతావు. అలాకాక ఏదో ఒక మానసిక ఆదర్శానికి లేక నియమానికి లోబడి తదనుగుణంగా ప్రవర్తిస్తుంటే నీవు మానసికస్థాయికే పరిమితమైపోతావు. అదే నిజమైన ఆధ్యాత్మిక దివ్యజీవనమని పొరబడతావు. నేటి ఆధునిక బుద్ధిజీవి ఇక్కడే తప్పటడుగు వేస్తున్నాడు. మనసునే నమ్ముకుని మోస పోతున్నాడు. దృష్టిని ఆధ్యాత్మికదిశగా మళ్ళించాలి. శాంతి, క్రాంతి, ఆనందాలు, దైవానికి చేరువకావటం ద్వారా మాత్రమే పొందగలుగుతావు. మర్త్యజీవనం దివ్య జీవనంగా పరిణామం చెందాలనేది దివ్యసంకల్పం. అదే దివ్యప్రణాళిక కూడా. ఈ పరిణామం వేగిరం కావటానికి అంతరంగం విశాలం కావాలి. సంకుచిత మనోనియమ నిబంధనలకు అనుగుణంగా సాగే వ్యర్థకార్యకలాపాల ద్వారా ఇది సాధ్యం కాదు.

సాధనలో పాటించవలసిన నియమనిబంధనల గురించి అడిగావు. ఇందుకు

అత్యంత ఆవశ్యకమైనది అంతరంగ చైతన్యంలో ఏకాగ్రత. మనసు యొక్క ఉపరి తలం సవాలక్ష ఆలోచనలతో నిండి ఉంటుంది. ఇవి అంతరంగ చైతన్యాన్ని కప్పి ఉంచుతాయి. బాహ్యమైన మనసుకి మించిన ఉన్నతచైతన్యం, లోలోపల నిగూఢంగా ఉంది. అదే అసలైన సత్యనిత్యప్రకృతి. ఏకాగ్రత యొక్క లక్ష్యం మనసుని నిశ్చలం చేసుకుని అంతరంగ చైతన్యంలో నివసించగలగడమే. సాధారణ మనస్సుకి అతీతంగా ఉన్న సత్యచైతన్యంలో రెండు కోశాలున్నాయి. అవి హృదయ, మనోకోశాలు. ఏకాగ్రతవల్ల హృదయకోశం తెరుచుకొని లోనున్న చైత్యపురుష సాక్షాత్కారం కలుగచేస్తుంది. అంటే వ్యక్తి తన లోనున్న దైవాన్ని తెలుసుకోగలుగుతాడు.

అంతరాత్మ తెరుచుకొని దైవం ఆవిష్కృతమయే కొలదీ వ్యక్తి తాలూకు మర్త్యప్రకృతి దివ్యప్రకృతిగా రూపాంతరీకరణం చెందుతూ ఉంటుంది. అంత ర్వికాసం కోసం ఆకాంక్షతో ఆత్మార్పణం కావించుకొని హృదయ కేంద్రంలో ఏకాగ్ర తతో ఉపవిష్ఠులై ఉన్నప్పుడు దివ్యత్వం తాలూకు ఉనికి తెలుస్తుంది. ఈ రకమైన ఆధ్యాత్మికమార్గాన్ని అవలంబించడం క్షేమదాయకమైనది; శ్రేయోదాయకమైనది. ఇందులో విజయం సాధించినప్పుడు సాధనలో ఇక తిరోగమనమే ఉండదు. అంతా పూలబాటే! ఇతర యోగమార్గాలకంటె ఇది సులువు.

మరో మార్గం — మనోమయకోశానికి సంబంధించినది. సాధారణ మనసుని అధిగమించి ఉన్నత ఊర్ధ్వ మనోభూమికల నధిరోహిస్తూ, మనోసీమకి మకుటమైన ఊర్ధ్వమనస్సుని చేరుకొని, దానికి ఇంకా పైనున్న పరమోన్నత దివ్యచైతన్య సత్యశిఖరాన్ని అందుకోగల్గటం. ఇందుకు ప్రాథమికంగా సాధారణ భౌతికమనస్సును నిశ్చలం, నిరామయం కావించుకోవాలి. అలా చేసుకోగలిగినప్పుడు ఊర్ధ్వమనో భూమికలు తెరచుకొంటవి. ఫలితంగా ఆధ్యాత్మిక దివ్యజ్ఞాన అనుభూతులు అనుభావ్య మౌతవి. పరమోన్నత ఆధ్యాత్మిక శిఖరమైన దివ్య చైతన్యమునకు దారి సుగమమౌ తుంది. దివ్య ఆత్మానుసంధానం వల్ల దివ్యశాంతి, కాంతి, శక్తి, జ్ఞానం, ఆనందాలు అనుభవైకవేద్యమౌతవి. మనోకేంద్రంలో ఏకాగ్రతయొక్క లక్ష్యం ఊర్ధ్వచేతనకి చేరువ కావటం కోసమే కావాలి. ఈ లక్ష్యం విస్మరిస్తే మనోచేతనకి మాత్రమే పరి మితమైపోయే ప్రమాదం ఉంది. మనోస్తరాలన్నిటినీ అధిగమించి అతీతస్థాయికి ఎదగలేకపోతే దివ్యసత్యసాక్షాత్కారం లభించదు. బుద్ధిజీవులకు మనోకోశంలో ఏకాగ్రత, హృదయజీవులకు హృదయకోశంలో ఏకాగ్రత సాధ్యమౌతుంది. కొంతమంది ఇరు

కోశాలలోనూ ఏకాగ్రత సాధించగలిగేవారు ఉంటారు. ప్రారంభదశలో హృదయకోశం లోనే ఏకాగ్రత సాధించ ప్రయత్నించడ అభిలషనీయం. ఇది తేలిక.

మరో (యోగ) విధానం వ్యక్తి తన మానసిక, ప్రాణిక, శారీరక సంబంధమైన సమస్త కర్మలను భగవదర్పణంగా అనుష్ఠించడం. వికసించిన అంతరంగంతో ఆత్మ ప్రబోధానికి లోబడి, శరీర బాహ్యంతర భాగాల సామరస్యంలో సర్వకర్మలూ నిర్వహింప బడాలి. అంతరంగ వికాసంతో చైత్యపురుషునికి (అంతరాత్మ) చేరువ అయే కొలదీ క్రమేపీ దోషాలన్నీ తొలగిపోతాయి. మానసిక, ప్రాణిక, శారీరక చైతన్యస్థాయిలలో సకల క్రియాకలాపాలు క్రమపద్ధతిలో కొనసాగుతాయి.

ఏ పని చేసినా నిర్లిప్తంగా నిరామయంగా చేయడం మరోపద్ధతి. మనో, ప్రాణిక, దేహాలతో మమేకం కాకుండా, నిరహంకారంగా, అంతరాత్మ సాక్షిగా కర్మలు చేసి నపుడు నీవు ఒక దైవోపకరణంగా, దివ్యాత్మ ప్రతినిధిగా భాసిస్తావు. ఈ నిశ్చల నీరవ చేతనలో నీ స్వీకార తృణీకారాలు అన్నీ నీలోని దివ్యచిత్తానికి ఒదిగే ఉంటాయి. ఆధ్యాత్మికోన్నతికి మరింతగా దోహదపడతాయి. నీ శరీరము, ఇంద్రియాలు, మనసు దివ్యచేతనకే లోబడి కర్మానుష్ఠానం చేస్తాయి. ఏ సాధన ప్రక్రియ అయినా వ్యక్తి స్వభావానికి అనుగుణంగా ఉండాలి.

సాధన కుంటువడినా, సాధకునికి ఏ ఇబ్బంది కలిగినా 'గురువు' ప్రమేయంతో సరిచేసుకొని కృతార్థులు కావచ్చు.

అనువాదం: కర్రా వేంకటేశ్వర్లు

నీవు తెలుసుకొని తీరవలసింది ఇదే

నిరోద్ బరన్‌కు శ్రీఅరవిందుల సలహాలు

నిరోద్: ఆధ్యాత్మిక జీవనవిధానానికి గాని లేదా జీవితంలో ఏదైనా ఘనకార్యం సాధించడానికి నేను పనికిరానేమోనని ప్రతిక్షణం అన్పిస్తోంది. నాకు సుఖం లేదని తెలుసు, అసలు మనుషులంతా సుఖంగా జీవించడానికేనా పుట్టేది?

శ్రీఅరవిందులు: విషాదమానవా! విషాదమానవా! అతన్ని తన్ని పంపించెయ్యి, తన్ని పంపించెయ్యవయ్యా!

నిరోద్: విషాదమానవుడా, అతడిని తన్ని పంపించాలా? సరే అతను నాకు కన్పించడం

లేదు. లేదా కన్పించనంత చిన్నగా ఉన్నాడు. మీ సమాధానంతో నాకు పెద్దగా సంతృప్తి కలుగలేదు.

నాలో నాకు కన్పించిన అత్యంత ప్రాథమిక యిబ్బందేమిటంటే నాకోసం దైవం సమస్తం చేసి పెడ్తుందనే నమ్మకం లేకపోవడం. నా అనుభవం నాకలా చూపించింది — నా అనుభవానికి విలువ లేదని మాత్రం దయచేసి చెప్పకండి. ఉదాహరణకు ఈ కవిత్వ వ్యవహారమే తీసుకోండి. పెద్ద మోతాదులో మానసిక కసరత్తు లేకుండా ఏ మాత్రం కవిత్వమైనా వ్రాయగలగడం ఎప్పుడో గాని జరగడం లేదు. అది మీకు బాగా తెలుసు. నేను చెప్పినట్లు ఒకటి రెండు సార్లు తప్పిస్తే కొంత క్రియాశక్తి క్రిందికొచ్చి నా నుండి ఒక క్షణంలో ఒక గేయాన్ని బయటకు తెస్తోంది. దానికి విలువ లేకపోవచ్చు. నేను వ్రాయకపోతే వ్రాయకుండానే ఉండిపోతున్నాను, వ్రాద్దామని ప్రయత్నించినప్పటికీ ఎంతో శ్రమిస్తే ఎన్నో, ఎన్నో రోజులు పడ్తోంది. మీరేమో మామూలుగా చెప్పే సమాధానమే చెప్తారు — అయితే ఏమిటట? అని అదంతా, మంచిదె అంటే నేను శ్రమించాల్సిందే అంటారు — నేను సఫలీకృతుడిని కావాలంటే నా వంతుగా చేయవలసింది అపారంగా కన్పిస్తోంది. కాని నాకు అలా జలగలా పట్టుకొని వుండే జిగటస్వభావం లేదు. నాకది లేదు గనుక ఏదో ఒక రోజు దైవక్రియాశక్తి గ్రుమ్మరించుకొంటూ వచ్చి, లేదా వెలుపలికి తన్నుకుంటూ వచ్చి అద్భుతాన్ని సృష్టిస్తుందని నమ్మలేకపోతున్నాను. మీ విషయానికొస్తే మీరే చాలా సంవత్సరాల పాటు, రోజుకు నాలుగైదు గంటల చొప్పున దానిపై కేంద్రీకరించవలసి వచ్చేది. ఆ తర్వాతే ఒక నదిలా అది ప్రవహిస్తూ వచ్చింది. కాని నేను శ్రీఅరవిందుల్ని కాదే? అంతటి సంకల్పంతోనూ, దృఢనిశ్చయంతోనూ పుట్టలేదే! నాకు అవి లేవు గనుక అత్యంత తెలివిగల పనేమిటంటే దైవం మీద ఆధారపడడం. కాని అటువంటిదాన్ని దేనినీ నమ్మలేను. మీరు కేంద్రీకరించక తప్పలేదు. దిలీప్‌దా కూడా, అంత ఆ మాట కొస్తే ప్రతి ఒక్కరూ అలా చేయవలసిందే. నేను అంత అధికంగా శ్రమించలేను గనుక, అటువంటి ఘనకార్యాలు నా వల్ల కాదని సరిపెట్టుకోవాలి. నేను రెండు మూడు గంటల పాటు అలా కూర్చున్నా మూడు, నాలుగు, లేదా అయిదు రోజులు గడిచిపోతాయి. అయినా నేనదివరకెక్కడున్నానో సరిగ్గా అక్కడే ఉండిపోతున్నాను — ఫలితం: నిరాశ. ఎక్కడుందా పరాశక్తి?

ఇప్పుడు యోగం విషయం చూద్దాం. నేను ఎంత పురోగమించానో మీకు

తెలుసు. అందుకు మిమ్మల్నేమీ అనను. నేను ధ్యానించలేను, ప్రార్థించలేను, ఆకాంక్షించలేను. అవి లేకుండా దేన్నైనా పొందడం ఎలాగో నాకు తెలియడం లేదు. ఎందుకని అలా చేయలేవు — అని మీరు అడుగుతారు. నేను చేయగలిగితే నా ఈ శోకాలతో మీ కిబ్బంది కలిగిస్తానా? నేను చేయలేను గనుక నాకు శాంతి లేదు, సంతోషం లేదు. వాటి కోసం ఆరాటం గాని, ఆకాంక్షగాని ఏమీ లేకపోతే వాటిని మీరు ఇవ్వరు, ఇస్తారా? నాకు తెలుసు, వీటన్నింటి కోసం ఎవరైనా ఎంతగా ఆకాంక్షించాలో నేనర్థం చేసుకోగలను, అయినప్పటికీ కొన్ని సందర్భాల్లో ఫలితం శూన్యం. అసలు ఆకాంక్షే లేకపోతే జరుగుతుందనే ఆశెక్కడుంటుంది.

కొన్ని సమయాల్లో — బుర్ర పాడుచేసుకోకు, తిను, త్రాగు, సంతోషంగా ఉండు — యోగిక సంయమనంతో ఆలోచన, విచారం లేకుండా ఉండాలని అనుకుంటాను. కబుర్లు చెప్పుకుంటూ, తిండి తింటూ, నవలలు చదువుకుంటూ కాలం గడిపేయాలని అనుకొంటాను. కాని నేనలా చేయలేకపోతున్నాను. కొందరు బాగానే ఉన్నా నాకు మాత్రం శాంతి దక్కడం లేదు. ఉదా: అనిల్ కుమార్ (అతనంటే వ్యతిరేకభావం లేదు, అయినా) మొత్తం రాత్రంతా నవలలు చదువుతూనే ఉంటాడు.ఎలా చేయగలుగుతున్నాడు? అతనికేదో ప్రాప్తించి వుంటుంది. నేను అలా చేయగలిగితే, చేస్తాను, కాని దాని వల్ల నాకు సాధనలో శాంతి, ప్రగతి ఎలా లభిస్తాయి? మీరు చెప్పినట్లు పురుషప్రయత్నం తప్పక చేయాలి, మీ కరుణా కటాక్షం దిగివచ్చే దాకా ఆ కృషి నిరంతరాయంగా సాగాలి. అప్పుడేం జరుగుతుంది, భగవంతుడికే యెరుక! అటువంటి కృషిగాని, తత్సామర్థ్యం గాని, కనీసం దానికై సంకల్పంగాని, నాలో ఎక్కడా కన్పించడం లేదు. అయినప్పుడు దేనితో ఆశపెట్టుకోవాలి, దేని మీద ఆధారపడాలి? నా అంతట నేను ప్రయత్నించనూ లేను, మీరే నాకంతా చేసిపెడ్తారని నమ్మనూ లేను. ఈ సున్నితమైన అలజడులన్నీ అపనమ్మకం.... ఏదైనా, మహాకార్యానికై నేను నిర్దేశించబడలేదని అన్పిస్తోంది.

మానసిక జీవిని, అంకుశం లాంటి సమాధాన మివ్వండి, సమాధానం ద్వారానే సుమా, అంతకంటె అధికంగా ఆశించను!

శ్రీఅరవిందులు: అనేక ఆర్తనాదాలు ఈ రోజు నన్ను చుట్టుముట్టినందువల్ల ప్రతిదానితో విడివిడిగా వ్యవహరించడానికి తగినంత తీరుబడి లేదు. 'దైవమే నాకు కావలసిందల్లా చేసిపెడ్తుందనే నమ్మకం నాకు కలగడం లేదు, ఎందుకనంటే అది కేవలం నా బల

మైన, నిష్ప్రయోజనకరమైన ప్రయత్నాల వల్లనే, నేను కవిత్వం వ్రాయడంగాని, వ్రాయకపోవడంగాని చేస్తూ నన్ను నేను కవిగా నిలద్రొక్కుకున్నది' అనే నీవు చెప్పినదాని కర్థం అని నేననుకొంటే, నిన్ను నేను అర్థం చేసుకున్నట్లేనా? సరే, అదో అద్భుతభావన, ఎప్పుడూ వినలేదు. మానవజాతి పొత్తిళ్ళలో వున్నకాలం నాటి నుంచీ దానికో భావన వుంది. పద్యపాదాలు వ్రాసేవాడిని తయారుచేయగలం, లేదా తనకు తానే తనను అలా తయారుచేసుకోగలడు. అంతేగాని కవిని తయారు చేయలేం, కాలేడు. కవి పుట్టుకొస్తాడు, తయారుచేయబడడు అనేది శతాబ్దాల నుండి, సహస్రాబ్దాల నుండి వినిపిస్తున్న నానుడి. నేను చదివిన లాటిన్ వ్యాకరణంలోని మొదటి పేజీల ద్వారా నా చెవుల్లో అది మార్మ్రోగింది. సాహితీపరమైన చారిత్రక వాస్తవాలు ఈ కఠిన సూక్తినే సమర్థిస్తున్నట్లు కన్పిస్తున్నాయి. కాని, ఇచట పాండిచ్చేరిలో కవులను ఉత్పత్తి చేయుటకు బదులు వారికి జన్మనివ్వడానికి, ఆధ్యాత్మిక జన్మనివ్వడానికి — భౌతికంగా దేహంలో పుట్టడానికి కాదు — ప్రయత్నించాం. అనేక సందర్భాల్లో మేం విజయం సాధించామనే చెప్పవచ్చు — ఇందులో ఒకటి తమ ఉదాత్త ఆత్మ — లేదా, నీలోని విషాద మానవుడినే నమ్మవలసివస్తే, అతడు చెప్పిన — నీ దీనాతిదీనమైన, దుఃఖితుడైన, నిరాశోపహతుడైన మరియు అశక్త ఆత్మ. కాని అదెలా జరిగింది? రెండు సిద్ధాంతాలున్నాయి. ఒకటి పరాశక్తి వల్ల. రెండోది స్వయంగా నీవు చేసిన కోలాహలం, పడిన చీకాకులు, ముక్కుతూ మూలుగుతూ చేసిన దుష్కర ప్రయత్నాల వల్ల అది జరిగింది. ఇప్పుడు సారూ! రెండోదే గనుక నిజమైతే ఇంతకు ముందెన్నడూ జరగనటువంటి దాన్ని నీవు చేసి వున్నట్లైతే కఠినశ్రమ చేయగల నీ బలమే నిన్ను కవిగా చేసింది. (ఎందుచేతనంటే అంతకు ముందు నీవు చేసిన యుక్తమైన సాహితీ కసరత్తులు). అయినపుడు సారూ, ఏం కొంప మునిగిందని, నీ వంత దైన్యస్థితికి చేరావు, ఆత్మన్యూనత ననుభవిస్తున్నావు, దుఃఖితుడవవుతున్నావు? ఎన్నో నెలలకు గాని కొద్ది గేయాలను మించి పుట్టించలేని వాడు మాత్రమే కవి, అని చెప్పకు. అలా చేయడానికి కూడా, అసలు కవిగా తయారవడానికి గూడా, తనను తానే కవిగా చేసుకొనడం కూడా ఒక అద్భుతమే. అప్పుడు శభాష్, శభాష్ అని మాత్రమే ఆగకుండా మెచ్చుకోగలం.

నీ స్వప్రయత్నమే అలా చేయ చేయగలిగినపుడు, అది చేయలేనిదంటూ ఇంకేముంటుంది? దానితో అద్భుతా లన్నింటినీ సాధించవచ్చు. ఒక బ్రహ్మాండమైన

ఆత్మవిశ్వాసం నీలో వుండి, ఆ పని చేసి వుండాలి. లేకపోతే, ఆ పరాశక్తి ఆ పని చేసి వుండాలి. అయినప్పుడు అది చేయలేనిది ఇంకేముంటుంది? ఇక్కడ కూడా విశ్వాసమే, ఒక బ్రహ్మాండమైన విశ్వాసం అనేదే చివరకు తర్కరీత్యా తేలుతుంది. కనుక ఎలా చూసినా హెల్లలూయా అని చెప్పడానికే వీలుంది గాని, ఆ ఆర్తనాదాలకు, మొత్తుకోళ్ళకు కాదు. Q.E.D

సరే, అదలా ఉంచు. ఏదైనా దిగివచ్చే ముందు రోజుకు నాలుగైదు గంటల చొప్పున చాలా సంవత్సరాల పాటు దాని మీద కేంద్రీకరించానని నా గురించి చెప్పిన కథ సంగతేంటి? కేంద్రీకరించడం అన్న మాటకు నువ్విచ్చే అర్థం శ్రమతో కూడిన ధ్యానం అని గనుక అయినట్లైతే అసలటువంటిదేం జరుగలేదు. నేను చేసింది రోజుకు నాలుగైదు గంటల ప్రాణాయామం — అదే వేరే సంగతి, దీనితో దానికెట్టి సంబంధం లేదు. నువ్వు మాట్లాడేది ఏ ప్రవాహం గురించి? నేను ప్రాణాయామం చెస్తున్నపుడే కవిత్వ ప్రవాహం జాలువారింది, కొన్ని సంవత్సరాల తర్వాత గాదు. అనుభవాల ప్రవాహం అయితే, అది కొన్ని సంవత్సరాల తర్వాత వచ్చింది. కాని ప్రాణాయామానికి స్వస్తి చెప్పిన చాలా కాలం తర్వాత, ఏమీ చేయకుండా కూర్చుంటున్నప్పుడు, నా సమస్త ప్రయత్నాలూ విఫలమైన తర్వాత ఏం చేయాలి లేదా ఎక్కడకు పోవాలో తెలియనప్పుడు కవిత్వం ప్రవహిస్తూ వచ్చింది. అది సంవత్సరాల తరబడి చేసిన ప్రాణాయామం యొక్క లేదా ఏకాగ్రత యొక్క ఫలితంగా రాలేదు. కాని, ఏ మాత్రం అనుకోకుండా, సందర్భం లేకుండా సునాయాసంగా, తాత్కాలిక గురుకృప వల్ల గాని (కాని అది కాదు, ఎందుకనంటే అతడే దిగ్భ్రాంతికి లోనయ్యాడు) లేదా శాశ్వత బ్రహ్మం యొక్క కృపాకటాక్షం వల్ల గాని జరిగింది. తరువాత అది మాహాకాళి, మరియు, శ్రీకృష్ణుల కృప వల్ల జరిగింది. కనుక నన్ను దైవాన్ని వ్యతిరేకించే వాదనలోకి దించడానికి ప్రయత్నించకు. అటువంటి ప్రయత్నం పూర్తిగా నిష్ప్రయోజనం.

ఇహ ముగించక తప్పదు — అలా వ్రాసుకుంటూపోతే 12 గంటల దాకా 'ప్రణామం' వుండదు. తిరిగి నీ ఆర్తనాదాన్ని రాత్రికి వినిపించు. ఇంకా వ్రాయవలసిందేమైనా వుందేమో అప్పుడు చూస్తాను. ఇంత వరకూ చాలా దూకుడుగానే వ్రాసాను — దీన్నిండా వ్రాయస కాని పొరపాట్లు లేవనే భావిస్తాను.

జనవరి 26, 1936

నిరోద్: నా ఆర్తనాదాన్ని వినిపిస్తున్నా సార్. నే నేమనుకొన్నదీ తెలుపడం లేదు. ఏదేమైనా నిరాశానిస్పృహల మేఘాలను చెదరగొట్టడంలో మీరు విజయం సాధించారు.

శ్రీఅరవిందులు: వ్రాయడం కొనసాగిస్తాను. నీవు క్రియాశక్తిని అనుభూతి చెందడం లేదనే వాస్తవం, అది లేదనేందుకు ఋజువు కాదు. ఆవిరియంత్రం తనను నడిపే శక్తిని అనుభూతి చెందలేదు, కాని శక్తి వుండనే వుంది. మనిషి ఆవిరియంత్రం కాదు? అతడు దాని కంటె కొంత తక్కువ గానే అధికుడు. ఎందుకనంటే అతడు తనను గురించి తానేమనుకొంటున్నాడో అది కేవలం ఉపరితలంపై కన్పించే నురుగు మాత్రమే, దానిని గురించే అతనికి యెరుక ఉన్నది. ఉపచేతన, నిలీనచేతన, అతీత చేతనాశక్తులు తనను నడిపిస్తున్నాయని అతనికి తెలియదు. (ఆధునిక మనో విజ్ఞాన శాస్త్రం ఉన్నతతర శక్తులపై గాక నిమ్నశక్తుల పైనే పట్టును సాధించినప్పటికీ అది అధికాధికంగా ధృవీకరించిన వాస్తవం ఇది. అందుచేత నీవు నీ సహేతుకతా నాసికను అటువైపు, ఇటువైపు త్రిప్ప పనిలేదు.) అతడు తెలివిగా (= తెలివితక్కువగా) ఉపరితల ఫలితాలను గురించి చిలుకపలుకులు పలుకుతాడు. తన గొప్ప ఆత్మ తన దృష్టికే అందకుండా, మసకమసకగా తళుక్కుమంటున్న బుద్ధి యొక్క తెర వెనుక, ప్రాణిక సంవేదనలు, భావోద్వేగాలు, ప్రేరణలు, ఉద్రేకాలు, అభిప్రాయాల కదలాడుచున్న పొగమంచు వెనుక ఎంతో దూరాన దాగి ఉన్నదనే, వాస్తవాన్నతడు గ్రహించకుండా, ఆ ఫలితాలను తన ఉపరితల ఉదాత్త — ఆత్మకే ఆపాదించుకొం టాడు. కనుక నీ వాదన పూర్తిగా అర్థం లేనిదీ, ఎందుకూ పనికిరానిదీ. రహస్యశక్తులకు చెందిన ఏవో కొన్ని ఛాయలను లేదా మెరుపులను తెర గుండా రాబట్టు కొనుటకు లేదా పూర్తిగా అడ్డుకొనుటకు బదులు ఒక్కుమ్మడిగా అవి 'గ్రుమ్మరిల్లడమో' మరియు 'నదీప్రవాహంలా ప్రవహించడమో' కాక, వాటిని గోడలు లేని బహిరంగం లోనికి తీసుకొని రావడం మన లక్ష్యం. అంతా వెంట వెంటనే సంభవించాలని ఆశించడం అసహనం నిండిన అజ్ఞానాన్ని, అనుభవరాహిత్యాన్ని తెలిపే మితిమీరిన ఆత్మవిశ్వా సంతో వత్తిడి చేయడంగా అవుతుంది. మొదట్లో బొట్లు బొట్లుగా లభిస్తే, భవిష్యత్తులో వర్షపాతంలా లభిస్తుందనే విశ్వాసం న్యాయసమ్మతమే అనడాని కది చాలు. 'శక్తి దిగి వస్తోంది, నా నుండి ఒక గేయాన్ని బహిర్గతం చేస్తోంది' అని ఒకటి రెండుసార్లు అంగీకరించావు (ఆ గేయం మంచిచెడుల గురించి నీవు వెలిబుచ్చిన అభిప్రాయానికి పైసా విలువ కూడా లేదు. ఆ విషయం ఇతరులు చెప్పాలి.) నైరాశ్యాన్ని పటాపంచలు

చేయడానికీ సమ్మెట దెబ్బ చాలు. శక్తి వుండి వున్నది, ఉంటూనే వున్నది, పనిచేస్తూనే ఉన్నది అనేది ఋజువు అయ్యింది. చెమటలు గ్రక్కే నీ దుర్ఘటమైన శ్రమే, దానిని నీవు సంవేదించకుండా అడ్డుపడుతోందని తెలుస్తోంది. అంతే గాక బొట్లు బొట్లుగా లభించడం వర్షపాత సంభావ్యతకు హామీ నిస్తోంది కూడా. చేయవలసిందల్లా, చేసు కుంటూ పోతూండటమే. తన సహనం వల్ల వర్షపాతానికి అర్హుడవుతాడు లేదా అర్హత పొందకపోయినా, అది లభించేదాకా దానికి అతుక్కుపోతాడు. ఆ అనుభవమే ఒక హామీ, ముందుగా రుచి చూడడం లాంటిది, కాని అది, ప్రకృతి సన్నద్ధమయ్యేంతవరకు ఆగిపోవడం అనేది యోగవిధానంలో ఒక భాగమే. ఇది ప్రతి యోగికీ అనుభవైకవేద్యమే. అతడు వెనుదిరిగి గతానుభవం లోనికి దృష్టి సారిస్తే తెలుస్తుంది. నీకు కొంతకాలం ముందు కలిగిన ఆనందం యొక్క సంక్షిప్త రాకపోకలు అలాంటివే. నీకు జలగలా పట్టుకొనే జిగట లాంటి స్వభావం లేకపోయినా ఏం ఫరవాలేదు — జలగలు ఒక్కటి మాత్రమే యోగుల్లాంటివి అనుకోరాదు. ఏదో విధంగా నీవు యోగానికి అతుక్కుపోతే లేదా అతికించబడిపోతే చాలు. నీవు శ్రీఅరవిందులవు కాదు (అవునని ఎవరన్నారు) అనేది అప్రస్తుత అసంబద్ధ ప్రస్తావన. హేతురీత్యా నీ వెవరివో అలాగే వుండడం అవసరం నైరాశ్యం వున్నపుడు విదిలించివేసుకోవాలి. ఒక మంచి కారణానికి జలగ లాంటి జిగట పట్టుతో', దానిని పట్టి ఉంచుకొనక దానంతటదే విదిలించుకుపోయేలా చేయాలి.

మిగతాదంతా తామిసికాహంకారం యొక్క బూజు పట్టిన పదార్థమే. 'నే నెటువంటి ఉదాత్త దివ్యవ్యక్తిని, నాకు నేనే సాటి, వేరెవ్వరూ సాటి రారు' అని ఎలుగెత్తి చాటే (శ్రుతిలో స్థాయీ భేదం వుండవచ్చునేది నిజమే) రాజసికాహంకారం ఉన్నట్లుగానే తామసికాహంకారం కూడా ఉన్నది. అదిలా కీచు కీచుమంటుంది. 'ఎటువంటి దైన్య, నిరాశాయుత, విలువ లేని, అసమర్థ, దురదృష్ట, అనుగ్రహరహితమైన, ఏ విధంగా చూసినా ఎందుకూ పనికిరాని ప్రత్యేక జీవిని నేను, — అందరూ గొప్పవారే, అర విందుళ్ళు, దిలీపులు, అనిల్‌కుమార్ లు, (నీవు చెప్పినదాన్ని బట్టి నవలాపఠనంలో అసదృశ సామర్థ్యం కలిగి వున్నందువల్ల గొప్పవారు, ఆత్మ-తృప్తి గలవారు) కాని, నేను, అయ్యో నేను, అయ్యో నేను', అది నీ స్టైలు. ఈ తామసికాహంకారమే (అది వివిధ సమయాల్లో, వివిధ పద్ధతుల్లో తనను తాను బయటపెట్టుకొంటుంది. నేను నీ ప్రస్తుత శ్రుతిస్థాయిని గురించి మాత్రమే వ్రాస్తున్నాను). ఆ విషాదమానవుడు

నీ లోనికి రావడానికి కారణం — అదంతా పిచ్చివాగుడు — సోమరితనం యొక్క విచారం, నైరాశ్యాల యొక్క భోగాన్ని అనుభవించడానికి సాకుగా చెప్పే చెత్త. నీవు ప్రస్తుతానికి అలాంటి ఊబిలో వున్నావు. ఎందుచేతనంటే నీవు విశ్వాసంతో సంపూర్ణంగా జడప్రాయమైన మతిలేని స్థితిలోకి దిగిపోయావు. ఒక ప్రత్యేక నమూనా అని నేనొప్పుకుంటాను. అయినా నీ భౌతికచేతన యొక్క బురదత్వంలో చచ్చే స్థితికి దిగిపోయావు. అందరిదీ అదే చేతన కాకపోతే నమూనాలు వివిధ రకాలుగా వుంటాయి. ఏం చేస్తాం? రాగలిగితే బయటకు నెట్టుకుంటూ రా, లేకపోతే త్రాళ్ళ కోసం అర్థించు, అవొచ్చేదాకా వేచి వుండు. దైవకృప దిగివచ్చినప్పుడేం జరుగుతుందనేది భగవంతునికే తెలియాలి. అంతేగా చేయగలిగింది, కాదా? అది నీకు తెలియదనేది వాస్తవం, అదే నీ బుద్ధిని కలవరపెడ్తోంది. కాని అదేమంత ప్రాముఖ్యం గల విషయం కాదు. నీకున్నదని నీ వనుకుంటున్న నీ అనర్హతను మించినదేదీ ఆ వాస్తవం కలవరపెట్టదు. ఎవరు అర్హులైనా, ఆ మాట కొస్తే, అర్హత, అనర్హత అనేవి కేవలం మాట్లాడే తీరు మాత్రమే, బాహ్యప్రకృతిలో మనిషి అనర్హుడు (ఆధ్యాత్మిక విషయానికి సంబంధించినంత వరకు) తగనివాడు. కాని అతని అంతరంగంలో ఒక అంతరాత్మ, అతనికి ఊర్ధ్వాన దైవకృప ఉన్నవి. 'నీవు తెలుసుకోవలసిందిదే, లేదా దీనినే తెలుసుకోవలసిన అవసరమున్నది.' అంతే గాదు నీకు తెలియకపోయినా సరే, ఏదో విధంగా యోగమార్గంలో పడ్డావు కనుక ఆ జ్ఞానానికి నీవు మేలుకొనేదాకా ఎంతో దూరం దాని వెంట ఈడ్చుకుపోబడేవరకు ఆ మార్గంలో ఉండిపోవలసిందే. తథాస్తు.

జనవరి 21, 1936

అనువాదం; కె. వి. రావు

దైవానుగ్రహం యొక్క పనితీరు

(దిలీప్‌కుమార్ రాయ్ లేఖకు శ్రీఅరవిందుల సమాధానం)

[దిలీప్‌కుమార్ రాయ్ గారి శిష్యురాలు 'బెంగాల్ కోకిల' గా పేరొందిన ఉమా బోస్ ఇరువది ఒక్క సంవత్సరాల పిన్నవయస్సులో క్యాన్సర్ వ్యాధితో మరణించినప్పుడు, దిలీప్‌కుమార్ రాయ్ వియోగదుఃఖంతో శ్రీఅరవిందులకు ఇలా వ్రాసారు.]

"కాని, ఇలాంటి సుందరమైన పుష్పం వికసించుటకు పూర్వమే ఎందుకు వాడి రాలిపోవాలి? ఆ కారణంగా, ఆమెను ఎరిగినవారందరూ ఆమె తెల్లని మంచు లాంటి స్వచ్ఛమైన గుణానికి, ఆమె దివ్యగానానికి ముగ్ధులై ఆమెపై ప్రేమను పెంచుకున్న వారందరూ ఎందుకు విచారసాగరంలో మునిగిపోవాలి? ప్రపంచ మంతటా అలముకుంటున్న విషాదఛాయలను చూడండి! నాకు దైవానుగ్రహంపై నమ్మకం ఉంది, కాని అది కొన్ని షరతులకు — మాలాంటి గ్రహీతలు క్షణమాత్రమైన నెరవేర్చలేనంత కఠినమైనది — లోబడి మాత్రమే ఆదుకుంటుంది. అలాంటప్పుడు, ఆ దైవానుగ్రహం కేవలం యాదృచ్ఛికము, అనుమానాస్పదము అయినప్పుడు, మన విలువైన సమయాన్ని, శక్తిని ఎందుకు వృధాగా దానిపై వెచ్చించాలి?"

ఆ రోజుల్లో శ్రీఅరవిందులు సమాధానాలను వ్రాసేవారు కాదు. 1938 నుండి శిష్యులకు లేఖలు వ్రాయడం మానేశారు. అయినప్పటికీ ఈ విషాదాకర లేఖను అందుకున్న వెంటనే — ఫిబ్రవరి 1942 — లో సమాధానం వ్రాసారు.]

నీ ప్రశ్న అన్నింటిలోకి అతి కఠినమైన చిక్కుసమస్యను లేవనెత్తుతుంది. దానిని ఏమాత్రం విపులంగా వివరించాలన్నా, నా 'దివ్యజీవనం' లోని ఒక అతిపెద్ద పేరా అంతటి సుదీర్ఘమైన సమాధానం అవసరమౌతుంది. అందుకని నా బుద్ధికి తోచినంత మేరకు చెప్తాను. కాని అది హేతువుకు కట్టుబడింది కాదు; నా స్వంత అనుభవంపై ఆధారపడినది. ఆ అనుభవం నాకు నేర్పింది ఏమిటంటే, దైవానుగ్రహం ఒకటి ఉన్నదని, ఈ విశ్వము నందున్నది ఏదీ కూడ నిష్ప్రయోజనం కాదని.

బాహ్యవిషయాలు పైకి కనుపించిన విధంగానే అర్థం చేసుకున్నా లేక మన చుట్టూ జరుగుతున్న వ్యవహారకాండలోని ఘటనలు క్షణభంగురమైనవిగా కాక నిశ్చితంగా జరగవలసినవిగా పరిగణించినా, దైవానుగ్రహ ప్రమేయం కానరాదు. మహా అయితే, ఎప్పుడో ఒకప్పుడు కనిపిస్తుంది లేదా కొన్నిసార్లు తరచుగా కూడ కనిపిస్తూండవచ్చు. దైవానుగ్రహం స్పష్టమయ్యేది ఎప్పుడంటే, పైకి కనిపించే విషయాల వెనుక నున్న వాటిని పరిశీలించి, వాటికి కారణభూతమైన శక్తులను, వాటి పనితీరును, వాటి నిగూఢ ప్రాధాన్యతను అర్థం చేసుకోగలిగినప్పుడు మాత్రమే. నిజమైన జ్ఞానమైనా, శాస్త్రవిజ్ఞానమైనా సమకూరేది వాటి ఉపరితల విషయాల వెనుక దాగి వున్న కార్యకారణాల మూలాలను పరిశీలించినప్పుడే. ఈ ప్రపంచమంతా దుఃఖభాజనమనే మాట పరమసత్యం. దానిని అస్థిరత అనే జాడ్యం పట్టి పీడిస్తున్నది. భగవద్గీతలో 'అసంతుష్ట,

అస్థిర ప్రపంచం', 'అనిత్యంసుఖం' అన్నట్టుగా ఈ జాడ్యం ప్రపంచాన్ని పీడిస్తున్నది. ఇది కేవలం ఒక దైవఘటన వల్ల సృష్టింపబడుతున్నదా లేక యాంత్రికంగా అనాలోచితంగా సంభవించే పరిణామమా లేక అందులో ఏదో ఒక అర్థం నిగూఢమై ఉండి దానిని మనం గ్రహించలేకపోయినా ఆ దిశ వైపుగా మనం కదులుతున్నామా, అనే విషయాలన్నీ ప్రశ్నార్థకమౌతాయి. ఒక వేళ దానిలో ఏదో అర్థం ఉన్నట్లయితే, పరిస్థితులు ఆ దిశగా ఏర్పడుతున్నట్లయితే, అప్పుడు తప్పనిసరిగ దైవానుగ్రహం ఉండి తీరిందనుట రూఢి అవుతుంది. అనగా, మన మొక అంతర్గత సంబంధం ఏర్పరచుకొనుటకు ఆలంబనంగా దివ్యచైతన్యము, దైవసంకల్పము ఉన్నవన్న మాట. అలాంటి దివ్యచైతన్యము, దైవసంకల్పము వాస్తవమైతే, దానంతటది తెలివితక్కువగా ఈ లోకపు పోకడ లోని పరమార్థాన్ని త్రోసిరాజని, సర్వదా అపజయం పాలగుట కాని లేక అంతిమ దశలో భంగపాటుకు గురి అగుట గాని బహుశః జరగక పోవచ్చు.

ఈ లోకంలో రెండు దశ లున్నాయి. ఒకటి, భౌతిక అచేతన పునాదిపై ఆధార పడినట్టుగా కనుపిస్తుంది. పొరపాటు, విచారము, మృత్యువు, బాధ దాని ఆవశ్యక పర్యవసానాలు. అయినప్పటికి పాక్షికంగా విజయవంతమైన ప్రయత్నంతో పాటు వెలుగు, జ్ఞానం, సత్యం, మంచితనం, సంతోషం, సమత, సౌందర్యాల దిశగా ఎంతో కొంత పురోగతి సమకూరుతుంది. అసలు ఈ లోకం యొక్క పరమార్థం నిజానికి ఈ పరస్పరర వైవిధ్యంలోనే ఇమిడి ఉండాలి. అది అధోచేతనా దశ నుండి ఉన్నతతర దిశగా దారితీసే ప్రయాసగా ఉంటుంది. దైవానుగ్రహం ఈ పరస్పర వైరుధ్య ప్రయాసలతో కూడిన పరిస్థితులలోనే ప్రసాదించబడాలి. అది ప్రత్యేకంగా వ్యక్తిని, బహుశః ప్రపంచాన్నంతా కూడా, ఉన్నతస్థాయి దిశగ జ్ఞానాజ్ఞానాలు, చీకటివెలుగులు, చావుబ్రతుకులు, సుఖదుఃఖాలు లాంటి ద్వంద్వప్రమాణాల ద్వారా కొనిపోయి, ఉన్నతస్థాయికి చేరి, అక్కడ స్థిరపడేవరకు ఈ ప్రమాణాల్లో ఏ ఒక్కదానిని విసర్జించకూడదు. సర్వసాధారణంగా, దైవానుగ్రహం వలన విషమపరిస్థితుల నుండి తక్షణ విమోచన వీలుపడదు. అంతేగాక, దైవానుగ్రహం స్వయంగా నిరంతరం సంతోషం, విజయము, అదృష్టాలను తప్పనిసరిగ సమకూర్చేది కూడ కాదు. అలా కానేరదు కూడ. దాని ప్రధానోద్దేశం మన అస్తిత్వ చైతన్యాలను అభివృద్ధిపరచుట, ఒక ఉన్నతోన్నత స్థాయి జీవిగ, దైవోన్ముఖంగా తీర్చిదిద్దుట. చివరకు ఒక దివ్యతేజము, దివ్యసత్యము, దివ్యానందాల దిశగ అభ్యున్నతిని కలిగించుట. మిగతా విషయాలన్నీ

అప్రధానమైనవి. అవి కొన్నిసార్లు సాధనాలుగాను, కొన్నిసార్లు ఫలితాలుగాను ఉండవచ్చునేమో గాని ఎన్నటికీ ప్రధాన ప్రయోజనాలు మాత్రం కాలేవు.

దైవానుగ్రహం గురించిన యదార్థ జ్ఞానం మనకు ఎప్పుడు కలగుతుందంటే మనం మన అంతరంగపు లోతుల్లోకి వెళ్లగలిగి, అక్కడి నుండి ఈ శక్తుల ఖేలనలను సన్నిహితంగ గమనించి, వాటి మరుగున దాగివున్న సంకేతాలను అందుకోగలిగినప్పుడు మాత్రమే అది సాధ్యపడుతుంది. ఉపరితల మనస్సు కేవలం ఒక అస్పష్టమైన అవగాహన మాత్రమే పొందగలదు. ఎప్పుడైతే మనకు దైవంతోనో లేక అంతర్బుద్ధితోనో, లేక అంతర్దృష్టితోనో అనుసంధానం ఏర్పడుతుందో, అప్పుడు జీవనస్థితిగతులను ఒక వినూత్న వెలుగులో చూడనారంభిస్తాము. మనకు తెలియకుండానే అవి మన అస్తిత్వాన్ని, మన చైతన్యాన్ని అభ్యుదయదిశగా ఎలా పెంచి పోషించి, మన నిర్దేశిత కార్యాచరణకు, అభ్యున్నతికి ఎలా దోహదపడింది గమనించగలుగుతాము. ఉత్తమమైనవి, సౌభాగ్యవంతమైనవి, విజయవంతమైనవాటిని మాత్రమే గాక, జీవితంలో ఎదురయ్యే పోరాటాలను, వైఫల్యాలను, కష్టనష్టాలను, మార్పులు చేర్పులను కూడా గమనించ గలుగుతాము. కాని అది అందరిపట్ల ఒకే రీతిగ స్పందించదు. ఒక్కొక్కరి పట్ల వారి వారి స్వభావరీత్యా వారి జీవనస్థితిగతులకు, వారి చైతన్యస్థితికి, వారి అభ్యున్నత స్థాయికి, వారికి అవసరమగు అనుభవసిద్ధికి అనుగుణంగా వర్తిస్తుంది. మనం స్వయంచాలక యంత్రాలం కాము. చైతన్యవంతులమగు జీవులము. మన మానసికతత్వం, మన సంకల్పం, నిర్ణయాలు, జీవితం పట్ల మన వైఖరి, దాని నుండి మనం పొందగోరేదేమిటి, మన ఉద్దేశాలు, కదలికలు మొదలగునవి మన జీవితగమనాన్ని నిర్దేశిస్తాయి. అవి మనలను కష్టనష్టాలకు గురిచేయవచ్చు, ఉపద్రవాల దిశగా కొనిపోవచ్చు. అయినప్పటికి వాటి ద్వారానే దైవానుగ్రహం, మన అనుభవ పురోగతికి, మన అస్తిత్వం మరియు చైతన్యాల అభ్యున్నతికి ఉపకరిస్తుంది. అంతరాత్మ భవితకు కావలసిన అనుభవాన్ని సంపాదించటానికై సాధించవలసిన పురోభివృద్ధి ఎంతటి వక్రమార్గాల ద్వారా సమకూరినా, ఎంతగా వెనకడుగు వేసినట్లుగానో లేక ధర్మవిరుద్ధమైనదిగా అనిపించినా, అది అనివార్యము. భగవంతునితో సన్నిహిత అనుబంధం ఏర్పడినప్పుడు మనకు ఉపకరించేది లేక ప్రత్యక్షంగ మార్గదర్శకం చేసేది, లేక మనలను కదిలించగలిగే ఆదరణ ఒకటి మనకు లభిస్తుంది. అది మన కష్టాలను, బాధలను, అపాయాలను లేకుండా చేయదుగాని, వాటి నుండి మనలను

సురక్షితంగా బయటపడేస్తుంది — ఒక ప్రత్యేక ప్రయోజనం నిమిత్తం అందుకు వ్యతిరేకంగా వ్యవహరించవల్సిన అవసరం ఉంటే తప్ప.

విశ్వగత కార్యకలాపాల నిర్వహణ క్రమంలో కూడ దైవానుగ్రహం యొక్క పనితీరు ఇలాగే ఉంటుంది. కాని కొంత భారీ యెత్తున మరింత సంకీర్ణమైనదిగ ఉండవచ్చు. అనవరతం కొనసాగుతుండే పరిణామ క్రమానికి సరియైన తత్కాల పరిస్థితులు, నియమనిబంధనలు, శక్తుల ప్రాబల్యానికి అనుగుణంగా కొనసాగుతున్నట్లు అనిపిస్తుంది. అయినప్పటికి పరిణామ ప్రయోజన దిశగా నడిపించేదేదో దానిలో ఉన్నది. దానిని గమనించి, తెలుసుకొని, అనుసరించుట, అల్పమైన, అత్యంత సన్నిహితమైన వ్యక్తిగత చైతన్యం మరియు జీవితవిషయాలకు సంబంధించినదాని కన్న కష్టతరము. ఏదో ఒక ప్రత్యేక పరిస్థితిలోనో లేక విశ్వగత కార్యాచరణలోనో లేక మానవజాతి మనుగడలోనో చివరకు జరిగేదేమిటో, అది ఎంతటి విపత్కరమైనదో నిర్ధారించ వీలుకాదు. ఇందులో కూడ బాహ్య కదలికలనే కాక అంతర్గత రహస్య ఖేలనలను, భవిష్యత్ ఫలితాలను, పొంచివున్న సంఘటనలను, వీటన్నింటి వెనుక పనిచేస్తున్న దైవేచ్ఛను గమనించాలి. అసత్యము, అజ్ఞానము భూమి అంతటా అనాది నుండి ప్రబలి ఉన్నాయి. కొన్నిసార్లు వాటి ప్రభావము అధికమౌతుంది. అయినప్పటికి దివ్యతేజం క్షణిక మెరుపుల వలెనే కాక వెల్లువలై ప్రసరించిన సందర్భాలు లేకపోలేదు. ఈ సుదీర్ఘ కాలగమనంలో, కలగూరగంపలో కలసిపోయిన పరిస్థితుల్లోను, ఏ సంఘట, ఏ చలనం చోటు చేసుకున్నా ఆ దివ్యతేజం ప్రజ్వరిల్లుతూనే ఉంది. అభ్యుదయ సాధనాపోరాటం ఆగిపోలేదు. ప్రస్తుత కాలంలో అసత్యం, అజ్ఞానం వాటి శక్తులన్నింటిని కూడగట్టుకొని అధికబలం పుంజుకొని ఉన్నాయి. భగవత్ సాక్షాత్కారానికి పూర్వ సంకేతంగ ఇలాంటి పరిస్థితులు నెలకొంటాయి అని అనాదికాలంగా ఆధ్యాత్మిక తత్వవేత్తలు, మతప్రవక్తలు వక్కాణిస్తూనే ఉన్నారు. ఆ నిర్వచనాన్ని మనం తిరస్కరించినా కూడ, అసత్యం ఒక తిరుగులేని విజయం (కనీసం తాత్కాలికమైనది) సాధిస్తుందనే సూచన నిశ్చితంగా కనిపించదు. దీని అర్థం ఈ శక్తుల మధ్య పోరాటం తారాస్థాయికి చేరుకున్నదని, పర్యవసానంగ ఉత్తమశక్తి ఏదో అత్యంత బలోపేతమై ఆవిర్భవిస్తుందని. కారణం, విశ్వగత కార్యకలాపాల నిర్వహణ ఆ విధంగానే ఉండుట మామూలు గనుక. ఇక్కడితో నేనాపివేస్తాను. ఇంకా ఎక్కువ పొడిగించను.

ఉమాబోసు పురోగమన పథంలో సాత్త్వికతత్వ ప్రాబల్యం సుస్పష్టమైన స్థాయికి చేరుకున్నది గాని, శక్తివంతమైన ప్రాణికస్థాయిని అందుకోలేదు. అదే విజయవంతమైన, అదృష్టవంతమైన జీవితానికి తోడ్పడేది. ఉన్నత వెలుగుకు వివృతం కాలేదు. ఆమె మానసిక ఎదుగుదల, పరిసరాల ప్రభావము అందుకు అవరోధంగా నిలిచాయి. అంతేగాక ఆమె స్వయంగ అందుకు సన్నద్ధం కాలేదు. అకాల మరణం, అమితమైన బాధ పూర్వజన్మ ప్రభావ ఫలితాలై ఉండవచ్చు. లేదా ఒక ఉన్నతస్థాయికి ఎదగటానికని వాటిని ఆమె చైత్యపురుష సత్తా ఒక మార్గంగా ఎన్నుకొని ఉండవచ్చు. ఆ స్థాయికి అర్హత సంపాదించకపోయినా, ఆ దిశగా ఆమె అడుగులు వేసింది. ఆమెకు మిగిలింది ఈ ఒక్క జన్మ మాత్రమే అయితే, పై కారణాలతో పాటు ఆమె యోగ్యతా సమర్థతలు ఫలప్రదం కాకపోవుట చివరకు ఒక విషాద ఘట్టం అయ్యేది. కాని మరో జన్మ నెత్తుటకు సిద్ధపడటానికి ఆమె చైత్యపురుష విద్రావస్థ లోనికి జారుకుంది.

*

ఉరితీయబడుటకు కొనిపోబడుతున్న నేరస్తుడి గురించి సర్ ఫిలి ప్ సిడ్నీ అన్నారు, "అదుగో, దైవకృప లేనందువలన సర్ ఫిలిప్ సిడ్నీ పోతున్నాడు." కాని, ఇంగిత జ్ఞానమున్నవాడైతే, ఈ విధంగా అనేవాడు, "అదుగో, దైవకృప ఉన్నందువలన సర్ ఫిలిప్ సిడ్ని పోతున్నాడు".

(ఇక్కడ సర్ ఫిలిప్ సిడ్నీయే నేరస్తుడని భావించడమైనది.)

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

బుధవారపు తరగతుల్లో ఆఖరి ప్రసంగం (26-11-1958)

జన్మతః ఆత్మశక్తిని కలిగియుండుట

ప్రశ్న: ఆత్మశక్తి యొక్క పాత్ర ఏమిటి?

భగవంతునికి, అతని అభివ్యక్తికి మధ్యన ఒక చైతన్యవంతమైన మధ్యవర్తిత్వం నెరపుటతో పాటు, ఆ అభివ్యక్తి భగవంతునితో సంయోగం చెందే స్థానం అని చెప్పవచ్చు.

మహోన్నతుడైన ఆ భగవంతుని అర్థం చేసుకోగలిగి, ఆతనితో సంసర్గము

చెందగల సత్తా ఆత్మశక్తికి వుంది. అది స్వచ్ఛమైనది. ఆ భగవంతుని బాహ్య అభివ్యక్తి యొక్క వికృతి చెందని మధ్యవర్తి అనవచ్చు. ఈ ఆత్మశక్తి ఎలాంటిదనగా, అంతరాత్మ సహకారంతో చైతన్యాన్ని ఉన్నతోన్నత దివ్యదిశగా మళ్ళిస్తుంది. చైతన్యానికి భగవంతునిపై అవగాహన అంకురించుట ఆరంభమయ్యేది కూడ ఆత్మశక్తితోనే.

'ఆత్మశక్తి' అని పిలువబడేదాన్ని, దైవానుగ్రహంతో ఈ భౌతికజగత్తు నందు విస్తరించబడిన ఒక వాతావరణంగ అభివర్ణించవచ్చు. దాని మూలాలను గురించిన ఎరుక దానికి కలిగి ఆ మూలాలను తిరిగి అందుకోవాలనే ఆకాంక్ష దానికి ఏర్పడాలి. నిజానికి అది విముక్తిని ప్రసాదించి, ద్వారాలను తెరిచి, చైతన్యానికి స్వేచ్ఛను అందించగలిగే అనువైన వాతావరణం. సత్యాన్ని అనుభవైకవేద్యం గావించి ఆకాంక్ష ఈడేరుటకై అవసరమైన సమగ్ర శక్తిని సమకూర్చగలిగేది ఇదే.

ఉన్నతస్థాయిలో పరిశీలించినట్లయితే, దీనిని మరో విధంగ వ్యక్తపరచవచ్చు. ఈ దీప్తివంతమైన స్వేచ్ఛను ప్రసాదించగలిగే ప్రభావాన్ని చూపే చర్యను 'ఆత్మశక్తి' అనవచ్చు. అత్యున్నత వాస్తవాలకు మార్గాన్ని తెరిచేది, మనం కూరుకుపోయివున్న అజ్ఞాన బురద కూపం నుండి మనల్ని పైకి లాగేది, ద్వారాలు తెరిచేది, మనకు దారి చూపించేది, చేరవలసిన గమ్యానికి చేర్చేది, మొదలగువాటి నంతా మానవుడు 'ఆత్మశక్తి' గ పేర్కొన్నాడు. ఇది ఈ విశ్వాన్ని అది మునిగిపోయిన అజ్ఞాన తిమిరాంధకారాలనుండి రక్షించుటకై దైవానుగ్రహంచే ఈ ప్రపంచమందు నెలకొల్పబడిన వాతావరణం.

అంతరాత్మ దైవానుగ్రహం యొక్క వ్యక్తిగత కేంద్రీకరణ, మానవునిలో దాని వ్యక్తిగత ప్రతినిధి. అంతరాత్మ ఒక మానవాళికే ప్రత్యేకమైనది. మానవుని యందే దాని ఉనికి. అది మానవునిలో ఆత్మశక్తి యొక్క ప్రత్యేకమైన ప్రతిబింబము. ఇతర లోకవాసులకు అంతరాత్మ ఉండదు. కాని వారు ఆత్మశక్తితో జీవించగలరు. అంతరాత్మ మానవజాతికి ప్రసాదింపబడిన ఆత్మశక్తి అనవచ్చు; దాని పురోగతిని వేగవంతం చేయుటకు అందించబడిన ప్రత్యేక సాయం. అంతరాత్మ వ్యక్తిగత అభ్యున్నతిని సిద్ధింపజేస్తుంది. ఆత్మశక్తి తన మౌలిక రూపంలో అతి సామాన్యమైన సామూహిక కార్యాచరణకు కర్త.

ఆత్మశక్తి ఒక తత్కాల సహాయకుడు లేదా మార్గదర్శి పాత్రను పోషిస్తుంది

గాని, ప్రాపంచిక విషయాల్లో సర్వశక్తి సమన్వితమైన అధికారిక పాత్రను పోషించలేదు. దివ్యచైతన్యం ఒక వినూత్న ప్రపంచాన్ని రూపొందించినప్పుడు, ఆత్మశక్తి ఆధిపత్యం వహించి ప్రకృతిని ఒక స్పష్టమైన పారదర్శక రీతిలో శాసిస్తుంది.

'నూతనజన్మ' అనటంలోని అంతరార్థం ఆధ్యాత్మిక జీవితంలో, ఆధ్యాత్మిక చైతన్యపథంలో జన్మ నెత్తుట; అనగా వ్యక్తి తనలో ఎంతో కొంత ఆత్మశక్తిని కలిగి వుండి అది వ్యక్తిగతంగ అంతరాత్మ ద్వారా జీవనగమనాన్ని, సృష్టిని నియంత్రించుటను ప్రారంభిస్తుంది. కాని, దివ్యచైతన్య భూమికలో ఆత్మశక్తి యావత్ ప్రపంచం పైన, దాని వివిధ రూపాల పైన, వైఖరుల పైన, తనంత తానుగ చైతన్యవంతంగ అతి సహజమైన రీతిలో ఆధిపత్యం వహించగలదు.

వ్యక్తి జీవితంలో ఇదమిద్ధంగా తేల్చగలిగేది ఆత్మశక్తి. ఎంత కాలం వ్యక్తి ఆత్మశక్తిని కేవలం మాటలకే పరిమితం చేస్తాడో, అతని దృష్టిలో అది ఎక్కడో చదివిన విషయంగా మిగిలిపోతుందో, అతనికి దాని ఉనికిని గురించి ఒక అస్పష్టమైన అవగాహన తప్ప చైతన్యవంతమైన వాస్తవజ్ఞానం లేదో, దాని అర్థం అతనికి జన్మతః ఆత్మశక్తి లేదని, జన్మతః అతనికి ఆత్మశక్తి ఉన్నట్లయితే, అది మరింత ధృఢతరమౌతుంది, సజీవంగా స్పందిస్తుంది. మరింత వాస్తవికతను, భౌతిక ప్రపంచాన్ని మించిన స్పష్టతను సంతరించుకుంటుంది. జీవుల మధ్య తేడాను ప్రధానంగ సృష్టించేది ఇదే. ఎప్పుడైతే అది తనంతట తాను వాస్తవరూపం దాలుస్తుందో — నిజమైన ధృఢమైన స్థితి, స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోగల వాతావరణం — అప్పుడు వ్యక్తి తాను ఆవలి ఒడ్డుకు చేరుకున్నానని తెలుసుకుంటాడు. కాని అది అస్పష్టంగా ఉన్నంత కాలం — దాన్ని గురించి విన్నావు, దాని ఉనికి నీకు తెలిసింది కాని దాని వాస్తవికత నీకు అంతుబట్ట లేదు — నూతన జన్మ ఇంకా పొందలేదని అర్థం. ఎంత కాలం నీకు నీవు ఇలా చెప్పుకుంటావో "ఔను. దీనిని నేను చూడగలను, నేను పడుతున్న బాధ, నన్ను పీడించే ఆకలి, నాకు మత్తుగొలిపే నిద్ర, ఇదంతా సత్యం, ఇదంతా వాస్తవం...." (శ్రీమాత నవ్వుతారు) దాని అర్థం నీ వింకా ఆవలి ఒడ్డుకు చేరలేదని, నీకు జన్మతః ఆత్మశక్తి లేదని.

(నిశ్శబ్దం)

నిజానికి మనుష్యులలో అధిక శాతం ఖైదీల వంటి వారు. ద్వారాలు, కవాటాలు అన్నీ మూయబడి ఉన్నందున ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు; సహజమే

కదా. మూసిన ద్వారాలను, కవాటాలను తెరిచే బీగం వారి వద్దనే ఉంటుంది కాని దానిని వాడరు.... ఒకప్పుడు ఆ బీగం వారి వద్దనే ఉన్నదనే విషయం వారికి తెలియదు. కాని, వారికి తెలిసిన చాలా కాలం వరకు, ఆ విషయం వారికి తెలియపరచిన తదుపరి కూడ ఆ బీగాన్ని వాడుటకు సందేహిస్తారు. ఆ బీగంతో మూసివున్న ద్వారాలు, కవాటాలు తెరుచుకుంటాయో లేదో లేక అసలు వాటిని తెరవటం మంచిదో కాదో అనే సందిగ్ధావస్థలో వుండిపోతారు. 'ఏమైతేనేం, అది మంచిదే కావచ్చు" అని అనుకున్నప్పటికీ ఏదో కొంత భయం; "ఈ ద్వారాలు, కవాటాలు తెరిస్తే ఏం జరుగుతుంది?".... ఆ భయం వారిని వీడదు. ఆ వెలుగులో, ఆ స్వేచ్ఛలో వారిని వారు కోల్పోతారేమోనని భయం వారిని పీడిస్తూంటుంది. 'వారికి వారుగ' నే ఉండాలనే వారి అభిలాష. వారి దంభమును వారి బానిసత్వమునే ఇష్టపడతారు. వారిలో ఉన్నదేదో ఒకటి దానిని ఇష్టపడుతుంది. దానినే అంటిపెట్టుకుని ఉండాలనుకుంటుంది. హద్దులు మీరితే మనుగడ అసాధ్యమనే ఊహలోనే కొనసాగుతారు.

అందుకే ఈ సుదీర్ఘ పయనం, అందుకే ఈ కష్టం. నిజంగా ఎవరైనా వారి బ్రతుకుకు ముగింపు పలకడానికి ఒప్పుకుంటే, అంతా ఎంతో సులభతరమౌతుంది, వేగవంతమౌతుంది, తేజోమయమౌతుంది, ఆనందమయమౌతుంది — కాని, మనుషుల మదిలో మామూలుగ మెదిలే లౌకిక భావనలకు అనుగుణంగా కాకపోవచ్చు. వాస్తవానికి పోరాటాన్ని ఆనందించనివారు బహు కొద్దమంది. రాత్రి లేమిని అంగీకరించె 'వారు కూడ కొద్దిమందే. వెలుతురు చీకటికి వ్యతిరేకమని తప్ప మరో విధంగా భావించే వారుండరు. ఛాయ లేని చిత్తరు వుండదు. పోరాటం లేని విజయం ఉండదు. బాధ లేని ఆనందం ఉండదు. వారి భావన అది. ఆ విధంగా భావిస్తున్నంత కాలం ఆత్మశక్తి ఇంకా వారిలో ఉద్భవించలేదన్న మాట.

(ఆశ్రమ క్రీడాప్రాంగణంలో బుధవారపు సాయంకాల తరగతులలో చివరిది)

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఒక ప్రగాఢ సత్యం

అసత్య దోష పరిహారార్థం
కల దొక ఉన్నత మార్గం

చైతన్యంలో దైవసాక్షాత్కారం
ధిక్కరించే తిరస్కార భావం
మనకై మనమే చేయాలి నయం

అదే ఏకైక పరిష్కారం

(శ్రీమాత సందేశం, 31 డిసెంబర్ 1972)

అవును, అదే నేను నొక్కి చెప్పేది. అది పరమసత్యం, పరమసత్యం. అర్థం చేసుకోవడం అంత తేలిక కాదు, కాని అది ఒక ప్రగాఢ సత్యం.

మనలో దైవసాక్షాత్కారాన్ని అడ్డుకునేది, అపభ్రంశపరచేది, మరుగున పడేసేది అంతా: అదే అసత్యం.

అన్ని వేళలా నేను చేస్తున్నది ఇదే — ప్రతిదినం, దినమంతా, నేను ఇతరులను చూసే సమయంలో కూడా — కేవలం అందులోనే ఉంది జీవిత పరమార్థం.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

శుక్రవారపు తరగతుల్లో ఆఖరి ప్రసంగం (5-12-1958)

సాధనాపథంలో ముందుకు పోవడానికి పనికివచ్చే అత్యంత శక్తివంతమైన ఉపాధులు

వారు దేవుడు లేడనే విషయాన్ని ఎంతో హేతుబద్ధంగా తర్కవితర్కాలతో నాకు నిరూపించి ఒప్పించారు, నేను వారిని విశ్వసించాను. తరువాత నేను దైవాన్ని

చూశాను. ఎలాగంటే ఆయనే వచ్చి నన్ను ఆలింగనం చేసుకున్నాడు. ఇప్పుడు నేను దేనిని విశ్వసించాలి, వారి హేతుబద్ధతనా లేక నా సొంత అనుభవాన్నా?

శ్రీఅరవిందులు: తలపులు — స్ఫూర్తులు

శ్రీఅరవిందులు ప్రశ్న వేయటం లేదు, నర్మగర్భంగా చేస్తున్న వ్యంగ్యోక్తి. ఇది మనస్సులోని హేతుబద్ధత ఎంత మూర్ఖమైనదో, తనకు తెలియనిదాని గురించి ఏ రకంగా మాట్లాడవచ్చుననేదానిని ఎలా ఊహిస్తుందో స్పష్టంగా తెలియజేస్తుంది. అంతకు మించి మరేమీ లేదు.

మనస్సుతో మీరు దేనినైనా నిరూపించగలరు. మీరు దానిని ఏ విధంగా వాడుకోవాలో తెలిసి, హేతువు మీదను, అనుమానించి సిద్ధాంతం చేయగలగడం మీదను ఆధిపత్యం సంపాదించి ఉంటే, మీరు దేనినైనా నిరూపించగలరు. నిజానికి విశ్వవిద్యాలయాలలో మనస్సు ఎటైనా ఆలోచించడానికి ఒక అభ్యాసం చేయిస్తారు, ఒక సిద్ధాంత వ్యాసం ఇచ్చి, దాని నిరూపణను సమర్థించమంటారు. వెనువెంటనే అంతే తీవ్రతతో దాని మీద విరుద్ధవాదంతో దాని అసత్యతను నిరూపించమంటారు, దాని ఫలితంగా రెండు వాదాలను అధిగమించి, వాటి మధ్య సంయోజనం కుదర్చగల రని ఆశిస్తారు.

ఆ విధంగా, ఒకసారి దేనినైనా నిరూపించవచ్చుననే విషయాన్ని ఒప్పుకుంటే, దాని వలన, హేతువు ఎటువంటి మార్గదర్శనం చేయలేదనే విషయం అర్థం అవుతుంది. ఎందువల్లనంటే మీరు ఒక దానిని నిరూపించి, వెనువెంటనే దాని వ్యతిరేకతను కూడా నిరూపించడం జరిగితే, మీ నిరూపణలు ఎందుకూ కొరగానివనే విషయం తేటతెల్లం అవుతుంది.

ఒక అనుభవం వచ్చింది. అది ఒక వినమ్ర హృదయానికి, ఒక చిత్తశుద్ధితో కూడిన నిజాయితీకల ప్రకృతికి, నిజాయితీతో కూడిన అనుభవమేనని తెలిసిన ప్రకృతికి, అది కోరికతో లేదా మానసిక వాంఛామయ ఆశయంతో లేనిదానిని ఉన్నట్లుగా ప్రకటించే అసత్యం కాకుండా, ఆత్మ నుంచి తనంత తానుగా తటాలున వచ్చిన కదలికల మూలంగా సంభవించినదైతే, ఆ అనుభవం పూర్తిగా ఒప్పుకుని తీరేదే అవుతుంది. అనుభవాన్ని పొందాలనే కోరికతో గాని లేదా వాంఛామయ ఆశయంతో తనకు తాను అధికుడననే తలంపుతో దానితో కలిసిపోయినందువల్ల గాని అది దాని విశ్వాసపాత్రతను కోల్పోతుంది. అలాంటిదేదో నీలో ఉన్నట్లయితే, జాగరూకతతో మెలగాలి.

కారణం కోరికలు, ప్రగాఢ వాంఛలు అనుభవాన్ని భంగపరుస్తాయి. మనస్సుకు రూపకల్పన చేసే శక్తి ఉంది, చాలా ముఖ్యమైనది, చాలా ఉత్సుకతను రేపేది నీకు కలగాలనే చాలా బలమైన కోరిక ఉంటే, ఆ అనభవం కలిగేటట్లుగా చేయగలవు. పైపైన మాత్రమే చూసేవారి దృష్టికి అది నికార్సయినదే అవుతుంది. ఇవన్నీ పక్కకుపెడితే, నీవు నిజాయితీగాను, చిత్తశుద్ధితోను, మనఃస్ఫూర్తిగాను ప్రత్యేకించి అనుభవాలు అయాచితంగా వచ్చినప్పుడూ, నీ ఆకాంక్ష మూలంగా వాటంతటవే వ్యక్తపరచబడినప్పుడు, ఈ అనుభవాలు సంపూర్ణ అధికారిక ముద్ర కలిగినవిగా నుంటాయి. ఈ ప్రపంచం మొత్తం అవి అర్థం పర్థం లేనివి, భ్రాంతిపూర్వకమైనవని నీకు చెప్పినా, అవేవీ నీ వ్యక్తిగత నమ్మకాన్ని వమ్ము చేయవు. కాని, దీనికి, సహజంగానే నిన్ను నీవు మోసగించుకోకూడదు. నీవు తప్పకుండా చిత్తశుద్ధి, నిజాయితీతో అంతరంగంలో సరళతతో ఉండాలి.

నన్ను ఒకరు "దేవుడు తనను విశ్వసించనివారికి సాక్షాత్కారం ఎలా ఇస్తాడు" అని ప్రశ్న వేశారు. అది చాలా హాస్యాస్పదంగా అనిపించింది. ఎందువల్లనంటే దైవానికి తనను విశ్వసించనివానికి ప్రసన్నుడవటంలో ఆనందం ఉంటే, ఆయన కది చేయకుండా ఉండటానికి నాకే కారణం కనిపించదు.

దానికి బదులుగా, ఆయన హాస్యప్రియుడు, పరమాత్మకు ఒక విధమైన హాస్యప్రియత్వం ఉందని శ్రీఅరవిందులు మనకు చాలా మారులు చెప్పారు. మనమే ఆయనకు గోరీ కట్టి, తప్పనిసరిగా గంభీరముద్ర వేస్తాము. ఆయన తనను విశ్వసించని వారి దరికి వచ్చి ఆలింగనం చేసుకోవటంలో ఎంతో వినోదం పొందుతాడు. "దేవుడు లేడు, నేను ఆయనను విశ్వసించను, అదంతా అసత్యం, అజ్ఞానం...." అని ముందు రోజు ఎవరైనా ఒకరు ప్రకటించి ఉంటే, ఆయన వానిని తన కౌగిలి లోకి చేర్చి, తన గుండెలకు అదుముకుని, అతని మొహంలోకి నవ్వుతూ చూస్తాడు.

మన అల్పమైన, పరిమితమైన బుద్ధికి అనూహ్యమనిపించే వాటన్నింటిలో ప్రతిదీ సాధ్యమవుతుంది.

వాస్తవానికి మనం స్ఫూర్తుల చివరకు వచ్చినప్పుడే మనం వాటిని అర్థం చేసుకోగలం. ఎందువల్లనంటే ప్రతిదానితో, ఏ సత్యం ఆవిష్కరించబడాలో దాని ప్రకారం శ్రీఅరవిందులు మనలను పూర్తిగా వేరే స్థాయిలో కూర్చోపెడతారు. అక్కడ లెక్కకు మిక్కిలిగా బహుముఖాలు, లెక్కలేనన్ని దృక్పథాలు ఉన్నాయి.

ఎవరైనా పరస్పర విరుద్ధమైన విషయాలను తనకు వైరుధ్యతను, పొసగనితనాన్ని ఆపాదించుకోకుండా చెప్పవచ్చును. ప్రతిదీ నీవు ఏ దృష్టితో చూస్తున్నావనేదాని మీద ఆధారపడి ఉంటుంది. ఒక్కసారైనా మనం అన్నింటిని, మనకు అందుబాటులో ఉన్న అన్ని దృక్పథాలలో కేంద్రబిందువై సత్యం చుట్టూ చూచి ఉండినట్లయితే, అప్పటికిని కూడా మనకు కేవలం అసలైన దానికంటె చాలా తక్కువ అస్పష్టంగా దృగ్గోచరమయి ఉండవచ్చు; ఆ మహాసత్యం ఒక్కసారిగా అన్ని వైపుల నుంచి మనలను తప్పించుకుపోవడం తథ్యం. కానీ, బాగా గమనించతగిన విషయం ఏమిటంటే ఒకసారి దైవంతో మనకు ఒక్క స్పర్శానుభవం సిద్ధించితే, అదీ నిజంగా, దానంతటదే తటాలను చిత్తశుద్ధితో కలిగిన అనుభవమైతే, ఆ క్షణంలో ఆ అనుభవంలో ప్రతి దానిని తెలుసుకుంటూ, ఇంకా ఎక్కువ కూడ తెలుసుకుంటాం. అందువల్లనే ఆ అనుభవాలు పొందే సామర్థ్యాన్ని కలిగి ఉండా లంటే, తెలుసుకున్నది కొద్దిపాటిదైన ప్పటికీ పూర్తి చిత్తశుద్ధితో తెలుసుకుని జీవించాలి. జ్ఞానం అనుభవం ద్వారా పొందాలి, మానసికంగా కాదు, ఎందువల్లనంటే నీవు వీటిలో జీవిస్తావు. ఎందువల్లనంటే అవి నీ అస్తిత్వంలో, చైతన్యంలో భాగం అయిపోతాయి కాబట్టి.

నీకు తెలిసినది కాస్తయినా దానిని ఆచరణలో పెట్టగలిగితే అది ఇంకా ఎక్కువ తెలుసుకోవటానికి మార్గం సుగమమం చేస్తుంది. ఎంత స్వల్పమైనా దానిని నిజంగా ఆచరణలో పెడితే సాధనా మార్గంలో ముందుకు పోవటానికి అది అత్యంత శక్తివంతమైన సాధనం. ఉదాహరణకు, ఒక పని చేయకూడదని నీకు తెలిస్తే, అది ఎప్పటికీచేయకూడదు. నీవు ఒక బలహీనతను, నీ అస్తిత్వంలో ఒక అశక్తతను గుర్తిస్తే, అది పునరావృతం కావడాన్ని నీవు అనుమతించకూడదు. ఎప్పుడైనా ఒక్క క్షణం పాటైనా ఒక అగ్నిశిఖ లాంటి ఆకాంక్షలో నీవు ఏ విధంగా ఉండాలనేదాని దర్శనం కలిగితే, అలా అయి తీరటాన్ని నీ వెప్పుడూ విస్మరించకూడదు.

కొంతమంది తమ అశక్తతను గురించి ఎల్లప్పుడూ మొత్తుకుంటూ ఉంటారు. దాని వల్ల ఏమీ ప్రయోజనం లేదు. నీవు గనక ఒకసారి నీలో నిజంగా నీ బలహీనతను చూస్తే, నిజంగా, చిత్తశుద్ధితో అర్థం చేసుకుంటే, నీవు ఆ విధంగా ఉండకూడదని నీకు అనిపిస్తే, దానితో ఇక నీ మొత్తుకోలు ఆగిపోవాలి. అప్పటి నుంచి ప్రతి నిత్యం దానికై ప్రయత్నించడంతో పాటు, ఇచ్ఛను పెంచుకుంటూ, అహర్నిశలు ప్రతిక్షణం జగరూకతతో ఉంటూ, తెలుసుకున్న తప్పు తిరిగి పునరావృతం కావటానికి

ఏ విధంగానూ అనుమతి నొసగకూడదు. అజ్ఞానం వల్ల జరిగే తప్పు, జడచైతన్యం వల్ల జరిగే తప్పు అది నిశ్చితంగా దురదృష్టకరమే. కాని దానిని ఋజుమార్గంలో పెట్టవచ్చును. కాని, చేయకూడదని తెలిసీ, అదే పనిగా అదే తప్పును చేస్తూ ఉండటమనేది భీరువు లక్షణం, దాని నెప్పుడూ మనలో మనం ఎంత మాత్రం అనుమతించకూడదు..

"ఓహ్! మానవ స్వభావం ఇంతే, ఓహ్! మనం అచేతనలో ఉన్నాం, ఓహ్! మనం అజ్ఞానంలో ఉన్నాం," ఈ మాటలన్నీ సోమరితనాన్ని, బలహీనతను సూచి స్తాయి. ఈ సోమరితనం, బలహీనతల వెనకగా బ్రహ్మాండమైన దుష్టబుద్ధి ఉంది. తెలిసింది కదా!

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే, చాలామంది నా ముందు ఈ విధమైన వ్యాఖ్యానాలు చేశారు. అది ఎప్పుడూ తమను తాము సమర్థించుకునేదే, "ఓహ్! మనకు చేతనయినంత చేస్తున్నాం". అది సత్యదూరం. ఎందువల్లనంటే నీవు చిత్తశుద్ధితో ఉంటే, నీవు ఒకసారి దానిని దర్శించడం జరిగితే — నీవు చూడనంత కాలం దానిని గురించి మాట్లాడటానికేమీ లేదు — కాని నీవు చూసిన ఆ క్షణం, అది భగవదనుగ్రహం ప్రసరించిన క్షణం. ఒకసారి నీవు భగవదనుగ్రహాన్ని అందుకుంటే, నీకు ఇక ఏ మాత్రం దానిని మరచిపోయే హక్కు లేదు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

మానవజాతికి సహాయం

రెండు ప్రసిద్ధమైన ఉదాహరణలు

పూర్ణయోగ సాధకులకు, మానవ సంక్షేమం వారి జీవన విధానం యొక్క పర్యవసానం గానో, ఫలితంగానో సంభవించవచ్చు. అంతే కాని అది వారి లక్ష్యం కారాదు. మానవుల స్థితిగతులను అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేసినా, ఎందరో ఉత్సాహంతో వారి సంపూర్ణ శక్తిని కూడదీసుకుని శ్రమించినా, చివరికి వారి ప్రయత్నాలన్నీ బాధాకరంగా విఫలమగుటకు ఖచ్చితమైన కారణం పరివర్తన చెందని మానవజీవనం. ఆ పరివర్తన సంభవించాలంటె దానికి ముందుగా సంసిద్ధతను తెలిపే ఓ మార్పు

అనివార్యం. ఆ విధంగా పరివర్తన చెందిన మానవచైతన్యం లేదా ఆ పునాది వేయగల విశిష్ట వ్యక్తుల యొక్క కృషి మాత్రమే మరింత విస్తారంగా దాన్ని సాధించగలదు.

ఈ విషయానికి తరువాత కాని, ముగింపులో కాని తిరిగి వద్దాం. నేను ముఖ్యంగా నిజమైన పరోపకారబుద్ధి గల ఇద్దరు నిష్ణాతులను ఉదాహరణగా తీసుకున్నాను. వారిని గురించి నీకు చెప్పాలనుకుంటున్నాను.

వారు అత్యంత విశిష్టమైన ఇద్దరు వ్యక్తులు. అత్యంత భిన్నమైన ఆలోచన, ఆచరణ కలిగిన, దయార్ద్రహృదయులైన సున్నిత మానవ ఆత్మలు వారిరువురు. మానవ దుఃఖాన్ని చూసి ఒక విధమైన మానసిక దిగ్భ్రాంతికి గురైయ్యారు. వారు ఈ మానవుల దుఃఖనివారణకు కావలసినదాన్ని గురించి కనుక్కోవడానికే జీవితమంతా ధారపోశారు. చివరికి ఇద్దరూ కారణం కనుక్కోగలిగామనే విశ్వసించారు. కాని వారిద్దరి పరిష్కారం పరస్పర విరుద్ధమైనది. అంచేత రెండూ వాటి స్థానాల్లో అసంపూర్ణమూ, పాక్షికమూ. అందుకే ఇద్దరూ ఈ మానవులను దుఃఖాన్నించి, బాధల నించి విముక్తి కల్గించడంలో విఫలమయ్యారు.

అందులో ఒకరు తూర్పుకు చెందిన రాజకుమారుడు సిద్ధార్థ, ఆ తరువాతి కాలాల్లో బుద్ధుడిగా పిలవబడ్డాడు; మరొకరు పడమరకు చెందిన శ్రీ విన్సెంట్. అతడు మరణించాక 'సెయింట్ విన్సెంట్ ద పాల్' గా పేరుపొందాడు. నిజానికి వీరిద్దరూ మానవచైతన్యానికి రెండు ధృవతారలుగా నిలిచారు. వారు అందించిన సహాయం కూడా పూర్తిగా భిన్నమైనది. ఇద్దరూ ఆత్మ ద్వారా విముక్తిని పొందడం నమ్మినవారే, ఆ సర్వ సమగ్రమైన, ఆలోచనకు అందని ఆ శక్తినే ఒకరు దైవంగాను, ఇంకొకరు నిర్వాణంగాను పిలిచారు.

విన్సెంట్ ద పాల్ తీవ్ర నమ్మకమున్నవాడు. అందుకే తన అనుయాయులకు వారు వారి ఆత్మను రక్షించుకోవాలని చెప్పేవాడు. అయితే మానవ దుఃఖంతో సంపర్కం కలిగాక, ఆత్మను తెలుసుకోవాలంటె దాన్ని గమనించే సమయం కావాలని త్వరలోనే కనుక్కున్నారు. రాత్రి, ప గలు అనక బ్రతుకు తెరువుకని నిరంతరం శ్రమించే శ్రమజీవులకు ఆత్మ గురించి ఆలోచించే సమయం ఎక్కడిది? దయగల అతని హృదయ నిరాడంబరత్వంలో అతడు ఒక ఆలోచన కొచ్చాడు. అది పేదవారికి అత్యంత ప్రాథమిక అవసరాలు తీరడానికి, అవసరానికి మించిన ధనం ఉన్న ధనవంతులు సహాయం అందిస్తే, ఈ దురదృష్టవంతులకు కాస్త సమయం దొరికి మరింత

మంచిగా జీవించడానికి మార్గం దొరుకుతుందని భావించాడు. అతడు పుష్కళమైన ద్రవ్యవితరణ ఉత్తమమూ, సార్థకమూ అయిన సామాజిక సేవగా విశ్వసించాడు.

అధిక సంఖ్యాకులకు వ్యక్తిగతమైన సహాయం అందించగలిగితే, అది మరింత విస్తరించి, పెరిగి, అసంఖ్యాకులకు వారి బాధల్ని తగ్గించగలదని అతడు నమ్మాడు. అయితె అది ఓదార్పు మాత్రమే, నివారణ కాదు.

అతని సమర్పణ, త్యాగనిరతి, అతడు దీక్షతో, ధైర్యంతో ఆ కార్యసాధనకు పాటుపడిన తీరు అతడు మానవచరిత్రలో ఓ గొప్ప ఔదార్యంతో చక్కని హృదయ సౌందర్యంగల వ్యక్తిగా గుర్తించబడ్డాడు. అయితే అతని కృషి నిరాశ్రయులని, నిస్సహాయులని రెట్టింపు చేసింది తప్ప తగ్గించలేదు. నిస్సందేహంగా ఓ గొప్ప ప్రవక్తగా అతని ప్రభావం ధనికుల్లో దాతృత్వగుణాన్ని పెంచడానికి తోడ్పడింది. ఇది దీనజనుల కంటె, దాతృత్వం చేయగల ధనికులకే ఎక్కువ ఉపయోగపడింది.

చైతన్యానికి మరో అంచున శుద్ధమైన కారుణ్యం కల్గిన బుద్ధుడు నిలిచాడు. అతడికి జీవితంలోంచి ఉత్పన్నమైన దుఃఖం — జీవితాన్ని నిర్మూలించినపుడే నిర్మూలించబడుతుంది. ఎందుకంటె ఈ ప్రపంచము, ప్రాణము, కోరిక వల్ల పుట్టిన అజ్ఞానఫలం. కోరికను నిర్మూలించి అజ్ఞానాన్ని విసర్జించాలి. అపుడు నీకు ఈ దుఃఖభరితమైన ప్రపంచం శూన్యమౌతుంది. దానితో బాధ, దైన్యం సమసిపోతాయి. ఆధ్యాత్మిక ఆకాంక్షతో కూడిన గొప్ప కృషితో, నిశ్శబ్ద ఏకాగ్రతతో అతడు తన శిక్షణను విస్తృతం చేశాడు. ముక్తి కోసం ఆత్రంగా ఎదురు చూసినవాళ్ళకి ఎంతో ఉన్నతమైన, ఇంతవరకూ మానవాళికి అందని సమర్థవంతమైన శిక్షణ నందించగలిగాడు.

కోట్లకొలది జనులు అతడి సిద్ధాంతతాన్ని విశ్వసించారు. అయితే దాన్ని ఆచరణలో పెట్టగల సామర్థ్యం కల్గిన వ్యక్తుల సంఖ్య చాలా స్వల్పమే. దీనివల్ల ఈ భూమ్మీద పరిస్థితి ఏమాత్రం మారలేదు సరి కదా మానవుల బాధాతప్త జీవనంలో ఏ మార్పు రాలేదు.

ఏది ఏమైనా ప్రజలు ఆ మొదటి వ్యక్తిని సెయింట్‌గాను, రెండవ వ్యక్తిని దైవ సమానంగాను భావించి వారి ఆరాధన, కృతజ్ఞతలను వ్యక్తపరిచారు. చాలా కొద్దిమంది మాత్రమే వారిచ్చిన పాఠాన్ని, ఆ ఉదాహరణని నిజాయితీగా ప్రయత్నించి ఆచరణలో పెట్టారు. నిజానికి కృతజ్ఞత చూపడమంటె ఆచరణలో పెట్టడమే. అదే నిజంగా ప్రయోజనాన్ని సాధించగల మార్గం. కాని, అది అధిక సంఖ్యలో సంభవించినా,

మానవ జీవన పరిస్థితులు అనుకున్నంతగా మెరుగుపడి ఉండేవి కావు. ఎందుకంటె సహాయపడడమంటె పూర్తిగా నివారణ చేయడంతో సమానం కాదు. అలాగే, తప్పించు కొనుట, వశపరచుకొనుట కాదు. నిజానికి భౌతికమైన కష్టాలను ఉపశమింపచేయడానికి విన్సెంట్ ద పాల్ సూచించిన పరిష్కారం మానవుల బాధల్ని, కష్టాల్ని నివారించడానికి ఏమాత్రం సరిపోదు. ఎందుకంటె మానవుల బాధలన్నీ భౌతికమైన నిస్సహాయత వల్ల వచ్చినవి కాదు. అది ఆర్థిక సహాయం వల్ల నివారణ చెందదు. అది దానికి బహుదూరం. శారీరకమైన సంతులనం, ఆరోగ్యం తప్పనిసరిగా శాంతి, సంతోషాల నిస్తాయని చెప్పలేం. అలాగే బీదతనం కూడా దుఃఖహేతువు కానక్కర్లేదు. దానికి ఉదాహరణ మనకు అన్ని దేశాల్లోనూ, అన్ని కాలాల్లోనూ ఉన్న సత్పురుషులు. వారు స్వయంగా ఆ పేదరికాన్ని ఆహ్వానించి, ఆ నిరాడంబర, నిరుపేద స్థితి సంపూర్ణ శాంతిసంతోషాలకి జన్మస్థానంగా భావించారు. దానికి విరుద్ధమైన భోగ భాగ్యాలు, సిరిసంపదలు పుష్కలంగా ఉన్నా, అవి బాధను, విచారాన్ని దూరం చేయడానికి అశక్తమైనవి.

బుద్ధుని పరిష్కారమైన పలాయనం కూడా ఈ సమస్యకు ఆచరణీయమైన నివారణను ఇవ్వలేదు. ఒకవేళ అసంఖ్యాకమైన వ్యక్తులు ఈ క్రమశిక్షణను అభ్యసించి, ఆచరించి, చివరికి విముక్తిని పొందినా, అది ఏ విధంగాను ఈ భూమ్మీద బాధల్ని నివారించి, నిర్వాణపథాన్ని పాటించలేని వ్యక్తులకు ఉపయోగపడలేదు.

నిజానికి అసలైన ఆనందం అన్నది ఎవరైనా, ఏ పరిస్థితిలో ఉన్నా, ఆనందంగానే ఉండగలిగిన ఒక స్థితి. అది ఈ బాహ్యపరిస్థితుల వలన ప్రభావితం కాని ప్రదేశాల నించి వస్తుంది. అయితే ఈ ఆనందం కూడా కొద్దిమందికే అందగలిగినది; అధిక సంఖ్యాకులు ఇంకా ఈ ప్రాపంచిక పరిస్థితుల ప్రభావంలోనే ఉన్నారు. ఓ పక్క మన మానవచైతన్యంలో మార్పు వచ్చి తీరాలి అనునది ఒక తిరుగులేని ఆవశ్యకత; మరో పక్క ఒక సమగ్రమైన పరివర్తన ఈ లౌకిక వాతావరణంలో జరిగితే కాని, మానవ జీవనపరిస్థితులు సార్థకమైన మార్పును పొందలేవు.

రెండు విషయాల్లోనూ నివారణోపాయం ఒక్కటే. ఒక నూతన చైతన్యం మనిషి లోను, పృథ్వీతత్వంలోను అభివ్యక్తి కావాలి. ఒక నూతన శక్తి, ప్రకాశం, ఆ అతిమానస చైతన్యంతో పాటు అవరోహణ చెందినపుడే, ఈ దుఃఖంలో, బాధల్లో, కష్టాల్లో మునిగి వున్న మానవుడు ఉద్ధరించబడతాడు. అతిమానసచైతన్యం ఈ పృథ్వి కోసం తెచ్చే

ఆ ఉన్నత, శుద్ధ, సత్య ప్రకాశమే ఆ రూపాంతరం అనే మాహాద్భుతాన్ని సాధించ గలదు.

ప్రకృతి కూడా ఈ నూతన అభివ్యక్తి కోసం శ్రమిస్తోంది. అయితె ఆమె దార్లు కఠినమైనవి, ఆమె నడక కుంటుపడుతూ అస్పష్టంగా సాగుతుంది. మనకు వాస్తవమైన ఆమె ప్రణాళిక గ్రహించడం కష్టం. ఆ విధమైన గమనం ఆమెది. అయితే ఒక్కటి మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మానవజాతి నించి కొత్తజాతిని తీసుకురావాలన్న ఆమె ఆకాంక్ష అది; మృగం నించి మానవుడు వచ్చినట్లుగా మనిషి నించి అతిమానస జాతి ఆవిష్కరణ. ఈ రూపాంతరం యొక్క ఆగమనం, నూతనజాతి ఆవిర్భావం, ప్రకృతి తన సహజరీతిలో తడుముకుంటూ ప్రయత్నించినపుడు శతాబ్దాలు పడుతుంది. అయితే ఇవి వివేకవంతమైన మానవ సంకల్పంతో అతి తక్కువ వ్యవధిలో, తక్కువ నష్టంతో, సాధ్యం చేసుకోవచ్చు.

ఇక్కడే పూర్ణయోగం యొక్క ఆవశ్యకత, ఉపయుక్తమవుతుంది. కారణం, యోగం ఒక గాఢమైన ఏకాగ్రతతో, సాధనతో నూతన సృష్టిపై మౌలికమైన రూపాంతరంపై కాలం విధించే ఆలస్యాన్ని అధిగమించె శక్తి నివ్వగలదని అర్థం.

పూర్ణయోగమంటె ఏ మాత్రం పట్టించుకోకుండా దాని విధికి దాన్ని వదిలేసి భౌతిక ప్రపంచం నించి పారిపోవడం కాదు. లేదా ఒక నిశ్చయమైన మార్పు నాశించకుండా ఈ భౌతిక జీవితాన్ని యథాతథంగా అంగీకరించడం కాదు, లేదా ఈ ప్రపంచమే దైవసంకల్పం యొక్క తుది అభివ్యక్తిగానూ, అంగీకరించడం కాదు.

పూర్ణయోగలక్ష్యం చైతన్యం యొక్క అన్ని అంతస్థులను అధిరోహించడం, సామాన్యమైన మానసిక చైతన్యం నించి, అతిమానస దివ్యచైతన్యాల వరకు ఆరోహణ పూర్తి చేశాక, తిరిగి ఈ భౌతిక ప్రపంచంలోకి అవరోహించి గెలుచుకున్న ఆ అతి మానసశక్తి మరియు చైతన్యంతో దాన్ని మేళవించడం; ఆ విధంగా క్రమంగా ఈ పృథ్వి మార్పు చెంది, అతిమానస దివ్యప్రపంచంగా మారడానికి సహకరించడం.

మానవజీవితంలో సాధించవలసినవన్నీ సాధించినా, ఇంకా తృప్తిచెందనివారికి, అంటే జీవితం అందించలేని విస్తృత విషయాలను ఆశించేవారికి — అలాంటివారికి ముఖ్యంగా పూర్ణయోగం ఉద్దేశించబడింది. ఎవరు ఆ తెలియనిదాని కోసం, సమగ్రత కోసం ప్రాకులాడుతారో, తపన పడుతారో, ఎవరు వారి దుఃఖపూరితమైన ప్రశ్నలకు

ఖచ్చితమైన సమాధానం లభించక పరితపిస్తారో అలాంటివారే ఈ పూర్ణయోగ సాధనకు అర్హులు.

మానవజాతి యొక్క విధిని పట్టించుకున్నవారు వేయగల కొన్ని ప్రాథమికమైన ప్రశ్నలున్నాయి. ఇప్పుడున్న వివరణలో, సూత్రాల్లో వారికి తృప్తికరమైన సమాధానాలు లభించక, వారు ఈ ప్రశ్నలు తప్పనిసరిగా వారికి వారు వేసుకుంటారు. అవి ఈ క్రింది విధంగా ఉండవచ్చు.

మరణించడానికే అయితే, పుట్టడం ఎందుకు?

బాదలు పడడానికే అయితే, జీవించడం ఎందుకు?

విడిపోవడానికే అయితే, ప్రేమించడం ఎందుకు?

పొరపాట్లు చేయడానికే అయితే, ఆలోచించడ మెందుకు?

తప్పులు చేయడాకే అయితే, క్రియాచరణ ఎందుకు?

వీటన్నింటిని సమాధానపరచే జవాబు — ఇప్పుడు నువ్వు చూస్తున్నది ఇలాగే ఉండదని, ఇది దీని వాస్తవం కాదని, ఈ పరస్పర వైరుధ్యాలు తప్పనిసరి కానివి మాత్రమే కాదు. అవి సరిదిద్దగలిగినవనీ ఏదో ఒక రోజున పూర్తిగా అంతరించిపోగలవని. కారణం ప్రస్తుతం కనిపిస్తున్నది ఈ ప్రపంచ నిజస్వరూపం కాదు. ఈ పృథ్వి పరివర్తనా కాలంలో ఉంది, అది మానవుల అల్పచైతన్యానికి సుదీర్ఘంగా కనిపిస్తుంది. కాని అది శాశ్వత చైతన్యంలో అత్యంత అల్పమైన కాలం. అతిమానస చైతన్య ఆవిష్కరణతో ఈ కాలం ముగింపు కొస్తుంది. అప్పుడు వైరుధ్యాలు, సామరస్యత తోను, ప్రతికూలత సమన్వయంతోనూ మార్పుచెందుతాయి.

అతిమానవుడు వ్యక్తిగా మన ముందు తన నిజరూపంలో నిలిచి, తన నిజస్వరూపమేమిటో మనకు తెలియపరచేదాకా, వివేకము, సత్ సంకల్పము కల్గిన ప్రతి మానవుడు తాను ఏది అత్యంత సౌందర్యభరితమైన, అత్యంత ఉన్నతమైన, సత్యమైన, శుద్ధమైన, ప్రకాశవంతమైన, గొప్పదిగా భావించిన ఆ మూర్తిని తనలో సాక్షాత్కరింపచేసుకుందుకు సాధన చేయాలి. ఈ ప్రపంచం యొక్క అభ్యున్నతికి ఆ విధంగా మానవుడు దోహదపడగలడు.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

Vol. 41, No. 7 Rs. 15.00 Registered: TN/PMG(CCR)/39/09-11
July 2011 WPP No. 35/09-11

AKHILA - Akhila Bharat Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)
Published on 1st day of every month.

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Flower on the cover:
Aspiration of the Mind for the Supramental Guidance
Spiritual significance and explanation given by the Mother

Editor: A. Kailasapati
Published by Pradeep Narang on behalf of Sri Aurobindo Society,
No. 1, Rangapillai Street, Puducherry - 605001
Printed by Swadhin Chatterjee at Sri Aurobindo Ashram Press,
38, Goubert Avenue, Puducherry - 605001

Single copy: Rs. 15 **Annual Subscription: Rs. 150 (in India)**

A Monthly Published by
SRI AUROBINDO SOCIETY, PUDUCHERRY - 605002



అఖిల

అఖిల భారత పత్రిక

ఆగస్టు 2011

విషయసూచిక

'సావిత్రి' - శ్రీమాత వ్యాఖ్యలు

'సావిత్రి' — శ్రీఅరవిందుల వ్యాఖ్యలు

అనుబంధము

‘సావిత్రి’ — ఒక దివ్య భవ్య గీతం

‘సావిత్రి’ మానవ సమాజ భవిష్య లక్ష్యసిద్ధి వైపు సాగే పురోగమనంలో మార్గదర్శనం చేసే మహాద్భుత దివ్య భవ్య గీతం.

*

‘సావిత్రి’
శ్రీఅరవిందులు దర్శించిన
పరమోన్నత దివ్యజ్ఞానం

*

(‘సావిత్రి’ ని గురించి)

1. రచించిన వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక అనుభవాల రోజువారీ చిట్టా.
2. సమగ్రసాధనను అనుసరించగోరేవారికి మార్గదర్శి ఉపకరించే పూర్ణయోగ పద్ధతి.
3. దివ్యత్వం వైపు ఎదిగే ఆరోహణాక్రమంలోని పృథ్వీతత్వ యోగం.
4. తాను స్వీకరించిన దేహానికి తనను తాను సంధానపరచుకొనుటకై చేసే ప్రయత్నం లోని శ్రీమాత అనుభవాలు. ఆమె అవతరించిన భూమండలం యొక్క అజ్ఞాన, అసత్య తత్వం.

*

‘సావిత్రి’ యొక్క ప్రాముఖ్యత అపారం.
దాని మౌలిక విషయం సార్వత్రికమైనది.
అది భవిష్యదర్శిని. దాని భావపరిధిలో గడిపే కాలం వ్యర్థం కాదు.

మూలం: శ్రీమాత
అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

'సావిత్రి': రూపాంతరీకరణ మంత్రం

(శ్రీమాత 'సావిత్రి' గురించి శిష్యుడు మోనాసర్కార్ తో చెప్పిన విషయ జ్ఞాపకాలను లిఖితపూర్వకంగా పొందుపరచి, 1967 నవంబరు 5 న శ్రీమాతకు చదివి వినిపించారు. శ్రీమాత ఆ వ్రాతప్రతి చివరి పేజీలో 'ఆశీర్వాదములు' అని వ్రాసి, 5.11.67 తేదీ వేశారు. కిషోర్ గాంధీ అనే మరొక శిష్యునితో శ్రీమాత ఇలా అన్నారు: ఇందులో వ్రాయబడినదంతా మొత్తం మీద యదార్థమనిపిస్తుంది.)

(ఆ విషయమే ఇక్కడ పొందుపరచడమైనది)

'సావిత్రి' ని ఇతర గ్రంథాలను, వార్తాపత్రికలను చదివినట్లుగా చదువకూడదు. బుర్రను ఖాళీగా వుంచి, మనసును శూన్యపరచి, ఇతర ఆలోచన లేవీ లేకుండ చదవాలి; మిక్కిలి శ్రద్ధతో, రిక్తమనస్కుడవై, ప్రశాంతంగా తెరచుకొని ఉండాలి. అప్పుడు పదాలు, స్వరగతులు, స్పందనలు, స్వచ్ఛమైన తెల్లని కాగితం లాంటి మానసంలోనికి సూటిగ చొరబడతాయి. మేధపై వాటి ముద్రను వేస్తాయి. అప్రయత్నంగానే తమను తాము విశదీకరించుకుంటాయి.

ఒక్క 'సావిత్రి' చాలు, నిన్ను మహోన్నత శిఖరాలను అధిరోహింపచేయటానికి. నిజంగా 'సావిత్రి' ని ఒక ధ్యానతత్పరతతో అధ్యయనం చేయటం తెలిసినవారికి అవసరమైన సహాయం అంతా అందుతుంది. ఈ మార్గాన్ని అనుసరించగోరేవారికి, ఇది ఎలా ఉంటుందంటే, ఆ ప్రభువే స్వయంగా వారి చేయి పట్టి, వారిని నిర్దేశిత గమ్యం వైపు నడిపిస్తున్నట్లుగా ఉంటుంది. ఒక సుస్పష్టమైన ఆసరాగా ఉంటుంది. అంతేగాక, ప్రతి ఒక్క ప్రశ్నకు, అది ఎంతటి వ్యక్తిగతమైనదైనా, సమాధానం ఇక్కడ ఉంది. ప్రతి ఒక్క కష్టానికి పరిష్కారం ఇక్కడ లభిస్తుంది. నిజానికి, యోగసాధనకు అవసరమైనదంతా ఇందులో ఉంది....

అందువలన 'సావిత్రి' ఒక దివ్యజ్ఞాన ఆవిష్కరణ, ఒక ధ్యానం అనవచ్చు. అనంతుడు, నిత్యుడు అగు ఆ పరమాత్మకై అన్వేషణగా అభివర్ణించవచ్చు. అమృతత్వంపై ఈ ఆకాంక్షతో దీనిని అధ్యయనం చేసినట్లయితే, ఆ పఠనమే స్వయంగా అమృతత్వానికి మార్గదర్శకమౌతుంది. 'సావిత్రి' పఠనమే నిజమైన యోగసాధన, ఆధ్యాత్మిక ఏకాగ్రత. దైవసాక్షాత్కారానికి అవసరమైనదంతా అందులో లభిస్తుంది.

యోగంలోని ప్రతి మెట్టు ఇందులో పొందుపరచబడినది — ఇతర యోగాలలోని గోప్యాలతో సహా. ఇందులోని ప్రతి చరణంలో ప్రకటితమైనదానిని మనస్ఫూర్తిగ అనుసరించేవారు చివరకు దివ్య చైతన్య యోగ లక్ష్యమగు రూపాంతరీకరణ దశను చేరుకొనుట తథ్యము. నిజానికి అది నిన్ను ఎన్నటికీ వీడని మార్గదర్శి. ఈ మార్గాన్ని అనుసరించగోరేవారికి అది సర్వదా బాసటగ నిలుస్తుంది. 'సావిత్రి' లోని ప్రతి చరణము మానవుని జ్ఞానసంపదనంతా మించిన అతీత శక్తియుతమైన మంత్రం లాంటింది. మళ్లీ మళ్లీ చెప్తున్నాను. మంత్రాక్షరక్రమము ఏ విధంగా వ్యక్తపరచబడింది, ఏ విధంగా పొందుపరచబడిందంటే, ఆ స్వరగతుల లయ, విన్యాస, శబ్దగాంభీర్యత మిమ్మల్ని శబ్ద మూలమైన 'ఓం', ఓంకారం వద్దకు కొనిపోతుంది.

అవును, అంతా అందులో వుంది. మార్మిక తత్వం, గుప్తవిద్య, వేదాంతం, జీవపరిణామ చరిత్ర, మానవ చరిత్ర, దేవతల చరిత్ర, ప్రకృతి చరిత్ర; ఈ విశ్వసృష్టి ఎలా జరిగింది, ఎందుకు జరిగింది, ఏ లక్ష్యసాధన కోసం జరిగింది, దాని భవిత ఏమిటి అనే విషయాలన్నీ అందులో ఉన్నాయి. నీ ప్రశ్న లన్నింటికి సమాధానాలు అందులో ఉంటాయి. సర్వమూ అందులో విశదీకరించబడింది. మానవుని భవితవ్యంతో పాటు ఇంతవరకు తెలియని పరిణామ భవితవ్యం కూడ అందులో వివరించబడింది. వీటన్నింటిని ఆయన సుందరమైన, స్పష్టమైన మాటలలో వ్యక్తపరిచారు. సృష్టి రహస్యాలను ఛేదించగోరే ఆధ్యాత్మిక సాహసికులకు అతి సులభంగ అర్థమగు రీతిలో విశదపరిచారు. కాని వీటిలోని మర్మం చరణాల మరుగున నిగూఢమై ఉంది. దాన్ని కనుగొనాలంటే, వ్యక్తి దానికి తగిన నిజచైతన్య స్థాయికి ఎదగవలసి ఉంటుంది. అన్ని భవిష్య సూచికలతో పాటు జరగబోయే చరిత్ర కూడ సుస్పష్టంగా, అత్యద్భుతంగా ప్రకటించబడింది. శ్రీఅరవిందులు దీనిలో పరమసత్యాన్ని కనుగొనటానికి, దివ్యచైతన్యాన్ని దర్శించడానికి, ఈ విశ్వమనగా ఏమిటి అనే సమస్యకు పరిష్కార మార్గం సూచించారు. అచేతనలోకి ప్రకాశం చొచ్చుకొనిపోయి దానిని పరివర్తన గావించుటకు తాను ద్వారాలను ఎలా తెరిచారో వివరించారు. అజ్ఞానం నుండి విమోచన పొంది ఊర్ధ్వచేతన శిఖరాన్ని ఎలా అధిరోహించాలో సూచించారు. ఈ మార్గంలోని ప్రతిదశను, ప్రతి చైతన్యభూమికను వ్యక్తి ఎలా అధిరోహించాలో, అసలు మృత్యువు అనే అవరోధాన్ని ఎలా అధిగమించి అమృతతత్వాన్ని పొందాలో, సూచించారు. ఈ మార్గం యొక్క వివరాలన్నింటిని ఇందులో విపులంగా చూడవచ్చు.

ఈ మార్గంలో ముందుకు సాగుతున్నకొద్దీ, మానవునికి ఏమాత్రం తెలియని ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తాయి. అదీ 'సావిత్రి' అంటే, అంతే కాదు, మరింకెంతో! 'సావిత్రి' యొక్క అధ్యయనం నిజానికి ఒక అనుభవం. మానవునిలో నిగూఢమై ఉన్న రహస్యాలనే కాక, భవిష్యత్తులో అతనికై పొంచివున్నవాటిని కూడ వారు బహిరంగపరిచారు. ఇదంతా 'సావిత్రి' లోతుల్లోకి తరచి చూస్తే విదితమౌతుంది. కాని వాటిని తెలుసుకొనే జ్ఞానపరిపక్వత వ్యక్తికి ఉండాలి — వివిధ చైతన్య భూమికల అనుభవం, దివ్య చైతన్యానుభవమే కాక మృత్యువును జయించగలిగే అనుభవం కూడ ఉండాలి. అన్ని దశలను ఆయన అందులో పొందుపరిచారు. సమగ్రయోగంలో సమగ్ర పురోగతిని సాధించటానికి వేయవలసిన ప్రతి అడుగును సూచించారు.

ఇవి వారు పొందిన జీవితానుభవాలు, వాస్తవాలు, విశ్వాతీతసత్యాలు. ఒక వ్యక్తి భౌతికంగా సంతోష, విచారాలను ఎలా అనుభవిస్తాడో, ఆ విధంగా వారు వీటిని అనుభవించారు. అచేతనావృత అంధకారంలో మృత్యువు సరసన వారు సంచరించారు. శాపగ్రస్థ ఫలితమైన బాధలను సైతం ఓర్పుతో అనుభవించారు. ఈ రొంపి నుండి, ఈ లోకపు దయనీయ దుస్థితి నుండి బయటపడి ఒక ఉత్కృష్టమైన సమగ్ర సమృద్ధి స్థితిని అందుకొనుటకు సంసిద్ధులయ్యారు. వీటన్నింటిని అధిగమించారు. ఈ దుర్భర పరిస్థితులను, వాటి పర్యవసానాలను, ఏ వ్యక్తికి కనీసం ఊహకందని బాధలను, భౌతికంగా అత్యంత ఓర్పుతో అనుభవించారు. అంతగా బాధపడిన వారు నేటి వరకు ఎవరూ లేరు. ఈ బాధలను దైవసంయోగంతో సమకూరే దివ్యానందంగా మార్చుటకై ఆయన వాటిని ఆహ్వానించారు. ఇది ప్రపంచ చరిత్రలోనే ఒక విశిష్టమైన, అసాధారణమైన, సాటిలేని విషయము. ఇలాంటిది ఇదివర కెన్నడూ జరగలేదు. దివ్యచైతన్య దిశగ ఒక ధృఢవిశ్వాసంతో ఈ అనంత అజ్ఞాతంలో మనం అడుగులు వేయుటకు దారి చూపిన ప్రథముడు ఆయన. మన పనిని సులభతరం చేశారు. 'సావిత్రి' వారి పరిపూర్ణమైన రూపాంతరీకరణ యోగము. పృథ్వీచైతన్యంలో ఈ యోగం ప్రప్రథమంగా ప్రకటితమైనట్లు మనకు కనిపిస్తుంది.

కాని, అది స్వీకరించడానికి మానవుడు ఇంకా సిద్ధం కాలేదని నేననుకుంటాను. అది అతను అందుకోలేనంత ఎత్తైనది, పట్టుకోలేనంత విశాలమైనది. దాని నతడు అర్థం చేసుకోలేడు, గ్రహించలేడు. ఎందుకనగా 'సావిత్రి' అర్థం చేసుకోవడం మనసుకు సాధ్యపడదు. అర్థం చేసుకోవడానికి, జీర్ణించుకోవడానికి ఆధ్యాత్మిక అనుభవాలు

అవసరం. ఎంతగా యోగమార్గంలో పురోగమించగలిగితే, అంతగా జీర్ణించుకోగలరు. కాదు, భవిష్యత్తులో మాత్రమే దాని విలువ తెలుస్తుంది. వారి 'భవిష్య కవిత' లో ఉటంకించినట్లుగ, ఇది భావితరానికి చెందే పద్యకవిత — అతిసూక్ష్మ మైనది, తీక్షణ మైనది, సున్నితమైనది, సంస్కారవంతమైనది. మనసులోగాని లేక మనసుచేతగాని కాదు, 'సావిత్రి' కేవలం ధ్యానంలోనే ప్రకటితమౌతుంది.

ప్రతిరోజు నీవు 'సావిత్రి' ని చదవబోతున్నావు. సక్రమంగా చదువు, సరియైన వైఖరితో చదువు. పుస్తకాన్ని తెరిచే ముందు మనసును వీలైనంత ఖాళీగ ఉంచి, కాస్తంత కేంద్రీకరించు. ఏ ఆలోచన రానివ్వకు. తిన్నని మార్గం ఒకటే — అది హృదయం ద్వారా. నేను నీకు చెప్పేదేమిటంటే, నిజంగా ఈ ఆకాంక్షతో నీవు కేంద్రీకరిచగలిగితే, నీవు జ్యోతిని వెలిగించగలవు — చైతన్యజ్యోతిని, పవిత్రీకరించగల జ్యోతిని — అతి త్వరలో, బహుశ కొద్ది రోజుల్లోనే. ఏది నీవు మామూలుగ చేయలేవో దానిని 'సావిత్రి' ఆసరాతో చేయగలవు. ప్రయత్నించు. ఈ వైఖరితో, నీ చైతన్యం వెనుక దీనిని నిలిపి, శ్రీఅరవిందులకు నివేదనాపూర్వకంగా చదివితే ఎంత భిన్నంగా ఉంటుందో, ఎంత నూతనంగా ఉంటుందో నీకే తెలుస్తుంది. నీకు తెలుసా, 'సావిత్రి' ఒక అస్తిత్వముగల జీవిగా, ఒక నిజమైన మార్గదర్శిగా చైతన్యంతో పూర్తిగ నింపబడింది. నీకు చెప్తున్నా, ఎవరైనా యోగాభ్యాసం చేయాలని మనఃపూర్వకంగా ప్రయత్నిస్తే, అవసరమని భావిస్తే, 'సావిత్రి' ద్వారా అందే సహాయంతో యోగమార్గారోహణ లోని నిచ్చెన పైమెట్టును ఎక్కవచ్చు; 'సావిత్రి' లో ప్రతిబింబించే రహస్యాన్ని ఛేదించవచ్చు. ఇందుకు గురువు సహాయం అవసరం లేదు. ఈ సాధనను ఎక్కడైనా సాగించవచ్చు. 'సావిత్రి' స్వయంగా మార్గదర్శి అవుతుంది. కారణం, అవసరమైన దంతా 'సావిత్రి' లో లభిస్తుంది కాబట్టి. కష్టం ఎదురైనప్పుడు, ఏమీ తోచని స్థితిలో ఉన్నా లేక పురోగమనానికి అవరోధాలను ఎలా అధగమించాలో, ఏ దిశగా మళ్లాలో తెలియకపోయినా, ఇతర సందిగ్ధావస్థలు, అనిశ్చిత పరిస్థితులు ప్రతిక్షణం మనలను ముంచెత్తుతున్నా, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు, సహాయము తప్పక అందుతాయి. పరిపూర్ణ ప్రశాంతతతో, వివృతమై, మనఃపూర్వకంగా ఆకాంక్షించినట్ల యితే ఎల్లప్పుడూ చేయిపట్టి, నడిపించినట్లుగా ఉంటుంది. పూర్ణవిశ్వాసం, తనను తాను అర్పించుకోవాలనే సంకల్పం, ఆవశ్యకమైన శ్రద్ధ ఉన్నట్లయితే, అంతిమ గమ్యాన్ని అవలీలగా చేరుకోవచ్చు.

వాస్తవానికి 'సావిత్రి' దృఢమైనది, సజీవమైనది, సమగ్ర చైతన్యంతో ప్రభావితమై నిండి ఉన్నది. మానవ సంబంధిత తత్వాలు, మతాలన్నింటి లోకి తలమానికమైన జ్ఞానభాండాగారము. అది ఆధ్యాత్మిక మార్గం, యోగం, తపస్సు, సాధన: వీటన్నింటి ఏకాకృతి. 'సావిత్రి' ఒక అసాధారణ శక్తి. అందుకోగల సత్తా ఉన్నవారికి స్పందనలను అందజేస్తుంది. — ప్రతి చైతన్యభూమికకు సంబంధించిన స్పందనలు. అది సాటిలేనిది. పుష్కలమైన సత్యసంపద. శ్రీఅరవిందులు కొనితెచ్చిన పరమ సత్యం అందులో ప్రకటితమైంది. ఈ పృథ్విపై ఆవిష్కరింపబడింది. 'సావిత్రి' లో ప్రతిబింబించే రహస్యాన్ని, అందులో ప్రకటితమైన శ్రీఅరవిందుల దివ్య భవ్య సందేశాన్ని గ్రహించుటకు ప్రయత్నించాలి.

'సావిత్రి' యొక్క అసాధారణ శక్తి

నీవు నిరుత్సాహంతో కృంగిపోయినా, చేసే పని ఫలించకపోయినా, లేక అనుకున్నదానికంతా వ్యతిరేకంగా జరుగుతున్నా, ఎంతగా ప్రయత్నించినా సంయమనం కోల్పోయి, చిరాకుపడి, జీవితంపై విరక్తి కలిగి, విచారంలో మునిగిపోయినప్పుడు, వెంటనే 'సావిత్రి' ని తీసుకో. క్షణం పాటు ఏకాగ్రత వహించు. ఏదో ఒక పుటను తెరిచి చదువు. నీ విచారమంతా పొగలా కరిగిపోతుంది. అతి తీవ్రమైన విషాదభరిత పరిస్థితులను అధిగమించగల శక్తిసామర్థ్యాలు నీకు కలుగుతాయి. నిన్ను పట్టి పీడిస్తున్నదేదైనా, యికపై నిన్ను అంటదు. మీదు మిక్కిలి నీకు అనూహ్యమైన సంతోషం కలుగుతుంది. అసాధ్యమనేది లేదను ఆత్మవిశ్వాసంతో పాటు, శక్తితో కూడిన చైతన్యం పునరావృతం అవుతుంది. అన్నింటిని క్షాళన చేయగల అక్షయమైన ఆనందానుభూతి కలుగుతుంది. కొన్ని చరణాలు చదివితే చాలు, నీ అంతఃసత్తాతో అనుబంధం ఏర్పడటానికి. అలాంటి అసాధరణమైన శక్తి 'సావిత్రి' ది.

లేకపోతే, చదివిన తర్వాత దీర్ఘంగా కేంద్రీకరించినట్లయితే, అప్పుడు కూడ నిన్ను పట్టి పీడిస్తున్నదేదో, దానికి పరిష్కారం లభిస్తుంది. నీవు చేయవలసినదంతా కేవలం 'సావిత్రి' ని అనాలోచితంగ తెరవడమే. నీ సమస్యలకు సమాధానం లభిస్తుంది.

విశ్వాసంతో, నిరాడంబరంగా చేయాలి. ఫలితం తథ్యం.

మూలం: శ్రీమాత (*Sweet Mother, Luminous notes* by Mona Sarkar)

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

'సావిత్రి' పై ప్రశ్నలకు శ్రీమాత సమాధానాలు

ప్రశ్న: మాతా! దుఃఖం అజ్ఞానం వలన, బాధ వలన, కలుగుతుంది. కాని దివ్య మాత తన బిడ్డల కోసం పడే దుఃఖం, బాధల యొక్క స్వభావం ఎలాంటిది — 'సావిత్రి' లోని దివ్యమాత?

అది ఆమె వారి స్వభావంలో పాలు పంచుకున్నందువల్ల సంభవించింది. వారి స్వభావంలో భాగస్వామిగా ఆమె ఈ భూమి పైకి అవరోహణ చేసింది. ఆమె వారి స్వభావంలో భాగస్వామి కాకపోతే వారు ముందుకు పోలేరు. అభివృద్ధి సాగదు. ఆ అతీత జ్ఞానచైతన్యస్థితిలోనే ఆమె ఉండిపోతే, ఈ మానవులతో, ఆమెకు సంబంధం ఉండేది కాదు. అందుకోసమే ఆమె మానవ చైతన్యాన్ని, రూపాన్ని ధరించడానికి అంగీకరించింది. అది వారితో సంబంధం నెలకొల్పడానికి. అయితే ఆమె మానవ చైతన్యాన్ని ధరించినా, తన నిజస్థితిని మరువక, తన స్వీయ వాస్తవ అతీతచైతన్యంతో సంబంధం కొనసాగించింది. ఆ రెంటిని కలపటం వల్ల, ఆ రెండవ చైతన్యంలో ఉన్న వారి అభివృద్ధికి సహాయపడింది. ఆమె వారి చైతన్యాన్ని స్వీకరించకపోతే, వారి దుఃఖాన్ని తనదిగా చేసుకుని బాధను అనుభవించకపోతే, వారికి ఆమె సహాయం చేయలేదు. ఆమె దుఃఖం అజ్ఞానం వల్ల వచ్చినది కాదు. ఆ బాధ తాదాత్మ్యం చెందడం వల్ల వచ్చినది — వారి ప్రకంపనలనే తాను కూడా అనుభవించుటకు అంగీకరించడం, తద్వారా వారితో అనుసంధానమై, వారిని ఆ స్థితి నుంచి బయటకు లాగడం చేయుటకు. ఆమె వారితో సంబంధం పెట్టుకోనపుడు, ఆమె ఉనికి తెలిసేదే కాదు లేదా ఆమె తేజాన్ని భరించగలిగేవారు కాదు. ...అనేక రకాలుగా ఈ విషయం చెప్పబడింది, అన్ని మతాల్లోను చెప్పబడింది. ఈ రకమైన దివ్యత్యాగం గురించి తరుచుగా చెప్పారు. అయితే ఒక కోణంలో ఇది వాస్తవమే. అది తనంతట తానుగా చేసిన త్యాగం. అయినా వాస్తవమైనదే. ఒక సంపూర్ణ సమగ్రచైతన్యాన్ని, ఆనందాన్ని, శక్తిని, ఈ బాహ్య ప్రపంచ అజ్ఞానస్థితిని అంగీకరించుట కొరకు, ఆ అజ్ఞానం నుంచి బయటకు లాగుట కొరకు వదిలివేయుట. ఈ స్థితిని అంగీకరించకపోతే, దానితో సంబంధం ఉండదు. అప్పుడు ఏ సంపర్కమూ సంభవం కాదు. అవతారాలలోని పరమార్థం ఇదే. అలా కాకపోతే ఆ ఆవశ్యకత లేదు. వాటి పరిపూర్ణస్థితి నుండి ఆ దివ్యచైతన్యం, ఆ దివ్యశక్తి సూటిగా పనిచేయగల్గితే, పదార్థం మీద ప్రత్యక్షంగా

పనిచేసి రూపాంతరం చేయగల్గితే, మానవుని వలె శరీరధారణ చేయవలసిన అవసరం ఉండదు. ఆ సత్య ప్రపంచం నించి, సమగ్ర చైతన్యంతో ఈ మానవచైతన్యం మీద పనిచేయగలిగితే ఈ అవసరం ఉండేది కాదు. అది కూడ పని చేయవచ్చు, కాని నెమ్మదిగా పనిచేస్తుంది. ఈ ప్రపంచ వికాసానికి ఈ సహాయం ఉన్నపుడు, శీఘ్రంగా ముందుకు సాగుటకు దోహదపడినప్పుడు, దైవం మానవ స్వభావాన్ని తీసుకోవడం అవసరం. ఈ భౌతికమైన మానవ ప్రకృతిని పొందడం ఒక ఆవశ్యకత. మానవశరీరం ధరించడం వలన మానవ స్వభావాన్ని కూడా తప్పక స్వీకరించాలి — పాక్షికంగా. ఒక్కటేమిటంటే వారి నిజచైతన్యాన్ని, సత్యంతో సంబంధాన్ని కోల్పోకుండా, ఈ సత్యాన్ని, ఈ చైతన్యస్థాయిని కూడా తనలో నిలుపుకోవాలి. ఆ రెండింటిని కలుపుట ద్వారా, పరుశవేదితో సాధించినట్లుగా, రూపాంతరం సాధించగ లరు. కాని, భౌతికతత్వాన్ని స్పర్శించకపోతే, ఏమి చేయలేరు.

ప్రశ్న: సావిత్రి తన భవిష్యకార్యాన్ని ముందే దర్శించిందా?

అవును. ఆమె అలాగే చెప్పింది. నీవు చదవలేదా? ఆమె ఒంటరిగా ఉండగలనని కూడా చెప్పబడింది. ఆమె కూడ చెప్పింది — నేను ఒంటరిగా ఉండటానికి తయారు గానే ఉన్నాను. అది నీవు చదవలేదా? అది బుక్ VII, కాంటో 4 లో ఉంది.

ప్రశ్న: ఆమెకు "బాధల తల్లి" ని మరియు "శక్తి మాత" ని కలుస్తానని తెలుసా?

నిజంగా ఆమెకు తెలుసు. జరగబోయేదంతా ఆమెకు తెలుసుననే, అంతటా చెప్పబ డింది. ఈ విషయం స్పష్టంగా వ్రాయబడింది. నిజానికి వాళ్ళలో ప్రతివారికి ఆమె స్పష్టంగా చెప్పింది... నీ కేది అవసరమో, అది నీకు తెస్తాను అని. అందువల్ల ఆమెకు తెలుసు. తెలియనపుడు ఆమె ఎలా చెప్పగలదు?

ప్రశ్న: సావిత్రిలో "బాధల తల్లి" చెప్తుంది:

> "బహుశ ఈ ప్రపంచం అంతిమ ఘడియల్లోని సుషుప్తిలో మునిగినపుడు,
> నేను కూడా ఆ మూగ శాశ్వత శాంతిలో నిద్రించవచ్చు"
>
> సావిత్రి, బుక్ VII కాంటో 4

అహా! అదే, అదే మానవచైతన్యం. మానవచైతన్యం అంటే అదే. దాని భావం, ఈ బాధలన్నీ పోయాక నేను హాయిగా నిద్రిస్తాను అని. శ్రీఅరవిందులు దీన్ని గురించే మాట్లాడేది. ఒక అత్యంత అతీత శాంతి కోసం ఆకాంక్ష ఉన్నప్పుడు, ప్రళయం సంభవించి ఈ ప్రపంచం అదృశ్యమైనపుడు కనీసం అప్పుడైనా శాంతి దొరుకు

తుందన్న భావన. కాని, అ పదమే స్వయంగా అసంగతమైనది. ప్రళయం వచ్చిన ప్పుడు శాంతి అన్నది అనుభవించడానికి ఉండదు, శాంతికి ఆస్కారం లేదు. అక్కడ ఇంక ఏమి మిగలదు.

కాని, ఇది మానవ చైతన్యం యొక్క మరో వైరుధ్యం. "ఈ ప్రపంచం ఉన్నంత కాలం, బాధ ఉన్నంత కాలం, నేను ఈ ప్రపంచంతో పాటు బాధపడతాను. కాని ఎప్పటికైనా ఈ ప్రపంచం ప్రశాంతత లోకి ప్రవేశిస్తే అస్తిత్వరహితమైన ఆ శాంతిలోకి అదృశ్యమైపోతే, అప్పుడు నేనూ విశ్రాంతి పొందుతాను." ఇది కవిత్వపరంగా ఇలా చెప్పడం; ఈ ప్రపంచంలో విచారమున్నంత కాలం ఈ ప్రపంచంతో పాటు నేనూ దుఃఖిస్తాను. అది అంతరించినప్పుడు నాకు కూడ అది అంతరిస్తుంది.

ప్రశ్న: అప్పుడు బాధల తల్లి ఏం చేస్తుంది, ఇంకేం చేయగలదామె?

ఆమె "ఆనందమయిమాత" గా మారుతుంది.

ప్రశ్న: సావిత్రి శ్రీమాత చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది కదా?

అవును.

ప్రశ్న: సత్యవాన్ దేనికి ప్రతీక?

సరే, అతడే అవతారం. మానవ అవతార మెత్తిన దైవం.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

సృష్టి కథ

తాత్త్విక శాస్త్రపరమైన నిరాసక్త విషయాలు ప్రక్కన పెడదాం. చాలా ఖచ్చితంగా, యదార్థంగా, నిరామయంగా సృష్టిని గూర్చి చెప్పే పండితుల గ్రంథాలలో వాటిని చదవడం మంచిది. మనస్తత్వశాస్త్రపరంగా సృష్టిని గూర్చి మాట్లాడడం కాదు. సృష్టి కథను జీవించడం ఉత్తమం. పిల్లల కోసం అసలు కథలు మొదలుపెట్టాలి. ఎల్ల ప్పటికీ పిల్లవానిగా ఉండడం మంచిది. ఈ సృష్టి కథలు ఏదో నిర్దిష్ట మతసూత్రాలు అనుకుని నమ్మనవసరం లేదు. వాటికి అపచారం చేయకూడదనుకుంటే, వాటిలో ఏదీ మార్చకూడదు. అయినప్పటికీ, మనస్సుకు బహుదూరంగా ఉండే విషయాలు మనలోని శైశవ చైతన్యానికి సజీవమైనవాటిగా చేసేందుకు ఈ కథల్ని పరిగణించవచ్చు.

సృష్టి గూర్చి అనేక కథలున్నాయి. దేనినైనా ఎన్నుకోవచ్చు. అవి కొంత నిజం కావచ్చు. పూర్ణం కావచ్చు. అసలు సత్యాన్ని వ్యక్తం చేస్తే చేయవచ్చు. ఎవరైన అంతర్ముఖులు కాని బహిర్ముఖులు గానీ అవగలిగితే — ఒక దృష్టిలో ఈ రెండూ ఒకటే అనుకోండి — ఈ సృష్టి కథను జీవించగలిగితే, దాని విశాల పరిధిలో కనీసం సాక్షికంగానైనా, ఈ సృష్టి ఎలా వచ్చిందో అవగాహన అవుతుంది. అందులో ప్రావీణ్యం పొందవచ్చు. కొందరు ఆ పని చేశారు. వారినే ప్రవక్తలు, తంత్రజ్ఞులు, మంత్రద్రష్టలు అంటారు. సృష్టిని గూర్చి ఎన్నో అందమైన కథలు చెప్పారు.

నేను ఒక కథను క్లుప్తంగా చెప్తాను.

దాన్ని ప్రవచనంగా తీసుకోవద్దు. అది కథ. అంతే.

తనను తాను చూసుకోడానికి పరాత్పరుడు బహిర్ముఖుడు కావాలని నిర్ణయించుకొన్నప్పుడు, తనలో మొదట బహిర్గతమైనది ప్రపంచ జ్ఞానం. దానిని సృష్టించే శక్తి. ఈ జ్ఞానచైతన్యం, శక్తి తన పని ప్రారంభించింది. పరాత్పర సంకల్పంలో ఒక ప్రణాళిక వుంది. ఈ ప్రణాళికలోని మొదటి సూత్రం ఆనందం, స్వేచ్ఛ వ్యక్తీకరణం. ఈ సృష్టిలో అత్యంత ఆసక్తిదాయకమైన లక్షణం అదే.

ఈ స్వేచ్ఛానందాలను వ్యక్తం చేయడానికి, వాటికి రూపం ఇవ్వడానికి మధ్యవర్తులైన రూపకర్తలు కావలసి వచ్చారు. పరాత్పరునిలో నిక్షిప్తమైనదానిని కాలగతిలో బాహ్యరూపంగా మార్చడానికి విశ్వజనీన లీలావికాసం ప్రారంభం కావాలి. ఈ లీలను ప్రారంభించడానికి మొదటి నాలుగు చైతన్యరూపాలు వెలువడ్డాయి. ఆ రూపాలు ఇవి: చైతన్యము, కాంతి (రెండు కలసి ఒకటే రూపం) జీవం, ఆనందం, ప్రేమ (రెండు కలసి ఒకే రూపం) నాల్గవది సత్యం.

వాటికి మహాశక్తి, అమితబలం ఉన్నాయి. అంతే కాకుండా, ఈ సృష్టి స్వేచ్ఛకు మారుపదం కాబట్టి, సృష్టించే విధానంలో కూడా ఆ రూపాలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వబడింది. ఈ సృష్టి ఎలా చేయాలో తమ సొంత భావాలు వారికి ఉన్నాయి. వారికి స్వేచ్ఛ వుంది. అందుచేత పని ప్రారంభించగానే స్వతంత్రంగా తమ ఇష్టం వచ్చిన పద్ధతిని వారు ఎంచుకొన్నారు.

తాము సేవకులం, ఉపకరణాలం అని కాకుండా, తామే సృష్టికి అధినేతలం

అని వారు భావించారు. (శ్రీఅరవిందులు ఈ వైఖరిని ఒక సూక్తితో వివరించారు[1]). ఈ ప్రపంచంలో అల్లకల్లోలానికి అదే తొలి కారణం. పరాత్పరుని నుండి ఆ నాలుగు రూపాలు విడిపోగానే, చైతన్యం అచేతనగా, కాంతి చీకటిగా, ప్రేమ ద్వేషంగా, ఆనందం దుఃఖంగా, జీవం మృత్యువుగా, సత్యం అసత్యంగా మారిపోయాయి. వారు విడిపోయి స్వతంత్రంగా, ఆ గందరగోళంలో తమ తమ సృష్టికార్యాలు ప్రారంభించారు.

దీని ఫలితం మనం చూస్తున్న ఈ ప్రపంచం. క్రమానుగతంగా, దశలవారీగా ఈ లోకం రూపుదాల్చింది. అదంతా చెప్పడానికి నిజంగా చాలా సమయం పడ్తుంది. చివరికి భౌతిక పదార్థం ఏర్పడింది. అది జడం, మసకబారిన తమస్సు, విషాదమయం. ఈ నాలుగు రూపాలను ప్రసరింపచేసిన సృజన చిచ్ఛక్తి ఏం జరుగుతుందో గమనించింది. సృష్టికి జరుగుతున్న అపకారాన్ని, దుష్టశక్తిని రూపుమాపాలని పరాత్పరుని ప్రార్థించింది.

అప్పుడు ఆమె చైతన్యాన్ని అచేతనలోకి అవరోహించేటట్లు, ఆమె ప్రేమ దుఃఖాగ్నిమయ అగాధంలోకి అవతరించేటట్లు, ఆమె సత్యం ఈ అసత్య ప్రపంచంలోకి దిగివచ్చేటట్లు పరాత్పరుడు ఆదేశించాడు. భౌతిక పదార్థంలో చైతన్యం, ప్రేమ, సత్యాన్ని ప్రదీప్తం చేయడానికి, ఈ భౌతిక విశ్వాన్ని భావి సర్వోత్కృష్ట ఆవిర్భావ మహత్తులోకి తీసుకొని వెళ్ళడానికి, పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించడానికి మరింత మహనీయమైన చైతన్యం, మరింత పూర్ణ జ్యోతిర్మయ ప్రేమ, మరింత పరిపూర్ణ సత్య మహత్వం (అవి మొదట బయిటకు వచ్చిన రూపాల కన్న మహనీయమైనవి.) భౌతిక పదార్ధపు భయానక అగాధంలోకి దూకాయి.

దీనితో భౌతిక పదార్థంలో ఒకదాని తర్వాత మరొక అంతర్లయ ప్రక్రియలు

[1] *కత్తి కదనరంగంలో సమధికోత్సాహంతో సంహారం చేస్తుంది. అదే కదన కుతూహలం. ధనుస్సు నుండి విముక్తమైనప్పుడు వెలువడే "శబ్దం" తో ముందుకు దూసుకుపోవడంలో బాణానికి ఒక హర్షోల్లాసం వుంది. శూన్యంలో మత్తుగా, నెమ్మదిగా పరిభ్రమించడంలో భూమికి ఒక ఆహ్లాదం వుంది. తన ప్రజ్వలిత ఉజ్వల కాంతుల్లో, నిరంతర కదలికలో సూర్యునికి రాచరిక ఆనంద విలాసం ఉంది. ఓ! స్వీయ ఆత్మ విస్ఫూర్తి ప్రదీప్త ఉపకరణమా! నీ జీవితానికి అనుగుణంగా నిర్దేశితమైన కర్తవ్యాలలో దివ్య ప్రహర్షం పొందు!"*

— శ్రీఅరవిందులు

జరిగాయి. వాటికో చరిత్ర ఉంది. ఈ అంతర్లయల ప్రస్తుత ఫలితం అతిమనస్సు. (అచేతన నుండి అతిమనస్సు ప్రభవించింది) అతిమనస్సు తరువాత ఇంకేమీ అవరోహణలు ఉండవనడానికి సూచన లేమీ లేవు. పరాత్పరుడు అవ్యయుడు, అనంత శక్తిమయుడు. అనంత విభూతుల మహస్సు. కొత్త ప్రపంచాలను ఆయన ఎప్పుడూ సృష్టిస్తూనే వుంటాడు.

ఇదీ నా కథ.

మూలం: దివ్యజనని

అనువాదం: యజ్ఞన్న

'సావిత్రి' అనువాదం

ఈ వ్యవహారం గురించి నా యదార్థ వైఖరిని వ్యక్తపరచమని కోరితే, నా అభిప్రాయం 'సావిత్రి' అనువదించ వీలుకానిది అని. ఈ అసదృశ అద్భుతంపై ఏకాగ్రత కోసం వ్యక్తిగత సాధనగా తప్ప దాని అనువాదాన్ని నేను ప్రోత్సహించను. ప్రచురించడానికైతే, అసలు సమ్మతించను. ఆ కారణంగ, ఈ విషయానికి ఎలాంటి ప్రాముఖ్యతను ఇవ్వలేను.

ప్రేమాశీర్వాదాలతో

(14 డిసెంబరు 1961)

*

నీ స్వప్రయోజనం కోసమే అయితే 'సావిత్రి' అనువాదం తప్పక కొనసాగించవచ్చు. అందులకై శ్రీఅరవిందుల సహాయం నీ కెల్లప్పుడు ఉంటుందని నా నమ్మకం. ప్రేమాశీర్వాదలతో

(15 డిసెంబరు 1961)

(పృథ్వీసింగ్ నహర్ గారికి వ్రాసిన లేఖలు)

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఒక ఇతిహాసము, ఒక సంకేతము

మృత్యువుని జయించిన ఒక దాంపత్య ప్రేమ కథే మహాభారతంలో సావిత్రీసత్యవంతుల కథగా చెప్పబడింది. ఈ ఇతిహాసంలో మానవ జీవితానికి సంబంధించిన లక్షణాలే చాలా వరకు కనిపిస్తాయి. వేదపరంపరకు చెందిన అనేక సంకేతపూర్వక కల్పనా కథలలో యిది వొకటి.

అజ్ఞానం, మత్యువులచేత చిక్కిపోయిన దివ్యసత్యం అంతరాత్మగా కలిగిన జీవి సత్యవంతుడు. సావిత్రి దివ్యమంత్రం. సూర్యసుత. మహోన్నత దివ్య సత్యదేవత. లోకాన్ని వుద్ధరించడం కోసం మహిలో జన్మించింది. మర్త్యలోకంలో ఆమె తండ్రి అశ్వపతి. అతడు జితేంద్రియుడు, రాజర్షి. ఇంద్రియాలకు సంకేతం అశ్వం. అందుకే అతడి పేరు అశ్వపతిగా చెప్పబడింది. గాఢమైన ఏకీకృతమైన, ఏ ఆధ్యాత్మిక శక్తి మనల్ని అశాశ్వతంనించి శాశ్వతస్థాయికి యెదగడానికి సహాయపడుతుందో, దాని ప్రతిరూపం. సత్యవంతుడి తండ్రి ద్యుమత్సేనుడు. గ్రుడ్డివైన దివ్యమానసానికి ప్రతీక. దివ్యచేతనా శూన్యుడై, దివ్యదృష్టిని, భౌతికదృష్టిని కూడా పోగొట్టుకున్నవాడు. ఏదేమైనా ఇదంతా కేవలం ప్రతీక మాత్రమే కాదు. దీనిలో పాత్రలు గుణాలకి సంకేతంగా కల్పించిన మానవరూపాలు మాత్రమే కాదు. జీవం నిండిన చైతన్యశక్తుల అవతారాలు, అభివ్యక్తులు. వీటితో మనం దృఢమైన సంబంధం ఏర్పరుచుకోవచ్చు. వీటి సహాయంతోనే మనం వాస్తవ స్పృహలోనికి అడుగుపెడతాం. అవి మానవుడికి సహాయం చేసి అశాశ్వతస్థితి నించి శాశ్వత దివ్యచైతన్య జీవితానికి అతడికి మార్గం చూపడం కోసం మానవ దేహధారణ చేస్తాయి.

శ్రీఅరవిందులు

అశ్వపతి యోగం

అశ్వపతి యోగం త్రివిధమైనదిగా వుంటుంది. మొదటిది అతడు తన ఆధ్యాత్మిక సాఫల్యతను వ్యక్తిగతంగా పొందుతాడు. ఇది 'రాజు యొక్క యోగం' గా అభివర్ణించబడింది. తరువాత అతడు అచ్చమైన మానవజాతి ప్రతినిధిగా చైతన్యస్థాయిలన్నింటినీ సాధించి, స్వాధీనపరచుకునే అవకాశాలను అధిరోహింపచూస్తాడు.. వాటిని

అధిగమిస్తాడు. అయినప్పటికీ యిది కూడా వొక వ్యక్తి గత విజయంగానే పరిగణించబడింది. ఇది రెండవ భాగంలో అభివర్ణించబడింది. చివరిగా తన కోసం యేమాత్రం ఆకాంక్షించక, సర్వమానవాళి కోసం ఒక సార్వత్రిక అవగాహన కోసం ఒక నూతన సృష్టి కోసం ఆకాంక్షిస్తాడు. ఇది 'దివ్యమాత' భాగంలో అభివర్ణించబడింది.

శ్రీఅరవిందులు

సావిత్రి — దివ్యమాత అవతారం

పద్యకావ్యంలో సావిత్రి దివ్యమాత అవతారంగా చెప్పబడింది. ఈ అవతారం అతి ప్రాచీన కాలాలలో సృష్టి మొత్తం శాశ్వతత్వానికి దారితీసే ప్రయత్నంలో తెరుచుకొని వుండినప్పుడు చోటు చేసుకొని వుండవచ్చు.

శ్రీఅరవిందులు

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

'సావిత్రి' కూర్పు

ప్రశ్న: మీరు మీ గేయ కవిత్వాన్ని, ఉదాహరణకు 'సావిత్రి' ని, పది పన్నెండుసార్లు తిరిగి తిరిగి యెందుకు వ్రాయవలసి వచ్చిందా అని మేం ఆశ్చర్యపోతున్నాం.

దీనికి సమాధానం తేలికే. నేను 'సావిత్రి' ని ఆరోహణ కొక ఆలంబనంగా ఉపయోగించుకున్నాను. ఒకానొక మానసికస్థాయిలో దానితో ప్రారంభించాను. అంతకంటె ఒక ఉన్నతస్థాయికి చేరుకొన్నప్పుడల్లా, ఆ స్థాయి నుండి దానిని తిరిగి వ్రాసాను. అదీ గాక అందులో ఏదైనా ఒక భాగం నిమ్నస్థాయి నుండి వచ్చినట్లు కన్పించినపుడు, అది మంచి కవిత్వమైనా దాన్నలాగే వదలివేయడం నాకు సంతృప్తి కలిగించేది కాదు; ఆ విషయంలో నేను ఖచ్చితంగా వ్యవహరించాను. వీలైనంతవరకు 'సావిత్రి' అంతా ఒకే మూసలో నుండి వెలువడాలి. వాస్తవానికి ఏదో వ్రాసి, త్వరగా ముగించి వేయవలసిన గేయంగా నేను 'సావిత్రి' నెపుడూ పరిగణించ లేదు. ఒకరు తన స్వీయ యోగికచేతన నుండి కవిత్వాన్ని ఎంత మేరకు వ్రాయవచ్చో, ఎలా సృజనాత్మకంగా చేయవచ్చో చూడ్డానికి 'సావిత్రి' నొక ప్రయోగక్షేత్రంగా పరిగణించాను. నేను 'రోజ్ ఆఫ్ గాడ్' ను లేదా 'సానెట్స్' ను ఏదో ఒకటి రెండు మాటల్లో

మార్పులు, ఆ క్షణంలో చేయటం తప్ప, తిరిగి వ్రాయడం చేయలేదు.

1936 మార్చి 29

ప్రశ్న: 'సిక్స్ పోయెమ్స్' ను ఈ మధ్య వెలువడిన మూడు 'సోనెట్స్' ను ఎలా వ్రాసారు. మరి 'సావిత్రి' ని పరిపూర్ణస్థితికి ఎలా తీసుకుపోతున్నారు అనేది తెలుసుకొంటే మాకు విలువైన జ్ఞానం లభించినట్లవుతుంది.

ఇది ఇలానే జరిగింది. మరోలా కాదు అనేదేం లేదు. ఒక మినహాయింపేమిటంటే, నా బుద్ధికి పైస్థాయి నుంచి నేను స్వీకరించేవాడిని, మార్పులు, చేర్పులు, ఊర్ధ్వం నుంచే వచ్చేవి. నాకుగా నేను ఏ చొరవా చూపించకుండా లేదా మస్తిష్కం యొక్క శ్రమ లేకుండా ఇది జరిగేది. వందసార్లు మార్చి వ్రాసినప్పటికీ దాని మీద మనస్సు పనిచేసేది గాదు, స్వీకరించడం మాత్రమే చేసేది. మొదట్లో అదలా జరిగేది కాదు. సరిగా రూపుదిద్దుకొని, విషయం మీద మనస్సు ఎల్లప్పుడూ శ్రమిస్తుండేది. (మనలో మాట. 'నిర్వాణం' తప్పించి 'సానెట్స్' ఈ మధ్య వ్రాసినవి కావు — కొన్ని వ్రాసి ఇప్పటికి రెండేళ్ళయింది. ఏదేమైనప్పటికీ గేయాలు ధారావాహికంగా వస్తాయి. మొదటి చరణంతో ప్రారంభమై, చివరి చరణంతో ముగుస్తూ — కొన్ని మాత్రం ఒకటి రెండు మార్పులతో మాత్రమే, వచ్చినవి వచ్చినట్లుండిపోతాయి. మిగతావాటికి మొదట్లో వచ్చిన ప్రేరణ నిమ్నస్థాయికి చెందినదైతే, తిరిగి రూపం ఇవ్వవలసి వస్తుంది.) మిగతా వాటన్నింటిలా గాకుండా 'సావిత్రి' దానికదే ఒక ప్రత్యేక సృష్టి.మొట్టమొదట్లో తగినంతగా లేని పాత ప్రేరణ క్రింద వ్రాసినదాన్ని దాదాపు ఎనిమిది లేక పదిసార్లు తిరిగి వ్రాసాను. ప్రథమ ఉపగ్రంథం మీద శ్రద్ధ పెట్టి ప్రతి పంక్తి ఒక పరిపూర్ణ పరిపూర్ణతతో తయారుచేయగలననే ఆశతో తిరిగి తిరిగి దాని మీద పనిచేస్తూ, ఆ తరువాత పూర్తిగా దానిని తిరిగి వ్రాస్తూపోయాను — కాని ఇప్పుడు అంత పనిచేయడానికి సమయం చిక్కడం లేదు.

1934, అక్టోబరు 31

ప్రశ్న: మీ మౌనచేతనతో, కొద్ది మాత్రం శక్తిని ప్రయోగించితే ఉన్నతోన్నత స్తరాల నుండి దానిని పొంద సాధ్యమై వుండాలి గదా!

నీవు చెప్పినట్లు ఉన్నతోన్నత ఆధ్యాత్మిక స్తరాలు, అంత సుకరంగా ప్రవర్తించవు. అవి ఆలా వుంటే, భౌతికచేతన లోనికి అతిమనస్సును తీసుకొచ్చి వ్యవస్థీకరించడం అంత కష్టమైన కార్యంగా యెందుకవుతుంది? కాకతాళీయ ఆలోచనలతో, భ్రమల

సాలెగూళ్ళలో నివసించే ఎటువంటి అజ్ఞానులు మీరంతా? నీవు నిశ్చల నీరవత,చేతన, అధిమానసికం, అతిమానసికం వగైరాలను గురించి, అవన్నీ ఏవో విద్యుత్తును సర ఫరా చేసే మీటలు అన్నట్లు, వాటిని నొక్కగానే నీ వక్కడకు చేరుకుంటావన్నట్లు మాట్లాడుతున్నావు. ఏదో ఒక రోజు అలా జరగవచ్చునేమో కాని ఈ మధ్యకాలంలో, విద్యుచ్ఛక్తితో ఎన్ని విధాలుగా పనిచేయించడం సాధ్యమో, దానికి సంబంధించిన అన్ని ధర్మాలు, సాధ్యతలు, అందులో వుండే ప్రమాదాలు వగైరా అన్నీ కనుగొనాలి. వాటిని ఏ ప్రకారం సంధానపరచాలి, పరస్పర సంబంధమెలా ఏర్పరచాలి, అందుకు అవసరమైన తంత్రీవ్యవస్థను పూర్తిచేసి దానిని ఎలా పకడ్బందీగా తీర్చిదిద్దాలి, అదంతా కూడా ఒకే ఒక్క జీవితకాలంలో జరగాలి. సూచనలు గాకుండా ప్రతి విష యాన్నీ సుదీర్ఘంగా సవివరంగా బహిరంగపరచాలని ఆశిస్తూ, పూర్తి బాధ్యతారహిత స్థితిలో కుదురుకొని, ఉల్లాసంతో లేక ఉసూరుమంటూ ఫలితాలను బట్టి ఊహించుకొన్న వాదనల తూటాలను నా వైపు గురిపెట్టి, వరప్రసాదులైన నా శిష్యులు ప్రేలుస్తుండగా నేనా పనంతా చేయాలి, చిన్న, చిన్న సూచనలుగా కాదు — ఏకధాటిగా. దేవ దేవా, అంతా ఒక బృహత్ గ్రంథంగా!

మార్చి 29, 1936

*

ఆ గేయం మొదట్లో ఒక నిమ్నస్థాయి నుండి, బహుశా ఆంతరమనస్సు, చైత్యస్థాయి, కవన మేధస్సు, శుద్ధిచేయబడిన ప్రాణికంల మిశ్రమస్థాయి నుండి వ్రాయబడింది. ఆ తరువాత ఉన్నత మనస్సు తరచుగా ప్రకాశమయం చేయబడి అంతఃస్ఫూర్తితో మార్చబడిన మనస్సు జోక్యంతో వ్రాయబడింది. ప్రథమ ఉపగ్రంథంలోని అధిక భాగం క్రొత్తది, లేదా అదివరకు ఎలా ఉన్నదో అలా ఎంత మాత్రం లేనట్లు మార్చబడింది. పాతదానిలో ఉన్న ఉత్తమమైనదాన్ని కొన్ని సందర్భాల్లో మార్పు లేకుండా తిరిగి అలాగే వుంచేసాను, ఎందుకనంటె అది ఉన్నతతర ప్రేరణతో అదివరకే వచ్చి వుంది. పైగా ప్రతిసారీ దాని సాధారణ స్థాయిని ఉన్నతంగా మరింత ఉన్నతంగా, వీలైనంతగా అధిమనస్సు కవిత్వంగా ఉద్ధరించడానికి ప్రయత్నిస్తూ అనేక దఫాలుగా తిరిగి వ్రాసాను. ఇప్పుడున్నదాన్ని బట్టి చూస్తే ఒక సార్వత్రిక అధిమనస్సు ప్రభావంతో అది రూపుదాల్చింది, అని నమ్ముతున్నాను. కొన్ని సమయాల్లో పూర్తిగా అధిమనస్సు ద్వారా, కొన్ని సమయాల్లో ఇతర ఉన్నత స్తరాల సమ్మిళిత ఛాయతో ఈ కవిత్వం

వెలువడింది. కొన్ని సమయాల్లో ఈ ఉన్నతతర స్తరాల్లో ఏదో ఒకదాని యొక్క అత్యున్నతస్థితికి లేదా చైత్య కవితాధోరణిగల మేధస్సు వైపు లేక ప్రాణికం వైపు ఉద్ధరించబడుతూ కవిత్వం వెలువడింది.

నవంబరు 3 1936

*

శ్రమ అనే పదానికి గల సాధారణ అర్థంలో ఉపయోగించబడినది కాదు నేను 'సావిత్రి' విషయంలో పడిన సుదీర్ఘ శ్రమ అనే పదం. బాధలకు లోనవుతూ నిర్మాణం చేయడంలో పడిన శ్రమ కాదది. ఇది అన్నింటి కంటె ఉత్తమమైనదని అన్పించేది నాకు అందేంత వరకూ. ఒక తక్కువ స్థాయి ప్రమాణాలకు అది ఎంత మంచి కవిత్వంగా కన్పించి నప్పటికీ, ఉన్నతస్థాయి నందుకోలేని దానినంతా తిరస్కరిస్తూ, యదార్థ ప్రేరణకై దాన్ని వినడం కోసం వేచి చూడడానికై వెచ్చించిన అనంత సామర్థ్యం, శ్రమ అనే పదాని కర్థంగా చెప్పుకోవచ్చు.

*

సాంకేతికతను గురించే నేను ఆలోచించను, ఎందుకనంటే ఆలోచించడం అనేది నా పద్ధతెంత మాత్రం కాదు. మొదట పంక్తులు ఆవిష్కరిస్తున్నప్పుడు, ఆ తరువాత వాటిని తిరిగి వ్రాసేటపుడు, దాని వంక చూస్తాను, అనుభూతి చెందుతాను. వ్రాసేట ప్పుడు నేను వివరాలను గురించి పట్టించుకోను, ఎందుకనంటే అది ప్రేరణను సజావుగా రానివ్వక అడ్డుకొంటుంది. ఏమాత్రం జోక్యం చేసుకొనకుండా దాన్నలా రానిస్తాను, మధ్యలో ఎక్కడైనా స్పష్టంగా లోటు కన్పించినా లేక అది దిగివస్తున్న ప్పుడు మధ్యలో నిమ్నస్థాయికి చెందినదేదైనా చొరబడినా, కొంచెం ఆగుతాను. ప్రేరణ సరైనదైతే అప్పుడుగాని, ఆ తరువాత గాని సాంకేతికతను గురించి పట్టించుకోనవసరం లేదు. ఎందుకనంటే అలాంటప్పుడు పరిపూర్ణ పంక్తితో, పరిపూర్ణ లయ విడదీయలేని విధంగా పెనవేసుకొని లేదా విడదీయలేని విధంగా ఒకే ముద్దగా కరిగిపోయి, ఒకే రకంగా ఏకమైపోయి అది వస్తుంది. దానితో పాటు వ్యక్తమయ్యే దాని లయలో ఏదైనా అపరిపూర్ణత దొర్లితే, ఆ లయబద్ధత లోపభూయిష్టమైతే వ్యక్తీకరణ కూడా సంపూర్ణ విలువతో జరగదు. అలా జరగదని చెప్పడాని కవకాశం లేదు. అలా గాక మొత్తం వ్రాసినదానంతట్లోనూ, ప్రేరణ సరైనదిగా గాకపోతే, అప్పుడు దాన్ని తరువాత పరిశీలించి ఆ భాగానికి లేక మొత్తానికి తిరిగి సరైన

రూపమిస్తాను. ప్రతి పంక్తీ దాని స్థానంలో అది అనివార్యంగా ఉండి తీరవలసిందా, కాదా, మొత్తంగా కాకుండా పంక్తిలోని ప్రతి మాటా అదే స్థానంలో అనివార్యంగా ఉండితీరవలసిందేనా కాదా అనేదాని మీదా, వాక్యాల నిడివి, (ఇటువంటి బ్లాంక్ వెర్స్ రచనలో దానికెంతో ప్రాధాన్యత ఉంది.) సరిగా వున్నదా లేదా; పంక్తులు వాటి వాటి సరైన స్థానాల్లో వున్నాయా, లేదా, ఎందుకనంటే పంక్తులన్నీ పరిపూర్ణమైనవే కావచ్చు కాని ఒకదాని తరువాత మరొకటిగా కూర్చినపుడు, ఆ కూర్పు సమగ్రమైనది కాకపోవచ్చు — అక్కడక్కడా కలపడానికి సేతువులు అవసరం కావచ్చు. సరైన రీతి భావ అభివృద్ధి, అది కనిపించే విధానం వగైరా వగైరాల మీద యెక్కువ శ్రద్ధ పెట్టి చూస్తాను. ఈ విధమైన నిర్యమక కవిత్వంలో వ్యవధానాలుండవు. పంక్తుల మధ్య లయలోని వ్యత్యాసాల పైన, యతిపైన, దీర్ఘాక్షరాలు, హ్రస్వాక్షరాల పైన, అక్షరాలను కుదించి మరియు సాగదీసి పలకడం పైన, అచ్చుల హల్లుల నానా రూప సంధుల పైన, అంత్యప్రాసల పైన ధ్వని సామ్యతలు వగైరాల పైన శ్రద్ధ పెట్టి చూసేవాడిని. వాక్యాలను ఒక పంక్తిగా, రెండు, మూడు, నాలుగు లేదా అయిదు, లేదా అనేక పంక్తులకు విస్తరింపజేయడం పైన, ప్రతి పంక్తీ దానికదే తగినంత విషయం, శక్తితో నిండి తనను తాను సమర్థించుకొనేటట్లుంటూ అదే సమయంలో మొత్తం ఒక చక్కని వాక్యంగా, సామరస్యంగా తయారయేటట్లుగా వుండాలి — ఇవి దానిని గురించిన ముఖ్య విషయాలు. అదంతా మామూలుగా ప్రేరణతో పాటు వచ్చేది. ఎందుకనంటే నాకు తెలిసిన, అలవాటైన సాంకేతికత ననుసరించి నాకు కావలసినదాన్ని గురించి కొన్ని నియత ధర్మాలున్నాయి. వాటికి తగినట్లు ప్రేరణే జాగ్రత్త వహించేది. ఏదైనా లోపం వుంటే సరైన వివరణ వచ్చే వరకూ కేంద్ర కార్యాలయానికి విజ్ఞప్తి చేస్తూండేవాడిని. లేదా అవసరమైన ధ్వని, భావంతో మెరుపులా మెరిసే ఒక మాటతోనో లేక పదబంధంతోనో ఆ లోపాన్ని తొలగించడం జరిగేది. ఇవి సరైనదాని కోసం ఆలోచించడం వల్ల, లేదా అన్వేషించడం వల్ల జరుగవు. ఇందుకు సాయం చేసే ఏజంట్లు దృష్టి, పిలుపు, అనుభూతి — నాభికేంద్ర సంతృప్తి కూడా జరగాలి. అది జరిగేంతవరకు తిరిగి తిరిగి సరిచూడడం, వ్రాయడం కొనసాగేది. ఒక ఖచ్చితమైన మానసిక నియమం ప్రకారం సాంకేతికతను అనుసరించడం జరిగేది కాదు అని కూడా నేను చెప్పదలచుకొన్నాను — ఎందుకనంటే ఒక నియమబద్ధ పరిపూర్ణ సాంకేతిక రామణీయకత కాదిక్కడ లక్ష్యం. శబ్ధ ప్రాముఖ్యతను పద

ప్రాధాన్యతతో పూరించాలి. నియమాలను అతిక్రమించుట ద్వారా అవి అది చేయగలిగితే మంచిది, లేకపోతే నియమం దారి నియమానిదే.


అక్టోబరు 30, 1936

*

'సావిత్రి' పద్ధతి ఇది కాదు. వ్యక్తపరచుటలో దాని లక్ష్యం ఒకానొక క్రియాశక్తిని, సూటితనాన్ని, ఆధ్యాత్మిక స్పష్టతను, సత్యసంధతను ప్రకటించుట. అది అర్థం కానట్లయితే 'సావిత్రి' వ్యక్తం చేసే సత్యాలు సాధారణ మానవ మనస్సుకు పరిచయం లేనటువంటివి కావడం లేదా అడుగుపెట్టని క్షేత్రానికి లేక క్షేత్రాలకు చెందినవి, లేదా మార్మిక అనుభవపు క్షేత్రం లోనికి అది ప్రవేశించడం వల్ల అయివుంటుంది. అంధ లేక అస్పష్టమైన గంభీర విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం వల్లనో లేదా ఆలోచన నుండి తప్పించుకొనిపోయినందు వల్ల కాదు అర్థం కాకపోవడం. ఆలోచన వుంది కాని అది బౌద్ధికమైనది కాదు. అంతఃస్ఫూర్తికి సంబంధించినది లేదా అంతకు మించినది. అసలు వస్తువు లోనికే ప్రవేశించడం ద్వారా లభించే, తాదాత్మ్యత వల్ల వచ్చే, సదా ఒక అంతర్దృశ్యాన్ని ఒక ఆధ్యాత్మిక సంస్పర్శను లేదా జ్ఞానాన్ని వ్యక్తపరచే ఆలోచన అది.

*

'సావిత్రి' లో నేను ఎక్కడా, దేన్నీ కేవలం రామణీయకత కోసమో లేక పాండితీ ప్రకర్షను చూపించాలనో వ్రాయలేదు. ఈ గేయంలో ప్రతి చోటా, దర్శించిన, అనుభూతి చెందిన, అనుభవించినదాన్ని ఎంతో కొంత వ్యక్తం చేయడానికి ప్రయత్నిస్తూ వ్రాసాను. భావసంపద యొక్క భారంతో పంక్తి లేక పంక్తులను వుంచినపుడు, వాటిని వ్రాయడంలో ఉన్న ఆనందం కోసం వాటిని వ్రాయలేదు. భావసంపద అక్కడున్నది గనుక లేదా నా కదలా అంతర్దృశ్యంలో లేక అనుభవంలో కన్పించినందు వల్ల అలా వ్రాసాను. వ్యక్తం చేయడానికి సరైన వ్యక్తీకరణను కనుగొన్నపుడు, దాన్ని నేను, బుద్ధితో గాని, లేదా నిర్ధారించబడిన కవితా నియమం ద్వారా గాని గాక, అంతఃస్ఫూర్తికి సంబంధించిన అనుభూతితో, అది పూర్తిగా సరైన వ్యక్తీకరణా కాదా అని పరిక్షించేవాడిని. కానప్పుడు పూర్తిగా సరైన ప్రేరణ, సరైన భాషా రూపంలో వచ్చే వరకూ దానిని మార్చాలి గనుక మారుస్తూపోయే వాడిని. ఏదో విధమైన మంచికవిత్వంగా అది తయారైనా, ఏ విధమైన దాదాపుగా లేక పూర్తిగా అసంపూర్ణత



SRI AUROBINDO

అందులో వున్నా, దానితో ఎన్నడూ సంతృప్తి చెందలేదు. ఇలా చేయడానికి నేను ప్రయత్నించాను. ఇందులో నేను విజయం సాధించానో లేదా విఫలమయ్యానో, విమర్శకుడు లేక పాఠకుడే తీర్పు చెప్పుకోవాలి. కాని అతడిందులో దేన్నీ చూడలేకపోయినంత మాత్రాన లేదా అర్థం చేసుకోలేకపోయినంత మాత్రాన, అతని వ్యతిరేక తీర్పు ఖచ్చితంగా సరైనది, సత్యమైనది అని అర్థం కాదు. అలాంటి నిర్ణయాని కతడు రావడానికి కనీసం అక్కడొక అవకాశం వుంది అని అనుకోవటానికి చూడ్డాని కక్కడేం లేదు, అర్థం చేసుకోవడానికి అందులో యేం లేదు, అదంతా పసలేని సరుకు లేదా శుష్కపాండిత్యం మాత్రమే అయినందువల్ల కాదు. అందుకు కారణం అంతర్ద్రృశ్యాన్ని చూడగల లేదా అర్థం చేసుకోగల సాధన సంపత్తిని అతను సమకూర్చుకోలేదు అనుకోవాలి అంతే. 'సావిత్రి' ఒక అసాధారణమైన అంతర్దర్శనం యొక్క, ఆంతరికానుభవం యొక్క చిట్టా. అది చాలా వరకు సార్వత్రిక మానవ మనస్సు చూచేదానికి, అనుభవించేదానికి ఎంతో దూరాన వున్నది. సాధారణ జనబాహుళ్యం నుండి గాని, 'సావిత్రి' ప్రథమ సంపర్కం కలిగినవారిలో అధికుల నుండి గాని, ప్రశంసలను గాని, అవగతం చేసుకొనడాన్ని గాని ఆశించకూడదు. నేనిదివరకే ఎత్తి చూపించినట్లు మార్మిక కవిత్వాన్ని ప్రస్తుతించడానికి, రసాస్వాదనకు సంబంధించిన ఒక వినూత్న ఆధ్యాత్మిక చేతనా విస్తరణ, రసాస్వాదనాశక్తి తప్పక వుండాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

TWO EXCERPTS FROM '*SAVITRI*'

సావిత్రి నుండి రెండు అవతరణములు

Vision of The Future

భవిష్య దర్శనం

More and more souls shall enter into light,
Minds lit, inspired, the occult summoner hear

And lives blaze with a sudden inner flame
And hearts grow enamoured of divine delight
And human wills tune to the divine will,
These separate selves the Spirit's oneness feel,
These senses of heavenly sense grow capable,
The flesh and nerves of a strange ethereal joy
And mortal bodies of immortality.
A divine force shall flow through tissue and cell
And take the charge of breath and speech and act
And all the thoughts shall be a glow of suns
And every feeling a celestial thrill.
Often a lustrous inner dawn shall come
Lighting the chambers of the slumbering mind;
A sudden bliss shall run through every limb
And Nature with a mightier Presence fill.
Thus shall the earth open to divinity
And common natures feel the wide uplift,
Illumine common acts with the Spirit's ray
And meet the deity in common things.
Nature shall live to manifest secret God,
The Spirit shall take up the human play,
This earthly life become the life divine.

Sir Aurobindo

(Savitri, p. 710)

The World is Ready behind Confusing Appearence

ఈ లోకపు అస్తవ్యస్త దృశ్యం వెనుక అచ్చమైన లోకం ఆసన్నమై ఉంది

When darkness deepens strangling the earth's breast
And man's corporeal mind is the only lamp,
As a thief's in the night shall be the covert tread
Of one who steps unseen into his house.
A Voice ill-heard shall speak, the soul obey,
A Power into mind's inner chamber steal,
A charm and sweetness open life's closed doors
And beauty conquer the resisting world,
The Truth-Light capture Nature by surprise,
A stealth of God compel the heart to bliss
And earth grow unexpectedly divine.
In Matter shall be lit the spirit's glow,
In body and body kindled the sacred birth;
Night shall awake to the anthem of the stars,
The days become a happy piligrim march,
Our will a force of the Eternal's power,
And thought the rays of a spiritual sun.
A few shall see what none yet understands;
God shall grow up while the wise men talk and sleep;
For man shall not know the coming till its hour
And belief shall be not till the work is done.

Sri Aurobindo

(Savitri, p. 55)

అనుబంధం:

'సావిత్రి' మీద నళినీకాంత గుప్తాగారి వ్యాఖ్య

1

శ్రీఅరవిందుల వాణి, పద్యకావ్యం 'సావిత్రి'; అనాదిగా విశ్వాన్ని వేధిస్తున్న ప్రశ్నకు విశ్వపరమైన సమాధానం. మానవ ఆకాంక్షకు దైవ ప్రతిస్పందనే వ్యక్తి, దేవత, దివ్య స్త్రీమూర్తి అగు సావిత్రి. ప్రపంచం ఒక పెద్ద ప్రశ్నార్థకం, అది ఒక చిక్కు ప్రశ్న, శాశ్వతం, ఎప్పుడూ పునారవృతమయేటటు వంటిది. ప్రయత్నించి, ప్రశ్నించే మనసు తనకు ఇవ్వబడినపప్పటి నుంచి మనిషి ఆ చిక్కు ప్రశ్నను ఎదుర్కొని దానికి సమాధానం కనుగొనాలని ప్రయత్నిస్తున్నాడు. ఈ విశ్వానికి అర్థం ఏమిటి? ఇది ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి పోతున్నది? అసలు దాని ఉద్దేశం ఏమిటి? మనిషి ఇక్కడ ఎందుకున్నాడు? అతని ఉనికికి లక్ష్యం ఏమిటి?

మానవుని ఆకాంక్ష ఆ తీరుగా ఉంటుంది. అశ్వపతి తన అన్వేషణలో ఈ ప్రపంచాన్ని తరచి చూస్తూ, అది ఏ విధంగా నిర్మాణమయిందో గమనించడం ఆరంభిస్తాడు. అతడు అది అంచెలంచెలుగా చైతన్యంలో ఒక స్థాయి నుంచి మరొక స్థాయికి పైకెదుగుతున్నదనే విషయాన్ని గ్రహిస్తాడు. ఆ అంతస్తులన్నింటిని ఎక్కుతున్నాడు. ప్రతి ఘట్టాన్నీ వివరంగా అర్థం చేసుకుంటున్నాడు. ప్రతిదీ అది చేసే పనులను తెలుసుకుంటూ ఆ అనుభవాలతో పరిపుష్టి నొందుతూ, వృద్ధిపొందే తన చైతన్యానికి వాటి వంతు తోడ్పాటును పొందుతూ వాటిని దాటిపోతున్నాడు. అది అజ్ఞానం నుండి జ్ఞానానికి ఎదిగో ఆరోహణ అనే విషయాన్ని తెలుసుకున్నాడు. మానవ అస్తిత్వం అంధకారబంధురమైన అట్టడుగు అజ్ఞానం నుంచి బయలుదేరుతుంది, అది స్థిరమైన రాతిపునాది లాంటిది. అదే శరీరం, భౌతికతకు ఉనికి. ఇక్కడ అజ్ఞానం పూర్తిగా అచేతనామయం. చైతన్యం అక్కడ అసలే లేకపోవటం మూలంగా, జీవుడు మేలుకొనటం ఆరంభించి, విశాలంగా, లోతుగా, ఉన్నతోన్నతంగా అభివృద్ధి చెందే చైతన్యంలో నెమ్మదిగా పురోభివృద్ధి నొందుతూ పైకెదుగుతూ ఉంటాడు. ఆ విధంగా అశ్వపతి ముందుకు పోతున్నాడు, పూర్తిగా శారీరక జీవితం, చైతన్యం నుంచి సోపానం లోని తరువాత మెట్టుకు ఆరోహిస్తాడు. మొట్టమొదట ప్రకటితమై, అభివ్యక్తం అయిన జీవశక్తి అగు ప్రాణికచైతన్యం లోనికి అడుగుపెట్టాడు. అది

శక్తులు, రూపాలతో కూడిన అల్పమైన నిమ్నప్రాణికం. అశ్వపతి సాగిపోతున్నాడు, పైపైకి వెడుతున్నాడు; కాంతి అధికం అవుతున్నది, అది మసక చీకటితో కలిసిపోయి ఉన్నది, అజ్ఞానం చుట్టూ ఆవరించి ఉన్న కఠినమైన నల్లని పొరలు ఒకటొకటిగా విడిపోవటం ఆరంభమై, వాటి స్థానంలో లక్ష్యశీలము, ప్రేరణాత్మకమగు శక్తులు ఆవిర్భవిస్తున్నాయి. అతడు అక్కడ ఆ స్థాయికే అనుగుణంగా మెలిగే అస్తిత్వాలను, ప్రాణులను పోకుతూ, గిరగిర తిరుగుతూ, ఎగబాకుతూ అవి ఏ క్షేత్రాలకు చెందినవో వాటి సూత్రాలకు లోబడి చరిస్తున్న వాటిని కలిసాడు. ఈ విధంగా అశ్వపతి మనోసీమకు సరిహద్దు అయిన ఉన్నత ప్రాణికం లోనికి ప్రవేశించాడు.

ఇప్పుడు అశ్వపతి ఈ లోకాలు, వాటిలో వసిస్తున్న జీవాలు, శక్తుల శరీరాలపై కాల్చిన ఇనుప కమ్మీలతో దుర్మార్గ కౌటిల్య లక్షణాల ముద్ర వేయబడినట్లుగా, అతి స్పష్టంగా గమనించాడు. ఆరోహణకు అంతర్గతంగా ఎంత ఉత్సుకత ఉన్నా మార్గం తిన్నని రహదారి కాదు. అది వక్రంగా, వంకరగా, పక్కదారులలోకి మూయబడిన తోవలలోకి దారితీసేది. అక్కడ అవినీతి రాజ్యమేలుతున్నది. సత్యాన్ని చూపించే సహజ గమనాలు పెడదారి పట్టిపోయి ఉన్నాయి: అక్కడ అసత్యం, కాపట్యం, గుడ్డి అహంభావం వివిధ పరిమాణాలలో అధికారం చలాయిస్తున్నాయి. అశ్వపతి అవన్నీ ఎక్కడి నుంచి వచ్చినవి, ఎక్కడకు పోతున్నవి అని తెలుసుకోవాలనుకున్నాడు. ఆ కారణంగా వాటి వెనుక ఏమున్నదో చూడటానికి ప్రయత్నించాడు. ఒక్కసారిగా లోతుల్లోకి దూకుతూ, దీనికి మూలమై పునాదియైన అజ్ఞానానికి, అస్పష్టతకు, అసత్యానికి తావైన ప్రదేశానికి చేరుకున్నాడు. అతడు కాళరాత్రి హృదయగుహరమైన, చైతన్యపు అట్టడుగు పాతాళానికి చేరుకున్నాడు. అక్కడ అతడు దుష్టత్వానికి తల్లిని, చీకటి లోకపు పుత్రులను చూశాడు.. "అసత్య అనంతత్వ ప్రవేశద్వారం, విపత్కారక విశృంఖలాల శాశ్వతత్వం"[1] ముందు నిలిచాడు.

ఇక్కడి శక్తులు మానవుని ఆకాంక్షలను, దైవపరమైన విషయాలను అభివ్యక్తపరచి, నిర్మాణం చేయాలనే తీవ్ర ప్రేరణను కిందిగి దిగలాగుతూ, నాశనం వైపుకు ఆకర్షిస్తూ ప్రలోభ పెడుతుంటాయి. అచేతనలోని ఆద్యశక్తుల ఆదిమ క్రీడకు ఆలవాలం ప్రపంచమే. అవి నల్లని మేనితో ప్రమాదభూయిష్టమైనవి. అవి భూమి మీద చరించే జీవులు ఏవైతే అంధత్వానికి, బానిసత్వానికి లోబడక, వెలుగు దిశగా అభిముఖమై పయనం సాగిస్తాయో, వాటిని భక్షింపపూనుతాయి.

ఇది దివ్యత్వాన్ని ఆశించే సాధకునికి ప్రమాదకరమైన మార్గము. దాటవీలు లేని ప్రవాహం దాపున ఎర్ర తోడేలు నిరీక్షించు చోటు. మృత్యురూప నల్లరాబందుల కొండచరియలపై కూతలు.[2] అతడు తప్పకుండా, పూర్తి జాగ్రత్తతో, పూర్తి రక్షణతో, సంపూర్ణమైన చిత్తశుద్ధితో ఉండి తీరాలి.

తప్పదు యాత్రికుని కిక్కడ, పైకి పయనమౌదారిన
వీచే నరకపు పెనుగాలుల ధైర్యంగా ఎదుర్కొను
కొంతదరి ఆగుట లేదా నెమ్మదిగా పయనించుట,
ఒక ప్రార్థన, ఒక మహత్వ నామం పెదవులపై తాండవింప.[3]

కాని తప్పించుకునే దారి లేదు. ఆ దైవయాత్రికుడు ఆ దారి గుండా వెళ్ళవల సిందే. ఎందువల్లనంటే అతని లక్ష్యానికి అభిముఖంగానే ఆ దారి ఉంది. అంతే కాకుండా, ఆ కాళరాత్రి గుండా పోవటం కూడా అవసరం. అది అశ్వపతికి తెలుసు.

తెలుసును మృత్యువు జీవనగృహ నేలమాళిగగా
తెలుసును వినాశనంలో సృష్టి వేగిర నడక జోరు,
తెలుసును నష్టము స్వర్గలాభమునకైన త్యాగము
తెలుసును స్వర్గవాకిళ్ళకు దగ్గర దారి నరకముగా.[4]

అశ్వపతి ఇప్పుడు ఉచ్చతమమైన, ప్రకాశవంతమైన ప్రదేశాల గుండా వెడు తున్నాడు. అతడు విశాలప్రదేశాలతో, విస్తృతమైన కదలికలతో కూడిన లోకం లోనికి ప్రవేశించాడు. అది ఉన్నత ప్రాణికం. దాని నుంచి ఇంకా తేజోమయ ప్రదేశమైన ఉన్నత మనోలోకం లోకి ప్రవేశించాడు. అతడు అమరులైన జ్ఞానులు, దేవుళ్ళు, దేవతలు నివసించే స్వర్గాలను చేరుకున్నాడు. అశ్వపతి వీటిని కూడా విశ్వానికి ఆవల నున్న ఏకైక వాస్తవ అస్తిత్వానికి పాక్షిక సత్యాలుగా, అనేక దృక్పథాలుగా, సత్యమైనవైనా పరిమితి కలవిగా తెలుసుకున్నాడు. ఆ విధంగా వాటి నన్నింటిని వదలివేసి, అన్నింటికీ అతీత సత్యమై, బృహత్తరమై, ఆనందకరమై, శాశ్వతస్థితి కలిగి, మార్పులేని ఉనికితో, చైతన్యమయమై పరమానందమయమైన ఒకే ఒక ఏకైక యదార్థ అస్తిత్వంలోకి చేరుకున్నాడు.

స్థలాభాస లేక స్వేచ్ఛాయుత విస్తృత దీర్ఘాలోచన,
కాలమును తోసిరాజన్న శాశ్వతత్వం....
"ఒక సంపూర్ణ నిశ్చలత, అవాఙ్మానసమై పాలు పంచుకోలేని..."[5]

అతని అన్వేషణ ఇక్కడితో ఆగినట్టనిపిస్తుంది. ఆ స్థితిలో ఎవరైనా సమ్మతితో శాశ్వతంగా ఎప్పటికీ అక్కడే ఉండిపోతారు.

...నిగూఢమై, దుర్గ్రాహ్యమై, —

అనంతమైన, శాశ్వతమైన, ఊహాతీత, ఏకాకి.[6]

అశ్వపతి బహుశా ఆ పరమానందపు ప్రలోభానికి కొంత వశుడైనట్లు కనిపించాడు. కాని అంతలోనే అతనిలో హఠాత్తుగా ఒక సందేహం ప్రవేశించింది — ఒక సంశయంగా, ఒక ప్రశ్నల పరంపరగా — ఒక వాణి అతనికి వినపడుతున్నది.

ఆహం నశించె; అస్తిత్వ, బాధ్యతల విముక్తి కలిగె,

జన్మ, మృత్యు, కర్మ, విధివిధానములిక మన దరికి రావు.

ఓ ఆత్మా, హర్షోల్లాసముల కపుడె సమయము కాదు!

హద్దు లేని ప్రశాంత పరమాత్మను చేరినావు,

దివ్యానందమయ అట్టడుగు లోకమందునకు లంఘించినావు;

విసిరితి వెక్కడకు నీ ఆత్మానుగత లక్ష్యాన్వేషణను, నీ ఆత్మశక్తిని?

అవిచ్ఛిన్న నిత్యశాశ్వతుని మార్గములో మూసుకుపోయిన

ఏ దారి కుప్పల మీద?

అశ్వపతి చటుక్కున తనలోనికి తిరిగాడు. ఒక కొత్త అవగాహన, ఒక కొత్త చైతన్యం అతనిలో ఉదయించ నారంభించాయి. ఒక కొత్త ప్రేరణ అతనిని కదిలించింది. అతను మరొక కొత్త ప్రయాణానికి, ఒక కొత్త అన్వేషణకు, సాఫల్యసిద్ధికి సమాయత్తమవాలి. ప్రపంచం పూర్తి సత్యంగానూ లేదు, దానికది భ్రాంతిగానూ లేదు. అది జగన్మాతలోను, ఆమె ద్వారాను తన ఉనికిని కలిగి ఉన్నది. దానికి ఒక ఉద్దేశం ఉంది. ఆమె ఇచ్ఛ ననుసరించి దాని ఉనికి మనుగడలోనికి వస్తున్నది. భూ జీవిత, మానవజీవిత పరిణామాల ద్వారా, ఒక లక్ష్యసిద్ధి, ఉద్దేశాన్ననుసరించి ప్రపంచం సాగిపోతున్నది. అజ్ఞానభూయిష్టమై, అసంపూర్ణమైన మానవజీవితం ఈ భూమి మీద అంతా ఇదే, అంతటికీ ముగింపిక్కడే అనే జీవితం మాత్రమే కాదు. ఆ జీవితం ఇక్కడే ఈ భూమి మీద జ్యోతిర్మయంగా, ప్రేమమయంగా, పరిపూర్ణంగా, ఆనందమయ జీవితంగా పరిణమించాలి. ఇప్పుడు ఈ విధంగా ఉన్న ప్రకృతి ఏదో అదే పవిత్రమైన, తేజోమయమైన పదార్థంగా మార్పుతో రూపధారణ చెందవలసి ఉంది. అశ్వపతి ఈ నూతన ప్రేరణతో నిండిపోయి, ఈ కొత్త దృష్టితో ఉత్తేజం

పొందాడు. ఇప్పుడు తన జీవిత సత్యాన్ని, సాధించవలసిన ధ్యేయాన్ని, ఈ భూమి మీద, పదార్థంలోను, దాని ద్వారాను సాక్షాత్కారింప చేసుకోవలసిన గొప్ప స్వప్నాన్ని చూసి, అవగాహన చేసుకున్నాడు. ప్రకృతి యుగయుగాలుగా, శాశ్వతత్వంతో నిరంతరాయంగా ముందుకు, అవిశ్రాంతంగా పరిశ్రమించడాన్ని అతడు తెలుసుకున్నాడు. అతడు లక్ష్యసిద్ధి ఇక్కడే, ఇప్పుడే అయి తీరాలనే అసహనానికి చాలా మటుకు లోనయాడు. ఏది ఏమయినా, దివ్యవాణి అతనికి ఓరిమితో శ్రమించుతూ, నెమ్మదిగా వేగం పెంచుకుంటూ పోవడమనే వివేకాన్ని కలిగించింది. ఆ వాణి అతనిని మందలిస్తున్నది.

నీ హృదయాగ్ని జ్వాలను నేనడగ లేదు మిళితమవాలని
అచల బృహత్తర నిర్లక్షిత పరమానందంలో...
బరువగు శక్తి నీ వంతు దగుటకు నీ ఆత్మ పుట్టుక;
ప్రకృతి ఆజ్ఞ నవధరించు పూర్ణించు నీ విధిని:
కష్టాలను భరించు, దైవానికై శ్రమించు,
నెమ్మదైన నడక సర్వజ్ఞ ఉద్దేశంతో కొనసాగించు జీవనము...
ఆ దైవం రూపాంతరం చెందించు ఘడియన సమస్తము మార్పునొందు.[8]

కాని మానవుని అంతరంగ హృదయజ్వాల ఒకసారి గనుక జ్వలితమైతే మరల దానిని మలిపివేయడం అసాధ్యం. అది ఫలితం తక్షణమే కావాలని కోరుతుంది. అది కాలం యొక్క సంపూర్ణతత్వాన్ని అర్థం చేసుకోలేదు. అందువలన అశ్వపతి ఎలుగెత్తి అరుస్తాడు:

బరువై, సుదూరమైనది మా శ్రమైక సంవత్సరాల గణనము
అయినా మనిషి అంతరాత్మపైన కలవు గట్టి సీలు ముద్రలు,
అలసిసొలసినది ఆ ప్రాచీన ప్రకృతిమాత హృదయము...
తచ్ఛాడనివ్వకు బహుకాలము నీ రూపు మార్చు చేతిని
కాలమను బంగారు కడ్డీని నొక్కుతూ నిస్సారంగా...
ఉన్నత శిఖరాల నుండి ఒక గొప్ప మాట చెప్పబడు గాక
ఒక మహోదాత్త కర్మ విధి తాళమును తెరుచు గాక[9]

ఎలుగెత్తి చేసిన ఈ మానవ ఆత్మ ఆర్తనాదము దివ్యమాతను కదలించింది, చివరకు ఆమె దాని ప్రార్థనను అంగీకరించింది. ఆమె తన మాతృహృదయంతో

అతని అన్వేషణ ఇక్కడితో ఆగినట్టనిపిస్తుంది. ఆ స్థితిలో ఎవరైనా సమ్మతితో శాశ్వతంగా ఎప్పటికీ అక్కడే ఉండిపోతారు.

...నిగూఢమై, దుర్గ్రాహ్యమై, —

అనంతమైన, శాశ్వతమైన, ఊహాతీత, ఏకాకి.[6]

అశ్వపతి బహుశా ఆ పరమానందపు ప్రలోభానికి కొంత వశుడైనట్లు కనిపించాడు. కాని అంతలోనే అతనిలో హఠాత్తుగా ఒక సందేహం ప్రవేశించింది — ఒక సంశయంగా, ఒక ప్రశ్నల పరంపరగా — ఒక వాణి అతనికి వినపడుతున్నది.

ఆహం నశించె; అస్తిత్వ, బాధ్యతల విముక్తి కలిగె,
జన్మ, మృత్యు, కర్మ, విధివిధానములిక మన దరికి రావు.
ఓ ఆత్మా, హర్షోల్లాసముల కపుడె సమయము కాదు!
హద్దు లేని ప్రశాంత పరమాత్మను చేరినావు,
దివ్యానందమయ అట్టడుగు లోకమందునకు లంఘించినావు;
విసిరితి వెక్కడకు నీ ఆత్మానుగత లక్ష్యాన్వేషణను, నీ ఆత్మశక్తిని?
అవిచ్ఛిన్న నిత్యశాశ్వతుని మార్గములో మూసుకుపోయిన
ఏ దారి కుప్పల మీద?

అశ్వపతి చటుక్కున తనలోనికి తిరిగాడు. ఒక కొత్త అవగాహన, ఒక కొత్త చైతన్యం అతనిలో ఉదయించ నారంభించాయి. ఒక కొత్త ప్రేరణ అతనిని కదిలించింది. అతను మరొక కొత్త ప్రయాణానికి, ఒక కొత్త అన్వేషణకు, సాఫల్యసిద్ధికి సమాయత్తమవాలి. ప్రపంచం పూర్తి సత్యంగానూ లేదు, దానికది భ్రాంతిగానూ లేదు. అది జగన్మాతలోను, ఆమె ద్వారాను తన ఉనికిని కలిగి ఉన్నది. దానికి ఒక ఉద్దేశం ఉంది. ఆమె ఇచ్ఛ ననుసరించి దాని ఉనికి మనుగడలోనికి వస్తున్నది. భూజీవిత, మానవజీవిత పరిణామాల ద్వారా, ఒక లక్ష్యసిద్ధి, ఉద్దేశాన్ననుసరించి ప్రపంచం సాగిపోతున్నది. అజ్ఞానభూయిష్టమై, అసంపూర్ణమైన మానవజీవితం ఈ భూమి మీద అంతా ఇదే, అంతటికీ ముగింపిక్కడే అనే జీవితం మాత్రమే కాదు. ఆ జీవితం ఇక్కడే ఈ భూమి మీద జ్యోతిర్మయంగా, ప్రేమమయంగా, పరిపూర్ణంగా, ఆనందమయ జీవితంగా పరిణమించాలి. ఇప్పుడు ఈ విధంగా ఉన్న ప్రకృతి ఏదో అదే పవిత్రమైన, తేజోమయమైన పదార్థంగా మార్పుతో రూపధారణ చెందవలసి ఉంది. అశ్వపతి ఈ నూతన ప్రేరణతో నిండిపోయి, ఈ కొత్త దృష్టితో ఉత్తేజం

పొందాడు. ఇప్పుడు తన జీవిత సత్యాన్ని, సాధించవలసిన ధ్యేయాన్ని, ఈ భూమి మీద, పదార్థంలోను, దాని ద్వారాను సాక్షాత్కరింప చేసుకోవలసిన గొప్ప స్వప్నాన్ని చూసి, అవగాహన చేసుకున్నాడు. ప్రకృతి యుగయుగాలుగా, శాశ్వతత్వంతో నిరంతరాయంగా ముందుకు, అవిశ్రాంతంగా పరిశ్రమించడాన్ని అతడు తెలుసుకున్నాడు. అతడు లక్ష్యసిద్ధి ఇక్కడే, ఇప్పుడే అయి తీరాలనే అసహనానికి చాలా మటుకు లోనయాడు. ఏది ఏమయినా, దివ్యవాణి అతనికి ఓరిమితో శ్రమించుతూ, నెమ్మదిగా వేగం పెంచుకుంటూ పోవడమనే వివేకాన్ని కలిగించింది. ఆ వాణి అతనిని మందలిస్తున్నది.

నీ హృదయాగ్ని జ్వాలను నేనడగ లేదు మిళితమవాలని
అచల బృహత్తర నిర్లక్షిత పరమానందంలో...
బరువగు శక్తి నీ వంతు దగుటకు నీ ఆత్మ పుట్టుక;
ప్రకృతి ఆజ్ఞ నవధరించు పూర్ణించు నీ విధిని:
కష్టాలను భరించు, దైవానికై శ్రమించు,
నెమ్మదైన నడక సర్వజ్ఞ ఉద్దేశంతో కొనసాగించు జీవనము...
ఆ దైవం రూపాంతరం చెందించు ఘడియన సమస్తము మార్పునొందు.[8]

కాని మానవుని అంతరంగ హృదయజ్వాల ఒకసారి గనుక జ్వలితమైతే మరల దానిని మలిపివేయడం అసాధ్యం. అది ఫలితం తక్షణమే కావాలని కోరుతుంది. అది కాలం యొక్క సంపూర్ణతత్వాన్ని అర్థం చేసుకోలేదు. అందువలన అశ్వపతి ఎలుగెత్తి అరుస్తాడు:

బరువై, సుదూరమైనది మా శ్రమైక సంవత్సరాల గణనము
అయినా మనిషి అంతరాత్మపైన కలవు గట్టి సీలు ముద్రలు,
అలసిసొలసినది ఆ ప్రాచీన ప్రకృతిమాత హృదయము...
తచ్ఛాదనివ్వకు బహుకాలము నీ రూపు మార్చు చేతిని
కాలమును బంగారు కడ్డీని నొక్కుతూ నిస్సారంగా...
ఉన్నత శిఖరాల నుండి ఒక గొప్ప మాట చెప్పబడు గాక
ఒక మహోదాత్త కర్మ విధి తాళమును తెరుచు గాక[9]

ఎలుగెత్తి చేసిన ఈ మానవ ఆత్మ ఆర్తనాదము దివ్యమాతను కదలించింది, చివరకు ఆమె దాని ప్రార్థనను అంగీకరించింది. ఆమె తన మాతృహృదయంతో

పరితపించుతూ దప్పిగొన్న ఆత్మను తన సమాధానంతో అనుగ్రహించింది.

ఓ ధృఢ భవిష్యగామీ, నీ ఆర్తిని నేను విన్నాను.
దిగివచ్చు నొకరు పగులగొట్టు ఇనుప చట్టాన్ని...
భయంకర మృత్యు ఘడియలో నాటబడును ఒక బీజం,
స్వర్గశాఖ మరోసారి అంటుకట్టబడు మానవ దేహంలో,
ప్రకృతి అధిగమించు తన ప్రాణాంతక నడక;
విధి మార్చబడు నొక మార్పులేని ఇచ్ఛతో.[10]

ఆమె తనకు తానుగా అశ్వపతి కూతురుగా, మానవ శ్రమను నిర్వర్తించుటకు, దైవకార్యం నెరవేర్చుటకు భూమి మీద అవతరించింది.

2

దివ్యమాత ఈ భూమి మీద మానవజీవిగా వచ్చింది. ఆమె మరణాంతకమైన భూమిని అమరమగు స్వర్గభూమిగా మార్చడానికి సిద్ధపడింది. భూమి ప్రస్తుతం ఒక భౌతికమైన అచేతనత్వంతో నిండిన ముద్ద. పరమచైతన్యం పరమ చైతన్యరహితంగా అభివ్యక్తమయింది. దైవం తానను తాను నుసి చేసుకొని, ఉనికిని కోల్పోయాడు, అన్ని వైపులా చెల్లాచెదురు అయిపోయాడు. అమృతత్వం ఆ విధంగా మృత్యువులో సమాధి అయింది. అవతారమూర్తి అయిన పరమాత్మ చైతన్యం ముందున్న కర్తవ్యం మృత్యు కుహరంలో బంధింపబడిన దివ్యత్వాన్ని ఉద్ధరించటం, భౌతిక అచేతనత్వం యొక్క మసక చీకటిలో మగ్గుతున్న మానవచైతన్యానికి ఈ ప్రాపంచిక జీవితంలో విముక్తిని ప్రసాదించడం, దివ్యచైతన్యాన్ని దాని మూల తేజోమయస్థితిలో పునఃప్రతిష్ట చేయడం.

అది సావిత్రి ముందున్న కర్తవ్యం. ఈ విధాయక కర్మ రెండు అంచెలలో ఉంటుంది. మొదటిది దాని కొరకు సిద్ధపరచడం, రెండవది దాని సాఫల్యత. మానవరూపంలో ఉన్న సావిత్రికి ఆమె పృథ్వీజీవితంలో ఈ పనికి పన్నెండు నెలల గడువు మాత్రమే ఇవ్వబడింది; అంత తక్కువ సమయంలో ఆమె తాను చేయవలసిన పనికి మొత్తం సమాయత్తమవాలి. ఆమెకు పుట్టుక నుంచే తాను చేయవలసిన పని ఏమిటో తెలుసు, ఆమెకు తన చైతన్యపు ఎరుక ఉన్నది, తనకు అప్పగించబడి, తాను నెరవేర్చవలసిన కార్యము ఆమెకు తెలుసు. ఇప్పుడు ఆమె చాలా క్లిష్టపరిస్థితిని ఎదుర్కొంటున్నది. మృత్యువు ఆమెకు ఎదురుగా నిలుచుని ఉన్నది. ఏమి చేయాలి? ఆమె ఏ విధంగా అడుగు వేయాలి? మృత్యువును జయించాలని ఆమెకు చెప్పబడింది,

అమృతత్వ జీవనాన్ని ఈ మర్త్యభూమిలో ఆమె స్థాపించాలి. దివ్యవాణి మారు మ్రోగుతున్నది.

అంతరాత్మా,మేలుకో, జయించు కాలమును, మృత్యువును.[11]

అవును, అది చేయడానికి, ఆమె సిద్ధపడింది. కాని అది తన కోసం కాదు, తన ప్రేమ కోసం, ఆమె ప్రాణానికి ప్రాణమైన అస్తిత్వం కోసం. సావిత్రి దివ్య చైతన్యమూర్తి, కాని ఈ నశించిపోయే శరీరంలో ఆమె మానవ చైతన్యంతో ఆఛ్ఛాదింపబడి ఉన్నది. ఆ మానవ చైతన్యాన్ని ఆమె ఊర్ధ్వముఖంగాను, దానికి ఆవలగాను నడిపించాలి, ఆ మానవ చైతన్యంలోను, దాని ద్వారాను దివ్యసాక్షాత్కారత అభివ్యక్తమై, స్థాపించబడాలి. మానవరూపంలోని సావిత్రి ప్రకటిస్తున్నది: మృత్యువు జయించ బడిందంటే, అది సత్యవంతుడు తనతో శాశ్వతంగా జీవించుట కోసమే. బహుశా ఆమె చెప్పదలచుకున్నది ఇది కావచ్చు, నేను చూడదలచుకున్నది జీవించి ఉన్న సత్యవంతుని, నేను ఆయనతో ఎప్పటికీ కలసి ఉండటాన్ని, ఆయనలేని పృథ్వీజీవితం నా కవసరం లేదు, అంతగా ఇక్కడ అది జరగదనే పక్షంలో, ఈ అస్పష్టత, ఈ పెనుగులాటలతో నిండిన భూమికి దూరంగా మరో లోకంలో ఉండటాని కయినా నేను ఇష్టపడతాను.

నా నుంచి నా బలము గ్రహించబడి ఇవ్వబడెను మృత్యువుకు,
ఏల చేతులెత్తి అర్థించాలి ఆ మూయబడిన స్వర్గాలను
ఏల పెనుగులాడాలి నేను లొంగని భూధర్మాల తోటి,
లేక తప్పనిసరైన మృత్యుఘడియల తప్పించుటకు?
సరియైన మార్గము నా విధితో సాగిపోవుటయే
నా ప్రేమికుని అడుగుజాడల ననుసరించి పయనించుటయే.
చీకటి నుండి సంజె వెలుగుకు అట నుండి ఆదిత్యుని చెంతకు[12]

కాని పైనుంచి ఒక వాణి మేఘగర్జనతో సావిత్రి మూల అస్తిత్వాన్నే కదిలిస్తూ వినవచ్చింది.

"నీ ఆత్మ మేల్కొంచి తానే పనికై విచ్చేసిందో ఆ పని
అర్ధాంతరంగా ఏల ఆగిందని అడిగితే ఏమిటి సమాధానం?"[13]

అశ్వపతి ఎటువంటి సంక్లిష్టతను ఎదుర్కొనవలసి వచ్చిందో అటువంటిదే అయిన కఠిన పరిస్థితి ఇప్పుడు సావిత్రికీ ఎదురయింది. వారు ఇద్దరు కూడా భూమికి

దూరంగా దారితోచక స్వచ్ఛమైన స్వర్గధామ దివ్యానందాలలోనో లేక ధరిత్రి గడ్డ మీద అవిశ్రాంతంగా శ్రమిస్తున్న లోకం లోనో ఉన్నారు. సావిత్రికి ఇప్పుడు ఆమె ఆత్మ దాని సంపూర్ణత్వంతో పూర్తిగా సాక్షాత్కారమయింది. ఆమె ఏ బలవద్విధితో క్రిందికి వచ్చిందో, ఏ మహాత్కార్యాన్ని ఈ భూమి మీద ఆమె సాధించవలసి ఉందో, — ఏ మాత్రం వ్యక్తిగతం కానిది, లేక స్వయం సంతృప్తి కోసమో లేక ఒక వ్యక్తి సంతృప్తి కోసమో కానిది — అది ఒక విశ్వసంసిద్ధికై, ప్రపంచవ్యాప్తంగా మానవుల సాక్షాత్కారం కోసం అనే విషయం ఆమెకు దృగ్గోచరమయింది. సావిత్రి లోని ఆ దేవత ఇప్పుడు పూర్తిగా మేల్కొంది, తన అపారతతో ఆమెలో సుస్థిరమై ఉన్నది — మానవచట్రంలో దివ్యత్వం అవతరించినట్లుగా. సర్వదేవుళ్ళు, దేవతల అంశలు ఇప్పుడు ఆమెలో ప్రవేశించి ఆమె బ్రహ్మాండస్వరూపం మొత్తాన్ని సంపూర్ణంగా తీర్చిదిద్దాయి.

ఇక్కడి నుంచి ఆమెకు అప్పగించబడిన పనిలో రెండవ అంకం ప్రారంభమయింది. ఆమె సాధించవలసిన కార్యం మృత్యువును జయించటం. కేవలం దివ్యమానవ అస్తిత్వం మాత్రమే మృత్యువును గెలవకలదు. సావిత్రి ఒక్కొక్క అడుగువేస్తూ మృత్యువును అనుసరిస్తున్నది, క్రమక్రమంగా మృత్యువు రహస్యం, అతని వ్యక్తిత్వం, అతని నిజమైన విధాయక కర్మ ప్రస్ఫుటమవుతున్నది. ఆ నల్లని శరీరఛాయగల దేవుడు మాత్రం తానే సత్యవంతుని, సావిత్రిని తనతో పాటుగా, తన లోకమైన, అంధకారబంధురమైన వినాశనా క్షేత్రానికి తీసుకువెడుతున్నానని అనుకుంటున్నాడు. ఎందువల్లనంటె, మృత్యువు మొదట కనపడిన తీరు ఆ విధంగా ఉంది. అది పూర్తిగా విధ్వంసం, శూన్యస్థితి, ఏ ఉనికీ లేని అభావస్థితి; అందువల్ల మహాశక్తివంతమైన ఆ దేవుడు, అధికారస్వరంతో దర్పం ఉట్టిపడేలా మానవకాంత అయిన సావిత్రి నుద్దేశించి అంటున్నాడు:

ఇది నా అపారమైన చీకటి నిశ్శబ్దం,
ఇది శాశ్వతరాత్రికి నివాసప్రదేశం,
ఇది ఏమీ లేని స్థితి యొక్క మర్మం
జీవిత వ్యర్థ ఆడంబర కోర్కెల సమాధి ఇది...
ఇప్పటికీ ఎల్లకాలం జీవించి ప్రేమిస్తుండాలని ఆశిస్తున్నావా?[14]

నిజానికి మృత్యువు కేవలం శరీరం నాశనం చేసేదే కాదు, అది వాస్తవానికి

ఏమీ లేని స్థితి, ఏ ఉనికీ లేని అభావస్థితి. ఏ క్షణానయితే అస్తిత్వం, ఉనికి, వాస్తవికతలకు తాము అభివ్యక్తమైనాయో, ఒక ప్రధానమైన విషయంగా ధృవరపడ్డాయో మరు క్షణంలో, దానికి సమాంతరంగా, దాని కెదురుగా నిలబడింది, దానికి వ్యతిరేకమైన అస్తిత్వరహితస్థితి, ఉనికిలేని అభావస్థితి, అవాస్తవ స్థితి. ఒక శాశ్వతమైన 'అస్తు' కు వ్యతిరేకంగా ఒక శాశ్వతమైన 'నాస్తి' వాస్తవంగా ఏర్పడింది. వాస్తవానికి ఈ శాశ్వతమైన నాస్తియే అధికాధికంగా సమర్థవంతమై, యదార్థమై విశ్వంలోని సంవిధాన శక్తి అయి నటువంటి ప్రతి అణువు చుట్టూ పెనవేసుకుని ఉన్నది. అదే భౌతికక్షేత్రంలో వెనుకకు మరల్చ వీలులేని, క్రింది స్థాయికి దిగజారిన శక్తిగా అభివ్యక్తమయింది. మర్త్యప్రపంచంలో కరాఖండైన నిరాకరణగా, అనిశ్చిత స్థితిగా, అసత్యంగా ఉంది. అదే జీవితంలో అపజయాలనూ, అడ్డంకులతో భగ్నపరిచే చికాకునూ, దైన్యతనూ, దుఃఖాన్నీ తీసుకు వస్తుంది. కాని సావిత్రి దృష్టి సుదూరతీరాల ఆవలకు చొచ్చుకుపోయి, మృత్యువనేది ఇంకా ఎక్కువ వేగంగా, ఇంకా ఎక్కువ సంపూర్ణంగా ముగింపును అందుకోవటానికి ఒక సుగమ మార్గంగా తిలకించింది. ఇంకేమీ లేదనే తిరస్కారభావం, అభివృద్ధిపరచడా నికి, పవిత్రీకరించడానికి ప్రపంచము, మానవజాతి తిరిగి కొత్త ఆకృతితో, కొంగ్రొత్త సృష్టిని పొందగలందులకై సమాయత్తపరచే వేగాన్ని తీవ్రతరం చేసేటందుకు ఒక ప్రత్యక్ష అవరోధం. ఈ ఉగ్రదేవుడు మానవ ఉద్యమాన్ని చివరి వరకు దాని బాగోగు లతో, ఇక ఏమీ చేయటానికి మిగలలేదనేటంత వరకు అనుసరిస్తుంటాడు. ఆ విధంగా అతడు చేయవలసిన విధాయకకర్మ కూడా సఫలీకృతమవుతుంది.* అందువలన ఒక చివరి కేక, నిరాశాపూరిత మృత్యువు చివరి అరుపు, విశ్వాన్ని చీల్చుకుంటూ సావిత్రికి ఆఖరి సవాలును విసురుతుంది:

అమృతత్వం నా హక్కని వాదించే ఓ మానవా,
చూపించు నీ శక్తిని, బట్టబయలు చేయి నీ ఆత్మశక్తిని,
ఇవ్వగలనప్పుడే నేను నీ సత్యవంతుని.

* ఇక్కడ మనకు గోయెత్ భావించినటువంటి మానవజీవితాలలో పాత్ర వహించినటువంటి సైతాను (వ్యతిరేకసూత్రం) పాత్రకు సామ్యత గుర్తుకు వస్తుంది. సైతాను పూర్తిగా విధ్వంసకారక దుష్టదెయ్యం కాదు, అతడు నిర్మాణాత్మక దేవత, అందువలననే అతడు
తప్పక పొడిచి బాధించు, వేధించు నాతడె
శ్రమించి పెనుగులాడు సృష్టి సేవకై ఎప్పుడెప్పుడు
మానవ శ్రమ కృంగు సరి అయిన స్థాయి కిందకు

లేక ఉండిన మహాశక్తి మాత నీకు తోడుగా,

చూపించు ఆమె వదనారవందము, చేతు నామె కప్పుడు ఆరాధనము;

మరణము లేని చక్షులు చూచుగాక మృత్యు చక్షులందు...[15]

మృత్యువు కోరిక, అతడి ప్రార్థన కూడా ఫలించింది. అతడు సావిత్రిని ముఖా ముఖి చూశాడు. కాని అతడు ఎదుర్కొన్న సావిత్రి తాను పోరాడిన సావిత్రి కాదు. ఎవరిదీ కంఠస్వరము?

అందుకో నా అభినందన సర్వశక్తిమంత, జయచరిత మృత్యు,

అనంతం యొక్క అంధకార ఆర్భాటానివి నీవు.

గంభీర, భయోత్పాత రూపమొసగితి నేను నీకు

భీతి గొలుపు బాధించు పదునైన కత్తిని సైతం.

వెలుగుకై పోరాటానికి మానవాత్మను రెచ్చగొట్ట...[16]

దాని తరువాత జరిగేదంతా, ఒక విధంగా. కొంత ఆశ్చర్యం కలిగించే, భయం కలిగించే అద్భుతం. అన్ని వైపులా కాంతి విరజిమ్మగా ఉవ్వెత్తున ఎగసి నాలుకలాగా చాపిన మంట దిక్కులన్నింటిని కప్పగా, నల్లని రూపంతో కూడిన మృత్యువు అందులో దగ్ధమైపోయాడు, కాని భస్మం కాలేదు. మిరుమిట్లు గొలుపు కాంతులీను తేజోరాశిగా మారిపోయాడు.

కబళించే కాంతి యాతని శరీరము, లీనమైపోయె నాతని ఆత్మ.[17]

ఆ విధంగా మృత్యువు తన చావును చేరాడు; వాస్తవానికది మరణము కాదు, కాని ఒక కొత్త అవతరణం. మృత్యువు తన దివ్య సత్యమూల స్థితిని, దివ్యమాత అంశారూపమును తిరిగి పొందాడు.

ఒక రహస్య వైభవ కాంతి ఎగసి బహిర్గతమాయె దృష్టికి

ఒకప్పుడు విశాల శూన్య దేహధారి నిలచిన చోటున.

మసక ముసుగు కాళరాత్రి మారె నొక అద్భుతవదనంగా.[18]

అతీత కాంతిక్షేత్రములో మానవమూర్తి సావిత్రి, మార్పునొందిన సత్యవంతుడు ఎదురెదురుగా నిలుచుని ఉన్నారు.

3

సావిత్రి కేవలం సౌందర్యం తప్ప ఏమాత్రం దోషం లేనటువంటి, కేవలం ఆనందం తప్ప ఏమాత్రం కళంకం లేనటువంటి, స్వతఃసిద్ధమై చెప్పలేనంత బలంతో నిండినటు

వంటి అమరమైన తేజోమయలోకంలోకి ప్రవేశించింది. సావిత్రికి శ్రావ్యంగా దివ్యవాణి వినపడింది:

నీవు ఇప్పుడు భూమికి చెందిన దైన్యస్థితి, దాని ఘోరమైన పరిస్థితులను దాటిపోయావు. నీవు స్వచ్ఛమైన సౌభాగ్యసీమకు చేరుకున్నావు. నీవు సంక్షోభ భరితమైన పాతజీవితానికి మరలిపోనవసరం లేదు. మీరిరువురూ ఇక్కడే నివసిస్తూ ప్రశాంతభరితమైన శాశ్వతానందములో సంతోషముగా ఉండవచ్చును.

కాని సావిత్రి దృఢంగా, ఏమాత్రం చలించకుండా ప్రత్యుత్తరమిచ్చింది.

అందుకోను నేను నీ శాశ్వతమగు దినమును,
శాశ్వతమగు నీ రాత్రిని కూడ త్యజించినట్లుగా,...
అత్యంత శక్తియుత ఆత్మల ఎంపికయే వసుంధర
వీరోచిత ఆత్మల యుద్ధభూమి గాదె వసుంధర...
భూమిపై నీ కొరకైన సేవలు గొప్పవి, ప్రభూ,
మహిమాన్విత స్వర్గవిమోచనముల కన్నింటి కన్నను.[19]

మరొకమారు సావిత్రి కూడా, అశ్వపతి వలెనే రెండు భవితవ్యములు, రెండు ఆత్మగమనముల నుంచి, ఎన్నుకోవలసిన సమయం — ఆమెకు ఇవ్వజూపకముందే ఆ ఎంపిక జరిగిపోయినప్పటికీ — ఆసన్నమయింది. ఏ విధంగా, శుద్ధతేజోమయమై మార్పులేని నిశ్శబ్ద అతీతస్థితిని, ఈ నిమ్నభూకాంతులలో ఓలలాడటం కోసమై అశ్వపతి తోసిరాజన్నాడనే విషయం మనకు తెలుసు. సావిత్రి కూడా మానవచైతన్యానికి నమూనా అయినందువలన, తన ఎంపికతో, ఈ భూప్రకాశం వైపుకు మరలింది.

ఉపనిషత్ ఋషి ఈ విధంగా ఘోషించాడు: కేవలం అజ్ఞానమునే ఆరాధించు వారు గాఢాంధకారమును చేరెదరు. కాని జ్ఞానము నారాధించువారు మాత్రము ఇంకా కటికచీకటి అయిన గాఢాంధకారము నందు ప్రవేశించెదరు. ఉపనిషత్ ఋషి దర్శించి, వర్ణించినటువంటి ఆదిత్యుని కప్పిన బంగారుమూతయే సావిత్రి వర్ణించి నటువంటి 'శాశ్వతమగు దినము' ఉండు లోకపు విశుద్ధకాంతి. ఆదిత్యుడు సంపూర్ణమైన సమగ్ర సత్యప్రకాశం. ఎవరైనా ఆదిత్యుని దర్శించాలంటే ఆ బంగారు మూతను తొలగించవలసినదే. ఎవరైనా సమగ్ర జీవితం కొనసాగించాలనుకుంటే వారు సమగ్ర సత్యాన్ని వశం చేసుకోవలసినదే.

దాని కొరకే సావిత్రి కిందకు ఈ భూమి మీదకు దిగి వచ్చింది, స్వాగతిస్తున్న

ఆ నేల మీద నిలబడి ఈ మృతి చెందే మనుషుల మధ్య నివసించటానికై, వారిదైన స్వర్గధామమును త్యజించినందుకు ఓదార్చుతున్నదా అన్నట్లుగా సత్యవంతునితో సంభాషిస్తున్నది:

స్వర్గస్పర్శపూర్ణత నిచ్చు కాని రద్దు చేయదు మన భూమిని...
అయినను నీకై వచ్చితి నేనే ఈ గుసగుసల మధ్య
సూర్యకిరణకాంతుల గుబురాకుల వెలిగే ఈ అరణ్యపు చిట్టచివరన...
మునుపు నేనెట్లుంటినో, ఇప్పటికిని ఉంటి నీకు ఆ విధముగనే...[20]

సత్యవంతుని ఆలోచన, అనుభూతులకు వాగ్రూపమిస్తూ సంతోషముతో, కృతజ్ఞతాపూర్వకంగా ఈ మానవజాతి మొత్తము ఈ అభినందనమంత్రమును ఉచ్ఛరిస్తున్నది.

ఈ ప్రపంచము ఆలకించినది ఆమెనే అయినచో
ఏ సంతోషకర మార్పుకు ఆశ్చర్యపడనక్కర లేదు[21]

మూలం: నళినీకాంత గుప్త

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

1. శ్రీఅరవిందులు: సావిత్రి Book II: Canto 8: p. 250; 2. శ్రీఅరవిందులు: సావిత్రి Book II: Canto 8: p. 260; 3. శ్రీఅరవిందులు: సావిత్రి Book II: Canto 7: p. 238; 4. శ్రీఅరవిందులు: సావిత్రి Book II: Canto 8: p. 262; 5. శ్రీఅరవిందులు: సావిత్రి Book III: Cantos 1-2: pp. 349, 351; 6. శ్రీఅరవిందులు: సావిత్రి Book III: Canto 1: p. 350; 7. శ్రీఅరవిందులు: సావిత్రి Book III: Canto 2: p. 351; 8. శ్రీఅరవిందులు: సావిత్రి Book III: Canto 4: pp. 380, 386; 9. శ్రీఅరవిందులు: సావిత్రి Book III: Canto 4: pp. 390-91; 10. శ్రీఅరవిందులు: సావిత్రి Book III: Canto 4: pp. 391-92; 11. శ్రీఅరవిందులు: సావిత్రి Book VII: Canto 2: p. 539 (474); 12. శ్రీఅరవిందులు: సావిత్రి Book VII: Canto 2: p. 539 (474-475); 13. శ్రీఅరవిందులు: సావిత్రి Book VII: Canto 2 : p. 540 (475); 14. శ్రీఅరవిందులు: సావిత్రి Book IX: Canto 2: p. 661 (586); 15. శ్రీఅరవిందులు: సావిత్రి Book X: Canto 4: p. 745 (664); 16. శ్రీఅరవిందులు: సావిత్రి Book X: Canto 4: p. 747 (666); 17. శ్రీఅరవిందులు: సావిత్రి Book X: Canto 4: p. 749 (667); 18. శ్రీఅరవిందులు: సావిత్రి Book XI: Canto 1: p. 762 (679); 19. శ్రీఅరవిందులు: సావిత్రి Book XI: Canto 1: p. 770 (685-686); 20. శ్రీఅరవిందులు: సావిత్రి Book XII: p. 808 (719)
21. శ్రీఅరవిందులు: సావిత్రి Book XII: p. 812 (723)



అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబరు 2011

6/9/2011

విషయసూచిక

శ్రీఅరవిందాశ్రమము

(శ్రీమాతారవిందులు చెప్పిన మాటల సంకలనం)

పరిచయము

1

ఈ ఆశ్రమము ప్రారంభించింది, సాధారణంగా ఇటువంటి ఆశ్రమాలు ఏర్పాటుచేసినట్లు ప్రాపంచిక జీవితాన్నుంచి తప్పించుకోడానికి కాదు. ఇది జీవపరిణామానికి ఒక కేంద్రంగా, దాని కోసం చేసే అభ్యాసాని కొక క్షేత్రంగా ఏర్పడింది. ఆ లక్ష్యానికి పరాకాష్ట వేరొక రకమైన జీవపు ఆకృతి; ఒక ఉన్నత ఆధ్యాత్మిక చైతన్యంతో నడుచుకుంటూ ఆత్మ దివ్యజీవితాన్ని అవధరింపచేసే ఒక మూర్తి

శ్రీఅరవిందులు

2

శ్రీఅరవిందుల యోగలక్ష్యము అంతర్గతంగా ఆత్మాభివృద్ధి పొందడం. దీన్ని అనుసరించిన ప్రతివారు క్రమంగా అందరిలో ఉండే పరమాత్మను గుర్తించి మానసికచైతన్యాన్ని మించిన ఉన్నతచైతన్యాన్ని వికసింపజేసుకోగలరు — అదే మానవ ప్రకృతిని దైవత్వంగా మార్చగల ఆధ్యాత్మిక అతిమానస చైతన్యము.

శ్రీఅరవిందులు

3

...ఈ ఆశ్రమం శక్తిపూరితమైన, క్రియాశీలక ప్రశాంతతల సంగ్రహరూపము. ఆ ప్రశాంతత ఎంతవరకంటె బయటనుంచి వచ్చినవారి కది వేరే లోకంలోకి వచ్చినట్లే ఉంటుంది. నిజం చెప్పాలంటే అది కొంత వరకు కొత్త లోకమే. ఈ ప్రపంచంలో అంతరంగ జీవితం బాహ్యజీవితాన్ని పాలన చేస్తుంది. పనులన్నీ కూడా వ్యక్తి ప్రయోజనాల కోసం కాకుండా, ఒక లక్ష్యసాధనకై నిస్వార్థంగా జరుపబడతాయి. ఇక్కడ మేము గడిపే జీవితం సన్యాసుల మాదిరి అన్నీ వదిలి ఉండటమూ కాదు, శక్తిని హరించే సౌఖ్యజీవనమూ కాదు. అన్నిటా సరళంగా ఉండటమే ఇక్కడి పద్ధతి. ఇక్కడ సరళత్వంలో వైవిధ్యం సంపూర్ణంగా ఉంటుంది. వృత్తులలో వైవిధ్యం, పనుల్లో వైవిధ్యం; ఇంకా రుచుల్లో, వైఖర్లలో, స్వభావాల్లో అన్నిటా వైవిధ్యమే. ఎవరి జీవితాన్ని వారికి నచ్చిన రీతిలో వ్యవస్థీకరించుకొనే స్వేచ్ఛ ఇక్కడ ప్రతి ఒక్కరికీ ఉంది. ఇక్కడున్న వారందరి జీవనమూ వ్యవస్థీకరించడానికీ, యోగలక్ష్యాన్ని

భంగపరచేవాటిని చేయకుండా ఉండటానికీ ఏమాత్రం క్రమశిక్షణ అవసరమో అంత మాత్రమే ఇక్కడ పొటిస్తాము.

శ్రీమాత

(శ్రీమాత శతజయంతి ప్రచురణ వాల్యూం 16, పుట 7, 8)

అనువాదం అమరవాది ప్రభావతి, అమరవాది వెంకటరామ శాస్త్రి)

సంక్షిప్తంగా

ప్రకృతిలోని పరిణామక్రమం ఆరోహణా మార్గంలో ఉంటుంది. ఆదిలో రాతి నుంచి వృక్షజాతి, వృక్షజాతి నుంచి మృగాలు, మృగాల నుంచి మానవుడు ఆవిర్భవించారు. ఈ విధంగా సాగిన పరిణామక్రమంలో ప్రస్తుతం మానవుడే శిఖరాగ్రం మీద ఉన్నట్లుగా భావించడం వల్ల ఈ ఆరోహణాక్రమంలో తానే చరమస్థాయి కాబట్టి ఈ సృష్టిలో తన కంటె గొప్పది ఏదీ లేదని భావిస్తాడు. ఈ విషయంలో అతను పొరపడినట్లే. అతని భౌతిక ప్రకృతిలో అతను ఇంచుమించుగా జంతువుగానే ఉన్నాడు; ఆలోచించ గలిగి, మాట్లాడగలిగినా ఇంకా దైహిక చర్యలలోనూ, సహజప్రవృత్తులలోనూ, పశులక్షణాల తోనే ఉన్నాడు. ఇటువంటి అపరిపూర్ణ ఫలంతో ప్రకృతి సంతృప్తి చెందకపోవడం అనేది నిస్సందేహం. ప్రకృతి మాత ఏ విధంగానైనా కృషిచేసి ఒక కొత్త జీవిని — ఈనాడు మానవునికీ, జంతువుకీ ఉన్న తేడా ఎలాటిదో అలాటి తేడా ఆ కొత్త జీవికీ మానవునికీ ఉండేటట్లు — సృష్టించ ప్రయత్నిస్తుంది. ఆ జీవి బాహ్యానికి మానవరూపంలోనే ఉన్నప్పటికీ ఆతని చైతన్యం మానవ మేధస్సుకు అంటే అజ్ఞానానికి దాసోహం చేసే అతని అల్ప మేధస్సుకు అందనంత ఉన్నతంగా ఉంటుంది.

మానవులకు ఈ సత్యాన్ని బోధించేందుకే శ్రీఅరవిందులు ఈ భూమి పైకి దిగివచ్చారు. మానవుడు మానసిక చైతన్యంతో చరించే సంక్రమణజీవి మాత్రమేననీ, నూతన చైతన్యాన్ని సంతరించుకోగల అవకాశం ఉన్న జీవి కాబట్టి, ఆ సత్యచైతన్యాన్ని పొంది చక్కటి మంచి ఆనందదాయకమూ, సామరస్యపూరితమూ అయిన జీవితాన్ని పూర్తి చైతన్యంతో గడపగల సామర్థ్యం కలవాడేననీ ఆయన చెప్పారు. శ్రీఅరవిందులు జీవించినంతకాలం అతిమానస చైతన్యంగా చెప్పే ఈ నూతన చైతన్యాన్ని తనలో

నెలకొల్పుకోటానికై సమయాన్నంతా వెచ్చించారు. ఇంకా తన ననుసరించివున్న వారికి కూడా దీన్ని సిద్ధింపచేసుకోటానికి సహాయమందించేవారు.

శ్రీమాత

అనువాదం: అమరవాది వెంకటరామ శాస్త్రి, ప్రభావతి

ఆవిర్భావము — చరిత్ర

శ్రీమాత:

(1912 వ సంవత్సరంలో ఆమె ఫ్రాన్స్ దేశంలో రాసిన వ్యాసము నుంచి)

ఒక ప్రవర్ధమాన సార్వత్రిక సామరస్యం నెలకొల్పడమే సాధించవలసిన లక్ష్యం కావాలి.

ఈ భూమికి సంబంధించినంతవరకు ఈ లక్ష్యాన్ని సాధించే విధానం, ప్రతివారి లోనూ ఉండే ఆ ఏకైక దైవత్వాన్ని మేలుకొలిపి తద్వారా మానవ ఐక్యతను సాధించ డము.

* ప్రతి ఒక్కరూ వారి వారిలో ఉండే దైవాన్ని గుర్తెరిగి దానితో ఏకత్వం పొందడం.
* ఇప్పటిదాకా మనిషిలో చైతన్యం పొందని వివిధ అస్తిత్వభూమికలను వ్యక్తీకరించి, తద్వారా ఇంత వరకూ భూమికి అందకుండా ఉన్న సార్వత్రిక శక్తి విస్ఫోటక కేంద్రాలతో అనుసంధానపరచడం.
* సామూహికంగా, ఒక అనుకూల ప్రదేశంలో భగవంతుని బిడ్డలనదగిన కొత్తజాతి వికసించేటట్లుగా ఒక ఆదర్శ సంఘాన్ని స్థాపించడం.

పృథ్వీ పరివర్తనము, సామరస్యీకరణము రెండు పద్ధతుల ద్వారా సాధించవచ్చు. అవి పరస్పర విరుద్ధములుగా కనిపించినప్పటికీ రెండూ కలిసిపోయి ఒకదానిపై యొకటి పనిచేసి రెండూ కూడా పరస్పరం పూరించుకోవాలి:

మొదటి పద్ధతి: వ్యక్తి పరివర్తన; అంతర్గతంగా అభివృద్ధి చెంది తద్వారా దైవంతో ఏకత్వం పొందడం.

రెండవది: సామాజిక పరివర్తన; వ్యక్తి వికాసం చెంది అభివృద్ధి గాంచటానికి తగిన వాతావరణాన్ని ఏర్పరచడం.

పరిసరాల ప్రభావం వ్యక్తి మీద ప్రతిబింబిస్తుంది. ఇంకో విధంగా చూస్తే పరిసరాలకు విలువ వ్యక్తినిబట్టే ఉంటుంది కాబట్టి, ఈ రెండు కార్యక్రమాలు జంటగా సాగాలి.

సమాజ సభ్యుల కార్యాచరణ మూడంచెలుగా ఉండాలి:

1. సాధించవలసిన ఆదర్శాన్ని తనలో సిద్ధింపచేసుకోవటం; సకల గుణాలతో, ప్రవృత్తులతో, విశేషణాలతో ఆవిష్కరించబోయే ఆ అచింత్యరూపునికి పరిపూర్ణుడైన ప్రథమ ప్రతినిధిగా తయారుకావాలి.
2. ఈ ఆదర్శాన్ని బోధించాలి. ఆ బోధనలు కేవలం మాటల్లోనే కాక తానే ఉదాహరణగా నిలవాలి. ఎవరైతే ఈ ఆదర్శాన్ని తమలో కూడా సిద్ధింపచేసుకొని, తామూ కూడా ముక్తిని బోధించేవారుగా తయారవాలని ఉత్సుకతతో ఉంటారో వారందరినీ కలుపుకోటానికొక ఉదాహరణగా నిలవాలి.
3. ఈ నమూనాగా ఒక సంఘాన్ని స్థాపించడం కానీ లేక అంతకు ముందే ఉన్న సంఘాన్ని దేన్నైనా పునర్వ్యస్థీకరించడం.

*

నా ఈ ప్రస్తుతజన్మ ప్రారంభదశల్లో మంచి ఆకాంక్షాపరులైన పలువ్యక్తులతో నాకు పరిచయమైంది. వారు తమకు ప్రగాఢమైన ఆంతరిక ఆకాంక్ష ఉన్నదనీ, ఏదో ఒక నిగూఢతత్వము, సత్యము కోసం తమలో ఆరాటం కలుగుతోందని అయితే వారు భుక్తి కోసమనే పాశవిక ఆవశ్యకతకు లోబడి సంపాదన కోసమే రోజులు గడపవలసి వస్తోందనీ, అది వారికి చాలా బాధ కలిగిస్తోందనీ, అది వారి సమయాన్నీ, శక్తినీ హరిస్తోందనీ, అందువలన తామింకేమీ చేయలేకపోతున్నామనీ వాపోయేవారు. ఇలా చాలా సార్లు విన్నాను.

అప్పట్లో నేను చాలా చిన్నదాన్ని; ఏదో ఒక రోజున నా వల్ల అయేటట్లయితే ఒక చిన్న ప్రపంచం సృష్టించాలని నాలో నేను అనుకొనేదానిని. ఆ చిన్ని ప్రపంచంలో ప్రజలు తిండి, బట్ట, తదితర నిత్యావసరాల కోసం సమయమంతా వెచ్చిస్తూ ఆరాటపడే అవసరం లేకుండా సమకూరితే, ఆ విధంగా తీరిన వారి బాధ్యతవల్ల లభించిన సమయాన్నీ, శక్తినీ దివ్యజీవనం కోసమూ, ఆంతరిక సిద్ధి కోసమూ వెచ్చిస్తారో లేదో చూడాలని అనుకునేదాన్ని.

నడివయసులో ఉండగా, అంటే జీవిత మధ్యకాలంలో, దానికి కావలసిన సాధన సంపత్తి సమకూరటం వల్ల అది సిద్ధించింది, అంటే అటువంటి జీవనానికి తగిన అవకాశాలు ఏర్పరచగలిగాను.

*

శ్రీఅరవిందులను కలిసినప్పుడు అడిగిన మొదటి ప్రశ్న అదే. ఎవరంతట వారు యోగసాధన చేసుకొని గమ్యాన్ని చేరి ఆ తర్వాత మిగతావారితో కలిసి కార్యక్రమం ప్రారంభించాలా లేక ముందుగానే ఇటువంటి ఆకాంక్షాపరుల నందరినీ కలుపుకొని వారితోబాటుగానే గమ్యం వైపు పయనించడమా?

అయితే నిర్ణయం మాత్రం ఆలోచనతో చేసింది కాదు. అది అయత్న సిద్ధంగా జరిగింది. ఎంపికకే అవకాశం లేని పరిస్థితి అది. చాలా సహజంగా అప్రయత్నంగా ఒక సమూహం ఏర్పడింది. అది తప్పనిసరి ఆవశ్యకత అయింది. ఆ విధంగా ప్రారంభమయింది. చివరిదాకా అలా కొనసాగాలిసిందే.

మొదట్లో సుమారు పదిమంది దాకా ఉండేవారు. చాలా కాలం దాకా అయిదు గురు మాత్రమే ఉండేవారు. క్రమంగా పది, పన్నెండు, ఇరవై, ముప్ఫై అయిదు అయినారు. అలా చాలా కాలం గడిచింది. ఆ తర్వాత ఉన్నట్లుండి ఆశ్రమం ప్రారంభమైంది. అంతే.

*

1910 నుంచి 1920 దాకా శ్రీఅరవిందులు పాండిచ్చేరిలో నలుగురైదుగురు శిష్యులతో కలిసి ఉండేవారు.

1914 లో పాల్ రిచర్డుతో కలిసి ఫ్రాన్స్‌దేశం నుంచి శ్రీమాత వచ్చారు. శ్రీఅరవిందులు ఆర్య పత్రికకు సంపాదకత్వం వహించి 1920 దాకా కొనసాగించారు.

1920 ఏప్రిల్ నెలలో శ్రీమాత జపాన్ నుంచి తిరిగివచ్చిన తర్వాత క్రమ క్రమంగా అక్కడ చేరే జనసంఖ్య వృద్ధికావడం మొదలుపెట్టింది. 1926 లో ఆశ్రమ స్థాపన జరిగింది.

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వెంకటరామశాస్త్రి)

లక్ష్యం — లక్షణం

శ్రీమాత

మామూలు సాధనల యొక్క లక్ష్యం పరమాత్మ చైతన్యంతో సంయోగం (సత్-చిత్-ఆనందం). ఆ స్థాయిని చేరుకున్నవారు వారి స్వీయవిమోచనంతో సంతృప్తి చెంది ప్రపంచాన్ని దాని దుఃఖభాజిత దురవస్థకు వదిలివేస్తారు. శ్రీఅరవిందుల సాధన అందుకు విరుద్ధం. ఇతర సాధనాలు ఎక్కడ ఆగిపోతాయో అక్కడ అది ప్రారంభమౌతుంది. ఒక్కసారి పరమాత్మతో సంయోగం సఫలమైతే, ఆ అనుభవాన్ని బాహ్యప్రపంచానికి కొనితెచ్చి, పృథ్విపై జీవనస్థితిగతులను ఒక సంపూర్ణ రూపాంతరీకరణ చెందు విధంగా మార్చాలి. ఈ లక్ష్యాన్ని అనుసరించగోరే సమగ్ర యోగ సాధకులు కేవలం ధ్యాన, మననాదులతో జీవితాన్ని గడపుటకు ప్రాపంచిక జీవితం నుండి విరమించ నక్కర లేదు. ప్రతి ఒక్కరు వారి సమయంలో కనీసం మూడవ వంతు ఒక ప్రయోజనకరమైన పనికి తప్పక వినియోగించాలి. ఆశ్రమంలో అన్ని రకాల కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. ప్రతి ఒక్కరు వారి స్వభావానికి అత్యంత అనుకూలమైన పనిని ఎన్నుకోవాలి, కాని దానిని సేవాస్ఫూర్తితో, నిస్వార్థంగా, సర్వదా సమగ్ర రూపాంతరీకరణ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్వర్తించాలి.

ఈ ఉద్దేశం నెరవేరడానికి, ఆశ్రమవాసులు న్యాయమైన అవసరాలు తీర్చబడి, వారి జీవనాధారానికై వ్యాకులత చెందకుండ ఉండటానికి, తగు రీతిగ ఆశ్రమం ఏర్పాటు చేయబడింది.

ప్రతి ఒక్కరు వారి పురోభివృద్ధికి అవసరమైన స్వేచ్ఛాయుత వాతావరణాన్ని అనుభవించుటకు వీలుగా, స్వల్ప నియమనిబంధనలు విధించబడ్డాయి. కాని కొన్ని విషయాలు మాత్రం ఖచ్చితంగా నిషేదింపబడ్డాయి. అవి 1) రాజకీయాలు 2) పొగత్రాగుట 3) మద్యపానం 4) లైంగిక భోగం.

ఆశ్రమవాసుల ఆరోగ్య పరిరక్షణకు, శ్రేయస్సుకు, శారీరక పటిష్టతకు, అత్యంత శ్రద్ధ తీసుకోబడుతుంది.

*

మానవజాతి నేటివరకు సాధించిన విజయాలేవీ, అవి ఎంత గొప్పవైనా కానీ, మన

మనుసరించతగ్గ ఆదర్శాలు కాలేవు. ఈ విశాల ప్రపంచమే మానవ ఆదర్శాలకు ప్రయోగ క్షేత్రంగ ఉన్నప్పుడు, ఆ అవసరం లేదు.

మన లక్ష్యం వేరు. ప్రస్తుతం మన విజయావకాశాలు సన్నగిల్లినట్లు కనిపించినా, భవిష్యత్తును విజయవంతం చేయడానికి శ్రమిస్తున్నామనుట వాస్తవము.

బాహ్యదృష్టికి, నేటి ప్రపంచంలో సాధించబడిన ఎన్నో విషయాల్లో మనం వెనుకబడి ఉన్నామని నాకు తెలుసు. కాని, మన లక్ష్యం కేవలం మానవ ప్రమాణాలకు అనుగుణమైన పరిపూర్ణతను సాధించుట కాదు. భవిష్యత్ కాలానికి చెందిన ఒక మహోన్నత ఆదర్శానికై మనమంతా ప్రయత్నిస్తున్నాం. ఆశ్రమం స్థాపించబడింది నూతన ప్రపంచాన్ని పొత్తిళ్ళ నుంచి పెంచి పోషించే ముఖ్యోద్దేశంతో.

అందుకు ప్రేరణ పైనుండి వచ్చింది. మార్గదర్శకశక్తి పైనుండి వచ్చింది. క్రియాశక్తి పైనుండి వచ్చింది. ఇవన్నీ నూతన సాక్షాత్కార అవరోహణకు కృషి సల్పుతున్నాయి.

ఆశ్రమ నిర్వహణలోని అసమర్థతలు, లోపాలు, వైఫల్యాల కారణంగానే ఆశ్రమం నేటి తరానికి చెందినట్లుగ ఉంటుంది.

మానవజాతి ప్రస్తుతం సాధించిన విజయాలేవీ ఆశ్రమాన్ని దానికున్న కష్టాల నుండి బయట పడవేయలేవు.

ఆశ్రమవాసు లందరిలో సంపూర్ణ పరివర్తన కలిగి, అందరు ఆ పరమ సత్యప్రకాశ అవరోహణకు సమగ్రంగా వివృతమైనప్పుడు మాత్రమే ఆశ్రమం దాని లక్ష్యసిద్ధిని సాధించుకోగలదు.

ఈ బృహత్ కార్యం నిస్సందేహంగ అసాధ్యమైనదే కాని, దానిని విజయవంతం చేయాలని ఆదేశం అందింది. కేవలం అందుకోసమే మనం ఈ భూమిపై ఉన్నాము.

భగవంతుని దివ్యసంకల్పము, దివ్యానుగ్రహంపై అచంచల విశ్వాసంతో మన ప్రయత్నం తుదివరకు కొనసాగిద్దాం.

ఈ ప్రయోజనం కోసం వారి జీవితాలను ధారపోయ నిశ్చయించుకున్న వారందరికి ద్వారం తెరిచి ఉంటుంది. సర్వదా తెరిచి ఉంటుంది.

*

జీవితంపై, మనుషులపై విరక్తితో మాత్రం యోగం వైపు మళ్ళకూడదు.

కష్టాల నుండి దూరంగ పారిపోవుటకు కాదు ఇక్కడకు వచ్చేది.

ప్రేమ, ఆదరాభిమానాల మధురిమను చవి చూచుటకు కూడ కాదు ఇక్కడికి రావటం. సరైన వైఖరిని అవలంబించితే ప్రేమాదరాభిమానాలు అన్ని చోట్లా లభిస్తాయి.

ఎవరైనా తమను తాము సంపూర్ణంగ భగవత్సేవకు అంకితమైపోవాలనుకున్నప్పుడు, అది ప్రతిఫలం ఆశించకుండా అట్టి సేవల వల్ల కలిగే ఆనందం కోసమే అయినట్లయితే, అప్పుడు వారిక్కడకు వచ్చుటకు సంసిద్ధులై ఉన్నారన్న మాట. వారి కోసం తలుపులు పూర్తిగ తెరిచి ఉంటాయి.

*

ఇక్కడ మనకు మతం లేదు. మతస్థానాన్ని సత్యమైన, లోతైన, ఉన్నతమైన దైవానికి అత్యంత సన్నిహితమైన, ఆధ్యాత్మిక జీవనంతో భర్తీ చేస్తాము. కారణం, భగవంతుడు అన్నింటిలో ఉన్నాడు. కాని, మనకా ఎరుక లేదు. మానవుడు సాధించవలసిన అత్యున్నత ప్రగతి ఇదే.

*

ఇక్కడ మనం — ఏ విశ్వాసానికి, ఏ మతానికి విరుద్ధంగా పోరాడం. ఏ విధమైన ప్రభుత్వానికి విరుద్ధంగా పోరాడం. ఏ సామాజిక వర్గానికి విరుద్ధంగా పోరాడం. ఏ దేశానికి గాని, ఏ సంస్కృతికి గాని విరుద్ధంగా పోరాడం. మన పోరాటం, విభజన, అచేతన, అజ్ఞానం, జడత్వం, అసత్యాలకు విరుద్ధంగా సాగుతుంది.

మన ప్రయత్నమంతా భూమిపై ఐక్యత, జ్ఞానం, సత్యం ప్రతిష్ఠించుటకు. మన పోరాటం ప్రకాశమానమైన, శాంతియుతమైన, సత్యం ప్రేమలతో కూడిన నూతన సృష్టి ఆగమనాన్ని అడ్డుకునేదేదైన దానికి విరుద్ధంగా ఉంటుంది.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఆశ్రమంలో సమిష్టి జీవనం

భౌతిక జీవనం — ఆధారం

శ్రీఅరవిందులు:

రెండు విధాలైన ప్రాతిపదికల మీద ఇక్కడ భౌతికజీవనం కొనసాగించడానికి అవకాశం ఉంది. ఒకటి తనను తాను అర్పించుకోవటము, సమర్పణ అనే సూత్రాల మీద స్థాపించబడిన ఈ ఆశ్రమంలో, ఒక వ్యక్తి సభ్యుడై ఉండటం. అతడు దైవానికే చెంది, అతడి వశంలో ఏదైతే ఉందో అదంతా కూడా దైవానికే చెందినదై ఉంటుంది. ఆ సమర్పణలో ఇచ్చేదేదీ తనది కాదని, దైవానికి చెందినదే తాను సమర్పిస్తున్నానని భావించడం. ఇక్కడ ఇచ్చేది, తిరిగి పుచ్చుకొనేది, బేరాలు, హక్కుభుక్తాలు, ఇష్టాలు అనేవేవీ లేవు. ఏకైక బాధ్యత శ్రీమాతదే; ఆమెకి అందుబాటులో ఉన్న వనరుల ననుసరించి, సాధనాసంపత్తుల సామర్థ్యాన్ననుసరించి ఎంత బాగా అమర్చవచ్చునో అంత బాగా విషయాలను ఆమె అమర్చుతుంది. సాధకుల మానసిక ప్రమాణాలు లేక ప్రాణికమైన కోర్కెలు, వారు హక్కుగా కోరేవాటికి బద్ధురాలై పనిచేయవలసిన ఆవశ్యకత ఆమెకి లేదు; వారితో వ్యవహరించే తీరులో ప్రజాస్వామిక సమానత్వాన్ని పాటించవలసిన అవసరం ఆమెకు లేదు. ప్రతివారికీ ఆమె దృష్టిలో వారి నిజ అవసరం ఏమిటో లేదా వారి ఆధ్యాత్మిక పురోభివృద్ధికి ఏది మంచిదో, దానిని సమకూర్చుటకు స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. ఆమె చేసే పనుల న్యాయాన్యాయాలను ఎవరూ నిర్ణయించలేరు. లేక తమ నిబంధనలను, ప్రమాణాలను ఎవరూ ఆమె మీద రుద్దలేరు; ఆమే నిబంధనలను రూపొందించగలదు, అవసరమనుకుంటే. తన నిబంధనలను తానే పక్కకు పెట్టగలదు, కాని ఎవరూ ఆమె ఆ విధంగానే చేయాలని పట్టుబట్ట లేరు. వ్యక్తిగతమైన హక్కులు, ఇష్టాయిష్టాలు ఆమె మీద రుద్దలేరు; ఎవరైనా వారు తమ అవసరాన్ని సరైనదిగా గ్రహించినా, లేదా తనకు నిర్దేశించబడిన పరిధిలోని వాటి మీద ఏదైనా సలహా ఇవ్వాలనుకున్నా, అలా ఇవ్వవచ్చును. కాని ఆమె దానికి అనుమతి నిరాకరిస్తే, దానికి అతడు సంతృప్తిపడగలిగి ఉండి ఆ విషయాన్ని అంతటితో వదలివేయాలి. దివ్యసత్యం కేంద్రంగా ప్రాతినిధ్యం వహించినవారికి లేదా రూపధారణ చేసినవారికి నిర్దేశించిన ఆధ్యాత్మిక నియమావళి ఇదే. ఆమె

అదేనా, ఇదంతానా అనే విషయం పూర్తిగా లోకజ్ఞానానికి సంబంధించినది. ఆమె అది కాకపోయినట్లైతే ఎవ్వరికీ ఇక్కడ ఉండవలసిన అవసరం లేదు. ప్రతివారూ తమ దారిన తాము పోవచ్చు. అప్పుడు ఆశ్రమమూ ఉండదు, యోగమూ లేదు.

రెండవ ప్రాతిపదిక, ఆశ్రమంలో సభ్యునిగా చేరడానికి ఎవరైనా తయారుకాక పోయినా, లేక నియమావళిని భరించలేకపోయినా: అలాంటివారు ఇక్కడ యోగాభ్యాసానికి అనుమతించబడితే, వారు దూరంగా ఉంటూ వారి ఖర్చులు వారే భరించాల్సి ఉంటుంది. భౌతికపరంగా అతనికే నియమావళి వర్తించదు, కాకపోతే సక్రమంగా పని జరగడానికి అవసరమైన నిబంధనలు మాత్రం వర్తిస్తాయి; వారి విషయంలో శ్రీమాతకు భౌతికంగా బాధ్యత ఏమీ ఉండదు.

*

ఇతర ఆశ్రమాలలో సాధకులు ఇక్కడ సమకూరేదానిలో పదవ వంతును కూడా పొందరు. వారు అన్ని విధాలైన అసౌకర్యాలకూ, నిత్యావసరాల లేమికీ, దుర్భరమైన, కఠినమైన దినచర్యలతోను సతమతమవాల్సి ఉంటుంది. ఒక వేళ అసహనంతో ఫిర్యాదు చేస్తే, వారు యోగానికి అర్హులు కారనే సమాధానం వస్తుంది. ఇక్కడి నిబంధన మరొక రకంగా ఉందంటే, దానర్థం కోరికలను తీర్చుకోవటానికి కాదు, దానికి కారణం కోరికలను ప్రేరేపించే బాహ్యవస్తువులు ఎదురుగా ఉండగా వాటిని అధిగమించగలగడం కోసం. అంతే కాని అవి లేనప్పుడు కాదు. యోగంలో మొదటి నిబంధన సాధకుడు తాను పొందినదానితో, అది ఎక్కువ కాని, తక్కువ కాని, సంతృప్తి చెందడం; వస్తువులున్నప్పుడు వాటితో ఏ బంధనం, కోరిక లేకుండా వాడుకోవడం; అవి లేకపోతే, ఉదాసీనంగా ఉండడం.

ఆర్థికపరమైన ఏర్పాట్లు

శ్రీఅరవిందులు:

ఆర్థికపరమైన ఏర్పాట్లను గురించి చెప్పవలసివస్తే, ఎప్పుడూ పెరుగుతూండే సభ్యులతో, అన్నింటిని సర్దుబాటు చేస్తూ, అప్పుడప్పుడు లోటు బడ్జెటుతో, దాని వలన సంభవించే పరిణామాలతో, ముఖ్యంగా ఇటువంటి యుద్ధసమయంలో, ఖర్చులు కళ్ళు బైర్లు కమ్మే అనూహ్యమైన రీతిలో పెరుగుతుంటే, శ్రీమాతకు, నాకు కష్టతరమై

పరీక్షతో కూడుకున్న పని అవుతున్నది. కేవలం వీటికి అలవాటుపడిన వ్యక్తిగాని, లేదా ఇటువంటి బాధ్యతలు నెత్తి మీద వేసుకున్నవారు గాని మాత్రమే మేము ఎటువంటి పరిస్థితుల గుండా పోతున్నామో అర్థం చేసుకోగలరు. ఏదైనా, ఇంత పరిణామంలో ఏ మాత్రం స్పష్టమైన నియమిత ఆదాయం లేకుండా, దివ్యశక్తి పని చేయకపోతే, దీనిని నిభాయించగలగడం అయే పని కాదు. సేవాతత్పరతతో కూడిన దానధర్మాలు మన పనిలో భాగం కాదు. అవి చేయదలుచుకున్నవారు వేరే ఉన్నారు. వారు ఆ పనులను కొనసాగిస్తారు. మేము చేతిలో ఉన్నదాని నంతా చేయదలుచుకున్న పనికి ఖర్చు పెట్టవలసిందే. మన అవసరాలతో పోలిస్తే మనకు లభించేది శూన్యం. సాధారణ మార్గాలలో డబ్బు సంపాదించే పనులు మనం చేపట్టలేము.

*

శ్రీమాత:

నాకు ఎవరికీ వారి డబ్బు కోసం వ్రాసే అలవాటు లేదు. మనుషులు దైవానికి తమ డబ్బు ఇవ్వడాన్ని వారికి ఇవ్వబడిన ఒక గొప్ప అవకాశం మరియు దైవానుగ్రహం అని వారు అనుకోకపోతే అది వారి దురదృష్టం! పనికి డబ్బు అవసరం అవుతుంది, డబ్బు నిశ్చయంగా వచ్చి తీరుతుంది. ఎవరికి అది ఇవ్వగలిగిన భాగ్యం ఉందో చూడవలసి ఉంది.

*

మేము ప్రజల నుంచి దానం ఆశించడం లేదు, వారి ఆత్మకు ఎక్కువగా దగ్గర అవడానికి వారికి ఈ విధంగా ఒక అవకాశం ఇవ్వబడింది.

వ్యవస్థ — వర్గీకరణ

శ్రీఅరవిందులు:

నీవు చెప్పదలచుకున్నది, బహుశా, అందరికీ పూర్తి స్వేచ్ఛకు అనుమతిని కేవలం వారి మీద వారు విధించుకునే నియమావళి మాత్రం ఉండేటట్లు ఇవ్వాలనేగా; అది ఎప్పుడు సాధ్యపడుతుందంటే, ఒక్క అంతరంగ సాక్షాత్కారం కోసం మాత్రమే సాధన అయిన సందర్భంలో మాత్రమే; దానికి జీవితంతో సంబంధం లేదు. లేదా

ఉమ్మడి జీవనం లేదా సమిష్టి కార్యాచరణ లేదా మరే ప్రాముఖ్యత కలిగినదేదీ లేని సందర్భంలో మాత్రమే. కాని ఇక్కడ పరిస్థితి అది కాదు. మేము జీవితం, క్రియాకలాపాలు, భౌతిక ప్రపంచంతో ముడిపడిన కార్యసరళిని చేయబూనాము. నేను చేస్తున్న ఈ ప్రయత్నంలో, ఆధ్యాత్మిక సాక్షాత్కారం పొందటం మొట్టమొదటి ఆవశ్యకత, కాని అది బాహ్యజీవితం లోను, మనుషుల్లోను, ప్రపంచంలో కూడా సాక్షాత్కారం పొందకుండా పూర్తి కాబోదు. ఆధ్యాత్మిక చైతన్యం అంతరంగంలోను దానితోబాటు ఆధ్యాత్మిక జీవితం బాహ్యములోను ఉండాలి.... మా శ్రమ ఫలితంగా ఏర్పడినదాని మొదటి రూపం ఆశ్రమం; చేయవలసిన పనికి సన్నద్ధం చేయడానికి ఉపయోగపడే క్షేత్రం ఇది. దీని నిర్వహణ బాధ్యత శ్రీమాతది. దానికి ఒక క్రమంలో వర్గీకరణ, ఈ వ్యవస్థ ఉండాలి. అది నిబంధనలు, నియమావళి లేకుండా జరగదు. నియమావళి అహాన్ని, మానసిక ఇష్టాయిష్టాలను, రజోప్రాణప్రకృతిని అధిగమించడానికి కూడా అవసరమైనదే. ఏ విధంగా చూసినా అది సహాయపడేదే. వీటిని అధిగమించగలిగితే, బాహ్యనిబంధనలు వగైరాల అవసరం చాలా తక్కువ అవుతుంది; అప్పుడు సహజ సిద్ధంగా అభిప్రాయాల మధ్య అంగీకారం, ఏకత్వం, సామరస్యత, సహజసిద్ధమైన ఋజువర్తన నెలకొంటాయి. కాని ఇప్పుడున్న పరిస్థితులు ఇలాగే కొనసాగితే, నియమావళిని పరిత్యజించినా లేక తీసివేసినా, మనుషులు తమకు తాముగా తమ మీద విధించుకునే నియమావళిని మినహాయించి, ఒనగూడే ఫలితం ఓటమి, ఉపద్రవమే.

*

ఆశ్రమంలో ఇప్పుడు ఉన్నది శ్రీమాత ఏర్పరచగలిగి, కొనసాగించగలిగినటువంటి వ్యవస్థ, వర్గీకరణ.... ఆ వ్యవస్థ, ఆ వర్గీకరణ సమిష్టిగా పనిచేయడానికి అవసరం; ఆశ్రమాన్ని బయటి నుంచి చూసేవారి ప్రశంసకు, ఆశ్చర్యానికి అది పాత్రమయింది; ఆ కారణంగానే ఎంతోమంది చేసే విద్వేషదాడులకు తట్టుకుని మనగలుగుతున్నది. లేకపోతే వారు చాలా కాలం క్రితమే దానిని అంతం కావించి ఉండేవాళ్లు.

*

సాధకులు కనీసం సిద్ధయోగులు కానంతవరకు ఆత్మనియంత్రణను కఠినంగా పాటించి తీరాలన్నది పూర్తిగా సరయిన మాటే; వారు యథేచ్ఛగా, అతిగా ఎటువంటి దానిలోనైనా పాలు పంచుకోవటం, నిర్లక్ష్యం, అత్యాశ లేక వ్యక్తిగతమైన సరదాల నుంచి

నిగ్రహించుకోవడమెలాగో తెలుసుకుని ఉండాలి. వారు ఆ పనులు చేస్తుంటే, శ్రీమాత ప్రతి నిమిషం వారిని సరిగా ఉన్నారా లేదా అని పరీక్షిస్తూ జోక్యం చేసుకోదు; ఒక ప్రమాణం నెలకొల్పబడంది, వారికి దుబారా చేయవద్దని హెచ్చరించబడింది, చేయ వలసిన పనికి ఒక కార్య ప్రణాళిక రూపొందించబడింది, మిగతాదంతా వారు తెలుసుకో గలగాలి. అంతరంగంలో శ్రీమాత శక్తి సహాయం చేస్తుండగా వారు తమ చైతన్యం తోను, ఇచ్ఛతోను బలహీనతల నుండి బయటపడి వృద్ధి పొందాలి.... శ్రీమాత ఎప్పుడూ అదే చేయాలని బలవంతం చేయదు, ఆమె జాగ్రత్తగా కనిపెట్టి చూస్తూ, పరీక్షిస్తూ ఉంటుంది. సాధకుల వ్యక్తిగత జీవితాలలో కన్నా, బాహ్యంలోనే ఎక్కువగా కల్పించుకుంటుంది. కాని వారు వారి చైతన్యంతో, అనుభవాలతో, తాము చేసిన పొరపాట్ల నుంచి నేర్చుకున్న పాఠాలతో వృద్ధి పొందడానికి ఇంకా అవకాశం కల్పి స్తుంది. బాహ్యం మీద ఒత్తిడి చేసి మార్పు తీసుకువచ్చేదాని కంటే అంతరంగమార్పు రావటానికే ఇష్టపడుతుంది కనుక తరుచుగా అంతరంగంలోనే ఒత్తిడిని కలుగ చేస్తుంటుంది.

*

మొత్తాన్నంతటినీ వ్యవస్థీకరించే తన పని కోసం శ్రీమాత వివిధ శాఖల అధిపతులను ఎన్నుకున్నది. పనుల కార్యాచరణ పద్ధతి, వివరాలన్నింటిని ఆమే పొందుపరచింది, శాఖల అధిపతులందరూ దానిలో ఆమెచే శిక్షణ ఇవ్వబడిన తరువాతనే తాను వైదొ లగి తాను అనుకున్న పద్ధతులలో పని జరుగుతుందని ఆశిస్తూ వారికి పూర్తి బాధ్యతలను అప్పగించింది, కాని ఎల్లప్పుడూ జాగ్రత్తగా కనిపెట్టి చూస్తూనే ఉంటుంది.... కాని సాధకులు, పనిచేసేవారు తాము ఇక్కడ ఉన్నది అహం సంతృప్తికి, ప్రాణిక, భౌతిక అవసరాల సంతృప్తికి యథేచ్ఛగా తమ ఇష్టం వచ్చినట్లు వాటిలో పాలు పంచుకోవటం కోసం కాదు. దానికి భిన్నంగా ఒక ఉన్నతమైన, నిక్కచ్చిగా ఫలితాన్ని అపేక్షించే యోగం కోసం. దాని మొదటి లక్ష్యం కోరికను దునుమాడి, నాశనం చేసి, దాని స్థానంలో దివ్యసత్యం, దివ్య ఇచ్ఛను నెలకొల్పడం.

*

ఆశ్రమంలో స్వతంత్రమైన పని అంటూ ఏదీ లేదు. ప్రతిదీ వ్యవస్థీకరించబడి, ఒకదానితో ఒకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. శాఖల అధిపతులు కాని, పనిచేసేవారు కాని ఎవరూ స్వతంత్రులు కారు. పై అధికారులను మన్నించటం, సహకారం

అందించటం అనేవి అన్ని విధాలైన సమిష్టి పనులకు అత్యావశ్యకం; అది లేకపోతే అంతా అరాచకమే.

*

శ్రీమాత:

ఆశ్రమంలో బాహ్య నియమావళిగాని, ఇంకా దృష్టికి గోచరమయే ఎటువంటి పరీక్షలూ లేవు. కాని అంతరంగ పరీక్ష చాలా కఠినంగా ఉంటుంది, నిరంతరం ఉంటుంది, ఎవరైనా సరే ఇక్కడ ఉండాలంటే చాలా చిత్తశుద్ధితో, అహాన్నంతా అధిగమించాలనే, స్వాతిశయాన్నంతా జయించి తీరాలనే ఆకాంక్షతో తప్పక ఉండి తీరాలి.

బాహ్యపరంగా పూర్తి సమర్పణ కోరడం జరగదు. కాని ఎవరైతే అంటిపెట్టుకుని ఉండాలనుకుంటారో వారికి అత్యావశ్యకం. సమర్పణలోని చిత్తశుద్ధిని పరీక్షించడానికి ఎన్నో వస్తుంటాయి. అయినప్పటికి అనుగ్రహం, సహాయం అనేవి వాటిని అపేక్షించే వారికి ఎల్లప్పుడూ ఉంటాయి. విశ్వాసం, గట్టి నమ్మకంతో వాటిని అందుకోగలిగితే, వాటి శక్తి అపరిమితం.

*

ఆశ్రమంలోని పనిలో అశ్రద్ధ విశ్వాసఘాతుకం.

సహవాసుల మధ్య సహజీవనం

శ్రీఅరవిందులు:

సహవాసుల మధ్య సాధారణ సహజీవనం ఏ విధంగా ఉండాలనే విషయం మీద శ్రీమాత ఎటువంటి విధివిధానాలను నొక్కి చెప్పలేదు (దయార్ద్రిత, ఇతరుల కష్ట సుఖాలలో పాలు పంచుకోవడం, మర్యాద అనేవి ఎప్పుడూ ఉండవలసినవే). కారణం అది ధ్యేయం కాదు. నూతనచైతన్యంలో ఏకత్వం ధ్యేయం. దానికి మొదట చేయ వలసిన పని ప్రతివారూ తాము సాధన చేస్తూ ఆ నూతన చైతన్యానికి చేరుకుని, అక్కడ ఏకత్వం అనుభూతిని సాక్షాత్కరించుకోవాలి.

*

ఈ యోగం యొక్క ప్రధాన సూత్రం దైవానికి మాత్రమే పూర్తిగా తనను తాను

అర్పించుకోవటం, మరెవ్వరికీ కాదు, మరి దేనికీ కాదు; దివ్యమాత శక్తి సంయోగంతో మన లోనికి మార్పు చెందించే అతిమానస దైవ తేజస్సు, శక్తి, విశాలత, శాంతి, శుద్ధత, సత్యచైతన్యం, ఆనందాల నన్నింటిని తీసుకురావాలి. కనుకనే, ఈ యోగంలో, ఇతరులతో ప్రాణిక సంబంధాలకు లేక పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటానికి చోటు లేదు; అటువంటి సంబంధాలు లేక ఇచ్చిపుచ్చుకోవటాలు ఏమాత్రం ఉన్నా ఆత్మను నిమ్న చైతన్యానికీ దాని నిమ్నప్రకృతికీ కట్టిపడవేసి, దైవంతో నిజమైనటువంటి, పూర్ణసంయోగానికి అడ్డుపడి, అతిమానస సత్యచైతన్యానికి ఆరోహణ, అతిమానస ఈశ్వరిశక్తి అవరోహణలకు రెండింటికీ ప్రతిబంధకం అవుతుంది.

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

ఆశ్రమంలో పని, దాని ప్రాముఖ్యత

శ్రీఅరవిందులు ఇలా వివరించారు:

ఇది ఇతర ఆశ్రమాల వంటిది కాదు. ఇక్కడి సభ్యులు సన్యాసులు కారు. 'మోక్షసాధన' వీరి లక్ష్యం కానే కాదు. యోగస్పృహతో, యోగశక్తితో కార్యనిమగ్నులు కావటమే వీరు చేస్తున్న ప్రయత్నం. పనికి ఇంతకు మించిన ప్రాతిపదిక వేరొకటి ఉండే అవకాశమే లేదు. ఈ ఆధ్యాత్మిక సన్నాహంలో భాగంగా సభ్యులు ఏదో ఒక 'పని' చేయవలసి ఉంటుంది.

మీరు వ్రాసినదాన్ని బట్టి పని అంటే సరియైన భావన మీకు ఉన్నట్లు తోచటం లేదు. ఇక్కడ జరిగేది సమాజసేవ లాంటిది కాదు. సాధకుల సంక్షేమానికి ఉద్దేశించింది కూడా కాదు. స్వీయవ్యక్తిత్వ ప్రకటనకో, సామూహిక ప్రాణికాహంకారాన్ని సంతృప్తి పరచటానికో ఇక్కడ కార్యక్రమాలు జరగటం లేదు. సంతోషంగా సంఘజీవనం సాగించటం కూడా లక్ష్యం కాదు. సాధకులు పరస్పరం తమ మనోభావాలనూ, సంబంధాలనూ, ప్రాణిక ఆవేశాలనూ ఇతరులతో పంచుకునే అవకాశం కల్పించటం ఇక్కడి ఉద్దేశం కాదు.

ఇదొక ఆధ్యాత్మిక కార్యక్రమం. అంతర్గత శక్తులు భగవంతుని యందు నిమగ్నం చేసి, భగవంతునకు అంకితమై, దైవపరంగా ఇక్కడి కార్యక్రమాలు జరుగుతూ

ఉంటాయి. మనసులోని అల్పమైన అహంకారాన్ని దివ్యత్వంతో మేళవించి, శుద్ధపరచి ఆ దివ్యత్వానికి సమర్పించుకోవటమే ఇక్కడి కార్యక్రమాల ఉద్దేశం. అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న స్వీయనిర్దేశికత్వానికి బదులుగా దివ్యత్వపు నిర్దేశికత్వాన్ని ప్రతిష్ఠించుకోవటమే దీని లక్ష్యం. ఒక్క మాటలో చెప్పాలంటే స్వకీయమైన ఇచ్ఛను దైవేచ్ఛగా పరివర్తించుకోవటం ఇక్కడ జరుగుతుంది. ఇదే కర్మయోగ మంటే!

మానవసేవే మాధవసేవ అని భ్రమించటమే ఒక శుద్ధ తప్పు. నేరుగా దైవాన్ని సేవించటానికి బదులు మనకు దగ్గరలో ఉన్న మానవులకు సేవ లందించటంలో మానసిక, ప్రాణిక, నైతికశక్తుల ప్రేరణ ఉంటుంది. ఇది ఆధ్యాత్మిక జీవనం కానే కాదు.

పూర్ణయోగంలో ముందుకు సాగటానికి 'పని' అనేది ఒక మార్గం — పూర్ణయోగం లోని కర్మయోగ మార్గం. యోగమార్గంలో నిస్వార్థంగా కర్మను చేయటం, విధేయత, జాగరూకత, క్రమశిక్షణలను ఆత్మపరంగా కాకుండా దైవపరంగా చేస్తున్నామని విశ్వసించటం ఇక్కడి పని యొక్క ఆశయాలు. దీని ద్వారా సమన్వయమూ, సహనము సాధించవచ్చు.

అహంకారాన్ని తృప్తిపరచటం కోసం చేసేది 'పని' అని నేను అనుకోను. అజ్ఞానము, అహంకారముతో చేసేది, రజోగుణ ప్రధానమైనది, కర్మ కానే కాదు. అహాన్ని అధిగమించాలనే ప్రయత్నం లేని చోట కర్మయోగం ఉండదు. అట్టి స్థితిలో కేవలం 'అహం' వలన, రజోగుణం వలన కలిగే కోరికలను తీర్చుకోవటమే 'కర్మ' గా చలామణి అవుతుంది. కాని అది కేవలం అజ్ఞానానికి చిహ్నమే.

పరోపకారం, మానవసేవ అనేవి నైతిక ఆదర్శాలు. వీటిని నిగూఢ సత్యానికి ప్రతిరూపాలుగా మనసు భ్రమిస్తూ ఉంటుంది. దైవం కోసం దైవంలో లీనమై చేసేదే కర్మ. ఇందులో ఇతర భావాలకు స్థానం లేదు. మొదట్లో ఇది సాధ్యం కాకపోవచ్చు. సరియైన దృక్పథం, సరియైన సంకల్పం ఉన్న చోట మాత్రమే అది తనకు తానుగా సిద్ధిస్తుంది.

*

పనియే యోగము

అంతర్గత మానసిక, ఆధ్యాత్మిక శక్తుల వికాసం కర్మకు ప్రాథమికమైనది. దాన్ని

కేవలం కర్మగానే 'ఆచరించటం' అప్రధానమైనది. శ్రీమాతకు సమర్పణగా జరిగే ప్రతి పనీ యోగసాధనలో భాగమే. అంతరంగ వికాసానికి అది మార్గమూ, అంతర్భాగమూ అవుతుంది. సాధకుని మానసిక పరిణామం పెరుగుతున్నకొద్దీ ఇది తెలుస్తుంది.

*

పని యోగంలో ఒక భాగము. దివ్యచైతన్యపు ఉనికిని, తేజస్సును, శక్తిని ప్రాణికస్థాయిలో జరిగే కార్యక్రమాలలోనికి ఆవిష్కరిస్తుంది. సమర్పణ భావాన్ని, దాని పరిధిని విస్తృతం చేస్తుంది.

*

'పని', దాని ఫలితాలు శ్రీమాతకు చెందినవే అనే భావన మాత్రమే చాలదు. శ్రీమాత శక్తి మన వెన్నంటి ఉన్నట్లుగా భావించటం మనం నేర్చుకోవాలి. ఆమె ప్రభావానికీ, ఆమె నిర్దేశిత్వానికీ సిద్ధపడాలి. కేవలము మానసిక ప్రయత్నమే చాలదు. మన చైతన్యంలో శ్రీమాత శక్తి పనిచేస్తున్నట్టు, నీకు అండగా వుంటున్నట్లు భావించటం నిజమైన దృక్పథం.

ఈ రకమైన భావన పెంపొందించుకోవటంతో పాటు, చేసే ప్రతి పనీ శ్రీమాతకు సమర్పణగా భావించాలి. అప్పుడే ఇది నీలో నిలచి ఉంటుంది. పనిలో ఉండి ధ్యానం చేస్తూ ఉండటం కూడా సరియైనది కాదు. ధ్యానం నిన్ను పనిలో నిమగ్నం కానీయదు. పనిని నీవు శ్రీమాతకు సమర్పణ చేయదలిస్తే శ్రీమాత నీ మనోగతంలో నిలిచి యుండాలి. ఈ స్థితి కేవలము ప్రాథమిక దశ మాత్రమే.

శ్రీమాత దివ్యరూపం నీ ముందున్నపుడు కలిగే నిశ్చలత, నీ ద్వారా పని చేస్తున్నది ఆమె శక్తియే అన్న భావన ఈ యోగానికి గుర్తులు. ('మానసికం' దాని పని అది చేసుకుంటూ పోతుంది) శ్రీమాత శక్తి నిన్ను ఒక మార్గంలా, పనిముట్టులా ఉపయోగించుకుంటున్నదని భావించటం మొదలుపెడ్తావు. దివ్యత్వమే నీ పనిలో అంతర్భాగం అవుతుంది!

ఈ స్థితిని సాధించాలంటే మొదటగా ఒక అతీత శక్తి నీ మనసును నడిపిస్తున్నదని భావన చేయాలి. తర్వాత నీ సాధన ద్వారా ఆ శక్తిని నీ పనిలో ప్రవేశపెట్టాలి. ఈ రెండింటిలో దేనినీ నీవు ఒకేసారి సాధించగలవని నేను అనుకోను. మొదట ఇంతకంటె ఉన్నతమైన అంతఃచైతన్యంలో నివసించటం నేర్చుకోవాలి.

శ్రీమాత ఇలా అన్నారు:

సృష్టికర్తకు ప్రాతినిధ్యం వహించే ఉనికి ఏదైతే ఉన్నదో దాని ప్రతీక మన వ్యవస్థలో అంతర్గతంగా ఒదిగి ఉన్నదని నీవు గమనించగలవు. ఇక్కడ పని సర్వం తానేయైన పరమాత్మ కే చెందుతుంది. ఏదీ స్వప్రయోజనం కోసం జరగదు. పని అంటే ప్రేమను పరమాత్మకు అర్పణ గావించటమే. మన శక్తి ప్రేమశక్తియే. నేను కేవలం మార్గదర్శిని, నామమాత్రపు ప్రతీకను మాత్రమే.

ఆశ్రమం నీ కోసమూ కాదు, నీ పై అధికారుల కోసమూ కాదు. ఇది దైవ కార్యక్రమం. నీవు దైవానికి సంపూర్ణంగా అంకితం కావాలి; అల్పమైన మానవ ప్రయోజనాలకు కాదు.

పరమాత్మ కోసం పనిచేయటమే శరీరంతో చేసే దైవప్రార్థన.

అనువాదం: కె. ఆర్. యల్. నరసింహారావు

శ్రీమాత సన్నిధిలో ధ్యానము

శ్రీమాత

ఆశ్రమంలో ఇదివరలో జరిగిన ఉదయం లేక సాయంకాలపు ధ్యానసమయాల్లో అక్కడున్న వారందరి చైతన్యాన్ని ఏకీకృతం గావించి నాకు సాధ్యమైనంత ఎత్తుకు దైవం దిశగా కొనిపోయేదాన్ని. ఈ గమనానికి స్పందించగలిగేవారు, దానిని అనుసరించేవారు. అది దైవం దిశగా ఆకాంక్ష, ఆరోహణాక్రమంతో కూడిన సాధారణమైన ధ్యానం. ఇక్కడ, ఈ క్రీడాప్రాంగణంలో చేయవలసిందల్లా, ఇక్కడున్న వారందరిని ఏకీకృతం చేసి, వారిని వివృతం గావించి, దివ్యశక్తిని అవరోహణ గావించి, దానిని వారిలో ప్రవేశింపజేయుట. ఈ చర్య ఆశ్రమంలో చేసినదానికి విరుద్ధమైనది. అందువలన ఇక్కడి ఏకాగ్రత, ఆ ఏకాగ్రతకు ప్రత్యామ్నాయం కాదు. అదే విధంగా ఆ ఏకాగ్రత దీనికి ప్రత్యామ్నాయం కాదు. ఇక్కడ జరిగేది ఒక అసాధారణ చర్య. ఆశ్రమ ధ్యానంలో నేను అక్కడున్నవారందరి చైతన్యాన్ని సమీకరించి ఆకాంక్ష శక్తితో దానిని దైవదిశగా కొనిపోయాను. అనగా, ప్రతి ఒక్కరిని కొంత పురోగతి సాధించునట్లు

చేశాను. కాని, ఇక్కడ, అందుకు బదులు మిమ్ములను ఎలా ఉన్నారో అలానే స్వీకరిస్తాను. ప్రతి ఒక్కరు నాతో ఇలా అంటారు: "రోజంతా చేసిన పనులతో ఇక్కడ నిలిచాము. మా శరీరంతో శ్రమించాము, అది ఇక్కడ ఉన్నది, మమ్ములను మా పనులను యథాతథంగా మీకు నివేదిస్తున్నాము." ఇక నా పని దీనినంతా సమీకరించి, ఒక సమానాకృతి గల పదార్థంగ మలిచి, ఈ నివేదనకు సమాధానంగ (నివేదన ప్రతి ఒక్కరు వారి ఇష్టానుసారం చేయవచ్చు.) ప్రతి ఒక్కరి చైతన్యాన్ని వివృతపరచి, గ్రహణశక్తిని విస్తృతపరచి, మీరు గ్రహించినదాని నంతా ఏకం చేసి, దైవశక్తిని క్రిందికి కొనితేవాలి. అందువలన, ఆ క్షణాన మీలో ప్రతి ఒక్కరు, ప్రశాంతంగ శ్రద్ధ కలిగి ఉన్నట్లయితే, ఎంతో కొంత తప్పక స్వీకరించగలుగుతారు. మీకు దాని అవగాహన అన్ని వేళల కలగదు కాని, మీకు ఎంతో కొంత లభిస్తుంది.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

క్రీడలు

శ్రీఅరవిందులు:

ఆశ్రమాలంటే ధ్యానం, అంతరంగ అనుభూతులు, అనుభవాలు, వాటికి సంబంధించిన సాధన వుండాలి కాని, ఆశ్రమాలలో క్రీడలు వుండడం అవసరమా? అని కొంతమంది ప్రశ్నిస్తారు. ఇంకా భౌతిక జీవితం నుంచి తప్పుకుని బ్రహ్మన్ లో విలీనం కావాలనే ప్రయత్నంలో వుండాలి కదా! అని కూడా అంటారు. కాని యిలాంటి కార్యక్రమాలు సాధారణంగా మామూలు ఆశ్రమాలలో వుండడం చూస్తూ మనం వాటికి అలవాటు పడిపోయాం. కాని ఇది ఆలాంటి ఛాందసమైన ఆశ్రమం కాదు. ఈ ఆశ్రమంలో యోగసాధనలో జీవితం కూడా కలిసి వుంటుంది. ఎప్పుడైతే మనం జీవితాన్ని కూడా చేర్చేమో అప్పుడు జీవితాని కవసరమయినది ఏదైనా తక్షణ ప్రయోజనాన్ని కలిగించేది, ఆత్మోద్ధరణకు తోడ్పడేది తప్పనిసరిగా అనుమతించాలి. ప్రాచీన కాలంలో ఆశ్రమాలలో ప్రాపంచిక విషయాల్ని పరిత్యజించడమనేది బ్రహ్మజ్ఞాని అయిన తరువాత చిట్టచివరి దశలో జరిగేది. కాని భౌద్ధమత ఛాయలు భూమిపై విస్తరించిన తరువాత ఆశ్రమాలు ఆరామాలుగా మారిపోయాయి. ప్రాచీన ఆశ్రమాలు పూర్తిగా ఆరామాలను



సాగించటంలో అత్యవసరమైనది సృష్టి యొక్క రెండు కొనలను కలపడం. 1) పదార్థ భూమిక 2) ఆధ్యాత్మిక శిఖరాగ్రం శారీరక వ్యాయామాలు, క్రీడలు లాంటి కార్యకలాపాలు ఆశ్రమజీవితంలో అనుమతించడంలో మనకు తెలిసేది, సాధన విధానాలు, సాధించవలసిన మొదటి లక్ష్యాలు, అస్తిత్వం దిగువ కొసకి చెందినవని, మానవ సమగ్రత యీ పరిమితుల్లోనే సాధించబడుతుందని. అంతకంటే గొప్ప దేదైతే వుందో అది ఉన్నతశక్తులు, చైతన్యశక్తులు, ఆధ్యాత్మిక శక్తి జోక్యంతో చేరుకో వచ్చు. అయినప్పటికీ, మానవ పరిమితుల్లో సాధించగలిగిన దేదైతో వుందో అది గణనీయమైనది. కొన్ని సమయాల్లో అపారమయినది.


శ్రీమాత:

శారీరక కణాలలోకి చైతన్యం చొప్పించే మార్గమే భౌతిక సంస్కృతి. తెలిసినా, తెలియకపోయినా అది యదార్థం. మనం ఏకాగ్రతతో మన కండరాలు మన ఇష్ట ప్రకారం కదిలేటట్లు చేస్తున్నప్పుడు, మన అవయవాలు అంతకు ముందు కంటె మృదువుగా మడుచుకొనుటకు, వాటికి ఒక చురుకుదనం, లేక ఒక శక్తి లేక ఒక నిరోధక లేదా మృదువైన లక్షణం, యిటువంటివి ఏవైనా, వాటికి సహజంగాలేని వాటిని సమకూర్చడానికి ప్రయత్నించినప్పుడు, శరీరకణాలలో అంతకు పూర్వం లేని చైతన్యాన్ని చొప్పించడం ద్వారా ఒక మరింత సమానత్వం, ఎక్కువ గ్రహణశక్తి గల పరికరంగా మార్పుచెందుతుంది. అది నిర్వర్తించే చర్యల ద్వారా అది వృద్ధిచెందుతుంది. ఇది భౌతిక సంస్కృతి యొక్క ప్రాథమిక ప్రయోజనం. అయితే అదొక్కటే కాదనుకోండి, శరీరంలోకి చైతన్యాన్ని చొప్పించేది. అది ఒక అనిర్వచిత శక్తి, మొత్తం అంతటి మీదా పనిచేసేది.

*

మీ కొక విషయం గుర్తు చెయ్యాలి. అదేమిటంటే ఎక్కడా చెయ్యబడని ఒక ప్రత్యేకమైన పని యిక్కడ చెయ్యడానికే మనం వున్నది.

అత్యున్నత చైతన్యంతో అనుసంధానం కావడమే మనం ఆకాంక్షించవలసినది. అదే సార్వత్రిక చైతన్యం. ఆ సార్వత్రిక చైతన్యాన్ని మనలోకి అవరోహణ చేసుకుని, అభివ్యక్తం చెయ్యాలి. కాని అలా చెయ్యడానికి మనలో చాలా బలమైన పునాది కావాలి. ఆ పునాది యేదంటే మన భౌతిక అస్తిత్వం, మన శరీరం. అందుకే మనం



పోలినవి కావు. వాటిలో శిక్షణ పొందే పిల్లలకు, యువతకు, జీవితావసరాలలో తర్ఫీదు ఇవ్వబడేది.

*

శారీరక సమగ్రతను మనకందుబాటులో నున్న సాధనలతో ఎంత సమగ్రంగా తీర్చి దిద్దగలుగుతామో అంతగా తీర్చిదిద్దాలి. అదే భౌతిక సంస్కృతి యొక్క అంతిమ లక్ష్యం. సమగ్రతే సంస్కృతి యొక్క నిజమైన లక్ష్యం — ఆధ్యాత్మిక, చైత్య, మానసిక, ప్రాణిక సంస్కృతుల సమగ్రతే. భౌతిక సంస్కృతి అంత సమగ్రంగా వుండాలి. మన అన్వేషణ జీవి యొక్క పరిపూర్ణ సమగ్రత అయినప్పుడు భౌతిక విభాగాన్ని ఒక పక్కకి త్రోసివేయలేం. కారణం, శరీరమే పదార్థ భూమిక, శరీరమే మన సాధనా పరికరం గనుక. మన ప్రాచీన సంస్కృత సుభాషితం 'శరీరం ఖలు ధర్మ సాధనం' అంటుంది. అంటే ధర్మసాధన సాఫల్యం శరీరం ద్వారానే సాధ్యం. మన కోసం మనకి మనం ప్రతిపాదించగలిగే ప్రతి ఆదర్శం, ధర్మమే. అది పనిచేసే నియమావళి, ఆచరణ కూడ ధర్మం అవుతుంది. మనం నిర్ణయించుకొని ముందుంచు కున్న అంతిమ లక్ష్యం సంపూర్ణ సమగ్రత. మనం భూమి మీదకు తేవాలనుకున్న దివ్యజీవన ఆదర్శాని కిది అవసరం. ఆధ్యాత్మిక జీవనం భూమి మీద సఫలీకృతం కావడం, జీవితం దాని స్వంత ఆధ్యాత్మిక పరివర్తన యిక్కడ యీ భూమి మీద పదార్థ ప్రపంచ నియమాల ప్రకారం జరగడం మన లక్ష్యం. శరీరం సైతం పరివర్తన చెంది, దాని ఆచరణ, కార్యక్రమ నిర్వహణ ఒక అత్యున్నత సామర్థ్యం, సమగ్రత పొంది, అది పొందడానికి వీలయినంత లేక, వీలుకల్పించబడినంత మేర వృద్ధిచెంది నప్పుడు గాని, ఆధ్యాత్మిక పరివర్తన సాధ్యపడదు.

ఇంతకు ముందు యిచ్చిన సందేశంలో చెప్పబడింది శరీరంలోను, మనసులోను, జీవితంలోను, స్వభావంలోను భౌతిక చైతన్యాన్ని సమగ్రంగా రూపొందించే ప్రక్రియ స్వయం సహజమైన శక్తిసామర్థ్యాల అభివృద్ధి ప్రక్రియకు తీసిపోయినదేమి కాదు అని. మనము ఆశ్రమంలో ప్రారంభించి, ప్రత్యేక ప్రాముఖ్యతనిస్తున్న భౌతిక చైతన్య అభ్యాసాలకు, ఆచరణలకు వాంఛనీయమైన ఫలితం ఇది. భౌతిక సంస్కృతి యొక్క అభివృద్ధి ఎల్లప్పుడూ మన లక్ష్యంలో ఒక భాగంగా గుర్తించాలి. దానికి సరియైన శారీరకాభివృద్ధి అత్యవసరమయిన అంశం. ఆరోగ్యం, బలం, యోగ్యత, ప్రాథమిక అవసరాలు. దేహనిర్మాణం దానికి బాగా ఉపకరిస్తుంది. పదార్థ ప్రపంచంలో దివ్యజీవనం

బలమైన దృఢమైన శరీరం కలిగి వుండాలి. ఆరోగ్యం, తట్టుకునే శక్తి, నైపుణ్యం, చురుకుదనం, దారుఢ్యం కలిగి దేనినైనా తట్టుకోడానికి సిద్ధంగా వుండాలి. అందువలన ఆ విధంగా శరీరాన్ని సిద్ధపరుచుకోవాలంటే శరీర వ్యాయామం, క్రీడలు, సాముగరిడీలు, కసరత్తులు, ఆటలు, పోటీలు ఇలాటివన్నీ అభ్యసించాలి. శరీర దారుఢ్యం పెంచుకోడానికి, మరింత బలంగా తయారవడానికి యివన్నీ అత్యుత్తమ మార్గాలు.

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

భౌతిక వస్తువుల పరిరక్షణ

శ్రీ అరవిందులు:

గోల్కొండ అతిథిగృహ నిర్వహణ నియమావళి విషయమై — నియమాలకు ఒక కారణముంది. వాటిని నిరర్థకంగా విధించలేదు. మదర్ తన సొంత ఆలోచనలను రేమాండ్ , సమ్మర్ , ఇతరుల ద్వారా వాటిని రూపొందించారు. మొదటిది, దైవసదృశమైన జీవనంలోను, ఆధ్యాత్మికతలోను సౌందర్యం ఒక భాగమని శ్రీమాత విశ్వాసం. రెండవది, సజీవమైన వాటిలో దైవచైతన్యం ఉన్నట్లుగానే భౌతిక వస్తువులలో కూడా అంతర్లీనంగా దైవచైతన్యం ఉంటుందని శ్రీమాత నమ్మకం. మూడవది భౌతిక వస్తువులు తమదైన వ్యక్తిత్వం కలిగి ఉంటాయి. వాటిని ఆదరపూర్వకంగా చూడాలి, సక్రమమైన రీతిలో వినియోగించాలి. తప్పుగా, అనుచితంగా వాడరాదు, హాని కలిగించ కూడదు, నిర్లక్ష్యం చేయకూడదు. అలా కాని పక్షంలో అవి తమ అందాన్ని, విలువను పోగొట్టుకుని త్వరితగతిని నశించిపోతాయి. వాటిలోని చైతన్యాన్ని ఆమె అనుభూతి చెందేవారు. వాటి పట్ల ఆమెకు ఎంత సానుభూతి అంటే ఇతరుల చేతులలో స్వల్పకాలంలో చెడిపోయే, వ్యర్థమయే వస్తువులు ఆమె వద్ద సంవత్సరాల పాటు మన్నికగా ఉండేవి. ఈ విధమైన భూమికపై గోల్కొండ ప్రణాళికను శ్రీమాత రూపొందించారు. అత్యున్నత సుందర నిర్మాణశైలిని అభిలషించి, సఫలత పొందారు. అసాధరణ రీతిలో రూపుదిద్దుకున్న ఈ గోల్కొండ నిర్మాణం పట్ల భవన నిర్మాణ నిపుణులు, భవననిర్మాణ రంగమునందు అవగాహన కలిగిన ప్రజలు కూడా అత్యుత్సాహంతో తమ హర్షాన్ని వెలిబుచ్చారు. యూరప్, అమెరికా లాంటి ఖండాలలో

కూడా ఇంత చక్కడి భవనానికి సాటి రాగల భవనాలు మరి లేవని అభిప్రాయపడ్డారు. ఇటువంటి నిర్మాణాన్ని చేయాలని గొప్ప ఆర్కిటెక్టె అయిన మాస్టర్ ఒకరు ఆశించారు. కాని ఆయనకు ఆ అవకాశం రాలేదు, అని ఒక ఫ్రెంచ్ ఆర్కిటెక్ట్ అన్నాడు. భవనం లోని అన్ని గదులు, గృహోపకరణాలు, కావలసిన బల్లలు, కుర్చీలు మొదలైన సామగ్రి అంతా కళాత్మకంగా, పొందికగా ఉండాలని శ్రీమాత కోరిక. ఆ పని కూడా అతి జాగ్రత్తగా పూర్తిచేయబడింది. అంతే కాక ప్రతి వస్తువు వాటి ప్రయోజనా న్ననుసరించి ఏర్పాటు చేయబడింది. ఒకదానితో ఒకటి కలిసిపోయి అన్యథా ఉప యోగించబడకుండ వస్తువులు యథాస్థానాలలో ఉంచబడ్డాయి. ఇవన్నీ వాడుకలో పద్ధతిగా కొనసాగాలి. ఇక్కడ నివసించేవారు, వీటిని దుర్వినియోగం చేస్తే అవి స్వల్పకాలంలో పాడవుతాయి. అందువలన నియమనిబంధనలు విధించబడ్డాయి. అంతకు మించి వేరే ఉద్దేశం లేదు. ఈ అతిథిగృహంలో ఉండటానికి సరైనవారిని లేక మామూలు అలవాటుకన్నా కొంత తక్కువ మొరటుగా మెసలడానికి శిక్షణ పొందినవారిని, అనుమతించినట్లయితే, శ్రీమాత ఆదర్శాన్ని కాపాడుతూ, ఖర్చు, శ్రమ వృధా కాకుండా ఉంటుందని శ్రీమాత ఆశించారు.

శ్రీమాత:

వాడబడే భౌతికవస్తువుల పట్ల అజాగ్రత్తగా ఉండటము అజ్ఞానానికి, అచేతనకు సూచన. ఏ భౌతిక వస్తువు పట్లనైనా, జాగ్రత్త వహించకపోతే, దానిని ఉపయోగించే హక్కు నీకు లేదు.

ఒక భౌతిక వస్తువుపై శ్రద్ధ వహించడం, దానిపై ఉండే మమకారంతో కాదు, కాని, ఆ వస్తువులో దైవచైతన్యం కొంతమేరకు అభివ్యక్తమై ఉంటుంది కాబట్టి.

*

(ఒక సాధకునికి)

అది దురుద్దేశం కాదు, నిర్లక్ష్యం అని నేనిచ్చిన వివరణను నేను కాదనను, కాని నీకు ఒకటి చెప్పాను. నా వరకు నిర్లక్ష్యం అనేది, దురుద్దేశం యొక్క అత్యధిక చెడు లక్షణం. కారణం, అది అవిశ్రాంత జాగరూకతను అర్థించే దివ్యచైతన్యాన్ని, దివ్యప్రేరణను తిరస్కరిస్తుంది కనుక.

*

నైపుణ్యతగల చేతులు, నిష్టతో కూడిన జాగ్రత్త, నిర్విరామ శ్రద్ధ ఉంటే చాలు, పదార్థం ఆత్మకు విధేయతతో మెలగడానికి.

అనువాదం: సిద్ధులగారి త్రివేణి

చిచ్ఛక్తి ఆశ్రమంలో పనిచేస్తున్నది

శ్రీఅరవిందులు:

ఇచట (ఆశ్రమంలో) పనులు ఎలా జరుగుతున్నాయో వివరించ ప్రయత్నించడం చాలా ముఖ్య విషయంగా నాకు కన్పిస్తోంది.

ఇచట పని ఒక మానసిక పథకం ప్రకారం, ఒక స్థిరమైన కార్యక్రమం ప్రకారం లేదా ముందుగా నిర్ణయించబడిన ఒక పద్ధతి ప్రకారం ఏనాడూ జరుగలేదు. సదా కొనసాగించబడిన, పెంపొందించబడిన, బలోపేతం చేయబడిన చిత్ తపస్సు యొక్క ఒక ఉద్యమం ద్వారా సమస్తం సజీవ జీవిలాగ పుట్టి, పెరిగి, అభివృద్ధి చెందింది. చిచ్ఛక్తి పదార్థంలోని కవతరించి విస్తరిస్తున్నప్పుడు అది తనను వ్యక్తం చేసుకొనేటందుకు, అభివ్యక్తీకరించుకొనేటందుకు తగిన ఉపకరణాల కోసం అన్వేషిస్తుంది. ఉపకరణం ఎంతెంతగా ఉన్ముఖమై స్వీకరిస్తుందో, నమ్యం కాగలుగుతుందో. అంతంతగా మంచి ఫలితాలుంటాయని వేరే చెప్పవలసిన అవసరము లేదు.

దివ్యక్రియాశక్తి, దివ్యచేతన పనిచేస్తున్నదనే స్పష్టమైన, ఖచ్చితమైన అవగాహన వున్నది. తమ పనిలో దివ్యక్రియాశక్తి అస్తవ్యస్తం అయినపుడు లేక దివ్యచేతన కాంతి హీనం అయినపుడు నేను జోక్యం చేసుకొని ఆ కదలికను సరిజేయవలసి ఉంటుంది. అనేక సందర్భాల్లో విషయాలు కలగాపులగం అవుతాయి. అటువంటప్పుడు గూడా అస్తవ్యస్తంగా తయారైన నకలును, అసలైన దాన్నుండి వేరుచేయడానికి నేను జోక్యం చేసుకోవలసి ఉంటుంది.

అలాంటి ప్రత్యేక సందర్భాల్లో తప్పించి అందరికీ కర్మ చేయడంలో గొప్ప స్వేచ్ఛ ఇవ్వబడింది. ఎందుచేతనంటే అసంఖ్యాక రీతుల్లో అభివ్యక్తి యొక్క పరిపూర్ణత కోసం, సమగ్రత కోసం, చిచ్ఛక్తి తనను తాను వ్యక్తం చేసుకుంటుంది. ఆ అభివ్యక్తికి ప్రత్యేకించి ఇవే మార్గాలు అని వేటినీ స్థిరీకరించలేదు, ఏది సరైనదో తేల్చడానికి

ముందు చాలా తరచుగా కొన్ని ప్రయత్నాలు జరుగుతాయి.

దివ్యజనని వివరణ:

ఏ ఒక్క క్షణంలో కూడా చేతన యొక్క చలనం ఆగిపోలేదు అని చెప్పగలను. 'సృష్టిగమనం' మొదలైంది, తరువాత ఆగిపోయింది, మళ్లీ మొదలైంది అని కాదు. చేతన సదా పునః సృష్టి చేస్తూనే వుంది. అంటే సృష్టించడం అనే తన కార్యాన్ని చేస్తూనే వుంది. అది జరిగిపోయిన కార్యం, ఆ జరిగిపోయిన కార్యంలో నుంచే ఇది పెరుగుతున్నది అని కాదు. ఇదిలా వుండడానికి ఆ కార్యం అలా జరుగుతూనే వుంటుంది. ఇదివరకు జరిగినదానిని కొనసాగించడం గాకుండా, అది దేనిని చూస్తున్నదో దాని ఫలితంగా చేతన సదా పనిచేస్తూనే వుంది. మానసిక ఉద్యమంలో అయితే ఇదివరకు జరిగినదాని కొక పర్యవసానం వుంటుంది — ఇదలాంటిది కాదు. చేతన సదా చూస్తూ ఏది చేయవలసి వుందో దానిని చేస్తుంటుంది. దీన్నర్థంచేసుకోవడం చాలా ముఖ్యం. ప్రతిదాని విషయంలోనూ అది ఇలా తన పనిని కొనసాగిస్తూంటుంది. ఎంతమాత్రం 'రూపొందించడం' కాదు. దేని పెరుగుదలను చూస్తూ వుండాలో ఆ 'రూపాన్నేర్పరచడం' ఎంత మాత్రం కాదు. చేతన ప్రతి క్షణం అనుసరిస్తూ, అంటే తన ఉద్యమాన్ని తాను అనుసరిస్తూ వుంటుంది. అది సమస్తాన్నీ అనుమతిస్తుంది, అంటే అది మహిమలు, తిరోగమనాలు వగైరాలను, ప్రతిదాన్నీ అనుమతిస్తుంది. అది మానవ సృజనల విధానానికి సరిగ్గా వ్యతిరేకమన్న మాట. అదలా వుంది, అలా వుండడమే కొనసాగుతుంటుంది, నేనున్నంతవరకు అది ఎల్లప్పుడూ అలానే వుంటుంది.

ఒక అధి మనః సృష్టి

దివ్యజనని:

నేనిదంతా చూచినపుడు, గతంలో జరిగిన ఒక విషయం గుర్తుకొచ్చింది. అది జరి గింది 1926 లోనని సరిగానే గుర్తుంచుకొన్నాననుకొంటాను. అతిమానసచేతన అభివ్యక్తిని వేగిరపర్చడంపై కేంద్రికరించేందుకు, ఏకాంతం లోనికి ఉపసంహరించు కొనేందుకు, శ్రీఅరవిందులు ఆశ్రమానికి సంబంధించిన బాహ్యకార్య నిర్వహణను నా కప్పగించారు. ఆశ్రమంలోని వారికి సాయం చేయడం, మార్గం చూపించడం

అనే పనిని నా కప్పగించినట్లు, నేను శ్రీఅరవిందులతో సంపర్కంలో వుంటాననీ, అందువల్ల సహజంగానే, నా ద్వారా తాము పనిచేస్తుంటామని, అప్పుడు అక్కడున్న కొద్దిమందికి శ్రీఅరవిందులు చెప్పారు. ఆకస్మికంగా, ఆ వెంటనే విషయాలన్నీ ఒకానొక రూపం తీసుకొన్నాయి. అసాధరణ రీతిలో, వివరణతో సహా ఒక అత్యంత ప్రశస్తమైన సృష్టి, అద్భుతమైన అనుభవాలతో, దివ్యజీవులతో సంబంధాలు, మహిమోపేతమైనవని అన్పించే సర్వ విధ అభివ్యక్తులు చోటు చేసుకొన్నాయి. ఒకదానిని మించి మరొకటిగా అనుభవాలు పరంపరగా ప్రాప్తించాయి. పూర్తిగా ప్రశస్తమైన, అత్యంత ఆసక్తి కలిగించే రీతిలో విషయాలు ఒకదాని తర్వాత ఒకటిగా బహిర్గతమయ్యాయి అని చెప్పక తప్పదు.

ఒక రోజు మామూలుగానే, ఏం జరుగుతున్నదో చెప్పడానికి శ్రీఅరవిందుల దగ్గరకు వెళ్ళాను — నిజంగా ఆసక్తి కలిగించే విషయం దగ్గరకొచ్చాం. ఏం జరిగిందో చెప్పడంలో నేను బహుశా కొంత అత్యుత్సాహం చూపాననుకొంటాను — అప్పుడు శ్రీఅరవిందులు నా వంక చూసి ఇలా అన్నారు. "అవును, ఇది అధిమనః సృష్టి.[1] చాలా ఆసక్తిదాయకంగా వుంది, చాలా బాగా జరిగింది. ప్రపంచమంతా నీ కీర్తిప్రతిష్టలను విస్తరింపజేసే మహిమలను చేయగలవు. భువిపై సంభవించే సంఘటనలన్నింటినీ తలక్రిందులు చేయగలవు." తర్వాత చిరునవ్వుతో "అదొక గొప్ప విజయమే. కాని అది అధిఃమనః సృష్టి. మనకు కావలసింది ఈ విజయం కాదు, మనం అతిమనస్సును భువిపై ప్రతిష్టించాలనుకొంటున్నాం. ఒక నూతన ప్రపంచాన్ని, సమగ్రమైన అతిమానస ప్రపంచాన్ని సృష్టించేందుకు వెనువెంటనే లభించే విజయాన్నెలా త్యజించాలో తెలుసుకొని వుండాలి" అన్నారు.

---

[1] అతిమనస్సుకు, మానవ మనస్సుకు మధ్య చేతనకు సంబంధించి అనేక శ్రేణులు, స్తరాలు, లేదా పొరలు — దాన్ననేక విధాలుగా చెప్పవచ్చు — ఉన్నాయి. వాటిలో మనస్సుకు మూలం మానసిక ద్రవ్యం ఉన్నాయి. వాటి పర్యవసానంగా చేతన కదలికలు అధికాధికంగా తేజోవంతమై, శక్తివంతమై, విస్తృతమై వుంటాయి. ఈ శ్రేణులన్నింటి కన్నా అత్యంత ఉన్నతమైనది అధిమనస్సు. అది పూర్తిగా వెలుగులమయం, శక్తులమయం. కాని దానికి పైనున్న దాని దృష్టి నుండి చూస్తే, సంపూర్ణమైన అవిభాజ్యమైన జ్ఞానం నుండి అంతరాత్మ మరలిన, అజ్ఞానం వైపు దిగిన రేఖగా కన్పిస్తుంది. అధిమనస్సు మహాదేవుళ్ళ లోకం.

— శ్రీఅరవిందుల సుభాషితాలు

నా అంతఃచేతనతో వెంటనే అర్థం చేసుకొన్నాను. కొద్ది గంటల తర్వాత ఆ సృష్టి వెళ్ళిపోయింది. ఆ క్షణం నుండీ, ఇతర పునాదులపై తిరిగి క్రొత్తగా మా కార్యాన్ని మొదలుపెట్టాం.

అనువాదం: కె. వి. రావు

రూపాంతరం యొక్క అర్థం

శ్రీఅరవిందులు:

రూపాంతరం అంటె స్వభావంలో ఏదో మార్పు రావడం అని నా భావం కాదు. ఉదాహరణకి, ఋషిగా ఉండడం కాని, లేదా పరిపూర్ణ నైతికత్వం అని కాని లేదా యోగసిద్ధులని కాని (తాంత్రికుల వలె) లేదా అతీత (చిన్మయ) శరీరం అని కాని నా భావం కాదు. నేను రూపాంతరం అన్న మాట ఒక ప్రత్యేకమైన అర్థంలో ఉప యోగించాను. అస్తిత్వం యొక్క ఆధ్యాత్మిక పరిణామంలో అంతకు ముందున్న ప్రాణిక, భౌతిక జంతుప్రపంచంలో ప్రప్రథమంగా వచ్చిన మనోమయ జీవుల కంటె విస్తృతమైన, ఉన్నతమైన, గొప్పదైన, పరిపూర్ణమైన పురోగతి సాధించడానికి ఒక శక్తివంతమైన, విశ్వసనీయమైన ముందడుగు వేయాలి. దానికి చైతన్యంలో ఓ విప్ల వాత్మకమైన, ప్రత్యేకమైన మార్పు వచ్చి తీరాలి. ఈ ప్రక్రియనే నేను రూపాంతరంగా భావించాను.

ఇంతకన్న ఏమాత్రం తగ్గినా, లేదా ఈ పునాది పై ఒక వాస్తవమైన ప్రారంభం చేయకపోయినా, వాటి ఫలితం వైపు ఒక మౌలిక ప్రగతి జరగకపోయినా, నేను అనుకున్నది సాధించడం జరగదు. ఏదో ఒక అసంపూర్ణ సాక్షాత్కారం, అన్నీ కల గలపుగా ఉన్న మిశ్రమం, లేదా ఓ నిర్దిష్టరూపం లేనిది ఏదీ, నేను జీవితం పైన, యోగంపై పెట్టుకున్న ఆపేక్షకు సరిపోవు.

సాక్షాత్కార ప్రకాశం అవరోహణతో సమానమైనది కాదు. ఒక్క సాక్షాత్కారం మాత్రమే అస్తిత్వం యొక్క సంపూర్ణ రూపాంతరాన్ని సంభవింప చేయకపోవచ్చు. తద్వార ప్రకృతితత్వంలో ఏ విప్లవాత్మకమైన మార్పు కల్గించకుండా, ఉన్నత శిఖరాగ్ర స్థితిలో పురుషశక్తిలో ఒక సాక్షాత్కారాన్ని కల్గించవచ్చు. ఆధ్యాత్మిక

శిఖరస్థాయిలో చైతన్యం ఓ ప్రకాశాన్ని అనుభవంలోకి తెచ్చుకోవచ్చు. అయితే ఇవన్నీ జరిగినా, ఈ నిమ్నప్రకృతి వెనుకటి విధంగానే ఉంటుంది. నేను అలాంటి ఉదాహరణలు అనేకం చూశాను. ప్రకాశం యొక్క అవరోహణ మనసు పైనో లేక అందులో కొంతభాగంలో మాత్రమే కాకుండా పూర్తి నిమ్నభౌతికస్థాయికే కాక ఇంకా క్రింది వరకు ప్రసరించిన తరువాతనే అసలైన రూపాంతరం సంభవిస్తుంది.

మనసుపై ప్రకాశం పడినప్పుడు అది ఆధ్యాత్మికం కావచ్చు, లేదా మనసునో, కొంత భాగాన్నో ఏదో ఒక విధమైన మార్పు చేయవచ్చు. కాని అది ప్రాణిక స్వభావాన్ని మార్చనవసరం లేదు. అలాగే ప్రాణికం మీద ప్రసరించిన ప్రకాశం, దాన్ని శుద్ధిచేసి, ప్రాణిక కదలికలను విస్తృతం చేయవచ్చు, లేదా ప్రాణిక అస్తిత్వాన్ని నిశ్శబ్దపరచి, నిశ్చలం చేయవచ్చు. అయితే, అది భౌతికచైతన్యాన్ని, శరీరాన్ని ఎలా ఉన్నదాన్ని అలాగే వదిలేస్తుంది, లేదా దాన్ని జడం చేయడం కాని, దాని సమతుల్యాన్ని భంగపరచడం కాని చేస్తుంది. అందుకే ఒక్క ఆ ప్రకాశం యొక్క అవరోహణ జరిగితె సరిపోదు, ఆ సంపూర్ణ ఉన్నత చైతన్యం యొక్క అవరోహణ జరగాలి — దానితో వచ్చే శాంతి, జ్ఞానం, ప్రేమ, ఆనందాలతో సహా. ఇంకా చెప్పాలంటే అవరోహణ ముక్తి పొందడానికి సరిపోవచ్చు కాని, అది సమగ్రతను అందించదు, లేదా అంతఃసత్తాలో ఓ గొప్ప మార్పు సంభవింపచేయవచ్చు. అయితే, బాహ్య సత్తా మాత్రం అసంపూర్ణ పనిముట్టుగానే ఉండిపోతుంది, ఒక లోపభూయిష్ట, అనారోగ్య, కుంటుపడిన పరికరంగానే ఉండిపోతుంది. చివరిగా సాధన వల్ల సమకూరిన రూపాంతరం దానికది పరిపూర్ణం కాలేదు. అస్తిత్వం యొక్క అతిమానసీకరణ జరిగేంతవరకు పరిపూర్ణం కాలేదు. చైత్యీకరణ సరిపోదు, అది ప్రారంభం మాత్రమె. ఆధ్యాత్మీకరణ, ఉన్నత చైతన్యం యొక్క అవరోహణ సరిపోదు, అది మధ్యంతర స్థితి మాత్రమే. ఆ అంతిమ స్థాయిని పొందాలంటే అది అతిమానసశక్తి, చైతన్య ప్రభావం వల్లనే పొందగలం. దాని కన్న తక్కువ స్థాయి వ్యక్తిపరంగా, చాలనిపించ వచ్చు, కాని పృథ్వీ చైతన్యానికి అది చాలదు. నిశ్చయంగా ముందుకు సాగడానికి ఎప్పుడో ఒకప్పుడు వేయాల్సిన ముందడుగు వేయడానికి సరిపోదు.

*

నా సాధనలో వెంటనే సాధించవలసిన లక్ష్యం ఈ పృథ్వీపై ఆధ్యాత్మిక జీవితాన్ని స్థాపించడమే. దానికి మొట్టమొదటి ఆవశ్యకత ఎల్లప్పుడు దివ్యసాక్షాత్కారమే. ఆ

తరువాత మాత్రమే జీవితం ఆధ్యాత్మికం కాగలదు. అప్పుడే నేను చెప్పిన దివ్యజీవనం సంభవమౌతుంది.

సాక్షాత్కారం మొదటి ఆవశ్యకత. మిగిలినదంతా ఆ వృత్తంలోనే తిరుగుతుంది. ఎందుకంటె అది జరగనప్పుడు, మిగిలినదంతా అర్థరహితం.

అనువాదం డి. సత్యవాణి

ఆశ్రమం ఒక ప్రయోగశాల

శ్రీఅరవిందులుః

ఆధ్యాత్మిక మరియు అతిమానస యోగానికి ఆశ్రమం ఒక ప్రయోగశాలగా నున్నప్పుడు ('X' పేరుగల వ్యక్తి అన్నట్లుగా) వివిధ తరహాలకు చెందిన మనుషులు ప్రాతినిధ్యం వహించడం అనివార్యం. ఎందుకనగా రూపాంతరానికి చెందిన సమస్య అన్ని రకాల అనుకూల, ప్రతికూల అంశాలకు సంబంధించినది. ఒకే వ్యక్తి ఈ రెండింటి మిశ్రమాన్ని కలిగి ఉంటాడు. యోగానికి సాత్వికమైన, సంస్కారవంతమైన మనుషులే వస్తే — ప్రాణిక ప్రతిబంధకం అంతగా లేనివారు — అప్పుడు పృథ్వీ తత్వంలో ఈ ప్రాణికసమస్య ఎదురు పడలేదు, అధిగమించబడలేదు, కావున ప్రయత్నం ఫలించకపోవచ్చు. కొన్ని పరిస్థితుల్లో మానసిక, ప్రాణిక, భౌతిక స్థితులపై అధిమానసం యొక్క ఒత్తిడికి లోనై వాటిని ప్రభావితం చేయవచ్చు. అయితే అది ఏమాత్రం అతిమానసమైనది, మానవ అస్తిత్వాన్ని సర్వసమగ్రంగా రూపాంతరం చేయగల్గినది కాదు. అందుకే ఆశ్రమానికి అన్ని ప్రదేశాల నించి, అన్ని రకాలవారు రావాలి. మరో రకంగా ఉండకూడదు.

వ్యక్తిగతంగా కాకపోయినా, సామూహిక యోగమార్గంలో, ప్రతి ఒక్క దశలో ఎన్నో కష్టాలు ఎదురౌతాయి. ఊహించని సమస్యలు అక్కడ ఎదురౌతాయి. ఈ ప్రయోగశాలలో ప్రాథమిక దశ పూర్తయినపుడు, విషయాలు మారి తీరాలి.

సాధకులలో ఎలాంటి పొరపాట్లు ఉన్నా, పైనుండి వచ్చే ప్రకాశం వల్ల తొలగించ బడతాయి. ఒక సాత్విక నిబంధన, ఆ సాత్విక నియమం పట్ల అనుకూలత ఉన్నవారిని మాత్రమె మార్చగలదు.

ఇప్పటికి ఆశ్రమంలో ఉన్న వారి సంఖ్య పదకొండు వందల కంటె ఎక్కువే. మన సంఖ్య పెరుగుతోంది.

ఇప్పుడు ఆశ్రమంలో ఉన్న వారిలో చాలామంది సాధన చేయనివాళ్లు ఉన్నారు. అప్పుడు ఏ సమస్యా ఉత్పన్నం అవదు. అయితే సాధన చేసేవారికి వేరు విధంగా ఉంటుంది. ప్రతి భౌతిక అస్తిత్వం, అది ఎంత సమగ్రంగా ఉన్నా, అది అతడి యొక్క పరిమిత, అసంపూర్ణస్థితి మాత్రమే. ఎందుకంటె అతడు ఈ ప్రపంచంలోని ఒక ప్రతినిధిగా ఉంటాడు. అది చాలా క్లిష్టమైనది కావచ్చు, కాని అది ఒకే ఒక సాంప్రదాయం. అదే భారతదేశంలో ధర్మం, ఒక సత్యం, ఒక న్యాయం అని పిలుస్తారు.

ప్రతి వ్యక్తి, అతడు మరింత ఉన్నతస్థితికి చెందినవాడైనా, అతడు పూర్తిగా ఓ విశిష్టమైన కార్యాన్ని చేయడానికి తయారుచేయబడినా కూడా, అతను ఒక వ్యక్తిగత జీవి మాత్రమే. అంటే, రూపాంతరం సంపూర్ణంగా సంభవించడానికి. ఒకే ఒక్క శరీరం సరిపోదు. ఒకే ఒక్క శరీరంలో సంపూర్ణ రూపాంతరం సంభవించడానికి ఆస్కారం లేదు. అందుకే సహజంగా అనేక మంది కావలసి వచ్చింది.

ప్రతి వ్యక్తి, ఏకాకిగా తన స్వీయసమగ్రతను సాధించవచ్చు. ఎవరైనా వారి స్వీయచైతన్యంలో అపరిమితంగాను, సమగ్రంగాను ఉండవచ్చు. అయితే, అది ఒక కార్యంగా సాధించవలసి వచ్చినపుడు పరిమితమౌతుంది.

మీరు నే చెప్పేది సరిగా అర్థం చేసుకున్నారో లేదో తెలియదు. కాని వ్యక్తిగత సాక్షాత్కారానికి పరిమితులు లేవు. ఎవరైనా తమలో తాము అంతర్గతంగా పూర్ణత్వాన్ని, అపరిమితమైన విస్తృతిని సాధించవచ్చు, కాని బాహ్యంలో ఆవిష్కరించ బడడానికి అవశ్యంగా పరిమితి ఉంది. దానిని సామాన్య క్రియాచరణగా సాధించాలంటె మాత్రం, అల్పసంఖ్యలోనైనా దైహిక జీవులు అవసరం.

ప్రాచీన సాంప్రదాయంలో ఓ పన్నెండుగురు ఉంటే చాలునని అనేవారు. కాని ఈ ఆధునిక జీవన విధానంలోని సంక్లిష్టతలలో అది సంభవం అనిపించదు. దానికి ప్రాతినిధ్యం వహించే ఒక సమూహం ఉండాలి. దాని అర్థం ఈ యోగం గురించి మీకేం తెలియకపోయినా, సరిగ్గా ఊహించలేకపోయినా పరవాలేదు. ఎందుకంటె మీలో ప్రతి ఒక్కరు రూపాంతరీకరణ కోసం స్వాధీనపరచుకోవలసిన

ఒక్కొక్క కష్టానికి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ విధంగా అనేకమైన అసంభావ్యతలు తయారౌతాయి. వాటిని మనం అధిగమించాలి. నేనొక చోట వ్రాశాను — కష్టాని కన్నా కూడా ప్రతి వ్యక్తి మనం పరిష్కరించబోయే అసంభావ్యతకు ప్రతినిధిగా ఉంటాడని చెప్పాను. ఈ మొత్తం అసంభవాలన్నీ ఈ కార్యంలోకి పరివర్తన చెందాలి, అది అనుభవంగా మారాలి. ప్రతి స్థితి పరిష్కరించవలసిన ఒక అసంభావ్యత. వాట న్నింటిని అధిగమించినపుడె మనం ఈ కార్యాన్ని సాధించగలం.

ఇప్పుడె నేను ఇంకా సౌమ్యంగా చెప్తున్నాను. నేను 'అసంభవం' అన్న పదాన్ని తీసేసి దాని స్థానంలో 'కష్టం' అన్న పదాన్ని పెడుతున్నాను. బహుశ ఇక మీదట అవి అసంభవం కాకపోవచ్చు.

*

నీవు ఒంటరిగా, పూర్తి నిశ్శబ్దంలో, అందరికీ దూరంగా కూర్చుని, నిన్ను నీవు ఎంతో కొంత అభినందనా దృష్టితో చూసుకున్నప్పుడు నువ్వేదో అద్భుతమైన అనుభవాన్ని పొందుతున్నట్లు ఊహించుకోవచ్చు. కాని నీవు, జీవితంలో ప్రతి నిముషం తలపడినపుడు, బాహ్యప్రపంచంలో వివిధ సందర్భాలను ఎదుర్కోవలసి వచ్చినపుడు — నీలోని అసంపూర్ణతలు, లోటుపాట్లు, రోజూ నీలో కలిగే వందలాది చెడు సంకల్పాలు — వీటన్నింటిపై ఎరుక కలిగి, నీవేదో ప్రత్యేకమైన అద్భుతాన్ని సాక్షాత్కరింపచేసుకుంటున్నావన్న భ్రమ తొలగిపోతుంది. నీవు మరింత నిజాయితీతో కృషి చేస్తావు.

అందువల్ల, ఆశ్రమం ఒక నిర్జన అరణ్య ప్రదేశంలో, ప్రశాంతమైన, రమణీయ వాతావరణంలో, లౌకిక ప్రపంచానికి దూరంగా, మన స్వల్ప జీవిత అవసరాలను తీర్చుకోవడానికి నిర్మించాలని నిశ్చయించలేదు. దానికి బదులు, జీవన కార్యకలాపా లన్నింటినీ చేపట్టి, వాటిని మన చేతనైనంత చైతన్యవంతంగా నిర్వర్తించాలని, ఇతరులతో మనకుండే సంబంధాలలో అంతరంగ కదలికలపై అవగాహన పెంచుకొని మెలగాలని ప్రయత్నిస్తున్నాము.

కష్టాల నించి పారిపోవడం, వాటిని అధిగమించి దాటిపోవడానికి మార్గం కాదు. నీ శత్రువు నుంచి పారిపోతే అతడిని ఎన్నటికి ఓడించలేవు. నిన్ను ఓడించడానికి

మాత్రం అతడికి పూర్తి అవకాశం దక్కుతుంది. అందుకే మనం ఎక్కడో హిమాలయ శిఖరాగ్రం మీద కాకుండా, ఈ పాండిచ్చేరీలో ఉన్నాం.

అనువాదం: డి. సత్యవాణి

కొన్ని ప్రశ్నలు — జవాబులు

దివ్యజనని సమాధానాలు

ప్ర: ప్రియజననీ! ఎవరో నన్నీ ప్రశ్న అడిగారు; "మానవాళికి సేవ చేసే అపురూప ప్రతిభ, వ్యుత్పత్తులు ఉన్న వైద్యులు, న్యాయవాదులు తమ మోక్షం కోసం ఆశ్రమానికి వచ్చి వుండడం మానవసమాజానికి పెద్ద నష్టం కాదా? బయట ప్రపంచానికి, మానవాళికి సేవ చేయడం ద్వారా ఇంతకన్న బాగా భగవంతునికి సేవ చేయగలరు కదా!"

శ్రీఅరవిందులకు ముక్తిలో నమ్మకం లేదు. అందువల్ల ఎవరూ కూడా ముక్తి కోసం ఆశ్రమానికి రారు. మా దృష్టిలో ముక్తి అన్నది అర్థరహితమైన మాట. ఒక నవ సృష్టి ప్రాదుర్భావం కోసం, ప్రపంచాన్ని, మనుషుల్ని పరివర్తన చెందించడానికి మేము ఉన్నాము. అటు పురోగతి కోసం వ్యక్తిగత ప్రయత్నాలు చెయ్యాలి. పరివర్తన విజయవంతం కావడానికి ఈ పురోగతి అనివార్యం. ఇన్నాళ్ళు ఆశ్రమంలో వుంటూ ఈ విధంగా నువ్వు ఆలోచించడం ఆశ్చర్యం కల్గిస్తోంది. నేను నీకు శ్రీఅరవిందుల సూక్తి పంపుతున్నాను. నీ ఆలోచనను అది మెరుగుపరచ వచ్చు.

"మానవులతో సంబంధాలలో కానీ, మానవ శీలం ఉదాత్త భావంలో కానీ, ఇక్కడ మానస, నైతిక, సామాజిక సత్యాన్ని, న్యాయాన్ని, మానవ అహంకారయుత విధానాలలో నెలకొల్పాలన్న యోచన నా ప్రబోధానికి వెయ్యి మైళ్ళ దూరంలో వుంది. అది పూర్తిగా అజ్ఞానమయం. అటువంటి వ్యవస్థ కోసం నేను వాగ్దానం చేయలేదు. మానవప్రకృతి నిండా అపరిపూర్ణతలే. మానవదృష్టిలోని ధర్మం, న్యాయం, నయవంచనలే, అపరిపూర్ణతలే, అహంకార సంజనితి చలనాలే.

మానవ జీవితానికి పునాదిగా వున్న ఆధ్యాత్మిక సత్యాన్ని సాక్షాత్కరింప చేసుకోవడం, అదే పరమ లక్ష్యం. ఆ మార్గంలో తొలి మంత్రాల సమర్పణ, భగవంతుని

సాయుజ్యం. అహంను దాటిపోవడం. ఆ పునాది కనుక లేకపోతే, సాధకుడు అజ్ఞాన, అపరిపూర్ణ మానవమాత్రుడే. నిమ్నప్రకృతిలోని, దుష్టభావాలతో పోరాడే ఒక సామాన్యుడు. అంతరంగంలో ఒక అంతర్గత సామీప్యత, ఒక ఆత్మీయబంధం, జగన్మాత ప్రేమ, దివ్యసాన్నిధ్యం — ఇవి ఆధ్యాత్మిక పురోగతిలో పరిమళిస్తాయి."

ప్ర: ప్రియమాతా! మొదట్లో ఆశ్రమంలో చేరేవారిని అనుమతించడంలో మీరు కఠినంగా వ్యవహరించేవారు. కాని ప్రస్తుతం ఆ కఠిన షరతులు లేవు ఎందుచేత?

యోగాభ్యాసం చేసేవారికై ఆశ్రమం ఉన్నంతకాలం కఠినంగా వుండాల్సిందే. పిల్లలకు ప్రవేశం ఇవ్వడంతో కఠినంగా షరతులు విధించడం సాధ్యం కాదు. జీవన విధానమే మారింది.

భూమిపై జీవనహేలకు ఈ ఆశ్రమం ఇప్పుడు ఒక ప్రతీకగా మారింది. దివ్యతరమైన జీవనం వైపు పురోగమించాలన్న సంకల్పం వున్న మేరకు, అన్ని జీవనరీతులకు ఆశ్రమంలో స్థానం వుంటుంది.

ప్ర: ప్రియమాతా! ఒక అగంతుకుడు ఆశ్రమాన్ని గూర్చి అడిగితే సంగ్రహంగా, సరియైన సమాధానం ఎలా చెప్పాలి?

ఆశ్రమం భవిష్యత్ ప్రపంచానికి బంగారు ఊయల వంటిది. రేపటి సృష్టికి అది ఆవిర్భావ కేంద్రం. ఇతర ప్రశ్నలు గనుక అడిగితే ముక్తసరిగా ఇలా చెప్పు. "నువ్వు శ్రీఅరవిందుల గ్రంథాలు పఠించాలి. ఆయన ప్రబోధాన్ని అధ్యయనం చెయ్యాలి."

'నా నుండి నువ్వు దూరంగా వుంటే, నాతో ఇదే సంబంధాన్ని కలిగి వుండవచ్చునా' అని అడుగుతున్నావు. "ఓహ్! అది కాల వ్యవధిపై ఆధారపడి వుంటుంది." సుదీర్ఘ కాల స్రవంతిలో, నెమ్మదిగా నీలోని 'నిజమైన అస్తిత్వాన్ని' మరిచిపోతావు. చాలా మేధావిగా, తెలివైనవానిగా, హేతుబద్ధమైన జీవిగా ఉండటానికి అలవాటు పడిపోతావు. అంతకు మించి మరోలా వుండాలన్న భావనే నీకు రాదు.

అనువాదం కె. యజ్ఞన్న

ఆశ్రమంలోని విశిష్ట దినాలు

శ్రీమాత మాటలు:

ఫిబ్రవరి 21: జగన్మాత పుట్టిన రోజు (1878)

మార్చి 29: శ్రీఅరవిందులతో జగన్మాత మొదటి సమాగమ వార్షికోత్సవం (1914)

ఏప్రిల్ 4: పుదుచ్చేరికి శ్రీఅరవిందుల రాక (1910)

ఏప్రిల్ 24: జగజ్జనని పుదుచ్చేరికి తుది ఆగమనం (1920)

ఆగస్టు 15: శ్రీఅరవిందుల జన్మదినం (1872)

నవంబరు 24: 1926 లో జరిగిన ఒక ముఖ్య ఆధ్యాత్మకి సంఘటనకు గుర్తుగా జరిపే విజయ దినోత్సవం

ఫిబ్రవరి 29: పరాత్పరుని దినోత్సవం, స్వర్ణదినం. 1956 లో ఇదే రోజున అతిమానస రోచస్సు, శక్తి, చైతన్యం అవరోహించాయి.

నవంబరు 17: జగన్మాత 1973 లో తన మృణ్మయ శరీరాన్ని త్యజించిన దినం.
నవంబరు 20: సమాధి పైభాగంలో జగన్మాత పార్థివ శరీరాన్ని ఉంచారు.

డిసెంబరు 5 1950: శ్రీఅరవిందులు దేహపరిత్యాగం చేసిన రోజు. డిసెంబరు 9 న ప్రాకృత శరీరాన్ని సమాధిగతం చేశారు.

అనువాదం కె. యజ్ఞన్న


చిహ్నాల అర్థం

శ్రీమాత మాటలు:



శ్రీఅరవిందుల చిహ్నం

అవరోహిస్తున్న త్రిభుజం — సత్ -చిత్ -ఆనందం
అధిరోహిస్తున్న త్రిభుజం — జీవం, కాంతి, ప్రేమ రూపంలో భౌతికం నుండి వెలువడే ఆకాంక్ష
రెండూ కలిసిన మధ్యలోని చదరం — పరిపూర్ణ అభివ్యక్తీకరణ, మధ్యలోని పద్మం పరాత్పరుని అవతారం
చదరంలోని నీరు — అనేకత్వం, సృష్టి.



జగన్మాత చిహ్నం

మధ్యలోని వృత్తం భగవత్ చైతన్యం.
నాలుకు రేకులు జగన్మాతలోని నాలుగు అంశలు.
వాటి చుట్టూ వున్న 12 దళాలు జగన్మాత దివ్య కార్యం కొరకు అభివ్యక్తమైన శక్తులు

*

పరాత్పరుని చైతన్యాన్ని శ్వేతపద్మంలాగా చిత్రించిన సంకేత రూపం. (జగన్మాత విశ్వజనీన సృష్టి రూపంలోని) మహాశక్తి చిహ్నం మధ్యలో వుంది. నాలుగు అంశలు 12 అభివ్యక్త శక్తులతో పాటు.

అనువాదం: కె. యజ్ఞన్న

Vol. 41, No. 9
September 2011

Rs. 15.00

Registered: TN/PMG(CCR)/39/09-11
WPP No. 35/09-11

AKHILA - Akhila Bharat Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)
Published on 1st day of every month.

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo



Cover Picture
Sri Aurobindo Ashram, Puducherry

Editor: A. Kailasapati
Published by Pradeep Narang on behalf of Sri Aurobindo Society,
No. 1, Rangapillai Street, Puducherry - 605001
Printed by Swadhin Chatterjee at Sri Aurobindo Ashram Press,
38, Goubert Avenue, Puducherry - 605001

Single copy: Rs. 15 **Annual Subscription: Rs. 150 (in India)**

A Monthly Published by
SRI AUROBINDO SOCIETY, PUDUCHERRY - 605002



అఖిల

అఖిల భారత పత్రిక

అక్టోబరు 2011

కుంగిపోవడం — తగిన కారణాలు నివారణ

10/10/20

కుంగిపోవడం — దానికి కారణాలు — నివారణ

శ్రీమాత

శ్రీఅరవిందులు

శ్రీమాత సలహా

ఇక్కడున్నదంతా విచారము, విషాదభరితమూ కాదు ఆ చెట్లు కాని, ఆ నింగి కాని, ఆ కడలి కాని, ప్రతిదీ ఒక సంపూర్ణమైన దివ్యత్వంతో నిండి ఉన్నది. ఆ విష యాన్ని నీతో చెప్పటానికి అవి ఎంతో సంతోషిస్తాయి. ఈ పసితనపు చేష్ట లాంటి కుంగుబాటును వదిలించుకో, నీ హృదయంలో ఉదయిస్తున్న సూర్యునిపై దృష్టి నిలుపు!

*

నేనెప్పుడూ ఊర్ధ్వముఖంగా చూస్తాను. అక్కడ సౌందర్యం, శాంతి, ప్రకాశాలున్నాయి. అవి క్రిందికి రావడానికి తయారుగా ఉన్నాయి. అందుకే ఎల్లప్పుడు ఆకాంక్షించు. దృష్టిని పైకి సారించు. అప్పుడు అవి ఈ పృథ్విపై అభివ్యక్తం కాగ లవు.

*

ఈ ప్రపంచం లోని అసహ్యపు అందవిహీనత లోకి తొంగి చూడకు. నీలో విచారం క్రమ్ముకున్నప్పుడల్లా నాతో కలిసి పైకి చూడు.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

ఒక మిత్రుని స్వరం విను

నీవు అలసి ఉన్నప్పుడు, నిరుత్సాహంతో ఉన్నపుడు, గాయపడినపుడు, పడిపోయినపుడు, బహుశా నీవు ఓడిపోయానని భావించినపుడు — ఓ మిత్రుని స్వరం విను. అతడికి నీ విచారాలు తెలుసు. అతడూ అందులో భాగస్వామే, అతడు నీ లాగే ఈ భూమ్మీద ఉన్న చెడుతో బాధించబడ్డాడు. నీ లాగే అతడు నడిచే దారిలో ఎన్నో ఎడార్లు దాటాడు. అతడికి ఆకలిదప్పుల బాధ తెలుసు. ఏకాకిగా నుండటం, పరిత్యజించబడుట, అన్ని అభావాల్లోకల్లా అతిక్రూరమైన, ఆదరాభిమానాల లేమితో హృదయం పడే వేదన తెలుసు. అనుమానాలు, పొరపాట్లు, అపరాధాలు, దౌర్బల్యాలు, బలహీనతలు మొదలగువాటితో గడిపిన విషమ ఘడియల అనుభవం కూడ అతనికి ఉంది.

కాని అతడు నీకు చెప్తాడు, ధైర్యంతో ఉండమని. ప్రతి ఉదయం తన తొలి కిరణాలతో ఈ పృథ్విపై వెలుగు నింపే ఉదయించే సూర్యబింబం అందించే స్ఫూర్తి పాఠాన్ని తెలుసుకో. అది ఆశకు ఊపిరిపోసే పాఠం, ఒక ఓదార్పు సందేశం.

బాధతో కంపిస్తూ శోకించే నీవు, నీకు జరిగే చెడుకు, నీవు పడే బాధలకు ఓ అంతం ఉందని అనుకోడానికే భయపడే నీవు, నీ బాధలకు కారణం దొరక్క బాధపడుతున్న నీవు, ఒక్కసారి ఆగి చూడు! ఉషోదయం లేని రాత్రి లేదు. అంధకారం చిక్కగా ఉన్నప్పుడే ఉషస్సు ప్రారంభమయ్యేది. సూర్యరశ్మి కరిగించని పొగమంచు లేదు. పసిడి అంచుతో ప్రకాశించని మేఘమూ లేదు. అది ఏదో ఒక రోజున ఆర్పని అశ్రుబిందువు లేదు. ఇంద్రధనుస్సు వెన్నంటని తుఫాను లేదు, అది కరిగించని మంచు లేదు. అది వసంతంగా మార్చని శిశిరమూ లేదు.

నీకూ అంతే! ప్రతి కష్టం దానితో సరిసమానమైన విజయాన్ని తీసుకువస్తుంది. ఆనందంగా మార్పుచెందని దుఃఖమూ లేదు; విజయానికి దారితీయని ఓటమి ఉండదు. ఉన్నతస్థితులకు అధిరోహించని పతనమూ లేదు. జీవితకేంద్రంగా ప్రకాశించని ఏకాంతము లేదు. సమగ్రతగా మారని అసమగ్రతా లేదు — ఒక్కోసారి రెండు మనసుల మధ్య వచ్చిన అపార్థాలు, ఆ రెండు హృదయాల పరస్పర అవగాహనకి ప్రోత్సాహకమవుతాయి. చివరిగా అత్యంత బలహీనత సైతం శక్తిగా మారగలదు. అమిత బలహీనతలోనే దైవశక్తి అభివ్యక్తమౌతుంది.

కుమారా, విను, ఈ రోజు నీవు చెదిరిన మనసుతో, బహుశ పతనం చెందానన్న భావంతో ఉన్నావు, నిరాధారంగా నీ దుఃఖాన్ని దాచలేక, ఆత్మాభిమానాన్ని కాపాడుకోలేక, నిస్సహాయుడవై ఉన్నావు. అయితే, ఇంతకు ముందెన్నడూ నీ వింత గొప్పస్థితిలో లేవు! గాఢలోతుల్లోంచి మేల్కొన్నవాడే శిఖరాలకి చేరువగా ఉంటాడు. ఎందుకంటె అగాధం లోతైన కొద్దీ శిఖరాలు మరింత సుస్పష్టంగా ప్రకటితమౌతాయి.

ఆ విస్తృతాల అత్యంత ఉత్కృష్టశక్తుల అన్వేషణ అంతా ఆ దివ్యపదార్థ గాఢ మసక తెరల గుండా చొచ్చుకుపోయి వ్యూహరచన చేయడానికే అని నీకు తెలియదా? ఓహ్! ఆ మందమైన అంధకారాలతో సమాగమమైన ఆ సర్వోత్కృష్ట ప్రేమ యొక్క ఉన్నత వైభవం, ఆ నీలిఛాయలు దివ్యప్రకాశంతో సంగమించాలనే పరితాపం, ఎంత అద్భుతం!

ఓ కష్టం కాని, ఓ పొరపాటు కాని నిన్ను కృంగదీస్తే, నిన్ను బాధించే ఆ దుష్ట శక్తుల అగాధాల్లో నీవు మునిగిపోతే — బాధపడకు — అక్కడే నీకు వాస్తవంగా దివ్యప్రేమ దొరుకుతుంది, అప్పుడే ఆ దివ్య ఆశీస్సు నిన్ను చేరుతుంది! ఎందుకంటె పవిత్రపరిచే దుఃఖాల మూస నించి నీవు ప్రయాణించావు, కనుక ఈ ఉన్నత అధిరోహణా వైభవాలు నిన్ను వరిస్తాయి.

నీవు జనారణ్యంలో ఉన్నావు. అందుకే నిశ్శబ్దం యొక్క గొంతు విను. బాహ్య ప్రపంచంలోని కరతాళ ధ్వనులు, పొగడ్తలు, నీ చెవుల కింపుగా ఉండి ఉండవచ్చు. కాని నిశ్శబ్దం యొక్క స్వరం నీ ఆత్మను ఆనందపరచి, నీలో గాఢ లోతుల ప్రతిధ్వనులను మేల్కొల్పుతుంది, దివ్య మధురస్వర గీతాలను వినిపిస్తుంది.

నీవు గాఢ నిశీధిలో నడుస్తున్నావు. అప్పుడు నీవు నిశీధిలోని అమూల్యసంపదను పోగుచేసుకో. దేదీప్యమానమైన సూర్యకాంతిలో ప్రజ్ఞ యొక్క దారులు కాంతివంతమౌతాయి కాని నిశీధి యొక్క పరిశుద్ధ వెలుగుల ప్రసరణలో సమగ్ర మార్గాలు దాగి ఉంటాయి. అదే ఆధ్యాత్మిక వైభవాల రహస్యం.

అన్ని పోగొట్టుకుని నిస్సహాయంగా నిలిచావు. అదే సమృద్ధికి చేర్చే మార్గం. నీ దగ్గర ఏమి లేనపుడు నీ కంతా ఇవ్వబుడుతుంది. ఎందుకంటె ఎవరైతే నిజాయితీతో సత్యవర్తులై ఉంటారో వారికి ఎప్పుడూ చెడు నుంచి మంచి లభిస్తుంది.

భూమిలో నాటిన ప్రతివిత్తనం వేయింతలై ఫలిస్తుంది. పెల్లుబికే ప్రతి దుఃఖం, ఓ ఉన్నత వైభవం దిశగా దూసుకుపోతుంది.

దురదృష్టం మనిషిని వెంటబడి నిరంతరం తరుముతున్నప్పుడు, అతడిని నాశనం చేయడానికి పూనుకున్నదంతా అతడిని మరింత ఉన్నతుడిని చేస్తుంది.

ప్రపంచాల కథలు విను. ఇలా చూడు: ఓ గొప్ప శత్రువు విజయం పొందేటట్లు కనపడాతాడు. అతడు నిశీధిలోకి కాంతి దూతల్ని విసురుతాడు. రాత్రి మెరిసే నక్షత్రాలతో నిండుతుంది. విశ్వకార్యాన్ని ఎదిరించి విశ్వసామ్రాజ్య వలయాల సమగ్రత మీద దాడిచేస్తాడు, దాని సమతుల్యాన్ని చెల్లాచెదురు చేసి, విభజించి, దాన్ని మరింత విడగొట్టి, ముక్కలుచేసి, చివరికి ఆ ధూళిని అనంతవాయువులతో నాల్గు దిక్కులకు వెదజల్లుతాడు. ఆ! చూడు, ఆ ధూళే ఓ సువర్ణవిత్తుగా మారి అనంతాన్ని సారవంతం చేసి, జీవులతో నిండిన ప్రపంచాలుగా మార్చింది. అవే ఇప్పుడు ఆ విశ్వ విస్తృత ఆవరణలో తమ శాశ్వత కేంద్రం చుట్టూ పరిభ్రమిస్తున్నాయి — అంటే విభజన కూడ మరింత సమృద్ధ, మరింత గాఢమైన ఐక్యతను సృజిస్తుంది, మరియు ఈ భౌతిక విశ్వ ఉపరితలాలను రెట్టింపుచేయడం ద్వారా అది నిర్మూలించాలనుకున్న విశ్వసామ్రాజ్యాన్ని మరింతగా విస్తృతపరుస్తుంది.

అనంతత్వ హృదయంలో ప్రతిష్టితమై ఊయలలూగే ఆదిభౌతిక ఖగోళాల యొక్క గానం నిజంగా ఎంత రసరంజితమో! అయితె ఆ నక్షత్రమండలాల స్వరసమ్మేళన ఇంకెంత సౌందర్యభరితమూ, విజయవంతమో కదా! అది స్వర్గమంతటినీ శాశ్వత విజయగీతంతో నింపే అమర బృందగానం.

మళ్ళీ విను: తన దివ్యమూలాల నుండి విడిపడి ఈ భూమ్మీద చేరిన మానవుని స్థితి కన్నా అనిశ్చిత స్థితి ఏదీ లేదు. అతడి పైన తిరుగుబాటుచేసే దుష్టశక్తుల సరిహద్దులున్నాయి. అతడి దిఙ్మండల ద్వారము వద్ద కాపలాదారులు జ్వలించే కత్తులతో నిలిచి ఉంటారు. ఆ కారణంగా అతడు ఆ జన్మస్థానాన్ని అధిరోహించ లేనందున, ఆ మూలం అతనిలోనే ఉదయించింది. అతడు ఆ పైనించి వచ్చె కాంతిని అందుకోలేకపోవడం వలన — అతని అస్తిత్వ కేంద్రంలోనే అది ప్రకాశించింది. ఆ భావాతీత ప్రేమతో సంపర్కం కలిగి ఉండకపోవడం వలన ప్రేమ తనంతట తాను ఒక పూర్ణాహుతిగా ఈ భూమ్మీద ఉండే ప్రతి జీవిలో, ప్రతి మనిషిలో, తన నివాసంగా ఓ పవిత్రస్థానాన్ని నిలుపుకుంది.

ఆ విధంగా ఈ భౌతికజగత్తు నిరాశతో, దిక్కులేకుండా ఉన్నా, ఆశీస్సును పొంది ఫలవంతమైంది. ప్రతి అణువు ఓ దివ్య ఆలోచనతో నిండి ఉంది. ప్రతిజీవి

తనలో కొలువై ఉన్న దైవాన్ని మోస్తున్నాడు. ఈ విశ్వంలో ఏ జీవి కూడా మానవుడంత దుర్బలుడు కానట్టే, అతనంత దివ్యమైనవాడు కూడా ఎవ్వరూ లేరు.

నిజానికి, సత్యం ఏమిటంటే — అవమానంలోనే విజయం యొక్క జన్మస్థలి నెలకొని ఉంది.

(ఏప్రిల్ 28, 1912)

మూలం: శ్రీమాత
అనువాదం: డి. సత్యవాణి

పట్టుదలతో చేసిన కృషి అన్ని అడ్డంకుల్ని తొలగిస్తుంది

పట్టుదలతోనే కష్టాలపై విజయం సాధించగలం, వాటి నుంచి పారిపోవడం వలన కాదు. ధృడమైన కృషి చేసినవారు విజయం సాధించి తీరుతారు. అత్యంత సహిష్ణత ఉన్నవారినే విజయం వరిస్తుంది. నీ పనిని ఎల్లప్పుడు చక్కగా చేస్తే, దైవం ఫలితాలని తానే చూసుకుంటాడు.

*

నీ అభివృద్ధిని ఆటంకపరిచే ఏ విధమైన అలజడి, వ్యాకులతలను, నిరాకరించే స్థిరమైన నిశ్చల సహనం, చాలా ముఖ్యమైనది. నిజాయితీగల ఆకాంక్ష మాత్రమే విజయాన్ని ధృవపరుస్తుంది.

మూలం: శ్రీమాత
అనువాదం: డి. సత్యవాణి

కుంగుబాటుకు కారణం -- 1

ప్రతి ఒక్కరు సర్వదా ఒక సాధారణమైన ప్రాణికస్థితిలో ఉంటూ ఉంటారు. ఆ స్థితిలో అతి స్వల్ప అసంతోషకరమైన విషయం కూడ సహజంగానే కుంగుబాటును కలుగుజేస్తుంది. బలహీనుడి విషయంలో కుంగుబాటు, బలవంతుడి విషయంలో తిరుగుబాటు. ప్రస్తుత జీవనంలో ఈ విధంగా జరుగుట సర్వసాధారణ విషయం. కాని సంతోషకర పరిణామం అరుదైన విషయం.

శాశ్వత ఆనందానికి నిలయమైన అస్తిత్వము యొక్క సత్యస్వరూపంతో అను బంధమేర్పడినప్పుడే వ్యక్తికి అవిముక్తమైన ఆనందలబ్ధి ప్రాప్తిస్తుంది.

*

కుమారా, జాగ్రత్త, కుంగుబాటుకు, అధైర్యానికి, తిరుగుబాటుకు ద్వారం తెరువకు — ఇది చైతన్యానికి దూరంగ, బహుదూరంగ కొనిపోతుంది, సుఖసంతోషాలు ఎప్పటికీ ప్రవేశించలేని అంధకారబంధురమైన అస్పష్టత లోతుల్లోకి నిన్ను ముంచివేస్తుంది. నీ చిరునవ్వే నీకుండిన గొప్ప బలం; కారణం, జీవితాన్ని ఎలా ఉల్లాసంగా తీసుకోవాలో నీకు తెలుసు, ధైర్యసాహసాలతో నిబ్బరంగా ఎలా పని చేయాలో నీకు తెలుసు. ఈ విషయాలలో నీకు అసాధారణ ప్రజ్ఞ ఉండేది, కాని, అసంతృప్తి చెందటం, ఎదురుతిరగటం, కుంగిపోవటం నీవు నేర్చుకున్నావు. ఇప్పుడు నీ చిరునవ్వును కూడ జారవిడుచుకున్నావు. దానితో పాటు నీకు నాపై ఉన్న విశ్వాసం, నమ్మకం కూడ జారిపోయాయి. ఈ పరిస్థితిలో దివ్యశక్తుల నన్నింటిని నీపై కేంద్రీకరించినా కూడ అది వ్యర్థమే అవుతుంది; నీవు వాటిని స్వీకరించుటకు తిరస్కరిస్తావు.

దీనికి ఒకే ఒక పరిష్కారం ఉంది. దానికి సమ్మతించడానికి ఏమాత్రం ఆలస్యం చేయకు. నీ చిరునవ్వును తిరిగి రాబట్టుకో, నీ విశ్వాసాన్ని తిరిగి సంపాదించు. గతంలో మాదిరిగ ఆత్మస్థైర్యంతో నిండిన బాలుడిగ తయారవ్వు.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ఈ స్థితి ఇలానే ఉండదు, గడిచిపోతుంది, అంతా బాగుంటుంది అనే గట్టినమ్మకంతో ఉండటం ఉత్తమం.

ప్రశ్న: కుంగిపోకుండా ఉండటమంటే...?

కుంగిపోకుండా ఉండుట — ఇది చాలా ముఖ్యం. కుంగిపోవటం బలహీనతకు, ఎక్కడో ఒక చోట చెడుతలంపు తలెత్తిందనుటకు సంకేతం — సహాయాన్ని నిరాకరించాలనే ఆలోచన, బలహీనంగ బతుకును సాగించుటతోనే సరిపెట్టుకుపోయే బలహీనత లాంటి చెడుతలంపు. మనిషిలో పట్టు సడలుతుంది, శ్రద్ధ క్షీణిస్తుంది. దీనితో చెడు సంకల్పం నీలో ఉదయించిందనుట ధృవపడింది. ఎందుకనగా, ఆ క్షణంలో నీ అస్తిత్వంలోని ఒక భాగము, 'కుంగిపోవుట మంచిది కాదు' అని నీకు సూచించింది. కుంగిపోకూడదు, అని నీకు తెలియవచ్చింది. కాని కుంగిపోయిన నీ శరీరం లోని ఆ భాగం యొక్క స్పందన ఇలా ఉంటుంది: "నోర్మూయ్యి! నా కుంగుబాటు నాకు ఉండనియ్యి". ప్రయత్నించు, నీకే తెలుస్తుంది. ప్రయత్నించి చూడు. ఎప్పుడూ అలానే జరుగుతుంటుంది. ఏం! నిజం కదూ? కొంత సమయం తరువాత మళ్లీ ఇలా అనుకుంటావు: "తరువాత, తరువాత చూస్తాను. ఇప్పటికిలానే ఉంటాను, నా కారణాలు నాకున్నాయి" అదీ సంగతి. ఇది ఒక రకమైన తిరుగుబాటు. బలహీనమైన తిరుగుబాటు. అస్తిత్వంలో ఏదో ఒక నీరసపడినదాని తిరుగుబాటు.

*

మానసికపరమైన ప్రభావం అధికంగా ఉన్న వ్యాధుల విషయంలో కుదుటపడటానికి సుముఖత చూపని రోగులు మాత్రమే స్వస్థత పొందరు. బహుశ, శారీరకపరమైన వ్యాధుల విషయంలో కూడ ఈ విధంగానే ఉంటుందేమో?

*

కుంగుబాటు అంతా చెరుపే, ఎందుకనగా, అది చేతనను దిగజారుస్తుంది. శక్తిని వెచ్చిస్తుంది, ప్రతికూలతకు తెరుచుకుంటుంది.

శ్రీమాత

తృప్తిగా ఉన్నావా లేక అసంతృప్తిగా ఉన్నావా అనే విషయం ఎవరికి వారికే తెలుసు, ప్రశ్నించుకోనవసరం లేదు, చిక్కుప్రశ్నలు వేసుకునే అవసరం అసలే లేదు, ఎందుకంటే వారికా సంగతి తెలుసు గనుక. ఇది సాధారణ విషయం.

ఏ క్షణాననైతే విచారంగ ఉన్నానని నీకు అనిపిస్తే, "నాకు చిత్తశుద్ధి లోపించింది" అని వ్రాసుకోవచ్చు. ఈ రెండు వాక్యాలు జంటగ ఉంటాయి:

"నేను విచారంగ ఉన్నాను".

"నాకు చిత్తశుద్ధి లోపించింది". ఇప్పుడు ఏది తప్పు? అప్పుడు పరిశీలన ప్రారంభమౌతుంది. తెలుసుకోవడం చాలా సులభం.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

మనలోని ప్రాణిక సత్తాను తెలుసుకో

మనలోని ప్రాణికసత్తా మానసిక ప్రేరణలు కామనలకు, ఉత్సాహాలు దౌర్జన్యాలకు, క్రియాశీలశక్తులు నిరాశాయుత కుంగుబాట్లకు, గాఢావేశము తిరుగుబాట్లకు పీఠము. అది అన్నింటిని కదిలించగలదు, నిర్మించగలదు, సాధించగలదు; అయితే దేనినైనా ధ్వంసం చేయగలదు, భంగపరచగలదు కూడా. అందువల్ల మానవునిలోని ఈ ప్రాణిక సత్తాకు క్రమశిక్షణ గరుపుట కష్టమైన పని. ప్రాణికము యొక్క తోడ్పాటున్నట్లయితే ఏ కార్యసిద్ధి అయినా అసాధ్యమనిపించదు. ఏ పరివర్తన అయినా సాధించలేనిది అనిపించదు. కాని ఇబ్బంది అంతా దాని నిరంతర సహకారాన్ని సంపాదించుకొనుట లోనే ఉంది. ప్రాణికము ఒక మంచి శ్రామికుడి లాంటింది. అయితే అది స్వయంతృప్తినే తరచు కాంక్షిస్తూంటుంది. తృప్తి పూర్తిగ లేక పాక్షికంగానైన లభించకపోతే అది కలతచెందుతుంది, చిరచిర లాడుతుంది, భీష్మించుకుని కూర్చుంటుంది. దాని శక్తిసామర్థ్యాలు మటుమాయమౌతాయి. వాటి స్థానే మనుషుల పట్ల, విషయాల పట్ల ఏవగింపు, నిరాశ, నిస్పృహ, తిరుగుబాటు, కుంగుబాటు, అసంతృప్తి మిగులు తాయి. అలాంటి సమయాల్లో మనం శాంతి వహించి ఏ పనిని చేపట్టకుండుట

మంచిది. ఎందుకనగా అలాంటి సమయాల్లోనే ఎవరైనా తెలివిమాలిన పనులు చేస్తారు. నెలల తరబడి శ్రమించి సాధించిన ప్రగతిని క్షణాల్లో నాశనం చేస్తారు. ఇలాంటి సంకటావస్థలో చైత్యపురుష సత్తాతో సంయోగమొందిన వారి విషయంలో స్వల్పకాలికాలుగాను, స్వల్పహానికరాలుగా నిలుస్తాయి. వారిలో ఆకాంక్ష జ్వాల, సాధించవలసిన ఆదర్శస్మృతి సజీవంగా నుంచుట కది చాలు. ఈ చేతనా సహాయంతో వారు, వారి ప్రాణికంతో ఒక ఎదురుతిరిగిన పిల్లవానితో వ్యవహరించే తీరుగ, సహనంతో, నిలకడగా వ్యవహరించాలి; సత్యమేమిటో, వెలుగేమిటో చెప్పి సమాధానపరిచి, వారిలో మరుగునపడి ఉన్న మంచితనాన్ని మేల్కొలిపే ప్రయత్నం చేయాలి. ఆ విధమైన సహనశీల జోక్యంతో ప్రతి సంకటమును ఒక వినూత్న పురోగమనంగ, గమ్యాన్ని చేరుటలో మరో అడుగుగ మార్చవచ్చు. పురోగతి నత్తనడకగ సాగవచ్చు. విషయాలు పునః ప్రకోపించవచ్చు. కాని సాహసోపేతమైన సంకల్పాన్ని నిల ద్రొక్కుకున్నట్లయితే, ఏదో ఒక రోజున విజయం సాధించవచ్చు. సత్యచేతనా వెలుగులో అన్ని అవాంతరాలు అదృశ్యమైపోతాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

కుంగుబాటు నివారణ — 1

ప్రశ్న: కుంగుబాటును ఏ విధంగా నిగ్రహించగలం?

అదా! దానికి సులువైన మార్గం ఒకటుంది. కుంగుబాటు సాధారణంగా ప్రాణికంలో వస్తూంటుంది. ఎవరైనా ఒక వ్యక్తి కుంగుబాటు బారిన పడ్డాడంటే, అతడు కేవలం తన చైతన్యాన్ని ప్రాణికంలో ఉంచినప్పుడు మాత్రమే. చేయవలసిన పనల్లా, ప్రాణికం లోనుంచి బయటపడటం, ఇంకా ఎక్కువ లోతైనటువంటి చైతన్యపు లోతుల్లోకి, ప్రవేశించడం. ప్రకాశవంతమైన ఉన్నతమనస్సుకూ, అత్యంత ఉత్కృష్టమైన ఆలోచనలకు కూడా కుంగుబాటును తరిమికొట్టగల శక్తి ఉంది. వ్యక్తి ఉన్నతోన్నతమైన ఆలోచనాసీమలకు చేరుకున్నా, కుంగుబాటు మాయమౌతుంది. అన్నిటి కంటె, అతడు చైత్య అస్తిత్వ ఆశ్రయాన్ని అర్థిస్తే అప్పుడు కుంగుబాటుకు ఏమాత్రం తావుండదు.

కుంగుబాటు రెండు కారణాల వల్ల వచ్చే అవకాశం ఉంది: ప్రాణికమైన సంతృప్తి లేకపోవడం వలన గాని, లేక శరీరం కొంతకాలం అలసటకు లోనవడం వలన గాని వస్తుంది. భౌతికమైన అలసట వల్ల వచ్చిన కుంగుబాటును చాలా తేలికగా సరిచేయ వచ్చును. దానికి అతడు విశ్రాంతి తీసుకుంటే చాలు. స్తిమితం చిక్కేవరకు నిద్ర పోవటం లేదా విశ్రాంతి తీసుకోవటం, స్వప్నలోకంలో విహరించడం, కదలకుండా పడుకుని ఉండటం దానిని నివారిస్తుంది. ప్రాణికమైన అసంతృప్తి చాలా తేలికగా వస్తుంది. సాధారణమైన నివారణమార్గం దానిని అతడు తన హేతువుతో ఎదుర్కో వాలి. దేని వలన అసంతృప్తి కలిగిందో ఆ కారణాన్ని తప్పక అన్వేషించాలి. అప్పుడు దానిని లోతుగా తరచి చూసి, అది తన అంతరంగ ఆకాంక్షకు అనుగుణంగా ఉందా లేక అది కేవలం పూర్తిగా సర్వసాధారణమైన చలనమేనా అని తనకు తాను ప్రశ్నించుకోవాలి. సామాన్యంగా జరిగేదేమిటంటే, దానికీ వారి ఆకాంక్షకూ ఏ సంబం ధమూ లేదనే విషయాన్ని వారు తెలుసుకుంటారు, దానిని వారు తేలికగా అధిగమి స్తారు, తమ సాధారణ కార్యక్రమాలను తిరిగి చేపట్టుతారు. అదీ చాలకపోతే, వారు తమ అంతరాంతరాళాల్లోనికి యదార్థ చైత్యసంపర్కాన్ని పొందే దాకా ఇంకా ఇంకా లోలోతులకు తప్పక వెళ్ళాలి. అక్కడ వారు ఈ యదార్థ చైతన్యానికి, తనకు కుంగుబాటును కలిగించే చలనానికి కేవలం అనుసంధానించితే చాలు, అది తక్షణమే కనపడకుండా పోతుంది.

ప్రాణిక క్షేత్రంలోనే పోరాటం గురించి చెప్పవలసివస్తే, కొంతమందికి బాగా పోరాటపటిమ ఉంటుంది. వారు ప్రాణికంతో తలపడడాన్ని ఆస్వాదిస్తారు, కాని నీకు నిజం చెప్పాలంటే అది ఎంతో కష్టంతో కూడుకున్నది.

ప్రశ్న; ఒకసారి చైత్య అస్తిత్వం ముందుకు వస్తే, అది తిరిగి వెనుకకు మరలి పోగలదా?

అది సంభవమే. సామాన్యంగా ఒకరికి చైత్య అస్తిత్వంతో తాదాత్మ్యానుభవాలు వరుసగా వస్తాయి, మొదట చాలా తీవ్రంగానూ, తరువాత క్రమానుగతంగా తగ్గి పోతూ, ఒక రోజు అవి నీకు కనపడకుండాపోవటాన్ని కనుగొంటావు. అయినా నీవు ఏమాత్రం కలవరపడకూడదు, ఎందువల్లనంటే అది సర్వసాధారణంగా జరిగే విషయం. కాని దాని తరువాత రెండవసారి అనుసంధానం చాలా తేలికగా అందుకోబడుతుంది.

తరువాత ఒకానొక సమయం వస్తుంది, అదీ ఎంతో కాలం తీసుకోదు. వారు ఏకాగ్రత వహించి, ఆకాంక్షించటం మొదలుపెట్టగానే వారు దాని స్పర్శ నందుకుంటారు. ఒక వ్యక్తికి ఎల్లకాలం దానిని ఉంచుకునే శక్తి ఉండకపోవచ్చును, కానీ దానిని సంకల్పించి పొందగలరు. ఇక అప్పుడు ఆ క్షణం నుంచి విషయాలన్నీ చాలా తేలిక అయిపోతాయి. ఎప్పుడైనా వారికి కష్టం వచ్చినా లేక ఏదైనా సమస్యకు పరిష్కారం కనుగొనాల్సి ఉన్నా, పురోభివృద్ధి సాధించాలన్నా లేక ఒక కుంగుబాటును జయించాలన్నా లేక ఏదైనా అడ్డంకిని అధిగమించాలన్నా లేక, ఏదీ లేకుండా కేవలం తాదాత్మ్యతానందం కోసమైనా (ఎందువలనంటే ఒక అనుభవం అతి వాస్తవమైన ఆనందాన్ని కలిగిస్తుంది; తాదాత్మ్యత పొందిన క్షణాన ఆ వ్యక్తి ఎంతో ఎక్కువ ఆనందానుభూతి పొందుతాడు), అది ఎటువంటి తరుణమైనప్పటికి, కొంత సంబాళించుకున్న తరువాత, కొంత తడవు ఏకాగ్రత వహించి ఆకాంక్షించితే, ఎంతో సహజంగా అనుసంధానం ఏర్పడి, ఏ సమస్యలనైతే పరిష్కరించాలో అవన్నీ పరిష్కరించబడతాయి. కేవలం ఏకాగ్రత వహించం; స్థిరాసనులై ఏకాగ్రత వహించి, ఈ విధంగా ఆకాంక్షిస్తే అనుసంధానం జరిగిపోతుంది, చెప్పాలంటే అది తటాలున వెంటనే అయిపోతుంది.

నేను ఇంతకు ముందు చెప్పిన విధంగా, ఒక సమయం వస్తుంది, అనగా అది చైతన్యపు లోలోతులలో ఉంటుంది. నీవు చేసే పనులన్నింటికి ఆధారమౌతుండగా ఆ అనుసంధానాన్ని నీవు ఎప్పుడూ పోగొట్టుకోవు. అప్పుడు చాలా విషయాలు మాయమైపోతాయి. ఉదాహరణకు, కుంగుబాటు అనేది వీటిలో ఒకటి — అసంతృప్తి, తిరుగుబాటు, అలసట, కుంగుబాటు మొదలైనవి. ఒక వ్యక్తి, అతని చేతనలో వెనుకకు అడుగు వేయటమనే అలవాటు మేము చెప్పిన విధంగా చేసుకుంటే, అతని చైత్య చైతన్య పుతెర మీద అన్ని సందర్భాలు, అన్ని సంఘటనలు, అన్ని భావాలు, జ్ఞానమంతా, సమస్తాన్ని చూడడటం జరుగుతుంది. ఆ క్షణంలో అతడు అదంతా చూసి, తాను చేయదల్చుకున్నదానికీ నిశ్చయమైన మార్గదర్శనం పొందుతాడు. కాని ఇది చాలా కాలమే తీసుకుని తీరుతుందనేది వాస్తవం.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

కుంగుబాటు నివారణ — 2

నీ కష్టాలను, అడ్డంకులను చిరునవ్వుతో ఎదుర్కొనాలి. నీవు విషాదసూచకమైన దుస్తులతో, పశ్చాత్తాప మనస్సుతో, చేసిన తప్పులను గురించి దుఃఖిస్తూ, ఆ సమయంలో ఉండవలసినదానికి తగ్గట్టుగా నీవు ఉండలేకపోయిన కారణాన్ని తలచుకుంటూ పూర్తిగా దిగాలుపడి నిట్టూర్పులతో కూర్చుండనవసరం లేదు. నీవు చాలా తేలికగా ఒక చిరునవ్వుతో కుంగుబాటును తరిమివేయాలి. వంద తప్పులైనప్పటికి అది ఏమంత సమస్య కాదు: మందహాసంతో నీవు తప్పుచేశానని గ్రహిస్తావు, ఒక చిరుదరహాసంతో ఆ తప్పును ఇక ముందు చేయనని తీర్మానం చేస్తావు. కుంగుబాటు, విచారం అంతా దుష్టశక్తుల సృష్టి. నిన్ను దుఃఖంలో ముంచివెయ్యడం కంటె వాటికి ఆనందం కలిగించే విషయం మరొకటి లేదు. వినమ్రతకు, కుంగుబాటుకు చాలా తేడా ఉంది. వినమ్రత దైవం నుంచి వచ్చిన ఒక కదలిక, కాని కుంగుబాటు క్రూరశక్తుల ముతక వ్యవహారం. కనుక నీ కష్టాలన్నింటిని ఆనందంతో ఎదుర్కో. నీ పరివర్తనా మార్గాన్ని చుట్టుముట్టి అవరోధం కలిగించే అడ్డంకులను నిశ్చలమైన చైతన్యపూరకమైన ఆహ్లాదంతో ఎదిరించు. శత్రువును ఓడించి తరిమికొట్టడానికి ఉత్తమోత్తమమైన పద్ధతి అతడి మొహం మీద నవ్వటమే. రోజుల తరబడి తలపడి పెనుగులాడినా అతడి ఉద్ధతిలో తగ్గుదల ఏ మూలా కనపడదు; కాని ఒకసారి చిరునవ్వు నవ్వి చూడు, అతడు కాళ్ళకు బుద్ధిచెపుతాడు. గట్టి నమ్మకం, దైవం మీద విశ్వాసంతో నిండిన దరహాసం క్షణంలో పగులగొట్టి ముక్కలు చేసే అత్యంత శక్తివంతమైన ఆయుధం. అది శత్రుసైన్యంలో చీలికలు తెచ్చి, అన్ని శ్రేణులలో విధ్వంసాన్ని గోచరింపజేసి, నిన్ను విజయపథంలో ముందుకు తీసుకువెడుతుంది.

*

ప్రశ్న: మాతా, మీరిక్కడ "చిరునవ్వు శత్రువుని నిరాయుధుణ్ణి చేస్తుంది" అని చెప్పారు. 'చిరునవ్వు' అంటే అర్థం ఏమిటి? శత్రువుని చూసి ఎవరికైనా మందహాసం చేసే ఔచిత్యం ఉంటుందా!

ఔచిత్యముంటుందా... నేను ఇక్కడ ఒక అనుభవాన్ని చెప్తున్నాను. నేను సర్వసాధారణమైన పరిభాషలో గత అనుభవాన్నొకదానిని వ్యక్తం చేస్తున్నాను. ఒక వేళ ఎవరైనా, ఒకానొక సమయంలో ప్రాణం తీసేటంత దురుద్దేశంతో వస్తే, అప్పుడు

అతడిని చూసి నీవు చిరునవ్వు నవ్వగలిగితే, అతడు పూర్తిగా నిరాయుధుడవుతాడు, హాని కలిగించే ఆలోచనలను విరమించుకుంటాడు. అతడింక ఏమీ చేయలేడు. కాని ఆ చిరునవ్వు తప్పకుండా చిత్తశుద్ధితో కూడినదై ఉండాలి. అది ఏదో పళ్ళు బైటపెడుతూ పేలవంగా నవ్వే చిరునవ్వు కాకుండా లేదా అసహజమైన చిరునవ్వు కాకుండా ఉండాలి.... (నవ్వు) నేను 'చిరునవ్వు' ను దాని పూర్తి అర్థంలో వాడు తున్నాను. చెప్పాలంటే, ఒక వ్యక్తి తన మీద తాను ప్రభుతను సంపాదించి, అన్నింటినీ అధిగమించినవాడై, చాలా ఉన్నత చైతన్యంలో నుంచి పైనుంచి చూడగలి గితే, సాధారణ చైతన్యానికి అత్యంత అసాధ్యమై ఎంతో నాటకీయంగా ఆకర్షణీయ మైనదిగా కనపడేది కూడా, నీకు చిన్నపిల్లల చేష్టల వలె అనిపించి చిరునవ్వు తెప్పిస్తుంది. ఆ విధంగా ఒక వ్యక్తి ఆ చైతన్యంలో ఉండి, అన్నింటినీ చూసి మందహాసంతో నవ్వగలిగితే, (అనగా ఆ వ్యక్తికి అన్నింటికీ కారణాలు అర్థమై, అన్నింటిలో పనిచేసే శక్తులను సైతం చూడగలుగుతాడు), అతడు ఆ చైతన్యంలో ఉండగలిగి చిరునవ్వు నవ్వగలిగితే, విషయాలన్నీ వెంటనే మారిపోతాయి. ఇది కేవలం ఏదో బాహ్యంలో, మనుషులు కలుసుకున్నప్పుడు అలవాటుగా చేసే సాంఘికపరమైన నవ్వు కాకూడదు: ఆ చిరునవ్వు తప్పక చైత్య అస్తిత్వానిదై ఉండాలి.

*

అన్నింటిలోకి అత్యంతావశ్యకమైన లక్షణం పట్టుదల, ఓర్పు, ఇంకా... దానిని ఏమని చెప్పను? ఒక విధమైన ఆంతరంగహాస ప్రసన్నత. అది నిన్ను అధైర్యపడనివ్వదు, దుఃఖంలో మునగనివ్వదు, కష్టాలన్నింటినీ చిరునవ్వుతో ఎదుర్కొనేటట్లు చేస్తుంది. దానికి ఒక చక్కని పదం ఉంది, అది 'ఉల్లాసం'. దానిని నీవు నీలో ఉంచుకోగలిగితే, ఆ కాంతిలో పురోభివృద్ధిని ఆటంకపరిచే చెడుప్రభావాలతో నీవు ఇంకా బాగా పోరాడగలుగుతావు, దానిని ఇంకా బాగా నిరోధించగలుగుతావు.

*

నీవు అన్ని అవమానాలకూ, కయ్యానికి కాలుదువ్వటానికీ అతీతుడవైతే నీవు శత్రు వునుచూసి అతి సహజమైన చిరునవ్వు నవ్వగలవు. ఇది యౌగిక ప్రవృత్తిలో ప్రాథమిక నిబంధన.

*

నీవు జీవితాన్ని చూసి ఎల్లప్పుడూ దరహాసం చేయగలిగితే, జీవితం కూడా ఎల్లప్పుడూ నిన్ను చూసి దరహాసం చేస్తుంది.

*

ఒక వ్యక్తి శాశ్వతంగా చిరునవ్వు నవ్వుతూ ఉండగలిగితే, అతడు శాశ్వతంగా యవ్వనంలో ఉంటాడు.

*

అన్ని సందర్భాలలోను చిరునవ్వు నవ్వడం నేర్చుకోవాలి; నీ దుఃఖంతో పాటు నీ సంతోషాలకు కూడా, నీ బాధలతోపాటు నీ ఆశలకు కూడా నవ్వగలగాలి. ఎందువలనంటే ఆ నవ్వులో తన మీద తనకు పూర్తి ఆధిపత్యం కలిగిన సర్వోత్కృష్టమైన శక్తి ఉంది.

*

మామూలుగా చెప్పాలంటే, మనిషి తనను గురించి తాను అతిగా గంభీరంగా చింతించుకునే పశువు. అన్ని సంతోషాలలో తనను చూసి తాను నవ్వడం నేర్చుకుంటే, తన దుఃఖాలకు, భ్రాంతులకు, తన వాంఛామయ ఆశయాలకు, కష్టాలకు, దుష్ప్రవర్తనలకు, తిరుగుబాట్లకు నవ్వగలిగితే, తనను తాను అధిగమించడానికి అది ఎంత శక్తివంతమైన ఆయుధమౌతుందో!

*

ఎప్పుడు సణుగుతూ గొణగవద్దు. నీవు సణిగితే అన్ని రకాల శక్తులు నీలో ప్రవేశించి నిన్ను కిందకు దిగజారుస్తాయి. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండు. నేను చెప్పేది ఎప్పుడూ ఏదో హాస్యోక్తిగా ఉండవచ్చు, కాని నేను దానిని పూర్తిగా హాస్యానికి మాట్లాడటం లేదు. అది చైత్య అస్తిత్వం నుంచి ఉద్భవించే గట్టి నమ్మకం. చిరునవ్వు విశ్వాసాన్ని వ్యక్తపరచి, దైవానికి ఎదురునిలచి ఏదీ మనలేదనీ, చివరకు అంతా సవ్యంగా జరిగి శుభప్రదం అవుతుందనే విషయాన్ని తెలియజేస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

వైఖరి చాలా ముఖ్యమైనదనే విషయం గ్రహించాలి. బాహ్యవైఖరి సైతం ముఖ్యమైనదే. జనులకు విశ్వాసం ఎంత ముఖ్యమైనదో తెలియుదు; విశ్వాసం అద్భుతం చేస్తుందనీ, అది అద్భుతాల సృష్టికర్త అనీ తెలియదు. నీవు ప్రతి క్షణం పైకి ఉన్నతస్థితికి లేవ నెత్తబడి, దైవం వైపుకు లాగబడాలంటే, ఆయన నిన్ను పైకెత్తటానికి వస్తాడు. ఆయన నీ కోసం చాలా, చాలా దగ్గరగా, ఎప్పటికంటే చాలా దగ్గరగా ఉంటాడు.

*

ఒక వ్యక్తి, ఏమి జరిగినా దివ్యానుగ్రహం అక్కడ ఉండి అనుక్షణం కనిపెట్టి చూస్తుంటుం దనే గాఢనమ్మకంతో దివ్యానుగ్రహం మీద విశ్వాసం ఉంచి, ఆ విధంగా జీవితమంతా, ఎల్లప్పుడూ ఆ విశ్వాసాన్ని ఉంచుకుంటే గనుక, దానితో అతడు అన్ని అపాయాల నుంచి బయటపడగలడు, అన్ని ఇబ్బందులను ఎదుర్కొనగలడు, ఏదీ అతనిని కల వరపరచదు, ఎందువల్లనంటే అతడికి విశ్వాసం ఉంది, దివ్యానుగ్రహం అతనితో ఉంది. అది అపారమైన బలం కలిగి, ఎక్కువ ఎరుకతో, ఇంకా ఎక్కువ కాలం పని చేసే శక్తి. అది భౌతికపరిస్థితుల మీద ఆధారపడేది కాదు. కేవలం ఒక్క దివ్యానుగ్రహం మీద తప్ప దేని మీదా ఆధారపడేది కాదు. దానికి సత్యమే ఆధారం, దానిని ఏదీ కదిలించలేదు.

*

నీవు నీలో ప్రగాఢమైన నమ్మకాన్ని, ఏ తర్కవితర్కాలు చేయని నిష్పాక్షికమైన నమ్మకాన్ని ఉంచుకోగలిగితే... అవును, అదే ఆ నిజమైన నమ్మకమే నిన్ను త్వరిత గతిన నీ కష్టాలన్నింటి నుంచీ, అవి ఎటువంటివైనా, ఏ విధంగా కనపడినా, నిన్ను లక్ష్యం వైపు తీసుకువెళ్ళే ఉత్తమోత్తమ సాధనం.... దానిని నీవు నీలో ధృఢంగా ఉంచుకోగలిగితే, నీ మార్గం ఎంతో అద్భుతంగా సుగమం అవుతుంది.

నీ వైఖరి ఇలా ఉండాలి: నీకు నీవు ఈ విధంగా చెప్పుకోవాలి "దివ్యానుగ్రహం బహుశః మనల నుంచి ప్రగాఢమైన నమ్మకాన్ని కోరుకుంటున్నది", కేవలం దీనితోనే, మరి వేరేదానితో దేనితోనూ పని లేకుండా, నీవు ఎన్నో ఇబ్బందులను, చాలా వాటిని దూరం చేసుకోగలుగుతావు. వాస్తవానికి సాధారణ జీవితంలోనూ ఇది ఎన్నో ఇబ్బందుల నుంచి, ఎన్నో వ్యధల నుంచి దూరం చేస్తుంది.

నీ విశ్వాసం దైవం మీద పూర్తి నమ్మకంతో కూడినది కానట్లయితే, అప్పుడు నీవు ఏమనుకుంటావంటే నీకు దైవం మీద విశ్వాసం ఉందనీ, అయినా నీవు దైవశక్తి మీద లేదా దేవుని దయ మీద నమ్మకం కోల్పోతున్నావనీ లేదా దైవానికి నీ మీద నమ్మకం పోతున్నదనీ అనుకుంటావు....

కనుక, ఎవరికైనా దివ్యానుగ్రహం మీద విశ్వాసం ఉండి దానికి తోడుగా సర్వతో ముఖంగా, సంపూర్ణమైన నమ్మకాన్ని కూడా ఉంచితే తప్ప, కష్టాలనేవి ఉంటూనే ఉంటాయి. కాబట్టి రెండూ అత్యావశ్యకమే....

*

ఇంతకు మునుపు చెప్పుకున్న విశ్వాసం అనేది ఏదైతే ఉందో అది దివ్యానుగ్రహం మీది విశ్వాసం; నీవు చేపట్టినది చిట్టచివరకు సఫలం అవుతుందనే విశ్వాసం.

చాలామంది మొదలుపెట్టి, దాని తరువాత కొంతకాలానికి వచ్చి, "నేను ఎప్పటికీ ముందుకు పోలేను. నాకు చాలా అడ్డంకులున్నాయి" అని అంటారు. దానర్థం వారికి విశ్వాసం లేదని.

విశ్వాసం పదిలపరచుకోవాలంటే "సరే, మంచిది, నాకు అడ్డంకులున్నాయి, అయినా నేను వదిలిపెట్టను, అంటిపెట్టుకునే ఉంటాను" అని అంటుండాలి. ముఖ్యంగా నిరాశా నిస్పృహ నీ కాళ్ళను నరికివేస్తుంది, నిన్ను ఆపేసి "అంతా అయిపోయింది, ఇంక నేను ఏ మాత్రం కదలలేను" అని అనిపింపజేస్తుంది. నిజంగా దానితో కథ కంచికే, వ్యవహారం ముగిసినట్లే. అటువంటి దానిని దగ్గరకు రానీయకూడదు.

*

పరిపూర్ణ ప్రశాంతత, నిశ్చలతతో పాటు దివ్యానుగ్రహమందు మొక్కవోని నమ్మకం, విశ్వాసంతో మాత్రమే నీవు పరిస్థితులను ఎంత సవ్యంగా ఉండాలో అంత సవ్యంగా తీర్చిదిద్దగలుగుతావు. ఎవరైతే వారి నమ్మకాన్నంతటిని దైవం మీద, ఒక్క దైవం మీద మాత్రమే ఉంచుతారో, వారికి ఎల్లప్పుడు చాలా అత్యుత్తమమైన శుభం సంప్రాప్తిస్తుంది.

*

దైవానుగ్రహం ఎల్లప్పుడూ వర్షించడానికి సిద్ధంగా ఉంటుంది. కాని నీవు దానిని తప్పక పని చేయనివ్వాలి. అంతే కాని దాని పనిని అడ్డుకోకూడదు. దానికి ఉన్న ఒకే ఒక్క నిబంధన, విశ్వాసం. నీ మీద దాడి జరిగినదనే అనుభవం కలిగితే సహాయనికై

శ్రీఅరవిందులనూ, నన్ను ప్రార్థించు. నీ పిలుపు చిత్తశుద్ధి కలిగినదైతే (అంటే అర్థం, నీవు నిజాయితీగా స్వస్థత నొందాలని కోరుకుంటే), నీ పిలుపుకు సమాధానం వస్తుంది, దైవానుగ్రహం నీకు స్వస్థత కలిగిస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

కుంగుబాటు నివారణ — 4

ప్రతి విషయంలోను జరగకూడనిదేదో జరుగుతుందనే చెడుతలంపు రాక్షసుడి మారణా యుధం. అది ఎల్లప్పుడూ దుష్టశక్తే. నీవు అటువంటి ప్రతిపాదనకు ఏ కాస్త తలయొగ్గినా కూడా, అది దుష్టశక్తే. అది ఆ దుష్టుడి మహా మారణాయుధం.

*

చెడునే అనవరతం తలచడం అనేది ఒక వ్యక్తి దేని గురించి భయపడుతున్నాడో దానిని తన వైపు ఆకర్షించడమే. దానికి మారుగా వారు చేయవలసినదేమంటే అన్ని రకాల నిరాశాపూరిత తలంపులను అవశ్యం తరిమికొట్టాలి. అంతే కాకుండా, తాను ఏమి జరగాలని కోరుకుంటున్నాడో ఆ ఆశావహ ఆలోచనలనే ఆలోచించడానికి తనను తాను ఒత్తిడి చేసుకోవాలి.

*

ఎప్పుడూ గతించినదానికి వగవద్దు. లేక ఏమవుతుందా అని ఊహించుకోవద్దు.

నీలో జరగకూడనిది జరుగుతుందనే తలంపులను సాధ్యమైనంతవరకు రాకుండా చూసుకో; స్వచ్ఛందంగా ఆశావాదివికా.

*

మన చైతన్యంలో నుంచి ఓటమికి తలయొగ్గటాన్ని తరిమివేస్తే, మనం సాక్షాత్కార దిశగా పెద్ద అడుగు వేసినట్లు.

దివ్యానుగ్రహంలో మన విశ్వాసాన్ని పరిపూర్ణంగా పదిలపరచుకుంటే మన అధోచేతనలోని ఓటమికి తలయొగ్గే తత్వాన్ని జయించగలుగుతాం.

*

జీవితాన్ని అతి గంభీరంగా పరిగణించడంలో రెండు విధాలున్నాయి. మొదటిది ఏ ప్రాముఖ్యమూ లేని విషయాలకు ప్రాముఖ్యాన్నివ్వటం, రెండవది మంచివనేవాటిని కొన్నింటిని నిర్ధారణ చేసి, అవే మన జీవనానికి సార్థకత నివ్వగలవు అని ఆ కొన్ని విశిష్టగుణాలకే జీవితాన్ని కుదించివేయడం. ఉదాహరణకు, శ్రీఅరవిందులు చెప్పిన ట్లుగా 'సంస్కారవంతులు' లేదా నిష్ఠాగరిష్ఠులు అనబడే కొంతమందిలో ఈ వైశిష్ట్యం పొడిబారి పెడసరమై, నిస్సారంగా, సంప్రదాయమే పరమావధిగా, ఎదుటివారి మీద దాడిచేసే వైఖరిగా తయారవుతుంది. ఉల్లాసభరితమై, స్వతంత్రమై, సంతోష దాయకమైన ప్రతిచోటా, ప్రతిదాని లోనూ అది తప్పులు వెతుకుతుంది.

జీవితాన్ని పరిపూర్ణం చేయాలంటే, — నేను మాట్లాడుతున్నది, ఇక్కడే, ఈ భూమి మీదే — జీవితాన్ని ఎంతో ఎత్తు నుంచి అంటే జీవితం మొత్తంగా చూడ గలిగినంత ఎత్తు నుంచి చూడవలసిన అగత్యం ఉంది. దానిని ఇప్పుడున్నటువంటి మొత్తంగానే కాకుండా, భూత, వర్తమాన, భవిష్యత్తుల మొత్తంగా, అనగా, ఇతః పూర్వం అది ఏమిటి, ప్రస్తుతం దాని పరిస్థితి, మున్ముందు ఎలా ఉంటుంది అని గమనిస్తే, అప్పుడా వ్యక్తి సమస్తాన్ని ఒక్కసారిగా అవశ్యం చూడగలుగుతాడు. ఆ విధంగానే ఎందుకూ అంటే, ప్రతిదానిని దాని స్థానంలో ఉంచాలంటే, అదే పద్ధతి. దేనినీ తీసివేయడానికి లేదు, ఏదీ తీసివేయబడలేదు. ప్రతిదీ మిగతా వాటన్నింటితో పూర్తి సామరస్యంతో తన స్థానంలో తప్పక ఉండి తీరవలసిందే.

*

నీవు సంతోషంగా ఉండలేనంత కాలం, అంటే నిరంతరం, నిశ్చలంగా, ప్రశాంతంగా, వెలుగుతో, మార్పులేని సంతోషంతో ఉండలేనంత కాలం, నీవు ఇంకా పరిశుద్ధత నొందవలసి ఉంది, అని అర్థం. అందుకై నీవు అప్పుడప్పుడు కఠిన పరిశ్రమ చేయవలసిన అగత్యం ఉంది. ఏమైనప్పటికీ ఇది నీ పరిస్థితిని సూచిస్తుంది.

సంతోషంగా ఉండటానికి ప్రయత్నించు. తక్షణమే నీవు దివ్యప్రకాశానికి చేరువ అవుతావు.

శ్రీమాత

నీవు వేరే అన్న భావనతోనే బాధ, కష్టం, దైన్యం, అజ్ఞానం, అన్ని అసమర్థతలు పొడసూపుతాయి. అది పూర్తి భగవదర్పణలో సంపూర్ణంగా, స్వయంగా తనను తాను అర్పించుకుని, స్వ స్పృహ లేకుండా ఉన్నప్పుడే కష్టాలు మాయమై, వాటి స్థానంలో సంతోషం నెలకొంటుంది. దానిని ఏదీ మరుగుపరచ లేదు.

కేవలం ఈ సంతోషం ఈ ప్రపంచంలో సుస్థిరమైనప్పుడే అది పూర్తిగా మార్పు చెందుతుంది. దాని ద్వారా ఒక నవ్యజీవితం, ఒక నవీన సృష్టి, ఒక నవ్య సాక్షాత్కారం చోటు చేసుకుంటుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

కుంగుబాటు నివారణ — 5

ప్రశ్న: కుంగుబాటు కమ్ముకున్నప్పుడు ఏం చేయాలి?

దానిని దులిపివేయాలి, నీ కాళ్ళ మీద దుమ్మూధూళిని దులిపినట్లు దులిపివేయాలి.

*

ప్రశ్న: కుంగుబాటుకు లోనుచేసే దాడుల నుంచి ఏ విధంగా తప్పించుకోగలం?

ఆ సమయంలో కుంగుబాటు ఉనికికి ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వకుండా, దానికి ఉదాసీనుడవై, అది లేనట్లుగానే నీ పనులను యథావిధిగా కొనసాగించాలి.

*

మనిషిలోని అహమే కుంగుబాటుకు లోనవుతుంది. దానిని గురించి ఆలోచించవద్దు. ప్రశాంతంగా నీ పనులను చేసుకుంటూ పో, కుంగుబాటు మాయమవుతుంది.

*

ప్రశ్న: ప్రియమైన మాతా, గత రెండు రోజులుగా నేను చాలా నిరాశకు, దుఃఖానికి లోనయాను, ఎంతగా అంటే అవి మరి కొన్ని రోజులు ఇంకా ఉంటే వీటిని వదిలించుకోవటం నాకు చాలా కష్టమౌతుందేమోనని అనిపిస్తున్నది.

బాహ్యప్రపంచంలో ఉన్నట్లుగానే, సూక్ష్మప్రపంచంలోనూ చోరులున్నారు. దానికి, లోకజ్ఞానం కలిగిన వివేకవంతుడు ఎంతో జాగ్రత్తగా తన ఇంటి తలుపులకు గడియలు

వేసినట్లుగా, నీ ఆలోచనలు, అనుభూతులనే తలుపులను ఆ చోరులు ప్రవేశించకుండా అవశ్యం మూసివేయాలి.

ఈ దుఃఖం, నిరాశ, ఆత్మహత్యా సూచనలు వారి నుంచే (ప్రాణికలోకపు చోరులు) వస్తాయి. ఎందువల్లనంటే నీవు కుంగుబాటుకు లోనయినప్పుడే వారు నీ నుంచి తస్కరించగలుగుతారు. నీవు వారి సూచనలను ఏమాత్రం వినకూడదు. ఆ దుష్టసూచనలను నీవు ఆవశ్యం తిరస్కరించాలి. తిరిగి మరల ఆత్మస్థైర్యంతో నీ వ్యక్తిత్వంతో, చెప్పాలంటే నీదైన 'చిరుదరహాసం' తో నిలదొక్కుకోవాలి.

*

ప్రియమైన బిడ్డా, నీ ఇచ్ఛాశక్తులను, వ్యాయామంతో కండరాలను ఏ విధంగా బలిష్టంగా పెంచుకుంటారో, ఆ విధంగా పెంచుకోవాలి. ఓరిమితో ఉండటానికీ, నీ ఇచ్ఛను ఉపయోగించి, అదే విధంగా కుంగుబాటును తోసిపారవేయడానికీ నీ శక్తిని ఉపయోగించాలి. నా ప్రేమ సర్వస్వంతో నీకు సహాయం చేయడానికి నేను ఎల్లప్పుడు నీ దగ్గరగానే ఉన్నాను.

*

నీవు తప్పక చేయవలసిందేమంటే, అసమ్మతిని తెలిపిన మరుక్షణం ప్రాణికానికి రెండు దెబ్బలు తగిలించడమే. అదే భౌతికవిషయమైతే, దాని అసమ్మతికి కొంత కారణం ఉంటుంది కనుక, దాని విషయం పరిగణించి, కావలసిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. కానీ ప్రాణికం విషయంలో మటుకు కేవలం 'తన్నులే' మందు. ప్రాణికం ఏ క్షణాన అసంతృప్తి వెళ్ళగక్కినా దానికి రెండు తగిలించడమే. ఎందువల్లనంటే ప్రకాశాన్ని, సత్యాన్ని అడగటానికి బదులుగా, జీవి కోరుకునే తిండి, బట్ట మొదలైన సుఖభోగాలు, సాంఘికంగా ఆహ్లాదపరచే వస్తువులు, విషయాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వాటికే అంటిపెట్టుకుని ఉండే అల్పచైతన్యం నుంచి బయటపడాలంటే మరొకదారి లేదు.

ప్రాణికం సర్వసాధారణంగా గట్టిగా కోరుకునేవాటిలో మెచ్చుకోలు ఒకటి. అది విమర్శించబడటాన్ని, తనను చాలా అప్రధానమైనదిగా వ్యవహరించడాన్ని ద్వేషిస్తుంది. అందుకనే అది ఎల్లప్పుడూ తిరస్కారాలకు అవశ్యం తయారుగా ఉండాలి, వాటిని పూర్తి ప్రశాంతతతో స్వీకరించాలి. అదే విధంగా స్వయం సంతృప్తికై

చేసే ప్రతి గమనమూ అసత్యశక్తుల పాదపీఠానికి అర్పణ అనే విషయం మర్చిపోకుండా మెచ్చుకోలుకు ఏమాత్రం ప్రాధాన్యత నివ్వకూడదు.

*

అసంబద్ధమైన భావాలలో తగుల్కొనవద్దు. 'మతిభ్రమణం', 'నరకం', 'చీకటికూపం' అనేవన్నీ నీ ఊహల లోనివి మాత్రమే.

వాటి నన్నింటిని నా ప్రేమ, ఆశీస్సులతో మార్చడం నీకు చాలా శుభాన్ని కలుగజేస్తుంది.

*

వాస్తవంలో, కుంగుబాటు అనారోగ్యా లన్నింటిలోకి తీవ్రమైనది. మనం రోగాన్ని ఎంత శక్తిని ఉపయోగించి వదిలించుకుంటామో అంత శక్తితో దానిని అవశ్యం తోసి పారవేయాలి.

*

ప్రశ్న: మాతా, నా హృదయం పొడిబారి, దుఃఖంతో, అంధకారబంధురంగా తయారయింది.

నీవు అందమైనది, ఉత్సుకతను కలిగించేదానిని ఏదైనా చదవగూడదా. అది నిన్ను నీవే చూసుకోవటం నుంచి దూరంగా తీసుకువెళ్తుంది కదా? అదే శ్రేష్ఠమైన నివారణోపాయం.

*

ప్రియమైన బిడ్డా, నీవు ఎక్కువ మారులు దుఃఖంతో, కుంగుబాటుకు లోనవుతున్నా వనిపిస్తున్నది. ఎందువల్లనంటే నీ నరాలు బలిష్టంగా లేవు. నీవు ఎక్కువ తిని, ఎక్కువ సమయం నిదురించాలి. ఆరుబయలు వాతావరణంలో ఏదో కొంత వ్యాయామం మొదలైనవి చేయాలి.

*

కారుమబ్బులు కమ్మి మసకబారిన వేళలో ప్రశాంతచిత్తంతో ఉండగలగాలంటే, దైవం మీద ఆయన అందించే సహాయానికంతకూ కృతజ్ఞతను నీ హృదయమంతా నింపుకోవాలి. కృతజ్ఞత కూడా మరుగున పడిపోతే, ఇటువంటి అస్పష్టతతో నిండిన సమయం ఉండే వ్యవధి ఎక్కువగా ఉంటుంది. అయినా దీనిని వేగంగా, సమర్థవంతంగా ఎదుర్కొనే మందుంది; దానికి నీ హృదయంలో పరిశుద్ధతాగ్ని సర్వదా

జ్వలిస్తుండాలి. పురోభివృద్ధికై ఆకాంక్షతో, తీవ్రమైన గాఢభావావేశంతో కూడిన సమర్పణ ఉండాలి. చిత్తశుద్ధి ఉండేవారందరిలో ఈ అగ్నిజ్వాల రగిలింపబడుతుంది. అది కృతఘ్నతాపరమైన బూడితతో కప్పివేయబడకుండా నీవు అవశ్యం జాగ్రత్తపడాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

సరియైన దృక్పథం

సరియైన దృక్పథం అంటే నమ్మకం ఉంచటం; ప్రశాంతంగా ఉండటం. ఎదురుదాడి దాటేవరకూ ఓపికతో, సంయమనంతో ఉండటం. విశ్వాసము కలిగి వుండటం. ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోగూడదు. నమ్మకాన్నీ కోల్పోగూడదు. అసహనం పనికి రాదు. నిరాశపడకుండా ప్రశాంతంగా ఉండాలి. ఆకాంక్షను వీలయినంత అధికంచేసుకోవాలి. జరుగుతున్నదాన్ని పట్టించుకోగూడదు. 'అంతా చివరకు మంచే జరుగుతుంది' అనే దృఢనమ్మకాన్ని కలిగి ఉండటమే ఉత్తమ మార్గం.

*

మొట్టమొదటగా చైతన్యం కలిగి ఉండాలి. తరువాత మనసు అదుపులో వుండాలి. వీటిపై యాజమాన్యాన్ని సంపాదిస్తే మనస్తత్వం కూడా మారుతుంది. అయితే ఇది చివరలోనే లభిస్తుంది. చెడ్డ అలవాట్లను, పాత అలవాట్లను అదుపులో ఉంచుకోవాలి. వీటిని చాలా కాలము నియంత్రణలో ఉంచితే, వాటంతటవే పరిహరింపబడి ప్రవర్తన మారటం జరుగుతుంది.

ఉదాహరణకు తరచు నిరాశకు లోనయ్యే ఒక వ్యక్తి విషయం చూద్దాం. తాను అనుకున్నట్లు జరగకపోతే అతడు నిరాశపడతాడు. ఇలాంటివాడు తన నిరాశను తాను మొదటగా గ్రహించాలి. తరువాత దాని కారణాలను అన్వేషించాలి. తనకు ఎందుకు ఊరకనే నిరాశ కలుగుతున్నదో గమనించాలి. విషయం అవగాహనకు రాగానే నిరాశను అదుపులో వుంచుకోవడానికి ప్రయత్నం ప్రారంభించాలి. దానికి తగిన కారణం వున్నప్పటికి ఆ నిరాశను లేకుండా చేయటానికి ప్రయత్నించాలి. అంటే తన మీద తాను అదుపును సాధించాలి. అపుడు కారణం వున్నా, తాను

నిరాశ పొందదు. ఇలా చాలా కాలం చేస్తూ వుంటే నిరాశపడటం అనే అలవాటు తన ప్రవృత్తి నుండి అంతర్థానం అవుతుంది. ప్రవృత్తి మారితే నిరాశపడటం వంటి ప్రతిస్పందనలు వుండనే వుండవు.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

కుంగుబాటు — ఉత్సుకత

ఈ కుంగుబాటు, ఉత్సాహము రెండూ రెండు విపరీత స్థితులే. దేని ఇబ్బందులు దానికున్నాయి.

దృఢసంకల్పం[1] లేకపోతే కుంగువాడు వల్ల "దీని వల్ల ప్రయోజన మేమీ లేదు. జీవితమంతా వేచి యుండాలి" అనిపిస్తుంది. ఇక ఉత్సుకత విషయానికొస్తే ప్రాణిక మంతా రాత్రికి రాత్రే పరివర్తన చెందాలని ఆశిస్తుంది. "ఇక నుంచి నాకే అడ్డంకీ లేదు, యోగమార్గంలో చాలా తొందరగా ముందుకు పోతాను, ఏ విధమైన కష్టమూ లేకుండా దైవచైతన్యాన్ని పొందుతాను" అనుకుంటుంది. ఇంకొక విధమైన ఇబ్బందు లుంటాయి. వాటికింకా కొంత సమయం కావలసి వస్తుంది. ఇంకా పట్టుదల కావాలి. అందువల్ల ప్రాణికం కొన్ని గంటలో, రోజులో లేక కొన్ని నెలలో గడిచిన తర్వాత తనలో తాను అనుకుంటుంది. "ఉత్సుకత వల్ల ఏమీ ముందుకు సాగలేదు, నిజానికి ఏమైనా సాధించామా? ఈ పద్ధతివల్ల ఎక్కడి వాళ్ళ మక్కడే ఉన్నాము కదా! నిజా నికి పూర్వం కంటే అధోగతిగా వున్నాము. ఇంకా బాధ, కలతలు వచ్చాయి కదా! ఏవీ గతంలో ఉన్నట్లు లేవు. ఇంకా ఉండవలసిన తీరులో లేవు. నేను చేస్తున్నదేదో చాలా అలసట గొలుపుతున్నది." ఇంకా దీన్ని కొనసాగిస్తే ఒక పెద్దమనిషి ఇలా అనుకుంటాడు, "ఇంక చాలు, నన్ను వదిలిపెట్టేసేయి. నా కింక ముందు కెళ్ళాలని లేదు. నేనుండే చోట నేనుంటాను, నేనింకేమీ ఇబ్బంది పెట్టను, కాని నన్ను చికాకు పెట్టకు!" ఈ విధంగా ఎక్కువ పురోగతి లేకుండా ఉండిపోతారు.

---

1 ప్రాణికసత్తను మార్చుకోవాలనుకున్నప్పుడు

జాగ్రత్తగా తప్పించుకోవలసిన పెద్ద ఆటంకాలలో ఇది ఒకటి. ఈ విధమైన అసంతృప్తి, విసుగు కలుగుతున్నట్లుగా ఏ చిన్న సూచన కనిపించినా ప్రాణికానికి నచ్చచెప్పాలి: "మిత్రమా, నీవు చాలా ప్రశాంతంగా ఉండబోతున్నావు. నీకు చెప్పినది నీవు చేయబోతున్నావు. అలా కాని పక్షంలో నాతో పోరాటమే జరపాలి." "అంతా ఇప్పుడే, ఈ క్షణమే జరగాలి" అనే ఉత్సుకత కలిగినవారితో నీవు "కొంచెం ప్రశాంతత వహించు, నీ శక్తి అమోఘమే, కానీ దాన్ని ఇలా అయిదు నిమిషాల్లో ఖర్చు చేయకూడదు. మనకది చాలా కాలం రావాలి. దాన్ని జాగ్రత్తగా దాచు, అవసరమైనప్పుడు నీ సహకారాన్ని నేను కోరతాను. అప్పుడు నీ సద్భావాన్ని ప్రదర్శించు; నీవు తప్పక ఒప్పుకుంటావు, ఏ మాత్రం సణుగుకోవు, కాదని ఎదురు చెప్పవు, ఎదురు తిరగవు, కేవలం 'సరే' 'సరే' అంటూ అడిగినప్పుడు కాస్త త్యాగం చేస్తావు, మనస్ఫూర్తిగానే ఒప్పుకుంటావు" అనాలి.

*

నీ బాధలు, మనస్సులో కుంగుబాటు, నిరుత్సాహము, విసుగు, క్రోధము మొదలైనవన్నీ కూడా ప్రాణిక విభాగం నుంచే వస్తాయి. ప్రేమను ద్వేషంగా మార్చేదీ, పగ, ప్రతీకారం, వైరము, చెడుతలంపులు, పాడుచేయాలనీ, హానిచేయాలనే ప్రేరేపణలు కలిగించేది కూడా ప్రాణికమే. ఏదైనా దాని కిష్టం లేనిదీ, కష్టం కలిగించేదీ ఉన్నప్పుడు, అదే నిన్ను నిరుత్సాహపరుస్తుంది. భీష్మించుకోవటంలో దానికి అసాధారణ సామర్థ్యం ఉంది. దానికి తృప్తి కలగనప్పుడు, అది ఓ మూల నక్కుతుంది. ఏ మాత్రం కదలదు. ఇక అప్పుడు నీకు ఏ మాత్రం ఓపిక కానీ, శక్తి గానీ ఉండదు; నీ ధైర్యం సడలిపోతుంది. నీ సంకల్పం వాడిన తోటకూర మాదిరిగా అయి సడలిపోతుంది. రోషావేశాలు, విసుగు, క్రోధము, నిస్పృహ, దుఃఖము, రోషము మొదలైనవి కల్పించేది ఆ ప్రాణిక మనిషే. ఎందువల్లనంటే అది చర్యాత్మక శక్తి.

అందువల్ల అది ఎటువైపు మొగ్గుతుందో అనేదాన్ని బట్టే అంతా ఉంటుంది. ఇంకా చెపుతున్నాను, దానికి సమ్మె చేసే అలవాటుంది. అదే దాని గొప్ప ఆయుధము: "ఆ! నేను చెప్పింది నీవు చేయటం లేదు కదా! అయితే నేను కదలను, చస్తాను" అంటుంది. ఒక చిన్న విషయానికి కూడా అది అలా చేస్తుంది. దాని బుద్ధి చాలా చెడ్డది. అది ముక్కోపి. తాను చాలా శక్తివంతమైన దానిననే విషయం దానికి తెలుసనే నా నమ్మకము. తాను పూర్తిగా విజృంభిస్తే దాని వేగాన్ని ఏదీ తట్టుకోలేదని

అది స్పష్టంగా అనుకుంటుంది. తమ వైపు మొగ్గు ఉన్నదనుకునే వారందిరి మాదిరిగానే ఈ ప్రాణికం కూడా బేరాలు సాగిస్తుంది: "నేను నా శక్తి నీకిస్తాను, నీవు నేను చెప్పి నట్లే చేయాలి. నే నడిగింది గనక ఈయకపోతే నా శక్తి తీసేసుకుంటాను." అంతే, నీవు చతికిలపడిపోతావు. ఇది నిజము.

దాన్ని కట్టడి చేయటం కష్టమే. అయినప్పటికీ నీవు గనుక దాన్ని లొంగదీసుకోగలి గితే సిద్ధి పొందేందుకు నీకు మంచి శక్తివంతమైన సాధనం దొరికినట్లే. పెద్ద పెద్ద అడ్డంకులను అది ఎగరగొట్టి పారేయగలదు. ఒక మూర్ఖుణ్ణి కూడా మేధావిగా మార్చగల సామర్థ్యం ఒక్కదానికే ఉంది. ఎవరైనా గట్టిగా పురోగమించాలని పరితాపం చెందిన ప్పుడు, అది ప్రాణికం గ్రహించి పూనుకుంటే మూర్ఖాగ్రేసరుడు కూడా మహాబుద్ధిశాలి అవుతాడు! అది ఎవరో చెప్పిన మాట కాదు, నేను ప్రత్యక్షంగా చూశాను. మందంగా, జడుడిగా ఏం చెప్పినా అర్థం చేసుకోలేనివారు, వారికి మీరు నెలల తరబడి వివరించి చెపుతున్నా గోడతో చెప్పినట్లు గ్రహించలేనివారిని నేను చూశాను. ఉన్నట్లుండి వారి ప్రాణికం ఒక ఆర్ద్రతకు లోనుగావటం, వారెవరినో మెప్పించాలనుకోవటం గానీ, వారికేదో కావలసివచ్చి గానీ, అర్థం చేసుకోవలసిన అవసరం ఏర్పడగానే వారి ప్రాణికంలో చలనం కలిగి ఒక్కసారిగా మత్తు వదిలించుకొని, వారి శక్తిని మూలమూలలా నింపటం మొదలుపెట్టగానే వారికంతా బోధపడింది. తెలివి వచ్చింది.

అందువల్ల దాని విషయమై శ్రద్ధ వహించండి. దాన్ని మంచి ఆదరణతో చూసుకోండి గానీ, దానికి లోబడవద్దు. ఎందుకంటే అది మిమ్మల్ని చాలా రకాల ఇబ్బందికరమైన ప్రయోగాలకు గురిచేస్తుంది. అలా కాక, దాన్ని ఏదో రకంగా ఒప్పించగలిగితే, ఎంతో పెద్ద పెద్ద అంగలతో పురోగమించగలదు.

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వేంకటరామ శాస్త్రి

జీవితంలో వైఫల్యాలు, పరాజయాలు

ప్రశ్న: కొంతమంది వ్యక్తులకు వారికి జరిగే సంఘటనలు వారు ఆశించినదానికి, కోరుకున్నదానికి, మంచిదని భావించినదానికి ఎప్పుడూ విరుద్ధంగా ఉంటాయి. తరచు వారు నిరాశకు లోనౌతారు. ఇది వారి అభివృద్ధికి అవసరమా?

నైరాశ్యత అభివృద్ధికి ఎప్పుడూ అవసరం కాదు. ఇది ఎల్లప్పుడూ బలహీనతకు, తమస్సుకు గుర్తు. తరచుగా ఇది ప్రతిరోధశక్తి ఉనికిని సూచిస్తుంది. అంటే ఉద్దేశ పూర్వకంగా సాధనకు అవరోధం కల్పించే శక్తి.

కావున జీవితంలో అన్ని పరిస్థితులలోను నిరాశ చెందకుండా ఉండుటకు జాగ్రత్త వహించాలి. దానితోపాటు మందకొడిగా, విచారంగా, నిరాశగా ఉండే అలవాటు, సంఘటనలపై ఆధారపడి ఉండదు. ఆత్మవిశ్వాసం కొరవడి నందువల్ల సంభవిస్తుంది. తమ మీద తమకు విశ్వాసం కలవారు నిరాశ లేకుండా, అధైర్యపడకుండా అన్ని పరిస్థితులను, అత్యంత క్లిష్టపరిస్థితులను కూడా ఎదుర్కొనగలరు. అటువంటి వ్యక్తి ధీరోదాత్తుడిగా చివరి వరకు పోరాడుతూనే ఉంటాడు. తమ స్వభావం మీద తమకు నమ్మకం కొరవడినవారికి ఓర్పు, సహనశక్తి, ధైర్యసాహసాలు కూడ లోపిస్తాయి.

అభివృద్ధి చెందుటకు అవసరమైనది ఏది అని ప్రశ్నించుకుంటే — పరిణామం చెందుతున్న ప్రపంచంలో ప్రతి ఒకటి అభివృద్ధికి దోహదపడేలా ఉంటుంది. కాని వ్యక్తిగతమైన అభివృద్ధి ఎన్నో పూర్వజన్మలకు, అసంఖ్యాకమైన అనుభవాలకు చెందినదై వుంటుంది. దీనిని ఒక్క జన్మలో నున్న చావుపుట్టుకల మధ్య నున్న జీవితంతో తీర్మానించలేము. మొత్తం మీద జయాపజయాలతో గూడిన జీవితానుభవం, అంత రాత్మ పురోగతికి ఎంతగా ఉపయోగపడుతుందంటే, గెలుపు, విజయములతో గూడిన జీవితానుభవమంతగా ఉపయోగపడుతుంది. అంతకు మించి జయాపజయాలు, ఆశానిరాశలు, సుఖదుఃఖాలు సమ్మిళితమై ఒకదాని వెంట మరొకటి సంభవిస్తుండే గుర్తింపులేని జీవితానుభవం కన్న ఎక్కువగా ఉపయోగపడతాయనుట నిస్సందేహము. ఇలాంటి జీవితం 'సహజమైనది' గా సాగుతుంది — పెద్ద ప్రయత్నం లేకుండా.

మూలం: శ్రీమాత

అనువాదం: సిద్దులగారి త్రివేణి

మా హృదయం ముక్కలౌతున్నట్లనిపించే ప్రతీసారి ఒక లోతైన మార్గద్వారం మాలో తెరుచుకుంటుంది

ఎప్పుడైనా ఒక గాఢమైన దుఃఖం, కాల్చివేసే సంశయం, భరించలేని బాధ నిన్ను ముంచెత్తివేసే తీవ్ర నిరాశకు గురిచేస్తుంటే, అక్కడే ఎక్కడో నీవు పోగొట్టుకున్న, నిశ్చలతను, శాంతిని తిరిగి చేజిక్కించుకొనే పదిలమైన దారి వుండి ఉంటుంది.

మన అంతరంగపు లోతుల్లో ఒక జ్యోతి ప్రకాశిస్తుంది. తన ఉజ్వలతను, శుద్ధ తను బట్టి మాత్రమే సరితూచ బడుతుంది. ఈ భౌతిక ప్రకృతిని జీవింపజేస్తూ, పరి పోషిస్తూ ప్రకాశిపంజేస్తూ ఉన్న విశ్వాత్మలోని సచేతనమైన, సజీవమైన అంశ ప్రకాశం అతడు. అతడి ఆజ్ఞనే శిరసా వహించాలనుకునేవారికి అతడొక అమోఘమైన, సశక్తమైన మార్గదర్శి. అతడిని చూద్దామనుకుని, అతని స్వరం విందామనుకునేవారికి, అతడికే విధేయులమై వుందామనుకునేవారి వైపుకు తిరిగి, తన ప్రేమసహనాలతో వారిపై ఓదార్పును నింపుకొని వున్న సహాయకుడతను. అతడి పట్ల నిజాయితి, నిరంతర ఆకాంక్ష ఏదైనా వృధా కాదు: దృఢమైన, ఆదరపూర్వకమైన విశ్వాసం నిష్ప్రయో జనం కాదు; అతడికై నిరీక్షణ ఎప్పటికీ నిరాశాజనకం కాదు.

నా హృదయం ఎంతో వ్యధ చెందింది. వేదన పడింది. దుఃఖం అడుగున పడి ముక్కలైనంత పని అయ్యింది. బలీయమైన బాధ క్రింద నలిగి కుంచించుకుపోయింది. అయినా నిన్ను పిలిచాను. ఓ దివ్య స్వాంతన ప్రదాతా! నిన్నే నే పరితపిస్తూ ప్రార్థించా... మిరుమిట్లుగొలిపే నీ జ్యోతిర్మయ ప్రభ నా ఎదుట ప్రత్యక్షమై మళ్ళీ నన్ను బ్రతికించింది.

ఈ వేదన అనివార్యం కాదు, కోరుకోదగింది కాదు. అది మాలో ఏర్పడినప్పుడు, అది ఎంత సహాయకారి కాగలదు!

మా హృదయం ముక్కలౌతున్నట్లనిపించే ప్రతీసారి ఒక లోతైన మార్గద్వారం మాలో తెరుచుకుంటుంది. క్రొంగొత్త క్షితిజావరణలు, సుసంపన్నమైన రహస్యనిధులు బయటపడుతున్నట్లు, విధ్వంసపుటంచుల్లో ఉన్న ఈ అంతర్జీవునికి సశక్తమైన, నూత్న జీవితాన్ని మరొక్కసారి అందించే బంగారు ప్రవేశ ద్వారం తెరుచుకుంటున్నట్లు మాకు అనిపిస్తుంది.

ఎప్పుడైతే ఒకదాని వెంట ఒకటిగా అంతరానుభవ అవరోహణలతో నిన్ను అభివ్యక్తం చేసే తెరను చేరుతామో, అది వైదొలగుతుందో, ఓ పరమేశ్వరా! ఈ మొత్తం వ్యక్తిత్వపు అణువణువు లోనికి చొచ్చుకునిపోతున్న సంప్రాణ వేగతీవ్రతను, సదా రూపాంతరీకరిస్తూపోతుంటే, నీ ప్రేమ లోని ఉదాత్తతను, ఎవరు వర్ణించగలరు!

మూలం: శ్రీమాత

అనువాదం: హర్షవర్ధన్

దిక్కుతోచని శిష్యుని ఉద్దేశించి

ప్రశ్న: నేను ఎటు వెళుతున్నాను, ఏమి చేస్తున్నానో నాకు అర్థం కావటం లేదు. అంతా తికమకగా ఉంది. నాకు దారి చూపించండి.

నీ ప్రశ్నల వుద్దేశం నాకు బోధపడటం లేదు. ఇటువంటి అర్థంకాని తికమక పెట్టే నిరుత్సాహం, అర్థంలేని ప్రశ్నలు ఆశ్రమంలో చాలామందిపై ప్రభావం చూపించాయి. ఇదే విధంగా. ఇంతకు మించి నీ భావాలకు మరే ఆధారం వుండే అవకాశం లేదు.

నీవు ఎక్కడ వున్నావని? శ్రీమాత సమక్షంలో, నా సామీప్యంలో వున్నావు. నీవు ఏ దిశగా వెళుతున్నావు? సేవ, సమర్పణల ద్వారా దైవాన్ని చేరుకోవాలని.

నీవు ఏమి చేస్తున్నావు? సేవ; దైవానికి సమర్పించుకోవటం. శ్రీమాత సెలవిచ్చినట్లుగా, మిగిలినదంతా నీ సేవ, నీ సమర్పణల నిరాడంబరత, పరిపూర్ణత్వాల మీద ఆధారపడి యుంటుంది.

నిన్ను ఆందోళనపరిచే, ఆలోచనలలో ఇంకేమయిన ప్రత్యేకంగా వుంటే అది తేటతెల్లం చేయటం మంచిది. ఆశ్రమంలో కొంతమంది అనుకుంటున్న మాటలను, సూచనలను నువ్వు పట్టించుకోవద్దు. ఈ విషయం నేను ఇప్పటికే చెప్పాను. ఎందుకంటే, అవి అసంతృప్తిని, నిరాశను కలిగించే విషపదార్థాల వంటివి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. ఆర్. ఎల్. నరసింహారావు

కుంగుబాటుకు కుంగిపోగూడదు

పరిస్థితులు అనుకూలించనపుడు కుంగిపోవడం సమస్య పరిష్కారానికున్న అతి చెడ్డమార్గం. ఏదో కోరిక లేక కాంక్ష తెలిసో తెలియకనో నీలో వుండి వుంటుంది. దానికి తృప్తి కలుగనందువల్ల ఉద్రేకంతో తిరుగుబాటు చేసింది. మంచిమార్గం ఏమిటంటే దాన్ని తెలుసుకొని, ప్రశాంతంగా, స్థిరంగా దాన్నెదుర్కొని బయటకు నెట్టివేయడం.

కోరిక, కాంక్ష అన్నీ పరమ సత్యానికి విరుద్ధమని, ఇంకెంత మాత్రం వాటిని గురించి తలచగూడదని, నిమ్నప్రాణికం శాశ్వతంగా తన మనస్సులో నిశ్చయించుకొంటే, అవి తిరిగి రాలేనంతగా త్వరలోనే నిర్వీర్యమైపోతాయి.

*

ఒక ప్రత్యేక ఫలితం కోసం గతంలో చేసిన కృషిలోని అధిక ఆరాటం, అధిక శ్రమ లాంటి ఏదో లోపం కుంగుబాటుకు, ప్రాణిక సంఘర్షణకు కారణం. ఇందు మూలంగా చేతనలో పతనం జరిగినపుడు, క్షోభ, నిరాశ, కలవరానికి లోనైన ప్రాణికం పైకి వచ్చి, సంశయం, నిస్పృహ, తమస్సులకు సంబంధించిన సూచనలను విశ్వప్రకృతి యొక్క విరుద్ధ పార్శ్వం నుండి లోనికి నిండుగా ప్రవేశించనిస్తుంది. మానసిక చేతనలో కంటె ఏ విధంగానూ తక్కువ గాకుండా, ప్రాణికంలోనూ, భౌతికంలోనూ, ప్రశాంతత, సమత గల ఒక సుస్థిర పునాది వైపుకు కదలాలి. పరాశక్తి, బ్రహ్మానందాలు పూర్ణంగా క్రిందికి జలపాతంలా రావాలి. కాని దాన్ని నిలుపుకోగల ఒక సుస్థిర ఆధారమైన సంపూర్ణ సమత మాత్రమే, ఆ సామర్థ్యాన్ని సుస్థిరతను ఇవ్వగలుగుతుంది.

*

కుంగుబాటుకు నీవు కుంగిపోకూడదు అనేది యోగంలో ఒక నియమం. దాన్నుండి నీవు వెనక్కు తగ్గి నిలబడి దాని కారణాన్ని పరిశీలించి, దాన్ని తొలగించాలి. ఎందుకనంటే, బహుశా, ఒక అపసవ్య కదలికకు లోబడడం, లేదా జుగుప్స కలిగించే నీచ కోరికను, కొన్ని సందర్భాల్లో సంతృప్తిపరుస్తూ, మరి కొన్ని సందర్భాల్లో నిరాశపరుస్తూండడం చేత ప్రాణికసంబంధమైన దోషం, ఒక కారణంగా వ్యక్తిలో ఎక్కడో సదా వుంటుంది. యోగంలో నిరాశపడ్డ కోరిక కంటె ఒక సంతృప్తిచెందిన కోరిక,

ప్రాముఖ్యత నీయబడ్డ, ఒక అపసవ్య కదలిక, చాలా తరచుగా అకస్మాత్ చెడు పరివర్తనను కలుగచేస్తాయి.

వీటి యొక్క తాకిడులకు అందుబాటులో వున్న బాహ్యప్రాణికంలో, మానసిక భాగంలో తక్కువగానూ, నీ అంతరంగ లోతుల్లో అధికంగానూ జీవించడం నీకు చాలా అవసరం. అంతరాంతరాల్లోని చైత్యపురుషుడుని ఇవి కుంగదీయలేవు. అది దైవానికి తనదైన సామీప్యతలో వుండి, యదార్థ పరమ పురుషునికి ఉపరితలపు అల్ప కదలికలను విదేశీయమైన ఉపరితల విషయాలుగా పరిగణిస్తుంది.

*

అధైర్యపడటానికి బాహ్యకారణాలు మనస్సుచే కల్పించబడినవే. వాటికి బదులు పలికేదీ, పలుకనిదీ మనస్సే. మనస్సు (సాధారణంగా ప్రాణిక మనస్సు) వాటిని తానే తన ముందు, ఒకానొక విధంగా పరచిపెట్టుకొని, వాటికి స్వకీయ పద్ధతిలో స్పందించితే తప్ప, దానిని బాహ్యవిషయమేదీ ప్రభావితం చేయలేదు.

*

మనస్సు గనుక (మానసిక మనస్సు, ప్రాణిక మనస్సు, భౌతిక మనస్సు, ఉపచేతన మనస్సు) బాహ్యవిషయాలకు స్పందించకపోతే, కుంగుబాటు కలుగదు. ఒక ఆత్మ గాని, ఒక శిలగాని, ఎన్నడూ కుంగుబాటుకు లోను కావు. వాటి లాగే యధార్థ మనస్సు, యధార్థ ప్రాణికం, యధార్థ భౌతిక చేతన ఎన్నడూ కుంగిపోవు. ఎందుకనంటే కుంగుబాటుకు కారణమైన విషయాలకవి స్పందించవు.

*

స్వీయ పరిశుద్ధత, పరివర్తనకు సంబంధించిన కృషిలో తడబాట్లు, వైఫల్యాలు వగైరా లేకుండా వుండడం అసాధ్యం. కాని వాటి వల్ల స్థైర్యం కోల్పోవడం, పరితపించడం అనేవి సహాయపడవు సరి గదా, అపకారం చేస్తాయి. అవి తేలికగా కుంగిపోయేట్లు చేస్తాయి. కుంగుబాటు, మనస్సుపై మబ్బులు కమ్ముకొనేటట్లు చేస్తుంది, మనస్సును బలహీనపరుస్తుంది. అపసవ్య కదలికను, దాని స్వభావాన్ని ప్రశాంతంగా గమనించి (ఇచట తప్పు చేసింది నాలుక, తేలికగా పొరపాటు చేసేది ఎప్పుడూ నాలుకే) దానిని అంతరంగికంగానే సరిదిద్దుకోవడం ఎప్పుడు కూడా ఉత్తమమైన పద్ధతి. ప్రశాంతత, ఆత్మకు సంబంధించిన యధార్థ ఆధ్యాత్మిక ప్రశాంతత ఉన్నప్పుడు

దాన్ని పదిలంగా ఎల్లప్పుడూ నిలుపుకోగలగాలి. దానితో ప్రతిదాన్నీ నిర్ణీత సమయంలో అతి తక్కువ కష్టంతో చేయగలుగుతాం.

*

పూర్తి వెలుగు, యదార్థ క్రియాశక్తి తనలో చోటుచేసుకోనంత వరకు గందరగోళాన్ని లేదా అజ్ఞానాన్ని తనలో ఎక్కడో ఒక చోట అనుభూతి చెందకుండా ఎవరున్నారు? ఎప్పుడూ ఆ అయోమయ స్థితిని గురించి ఆలోచిస్తూ ఉండడం, దానితో బాధ పడ్తూండడం, దానితోనే జీవితాన్ని గడుపుతూండడం, దాన్ని గురించి ఆలోచిస్తూ గోరంతలను కొండంతగా చేయడం, అదొక్కటే వాస్తవం, యదార్థం అన్నట్లు దాన్ని పరిగణించడం నీవు చేస్తున్న పొరపాటు. క్రియాశక్తిని అనుభూతి చెందినపుడు, దాని వైపు తిరిగి దాన్ని పనిచేయ నివ్వు — సందిగ్ధస్థితిని, అంధకారాన్ని తొలగించి వేసేది ఆ దివ్య క్రియాశక్తే. నీవు గాని, నీవు దాన్ని గురించి చేసే ఆలోచన, నీవు పడే ఘర్షణగాని కాదు. నీ విశ్వాసం, నమ్మకం 'యదార్థ' మైనదో, కాదో పరీక్షించి నందువల్ల ప్రయోజనం ఏముంటుంది? క్రియాశక్తిని అనుభూతి చెందాలంటే కావలసింది ప్రశాంతంగా వుండడం, దాన్ని పనిచేయ నివ్వడం.

*

చుట్టూ కుంగదీసే, నిరుత్సాహపరచే శక్తులు ఎప్పుడూ ఉన్నట్లయితే, మనకు పైన, మన చుట్టూ మనం అందిపుచ్చుకోగల శక్తులూ ఎప్పుడూ ఉన్నాయి — మనలను యథాస్థితికి తెచ్చి, స్థిరపరచి, విజయం సాధించటానికి బలం, విశ్వాసం ఉత్సాహం తిరిగి మనలో పాదుకొలిపి, వాటిని మనలోనికి ఆకర్షించే శక్తులు, సహాయం చేసే ఈ శక్తులకు, నిష్క్రియంగా లేదా సక్రియంగా — ఏదైనా చేయగలం — వాటిని పొందుతూ వాటికై తెరచుకొని వుండడం అనేది నిజానికి ఒక అలవాటు అవ్వాలి. మన పైనా, మన చుట్టూ, అవి వున్నాయనే అవబోధన, వాటిని స్వీకరించ వచ్చును అనే విశ్వాసం, సంకల్పం వుంటే వాటిని స్వీకరించడం మరింత తేలిక. ఎందుకనంటే వాటిని గురించిన అనుభవాన్ని, ఘనిష్ట అంతరార్థాన్ని, అవసరం కలిగినప్పుడు, లేదా ఇచ్ఛాపూర్వకంగా వాటిని స్వీకరించగల సామర్థ్యాన్ని, ఆ అవబోధన కలిగిస్తుంది. సహాయం చేసే ఈ శక్తులతో సంపర్కం లోనికి రావడం, సంపర్కంలో వుండడం అనే దాన్ని నీ చేతనకు అలవాటుచేయడమే అసలు సమస్య. దాని కోసం ఇతరుల్వల్ల నీ పై పడే ప్రభావాలను, కుంగుబాటును, ఆత్మన్యూనతను,

వ్యాకులతకు లోను గావడం వంటి ఇతర చీకాకులను తిరస్కరించడానికి నీకుగా నీవు అలవాటుపడాలి.

*

నిన్ను భయపెట్టేందుకు వచ్చే యివి, సాధనలో ముందుకు నెట్టుకుపోకుండా అడ్డుకొనే అల్ప ప్రాణికశక్తులు నీ పైకి రువ్విన ప్రభావాలే తప్ప మరేం కాదు. అవి నిజంగా నిన్నేం చేయలేవు, నీవు చేయవలసిందల్లా సమస్త భయాన్ని తిరస్కరించడం మాత్రమే. అవి వచ్చినప్పుడు, "దివ్యజనని రక్షణ నాకున్నది, నాకు ఏ విధమైన చెడూ జరుగదు" అని ఎప్పుడూ అనుకో. ఎందుకనంటే చైత్యసంబంధమైన ఉన్మీలనం, దివ్యజననిపై విశ్వాసం చాలు, వాటిని దూరంగా ఉంచడానికి. భయపెట్టే కలలు వచ్చినప్పుడు ఆ కలలోనే దివ్యజననిని పిలువడం చాలా మంది సాధకులు నేర్చుకొన్నారు. అప్పుడు వారిని భయపెట్టింది, నిర్వీర్యమవుతుంది, లేదా అంతర్థానమౌతుంది. అందుచేత వీటివల్ల భయపడగూడదు. వీటి ప్రభావాన్ని ఏహ్యాభావంతో తిరస్కరించాలి. భయపెట్టేదేదైనా వుంటే దివ్యజనని రక్షణకై అర్థించు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

సాధనలో విషాద 'యోగం'

అన్ని యోగసాధనా మార్గాలలో – ప్రాచ్యమైనా, పాశ్చాత్యమైనా – తమస్సు, నైరాశ్యం, కృంగుబాటు వంటి ఉద్రేక క్షణాలు నియమంగా కనిపించడం పరిపాటి. అవన్నీ నాకు తెలుసు. అవన్నీ అనవసరమైన సంప్రదాయరీతులు. ఎవరైనా కోరుకుంటే వాటిని విడిచిపెట్టవచ్చు. నా అనుభవం నాకు చెప్పిన పాఠం ఇది. మీలో కానీ, ఇతులలో కాని అవి సంఘటిల్లినప్పుడు నేను వారిలో విశ్వాసదీప్తి వెలిగిస్తాను. అవి ఇంకా వస్తుంటే, సాధ్యమైనంత త్వరలో వాటిని వదలి వెలుగులోకి రావాలి..

*

నిరాశా నిస్పృహల భారం భరించలేనిది. ఎవరికైనా అవి తప్పవు. అవి పదే పదే సంభవించడం సాధనా మార్గంలో అడ్డంకులుగా నిలుస్తాయి. 'నిరాశకు చోటునివ్వని

హృదయంతో యోగసాధన చేయాలి' అని గీత ప్రబోధిస్తుంది, (అనిర్విణ్ణ చేతసా). బాధ, దుఃఖం,పోరాటం, నిరాశ సాధనామార్గంలో సర్వసహజం కాని అనివార్యం కాదు. అవి సహాయకారులు కావు. మానవ ప్రకృతిలోని తమస్సు వాటిని మనపై రుద్దుతుంది. ఈ తమోమయ ప్రకృతి నుండి మనం భగవత్ కాంతి వైపు పరిశ్రమించాలి.

*

భగవంతుని కోసం ఆత్మదాహం వేరు. నైరాశ్యం వేరు. తీరని దాహ ఫలితం నైరాశ్యం కాదు. సంతృప్తి చెందని ఈ దాహం మరింత తీవ్రమైన ఆత్మదాహానికి, నిర్ణయానికి, సంయమనంతో కూడిన ప్రయత్నానికి దారితీయవచ్చు, లేదా మరింత ఆకాంక్షా ప్రదీప్తమైన పిలుపునకు, చైత్యవేదనకు దారితీయవచ్చు. అప్పుడు అది నిరాశ, కృంగుబాటుతో సమానం కాదు. నైరాశ్యం లేదా కృంగుబాటు మేఘావృతమైన తామసిక స్థితి. స్పష్టమైన వాతావరణం గుండా కంటే, అటువంటి మబ్బులు, తామసిక తెరల గుండా వెలుగు ప్రసరించడం కష్టం. అటువంటి కృంగుబాటు అంతర్గత కాంతిరేఖను అడ్డుకొంటుంది. ఇది అందరి అనుభవం.

*

వేదన, బాధ అవసరం అని సంవాదం చేయడం ప్రమాదకరం. దుఃఖానికి లొంగిపోతే, అది అలవాటుగా మారుతుంది. జిగురులాగ అతుక్కొంటుంది. కొన్ని సంఘటనలు అలా వేదనతో అతుక్కొనిపోతాయి.

*

నువ్వు చెప్పే బాధ చైత్యపరమైనది కాదు. బాధాగ్నిమయ ఆకాంక్ష ప్రాణికానికి చెందినది. అది చైత్యపురుషుని లక్షణం కాదు. ఒక కోరిక ఫలించకపోవడం వల్ల చైత్యపురుషుడు ఏనాడు విచారం పొందడం జరగదు. ఎందుకంటే అది దాని స్వభావం కాదు. భగవంతుణ్ణి తిరస్కరించినప్పుడు, 'సత్య' మార్గం నుండి మనిషి లోని, మానవ ప్రకృతిలోని మానస, ప్రాణిక, శారీరక విభాగాలు దారి తప్పి వైకల్యం, అజ్ఞానం, అంధకారం వైపు ప్రయాణించినప్పుడు మాత్రం చైత్యపురుషుడు విచార గ్రస్తుడవుతాడు.

*

చైత్యపురుషుడు కలిగించే కల్లోలం కృంగుబాటు కాదు. అసమంజస చలనాన్ని త్రోసిపుచ్చడం వల్ల కలిగే కల్లోలం అది. కల్లోలిత మనస్సు కృంగుబాటును కాని, ప్రాణిక అసంతృప్తిని కాని కలిగిస్తే, అది చైత్యసంబంధితమైన కాదు.

*

అసంబద్ధమైన, నిర్హేతుకమైన విచారం, నైరాశ్యం, ఊహాగానాలు, భయాందోళనలు, వైకల్యపు హేతువాదాలు, తిరిగి తిరిగి సంభవించడం — వాటిని జాగ్రత్తగా పరిశీలిస్తే, అవి చర్వితచరణంగా అవే కదలికలు, భావాలు, సంవేదనలు, యంత్రంలాగా అదే భాష, అదే వాక్యనిర్మాణాలు — ఇవన్నీ నిమ్నప్రాణిక భూమిక పనిచేసే తీరు, లక్షణాలు. వాటితో పోరాడడానికి, తిరస్కరించడానికి, తమ ఆధిపత్యంలోకి తీసుకోవడానికి ఉన్నత ప్రాణికం, మనస్సు గట్టి నిర్ణయం తీసుకొని, వాటిని ఎదుర్కొన్నప్పుడు అవి మటుమాయం అవుతాయి. అంతకు మించి మరో మార్గం లేదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

అంతరాత్మ జ్యోతికి, భగవదాదేశానికి విధేయత

అనుమానము, అధైర్యము తత్సంబంధిత ఇతర లక్షణాలను, నీ నిజమైన ఉన్నత స్వభావానికి చెందనటువంటి వర్తనలను త్రోసివేయాలి. అశక్తత, అయోగ్యత లాంటి అన్యశక్తుల అవివేక గమనాల వలన జనించే ఆలోచనలను నిరాకరించాలి. నీలోని ఆత్మజ్యోతి, మబ్బుల మాటున మరుగుపడి మసకబారినా కూడా, దానిపై ధృఢ విశ్వాసం కలిగి ఉండాలి. నీ సహాయము, శ్రీమాత సహాయము గురించి నీవు తెలుసుకోలేని క్షణాలలో కూడ అవి నీకు బాసటగ నిలుస్తాయి. కాని నీకు, నీతో పాటు ఇతరులందరికి కూడ అవసరమైనది ఒకటి ఉంది. అది భౌతికచేతన యొక్క అవ్యక్తశక్తుల అజ్ఞానపు చీకటిలో నీవు మునిగిపోయినప్పుడు కూడ, గట్టి పట్టుదలతో మొండిగ నీ అంతరాత్మకు భగవదాదేశ స్మృతికి విధేయుడవై ఉండాలి. విధేయుడవై ఉండు. నీవు జయించి తీరుతావు.

*

ఆత్మజ్యోతికి, భగవదాదేశానికి విధేయత గలిగి ఉండాలని నేను అనుటలో అర్థం, సర్వ సంకటావస్థలలోను, అకస్మాత్ దాడులు ఎదుర్కోవలసి వచ్చిన సందర్భాలలోను, కావలసిన అనివార్యమైన ఒక గొప్ప అవసరాన్ని నొక్కి చెప్పడం. అది ఏమిటనగా, అవివేకపు ఆలోచనలను మానసిక ప్రేరణలు, ప్రలోభాలను దివ్యజ్యోతి జాతమగు పరమసత్య ప్రేరణతో ప్రతిఘటించాలి. అనుమానము, అధైర్యము ఆవహించిన సందర్భాలలో ఇలా అనుకోవాలి. "నేను దైవానికి దత్తమైనవాడను. నాకు ఓటమి ఉండదు." కల్మషాత్మకమైనవి, అయోగ్యతను సూచించే ఆలోచనలను ఈ విధంగ సమాధారపరచాలి. "నేను భగవంతుని అంశమైన అవినాశత్వము యొక్క సంతతిని; నేను నాకు నిజాయితీగ ఉండుటయే గాక దైవానికి కూడ నిజాయితీగ ఉండక తప్పదు — విజయం తథ్యం. నేను పడిపోయినా, మరల లేచి నిలబడగలను." అల్పమైన ఆదర్శానికి ఆకర్షింపబడి ప్రక్కదారి పట్టించే ప్రేరణలకు ఇలా సమాధానం ఇవ్వాలి, "ఇది అత్యుత్తమమైనది. నా అంతరాత్మను తృప్తిపరచగల ఏకైక పరమ సత్యం ఇదే. దివ్యపథం చివరి వరకు అన్ని పరీక్షలను, విపత్తులను తట్టుకుని ఓర్పుతో నిలబడతాను." ఆత్మజ్యోతికి, భగవదాదేశానికి విధేయత అని నేను అనుటలోని అంతరార్థం ఇదే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

నువ్వు తృప్తిచెంది, ఇక ఏమాత్రం ఆకాంక్షించని క్షణం నుండి, నువ్వు మరణించడం ప్రారంభమవుతుంది. జీవితం కదలిక, జీవితం ప్రయత్నం, జీవితం పురోగమనం, భవిష్య త్సాక్షాత్కారాలు, సిద్ధుల వైపు శిఖరారోహణం. విశ్రాంతి తీసుకోవడం కన్నా మించిన ప్రమాదం లేదు.

మూలం: శ్రీమాత

Vol. 41, No. 10
October 2011

Rs. 15.00

Registered: TN/PMG(CCR)/39/09-11
WPP No. 35/09-11

AKHILA - Akhila Bharat Patrika (Telugu)

Registered with the Registrar of Newspapers for India: No. 23593/72 (monthly)
Published on 1st day of every month.

Matter shall reveal the Spirit's face. — Sri Aurobindo




Flower on Cover
Smile of Beauty
(Spiritual significance and explanation given by the Mother

Editor· A. Kailasapati
Published by Pradeep Narang on behalf of Sri Aurobindo Society
No. 1 Rangapillai Street, Puducherry 605001
Printed by Swadhin Chatterjee at Sri Aurobindo Ashram Press,
38, Goubert Avenue, Puducherry 605001

Single copy· Rs. 15 **Annual Subscription: Rs. 150 (in India)**

A Monthly Published by
SRI AUROBINDO SOCIETY PUDUCHERRY 605002



శ్రీఅరవిందుల
యోగసమన్వయమునకు
పరిచయము
అఖిల
అఖిల భారత పత్రిక
నవంబరు 2011

యోగసమన్వయం

19/11/2011

విషయసూచిక

...ఒక ముఖ్యభావం మీద సడలని పట్టు నిరంతరం ఉండాలి. మన జీవేశ్వరునికి, మనలోనూ, ఈ జగతిలోనూ కొలువైన ఈశుడు, పరమేశ్వరుడు, విశ్వేశ్వరుడు అయిన ఆ ప్రభువుకి ఆత్మసమర్పణ కావించుకోవాలనే భావాన్ని వదలకూడదు. ఈ ముఖ్యభావనలో సుసంపన్నమై వుండే బుద్ధి, దాని స్వీయ అల్పమైన పట్టుదలలను, ఆధిక్యతలను అన్నింటిని అణచివేసి మనలోని అహంత తర్కంతో గానీ, స్వయంసంకల్పంతో గానీ, ప్రాణికంలోని కామనాగత హృదయంతోగానీ ఏ విధమైన హక్కుభుక్తులనూ పొందలేమని నేర్వాలి. దీనివల్ల వేదన, అభియోగము, ఏవగింపు, ఆతృత, కష్టము పొందితే అది మన జీవేశ్వరుని పట్ల దౌర్జన్యం చేసినట్లే.

(శ్రీఅరవిందుల యోగసమన్వయం నుంచి)

నవంబరు 17, 1914

ఆశ్చర్యము! దివ్యజననీ, మీ సహనశీలత ఎంత ఉదాత్తమైనది! పొరపాట్లను సరిదిద్దటానికి, జ్ఞానిని అనే భ్రాంతితో పెడదారిపట్టిన వ్యక్తియొక్క కుంటుపడిన పురోగతిని సక్రమమార్గంలో త్వరిత గతిన ఒడుదుడుకులు లేకుండ సాగనీయడానికి మీ చేతనాసంకల్పము ప్రత్యక్షంగా ప్రయత్నించిన ప్రతిసారి అతను మిమ్ములను ఒక విసుగు పుట్టించే అప్రస్తుత సలహాదారుగ నెట్టివేస్తుంటాడు. అస్పష్టతతో కూడిన అసంగతమైన నామమాత్రపు ప్రేమను కనబరుస్తాడు, కాని అతని అహంకారభరితమైన మనసు మాత్రం మిమ్ములను విశ్వసించుటకు అనుమతించదు, సరికదా, మీ ముందస్తు సలహాలను పాటించుటకు బదులు తనకు తోచిన విధంగా వ్యవహరించడానికి మొగ్గు చూపుతుంది.

అయినప్పటికి మీరు విసుగుచెందక, కారుణ్యం కురిపించే దరహాసంతో స్పందిస్తారు. ఈ మేధాసంపత్తి ఏదైతే మనిషిని గర్వాహంకారపూరితుడిని చేసి పొరపాటు చేయటానికి పురిగొల్పుతుందో, అదే ఒక్కసారి వికసనమొంది ప్రక్షాళన చెందితే, అతనిని ఉన్నతస్థాయికి కొనిపోగలదు. విశ్వగత ప్రకృతి తత్వానికి మిన్నయైన స్థాయికి — జగదీశ్వరునితో నేరుగా ఒక చైతన్యవంతమైన సంసర్గమునకు దారితీయగలదు. ఇట్టి విభాజితమైన మేధ ఏదైతే అతనిని నాకు దూరం చేస్తుందో, అదే మేధ అతను అందుకోవలసిన శిఖరాగ్రాలను అతివేగంగా అధిరోహించునట్లుగా కూడా చేయగలదు. అలా చేయుటలో ఈ సమస్త సృష్టియొక్క అపారత, సంకీర్ణత అతని పురోగమన తీవ్రతను భంగపరచవు.

ఓ దివ్యజననీ, మీ మాట ఎల్లవేళల ఓదార్పునిచ్చి అనుగ్రహిస్తుంది, ప్రశాంతత నిచ్చి ఆధ్యాత్మిక వెలుగును ప్రసరింపజేస్తుంది. మీ ఉదారహస్తము అనంత జ్ఞానాన్ని ఆచ్ఛాదించి ఉన్న తెరల పొరలను తొలగిస్తుంది.

మీ పరిపూర్ణమైన ధ్యానమననాదులు ఎంతటి నిశ్చలతను, ఎంతటి ఔదార్యమును, ఎంతటి పవిత్రతను కలిగి ఉన్నాయి!

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

నవంబరు 24, 1926 — సిద్ధిదినము

శిష్యులకు శ్రీఅరవిందుల సమాధానాలు

ప్రశ్న: నవంబరు 24 ఒక విజయదినమని కొందరు అంటారు; అతిమానసము (దివ్యచైతన్యము) శ్రీఅరవిందుల భౌతికచేతనలోనికి అవరోహించిన దినమని కొందరు భావిస్తారు; మరికొందరు అది కృష్ణతత్వము భౌతికచేతనలోకి అవరోహణ చెందిన దినమని అంటారు. అది కృష్ణతత్వ అవరోహణ దినమైతే, దాని అర్థం దివ్యచేతన ప్రకాశం అవరోహణ చెందినట్లుగా భావించవచ్చా?

కృష్ణుడు దివ్యచేతనప్రకాశం కాదు. కృష్ణతత్వం అవరోహణ చెందిందనుటలోని భావం అధిమానస దైవత్వం తనంతట తాను స్వయంగ అతిమానసమును, దివ్యానందమును కొనితేలేకపోయినా, వాటి అవరోహణకు అవసరమైన ప్రయత్నం చేయడం అని అనవచ్చు. కృష్ణుడు ఆనందమయస్వరూపుడు. అతడు పరిణామ ప్రక్రియకు అతిమానసం ద్వారా ఆధారపడుతూ దానిని దివ్యానందం దిశగా కొనిపోతాడు.

*

ప్రశ్న: నిజానికి, నవంబరు 24 యొక్క ప్రాధాన్యత ఏమిటి? అధిమానస సాక్షాత్కారమా, దివ్యచైతన్య సాక్షాత్కారమా లేక మరేమిటి? అది భౌతికంలోకి కృష్ణుడి అవరోహణ లాంటిదని మీరంటారు. మరి కొందరు ఆ అవరోహణ మీలో జరిగిందని అంటారు, కాని మీరు భౌతిక పదార్థం కారు. ఔనా? విషయం అంత స్పష్టంగా లేదు.

ఎందుకు లేదు? ఎందుకని నేను భౌతిక పదార్థాన్ని కాను? కనీసం దానిని పోలినట్లయిన లేనా? కనీస పక్షం నాలో కొంతైనా భౌతిక పదార్థం ఉన్నదని మీరు ఒప్పుకుంటారు. నాలో నున్న పదార్థం సాధారణ భౌతిక పదార్థానికి సంబంధించినది లేక కనీసం దానికి సరిసమానమైనది కాదని అనలేరు కదా? సరే, అయితే కృష్ణుడుగాని లేక అధిమానసంగాని లేక వీటికి సరిసమానమైనది వేరేదైనాగాని, నా భౌతికంలోకి అవరోహణ చెంది తత్సంబంధితమైన సాధారణ పదార్థంలోకి గూడ విస్తృతమగుట అనివార్యమైనప్పుడు, భౌతిక పదార్థంలోకి అవరోహించిందని అనుటలో స్పష్టత ఎందుకు లేదు?

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

'యోగసమన్వయము' ఒక పరిచయము

'యోగసమన్వయము' శ్రీఅరవిందుల ముఖ్యరచనలలో ఒకటి. ఈ గ్రంథములో 5 భాగములు గలవు. (1) పరిచయము — సమన్వయానికి నియమాలు (2) దివ్యకర్మ యోగము (3) పూర్ణజ్ఞాన యోగము (4) దివ్యప్రేమ యోగము (5) ఆత్మపరిపూర్ణత యోగము.

'యోగసమన్వయము' యొక్క ప్రచురణ ప్రప్రథమంగా తాత్త్విక విచారణ మాసపత్రిక యగు 'ఆర్య', ఆగస్టు 1914 సంచికతో ప్రారంభమై, జనవరి 1921 ఆఖరి సంచిక వరకు కొనసాగింది. జనవరి 1921 లో 'ఆర్య' ప్రచురణ ఆగిపోయింది. అప్పటికి ఈ గ్రంథం పూర్తి కాలేదు. దాదాపు 1932 ప్రాంతంలో శ్రీఅరవిందులు పుస్తకరూపంలో ప్రచురించే ఉద్దేశంతో దీనిని సమగ్రంగా సవరించి 'దివ్యకర్మయోగము' నందలి అన్ని అధ్యాయములను, 'పూర్ణజ్ఞానయోగము' నందలి 9 అధ్యాయయములను సవరించారు. 1940 ప్రాంతంలో ప్రచురణకు సిద్ధపరుస్తూ, ప్రథమ భాగాన్ని కొద్దిగా సవరించారు. మిగతా భాగాలు ఎప్పుడూ సవరించబడలేదు.

1936 లో శ్రీఅరవిందులు వ్రాసిన ఉత్తరములోని భాగము ఒకటి (క్రింద పొందుపరచబడినది) 'యోగసమన్వయము' రచించుటలో వారి లక్ష్యము గురించి, ఆ రచనకు వారు ఏర్పరుచుకున్న ప్రణాళిక గురించి కొంత అవగాహన కలుగజేస్తుంది.

'యోగసమన్వయము' అందరికి అనుసరణీయమైన ఒక విధానాన్ని అందించుటకై ఉద్దేశించబడలేదు.అందులో యోగమార్గములోని ప్రతి అంశము యొక్క సాధ్యాసాధ్యాలు ప్రత్యేకంగా విశ్లేషించబడ్డాయి. అవి అన్ని ఏ విధంగ సంయోజన మొంది, ఒక మార్గాన్ని అనుసరించి సాధన ప్రారంభించిన వ్యక్తిని ఇతర మార్గాలతో ఎలా అనుసంధానపరచగలదో సూచిస్తుంది. ఉదాహరణకు, ఒకరు జ్ఞానమార్గంలో మొదలిడి, కర్మ మరియు భక్తిమార్గాలను కూడ ఎలా అందుకోగలరో వివరిస్తుంది. 'ఆత్మ పరిపూర్ణత యోగము' పూర్తి అయిన పిమ్మట, అన్ని యోగాలను సమన్వయపరచే విధాన్నికి ఒకటి సూచించాలనే ఉద్దేశం ఉండింది కాని అది వ్రాయటం కుదరలేదు.

'ఆర్య' యొక్క నాల్గవ సంవత్సర చివరి సంచికలోని ఒక భాగాన్ని కూడ క్రింద పొందుపరుస్తున్నాము.

తత్వజ్ఞానంలో ప్రతిబింబించే సత్యం నిజజీవితంలో ఆచరణ సాధ్యమైతే తప్ప

అది కేవలం సైద్ధాంతికపరమైన విలువగలదిగానే మిగిలిపోతుంది. అందువల 'యోగ సమన్వయము' లో మేము సంయోగాత్మక దృష్టికోణంలో ఆధ్యాత్మికపరమైన ఆత్మనియంత్రణ సూత్రాలను నిర్దేశించడానికి మరియు అవి మానవజాతి మనుగడలో ఒక సమగ్ర దివ్యజీవన గమనానికి ఎలా దారితీయగలవో సూచించుటకు ప్రయత్నించాము. కాని, ఇది వ్యక్తిగత సముద్ధరణకు మాత్రమే సంబంధించినదైనందున మానవజాతి యొక్క సామాజిక జీవనగతిలో ఈ మా ఆదర్శం ఏ మాదిరిగా పని చేస్తుందో నిరూపించుట అవసరమైంది. ఈ వాస్తవాలు ఏ విధంగా మానవసమాజ పరిణామ ప్రక్రియను ప్రభావితం చేస్తాయో "సామాజిక అభ్యున్నతి తత్వం" (Psychology of Social Development) గ్రంథంలో సూచించాము. మానవజాతి యొక్క వర్తమాన సాధారణ పోకడలను ఏకోన్ముఖం చేసి, వాటి లక్షణాలను బేరీజు వేసి, యదార్థమైన మానవజాతి ఐక్యతను సాధించుటకు వాటిలో కొరవడినదేదో సూచించుటకు 'మానవ ఐక్యత ఆదర్శము' గ్రంథములో ప్రయత్నించాము.

ఇక ఈ సంచికలో 'యోగసమన్వయము' నుండి కొన్ని భాగాలను ఎంపికచేసి ప్రచురించడమైనది. ఇవి గ్రంథము నందలి విషయాలను పూర్తిగ ఆవిష్కరించకపోయినప్పటికి, కొత్తగా ఈ మార్గాన్ని అనుసరించగోరేవారికి ఉపయోగపడతాయి.

జీవితము — యోగము

జీవితాన్ని, యోగాన్ని సరైన దృక్పథంతో చూసినపుడు జీవితమంతా ఎరుకతోనో లేక ఎరుకలేకనో చేసే యోగమే. ఈ పదానికి మన అర్థం మన అస్తిత్వంలోని అంతర్గత రహస్య సంభావ్యతల అభివ్యక్తి ద్వారా స్వీయసమగ్రతను పొందడానికి, ఆ ఉన్నత విజయం కోసం చేసే క్రమబద్ధమైన కృషి — మనిషిలోను, విశ్వంలోను అసంపూర్ణంగా వ్యక్తమైన అస్తిత్వం యొక్క విశ్వ విశ్వాతీత స్థితులతో మానవుడు ఐక్యత చెందడం. కాని ఈ కనిపించేవాటి నేపథ్యాన్ని చూసినపుడు జీవితమంతా ఎరుకలోనూ, అధోచేతనలోనూ, నిరంతరం పెరుగుతున్న అభివ్యక్తి అభివృద్ధి కోసమూ, తనలో ఇంకా ఫలించని సంభావ్యతల సాకారం కోసమూ, తనలోని దివ్యవాస్తవంతో ఐక్యత పొందడానికి ప్రకృతి చేస్తున్న విస్తృత యోగమే.

ఈ పృథ్విపై ఆమె ఆలోచనలలో నిమగ్నుడైన మనిషిలో ఆమె మొదటిసారిగా

స్వీయ-చైతన్య సాధనామార్గాలను కార్యాచరణకు స్వయం సంకల్ప విధానాలను రూపొందించుట ద్వారా ఈ గొప్ప ప్రయోజనాన్ని శీఘ్రంగానూ, తృప్తికరంగానూ సాధించగలదు.

స్వామి వివేకానందులు చెప్పినట్లుగా యోగం వ్యక్తి యొక్క పరిణామాన్ని ఒక్క జీవితకాలంలో కుదించటానికి లేదా కొన్ని సంవత్సరాల్లోకి, లేదా కొన్ని నెల ల్లోకి కుదించటానికి ఏర్పరచిన మార్గంగా తెలుసుకోవచ్చు. ఏ మార్గమైన సామా న్యంగా ప్రకృతి తన పరిణామంలో సూత్రబద్ధం చేయకుండా తాపీగా నెమ్మదిగా నడిచే నడకను గాఢతతో కూడిన శక్తివంతమైనవిగా తయారుచేయడానికి చేసుకున్న ఒక ఎన్నిక లేదా క్లుప్తీకరణ మార్గం. ప్రకృతి యొక్క సామాన్య పరిణామంలో విశ్వ మాత యొక్క గొప్ప ఊర్ధ్వముఖ ప్రయాసలో, పదార్థశక్తులు వృథాపోకుండా మరింత సంపూర్ణ పద్ధతులతో సంకీర్ణపరచిన ప్రయత్నం. యోగం యొక్క ఈ దృక్పథమె యోగమార్గాల యొక్క సహేతుకమైన, పటిష్టమైన సమన్వయానికి పునాది. అప్పుడే యోగమంటే ఏదో ఒక మార్మికమైనదిగానూ, లేదా ఒక విపరీత మైనదిగానూ కనపడదు. ఆంతరంగికంగానూ, బాహ్యంలోను ఫలించడానికి ఆమె యొక్క రెండు కదలికలు తన సామాన్యమైన, ఎక్కువగా ఉత్తేజితంకాని అభివృద్ధిని క్రమబద్ధం చేసినపుడు, అంతకు ముందు అభివ్యక్తి చేసిన శక్తుల కంటె ఇవి చాలా గాఢంగానూ, ప్రత్యేకంగానూ ఆమె నడకలో ప్రతిఫలిస్తాయి.

విద్యుచ్ఛక్తి, ఆవిరి ప్రకృతిలో సహజంగా పనిచేసే తీరుకీ, వాటినే వైజ్ఞానిక పరంగా వాడుకునే తీరుకీ, ఎలాంటి సంబంధం ఉంటుందో, యోగసంబంధమైన పద్ధతులకీ మానవుల మానసికపరమైన కార్యకలాపాలకీ, అదే రకమైన సంబంధం ఉంటుంది. అవి కూడా శాస్త్రీయ విజ్ఞాన విధానాల్లాగా నిరంతర పరిశోధన, ప్రయోగాల వల్ల పెంపొందించబడిన జ్ఞానంతోనూ, ప్రత్యక్ష విశ్లేషణతోనూ అందుకున్న నిత్య ఫలితాలతో రూపొందుతాయి. మన మూలతత్వాలు, వాటి సంయోగాలు, కార్యా చరణలు, శక్తులను విభజించడం ద్వారానో, విలీనం చేయడం ద్వారానో, ఒక నూతన సంయోగాన్ని ఏర్పరచి అంతకు ముందు సాధ్యం కాని పనిని ఒక నిర్ణీత అంతర్గత ప్రక్రియ ద్వారా వినూత్న రీతిలో సమన్వయం చేయవచ్చు అన్నదానికి రాజయోగం ఒక ఉదాహరణ, ఒక అనుభవం. మన జీవితంలో సామాన్యంగా ఉండె ప్రాణికశక్తుల నిర్వహణా విధానము, అలాగె వాటి పని తీరు ఒకే రీతిలో సాగక

తప్పదని భావిస్తాం. అయితే ప్రాణశక్తిని మనం అదుపులోకి తెచ్చుకుని ఆ పని తీరును మార్చడమో, లేదా నిలిపివేయడం ద్వారానో ఆ పద్ధతిలోని హేతువును పట్టుకోక అంతకు ముందు అవేవో అద్భుతాలు, అసాధ్యాలని భావించినవాటిని సాధించగలమన్న అవగాహన, అనుభవం మీదే హఠయోగమూ ఆధారపడింది. ఇంకా కొన్ని పద్ధతుల్లో ఈ యోగలక్షణం పైకి అంత పటిష్ఠంగా కనిపించకపోవడానికి కారణం అవి యాంత్రికత తక్కువగానూ, అంతర్బుద్ధి ఎక్కువగానూ, భక్తియోగానికి దగ్గరగానూ ఉండి ఒక దివ్య పారవశ్యాన్ని అనుభవంలో పొందుతాయి, లేదా జ్ఞాన యోగంగా అనంత దివ్యచైతన్యాన్ని ఆ అస్థిత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకుంటాయి. అయినా అవి కూడా సహజమైన మన కార్యాచరణలో అప్పటిదాకా ఎన్నడూ ప్రయత్నించని మనలోని ఒక ప్రముఖమైన శక్తిని ఉపయోగించడంతో మొదలైనవే. సర్వసామాన్యంగా ఈ యోగం అన్న పేరు మీద ఏర్పడిన పద్ధతులన్నీ, మనలో రహస్యంగా ఉండి, మన సామాన్య కదలికల్లో తరుచుగా అభివ్యక్తం కాని విధానాలు, శక్తులు, ఫలితాలు, ఒక ప్రత్యేకమైన మనోవిశ్లేషణా పద్ధతుల మీద ఆధారపడి, ఆ ప్రకృతి యొక్క స్థిరసత్యం మీద ఆవిష్కరింపబడినవే.

మూలం: యోగసమన్వయం

అనువాదం: డి. సత్యవాణి

పూర్ణయోగము — మూడు విశిష్ట లక్షణాలు

ప్రకృతి కదలికి ద్వివిధంగా ఉంటుంది. ఒకటి ఉన్నతం, మరొకటి నిమ్నం. లేదా ఒకటి దివ్యం. మరొకటి అదివ్యం. ఆచరణాత్మక ప్రయోజనం కోసం మాత్రమే ఈ తేడా ఉంటుంది. నిజానికి దివ్యం కానిది ఏదీ లేదు. సహజమైనదీ అని, అతీతమైనదీ అని తేడా చూపడం అర్థరహితం. అన్నీ కూడా సహజమైనవే. అన్నీ ప్రకృతిలో వున్నాయి. అన్నీ భగవంతునిలో వున్నాయి. మనలో విశ్వాసం మారనంత కాలం నిమ్నప్రకృతి నిలిచే వుంటుంది. అది పరిమితం, భిన్నత్వం, అజ్ఞానం. అహంకారజీవనం దాని పర్యవసానం. ఉన్నత ప్రకృతి పరిమితిని దాటుతుంది. అది జ్ఞానం. దివ్యజీవనం దాని పర్యవసానం. నిమ్నప్రకృతి నుండి ఉన్నత ప్రకృతిలోకి మారడం యోగలక్ష్యం.

నిమ్నప్రకృతిని తిరస్కరించి ఉన్నత ప్రకృతిలోకి తప్పించుకోవడం ఒక మార్గం. లేదా నిమ్నప్రకృతిని ఉన్నత ప్రకృతిగా పరివర్తనం చెందించడం మరో మార్గం. అదే పూర్ణయోగ లక్ష్యం.

ప్రకృతి మనలో పనిచేసే తీరు ఒక సమగ్రమైన కదలికలాగ ఉంటుంది. మన మూలతత్వాలు, మన పరిసరాలు అన్నిటిని అది ప్రభావితం చేస్తుంది. జీవితమంతా ప్రకృతి యోగమే. అహంకారం, విభజనతో పనిచేసే నిమ్నప్రకృతి స్థానంలో భగవంతుడు, సమైక్యతలతో పనిచేసే ఉన్నత ప్రకృతి పూర్ణకార్యాచరణతో పనిచేయడం యోగసాధకుని లక్ష్యం. మనం ప్రపంచం నుండి భగవంతునిలోకి పారిపోవడం మన లక్ష్యం అయితే సమన్వయం అనవసరం — వృధా కాలయాపన.

భగవంతుని వైపు దారితీసే వేలమార్గాలలో ఏదో ఒక దగ్గర దారిని కనుగొనడమే మన లక్ష్యం. ఒకే లక్ష్యంగల అనేక మార్గాలను అన్వేషిస్తూ కూర్చోడం దండగ. మన అస్తిత్వాన్ని భగవదస్తిత్వంగా పరివర్తనం చెందించడం మన లక్ష్య మైతే అప్పుడు సమన్వయం అవసరం.

భగవంతునితో సంబంధం పెట్టుకొని, మన చైతన్యాన్ని భగవంతుని చైతన్యంగా మార్చాలని ఆయన్ని వేడుకోవాలి. అప్పుడు భగవంతుడే సాధకుడవుతాడు. యోగ సాధనకు ప్రభువుగా వుంటాడు. నిమ్నవ్యక్తిత్వం దివ్యపరిణామ కేంద్రంగా మారుతుంది, తన పరిపూర్ణతకు ఉపకరణం అవుతుంది. తపస్సు ద్వారా తన సిద్ధిని పొందుతుంది. దివ్యమైన సర్వ విజ్ఞాన మహత్వం పరిమిత అస్తిత్వంలోకి అవరోహించి దానిని ప్రదీప్తం చేస్తుంది. నిమ్నప్రకృతిని తపోజ్వలం చేస్తుంది. నిమ్న మానవ ప్రకాశం, మర్త్య కర్తృత్వ స్థానంలో అది పనిచేయడం ప్రారంభిస్తుంది. (సాధన ద్వారా పరిపూర్ణత్వం (సిద్ధి) లభిస్తుంది. సాధకుడు ఆ సాధన ద్వారా సిద్ధిని పొందుతాడు.)

ఈ పద్ధతి వల్ల అహం నెమ్మదిగా సమర్పణ భావంతో నిండిపోతుంది. ఇది అంత తేలిక సాధన కాదు. దీనికి అమితమైన ధైర్యం, విశ్వాసం, సహనం కావాలి. దీనికి మూడు దశలుంటాయి. భగవంతునితో సంపర్కం పెట్టుకోడానికి అహం చేసే యత్నం. ఉన్నత ప్రకృతిగా మారడానికి నిమ్నప్రకృతి చేసే విస్తృతమైన, కష్టతరమైన పరిశ్రమ. కాలక్రమేణా పరివర్తన చెందడం. చివరిది ఆనందమయమైన సత్వర ప్రక్రియ. నిజానికి తెరవెనుక గల దివ్యశక్తి తెలియకుండా మన బలహీనత

బదులుగా పనిచేస్తుంది. విశ్వాసం, ధైర్యం, సహనం విఫలమైనా అది ఆధారభూత మవుతోంది. "దాని వల్ల కన్నులు లేనివారు చూడగల్గుతారు. కాళ్ళు లేని వాడు పర్వతాలు దాటిపోగలడు." మనల్ని ప్రోద్బలం చేసే, మనల్ని ఉద్ధరించే ఒక నియతి ఉన్నట్లు తన మేధస్సు తెలుసుకొంటుంది. మనం ఎన్ని తప్పటడుగులు వేసినా మనల్ని కాపాడే ఒక ప్రభువు గూర్చి, ఒక స్నేహితుడ్ని గూర్చి, ఒక మాతృమూర్తి గూర్చి హృదయం సదా పలుకుతుంది. అందువల్ల ఈ మార్గం కష్ట భూయిష్టమైనది. అయినా దాని లక్ష్యం, శ్రమను దృష్టిలో పెట్టుకొంటే అది చాలా తేలికయినది. నిశ్చయమైనది.

ఈ పూర్ణయోగంలో మూడు విశిష్ట లక్షణాలున్నాయి. ప్రత్యేకమైన యోగ విధానాలలోలాగ అది ఒక నిర్ణీత పద్ధతిలో, క్రమంతో పనిచేయదు. అది మొదటిది. వ్యక్తి మానస తీరుతెన్నులు ఆధారంగా స్వేచ్ఛగా, క్రమంగా తీవ్రస్థాయిలో ప్రయోజనాత్మకంగా చెల్లాచెదురుగా పనిచేస్తుంది. అతని స్వభావాల నుండి లభించే సహాయం ఉపకరణాలు నిర్ధారిస్తూ వుంటాయి. ఆటంకాలు సైతం ఉపకరిస్తాయి. ఇవి సాధకుని పవిత్రీకరణకు, పరిపూర్ణత్వానికి దోహదం చేస్తాయి. అంటే ప్రతి వ్యక్తికీ తన మార్గంలో తనదైన యోగపద్ధతి ఉంటుంది. అయితే అందరికీ వర్తించే కొన్ని విస్తృత విధానాలుంటాయి. అవి చర్విత చర్వణమైన పద్ధతిని రూపొందించవు. అవి ఒక శాస్త్రాన్ని, సమన్వయ యోగానికి శాస్త్రీయ పద్ధతిని రూపొందిస్తాయి.

రెండవది — మన గతకాలపు పరిణామం దృష్ట్యా మన ప్రకృతిని ఈ పూర్ణ యోగం అంగీకరిస్తుంది. దేనినీ తిరస్కరించకుండా మానవ స్వభావం అంతా దివ్యపరివర్తన చెందేటట్లు ఒత్తిడి చేస్తుంది. ఒక మహనీయ దివ్య 'కళాకారుడు' ప్రతి అంశాన్ని తన హస్తాలలోకి తీసుకొని, మన స్వభావం వర్తమానంలో దేనిని అస్తవ్యస్తంగా అన్వేషిస్తుందో దానిని స్పష్టంగా మారుస్తుంది. అనుభవం పెరిగే కొలదీ నిమ్నప్రకృతి ఎలా రూపుదిద్దుకొందో, అందులోని ప్రతి అంశం దివ్యప్రకృతి సామరస్యం నుండి తప్పించుకొని ఎలా నికృష్ట వైకల్యరూపం చెందుతుందో అర్థం అవుతుంది — కొలిమి మంటలలో లోహంలోని కల్మషాలు ఎలా కాలిపోతాయో, అలా దేవతలను ఆది పితృదేవతలు రూపొందించడం గూర్చి వేదదృష్టలు చెప్పిన మాటుల అర్థం అవునట్లు.

మూడవది, మనలోని దివ్యశక్తి జీవితంలోని సర్వస్వాన్ని పూర్ణయోగానికి ఉప

కరణంగా మారుస్తుంది. ప్రపంచ పరిస్థితులు ఎంత అల్పమైనవైనా, ఎంత ప్రమాద కరమైనవైనా వాటితో కలిగే సంపర్క అనుభవాలు యోగానికే ఉపయుక్తమవుతాయి. ఎంతటి ప్రగాఢ ప్రతికూల వేదన అయినా, ఎంతటి అవమానకరమైన పతనమైనా ఆ అనుభవం పరిపూర్ణతకు సోపానం అవుతుంది. ప్రపంచంలో భగవంతుడు ఎలా పనిచేస్తున్నాడో, మసకచీకటిలో వెలుగు, బలహీనులలో బలం, ఆవేదనలో ఆనందం కోసం ఆయన చేసే పరిశ్రమ ఏమిటో మనము అప్పుడు గుర్తిస్తాం. అప్పుడు మన కళ్ళు పూర్తిగా తెరచుకొంటాయి. నిమ్న, ఉన్నత ప్రకృతిలో పనిచేసే తీరులో దైవం పద్ధతి ఒకేలా వుండడం మనం గమనిస్తాం. ఒక ప్రకృతిలో అది నెమ్మదిగా, మసకగా పనిచేస్తుంది. ప్రకృతిలోని అవచేతన ద్వారా అది పనిచేస్తుంది. ఉన్నత ప్రకృతిలో మరింత వేగంగా, ఆత్మస్పృహతో పనిచేస్తుంది. భగవంతుని హస్తాలు పనిచేస్తున్నట్లు ఉపకరణం ఒప్పుకుంటుంది. భగవంతుని తనలో ఆవిష్కరించడానికి జీవితమంతా ప్రకృతి చేసే యోగమే. ఈ ప్రయత్నం ఒక దశలో ఆత్మస్పృహగా మారి, సక్రమంగా పని పూర్తి చేస్తుంది. నిమ్న పరిణామంలో చెదిరిపోయిన చలనాలను పోగుచేసి కేంద్రీకృతం చేయడం జరుగుతుంది.

పూర్ణ పద్ధతి, పూర్ణ ఫలితం: మొదట భగవంతుడ్ని పూర్ణంగా సిద్ధింపచేసుకోవాలి. ఐక్యతలోనే కాదు అనేకత్వపు లక్షణాలతో కూడా దైవాన్ని వీక్షించాలి. సాపేక్ష చైతన్యం పూర్ణజ్ఞానం పొందాలంటే ఇది అవసరం. ఆత్మలో ఐక్యతాసిద్ధి మాత్రమే కాదు, విభిన్న, అనేకానేక ప్రపంచాలలో కార్యసరళి తీరుతెన్నులలో, జీవరాశులలో ఐక్యతను సిద్ధింపజేసుకోవాలి. అదే పూర్ణవిముక్తి. ఈ పూర్ణసిద్ధి, విముక్తితో విజ్ఞాన ఫలితాల పూర్ణసామరస్యం, జ్ఞానం, ప్రేమ, కర్మల పూర్ణ సామరస్యం సాధించవచ్చు.

దివ్య అస్తిత్వం స్వేచ్ఛతో నిండి వుంటుంది. అది అతి పవిత్రం, ఆనందమయం, పరిపూర్ణత్వపు మాధుర్యం. పూర్ణత్వంలో మనస్సు, శరీరాల పూర్ణత్వం కూడా వుంటుంది. అప్పుడు యోగసమన్వయ విస్తృత సూత్రంలో రాజయోగ, హఠయోగ ఉన్నత ఫలితాలను చేర్చవలసి వుంటుంది.

వ్యక్తిగా పరిమితమైతే మనం ఆశించే పూర్ణత్వం నిజం కాదు. సాధ్యం కాదు. అనేకుల ద్వారా ప్రేమను పొందాలి. మనలోని పూర్ణత్వపుసిద్ధి వారికీ వర్తిస్తుంది. మన విముక్తి వారికీ విస్తరిస్తుంది. దాని ఫలితాలు అనివార్యం. మన విముక్తి, మన పూర్ణత్వం యొక్క విస్తృత ఉపయోగం అదే. అటువంటి విస్తరణకై చేసే నిరంతర

ప్రయత్నం మానవాళికి అందరికీ వర్తించి చివరికి పూర్తిగా విజయవంతమౌతుంది. మరింత పెరుగుతుంది.

పరిపూర్ణ ఆధ్యాత్మిక అస్తిత్వపు పూర్ణాభివ్యక్తితో వ్యక్తిలోనూ, జాతిలోనూ సంభవించే మానస, నైతిక, స్వీయ సంస్కృతీ వైభవం, భౌతిక జీవన దివ్యీకరణం, ఈ మతాతీత ప్రయత్నం వ్యక్తిగతమైన, వ్యష్టిగతమైన సువర్ణ కిరీటం కాగలదు. అటువంటి మార్పు అంతర్గత స్వర్గ సామ్రాజ్య అవతరణకు, బాహ్యమైన పూర్ణ సామ్రాజ్య ప్రాభవానికి దారి తీస్తుంది. ప్రపంచ మతాలన్నీ విభిన్న మార్గాలలో ఆశించిన మహనీయ స్వప్నానికి నిజమైన సాఫల్యంత అది.

ఈ విస్తృత పూర్ణత్వ సమన్వయం ఆలోచనకు సాధ్యమైనదే. మానవాళిలో రహస్యంగా దాగివున్న భగవంతుని సాక్షాత్కారం పొందిన వారి అంకితభావం విలువ కట్టలేనిది. వారి ఏకైక ప్రయత్నమే ఈ పూర్ణయోగ దర్శన మహత్వం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

వివిధ యోగవిధానాలు — వాని సమన్వయము

యోగము — ప్రధాన సూత్రము:

మానవునికున్న శక్తులలో ఒకదానినిగానీ లేక అన్నిటినీగానీ దైవానికి చేరే మార్గాలుగా మలుచుకోవడమే యోగములోని ప్రధాన సూత్రము. సాధారణ యోగములో మనిషిలోకి ఒక ముఖ్య శక్తిగానీ లేదా దాని శక్తులలో కొన్నింటి సముదాయమునుగానీ వాహకంగానో, సాధనంగానో లేక ఒక మార్గంగానో చేసుకోవడం జరుగుతుంది. ఈ యోగసమన్వయంలో మాత్రం శక్తులన్నీ సమ్మిళితంగా మార్పుచేసే యంత్రాంగంలో చేర్చబడతాయి.

హఠయోగంలో శరీరము, జీవితమూ సాధనంగా ఉంటాయి. శరీరంలోని శక్తినంతా నిలకడగా చేసి, ప్రోది చేసి, శుద్ధి చేసి, సమున్నతం చేసి, ఇంకా ఆసనాలు మొదలైన శారీరక ప్రక్రియల ద్వారా అపరిమితమైన పరాకాష్టదాకా కేంద్రీకృతం చేయడం జరుగుతుంది. అదే మాదిరిగా ఆసనాలు, ప్రాణాయామం ద్వారా జీవపుశక్తిని కూడా

శుద్ధి చేసి, సమున్నతం చేసి కేంద్రీకృతం చేయడం జరుగుతుంది. ఈ విధంగా కేంద్రీకృతం చేసిన శక్తులను మానవశరీరంలో దివ్యచైతన్యం గుప్తంగా దాగి వున్న భౌతిక కేంద్రం వైపుకి మళ్ళించడం జరుగుతుంది. తన నిగూఢ శక్తులన్నిటితో కలిసి చుట్టలు చుట్టుకొని మానవుని దిగువ భాగాన మూలాధార చక్రం దగ్గర నిద్రావస్థలో మునిగివున్న జీవశక్తి అనే ప్రకృతిశక్తి — అక్కడనుండే జాగ్రతావస్థలో మనిషి నిత్యజీవిత చర్యలకు సరిపడ పరిమిత శక్తి విడుదల అవుతుంది — నిద్ర మేల్కొని అక్కడ నుంచి ఊర్ధ్వముఖంగా పయనిస్తూ ఒక్కొక్క నాడీకేంద్రాన్ని జాగృతం చేస్తుంది. తొలుతగా నాడీజీవితం, ఆవేగ నిలయమైన హృదయం, సాధారణ మనస్తత్వం, వాక్కు, దృష్టి, సంకల్పం, ఉన్నత జ్ఞానాలను మేల్కొలిపి అక్కడ నుంచీ మెదడు దాటి సహస్రారం గుండా పైనున్న దివ్యచైతన్యంతో ఏకమవుతుంది.

రాజయోగం మనస్సునే ప్రధాన సాధనంగా ఎంచుకుంటుంది. ప్రథమంగా మన సాధారణ మనస్తత్వాన్ని క్రమబద్ధీకరించి, శుద్ధిచేసి దివ్యత్వం వైపు మళ్ళించాలి. ఆ తర్వాత ఆసన, ప్రాణాయామాల సంకలన పద్ధతి ద్వారా మన దైహికశక్తిని స్తంభింపచేసి కేంద్రీకృతం చేస్తారు. ఆ తర్వాత పూర్తి నిలుపుదల జరిగేదాకా జీవశక్తిని లయబద్ధీకరించి ఊర్ధ్వదిశ చర్యల కోసం దాన్నొక ఉన్నతశక్తిగా ధారణ చేస్తారు. ఈ విధంగా తాను ఆధారపడిన జీవమూ, దేహముల అధిక చర్యలవల్ల, ధారణవల్ల మనస్సు దృఢపడి, స్థిమితపడుతుంది. దాని అసహనాలు, ఉద్రేకాలు చల్లబడి అనవసర ఆలోచనల నుండి శుభ్రపడుతుంది. ఇంకా దాని ఆలోచనాగతులు, పరధ్యాసలు, మతిభ్రమణాల నుంచి విముక్తి పొంది చక్కని ఉన్నత ధారణాశక్తి కలిగి విలీనక్రియ అనే సమాధిస్థితిని పొందుతాయి. ఈ పద్ధతి ద్వారా ప్రాపంచికంగానూ, శాశ్వతంగానూ రెండు రకాల ఆశయాలు సిద్ధిస్తాయి. ఇంకా దీని కేంద్రీకృత చర్యగా మామూలు సంకుచిత మనస్తత్వానికి అందనటువంటి అసాధారణ రీతిలో మనశ్శక్తి వృద్ధిపొందుతుంది: జ్ఞానోపలబ్ధితో అనూహ్యమైన సామర్థ్యం, ప్రభావవంతంగా ఉండే సంకల్పం, పరిగ్రహణంలో ప్రగాఢ తేజస్సు, ఆలోచనా ప్రసరణం వెలువరించే అత్యంత తేజోవంతమైన కాంతి మొదలైనవన్నీ దానివల్ల కలిగే ఫలితాలు. చివరలో అనేక యోగశక్తులు, గుహ్యశక్తులు లభిస్తాయి. వాటి చుట్టూ అనేక రహస్యాలు, ఏమంత ప్రాముఖ్యతలేని అనేక గాథలూ అల్లుకొని ఉంటాయి. అయితే చివరకు ఈ యోగం ద్వారా మనసుకు అతిముఖ్యమైన లబ్ధి చేకూరుతుంది. అదేమంటే

మనసు నిలకడ పొంది, తనను తాను మరిచిపోయి దివ్య చైతన్యంలో చేరుతుంది, ఆత్మకు స్వేచ్ఛ లభించి పరమాత్మలో ఐక్యం కాగలుగుతుంది.

త్రివిధ యోగమార్గం వ్యక్తి మానసిక ఆత్మజీవపు మూడు ముఖ్యశక్తులను తన సాధనాలుగా చేసుకుంటుంది. జ్ఞానం వివేచనను, మనోదర్శనాన్ని ఎంచుకొని వాటిని శుద్ధిపరచి, ధారణచేసి, ఒక రకమైన దైవదర్శకత్వ అన్వేషణతో ఉత్కృష్ట జ్ఞానం, అత్యున్నత దివ్యజ్ఞానం, దివ్యదర్శనం పొందటానికి సాధనాలుగా మలుచుకుంటుంది. దాని గమ్యం దైవాన్ని దర్శించడం, తెలుసుకోవడం, దైవంగా మారిపోవడం. కర్మ యోగంలో కర్మానుష్టానం కర్మధారి సంకల్పాన్ని తన సాధనంగా చేసుకుంటుంది. తన జీవితాన్ని యజ్ఞబలిగా దైవానికి సమర్పించుకుంటుంది. పవిత్రీకరణం, ధారణ, దివ్యసంకల్పానికి తలొగ్గడమనే ఒక రకం శిక్షణలను దైవత్వంతో సంబంధం, జగత్ప్రభువుతో ఆత్మ సమైక్యతను వృద్ధిపొందించటానికి మార్గాలుగా చేసుకుంటుంది. భక్తిమార్గం ఆత్మ ఉద్వేగభరిత, రసజ్ఞశక్తులను ఎంచుకొని వాటిని పరిపూర్ణ పవిత్రతతో, తీవ్రతతో, భగవదన్వేషణలో అనంతమైన ఆసక్తితో దైవత్వంతో ఒకటికి మించి అనేక విధాల సమైక్యత పొందటానికి సాధనాలుగా వాడుకుంటుంది. అన్ని మార్గాలు, తమదైన రీతిలో, జీవాత్మను పరమాత్మతో సంధానపరచడమే లక్ష్యంగా పెట్టుకుంటాయి.

ప్రతి యోగము కూడా అది వాడుకునే సాధనం యొక్క లక్షణాన్ని కలిగి ఉంటుంది. హఠయోగలక్షణం మనోభౌతికం కాగా, రాజయోగం మనోచైత్యకం కాగా, జ్ఞానమార్గం చిదాత్మకం, సంజ్ఞానాత్మకం అయి ఉంటుంది. భక్తి మార్గం చిదాత్మకం, ఉద్వేగాత్మకం, రసజ్ఞత్వకం కాగా, కర్మయోగం చర్యల ద్వారా చిదాత్మకం, శక్తి సంపన్నం అవుతుంది. ప్రతి యోగము కూడా తన స్వాభావికశక్తికి అనువైన మార్గాలలోనే నడుస్తుంది. అయితే చివరికి శక్తి అంతా ఒక్కటే. అంతా అచ్ఛమైన ఆత్మశక్తే. కానీ సాధారణ జీవన, దైహిక, మానసిక క్రమంలో ఈ సత్యం ప్రకృతిమాత యొక్క వ్యాప్తి చెందు, విభజించు, పంపకం చేయు చర్యల వలన మరుగున ఉండిపోతుంది. ఈ పరిణామం మన సాధారణ కార్యవిధులలో సహజమే అయినప్పటికీ చివరకు బయటపడుతుంది. ఎందువల్లనంటే భౌతికశక్తి అంతా ప్రాణిక, మానసిక, చైత్యక, ఆధ్యాత్మిక శక్తిగా నిక్షిప్తమై యుంటుంది. చివరలో ఆ ఏకైక శక్తి వివిధ రూపాలలో విడుదలకాక తప్పదు. ప్రాణికశక్తి ఇతర శక్తులను మరుగునపడిన

వాటిని కార్యరూపంలో విడుదల చేస్తుంది. మనస్సు తనే ప్రాణ, శరీరాల శక్తుల పైనా, వాటి చర్యల పైనా ఆధారపడి పనిచేస్తూ పూర్తిగా వృద్ధిచెందని ఆధ్యాత్మిక, చైత్యకశక్తిని తనలో దాచి ఉంచుతుంది. యోగము ద్వారా చెదరగొట్టు, పంపిణీ చేసే చర్యల లోనుంచి ఏ శక్తినైనా తీసుకొని దాన్ని అత్యున్నత స్థితికి లేవనెత్తి ధారణ చేసినప్పుడు అది ఆత్మశక్తిగా అభివ్యక్తమై అతి ప్రధానమైన ఏకత్వాన్ని వెలువరిస్తుంది. ఈ విధంగానే హఠయోగ ప్రక్రియకి కూడా శుద్ధచైత్యక, ఆధ్యాత్మిక ఫలితాలుంటాయి. రాజయోగంలో చైత్యకమార్గం ద్వారా ఆధ్యాత్మికసిద్ధి లభిస్తుంది. చివరకు ఈ త్రివిధ యోగవిధానం దాని ప్రయత్నాలలో, లక్ష్యాలలో మొత్తం మీద మానసికముగానూ, ఆధ్యాత్మికముగానూ కనిపిస్తుంది. కానీ లభించే సిద్ధి మాత్రం మిగతా మార్గాలలో లభించే సిద్ధి మోస్తరుగానే పరిణమిస్తుంది. ఆ మార్గాలలో ఫలితాలు చాలా అయత్నసిద్ధంగా, అసంకల్పిత వికాసంగా వెలువడుతుంటాయి. ఆ కారణంగానే ఆత్మశక్తే యావత్ శక్తిమూలం కాబట్టి అది ఒక దిశలో పరాకాష్ఠను చేరినప్పుడు దాని ఇతర సాధ్యతలు కూడా ఉన్నవి వున్నట్లుగా గానీ, లేక వికసనమందే దిశలో నున్నట్లుగా గాని కనబడతాయి. ఈ విధమైన ఏకీభావం వల్ల యోగసమన్వయం సాధ్యమనే విషయం సూచితమవుతుంది.

తాంత్రికమార్గం కూడా స్వాభావికంగా ఒక సంకలనమే. అది ఒక బృహత్తర విశ్వసత్యాన్ని ఆధారంగా చేసుకుని వ్యక్తి రెండు మూలస్తంభాలకు కట్టుబడి ఉంటాడనీ, వాటి పూర్తి సంఘీభావమే వ్యక్తి ఉనికికి మూలమనీ నమ్ముతుంది. అవి ఈశ్వరుడు, శక్తి; లేక పురుషుడు, ప్రకృతి. ప్రకృతి పురుషుని శక్తి అయితే, పురుషుడే శక్తి రూపము. మానవ స్వభావాన్ని పురుషశక్తిగా వర్ధిల్లచేయడమే తాంత్రికవిధానము. మొత్తం మానవప్రకృతిని ఆధ్యాత్మికపరమైన మార్పుచెందుటకు అది సేకరిస్తుంది. దాని కార్యసరళి బలవత్తరమైన హఠయోగవిధానంగానే ఉంటుంది. ముఖ్యంగా ఈ ప్రక్రియలతో వివిధ నాడీచక్రాలను వికసింపచేసి జాగృతమైన కుండలినీశక్తిని వాటి గుండా బ్రహ్మరంధ్రం దాకా ప్రవహింపచేస్తుంది. ఇంకా ఈ ప్రక్రియల్లో రాజయోగంలో మాదిరి పవిత్రీకరణం యొక్క సూక్ష్మప్రాధాన్యత, ధ్యానం, ధారణల ఆవశ్యకత, సంకల్పశక్తి ప్రభావము, భక్తివల్ల కలిగే ప్రేరణశక్తి, జ్ఞానమార్గం కనిపిస్తాయి. అయితే ఈ విధంగా ప్రత్యేక యోగవిధానాలను సంయోగం చేయడంతో ఇది ఆగిపోదు. అంతా సంశ్లేషణాత్మకంగా చేయడంతో యోగపరిధిని రెండు దిశల్లో విస్తృతం

చేస్తుంది. మొదటగా మానవునిలో ఉబికిపడే అతని వివిధ గుణగణాలను, వాంఛలను, చర్యలను తీసుకొని, అతని ప్రేరణలపై ఆత్మనియంత్రణే ప్రధాన లక్ష్యంగా వాటిని తీవ్రమైన శిక్షణకు గురిచేసి, వాటిని దివ్య చిదాత్మస్థాయికి ఉద్గమింపచేయడమే పరమప్రయోజనంగా చేపడుతుంది. దీనికి తోడు కొన్ని ప్రత్యేక యోగవిధానాలలో మాదిరిగా కేవలం ముక్తిని పొందడమే అన్నిటినీ మించిన ఏకైక లక్ష్యంగా చేసుకోకుండా పరమాత్మ శక్తి చిదానందసుఖానుభవాన్ని తన ధ్యేయాలలో ఒకటిగా చేర్చుకుంది. మిగిలిన యోగమార్గాలలో ఈ అనుభవం యోగమార్గంలో లభించే ఆయాచిత ఫలంగా తీసుకుంటారే తప్ప దాన్నే ధ్యేయంగా చేసుకోరు. ఇది సాహసోపేతమైన గురుతర విధానము.

మేమనుసరిస్తున్న సమన్వయ యోగంలో యోగసాధ్యతలను వేరొక దృక్పథంతో సంగ్రహించిన అన్యసూత్రం ఆధారంతో సాధన చేస్తున్నాము. ఇది వేదాంత విధానంగా ప్రారంభించి తాంత్రిక లక్ష్యాలను అందుకునే ప్రయత్నము. తాంత్రిక మార్గంలో అత్యంత ప్రాధాన్యత వహించేది పరమశక్తే; అదే ఆత్మను తెలుసుకోడంలో కీలకపాత్ర వహిస్తుంది. మా యోగసమన్వయంలో అన్నిటిలోకీ అతి ముఖ్యమైనది ఆత్మే. అదే శక్తిని కైవసం చేసుకునే రహస్యమౌతుంది. తాంత్రికమార్గం అట్టడుగున ప్రారంభమై వివిధ శ్రేణుల ద్వారా శిఖరాగ్రం చేరుతుంది. అందువల్ల దాని ప్రాథమిక భారం నాడీమండలంపైనా, వాటి చక్రాలపై పనిచేసే జాగృతశక్తిపై యుంటుంది. ఈ షట్కమలాలను వివృతం చేయడమంటే ఆత్మశక్తిశ్రేణులను వికసింపచేయటమే. మా యోగము మనిషిని దేహంలోని ఆత్మగా గాక మనసులోని ఆత్మగా పరిగణించి ఆ స్థాయిలో మొదలుపెడితేనే సమర్థవంతంగా ఉంటుందని తలుస్తుంది. ఆ పద్ధతిలోనే మనసులోని ఆత్మశక్తితో వ్యక్తిని పారమార్థీకరించి, ఆత్మను ఉన్నత ఆధ్యాత్మికశక్తికి అస్తిత్వానికి ఉన్మీలనం చేసి ఆ విధంగా సమకూరిన ఉన్నతశక్తితో పరిపూర్ణత సాధించి తద్వారా స్వభావాన్నంతనూ చర్యాత్మకంగా చేస్తుంది. ఆ కారణంగానే మా ప్రయత్నం మొదట మానసిక ఆత్మశక్తులను ఉపయోగించుకోవడంతో ప్రారంభమై, జీవాత్మలోని జ్ఞానం, కర్మ, ప్రేమలకు ద్వారం తెరవడానికి దారితీస్తుంది. దాని తర్వాత హఠయోగ పద్ధతులను వదిలేయవచ్చు. అయితే అది అరకొరగా అభ్యాసం లోకి రావచ్చు. రాజయోగపద్ధతి పాటించడం కేవలం యాదృచ్ఛికం. అతి దగ్గర దారిలో ఆధ్యాత్మికశక్తినీ, జీవినీ విస్తృతంగా అభివృద్ధిచేయాలనీ తద్వారా మానవ

జీవనశ్రేణిలోని విముక్త స్వభావాన్ని దైవీకృతం చేయాలనుకోవడమే ఉత్తేజభరిత ప్రేరణ అయింది.

మేమనుకున్న సిద్ధాంతం ప్రకారం ఆత్మ శరణాగతి పొందడం మానవుని దైవ తంగా, చైతన్యంగా, శక్తిగా, దివ్యానందంగా మలుచుకోవడం, జీవి అన్ని స్థానాలలోనూ ఆత్మసంయోగాన్ని పొందడం, మనోమయ పురుషునిగా ఏ అడ్డుతెరా లేకుండా దైవమే ఈ పరికరానికి యజమానిగా, ప్రభువుగా ఉండడం, ఆ ప్రత్యక్ష ఉనికితో, కాంతితో వ్యక్తి ప్రకృతిశక్తు లన్నిటిలోనూ దివ్యజీవితం గడిపే పరిపూర్ణునిగా తయారు కావడము. ఈ విధంగా యోగలక్ష్యాలను ఇంకా విస్తృతపరిధిలోకి తీసుకొనివస్తాము. సర్వసాధారణంగా మానవుని ఆత్మను ప్రస్తుత అజ్ఞానస్థితి నుంచి, పరిమితుల నుంచీ తప్పించి ఆధ్యాత్మికజీవిగా మలిచి తనలోని ఆత్మస్వరూపంతోనూ, దివ్య త్వంతోనూ ఐక్యం కావటమే యోగంలో ప్రాథమిక లక్ష్యంగా ఉంటుంది. కానీ ఆ తర్వాత ఇదే సంపూర్ణ చరమధ్యేయ మవుతుంది. అక్కడ ఆత్మ ఆనందస్థితిని పొందుతుంది; అంటే అది ఆత్మనిశ్శబ్దతలో మానవప్రకృతిని, వ్యక్తినీ విలీనం చేయడం కానీ, లేక ఉన్నత భూమికలో వేరొక అస్తిత్వాన్ని పొందటం కానీ జరుగుతుంది. తంత్రయోగంలో ముక్తిపొందటమే చరమలక్ష్యమైనా అదే పూర్తి లక్ష్యం కాదు. దానితో పాటు ఆధ్యాత్మికశక్తి పూర్తి పరిపూర్ణతను, ఆనందానుభూతిని, మానవ జీవితంలోని వెలుగును, సంతోషాన్ని కైవశం చేసుకుంటారు. అంతేకాక అన్ని వైరుధ్యాలను, వ్యతిరేకతలను అధిగమిస్తూ ముక్తి, బ్రహ్మాండ చర్యలు, సుఖాస్వాదనలు ఏకమైనటువంటి పరమసుఖానుభవాన్ని ఈషణ్మాత్రకంగా పొందగలుగుతారు. మన ఆధ్యాత్మిక సాధ్యతలను ఇంత విస్తృతదృష్టితో ఆలోచించి, ప్రారంభించి దానికి పూర్తి సార్ధకత ఉండేటట్లు వేరొక పరమార్థాన్ని కూడా జోడిస్తున్నాము. మనిషిని కేవలం దైవంతో పారలౌకిక ఏకత్వం పొందటానికే జీవిస్తున్న వ్యక్తిగా కాకుండా సకలజీవులలో, సర్వప్రకృతిలో ఒక్కటి కాగల సార్వత్రికజీవిగా గుర్తిస్తాము, ఈ విధంగా అతిశయించిన దృక్పథాన్నికి పూర్తి ఆచరణీయత కల్పిస్తాము. ఆత్మ వైయక్తిక ముక్తి, దైవంతో ఆత్మ సమైక్యత, చైతన్యం, ఆనందం అనుభవించటమే ఎల్లప్పుడు ప్రధాన యోగలక్ష్యము. దైవంతో విశ్వగత సమైక్యత రెండవ లక్ష్యము కావాలి, కాని అందులో నుంచే మూడవ లక్ష్యం వెలువడుతుంది. ఒక సానుభూతితో పాల్గొనడం ద్వారా ఒక పారమార్థిక ప్రయోజనాన్ని సిద్ధింపచేసుకోవటం సకల జీవులతో

కూడిన సర్వేశ్వరునితో సమైక్యం కావటంలోని అంతరార్థం. ఆ తర్వాత అతని వ్యక్తిగతమైన యోగం మానవజాతిలో దైవప్రకృతి సాగించే సామూహిక యోగంలో ఒక భాగమైపోతుంది. ముక్తిని పొందిన వ్యక్తి జీవి తన ఆత్మలోనూ, అంతరాత్మలోనూ నెలవైన దైవత్వంతో ఏకమై మానవత్వంలో దైవం సంపూర్ణంగా వెల్లివిరిసేటట్లు చేయటానికై స్వయంపరిపూర్ణక ఉపకరణంగా తయారవుతాడు.

ఇలా వెల్లివిరియటానికి రెండు అవధులున్నాయి. తొలుతగా ప్రత్యేకత కలిగిన జీవాత్మ పరమాత్మతత్వంతో ఏకం కావడము; తర్వాతగా మానసిక ప్రవృత్తి అనేది దివ్యప్రకృతి యొక్క ఛిద్రరచనే కానీ, దివ్యజీవిగా ఉండాలని తయారైన యదార్థ రచన కాదు కాబట్టి ఆ దివ్యప్రకృతికి ఏమాత్రం తక్కువ కాకుండా అంటే అధమ మానసికస్థాయిని మించిన దాని అత్యుత్తమ రూపాలను పొందటము. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మానసికస్థాయి నుంచి పూర్తి చిదాత్మస్థితికీ, అతిమానసస్థితికీ ఎదిగే పరిపూర్ణత కోసం ఆకాంక్షించాలి. అందుకని ఈ జ్ఞాన, కర్మ, ప్రేమల సమగ్ర యోగం తన ధ్యేయాన్ని పొడిగించుకోవాలి. ఆధ్యాత్మిక, విజ్ఞానమయ ఆత్మపరిపూరక యోగం కావాలి. పారలౌకిక జ్ఞానం, సంకల్పం, ఆనందం అనేవి ఆత్మను అనుసంధానం చేసే పరికరాలు కావటం వల్ల వాటిని సాధించాలంటే పరమాత్మతత్వంగా కావాలి. ఆ విధమైన పరమాత్మతత్వం పొందడమనేది మన యోగంలో ప్రథమ లక్ష్యం కావాలి. దైవం వ్యక్తి ఆత్మలో తన విజ్ఞానం పరిపూర్ణంగా వెల్లివిరియచేయటానికి ముందు మనోమయపురుషుడు దైవంతో ఏకత్వం దిశగా వృద్ధి పొందాలి. ఆ కారణంగానే జ్ఞానం, కర్మ, ప్రేమల త్రివిధమార్గం మా యోగం మొత్తానికి కీలక సూత్రంగా ఏర్పడింది. మనస్సు ద్వారా ఆత్మ మహోన్నతస్థాయికి చేరి అక్కడ నుంచి ఊర్ధ్వముఖంగా దైవంతో ఏకమైపోయే ప్రత్యక్ష విధానం ఇదే కాబట్టి యోగమార్గం సమగ్రంగా ఉండాలని చెపుతున్నాము. కేవలం అనంతత్వంలో లీనమైపోవడంకానీ భగవంతునిలో ఐక్య మైపోవడంకానీ మా లక్ష్య మైతే, పూర్ణయోగమే అవసరం లేదు. అది వ్యక్తి తానుగా సృష్టికి మూలకారణమైనదాని దగ్గరకు ఉద్గమించడంతో తృప్తిపొందటానికే అవుతుంది. అది తప్పితే అదే ముఖ్య లక్ష్యానికి పూర్ణయోగం అవసరం లేదు. ఎందుకంటే, ఏ ఒక్క ఆత్మప్రవృత్తితోనైనా భగవంతుని చేరవచ్చు.... ప్రతి ఒక్కటి అత్యున్నతస్థాయి చేరటం ద్వారా నిరపేక్షస్థితి పొందవచ్చు.... శత కోటి మార్గాలు అనంతుని దగ్గరకే చేరతాయి. విజ్ఞానమయకోశాన్ని చేరడమే పరి

పూర్ణమైన ఆనందం. అది అఖండాత్మ స్థితిని, దివ్యప్రకృతిని పొందడమే. ఇంకా మానవప్రకృతిని పూర్తిగా పైకి లేవనెత్తి దివ్యశక్తిగా చేసి దివ్య అత్మ అస్తిత్వాన్ని కలిగించడమే అవుతుంది. దీని కోసమే యోగవిధానానికి సమైక్య సంపూర్ణత అవసరము.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: అమరవాది వేంకటరామ శాస్త్రి, అమరవాది ప్రభావతి

దైవపరిపూర్ణత — మానవ పరిపూర్ణత


మనిషియొక్క దివ్యపరిపూర్ణత మన లక్ష్యం అయినపుడు ముందుగా మనిషి యొక్క సంపూర్ణ పరిపూర్ణతకు సంబంధించిన సారభూత అంశాలు ఏవో మనం తెలుసుకోవాలి. తరువాత మానవ పరిపూర్ణత నుండి వేరుచేసి చూపే దివ్యపరిపూర్ణత అంటే మనం చెప్పుకొనే అర్థం ఏమిటో తెలుసుకోవాలి. మనం మనిషి అని చెప్పుకొనే అతను ఒక జీవిగా, తనను తాను అభివృద్ధి చేసుకోగల సమర్థుడు. పరిపూర్ణత యొక్క ఒక ఆదర్శవంతమైన స్థాయిని అతని మనస్సు ఊహించి, తన ముందు నిలుపుకొని దానిని సాధించడానికి ఎంతో కొంత పూనుకొంటుంది. ఇదే చింతనాత్మకమైన మానవజాతి కంతటికీ సర్వ సామాన్య సిద్ధాంతం. ఒక అత్యంత ముఖ్యమైన జీవితలక్ష్యాన్నొకదాన్ని ఏర్పరుచుకొని సాధించడం సాధ్యమని భావించేవాళ్ళు తక్కువగానే ఉన్నప్పటికీ చింతనశీలియైన మానవజాతి కంతటికీ ఈ సూత్రమే ఆధారం. కాని ఈ ఆదర్శాన్ని కొంతమంది లౌకిక పరివర్తనగానే భావిస్తారు. మరి కొంతమంది దీన్ని మతపరమైన మార్పుగా భావిస్తారు.

బాహ్యజీవితానికి సంబంధించిన, సాంఘిక, కర్మ సంబంధమైన వ్యాపారాలలో, మన తోటివారితోనూ, పరిసరాలతోనూ మరింత సహేతుక, దృక్పథంతో, వ్యవహరించడంగానూ, మరింత మంచిగానూ, మరింత సమర్థవంతమైన పౌరునిగా విద్యుక్త ధర్మాలను నిర్వహించడంగానూ, మరింత శుభప్రదమైన, సమృద్ధమైన, దయాదాక్షిణ్యాలుగల, సుఖవంతమైన జీవితాన్ని జీవించడంగానూ, జీవితంలో సంప్రాప్తించే అవకాశాలను మరింత న్యాయబద్ధమైన, మరింత సామరస్యం నిండిన ఆనందంతో అనుభవించడంగానూ ఈ లౌకిక పరిపూర్ణతను కొంతమంది కొన్ని సమయాల్లో

అర్థం చేసుకొన్నారు. బుద్ధిని, సంకల్పాన్ని విచక్షణను నిర్మలం చేసుకొని ఉద్ధరించడం, స్వభావంలో శక్తిని, సామర్థ్యాన్ని ఇనుమడింపజేసుకొని క్రమబద్ధీకరించడం, ఒక ఉదారమైన నైతిక, ఒక సమృద్ధమైన సౌందర్యారాధాన ఒక సున్నితమైన భావోద్విగ్నత, మరింత ఆరోగ్యవంతమైన, చక్కగా నియంత్రించబడే ప్రాణిక, భౌతిక అస్తిత్వాన్ని కలిగి వుండడమనే ఆంతరిక స్వీయవిషయానికి సంబంధించిన ఆదర్శంగా మరి కొంతమంది భావించారు. ఒక్కొక్కపుడు మిగతావాటి నన్నింటినీ దాదాపు త్రోసి రాజంటూ ఒకే అంశానికి ప్రాధాన్యత నీయడం జరిగింది. మరికొన్ని సమయాల్లో, మరింత విశాలమూ, మరింత సమతుల్యత గలిగిన మనస్సుల్లో మొత్తం సామరస్యతే సంపూర్ణ పరిపూర్ణతగా భావించబడింది. విద్యలోనూ, సాంఘిక సంస్థలలోనూ మార్పును బాహ్య ఆలంబనగా ఉపయోగించుకొన్నారు. లేదా ఆంతర వ్యక్తిత్వపు పరిపూర్ణతను నిజమైన ఉపకరణంగావించుకున్నారు, లేదా బాహ్యజీవనం యొక్క పరిపూర్ణత, అంతర వ్యక్తిత్వపు పరిపూర్ణత అనబడు రెండు లక్ష్యాలు చక్కగా ఒకటైపోయాయి.

కాని లౌకిక లక్ష్యం, ప్రస్తుత జీవితం, అది అందించే అవకాశాలను తన కార్య క్షేత్రంగా చేసుకొంటుంది. మతం అందుకు విరుద్ధంగా మరణానంతరం మరొక జీవనానికి తనను తాను సిద్ధం చేసుకోవడాన్ని తన లక్ష్యంగా తన ముందు పెట్టుకొం టుంది. మతం యొక్క అత్యంత సామాన్య ఆదర్శం ఒక విధమైన పవిత్రత కలి గిన మహాత్ముడు గావడం. దైవకృపచే అపరిపూర్ణ మరియు, పాపియైన మానవునిలో మతమార్పిడి ద్వారా, లేదా శాస్త్రం విధించిన ధర్మాచరణ ద్వారా గాని, మార్పు తీసుకురావడం దాని సాధనోపాయం. మతం తన లక్ష్యంలో ఒక సాంఘిక పరివర్తన కూడా చేర్చవచ్చు. కాని భక్తిభావం కల జీవనవిధానాన్ని అంటే సాధుజన సౌభ్రా తృత్వం, స్వర్గరాజ్యాన్ని భువిపై ప్రతిబింబించే భగవంతుని రాజ్యం అనే ఒక సామాన్య మతపరమైన ఆదర్శానికి సంబంధించిన మార్పు మాత్రమే అవుతుంది.

ఇతర అంశాలలో లాగానే ఈ విషయంలో గూడా మా సమన్వయ యోగలక్ష్యం మరింత సమగ్రమైనదై, సర్వతోముఖమైనదై వుండాలి. ఈ అంశాల నన్నింటినీ లేదా ఆత్మ-పరిపూర్ణత యొక్క విశాల ప్రేరణకు సంబంధించిన ఈ ధోరణు లన్నింటిని సమన్వయం చెయ్యాలి లేదా వాటిని ఏకం చేయాలి. దాన్ని విజయ వంతంగా చేయాలంటే, సాధారణ మతసిద్ధాంతం కన్న విశాలమైన లౌకిక సిద్ధాంతం కన్న ఉన్నతమైన సత్యాన్ని అది స్వంతం చేసుకొని తీరాలి. సమస్త జీవనమూ ఒక



రహస్యయోగం, తనలో దాగివున్న దివ్యసూత్రాన్ని ఆవిష్కరించుకొని సాకారం చేసుకొనేవైపు సాగే విశ్వప్రకృతి యొక్క ఒక అస్పష్ట వికసనం. తనలోనూ, ప్రపంచం లోనూ గల పరమాత్మశక్తికి తన ఉపకరణాలైన జ్ఞానం, సంకల్పం, కర్మ, జీవితాలను ఉన్మీలనం చేయడం ద్వారా మానవునిలోని దివ్యమూలం క్రమంగా అస్పష్టత నుండి స్పష్టపడుతూ, మరింతగా తనను తానెరుగుతూ, ప్రకాశవంతమౌతూ, మరింతగా తనను తాను మానవునిలో ఆవహింపజేసుకొంటుంది. మనఃప్రాణ దేహాలు, మన స్వభావము యొక్క సమస్త రూపాలు ఈ వికాసానికి ఆలంబనాలు. కాని వాటి కావలనున్న దేనికో ఉన్మీలనం కావడం ద్వారా మాత్రమే అవి తమ చరమ పరిపూర్ణతను కనుగొనగలవు. ఎందువల్లనంటే మనిషి వీటి మొత్తం మాత్రమే గాదు అనేది మొదటి కారణం. రెండవ కారణం, ఇవి కాక ఇంకా ఆతడే మై వున్నాడో, అదే అతని సంపూర్ణత యొక్క కీలకం. అతని అస్తిత్వం యొక్క ఉన్నత మరియు విశాల వాస్తవికతను అతనికి ఆవిష్కరింపజేసే వెలుగును తీసుకొచ్చేది అదే.

ఒక మహనీయ జ్ఞానం వల్లనే మనస్సు సాఫల్యమౌతుంది, మనస్సు దాని యొక్క అర్థప్రకాశం మాత్రమే. ఒక మహనీయశక్తి సంకల్పంలో తన పరమార్థాన్ని కనుగొంటుంది జీవితం. వాటి యొక్క బాహ్యసంబంధమైనది ఇప్పటికీ అస్పష్టంగా పనిచేస్తున్నదే ఈ జీవితం. అస్తిత్వపు శక్తి యొక్క ఒక ఉపకరణంగా చివరకు ఉప యోగపడడమే దేహం యొక్క చరమ లక్ష్యం. అస్తిత్వపు ఆ శక్తికి ప్రస్తుత దేహం ఒక భౌతిక ఆధారం, పదార్థరూప ప్రారంభ బిందువు మాత్రమే. అవి అన్నీ తమంత తాము మొదటగా అభివృద్ధి చెంది తమ సాధారణ సంభావ్యతలను తెలుసుకోవాలి. మన సాధారణ జీవితం అంటే ఈ శక్యతలను వాస్తవం చేయ ప్రయత్నించడం, ఈ విధమైన సన్నద్ధతకు, ప్రయోగాత్మక స్వీయ శిక్షణ కుద్దేశించబడిన ఒక్క అవకాశం. అస్తిత్వం యొక్క మహనీయ సత్యపు సుసంపన్న శక్తికి సంబంధించిన ఈ అభివృద్ధి వల్ల దానిని మరింత అర్థవంతంగా ఉపయోగించడంతో వృద్ధిచెందిన సామర్థ్యం వల్ల అది కార్యనిర్వహణకు చక్కగా తయారుచేయబడిన కార్య క్షేత్రం అవుతుంది. అందువలన ఆ సత్యానికి జీవితం ఉన్ముఖం కానంతవరకు దానికి పరిపూర్ణ సాఫల్యత సిద్ధించదు.

బౌద్ధికమైన, సంకల్పపరమైన, నైతికపరమైన, భావోద్వేగపరమైన సౌందర్యో పాసనపరమైన, దేహపరమైన శిక్షణ మరియు అభివృద్ధి అంతా చాలా మంచిదే.

కాని, అవి పరమాత్మ శక్తి యొక్క సాన్నిధ్యానికి చేరి, ఆ శక్తికి ఉన్మీలనమై దాని ప్రత్యక్ష కార్యనిర్వహణకు అంగీకరించకపోయినట్లైతే, చివరికి ముక్తం చేసే, ప్రకాశవంతం చేసే ఏ విధమైన లక్ష్యం లేకుండా ఒక వృత్తంలో సదా పరిభ్రమిస్తూండే చలనాలుగా మాత్రమే తయారవుతాయి. మన యదార్థ పరిపూర్ణతకు అనివార్య నిబంధనమైన మొత్తం అస్తిత్వపు మార్పిడి జరిగేటట్లు ఈ ప్రత్యక్ష కార్యాచరణ చేస్తుంది. పరమాత్మ యొక్క సత్యంలోనికి, శక్తిలోనికి యెదగడం, సరాసరి పనిచేయడం ద్వారా, ఆ శక్తి తనను తాను వ్యక్తం చేసుకొనేవిధంగా, యుక్తమైన ప్రవాహమార్గం — దైవంలో మానవుని ఆవాసం, మానవజాతిలో పరమాత్మ యొక్క దివ్యజీవితం — కావడం అనేది ఆత్మ-పరిపూర్ణతకు సంబంధించిన పూర్ణయోగం యొక్క మూల సూత్రం, మొత్తం యోగలక్ష్యం అవుతుంది.

ఈ పరివర్తనా ప్రక్రియ యొక్క కృషిలో తప్పనిసరి ఆవశ్యకత వల్ల రెండు దశ లుండి తీరాలి. మొదటిది మనిషి స్వప్రయత్నం. అతడు తన అంతరాత్మ, మనస్సు, హృదయాల వల్ల ఈ దివ్యసంభావ్యతను తెలుసుకొన్నపుడు అదే జీవితపు యదార్థ లక్ష్యమని తనను తాను అందుకు సంసిద్ధం చేసుకొనడానికి, తనలోని నిమ్న కార్యకలాపానికి సంబంధించినదాని నంతా వదిలించుకొనడానికి, ఆధ్యాత్మిక సత్యానికి, దాని శక్తికి అతడు ఉన్మీలనమైయ్యే దారి కడ్డుగా నిలిచేదానినంతా వదిలించుకొనడానికి ఆ వైపు తిరగాలి. ఈ స్వేచ్ఛ వల్ల అతని ఆధ్యాత్మిక సత్తాను వశం చేసుకొని, అతని సహజ చలనాల నన్నింటినీ ఆధ్యాత్మిక సత్తా తనను తాను వ్యక్తపరచుకొనే నిరాటంక మార్గాలుగా కాగల విధంగా తయారుగావడానికి అతడు ఆ వైపు తిరగాలి. ఈ విధమైన మలుపు ద్వారా, తన లక్ష్యాన్నెరిగినటువంటి యోగం, తనకు తెలిసి చేసే యోగం ప్రారంభమౌతుంది. ఒక నూతన జాగృతి చోటు చేసుకుంటుంది. జీవిత పరమావధి ఉన్నతదిశగా పరివర్తన చెందుతుంది. మనః ప్రాణ దేహాల సాధారణ కార్య క్షేత్ర వలయాన్ని దాటి ఆవలకు పయనించలేని ప్రస్తుత మామూలు జీవన ప్రయోజనాల కొరకు బౌద్ధిక, నైతిక, తదితర స్వీయశిక్షణ అయినట్లైతే మనం ఇంకా అజ్ఞాన, అప్రకాశ, విశ్వప్రకృతి యొక్క సన్నాహక యోగంలో మాత్రమే ఉన్నట్లవుతుంది. మనం ఇంకా సాధారణ మానవ పరిపూర్ణతను మాత్రమే సాధించ చూస్తున్నామన్న మాట. దైవం కోసం, దివ్యపరిపూర్ణత కోసం ఆధ్యాత్మిక ఆకాంక్ష, మన సమస్త అస్తిత్వంలో ఆయనతో ఐకమత్యం, మన సమస్త

స్వభావంలో ఒక ఆధ్యాత్మిక పరిపూర్ణత నెలకొనడం అనేవి ప్రభావవంతమైన పరివర్తనా చిహ్నం అవుతుంది; మన అస్తిత్వం, జీవనం యొక్క ఒక గొప్ప సమగ్ర మార్పునకు ముందుగా లభించే శక్తి అవుతుంది.

పురుష ప్రయత్నం వల్ల ప్రాథమిక పరివర్తన, ప్రప్రథమ మార్పు సాధించవచ్చు. మన మానసిక ప్రేరణలు, మన నడవడిక, చిత్తవృత్తి, సాధికారత, ప్రాణిక, భౌతిక జీవన కర్మోపశమనం లేదా పరివర్తన చెందిన కర్మను, హెచ్చుతగ్గులుగా ఆధ్యాత్మీకరించడంగా భావించవచ్చు. పరివర్తన చెందిన ఈ కర్తృత్వభావనను మనోమయజీవి దైవంతో ఏదో విధమైన సంపర్కం పెట్టుకొనేందుకు, ఒకటై వుండేందుకు మానవ మనస్తత్వంలో దివ్యస్వభావం కొంత పాక్షికంగానైనా ప్రతిబింబించడానికి ఆధారంగా చేసుకోవచ్చు. ఏ సహాయం లేకుండా, లేదా పరోక్షసాయాన్ని పొందుతూ చేసే కృషితో మనిషి పోగలిగింది అంతవరకే. ఎందుచేతనంటే అది మనస్సు యొక్క కృషి గనుక, మరియు మనస్సు తనను దాటి తాను పైకి శాశ్వతంగా పోలేదు గనుక. మహా అయితే అదొక ఆధ్యాత్మీకరించబడిన, ఆదర్శవంతమైన మనస్తత్వందాకా లేవగలుగుతుంది. ఆ సరిహద్దు దాటి ఆవలకు దూసుకుపోతే, అది తన మీద తన అదుపును కోల్పోతుంది, జీవితం మీద పట్టును కోల్పోతుంది. సమాధిస్థితిలో మునిగిపోయే స్థితి కన్నా లేదా నిష్క్రియతాస్థితి కన్నా చేరుకొంటుంది. ఒక మహనీయ శక్తి ప్రవేశించి జీవుని యొక్క సమస్త కర్మను తన అజమాయిషీలోకి తీసుకున్నప్పుడు మాత్రమే మరింత గొప్ప పరిపూర్ణత సాధ్యమౌతుంది. మనం ఆకాంక్షించే దైవం మన యోగేశ్వరుడై, అస్తిత్వం మొత్తం ఆధ్యాత్మికమైన ఆదర్శవంతమైన మార్పుకు లోనయ్యేంతవరకు ఈ మహనీయ దివ్యశక్తి హస్తాల్లోనికి సమస్త కర్మను నిరంతరం సమర్పించడం, పురుష ప్రయత్నానికి బదులుగా ఆ శక్తిని పూనుకొని పనిచేసేటట్లు చేయడం, ఈ యోగం యొక్క రెండో దశ అవుతుంది.

మన యోగం యొక్క ఈ ద్విలక్షణం దానిని లౌకిక పరిపూర్ణతకు సంబంధించిన ఆదర్శానికి మిన్నగా ఉద్ధరిస్తుంది. అదే సమయంలో, సమున్నతమూ, తీవ్రతరమూ అయినప్పటికీ అత్యంత సంకుచితమూ అయిన మతసిద్ధాంతాన్ని కూడా దాటిపోయేటట్లు చేస్తుంది. లౌకిక ఆదర్శం మనిషిని యెప్పుడూ కూడా ఒక మానసిక, ప్రాణిక, భౌతిక జీవిగానే పరిగణిస్తుంది. ఈ పరిమితులకు లోబడే మానవ పరిపూర్ణత అంటే మనస్సు జీవితం దేహాల పరిపూర్ణతే దాని లక్ష్యం. బుద్ధి, జ్ఞానముల పరిపూర్ణత,

సంకల్పం, శక్తి, నైతికత, నడవడిక, సౌందర్యపిపాస, సృజనాత్మకత భావోద్వేగ సమతుల్యతాస్థితి, భోగపరాయణత, ప్రాణిక, భౌతిక ఆరోగ్యస్థితి, కర్మనియంత్రణ, యుక్తాయుక్త వివేచనా సామర్థ్యతలను విస్తృతం చేసుకొని సంస్కరించుకోవడాన్నే అది లక్ష్యంగా చేసుకొంటుంది. అదొక విశాలమైన, నిండైన లక్ష్యం, అయినా అది చాలినంత విశాలమైనదీ, నిండైనదీ కాదు. ఎందుచేతనంటే ఆధ్యాత్మికత అంశమని మనస్సు అస్పష్టంగా గ్రహించి, కేవలం అదేదో ఉన్నతమైన, అప్పుడప్పుడూ లేదా దేని ఫలితంగానో కలిగే అనుభవంగానో తలచి, మనస్సుకు గల అసాధారణ పార్శ్వాలలో జరిగే కర్మఫలితంగా భావించి, లేదా అది తన ఉనికికి, మనుగడకు, మనస్సు మీద ఆధారపడేది అని భావించి దానిని అభివృద్ధిచెందకుండా లేదా తగినంతగా తృప్తిచెందనీయకుండా వదలివేస్తుంది. అది మన మనస్తత్వానికి సంబంధించిన ఉదాత్తమైన, విశాల పరగణాలను అభివృద్ధిచేయ కాంక్షించినపుడు అదొక ఉన్నత లక్ష్యంగా తయారవుతుంది. అయినాగాని అది చాలినంత ఉన్నతమైంది కాదు. ఎందుచేతనంటే అది మనస్సును దాటిపోయి, మన అత్యంత విశుద్ధ హేతుబుద్ధి, అత్యంత దేదీప్యమానమైన మన మానసిక అంతఃస్ఫురణ, అత్యంత లోతైన మన మానసిక అవగాహన, అనుభూతి, అత్యంత బలీయమైన మనోసంకల్పం, శక్తి లేదా ఆదర్శవంతమైన లక్ష్యం, ప్రయోజనం, అన్నీ కూడా వెలవెలబారిన ప్రసరణలయ్యే స్థాయిని ఆకాంక్షించదు. అదీ గాక, సామాన్య మానవజీవితపు ప్రాపంచిక పరిపూర్ణతకే దాని లక్ష్యం పరిమితమై వుంటుంది.

మనః ప్రాణ దేహాల్లో చిక్కుకొన్న ఒక దివ్య ఆధ్యాత్మికజీవిగా మనిషిని సమగ్ర పరిపూర్ణతా యోగం పరిగణిస్తుంది. అందుచేత, ఆతని దివ్యస్వభావాన్ని ముక్తం చేయడాన్ని, పరిపూర్ణం చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకొంది. పరిపూర్ణంగా అభివృద్ధి చేయబడిన అతని ఆధ్యాత్మిక అస్తిత్వంలోని ఆంతరికజీవనం, ఆతని సహజసిద్ధమైన శాశ్వత జీవనగతి కావాలని ప్రయత్నిస్తుంది. మనః ప్రాణ దేహాల ఆధ్యాత్మీకం చేయబడిన కర్మను కేవలం ఆ జీవనగతి యొక్క బాహ్య అభివ్యక్తిగా చేయటానికి యత్నిస్తుంది. ఇదేదో అస్పష్టమైన, నిర్వచించనలవిగానిది లేదా పూర్తిగా గ్రాహ్యం కానిది, మానసికాన్ని ఊతంగా చేసుకొని, మానసిక పరిమితుల మీద ఆధారపడినది కాదు అనడానికి అది మనస్సు ఆవల నున్న అతిమానసిక జ్ఞానం, సంకల్పం, అతీంద్రియ సంవేదన, అంతఃస్ఫురణ, ప్రాణిక, భౌతిక కర్మ, మరియు ఆధ్యాత్మికజీవికి

సహజమైన కార్యం అనబడే అన్నింటిలో క్రియాశీలత చొప్పించటాన్ని కాంక్షించడమే కారణం. అది మానవజీవితాన్ని అంగీకరిస్తుంది. కాని భూ, భౌతిక జీవనం వెనుక గల విశాల అలౌకిక కర్మను కూడా అది లెక్కలోనికి తీసుకొంటుంది. మొత్తం జీవన మంతా తన దివ్యమూలాన్ని తెలుసుకొని, జ్ఞానం యొక్క సంకల్పం యొక్క, అనుభూతి యొక్క జ్ఞానేంద్రియం యొక్క, దేహం యొక్క ప్రతి కర్మలోనూ దివ్య మైన ఆద్య ప్రేరణను మొత్తం తెలుసుకొనగలిగేటట్లు, ఎవరి నుండి ఈ పాక్షిక, మరియు నిమ్నస్థితులన్నియు బయల్వెడలుతున్నాయో ఆ దివ్యపురుషునితో తనను తాను ఏకం చేసుకొంటుంది. లౌకిక లక్ష్యంలో ఏది తప్పక ఉండి తీరవలెనో అటువంటి దాన్ని దేన్నీ అతి తిరస్కరించదు. దానిని విస్తృతం చేస్తుంది. దాని నుండి ప్రస్తుతం దాచిపెట్టబడిన మహనీయమైన యదార్థ అర్థాన్ని కనుగొని, పరిమితమైన భూసంబంధ, మర్త్య సంబంధం నుండి, అనంత రూపం లోనికి దివ్య, అమృత విలువల లోనికి మార్చి అందులో నివసిస్తుంది.

పూర్ణయోగం మతపరమైన ఆదర్శంతో పలుచోట్ల అనుసంధానమౌతుంది. అనేక చోట్ల కలుసుకుంటుంది. అయినప్పటికీ, మహనీయమైన విశాల భావనలో దాన్ని దాటిపోతుంది. మతపరమైన ఆదర్శం ఈ భువి కావలనున్నదాన్ని మాత్రమే గాక, దానికి చాలా దూరాన ఉన్న స్వర్గం లేదా స్వర్గాలన్నింటినీ కూడా దాటి ఆవ లగా ఒక రకమైన నిర్వాణాన్ని కూడా చూస్తుంది. మానవజీవితం నుండి ఆవలగా నున్నదాని వైపు మరలడానికేది కాలక్రమేణా సాయపడ్తుందో, దానికి సంబంధించిన అంతర్గత, బాహ్యమార్పులకు దాని ఆదర్శమైన పరిపూర్ణత పరిమితం చేయబడు తుంది. పరిపూర్ణత అంటే అదొక మతసంబంధమై నైతికపరివర్తన, సక్రియాత్మకమూ, బావోద్వేగభరితమూ అయిన అస్తిత్వం ఆసాంతం పరిశుద్ధం గావడం అని మతం యొక్క ఉద్దేశం. ప్రాణిక ప్రేరణలను పూర్తిగా సన్యాసధోరణితో నిషేధించడం, తిరస్కరించడం దాని యొక్క అత్యుత్తమ స్థితికి పూర్తిగా చేరుకొనడంగా కూడా భావిస్తుంది. ఏదేమైనప్పటికీ పవిత్రమైన మరియు ధర్మబద్ధమైన నడవడికగల జీవితం ఫలితంగానూ లేదా, జీవితానికి లభించే బహుమతిగాను, పొందగలగాలని దాని మహోన్నత లక్ష్యం. మానవజీవితలక్ష్యాల దిశగా గాక, మరో విషయం వైపు వాటిని మరల్చి, కాలక్రమేణా భువికి సంబంధించిన సౌందర్యారాధన, సంకల్పం, జ్ఞానాల తిరస్కారాన్ని సాధించేంతవరకు, జ్ఞానం, సంకల్పం, సౌందర్యారాధనల మార్పును,

అది సమ్మతిస్తుంది. అది పురుష ప్రయత్నం మీదా లేదా దైవప్రభావం మీదా కర్మలు, జ్ఞానం మీదా లేదా దైవకృప మీదా, దేనిపై అది పట్టుబట్టినా, లౌకిక సంబంధమైన అభివృద్ధిలాంటి దానికోసం గాక, ఎక్కువగా మార్పుకోసమే. కాని చివరకు, లక్ష్యం మన మానసిక, భౌతిక స్వభావమార్పు గాక, స్వచ్ఛమైన ఆధ్యాత్మిక స్వభావాన్ని, అస్తిత్వాన్ని ధరించడం. అది ఇచట భువిపై సాధ్యం కాదు గనుక తత్ సంసిద్ధి కొరకది మరో ప్రపంచం లోనికి బదిలీ కావాలనీ, లేదా, సమస్త విశ్వసంబంధ ఉనికి నుండి తన స్థానాన్ని బదయాలించడం వైపు చూస్తుంది.

కాని, ఆధ్యాత్మిక అస్తిత్వం సర్వాంతర్యామి అనే అవగాహనమీద పూర్ణయోగం తనను తాను ప్రతిష్టించుకొంటుంది. దీనికి పూర్ణత్వం — ఇతర లోకాలకు పోవడం ద్వారానో లేదా విశ్వగతంగా తనను తాను లుప్తం చేసుకొనడం ద్వారానో గాక, ఇప్పుడు మనం ఎలా కన్పిస్తున్నామో దానిని సర్వాంతర్యామియైన సత్యం యొక్క చేతనలోనికి పెంపొందించుకొనడం ద్వారా సమకూడుతుంది. మన అస్తిత్వపు లోతులో మన మెప్పుడూ సారతః అదే గనుక, దానిని పొందుతాం. మతపరమైన భక్తి, ధర్మనిష్టల స్థానంలో దైవంతో సంపూర్ణంగా ఏకమయ్యే ఆధ్యాత్మిక అన్వేషణను నిలుపుతుంది. అది ఒక దైవప్రభావం ద్వారా, దైవాన్ని పొందడం ద్వారా మార్పు వైపుకు పురుషప్రయత్నంగా సాగుతుంది. కాని ఈ దైవకృప — మనం దానికా పేరు పెట్టుకొంటే — ఊర్ధ్వం నుంచి వచ్చే ఒక మార్మిక ప్రవాహం లేదా స్పర్శ కాదు. కాని అది ఒక దైవసన్నిధి యొక్క సర్వవ్యాపకమైన చర్య. అంతరాత్మలో ప్రవేశిస్తూ, దానిని వశం చేసుకొంటున్న మన అస్తిత్వం యొక్క పరమాత్మ మరియు గురువు యొక్క మనలోనే ఉన్న శక్తి అని మనం తెలుసుకొంటాం. అంతేగాక, అది మనకు చాలా సన్నిహితమైనదనీ, అది మన మర్త్యస్వభావంపై వత్తిడి కలుగ జేస్తున్నదనీ అనుభూతి చెందడం మాత్రమే గాక దాని ధర్మంలో నివసిస్తాం, ఆ ధర్మాన్ని తెలుసుకొంటాం, మన సమస్త ఆధ్యాత్మిక స్వభావం యొక్క మొత్తం శక్తిగా చేసుకొంటాం. మన నైతిక అస్తిత్వం, దైవస్వభావం యొక్క సత్యం న్యాయంగా మన మేధను దివ్యజ్ఞానప్రకాశంగా, మన భావోద్వేగాన్ని దివ్యప్రేమ ఐక్యతగా మన క్రియాశీలమైన మరియు సంకల్పశక్తికి సంబంధించిన అస్తిత్వం దివ్యశక్తి యొక్క కార్యసరళిగా, సౌందర్యోపాసనా లక్షణాన్ని దివ్యసౌందర్యాన్ని సమగ్రంగా స్వీకరించి సృజనాత్మక భోగానుభవంగా; చివరకు ప్రాణిక, భౌతిక అస్తిత్వం

యొక్క దివ్యపరివర్తనాన్ని గూడా విడువకుండా, సమగ్రంగా మార్పుచెందే చర్యగా పరిణమిస్తుంది. గత జన్మను ఒక అచేతన లేదా అర్థచేతనతో ఈ మార్పు వైపుకు అభివృద్ధి చెందుతున్న సన్నాహకంగా పరిగణిస్తుంది. యోగాన్ని ఈ మార్పును వాస్తవం చేసుకొనే బుద్ధిపూర్వకమై సచేతనా ప్రయత్నంగా పరిగణిస్తుంది. ఈ మార్పు వల్ల, రూపం మారుతున్నపుడు గూడా సమస్త మానవ మనుగడ అన్ని పార్శ్వాలతో, అంశాలతో సహా సఫలం అవుతుంది.

పరలోకాల లోని ఆముష్మిక సత్యాన్ని, జీవితాన్ని సమ్మతిస్తూనే, ఐహిక జీవితాన్ని కూడా సృష్టి యొక్క కొనసాగింపుగానూ, పృథ్విపై వ్యక్తిగత, సామూహిక జీవనం, దానిలోని పరమార్థాన్ని సూచించే ఒక శైలిగానూ సమ్మతిస్తుంది.

జగదాతీత దైవానికి ఉన్మీలనం గావడం, తనను తాను దైవంతో ఐక్యత పొందడం, తప్పనిసరి నియమం. ఇచట, స్వీయ లేక ఆత్మ-పరిపూర్ణతా యోగం జ్ఞాన, కర్మ, భక్తి యోగాలతో ఏకీభవిస్తుంది. ఎందుకనంటే పరమాత్మతోను, దివ్యచైతన్యం సచ్చిదానందంతోను సంయోగం లేకపోతే, సమస్త వస్తువులందు, జీవులందుగల దానియొక్క విశ్వజనీన పరమాత్మతో ఏకత్వం సిద్ధించకపోతే, మానవస్వభావాన్ని దివ్యస్వభావంగా పరివర్తన చేయడంగాని, లేదా, దానిని సృష్టి యొక్క దివ్యజ్ఞాన, సంకల్ప, ఆనందాల ఉపకరణంగా చేయడంగాని సాధ్యపడదు. దైవస్వభావంలో తనను తాను నిమజ్జనం చేసుకొనకుండా తద్భిన్నంగా వ్యక్తిగా, పూర్తిగా విడివడి దైవస్వభావాన్ని వశం చేసుకోవడం సాధ్యం కాదు. మనస్సులో, ప్రాణికంలో, దేహంలో ప్రత్యేకమై జీవించడం ద్వారా మానవజీవితం కొనసాగింతనంత కాలం ఈ ఐక్యత అంతరాంతరిక ఆధ్యాత్మిక ఐకమత్యంగా చెప్పబడదు. పూర్తి పరిపూర్ణత అంటే దైవాన్ని ఓ ఆధ్యాత్మిక ఐక్యత ద్వారా, విశ్వగతమైన దివ్యమనస్సు, దివ్యజీవనం, దివ్య ఆకారం ఏవైతే విశ్వమానవునికి మారుపేర్లో వాటి ద్వారా వశం చేసుకోవడమే అవుతుంది. పైగా మనిషిలో వాస్తవం అయిన దైవం యొక్క స్వీయ వ్యక్తీకరణగా మానవజీవితం యింకా అంగీకరించబడింది గనుక మన జీవితంలో దైవం యొక్క స్వభావం పూర్తిగా పనిచేయాలి, కర్మ జరగాలి. ఇది అతిమానసిక పరివర్తన యొక్క అవసరాన్ని కలుగజేస్తుంది. అతిమానసిక మార్పు ఉపరితల స్వభావపు అపరిపూర్ణ కర్మస్థానంలో, ఆధ్యాత్మిక సత్తా యొక్క స్వభావసిద్ధ కర్మను ప్రవేశపెట్టి, ఆ ఆధ్యాత్మిక సత్తా యొక్క అంగాలే అయిన మానసిక, ప్రాణిక భౌతికాలను ఆధ్యాత్మిక ఆదర్శ



తత్వంతో ఆధ్యాత్మీకరిస్తుంది, రూపాంతరం చెందిస్తుంది. సర్వోన్నత దైవంతో సంయోగం, విశ్వజనీన పరమాత్మతో ఏకత్వం, విశ్వాతీత మూలం నుండి, ఈ విశ్వజనీనత ద్వారా అతిమానసిక జీవనకర్మ అనబడే ఈ మూడు ప్రాథమిక అంశాలూ ఏకమై వ్యక్తిని అంతరాత్మ ప్రవాహమార్గంగా, సహజ ఉపకరణంగా చేసి, మానవజీవి సమగ్ర దివ్యపరిపూర్ణత యొక్క అంతః సత్యంగా రూపొందుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

శ్రీఅరవిందుల 'యోగసమన్వయం' లోని ఆణిముత్యాలు

పూర్ణయోగంలో విధిగా ఉండవలసిన విశ్వాసం:

పూర్ణయోగం అవశ్యక విధిగా ఆశించే ఒక రకమైన విశ్వాసాన్ని మనం ఈ విధంగా చెప్పుకోవచ్చును; మనలోనూ, విశ్వంలోనూ దైవం ఉనికి మీద, శక్తి మీద విశ్వాసం; ఈ విశ్వంలో జరిగేదంతా ఒకే ఒక దివ్యశక్తి క్రియాకలాపమేననీ, యోగంలో వేసే అడుగులు, వాటికుండే పెనుగులాటలు, కష్టాలు, వైఫల్యాలతో పాటు వాటి విజయాలు, సంతృప్తిచెందడాలు, గెలుపులు, అన్నీ ఆమె కార్యసరళిలో లాభం చేకూర్చేవీ, అనివార్యమైనవీ అనే విశ్వాసం; ఏకత్వాన్నీ, స్వేచ్ఛనూ, గెలుపునూ, పరిపూర్ణతనూ అందుకోగలమనే దృఢమైన బుద్ధితో, నిశ్చితాత్మతతో ఆ దైవంపై ఆధారపడి మనలోని ఆయన మహాశక్తికి పూర్తి ఆత్మసమర్పణను కలిగి ఉండటం.

*

మనం ఈశ్వరుని సన్నిధి అనుభూతిని పొంది, మన మనుగడ, చైతన్యం, ఆలోచనలు, ఇచ్ఛ, క్రియాకలాపాలన్నింటిని ఆయన హస్తగతం గావించి, అవి అన్నీ ఆయన ఆమోదంతోనే కొనసాగుతాయి అనే అనుభూతిని పొందుతూ, మనలోని ప్రతి భాగమూ, మన ప్రకృతితో సహా అన్ని విషయములందూ సర్వవ్యాపకమూ, అన్నింటి వశవర్తి అయిన ఆ పరమాత్మశక్తి అనుమతితోనే కొనసాగుతాయి అనే శ్రద్ధాభావము ఏర్పడినప్పుడు, అటువంటి అస్తిత్వము యొక్క శ్రద్ధ, పరమోచ్ఛస్థితికి చెందినదిగా

ఉంటుంది. అత్యుత్తమ పరిపూర్ణత నొందిన ఆ శ్రద్ధ దైవబలం పొందటానికి సదవకాశమై అది గట్టి పునాది అవటానికి తోడ్పడుతుంది. అది పూర్తి అయినప్పుడు తేజోమయమైన అతిమానసికశక్తి పురోభివృద్ధికి, అభివ్య క్తానికి, క్రియాకలాపాలకి అది ఆధారమౌతుంది.

(CWSA Vol. 23, 24 pp. 771, 781-782)

దివ్యశక్తి

దివ్యశక్తి యొక్క ప్రకృతి ఎలాంటిది అనగా దైవము యొక్క కాలానికి కట్టుబడని అనంతమైన శక్తి. అది విశ్వశక్తిగా కాలగమనంలో అభివ్యక్తమౌతూ విశ్వంలో సరాసరిగా అన్ని గమనాలనూ సృష్టిస్తూ, సంఘటితం చేస్తూ, పోషిస్తూ, దిశానిర్దేశం చేస్తూ ఉంటుంది. ఈ విశ్వశక్తి మొదట మనకు నిమ్నస్థాయిలో మానసిక, ప్రాణిక, భౌతిక విశ్వశక్తిగా ప్రత్యక్షంగా కనపడుతుంది. మన మానసిక, ప్రాణిక, భౌతికచర్యలన్నింటిని అది నిర్వర్తిస్తున్నది. పరిమితం చేసే అహంకారదృష్టి ఒత్తిడి నుంచి తప్పించుకోవడానికీ, అహంకారం పూర్తిగా తన పరిపాలన కొనసాగించే నిమ్నస్థాయిలలో సైతం మనం సార్వజనీనత పొందటానికీ మన సాధనలో మనం ఈ సత్యాన్ని తప్పనిసరిగా విస్పష్టంగా గ్రహించాలి. కర్మలకు మనమే కారకులం కాదనీ, మన లోనూ, అందరిలోనూ ఆ మహాశక్తియే పనిచేస్తున్నదనీ, నేను కాని, ఇతరులు కానీ కర్మలను చేయటం లేదనీ, ఒక మహాప్రకృతి దీనినంతా నడిపిస్తున్నదనీ చెప్పే కర్మయోగసూత్రం, ఇక్కడ కూడా ప్రధానసూత్రంగా ఆచరింపబడుతున్నది.

(p.762 762)

విశ్వశక్తికి మనం ఉన్మీలనమవటం:

మన క్రియాశీల అస్తిత్వంలో మన అహం భావన, మన వ్యక్తిత్వం, ప్రత్యేకపరచే మన వ్యక్తిత్వ ఇచ్ఛాశక్తుల స్థానంలో సార్వజనీనమైన దివ్య ఇచ్ఛాశక్తులను ప్రతిష్ఠించునట్లుగా ఇది పనిచేస్తుంది. అది మన చర్యలను విశ్వవ్యాపకమైన కార్యసరళితో సామరస్యపరచి, తాను సరాసరి పురుషోత్తముని ఇచ్ఛగా, సర్వమును మార్గదర్శనం చేసే ఆయన శక్తిగా తనను తాను బహిర్గంత చేసుకుంటుంది. మనం మనలోని అధమస్థాయికి చెంది కర్మ నాచరించే పరిమిత, అజ్ఞానభూయిష్ట, అపరిపూర్ణ వ్యక్తిత్వ ఇచ్ఛాశక్తుల స్థానంలో దివ్యశక్తి క్రియాశీలతను ఉంచాలి. దివ్యశక్తికి మనలను మనం

ఉన్మీలన చేసుకోవడం ఎల్లప్పుడూ సాధ్యమే. ఎందువల్లనంటే అది మన చుట్టూ ఆవరించి ఉన్నది, ఎల్లప్పుడూ మన లోనికి ప్రవహిస్తునే ఉన్నది, అదే ఆధారమై, మన అంతరంగ బాహ్యక్రియలను కావలసిన విధంగా సమకూరుస్తూ, నెరవేరుస్తున్నది. వాస్తవంలో ప్రత్యేకంగా చెప్పుకోవటానికి మనకంటూ వేరే శక్తి అనేదేమీ లేదు, కానీ మనకున్నది కేవలం ఒక వ్యక్తిగత రూపం దాల్చిన మహాశక్తి అంశ మాత్రమే అది. కాకపోతే ఆ విశ్వమహాశక్తి మనలో ఉంది, మనలో కేంద్రీకృతమై ఉన్నది, ప్రతి వ్యక్తిలో దాని మొత్తం శక్తి విశ్వంలో ఏ విధంగా ఉన్నదో ఆ విధంగానే ఉన్నది. దానిని కొన్ని పద్ధతులు, విధానాలతో, దాని మహత్తర అనంతశక్తిని, సంపన్నతను జాగృతపరచి, అధికతర కార్యసరళికి దానికి విమోచనం కల్పించవచ్చును.

(pp. 754-55)

ప్రతిదీ అనంతునిచే వ్యవస్థీకరింపబడింది:

సమస్తమూ ఆ అనంతశక్తి తనదైన అస్తిత్వం నుంచి, తనదైన చైతన్యం నుంచి అభివ్యక్తమైనవే. సమస్తమూ ఆ చైతన్యం స్వయంగా దర్శించగలిగి, స్వయంగా నిర్ణయించగలిగి, స్వయం సాఫల్యతను సాధించగలిగే శక్తి వలన అభివ్యక్తమైనవే.

అనంతుడు తన జ్ఞానశక్తిచేత తాను విశ్వంలో ఏ ధర్మం ప్రకారం అభివ్యక్తం కావాలో ఆ విధంగా, అది మన ఇంద్రియాలకు వ్యక్తమయ్యే భౌతికవిశ్వమే కాకండా, వాటి వెనుక ఏమి ఉన్నా, అవి ఏ లోకాల ఉనికికి సంబంధించినవైనా, అన్నింటిని తాను వ్యవస్థీకరించుతాడని చెప్పవచ్చును.

ప్రతిదీ దానిచేతనే వ్యవస్థీకరింపబడింది, కానీ అది ఎటువంటి అచేతనా నిర్బంధం చేతనూ, ఏ మనోవైచిత్ర్యాలు లేక కల్పనల చేతనూ కాక, తన అనంత ఆధ్యాత్మిక స్వేచ్ఛలోని అస్తిత్వపు స్వసత్యంతోనూ, తన అనంత అంతర్నిహిత సంభావ్యతాశక్తి కలిగిన వనరులతోను మరియు ఆ వనరుల నుంచి స్వయంసృష్టి కారకమగు తన ఇచ్ఛతోను వ్యవస్థీకరించబడింది. ఈ సత్యమనే ధర్మమే సృష్టించబడిన వాటన్నింటిని వాటి యొక్క సహజ ప్రకృతితో తప్పనిసరిగా ప్రవర్తించుటకు, పరిణమించుటకు అవసరమైనది.

*

మనిషిలో అంతర్లీనమై వున్న ఒక దివ్యశక్తి అతనిని స్వయం ప్రభుతను సాధించడానికి,

ఆత్మజ్ఞానప్రాప్తికి దారితీసే స్వపరిణామ ప్రక్రియకు ఒక శ్రామికుడిగా పనిచేయుటకు, బద్ధుడిని చేస్తుంది.

(pp. 785-86, 829)

మనిషి యొక్క నిజధర్మం:

మనిషి యొక్క నిజధర్మం, అతని అస్తిత్వ నియమం ఏమిటనగా అతను తన ఉనికిని గురించిన ఎరుక పెంచుకొనుటకు ప్రయత్నించుట; అస్పష్టతకు, అర్థరహిత అక్కరకు లోబడిన ఆత్మసాక్షాత్కారం బదులు ఒక ఉజ్వలమైన, చైతన్యవంతమైన, తనను తాను స్వయంగా అభివ్యక్తీకరించుకోగల ఒక నిండైన, అర్థవంతమైన ఆత్మసాక్షాత్కారం ఆకాంక్షించుట. చివరకు దానికి పరాకాష్టగా తనను తానుగా తన మహోత్కృష్టమైన నిజాత్మను తెలుసుకుని, చరించటంగాని లేక దానినే దాని సహజమైన, సమగ్రమైన ఇచ్ఛాజ్ఞానాలతో తనలో పని చేసేటట్లుగాగాని చేయాలి. (ఆత్మశక్తిని వ్యక్తం చేయగల పనిముట్టు స్వరూపమే అతని సహజసిద్ధమైన అస్తిత్వపు ఉనికి.)

(pp. 795-96)

అతిమానస దివ్యజ్ఞానం:

మానసికమైన ఆలోచనలకు కేంద్రస్థానం మనిషిలోని అహం, ప్రత్యేక వ్యక్తిగా ఆలోచించే మనిషియొక్క మూర్తి. అతిమానస మానవుడు దానికి వ్యతిరిక్తంగా ఎక్కువగా విశ్వమనస్సుతో ఆలోచిస్తాడు లేదా దానిని మించి పైకి పోగలడు కూడ...

మానసిక మానవుడు ఆలోచించేది, చేసేది అంతా అతని మానసిక పరిధి సంకుచితత్వం లేక విశాలత మీద, దాని అనుభవం మీద నిర్ధారించబడుతుంది. అతిమానసిక మానవుడి క్షేత్రం భూమినీ, దాని వెనుకగా ఉన్న లోకాలన్నింటినీ వ్యాపించి ఉంటుంది.

...మానసిక మానవుడు ఆలోచించేదీ, చూసేదీ అంతా వర్తమాన జీవనస్థితిగతుల స్థాయికి చెందినదిగా వుంటుంది. దాని ఆకాంక్ష, ఊర్ధ్వముఖంగా ఉన్నా అతని దృష్టి అన్ని వైపులా అవరోధాలతో అడ్డగించబడుతుంది... అతిమానసజీవి పైనుంచి విశాలక్షేత్రాలలో చూస్తాడు, అత్యున్నత స్థాయిలో అనంతసీమల నుంచి చూస్తాడు.

అతని దృష్టి వర్తమానానికి మాత్రమే పరిమితమై ఉండదు. కానీ కాలగమనంలో ముందుకు చూడగలదు లేదా కాలానికి అతీతంగా ఆత్మ యొక్క అవిభాజ్యతత్వాన్ని దర్శించగలదు.

*

అది మనస్సును అధిగమించగలిగి, ఉదాసీన నిశ్శబ్దంలో సద్దుమణిగి అంతరించి పోయినప్పుడే సంపూర్ణ ఆవిష్కరణ జరిగి సర్వోత్కృష్ట, సమగ్ర అతిమానస దివ్యజ్ఞానం క్రియాశీలమవగలదు.

(pp. 837-38, 861)

అన్ని యోగాలకు పునాది

సర్వశక్తివంతమైన మహాతపస్సిద్ధి, నిర్దిష్టమైన మహాభావ సాఫల్యత యోగమంతటికీ అసలైన పునాది. వాటికి ప్రతిగా మనిషిలో వీటిని మనం ఇచ్ఛ, విశ్వాసం అంటాము. ఇచ్ఛ చివరకు స్వయం సామర్థ్యాన్ని సంతరించుకుంటుంది. ఎందువల్లనంటే అది జ్ఞానానికి సంబంధించి ఉండటమే. విశ్వాసమనగా సృష్టిలో ఇంకా అనుభవసిద్ధిని పొందని యదార్థ మహాభావం, లేదా అధోచైతన్యంలో ప్రతిబింబించే పరమ సత్యం. ఇటువంటి ఈ స్వయంరూఢి అయిన మహాభావమునే గీత 'యోయచ్ఛ్రద్ధస్స ఏవసః' అని వెల్లడించింది, అనగా మనిషి ఎటువంటి విశ్వాసమును కలిగి ఉంటాడో దాని ననుసరించి లేక అతనిలోని నిశ్చితమైన మహాభావము ననుసరించి అతడు ఆ విధంగా అవుతాడు అని భావం.

(p. 44)

ఇది అతిముఖ్యమైన మహత్వపూర్ణ చర్య:

నూతన ఆధ్యాత్మికభావ శక్తి స్వీకరణను అనుమతించడం, అస్తిత్వంలో ఊర్ధ్వదిశగా భ్రమణం, ఇచ్ఛతో, హృదయపూర్వక కాంక్షతో ఒక ఉజ్వలమైన వెలుగును అందుకోవడం, ఒక కొత్త దారిలోకి మళ్ళడం లేక ఒక విప్లవాత్మకమైన మార్పును హఠాత్తుగా స్వాధీనం చేసుకోవటం. చాలా ప్రాముఖ్యమైన, మహత్వ పూర్ణమైన చర్య. ఒక విత్తనం రాబోయే సమస్తాన్నీ కలిగి ఉన్నట్లుగా, ఈ మహత్వపూర్ణ చర్య యోగం ఇచ్చే ఫలితాలన్నింటినీ కలిగి ఉంటుంది. కేవలం భావంతోగాని లేక

మేధోపరంగా గాని ఏదో ఆవల ఉచ్ఛతరమైనదాని కోసం గావించే అన్వేషణ, అది ఎంత మానసిక ఉత్సుకతతో బలంగా గ్రహించినదైనప్పటికీ, దానినే అవసరమైనదానిగా హృదయం పట్టుకొనకపోయినా, నిర్వర్తించవలసిన ముఖ్యచర్యగా ఇచ్ఛ సమ్మతించకపోయినా, అది వ్యర్థమే. ఎందువల్లనంటే ఆత్మ-సత్యాన్ని కేవలం ఆలోచనతోటే సరిపెట్టకుండా దానిలో జీవించాలి; అలా జీవించటానికి అస్తిత్వంలో సమస్తమును విధిగా ఏకోన్ముఖం చేయవలసి ఉంటుంది. యోగంలో ఏకాగ్రతా దృష్టితో ఏకోన్ముఖమై చేయబడి పొందే ఆ మహత్తరమైన మార్పు భిన్నమైన సంకల్పంతోను లేక పరిమిత శక్తితోను లేక సంశయాత్మక మనస్సుతోను సిద్ధించదు. ఎవరైతే దైవాన్ని దర్శించే ప్రయత్నం చేస్తారో వారు దైవానికే, కేవలం దైవానికి మాత్రమే తమను తాము అర్పణ చేసుకోవాలి.

(pp. 69-70)

నూతన దృష్టి కేంద్రాన్ని సృష్టించుకోవాలి:

గతంలోను, వర్తమానకాలంలోను చోటుచేసుకున్న పరిణామా లేవైతే సామాన్య భౌతికదేహము, మనస్సు కలిగిన మనిషిని రూపొందించాయో, ఆ పరిణామా లన్నింటినీ పటాపంచలు చేసి తుడిచిపెట్టివేయడాన్ని మన యోగంలో మేము ప్రతిపాదిస్తున్నాము. అంతే కాక దివ్యమానవ జాతినీ లేదా అతిమానవ ప్రకృతినీ మనలో సంఘటితంచేసే నూతనదృష్టి కేంద్రాన్నీ, నూతన విశ్వక్రియాకలాపాల సృష్టిని ప్రతిపాదిస్తున్నాము.

తన పురోబివృద్ధికి, సంతృప్తికి, అవసరాలకు ప్రాధాన్యమిస్తూ పురాతన బాహ్యావిషయాల నియమావళుల మీదనే కేంద్రీకృతమైన మనస్సులోని ప్రధానమైన విశ్వాసాన్ని, దృష్టిని కరిగించి రద్దుచేయడం దాని ప్రధమ కర్తవ్యం. ఈ విధంగా ఉపరితలం మీదనే దృష్టి పెట్టి పనిచేసే దాని స్థానంలో లోతైన విశ్వాసం, దృష్టితో కేవలం దైవాన్ని మాత్రమే చూస్తూ, కేవలం దైవాన్వేషణలోనే తరించేదానిని ప్రతిష్ఠించడం తప్పనిసరి. తదుపరి కర్తవ్యం మనలోని నిమ్న అస్తిత్వాన్ని ఈ నూతన విశ్వాసానికీ, మహత్తర దార్శనికానికీ భక్తి పురస్కారాలతో గౌరవించేటట్లు చేయడం. మన ప్రకృతి సమస్తం సమగ్రంగా సమర్పణను అవశ్యం చేసి తీరాలి; సంస్కరించబడని మానసిక బుద్ధికి మదర్థతక కంటె తక్కువగా తోచే భౌతిక ప్రపంచం, భౌతిక వస్తువుల ప్రతి అంశాన్నీ, ప్రతి గమనాన్నీ తనకు తాను దానికే అవశ్యం నివేదన చేయాలి. మన

మొత్తం అస్తిత్వం ఆత్మ, మనస్సు, బుద్ధి, హృదయం, ఇచ్ఛ, జీవనం, శరీరం అంతా తన శక్తియుక్తు లన్నింటితో పూర్తిగా దైవానికి ఉపయుక్తమైన వాహకంగా ఉండేటట్లుగా తయారవటానికి సమర్పించుకోవాలి. ఇది అంత తేలికైన విషయం కాదు. ఎందువల్లనంటే ఈ ప్రపంచంలో ప్రతిదీ స్థిరమైన అలవాటునే అనుసరిస్తుంది. దానికి అదే న్యాయంగా తోస్తుంది, విప్లవాత్మకమైన మార్పును ప్రతిఘటిస్తుంది. పూర్ణయోగంలో ప్రయత్నపూర్వకంగా చేయబూనే విప్లవం కంటె విప్లవాత్మకమైన మార్పు మరొకటి లేదు. ప్రతిదానిని నిరంతరం మనలోని ప్రధాన కేంద్రబిందువైన విశ్వాసానికి, ఇచ్ఛకు, దృష్టి వైపుకు మళ్ళించాలి. ప్రతి ఆలోచనకు, ప్రేరణకు ఉపనిషత్తు ఉటంకంచిన 'అదే దివ్యమైన బ్రహ్మము, కానీ మనుషులు ఇక్కడ ఆరాధించేది కాదు' అనే దానిని గుర్తుచేయాలి. ఇతః పూర్వం తన అస్తిత్వం నిల బడడానికై ప్రాతినిధ్యం వహించే వాటన్నింటిని పూర్తిగా పరిత్యజించడానికి ప్రాణికంలోని ప్రతి పోగు సమ్మతించేటట్లుగా ఒప్పించాలి.

(p. 72)

శాశ్వతునికి ఆరాధానాపూర్వక ఆత్మ నివేదన:

మన అస్తిత్వంలోని ప్రతి రెప్పపాటు కాలమూ, ప్రతి కదలికా నిరంతరం శాశ్వతునికి ఆరాధనాపూర్వక ఆత్మనివేదనగా నిర్మించబడాలి. మన చర్యలన్నీ మహోత్కృష్టమూ, గొప్పగా అసాధారణమూ, ఉదాత్తమూ అయినవే కాకుండా అల్పాతి అల్పమైనవి, సర్వసాధారణమైనవి, తక్కువ ప్రాముఖ్యత కలిగినవాటిని సైతం సమర్పణాపూర్వక చర్యలుగా నిర్వర్తించాలి. మన ప్రత్యేక వ్యక్తిత్వ ప్రకృతి అంతరంగ, బాహ్యగమనాలలోని అవిభాజ్య చైతన్యంలో మనకు ఆవల మన అహం కంటె ఉత్కృష్టమైనటువంటి ఆ ఏదో ఒక మహత్వానికి అవశ్యం అర్పించి జీవించాలి. మన మిచ్చే బహుమతి ఎటువంటిదైనా లేక మనం దానిని ఎవరికి ఇచ్చినా దానిని మనం అస్తిత్వాలన్నింటితో ఉండే ఒకే ఒక దివ్య అస్తిత్వానికే సమర్పిస్తున్నామనే చైతన్యాన్ని అవశ్యం కలిగి ఉండాలి. మన సర్వసాధారణమైన లేక అత్యంత స్థూలమైన భౌతిక కర్మలన్నీ ఈదివ్యత్వ లక్షణాలను అవశ్యం సంతరించుకోవాలి; మనం భుజిస్తున్నప్పుడు మనలో ఉపవిష్టుడైన దైవానికి మన ఆహారాన్ని ఒసంగుతున్నామనే ఎరుకను కలిగి ఉండాలి; అది దేవాలయంలో చేసే పవిత్రమైన నివేదనలాగా ఉండాలి,

భౌతిక అవసరాలను తీర్చే భావన లేక జిహ్వాచాపల్యాలను సంతృప్తిపరచుకోవడం అనే భావన తప్పక దూరమైపోవాలి.... మన ఉచ్ఛ్వాసనిశ్వాసలను, మన గుండె సవ్వడులను సైతం విశ్వయజ్ఞము యొక్క జీవలయలు అనే ఎరుక మనలో కలగాలి.

*

త్యాగపూర్వకమైన ఈ యోగాభ్యాసం మనలను అహం బుద్ధికి అంతరంగంలో దన్నుగా నిలిచే వాటన్నింటినీ మన మనస్సు, ఇచ్ఛ, కర్మలలో నుంచి పక్కకు విసిరివేసి, వాటి బీజాన్ని, వాటి ఉనికిని, వాటి ప్రభావాన్ని మన ప్రకృతిలో నుంచి తొలగించివేసి, వాటన్నింటిని వదలి దూరంగా పోవటానికి ఒత్తిడి చేస్తుంది. ప్రతిదీ దైవం కోసమే తప్పక అనువర్తించాలి, ప్రతిదీ దైవం వైపుకే దృష్టి సారించబడాలి. ఏదీ మన కోసం మన ప్రత్యేకమైన అస్తిత్వ ఉనికి కోసం ప్రయత్నించబడకూడదు. దేనినీ ఇతరుల కోసం చేయకూడదు — వారు ఇరుగుపొరుగువారైనా, స్నేహితులైనా, కుటుంబీకులైనా, స్వదేశం గురించైనా, లేక మానవజాతి గురించైనా లేక సృష్టిలోని ఇతర ప్రాణులైనా సరే. ఎందువల్లనంటే వారు కేవలం మన వ్యక్తిత్వజీవితంతో, ఆలోచనలతో, భావావేశ సంబంధాలతో ముడిపడి ఉంటారు లేదా వారి సంక్షేమంలో ప్రత్యేకాదరాభిమానాలకు అహం ఆసక్తి కనపరచే కారణాన కావచ్చు. ఈ విధంగా కర్మ లన్నింటిని చేస్తూ, జీవితాన్ని చూడటం మూలంగా ప్రతి నిత్యం, జీవితం కేవలం ఈ బృహత్తరవిశ్వంలో అతని హద్దులులేని దేవాలయంలో క్రియాశీలమైన ఆరాధనగా దైవసేవగా అయిపోతుంది.

(pp. 111, 113)

ప్రేమ, ఏకత్వమనే మహోత్కృష్ట ఆధ్యాత్మిక సత్యానికి ఆరోహణం:

...చైత్య అస్తిత్వపు అత్యంత స్వాభావికమైన లక్షణం దైవం వైపు పవిత్ర ప్రేమ, సంతోషం, ఏకత్వాలతో అది చేసే ఒత్తిడి. అది ఎక్కువగా తపించేది పర మోత్కృష్ట దివ్యప్రేమ కోసం. దైవప్రేమయే దానికి ప్రేరకం. దాని లక్ష్యం ప్రకాశ వంతమైన గుహలో నుంచి వెలుగులు చిమ్ముతూ ఆవిర్భవిస్తున్న మహాసత్యమనే నక్షత్రం లేదా మనలో ఇంకా స్పష్టం కాని ఊయలలోని నవజాత అయిన పరదైవం. దీర్ఘకాలం కొనసాగే దాని పెరుగుదలలోని మొదటి అంకంలో, దాని అపరిణితస్థితిలో అది ఐహికమైన ప్రేమ, ప్రీతి, వాత్సల్యం, ఆదరణ, దయార్ద్రత, పరపతి, జాలి,

ఉపకారబుద్ధి అనే వాటి మీదనూ, సౌందర్యం, శాంతస్వభావం, సున్నితత్వం, ప్రకాశం, బలం, ధైర్యం అనేవాటి మీదనూ, ఇంకనూ మానవప్రకృతిలో ముత్యాల మొద్దుబారిన సర్వసాధారణ విషయములను సంస్కరించి, శుద్ధిచేయటానికి తనకు సహాయం చేయగలిగిన తదితరములైన వాటన్నింటి మీదనూ ఆధారపడి ఉంటుంది; కాని ఈ మానవ గమనాలన్నీ ఒక ఉచ్ఛదశలో ఎంతగా కలగాపులగంగా కలిసిపోయి ఉంటాయో, వాటి అధోదశలో అవి ఏ విధంగా అధమస్థితికి దిగజారిపడిపోతాయో, అహం బుద్ధినే ఎంతగా ప్రస్ఫుటం చేస్తాయో, తనను తాను మోసం చేసుకునే మానసికభావాలతో కూడిన కాపట్యము కలిగి ఉంటాయో, ఏ విధంగా ఆత్మగమనాన్ని అనుకరించి తనలోని నిమ్న అస్తిత్వం లాభపడుతుందో దానికి తెలుసు. ఒక్కసారిగా బయటపడుతూ, అది పాతబంధనాలను, అసమంజసమైన భావోద్రేక కార్యకలాపా లన్నింటినీ తెంపివేసి ముక్కలు చేయడానికి వాటి స్థానంలో మహోత్కృష్ట ఆధ్యాత్మిక సత్యప్రేమ, ఏకత్వాలను ప్రతిష్టించడానికీ సిద్ధంగానూ, ఎప్పుడెప్పుడా అనే ఆతు రతతోనూ ఉంటుంది. అయినప్పటికీ అది ఇంకా మానవరూపాలనూ, గమనాలనూ అంగీకరించి అనుగమించవచ్చును, కానీ అవన్నీ కేవలం ఆ దైవం వైపుకు తిప్పబడా లనే నిబంధనతో మాత్రమే. అది తనకు ఉపయోగపడే బంధనాలనే అంగీకరిస్తుంది. గురువుకు హృదయపూర్వక, మనఃపూర్వక, భక్తిపూర్వక పూజ్యభావం, దైవాపేక్షకుల సంయోగము. ఈ అజ్ఞానభూయిష్టమైన మానవలోకం మీద, జంతులోకం మీద, ఆ లోకపువాసులు మీద ఆధ్యాత్మికతాపరమైన దయ, సర్వత్రా దైవం వ్యాప్తిచెంది వున్నాడనే జ్ఞానంతో సమకూరే సుఖసంతోషాలు, సంతృప్తులు అందించే ఆనందాన్ని మాత్రమే ఒప్పుకుంటుంది.

(pp. 155-56)

కష్టాన్ని తగ్గించే రెండు నిబంధనలు:

కేవలం రెండు నిబంధనలు మాత్రమే కష్టాన్ని తగ్గించి, ప్రమాదాన్ని నివారించగలవు. అహం నుంచీ, ప్రాణికమైన కోరికల నుంచీ, కేవల మనస్సుతోనే గాక, దాని మితిమీరిన విశ్వాసంతో తర్కించుటలోని అయోగ్యత నుంచీ ఈ అజ్ఞానభూయిష్ట కార్యనిర్వహకులకు తోడ్పడేవాటన్నింటినీ అవశ్యం తిరస్కరించాలి. అంతరాత్మ చెప్పేదానిని, గురువు మార్గదర్శకత్వాన్ని, జగత్ ప్రభువు ఆజ్ఞను

దివ్యమాత పనిచేసే విధానాన్ని వినడం, అనుగమించడం అవశ్యం నేర్చుకోవాలి. శారీరక కోరికలకూ, ఇంద్రియసుఖాల బలహీనతకూ, అజ్ఞానకలవరంతో అల్లకల్లోలమైపోయే ప్రాణికపు ఆరాటాలకూ, ఉద్రేకాలకూ, ఒక మహోత్కృష్ట జ్ఞానంతో అణచివేయబడని, ప్రకాశవంతంగాని వ్యక్తిగతమనస్సు యొక్క ఆదేశాలకూ ఎవరైతే అంటిపెట్టుకుని ఉంటారో వారు నిజమైన అంతర్గత ధర్మాన్ని తెలుసుకోలేరు. దివ్యత్వ పరిపూర్ణతామార్గంలో అడ్డంకులను పోగుచేసుకుంటారు. ఎవరైతే ఆ అస్పష్ట ఉపకరణాలను కనిపెట్టి, పరిత్యజించగలిగి, అంతరంగంలోను, బాహ్యంలోను వివేచన చేసి, అసలైన ఆ మార్గదర్శకమూర్తిని అనుగమించగలుగుతారో వారు ఆధ్యాత్మిక ధర్మాన్ని తెలుసుకున్నవారై, యోగలక్ష్యాన్ని అందుకోగలరు.

(p. 187)

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

దివ్యస్వభావంతో సారూప్యస్థితికి, ప్రాథమిక ఏకతాస్థితికి మానవుని స్వభావాన్ని మార్చడంతో పాటు భగవంతుని ప్రతిరూపాన్ని మనిషిలో వేగంగా రూపుదిద్ది, అతనిలో దాని ఆదర్శాలను నింపడమే సారతః దివ్య ఆత్మ-పరిపూర్ణతా యోగం.

19/12/2011

మృత్యువు దాని ప్రాధాన్యత



అఖిల

అఖిలభారత పత్రిక — డిశంబరు 2011

19/12/2011

మృత్యువు అంటే ఏమిటి?

శ్రీమాత ప్రవచనములు

విషయసూచిక

వాస్తవానికి, మృత్యువు అనేది అసలు లేనే లేదు.

శ్రీమాత

మృత్యువు యొక్క నిజస్వరూపము

ఈ సృష్టి చిత్రమైనది. జడపదార్థంతో మొదలైనప్పటికి అది పరిణామము చెంది చెంది మానవుడుద్భవించాడు. ఈ మనిషి కూడ అనేక జన్మలద్వారా పరిణామము చెంది దేవతారూపాలను ధరించగలడు. ఒక్కొక్క జన్మలోను ఈ శరీరము కొంతవరకే పరిణామము చెందగలదు. ఎప్పుడైతే ఇక పరిణమించలేదో అప్పుడు ఈ శరీరాన్ని వదిలేసి నూతన శరీరాన్ని ధరిస్తుంది. దానినే మృత్యువు అంటున్నాము. ఇందులో దుఃఖించవలసిందేమున్నది? మన అజ్ఞానంవలన అలా అనుకుంటామేగాని నిజానికి మృత్యువు నూతన దేహధారణా మహోత్సవానికి నాంది. ఇది మనం సంతోషంగా ఎదురు చూడాల్సిన విషయమేగదా మరి. — సంపాదకుడు

మృత్యువు ఆవశ్యకత: పుట్టిన ప్రతిజీవి గిట్టాల్సిందే. అయితే ప్రకృతి ఉద్దేశములో మృత్యువు మానవులు అనుకున్నంత భయంకరమైనదేం కాదు. మానవ చైతన్యంలోను ఉన్నతజాతి జంతువులలోను మృత్యవంటే ఒక రకమైన జగుప్సా భావమున్న మాట నిజమే. అయితే మృత్యువు అవసరము అనే జ్ఞానంకూడ జీవుల అవచేతనలో రహస్యముగా దాగి వున్నది. జీవుల పునర్జన్మకి, పరిణామానికి, రూపాంతరీకరణానికి మృత్యువు ఒక అవసరమైన దశ.

మృత్యువు — జీవరాసుల పరిణామము: సృష్టి జరిగినప్పుడు భూమ్మీద ఉన్న జడపదార్థముయొక్క చిత్రమైన పరిస్థితులవలన మృత్యువు తప్పనిసరి అయింది. దీనిని అర్థం చేసుకోవాలంటే మనం ముందర పరిణామము అంటే ఏమిటో తెలుసుకోవాలి. మొట్టమొదటి దశ అయిన అచేతనారూపము చైతన్యాన్ని పొందాలి. చైతన్యము అనేక రూపములను పొందాల్సి ఉంటుంది. కొత్తరూపములను పొందాలన్నంటే పాతరూపములను విసర్జించాలి. కాని ఆ ప్రక్రియ జరుగుటకు ఒక్కొక్క స్థాయిలోను ఒక్కొక్క నిశ్చయమైన రూపమును దాల్చాలి. ఈ తొడుగును మార్చాలంటే పాతతొడుగును మృత్యువు ద్వారా త్యజించాలి.

పాతరూపాలు శిథిలమైపోతాయి: పరిణామ కార్యక్రమంలో ప్రాణశక్తులు, చేతనాశక్తులు ఒక వస్తువు మీద పనిచేసి దాన్ని పరిణమింపచేస్తాయి. అందుకని ఆ వస్తువు గట్టిగా ఘనరూపంలో ఉండాలి. కాని అది కొంత వరకే మారగలదు. ఆ

తర్వాత అది శిథిలమైపోతుంది. ఆ పరిణామశక్తి వత్తిడికి అది తట్టుకోలేదు. అప్పుడది తన రూపాన్ని మార్చుకోవలసివస్తుంది. దాన్నే మనం మృత్యువంటున్నాము. మృత్యువు యొక్క ఆవశ్యకత మీకిప్పుడు అర్థమైందని తలుస్తాను. అలా కాకుండా పదార్థము తన జడత్వాన్ని పోగొట్టుకుని ఉన్నత శక్తులకు స్పందించి పరిణమించగల సామర్థ్యమును కనుక పొందినట్లయితే మరణించ నవసరముండదు.

*

దేహములో మృదుత్వము లోపించుట: కాని మామూలుగా మానవుని జీవితము మారుతున్న చైతన్యపరిస్థితులకు అణుగుణంగా స్పందించలేదు. మనోమయ పురుషుడు ప్రాణమయపురుషుడు విశ్వశక్తులతోపాటు పురోగమించేందుకు చేతనైనంతవరకు ప్రయత్నిస్తాయి. ప్రపంచపు ఆంతరంగిక రూపాంతరీకరణము ననుసరించి ఈ మానసిక ప్రాణిక పురుషులు కొంతవరకు పురోగమించగలవు. అయితే శరీరం మట్టుకు తన జడత్వము వలన మెల్లిగా నత్తనడక నడుస్తూ ఉంటుంది. సుమారు 70 లేక 80 ఏళ్ళు. మహా అయితే 100 లేక 200 ఏళ్ళకు ఈ భౌతిక కాయం ఇక మార్పుచెందలేక కుప్పకూలిపోతుంది; ఆ విశ్వశక్తులకు తట్టుకోలేక అది మరణముగా పరిణమిస్తుంది.

అన్ని స్తరములలోను సమగ్రమైన మార్పు: మనిషిలోని వివిద భాగములు ఒకేసారి పరిణామము చెంది విశ్వము యొక్క అంతరంగికముతోపాటు మనుగడ చెందినట్లయితే రోగాలుండవు. మృత్యువు ఉండదు. అయితే మనిషియొక్క యావత్స్వరూపము (అన్ని స్తరములు) అంటే మృదువుగా ఉండే పైస్తరముల నుండి స్థూలమైన క్రింది స్తరములవరకు మార్పుచెందాలి. ఆఖరికి అతి కఠినంగా, కర్కశంగా ఉండే భౌతికశరీరం కూడ గొప్పవైన పరిణామశక్తులకు అనుగుణంగా స్పందించి తన రూపమును మార్చుకోవాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి, ఆర్. లక్ష్మీప్రసాదమ్మ

(CWM Vol. 3, pp. 36-37, 87, 90)

మృత్యువు నిర్వహించే పాత్ర

గాలిపటాలు ఆకాశంలో ఎగురుతాయి. ఎదురుగాలి ఎంత ఎక్కువ వేస్తే అంత ఎత్తుగా ఎగురుతాయి. మనిషి విషయంలో కూడ అంతే; తనకెదురైన అడ్డంకులను ఎదుర్కోటంవలన తన స్థాయి పెరుగుతుంది; మృత్యువు ద్వారా చేతనాసోపానాల్ని అవరోహిస్తాడు. తన ద్వారా దైవాభివ్యక్తి ఇంకా ఎక్కువగా జరుగుతుంది. దివ్య ప్రేమంటే ఏమిటో నీకు తెలియదు. ఈ సృష్టి ఇంకా బాల్యదశలోనే ఉన్నది. తేజస్తిమిరములు, ప్రేమద్వేషములు లాంటి పరస్పర వ్యతిరేకలక్షణముల ద్వారా నీ చేతనాస్థాయి పెరుగుతుంది. దివ్యప్రేమ పైనుంచి ధారావాహికంగా వర్షించి నిన్ను తలమునకలు చేస్తుంది. — సంపాదకుడు

(88) తన మనుగడ కోసమే మృత్యువు ఈ ప్రపంచాన్ని సృష్టించింది. నీవు మృత్యువును బహిష్కరించెదవా? అలా చేస్తే జీవితం కూడా నశించిపోతుంది. నీవు మృత్యువును తప్పించలేవుగాని దానిని మహోదాత్తమైన అమృతత్వస్థితిగా పరివర్తనం చేయగలవు.

(89) తను ప్రేమించటం కోసమే క్రౌర్యం ఈ ప్రపంచాన్ని సృష్టించింది. నీవు క్రౌర్యాన్ని తొలగించగలవా? ఆ ప్రయత్నంలో ప్రేమకూడా తొలగిపోతుంది. నీవు క్రౌర్యాన్ని తొలగించలేకపోయినా తద్వ్యతిరేకమైన ప్రగాఢ ప్రేమగా దానికి కొత్త రూపాన్ని సంతరింపజేయగలవు.

(90) ప్రపంచం అజ్ఞానప్రమాదాల పునాదిపై నిర్మింపబడినదని వాటికి తెలిసేందుకే అలా జరిగిందేమో? అజ్ఞానప్రమాదాలను నీవు తొలగించగలవా? తొలగించలేవు. పైగా ఆ ప్రయత్నంలో జ్ఞానాన్ని కూడా కోల్పోతావు. తొలగించటం సాధ్యం కాకపోయినా, వాటిని తర్కాన్ని అధిగమించే పరమప్రకాశంగా రూపొందించగలవు.

(91) మృత్యువులేని జీవితం మాత్రమే ఉంటే, బహుశః అమృతత్వం ఉండేది కాదేమో. క్రౌర్యంలేని ప్రేమ మాత్రమే ఉంటే అది నిరుచప్పని క్షణికోల్లాసమే అవుతుంది. హేతుత్వమే ఉండి, అజ్ఞానమే లేకపోయినట్టయితే, మన

ఘనవిజయాలన్నీ లౌక్యాన్నీ, పరిమితమేధనూ అధిగమించగలిగేవి కావు.

(92) మృత్యువు రూపాంతరం చెందితే జీవితమవుతుంది. క్రౌర్యం పరిణామం చెందితే ప్రేమవుతుంది. అది తట్టుకోలేని తలమునకలయ్యే పారవశ్యం. అజ్ఞానం రూపాంతరీకరణం చెందితే, విజ్ఞానవివేకాల కలీతమైన జ్ఞానజ్యోతిగా ప్రకాశిస్తుంది.

శ్రీఅరవిందుల తలపులూ — సూక్తులు

శ్రీమాత వివరణలు:

ప్రేమయొక్క నిజతత్త్వము: పరస్పర వ్యతిరేకతా, వైరుధ్యమూ అనే లక్షణాలే ప్రగతికి ప్రచోదకాలవుతాయనే భావమిక్కడ వ్యక్తం చేయబడింది. ఎందుకంటే క్రౌర్యమే లేకపోతే ప్రేమ గాఢత్వమూ, తీవ్రతా లేకుండా చప్పగా ఉంటుంది. ప్రేమయొక్క నిజతత్వము వ్యక్తావ్యక్తస్థితులకు ఆవల భాసిస్తుంది. పదార్థపరిణా మాన్ని శీఘ్రతరం చేసేందుకు వ్యతిరేక లక్షణాలు చాలా ముఖ్యమని శ్రీఅరవిందుల భావన.

పరమప్రేమ పరమోత్కృష్టత: అనుభూతిగా ఈ విషయం పరమసత్యం ఏ విధంగానంటే — నిత్యమైన పరమోత్కృష్ట ప్రేమను దర్శించటం మాటల్లో చెప్పాలంటే — అది ప్రతి ఒక్కరికీ ఒక జ్ఞానోపలబ్ధిగా, ఇంద్రియానుభూతిగా కలుగుతుంది. అది కేవలం ఒక అవగాహనే కాకుండా నిర్దుష్టమైన ఆకారంతో మన ముందు నిలుస్తుంది. ఎంతటి ఉద్దీప్త పదార్థచైతన్యంతో రూపొందించి, సిద్ధపరుపబడినా అది ఆ ప్రేమను వ్యక్తం చేయలేదు. ప్రతివారూ మొట్టమొదట ఈ అశక్తతాభావాన్నే పొందుతారు. దీని తరువాతనే అనుభూతి కలుగుతుంది. అప్పుడు ఒక రూపం సాక్షాత్కరిస్తుంది. దీనిని అచ్చంగా క్రౌర్యమనలేము. ఎందుకంటే అది మన మెరిగిన క్రూరత్వం కాదు గనుక. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని గమనిస్తే కొంత తీవ్రత గలిగిన ఒక స్పందన మనకు కన్పించి అక్కడ వ్యక్తమయే ప్రేమను తిరస్కరిస్తుంది, నిరాకరిస్తుంది. నేను మామూలు ప్రపంచాన్ని గురించి కాక, ప్రకృతిచైతన్యం యొక్క ఉత్తమోత్తమస్థాయిని గురించి చెప్తున్నాను. జరిగిన ఒక యథార్థాన్ని వివరిస్తున్నాను. అది ఒక అనుభూతి. ప్రతిఘటింపబడి, వైరుధ్యలక్షణం చేత ప్రహరింపబడిన చైతన్యంలోని ఆ భాగం, తిరస్కరణకు గురైన ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రమే సాధ్యమయ్యే తీవ్రతలో ప్రేమ నిధానానికి మొరపెట్టుకుంటుంది. అప్పుడు మహాప్రవాహమొకటి అవధులు త్రెంచుకొని వెల్లువై ప్రవహిస్తుంది. ఇంతకు ముందెన్నడూ

వ్యక్తం కానిదిప్పుడు ప్రత్యక్షమవుతుంది.

దేహకణములు ఎలుగెత్తి పిలుచుట: జననమరణాలను ఈ దృక్కోణం నుండి పరిశీలించినట్టయితే సరిగ్గా ఇటువంటి అనుభవమే ఎదురవుతుంది. 'సావిత్రి' మహా కావ్యంలో వర్ణింపబడినట్లు మృత్యువును గురించి సుదీర్ఘ చింతనో, నిరంతరం మృత్యువు మన సమక్షంలోనే వర్తిస్తోందన్న భావనో, ఏ క్షణమైనా మృత్యువు మనల్ని కబళిస్తుందన్న భయమో — వీడని సహచరుడిలా ఆజన్మాంతం మనల్ని వెంటాడుతూ ఉంటుంది. దాంతోబాటే మృత్యువు ఆసన్నమైనప్పుడు మాత్రమే కలిగే తీవ్రతలో మన శరీరంలోని ప్రతి కణమూ తీవ్రస్థాయిలో స్పందించి, అమృతత్వశక్తిని ఆవాహన చేసుకుంటుంది. అప్పుడు అవి వ్యక్తీకరణను తీవ్రతరంచేసే మార్గాలని స్పష్టంగా అర్థమవుతుంది. ఇవన్నీ కూడా పురోగతి సాధించడానికీ, పరిపూర్ణత నందుకోడానికీ విధానాలని గోచరిస్తుంది. దీనిని సాధించే విధానాలు మొరటైనవి. ఎందుకంటే దీనివల్ల సాధించబడి వ్యక్తమయ్యేది కూడా ప్రాకృతికం గనుక. అయితే ఇవన్నీ కూడా క్రమక్రమంగా పరిపూర్ణత సంతరించుకుంటూ అంతకంటె ఉత్తమమైన నిరంతర పురోగమనశీలమైన తత్త్వాన్ని వ్యక్తం చేయడానికి యోగ్యమవుతాయి. ఆ ప్రాకృతిక, అపరిపూర్ణ విధానాల స్థానంలో సున్నితమైన సూక్ష్మప్రక్రియలు చోటుచేసుకుంటాయి. ఇటువంటి జాంతవికమైన అమానుష వైరుధ్యాలవసరం లేకుండానే ప్రపంచం పురోగమిస్తుంది. ఎందువల్లనంటే పరిణామ చక్రంలో ప్రపంచం ఇంకా ప్రాథమికస్థితిలోనూ, మానవచైతన్యం శైశవావస్థలోనూ ఉన్నాయి గనుక.

(నిశ్శబ్దం)

ఇది సృష్టిని తమోగుణం నుంచి మేల్కొల్పడానికి శీఘ్రతరమైన, అతిశక్తివంతమైన విధానం. ఇది సృష్టిని పరిపూర్ణత వైపూ, సాఫల్యత వైపూ నడిపిస్తుంది.

(దీర్ఘ నిశ్శబ్దం)

ఇది అతి త్వరలోనే సంభవం కావచ్చు. అయితే అసలు సమస్య ఇది — ఆకాంక్ష ఎంత (తీవ్రంగా) గాఢంగా, శక్తివంతంగా ఉంటే ఈ క్లిష్టపరిణామం అంత సరళమూ, సులభతరమూ అవుతుంది. క్రౌర్యం ప్రేమగా రూపొందింపబడుతుంది. ఇంకా మిగిలినవి కూడా అంతే.

మూలం: శ్రీమాత

భావానువాదం: ధారా రాధాకృష్ణమూర్తి

(CWM Vol. 10, pp. 166-70)

మృత్యువు యథార్థజీవితానికి మేలుకొలుపు!

పుట్టటం గిట్టటం కొరకేనా, పెరుగుట విరుగుట కొరకేనా, ఇది చాలా అన్యాయం అనే ప్రశ్న ప్రతిమనిషిని వేధిస్తూనే ఉంటుంది. జడపదార్థాన్ని ప్రేరేపించి అందులో నుంచి ఉన్నతోన్నతరూపాలని పుట్టించేందుకు మృత్యువు చాలా అవసరము. కాని పదార్థము వట్టి జడము. ఎద్దుమొద్దు స్వరూపం. దాని సామర్థ్యము పరిమితము. అది కొంతవరకు మాత్రమే మారగలదు. అందుకని దానిని మొదట మృత్యువు ద్వారా విచ్ఛిన్న పరచాలి. పునర్జన్మనెత్తి తదుపరి అవతారమును ధరింపజేయాలి. ఇపుడొక నూతనశక్తి దిగివచ్చింది. ప్రచలితమైంది. తగిన ఆధారాల కోసం వెతుక్కుంటోంది. మనమీ అద్భుతావకాశమును జారవిడువకూడదు. దానికి ఒదిగియుండి, మన వైపు ఆకర్షించుకొని, మనలో క్రియాశీలముగావించి ఆనందాతిరేకముతో నాట్యము చేయుదుము గాక. — సంపాదకుడు

మత్యువు జీవితాన్ని నిరంతరం సవాలు చేస్తూ ఉంటుంది. తన నిజస్వరూపం ఏమిటో తనకు తెలియదు. దానిని కనుగొనుటయే తన ప్రథమకర్తవ్యమని మనిషికి గుర్తు చేస్తూ ఉంటుంది. ఒక వేళ మృత్యువే లేదనుకోండి! అప్పుడు మనిషి శాశ్వతంగా ఈ దరిద్రపు జీవితానికే కట్టుబడి ఉంటాడు; అటుల గాక మృత్యువుచే తరమబడినప్పుడు ఇంతకంటె పర్ఫెక్ట్ లైఫ్‌కి గల అవకాశమును గుర్తించడానికి మార్గమును అన్వేషించటం మొదలుపెడతాడు.

శ్రీఅరవిందులు (Thoughts and Glimplses)

పరిపూర్ణ జీవితం కోసం ఆవేదన: చైతన్యం ఏమాత్రమైనా జాగృతమైన ప్రతివ్యక్తీ తన జీవితంలో ఒక్కసారైనా తనకు తాను వేసుకునే ప్రశ్న ఇది. మనిషి అంతరాంతరాలలో ఆయుష్షును పొడిగించాలనీ, దీర్ఘకాలం బ్రతకాలనీ, జీవనాన్ని వికసింపజేయాల్సిన అవసరం ఉంది. మృత్యువు తొలిసారిగా అడుగుపెట్టిన క్షణంలో అది యాదృచ్ఛికమైన సంస్పర్శ కావచ్చు — అది అనివార్యం. ఆ క్షణంలో చైతన్యమంతా భయంతో వెనుకకు మరలి హఠాత్ తిరోగమనం సంభవిస్తుంది.

మృత్యువంటే ఏవగింపు: సున్నితమైన మనస్తత్త్వం గలవారికి అది భయోత్పాతం కల్గిస్తుంది. ఇతరులలో క్రోధం కలుగుతుంది. తనలో ఈ విధమైన

ఆలోచనలు వస్తాయి — 'మనం కోరకుండా, మనం అర్థం చేసుకోలేని, మనం పాల్గొంటున్న ఈ భీతావహఖేలనం ఏమిటి? మనం చనిపోవటానికే అయితే, అసలు పుట్టటమెందుకు? మృత్యుహోమంలో అంతా సర్వనాశనమైపోతుంటే, అంతా హరించుకుపోతుంటే ఇక అభివృద్ధికి, పురోగతికి, ప్రజ్ఞాప్రాభవాల పాటవానికి ప్రయత్నించడమెందుకు?'

కొంతమందిలో తిరుగుబాటు చెలరేగుతుంది. మరి కొందరు బలహీనులలో నిరాశ ధ్వనిస్తుంది. ఎప్పుడూ ఈ ప్రశ్న తలెత్తుతుంది — 'ఈ మృత్యువు వికటట్టాహాసం వెనుక ఒక చైతన్యపూరితమైన సంకల్పమే ఉంటే, అది ఒక పెనుభూతం భీకరాకృతి మాత్రమే.'

పదార్థానికి మేలుకొలుపు: కాని శ్రీఅరవిందులు ఏమంటారో తెలుసా — భౌతిక పదార్థచైతన్యంలో పరిపూర్ణత్వ ఆవశ్యకతను, పురోగతి ఆవశ్యకతను ప్రేరేపించే అనివార్యసాధనం మృత్యువు. ఈ విపత్తు లేకపోతే, మనుష్యులంతా బహుశ తాము ఉన్న పరిస్థితులతో సంతృప్తిచెందేవారు. కాని పరిస్థితులు ఎలా ఉన్నా మనం వాటికి తలవంచి జీవితంలో ప్రయాణించవలసిందే. ఇందులో నుండి బయటపడే మార్గం కనుగొని తీరాలని మనకు మనం చెప్పుకోవాలి.

విశ్వపురోగమనము: అసలు విషయమిది — సృష్టిలో ప్రతీదీ నిరంతర ప్రగతిశీల వికాసస్థితిలో ఉంటుంది. అంటే సృష్టి సర్వస్వం, ఈ విశ్వం యావత్తూ ఒక పరిపూర్ణత్వం వైపు పురోగమిస్తున్నది. అటువైపు మనిషి పురోగమిస్తుంటే, పరిపూర్ణత్వం ఇంకా ముందుకు సాగిపోతుంది. ఈ పురోగమనం ఒక వైపు సాగుతుంటే చైతన్యంలోని అత్యంత సూక్ష్మ అస్తిత్వశ్రేణులు ఆ పురోగతిని అనుసరిస్తూ వుంటాయి. మనిషి ఎంత ఉన్నత శిఖరం చేరితే అంత ఉన్నతంగా పురోగమనం విశ్వపురోగమనాన్ని అనుసరించగలదు. దివ్యవికాస వైభవాన్ని అందుకోగలదు. కాని భౌతిక ప్రపంచం స్వభావరీత్యా ఓ కఠినమైన గండశిల వంటిది. అది జడము. పరివర్తన నెమ్మదిగా, అతి నెమ్మదిగా జరుగుతుంది. మానవచైతన్యం దానిని గమనించడానికి ప్రయత్నిస్తుంది. ఆ పురోగతి కాలం కొలమానానికి దాదాపు అందదు. అందువల్ల బాహ్య, అంతరాభివృద్ధుల మధ్య నిరంతర సమతుల్యరాహిత్యం ఏర్పడుతుంది. ఈ సమతుల్యంలేని స్థితి, అంతర్గత పురోగతి ననుసరించే బాహ్యరూపాల దుర్బలస్థితి వల్ల ఆ రూపాల విధ్వంసం ఆవశ్యకత, రూపాల మార్పిడి ఏర్పడుతాయి. కాని

అదే వేగాన్ని పొందడానికి ఈ పదార్థంలోకి చాలినంత చైతన్యాన్ని చొప్పించగలిగితే. అంతర్గత పురోగమనాన్ని అనుసరించడానికి నవనీతం వలె పదార్థం మృదువుగా మారితే ఈ సమతుల్యస్థితి దెబ్బతినదు. మృత్యువు అవసరం ఉండదు.

శ్రీఅరవిందులు చెప్పినట్లు భౌతికచైతన్యంలో అవసరమైన ఆకాంక్ష, మృదుత్వం మేలుకొల్పడానికి ప్రకృతి ఈ విప్లవాత్మకమైన సాధనాన్ని (మృత్యువు) కనుగొన్నది.

పదార్థంలోని జడత్వము: పదార్థం యొక్క ముఖ్యధర్మం జడత్వం. ఈ కర్కశత్వమే కనుక లేకపోతే వ్యక్తిగత చైతన్యం జడమయంగా ఉంటూ, మార్పును కోరకుండా, నిరంతరం స్తబ్ధంగానే ఉండిపోయేది. ఏది ఏమైనా, ప్రపంచ పరిస్థితులు ఇలాగే రూపొందించబడ్డాయి. కొద్దిగా ఎక్కువ తెలిసిన మనం చేయవలసింది ఒకటి ఉంది. మనకు సాధనాలు ఉన్న మేరకు బలాన్ని, చైతన్యాన్ని, సరికొత్త శక్తిని మనం ఆవాహనచేసి ఈ పరిస్థితిని మార్చాలి. చైతన్యాన్ని రూపాంతరం చెందించి, మృదుపేశలమూ, ప్రగతిశీలం చేయగల ప్రకంపనములను జడపదార్థంలోకి ఆ వినూత్నశక్తి ప్రవేశపెట్టగలదు.

ప్రకృతిలో మార్పుకు అయిష్టత: అయితే సృష్టి ఎప్పటికీ ఇలాగే స్తబ్దంగా శిథిలమైపోతుందని అనుకోకూడదు. మరింత ప్రగాఢమైన జ్ఞానంకలవారు చాల శీఘ్రంగా పురోగమించాలని కోరడం ప్రకృతి గమినిస్తుంటుంది. ఇష్టం వచ్చిన రీతిలో వలయాలలో పరిభ్రమించడం, వెంట వెంటనే ప్రయత్నాలు సాగించడం, అపజయాలు, తొలి ప్రారంభదశలు, కొత్త ఆవిష్కారాలు — ఇవి ప్రకృతికి ఎంతో ఇష్టం. ప్రకృతి సుదీర్ఘకాలం తీసుకుంటే, అది ఎంతో ఆనందదాయకం — ఆమెకు.

పాతవ్యవస్థ పట్ల విసుగుదల: కాని ఎంతటి ఉత్తమమైన ఖేలకైన మనిషి విసిగి వేసారిపోతాడు. ఆ ఆటల్ని మార్చే అవసరం వస్తుంది. ఏదో ఒకనాడు చివరకి ఒక రకం ఆటను గూర్చి అతడు కలలు కంటాడు. అందులో పురోగమించడానికి ధ్వంసం చేయనవసరం లేదని, కొత్త ఉపకరణాలు, కొత్త వ్యక్తీకరణలు కనుగొనడానికి పురోగతిలోని ఉత్సాహం చాలునని జడత్వాన్ని, బద్ధకాన్ని, అవగాహన లోపాల్ని, విసుగుదలను, నిర్లక్ష్యాన్ని దాటుకుపోవడానికి చురుకుదనం తీవ్రంగా ఉన్నదని అతను ఆ స్వప్నంలో తెలుసుకుంటాడు.

మృత్యువుకు ఆహ్వానము: కొత్త పురోగతిని సాధించగానే ఒక చోట నిస్తబ్ధంగా ఉండిపోవాలని ఈ దేహం ఎందుకు కోరుకుంటుంది? దేహం అలసిపోయిందన్న

మాట. 'ఓ నువ్వు నిరీక్షించాలి. నాకు విశ్రాంతి కోసం కొంత సమయం కావాలి' అంటుంది. అదే మరణానికి దారితీస్తుంది. మరింత బాగా పనిచెయ్యాలని (పురోగమనం) మరింత పారదర్శకంగా మారాలని, మరింత సుందరంగా తేజోమయంగా, శాశ్వతంగా యౌవ్వనంతో ఉండాలని కోరుతూ — చురుకుదనాన్ని దేహం తనలో భావించినట్లయితే, ఈ భయానకమైన ప్రకృతి దరహాసాన్ని —మృత్యువును తప్పించుకోవచ్చు.

ప్రకృతిలో ధాతువుల మథింపు: కాని ప్రకృతికి ఇదేమంత ముఖ్యం కాదు. ఆమె మొత్తాన్ని, లీలలోని సమగ్రత్వాన్ని చూస్తుంది. తాను ఏమీ నష్టపోలేదని ఆమెకు తెలుసు. ఎటువంటి ప్రాముఖ్యంలేని, అసంఖ్యాక సూక్ష్మమూలద్రవ్యాలను, పరిమాణాలను తను కలబోస్తున్నట్లు ఆమె భావిస్తుంది. తిరిగి వాటిని ఒక పాత్రలో పోసి మథిస్తుంది. అంతే. ఏదో కొత్తది ఆవిర్భవిస్తుంది. కాని, ఆ ఆట అందరికీ వినోదంగా ఉండదు. కాని ఎవరైనా ప్రకృతంత విశాలమైన చైతన్యంగా, అంత ఆనందంగా మారగల్గితే, ఆమె కన్నా శక్తివంతమైతే దానినే ఆ వ్యక్తి మరింత బాగా ఎందుకు నిర్వహించలేడు?

నూతనశక్తి ఆవిర్భావము: మనల్ని ఎదుర్కొంటున్న అసలు సమస్య ఇదే. భూమి మీదకు దిగివచ్చిన కొత్తశక్తి సహాయంతో, ఇప్పుడు అభివ్యక్తమవుతున్న, పనిచేస్తున్న శక్తి సహాయంతో ఈ బ్రహ్మాండమైన ఆటను ఎవరైనా ఎందుకు గ్రహించకూడదు? ఆ ఆటను ఎందుకు మరింత అందంగా, సామరస్యమైనదిగా, నిజమైనదిగా చేసుకోకూడదు?

వైతాళికులు కావాలి: ఈ శక్తిని స్వీకరించడానికి, ఒక కార్యాచరణను రూపకల్పన చేయడానికి అవసరమైన శక్తివంతమైన ప్రజ్ఞ మాత్రమే కావాలి. ప్రకృతి తాను చేసే పద్ధతికన్న ఇంకా ఇతరములైన పద్ధతులున్నాయని ఆమెను ఒప్పించగల శక్తిగల చైతన్యపూరితమైన వ్యక్తులు ఉండాలి. ఇది ఉన్మాదంలాగా కనిపిస్తుంది. కాని వాస్తవాలుగా అవడానికి ముందు ఎన్నో కొత్తవిషయాలు (ఆవిష్కారాలు) ఉన్మాదంగానే కనిపిస్తాయి.

దివ్యముహూర్త మాసన్నమైనది: ఈ ఉన్మాదాన్ని సాక్షాత్కరింపచేసుకునే సమయం ఆసన్నమైంది. మీలో చాలామందికి మనం అంతా ఇక్కడ ఎందుకు ఉన్నామో హేతువులు తెలియవు. కాని ఆ హేతువులు చాలా చైతన్యవంతమైనవి.

మనం ఇక్కడ ఉన్నాం కాబట్టి ఈ ఉన్మాదాన్ని సఫలీకృతం చేయడానికే మనం సన్నద్ధులం కావాలి. కనీసం ఆ ప్రకారం జీవించినా కూడా అది చాలా గొప్ప విషయం.

మూలం: శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

(CWM Vol. 9, pp. 33-36)

భౌతికంగా మృత్యువు అంటే ఏమిటి?

ఈ విశాల విశ్వంతో పోలిస్తే మనిషి ఒక నలుసే కావచ్చు. కాని అతనికి చాలా ప్రాముఖ్యత వున్నది. అతని శరీరము చిత్రమైనది. చూసేందుకు ఒట్టి రక్తమాంసములే. కాని ఇందులో నక్షత్రలోకములకు స్థానమున్నది. ఈ దేహము విశ్వానికి ప్రతిరూపము. విశాలవిశ్వంలో జరిగే మహత్తరమైన శక్తిప్రయోగాలు, అద్భుతమైన పరిణామాలు మానవశరీరంలో కూడా ప్రతిబింబిస్తాయి. మనమీ విషయాన్ని గుర్తించి దృష్టిని లోపలికి సారించి చూడాలి. శరీరకణములు తపనవలన దివ్యశక్తితో ఉద్దీప్తమైనట్లయితే అవి కూడ దైవమును అభివ్యక్తపరచగలవు. — సంపాదకుడు

ప్రశ్న: భౌతికంగా మృత్యువు అంటే ఏమిటి?

అనేక కోట్ల జీవకణాల సంకలితంవల్ల భౌతికదేహము ఏర్పడుతోంది. కొన్ని కారణాలవల్ల జీవంపోయి, కేంద్రీకృతమైన కణాలు విచ్ఛిన్నమై విడిపోయినప్పుడు, మృత్యువు సంభవించిందని అంటారు.

మూలవస్తువైన చేతనకి మృత్యువు లేదు. అది భౌతిక ప్రపంచంలో శరీరధారణ చేసేటప్పుడు బాగా మన్నగలిగే పదార్థరూపాలనే ఎన్నుకుంటుంది.

ఈ విధంగా ఎంచుకున్న భౌతికశరీరం పరివర్తనా కార్యక్రమంలో బహురూపాలు దాల్చి, క్రమానుగతంగా ఉన్నతోన్నత రూపాలను పొంది, పరిపక్వమయేంతవరకూ నిలిచి ఉండవలసినదే.

ప్రశ్న: కేంద్రీకృతమై ఉన్న కణాలన్నీ ఒక్కసారే చెదిరిపోతాయా? లేక దశలవారీగా విడిపోతాయా?

ఒక్కసారే విడిపోవు. దానికి చాలా కాలం పడుతుంది.

జీవకణాలన్నింటినీ ఏకాండంగా ఉంచాలనుకున్న శరీరం, ఆ సంకల్పాన్ని విరమించుకుంటుంది. మొట్టమొదట జరిగేది అదే. ఏదో ఒక కారణంవల్ల భౌతిక వ్యక్తిత్వం ఈ విచ్ఛేదనకి ఒప్పుకుంటుంది. నష్టపోయిన సామరస్యాన్ని శరీరం తిరిగి పొందలేకపోవటం ఒక ప్రబలమైన కారణంగా చెప్పవచ్చు. అంతేకాక వాటన్నిటినీ తిరిగి సమన్వయించి, సంబాళించడానికి దానికొక రకంగా విసుగు పుట్టడం కూడా కద్దు. ఇంకా ఇటువంటి కారణాలు చాలా ఉన్నాయి. ఇలా ఉన్నప్పటికీ అకస్మాత్తుగా ఏదన్నా ఘోరవిపత్తు వచ్చిపడితే తప్ప, ఈ కణాలన్నిటినీ ఏకాండంగా కలిపి ఉంచాలనే ఇచ్ఛ ఏదే ఒక కారణంవల్ల (కారణం లేకపోయినా కూడ) తన సంకల్పాన్ని విరమించుకుంటుంది. ఇది తప్పనిసరిగా మృత్యువుకు దారితీస్తుంది.

ప్రశ్న: జీవకణాలు చెల్లాచెదరైపోవటంలో ప్రత్యేకార్థం ఏమైనా ఉందా? అది ఏమిటి?

శరీరం ఏర్పడటానికి కారణమైన సమీకృతశక్తి విరమించుకున్నప్పుడు దేహం విఘటితమవుతుంది. శరీరమున్నప్పుడు అన్ని కణాలు చక్కగా వర్ధిల్లి, లోనున్న దైవాంశస్మృతిని తమలో ఇముడ్చుకుంటాయి. శరీరం అంతం కాగానే అవి చెల్లాచెదరై ఇతర సముచ్ఛయాలతో చేరతాయి. తమ స్పర్శద్వారా సముచ్ఛయాలలోని ఇతర కణాలలో దైవచైతన్యాన్ని జాగృతం చేస్తాయి. ఈ విధంగా సమీకృతం, వృద్ధి, విచ్ఛేదఘటనల ద్వారా పదార్థం పరిణామం చెందుతూ, సంపర్కంవల్లనే నేర్చుకొని, అభివృద్ధిచెంది, అనుభవాల్ని పొందుతుంది.

నిజానికి శరీరంతోబాటే కణాలు నశిస్తాయి కానీ, వీటి చైతన్యం మాత్రం ఇతర సముచ్ఛయాలతో చేరుతుంది.

ప్రశ్న: జీవకణాలన్నిటినీ సమన్వయించి, సామరస్యపూరితంగా ఉంచే ప్రయత్నం చేస్తున్న శరీరానికి విసుగెందుకు పుడుతుంది?

సాధారణంగా వ్యక్తిభాగాలలో ముఖ్యమైన ఒక భాగానికి (అది మానసిక విభాగం కావచ్చు, ప్రాణికం కావచ్చు.) పురోగమించడం ఇష్టంలేక నిరాకరిస్తుంది. ఆ నిరాకరణ ఏవిధంగా వ్యక్తమవుతుందంటే కాలం మీద జీవకణాలు కృశిస్తున్నప్పుడు ఆ క్షీణ తను ఎదుర్కోవడానికి అది ఏ విధంగాను సహకరించదు. అందువల్ల శరీరానికి విసుగు ఏర్పడుతుంది.

ప్రశ్న: భౌతికశరీరం సంకల్పానికీ, జీవకణాలకీ సంబంధమేమిటి? వాటి మధ్య సంబంధం ఎలా ఏర్పడుతుంది?

శరీరంలోని కణముల నిర్మాణము విశ్వములోని గోళముల నిర్మాణము ననుసరించి ఉంటుంది. అనగా అంతరంగిక పరిస్థితులకు బాహ్యపరిస్థితులకు మధ్య అంత దగ్గర సంబంధం ఉందన్న మాట. నిజానికి అది 'బాహ్యం' కానే కాదు. వ్యక్తికి మాత్రమే బాహ్యము. మొత్తం ద్రవ్యధాతువు దగ్గర్నుంచి వచ్చే ప్రకంపనాన్ని జీవకణం తన అంతర ద్రవ్యాంశకంలోకి పరిగ్రహిస్తుంది. ప్రతి కణం భిన్నభిన్న కాంతులతో కూడి ఉంటుంది. దాని కేంద్రం పూర్ణప్రకాశంతో విరాజిల్లుతూ ఉంటుంది. ఈ కాంతి ద్వారా అన్ని కణాలూ అనుసంధింపబడి ఉంటాయి. ఇంకా చెప్పాలంటే కేంద్రస్థ ప్రకాశంగా ఉన్న సంకల్పం, వ్యక్తి అంతర్గత సంయోగంతో కణాలలోని కాంతులను స్పృశించి ప్రభావితం చేస్తుంది. ప్రతి ఒక్క కణమూ మొత్తం విశ్వానికో చిన్ని ప్రతిరూపం!

ప్రశ్న: ఆధ్యాత్మికజ్యోతి భౌతికవస్తువు కాదు గదా. అటువంటప్పుడు కణాల మీద ఎలా పనిచేయగలదు?

ఇచ్ఛాశక్తి పదార్థం మీద ఎలా పనిచేస్తుందనే కదా నీ ప్రశ్న. జీవితమంతా ఆ ఇచ్ఛ వలనే నడుస్తుంది. పిల్లలకి చెప్పేటప్పుడు జీవితమంతా ఇచ్ఛాశక్తితోనే నడుస్తుందనీ, ఆ సంకల్పమే లేకపోతే ఉనికే ఉండదనీ, పదార్థం చలనరహితమై అచేతనంగా పడివుంటుందని, సంకల్పంవలన కలిగే ప్రకంపనాల ఫలితంగా పదార్థం సచేతనమై జీవితం సాగుతుందనీ చెప్పవచ్చు. దీనికి శాస్త్రీపరమైన వివరణ చెప్పటం కొంచెం కష్టమేకానీ అసలు విషయం మాత్రం ఇదే. ఆ వాస్తవాన్ని ప్రతిక్షణం గమనించవచ్చు.

ప్రశ్న: కేవలం పురోగమించాలనే సంకల్పము కాలాన్ననుసరించి కలిగే దేహ క్షయాన్ని అరికట్టగలదా? భౌతికసత్త (శరీర వ్యక్తిత్వం) ఈ దేహక్షయాన్ని ఎలా అరికట్టకలదు?

దైహిక పరివర్తనమంటే అదే. పరివర్తనచెందినప్పుడు దేహకణాలు చైతన్యవంతమవటమే కాకుండా దివ్యచైతన్యశక్తికి పరిగ్రహీతలవుతాయి. అంటే మహోన్నత చైతన్యాన్ని తమలో పనిచేయనిస్తాయి. అదే పరివర్తనా ప్రక్రియ.

ప్రశ్న: భౌతికసత్తాను గురించిన ఎరుక వ్యక్తికి ఎలా కలుగుతుంది?

మానవజాతి అంతా భౌతికసత్తాను గురించిన చైతన్యాన్ని మాత్రమే కలిగి ఉంటుంది.

విద్యాసముపార్జన ద్వారా మనోప్రాణికాలను గురించి చేతన కలిగిన మనుషుల సంఖ్య పెరుగుతుంది. ఇక చైత్యపురుషసత్తాను గురించి చేతన గలిగిన మనుషుల విషయంలో, అలాంటివారి సంఖ్య స్వల్పమే. 'భౌతిక అస్తిత్వ చేతనను ఎలా మేల్కొలపాలి' అని నీ ప్రశ్నలోని భావం అయితే, శారీరకశిక్షణ యొక్క లక్ష్యం యదార్థానికి అదే అని చెప్పాలి. శరీరంలోని కణాలను చైతన్యవంతం గావించేది శారీరక శిక్షణకు సంబంధించిన విద్యయే. అయితే, మేధాభివృద్ధికి అధ్యయనం, పర్యాలోచన, బుద్ధి సూక్ష్మతకు దోహదపడే విద్యయే గాక, వీటన్నిటికీ మించి పరిశీలనాత్మకంగా గమనించుట, తార్కిక విశ్లేషణ అవసరం. ఇకపోతే, మనిషి స్వభావానికి సంబంధించినంత వరకు, చైతన్యాన్ని మెరుగుపరచగలిగేది యోగవిద్య మాత్రమే.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామశాస్త్రి)

(CWM Nol. 12, pp. 342-48)

భౌతిక కాయము — మరణరాహిత్యము

పదార్థం ప్రాణం పోసుకుంది. జీవరాసులు ఉద్భవించినవి. అలాగే అవి కూడ విశ్వమహాశక్తులచే మథించబడి పరిణామం చెందుతాయి. కొత్తరూపాలు సంతరించుకుంటాయి ఈ మార్పు, ఈ పరివర్తనము అంచెలంచెలుగా జరుగుతుంది. జీవాత్మ మానవజన్మ ద్వారా మనుగడ సాగిస్తుంది. ఒక జన్మనుండి మరోజన్మకు చేతనాస్థాయి పెరుగుతూంటుంది. నక్షత్రాలలో జరిగే మార్పులు కూడ జీవిలో ప్రతిఫలిస్తాయి! కాని ఈ మార్పులు శరీరానికి బోధపడవు. అందుకే అది ఓడిపోయి నశిస్తుంది. మానవశరీరము అతిమానసీకరణమైనప్పుడు ఇక మృత్యువుయొక్క ఆవశ్యకతే ఉండదు.

— సంపాదకుడు

మరణరాహిత్యమనగా భౌతికకాయము రాలిపోయిన తరువాత మానసికవ్యక్తి సజీవంగా ఉండటం కాదు. అలా కూడ జరిగితే జరగవచ్చును కాని సశరీరంగా ఉండికూడ ఆత్మ (జననమరణములులేని ఆత్మకు ఛాయారూపమైన ఈ శరీరము కేవలం ఒక సాధనము మాత్రమే) జ్ఞానమును పొందుటయే నిజమైన మరణ రాహిత్యము.

శ్రీఅరవిందులు (మెరుపులు — తలపులు)

మనస్సు — శరీరాల సంబంధం: మానవశరీరానికి శక్తినిచ్చి చరింపచేసేది ప్రాణమయపురుషుడైతే, దాన్ని నియంత్రించేది, చాలావరకూ పాలించేది మనోమయపురుషుడు. ఈ మనోమయపురుషుడు ఎంతవరకు వ్యక్తీకరణపొంది స్పష్టమైన స్వతంత్రవ్యక్తి అయినాడు అనే విషయంలో మనిషికీ మనిషికీ తేడా వుంటుంది. చాలామంది మనుషుల్లో మనస్సు ఆకారం లేకుండా తరళంగా ఉంటుంది. కాబట్టి దానికి వ్యక్తిత్వం లేదు. ఈ విధంగా పద్ధతిప్రకారం తనను తాను ఏర్పాటు చేసుకోకుండా చపలంగా, తనకంటూ సంగ్రహజీవితం లేకుండా, వ్యక్తిత్వం లేకుండా ఉన్నంతకాలం దానికి మనుగడ లేదు. భౌతికశరీరం నశించిపోయి మట్టిలో కలిసిపోయినప్పుడు ఈ మనోమయపురుషుడు మానసికలోకంలో కరిగిపోతాడు.

అమరత్వమంటే ఏమిటి: శ్రీఅరవిందులు అమరత్వమని చెప్పింది ఇది కాదు. ఆద్యంతాలుకానీ, జననమరణాలుకానీ లేక, శరీరానికి అతీతంగా ఉండే జీవనమే అమరత్వము. ప్రతి ఒక్కరిలోనూ తప్పనిసరిగా ఉండే ఆత్మజీవనమే అది. ఆ ఆత్మ పరమాత్మకంటే వేరుకాదు. ఈ సారభూతాత్మకు భగవద్భావన ఉంటుంది. నిజానికి అది పరమాత్మ స్వయంవ్యక్తీకరణమే. అది ఆద్యంతాలు. జీవన్మరణాలులేక అనంతకాలం నిలిచిపోతుంది. ఈ పరమాత్మ చైతన్యాన్ని మనం సంపూర్ణంగా పొందినప్పుడు దాని అనంతజీవత్వంలో మనమూ పాల్గొని అమరులవుతాము.

ఈ అమరత్వమనే మాటను అపార్థం చేసుకోవడమూ, కువ్యాఖ్యలు చేయడమూ సర్వసాధారణమే. ఒకే దేహం కలకాలం నిలిచిపోవడమే అమరత్వమని అందరూ అనుకుంటారు.

శరీరానికి అమరత్వము: వారనుకున్నట్లు శరీరం కలకాలం నిలిచిపోగలదు కానీ, అలా నిలిచిపోవాలంటే అది సంపూర్ణంగా తనలోని దివ్యాంశను తెలుసుకొని దానితో ఐక్యతను పొంది, సారూప్యాన్ని సాధించి, నిరంతర పరివర్తనచెందగల శక్తి సామర్థ్యంతో విశ్వగమనాన్ని అనుసరించగలగాలి. శరీరం శాశ్వతంగా ఉండాలంటే ఇది తప్పనిసరి. కానీ శరీరం ఏమాత్రం నమ్యతలేక, కఠినంగా ఉండటంవల్ల అది విశ్వగమనాన్ని అనుసరించలేదు; విశ్వపరిణామంతో ఏకత్వాన్ని పొందగల వేగంతో పరివర్తన చెందలేదు: ఈ కారణాలవల్ల అది కృశించి నశిస్తోంది. దాని స్థిరత్వము, కాఠిన్యము (పరివర్తనకు), అశక్తతవలన అది నశించితీరవలసినదే. ఆ విధంగా పదార్థం, భౌతికరాశిలో చేరిపోయి పరిణామక్రమంలో పురోగతిచెందగల కొత్తనమూనాలు

సృష్టి కావడానికి ఉపయోగపడుతుంది. కానీ ప్రతివారూ అనుకునే అమరత్వం అంటే శరీరంతో నిలిచిపోవడమనేది ఇంతవరకూ సాధ్యం కాలేదని చెప్పవచ్చు.

శరీరం అతిమానసీకరణ: అయితే అది సాధ్యమేనని శ్రీఅరవిందులు చెప్పారు. దానికొక నిబంధన మాత్రం ఉంది. శరీరం అతిమానసీకరణం కావాలి — అంటే అతిమానసలక్షణాలైన మృదుత్వం (నమ్యత) నిరంతరం పరివర్తనచెందగలిగే స్వభావం దానికుండాలి. శ్రీఅరవిందులు మానవశరీరాన్ని కేవలం ఒక సాధనమనీ, ఒక ప్రతిచ్ఛాయ అనీ అనటంలో వారి ఉద్దేశం ఇది. జీవాత్మకు అది కేవలం ఒక ఉపకరణం గానే ఉంటున్నదనీ, పైగా చాలా అనుచితమైన అభివ్యక్తత మాత్రమేననీ, అంటే శరీరం ఇప్పుడున్న స్థితిలో అతిసున్నితంగా, కాంతివంతంగా వెలుగుతున్న అంత రాత్మకు కేవలం ఛాయారూపంగా, మనగమసగ వ్యక్తీకరణగా ఉంటూ ఇలాగే దీర్ఘకాలం కొనసాగగలదని వారన్నారు.

ఛాయామాత్రంగా ఉండే శరీరం ఆత్మోన్నతికి ఏవిధంగా పనికివస్తుంది? ఈ ఉపకరణాన్ని ఏవిధంగా సంస్కరించి అభివృద్ధిచేస్తే రానున్న జన్మలలో బాగా ఉపయోగపడగలదు అనే విషయాలు ఆసక్తికరంగా ఉంటాయి కదా!

ఆత్మ శరీరాన్ని ఎందుకు ధరిస్తుంది?: ఆత్మ మాటిమాటికీ భూమీమ్మదికి వచ్చి శరీరమును దాలుస్తుంది. అభివృద్ధిచెందుటకై నూతనానుభూతులను పొందుతుంది. మొదట బీజరూపంలో నున్న చైత్యపురుషుడు జన్మలపరంపర ద్వారా వృద్ధిపొంది సంపూర్ణచైతన్యమును సాధిస్తాడు. అప్పుడు స్వతంత్రుడై తనకు ఏవిధమైన జీవితం అవసరమో ఆ విధమైన జన్మ నెత్తుతాడు. తదనుగుణమైన దేశకాలపరిసరా దులను ఎంచుకుంటాడు.

శరీరధారణ అనగా అంధకారంలోకి ప్రవేశం: ఆత్మ భూలోకంలోకి దిగి వచ్చి నప్పుడు అజ్ఞానాంధకారములలో నిమజ్జనమైపోతుంది. అందుకని చాలాకాలము ఈ మొద్దుశరీరంలోకి కొంచెం చైతన్యాన్ని ఉద్దీపింపచేయడంతోటే సరిపోతుంది. మనము శరీరమును సంస్కరింపజేయుటకు ముఖ్యమైన కారణమిదియే. క్రమశిక్షణతో శరీరాభివృద్ధే కాకుండా ఆత్మకూడా దాంతోపాటు ప్రదీప్తమై పురోగమిస్తుంది.

అనువాదం: ఎ. ప్రభావతి, ఎ. వెంకటరామశాస్త్రి, ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి

*

53. వివిధ మతశాఖల మధ్య పోరాటాలు ఎలాంటివి అంటే, ఎన్నో పాత్రలు వున్నా ప్రత్యేకంగా ఒక్క పాత్రలో మాత్రమే మరణరాహిత్యాన్ని ప్రసాదించగల అమృతం నింపాలి అంటూ మనుషుల మధ్య తలెత్తే వివాదాల లాంటివి. వారిని అలా తర్కించుకోనీ. మనకు కావలసింది కేవలం మరణరాహిత్యం పొందటానికి అవసరమైన అమృతం — అది ఏ పాత్రలోదైతే నేమి.

54. పాత్రకు స్వతహాగా వుండే వాసన దానిలోని ద్రవాన్ని మారుస్తుందని మీరంటారు. అది కేవలం ఒక వాసన, ఒక రుచి; అంతమాత్రాన దాని అమరత్వ లక్షణాన్ని ఏది పోగొట్టగలదు?

శ్రీఅరవిందులు (*Thoughts and Aphorisms*)

శ్రీమాత వివరణ:

మరణరాహిత్యాన్ని ప్రసాదించగలిగే అమృతమే పరమ సత్యం, దివ్యజ్ఞానం, మరణ రాహిత్య చైతన్యాన్ని కలిగించే దైవసంయోగం.

ప్రతి ఒక్క మతశాఖకు దైవానికి చేరువయ్యే తనదైన ఒక మార్గం వుంటుంది. అందుకనే శ్రీఅరవిందులు వాటిని వివిధ రకాల పాత్రలతో పోలుస్తారు. ఆయన ఇలా అంటారు: నీవు ఏ మార్గం అనుసరించినా ఫరవాలేదు. గమ్యమొక్కటే ముఖ్యం. ఏ మార్గం అనుసరించినా, గమ్యం మాత్రం ఒక్కటే. అలాగే, ఏ పాత్రలోనిదైనా అమృతం ఒక్కటే.

కొందరనేది ఏమిటంటే పాత్ర యొక్క వాసన పాత్రలోని అమృతం యొక్క రుచిని మారుస్తుందని. అనగా నీవు అనుసరించే మార్గం దైవంతో మీ సంయోగాన్ని ప్రభావితం చేస్తుందని. అందుకు శ్రీఅరవిందుల సమాధానం: మీరు అవలంభించే వైఖరులు వేర్వేరుగా నుండవచ్చు. ప్రతి ఒక్కరు వారి కిష్టమైన లేక వారి అభిరుచికి తగినదానిని ఎంచుకోవచ్చు. కాని అమృతము, దైవసంయోగము దాని మరణ రాహిత్యశక్తిని పుంజుకుంటుంది.

దైవసంయోగంతో మనకు మరణరాహిత్య చైతన్యం సమకూరుతుంది అని అనుకోవడంలోని భావం. మనలోని చైతన్యం అమరత్వంతో ఐక్యమైనందున తానే మరణరాహిత్యాన్ని అనే అనుభూతి చెందుతుంది. అమరత్వం ఏ క్షేత్రాలలో నెల కొని ఉన్నదో మనకు ఎరుక కలుగుతుంది. ఆ మాత్రం చేత మన భౌతిక పదార్థం

రూపాంతరం చెంది అమరత్వం ఆపాదించుకున్నదని అనలేము. అందుకు వేరొక విధానాన్ని అనుసరించవలసి ఉంటుంది. ముందుగా మీరు ఈ చైతన్యాన్ని పొందటమే కాక, దానిని ఈ భౌతిక ప్రపంచంలోకి కొనితెచ్చి, దానిని భౌతిక చైతన్యాన్ని రూపాంతరీకరించుటకు పనిచేయ నిచ్చుటయే గాక భౌతిక పదార్థాన్ని కూడా రూపాంతరీకరించుటకు వినియోగించాలి. ఇది అధిక ప్రయాసతో కూడుకున్న పని.

చివరిగా, వ్యక్తిగత సాఫల్యతను మానవజాతి యొక్క సమిష్టి సాఫల్యతగా భావించే తప్పిదం చేయకూడదు. మన మెప్పుడైతే అమృతాన్ని కనుగొన్నామో, మనము మతతెగలకు అతీతులైపోయామన్న మాట. ఇక అవి మనకు అర్థరహితములు, నిరుపయోగములు. కానీ, సర్వసాధారణంగా, ముఖ్యంగా మనుషుల విషయంలో, ఇవి సాఫల్యతనొందే వరకూ, ఒక మార్గంగా వాటి విలువ, ఉపయోగము కొనసాగాలి.

అనువాదం: అందుగులాటి కైలాసపతి, జానకి

ప్రశ్నోత్తరాలు

ప్రశ్న: ఎప్పుడు ఎలా చనిపోవాలో ఆత్మ ఎంచుకోదా? వరదలు, భూకంపాలు, అణువిస్ఫోటాలలో అసంఖ్యాకంగా జననష్టం కలిగేటప్పుడు, ఆ ఆత్మలన్నీ ఒకేసారి మరణించాలని కోరుకున్నట్టా?

అత్యధిక శాతం మానవులు సామూహిక విధికే లోబడి వుంటారు. వారి విషయంలో ఈ ప్రశ్న వర్తించదు. తనదంటూ ప్రత్యేకమైన చైత్యపురుషుడుకల వ్యక్తి ఎటువంటి సార్వజనీన విపత్తుల మధ్య నున్నప్పటికీ, తాను కోరుకుంటే బయటపడగలడు.

ప్రశ్న: మరణానంతరం జీవియొక్క అన్నమయ, ప్రాణమయ, మనోమయ పురుషుల నుంచి వేరయ్యాక, ఆత్మకి తన అస్తిత్వం ఎలా తెలుస్తుంది?

ఆత్మ పరమాత్మలోని కిరణమే. ఆ భగవంతునికి తన అస్తిత్వం తెలియడానికి శరీరం అవసరమనుకోను.

ప్రశ్న: అమ్మా, మరణవార్త, అందులోనూ మనకి ప్రియమైనవారిదైతే ఎలా స్వీకరించాలి?

ఆ పరమాత్మ యొక్క ఇచ్ఛ నెరవేరాలని కోరుతూ, చేతయినంత, వీలయినంత ప్రశాంతంగా ఉండాలి.

మనకు ప్రియమైనవారు గతిస్తే, ప్రశాంతంగా మన ప్రేమ వారిపై కేంద్రీకరిస్తే, పోయినవారికి మేలు జరుగుతుంది.

*

ఆత్మ ఈ శరీరాన్ని వదిలాక, ఈ శరీరానికి ఏమి జరిగినా సాధారణంగా, వారికి ఏ బాధా కలగకూడదు. కానీ, ఈ స్థూలశరీరంలో 'ఆకారశక్తి' అనేది ఒకటి ఉంటుంది. శరీరంలోని కణసముదాయాల నుంచి అది పూర్తిగా వేరవడానికి కొంతకాలం పడుతుంది. అది పూర్తిగా వేరయిన తరువాతే శరీరం క్రుళ్ళడం మొదలవుతుంది. అంతకు ముందర దానికి కొంత శరీరస్ఫూర్తి ఉండవచ్చు. అందుకే అంత్యక్రియలు జరిపేందుకు తొందరపడకూడదు.

ప్రశ్న: మనుషులు తమ శరీరాలని ఎందుకు వదిలేయాలి?

ప్రకృతి దివ్యత్వం వైపుకి చేసే పయనంతో సరిసమానంగా తాము ముందడుగు వేయలేరు కనుక.

ప్రశ్న: మృతదేహాన్ని గౌరవించాలా? ఎలా గౌరవించాలి?

సజీవ నిర్జీవ పదార్థాలన్నింటినీ గౌరవించాలి — అన్నీ ఆ దివ్యచైతన్యంలోనే ఉంటాయి కనుక. గౌరవభావం మనసులో, మన అంతరవైఖరిలో ఉండాలి.

ప్రశ్న: మృతదేహంలో భగవంతుడుంటాడా?

ఆయన సర్వాంతర్యామి. ఆయనకి సజీవ నిర్జీవ భేదాలే లేవు.

ప్రశ్న: ఆత్మ ఆనందంగా ఉండి మంచి వాతావరణంలో, ఆధ్యాత్మిక అభివృద్ధి కలిగే చోట పునర్జన్మించాలంటే మనం ఏం చేయాలి?

మరణించిన ఆప్తులను గురించి ప్రేమతో తలచుకోవాలి. దుఃఖించకుండా, ప్రశాంతంగా ఉండాలి.

ప్రశ్న: ఆత్మలు దుఃఖిస్తాయా?

పరమాత్మ నుంచి ఏ కారణంవల్లనయినా వేరయితే దుఃఖిస్తాయి.

ప్రశ్న: ఎవరన్నా దుఃఖిస్తుంటే వారిని ఎలా సముదాయించాలి?

వారి కన్నీరు ఆపే ప్రయత్నం మాని వారిని మనస్ఫూర్తిగా ప్రేమించాలి.

అనువాదం: బి. వరలక్ష్మి

(CWM Vol. 11, p. 61; Vol. 16, p. 416; Vol. 15, p. 131-32)

యోగదృష్టి మామూలు మానసికదృష్టికంటె వేరైనది, లోతైనది. అది మనో, ప్రాణిక, దైహికముల ఉత్పత్తిస్థానమునకు పోయి జ్ఞానాన్ని అక్కడి నుంచి తవ్వుకువస్తుంది. మృత్యువును గురించి చాలా విపరీతమైన భావములు ప్రచారములో ఉన్నాయి. నీ జీవితము విలువ నీకు తెలియదు. దేవుడొక్కడికే తెలుసు. అందుకని "నా కర్తవ్యము అయిపోయింది. నా విధులను నిర్వర్తించేసాను. ఏదో కాలక్షేపం చేస్తూ పైనుంచి పిలుపుకోసం వేచివుంటానులే" అని అనుకోవటం మూర్ఖత్వం. దేహధారణ నీ మనస్సు చేసిన నిర్ణయం కాదు కదా! ఇదే న్యాయం నీ మృత్యువుకు కూడ వర్తించాలి. నీ సమస్యల పరిష్కారము, బలహీనతలపై విజయము మొదలైనవి అన్నీ సరళంగా ఉన్నప్పుడే సాధ్యములు. — సంపాదకుడు

ప్రశ్న: జీవితంలో 'నా కర్తవ్యాన్ని పూర్తి చేసేసాను. ఇక సాధించవలసినదేమీ లేదు' అని ఎవరైనా అనుకుంటే, ఆ వ్యక్తి దిశాహీనంగా అర్థరహితంగా బ్రతికే బదులు మరణించి మళ్లీ ఇంకో జన్మెత్తితే సరిపోతుంది కదా!

దైవమునకే చెందియుండుట: నెరవేరని గంపెడు కోరికలతో నిరాశ చెందిన వ్యక్తి అలాగే అనుకుంటాడు. కానీ భగవంతునికి చెంది సత్యమయజీవనమునే గడపాలనుకున్న వ్యక్తి అలా అనుకోడు. ఈ భూమి మీద ఎంతకాలము తన ఉపయోగము ఉండేటట్లు భగవంతుడు నిర్ణయిస్తే అంతకాలము జీవించితీరాలి అని గుర్తిస్తాడు. 'తన వలన ఇక ఎటువంటి ఉపయోగము ఉండబోదు' అని భగవంతుడు నిర్ణయించినప్పుడే తన జీవయాత్రను ముగిస్తాడు. అందుకని ఈ ప్రశ్నే ఉదయించదు; ఆ నిర్ణయాన్ని దైవానికే ఒదిలేసి ప్రశాంతంగా జీవితమును గడుపుతాడు.

ప్రశ్న: మీరు నిన్న వ్రాసారు 'భగవంతునికి చెందిన వ్యక్తి' అని. అందరు, భగవంతునికి చెందినవారే గదా?

నిరంతర దైవానుభూతి: 'భగవంతునికి చెందిన ఏ వ్యక్తి అయినా' అని అన్నప్పుడు ఏ వ్యక్తి అయితే అహంకారమును తనలో పూర్తిగా నిర్మూలించి భగవత్ స్ఫురణలోనే ఎల్లప్పుడూ ఉంటూ తనదంటూ ఇచ్ఛ ఏదీ లేక దైవప్రేరణాధీనంలోనే ప్రవర్తిస్తూ వేరొక ఆశయము, లక్ష్యమూ గాక భగవంతుడు ఆదేశించిన విధముగానే

జీవయాపన జేస్తుంటాడో అటువంటి వ్యక్తినే ఉద్దేశించి అన్నాను. ఇటువంటి చైతన్య స్థితిలో ఎక్కువమంది ఉంటారని నేననుకోను. ఈ వ్యక్తులు నిజానికి తమ జీవితములు ఉపయోగకరముగా ఉన్నాయా లేవా అని చింతించనే చింతించరు. వీరికి వేరుగా వ్యక్తిగత జీవనమనేదే ఉండదు. వీరందరు భగవంతుని కోసమే. భగవత్ సంకల్పము చేతనే జీవిస్తారు.

*

మనమందరము దేహధారులమై ఉన్నంతవరకు వయస్సు ఎంతైనా, బాధలు ఏవైనా, మనము ఏదో ఒక పనిజేయడానికో లేక నెరవేర్చుకోటానికో జీవిస్తున్నాము అన్న దృఢభావము అన్ని క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనడానికి కావలసిన బలమును మనకు ఇస్తుంది. శాశ్వత ప్రశాంతత కోసమైనా, లేక నిర్వాణానంద ప్రాప్తికైనా సరే దేహము నుంచి త్వరగా నిర్గమించాలనే తొందరపాటు పనికి రాదు. మనము దేహములో ఉన్నంతవరకు నిస్సందేహముగా ఇంకా చేయవలసినవి, నేర్చుకోవలసినవి చాలా మిగిలియున్నవన్న మాట.

*

శరీరమే రక్షణకవచము: దేహమును త్యజిస్తే ఈ గొడవ ఒదిలిపోతుందనుకోకు. ఈ శరీరమే నీ బాధలు తగ్గిస్తుంది. ఈ శరీరమిచ్చే సంరక్షణే లేనపుడు భౌతిక, ప్రాణిక జీవనంలో ఎదురయ్యే బాధలు నిన్ను ఇంకా ఎక్కువగా పట్టుకొని పీడిస్తాయి. ఆ బాధల నుపశమింప జేయుటకు ఏది మార్పుజేయాలో అది మార్పుజేయుటకు, ఏది సరిజేయాలో అది సరిజేయుటకు ఉపయోగపడే శరీరసాధనమును కూడా కోల్పోతావు. మరింత ప్రకాశమయమై, ఆనందమయమై, ఉత్కృష్టమైన చైతన్యములోనికి జీవనమును మరల్చడానికి కూడా శరీరము ఎంతగానో ఉపయోగపడుతుంది.

మృత్యువు నుంచి ఏదీ ఆశించకు. జీవనమే నీ విముక్తి. జీవిస్తూనే నిన్ను నువ్వు రూపాంతరించుకోగల్గుతావు. ఈ పృథ్వి మీదనే నువ్వు పురోగతిని సాధించగలవు. ఈ దేహములోనే నువ్వు విజయమును సాధించగలవు.

*

మృత్యువును గురించిన ఆలోచన అహంభావమునుంచే వస్తుంది — ఎందుకంటే త్వరలోనే తన సామ్రాజ్యాధిపత్యమును వదులుకోవలసి వస్తుందని నువ్వు ప్రశాంతంగా,

నిర్భయంగా ఉండు. ప్రతీదీ తనంతట తాని చక్కదిద్దుకుంటుంది.

*

నువ్వు పూర్ణత్యాగమును గురించి మాట్లాడుతున్నావు. కానీ శరీరమును త్యజించుట పూర్ణత్యాగము అనిపించుకోదు. అహంకారమును త్యజించుటే యథార్థమైన, సంపూర్ణమైన త్యాగము. ఇదే చాలా క్లిష్టతరమైన సాధన. అహంకారమును త్యజించక శరీరమును మాత్రమే త్యాగము చేస్తే నీకు స్వేచ్ఛ ఎక్కడా లభించదు.

*

మృత్యువు గురించిన నీ అవగాహన సరి అయినది కాదు. మృత్యువు నుండి నీవు ఆశించేది ఒక అచేతనాయుత విరామము వలన కలిగే తటస్థ నిశ్చలత్వము. కాని, ఆ విరామం పొందటానికి నీ ప్రయత్నం అవసరం.

కోరికలను త్యజించుట: నువ్వు మృతిచెందినప్పుడు నీ దేహమును కోల్పోవడమేగాక భౌతికప్రపంచముతో సంబంధము, దానిపై నీ ప్రభావమునుకూడా కోల్పోతావు. నీ శరీరము అంతమైనా ప్రాణికానికి జెందినదంతా అంతరించదు. అంటే నీ కోరికలు, సాంగత్యాలు, భోగకామనలు ఇంకా నిన్ను వెంటాడుతూనే ఉండి, అసంపూర్తిగానే మిగిలిపోతాయి. తత్ఫలితంగా నువ్వు అనుభవించే యాతనలు, ఆశలన్నీ ఆడియాశలుగా మిగిలిపోతాయి. ఆశించిన ప్రశాంతత లభించలేదనే వ్యాకులతతో నువ్వు తీవ్రముగా బాధపడుతూ ఉంటావు. సుస్పష్టమైన సాధన ద్వారానే కోరికలను నిర్మూలించగలవు.

మనకు దేహమున్నంత వరకు కర్మలు చేస్తూనే ఉండాలి. ఏదో ఒక పనిలో నిమగ్నమవాలి. అయితే ప్రతిఫలమును ఆశించకుండా లేక ఆ ఫలితము ఈ విధముగాగానీ మరొక రీతిగా గాని ఉండాలని భావించనపుడు మనము సంగరహితులమై ప్రశాంతముగా మరణించడానికి తగిన యత్నము జేసినవారమవుతాము.

*

నువ్వు మృత్యువు నుంచి విముక్తుడవ్వాలంటే నశ్వరముల బంధములలో చిక్కుకోకు! మృత్యువును గురించి భయపడినవాడు మృత్యువుచే అప్పుడే జయింపబడ్డాడు.

*

ప్రశ్న: నాది బలహీనమైన ప్రకృతి కనుక సాధారణ వస్తువులను సహితమూ త్యజించుట కష్టంగా ఉంది. ఒకటి మాత్రము నిజం. నాకు కావలసినది మీరొక్కరే.

మీరే కనుక లేకపోతే మరణమే శరణ్యము. మరి ఇక ఏమీ లేదు. మరణించుట అనే ప్రశ్నే ఉదయించ కూడదు. శరీరమును వదలిపెట్టుట పరిష్కారము గాదు. నీ కోరికలతోనే నువ్వు మిగిలిపోతావు. అది ఇంకా అధ్వాన్నస్థితి. దానికి బదులు నీ కోరికలకు అంతము కావలయునని ఆశించడము ఇంకా తర్కసంగతమూ గాను, యథార్థముగాను ఉంటుంది. అసలు నీ కోరికలన్నీ నిరర్థకములని, నిరుపయోగములని పూర్తిగా గ్రహించి వాటినన్నిటిని హతమార్చు. నువ్వు ఆశిస్తున్నది దివ్యజీవనము గనుక ఓటమిని చవిజూడవలసి వస్తుందనే భయము అక్కరలేదు. త్రికరణశుద్ధితో కూడిన ఆకాంక్ష చివరకు సఫలీకృతమై తీరుతుంది. బలహీనతల నన్నింటిని అధిగమించాలనే ఒక దృఢమైన సంకల్పము నువ్వు జేసుకో. నీలోని బలహీనతలను, అవరోధములను, దోషములను అతిక్రమించుటకు నా శక్తి నీతో ఎల్లప్పుడూ ఉంటుంది. నీకు నా ఆశీస్సులు.

మూలం: శ్రీమాత

అనువాదం: టి. మాధవరావు

ఆత్మహత్య

ఆత్మహత్యకు పాల్పడటం మనిషి చేసే అత్యంత అవివేకమైన చర్య అని ఖచ్చితంగా తెలుసుకోవాలి. ఎందుకనగా దేహం అంతమొందిందంటే చైతన్యం కూడా అంత మొందినట్లు కాదు. నీవు జీవించి ఉండగా ఏదైతే నిన్ను వ్యాకులపరిచిందో అదే నీ మరణానంతరం కూడ నిన్ను వ్యాకులపరచడం కొనసాగిస్తుంది. అయితే నీవు జీవించి ఉన్నప్పుడు నీ మనసును ఇతర విషయాల వైపు మళ్ళించగలిగే అవకాశం ఉండేది. మరణానంతంర ఆ అవకాశం ఉండదు.

*

ప్రశ్న: నేను మీకు ఒక అదృష్టహీనుడినై నిరర్థక, నిర్భాగ్య శిశువు ననుకుంటాను అలాంటి శిశువు ఈ జన్మలో నెరవేర్చవలసిన కర్తవ్యంగాని, సాధించవలసిన లక్ష్యంగాని ఉండదు. అలాంటప్పుడు ఈ లోకంనుండి నిష్క్రమించుట మేలు కదా?

ఈ లోకంలోనే నీవు మార్పు చెందాలి. ఆ మార్పు సంభవమే. ఈ లోకంనుండి

ఇప్పుడు పలాయనం చిత్తగిస్తే నీవు తిరిగి రావలసి ఉంటుంది. అప్పటి పరిస్థితులు ఇప్పటికన్నా అధ్వాన్నంగా ఉండవచ్చు. అంతేగాక అన్ని విషయాల్లో మళ్ళీ మొదటి నుండి ప్రారంభించవలసి ఉంటుంది.

ఒక పిరికిపందగా, ఒక భీరువుగా ఉండటం మాని ప్రస్తుత పరిస్థితులను ఒక ధీరుడిగా ఎదుర్కొని జయించడానికి అవసరమైన ప్రయత్నం చేయడం ఉత్తమం. సహాయం సర్వదా అందుబాటులో ఉంటుంది. దానిని నీ అంతట నీవు పొందటం నేర్చుకోవాలి.

ప్రశ్న: ఆత్మహత్య చేసుకున్నప్పుడు వ్యక్తి ఎందుకు బాధ నొందాలి?

ఎవరైన ఎందుకు ఆత్మహత్య చేసుకుంటారు? ఎందుకంటే, వారు పిరికిపందలు గనుక. ఎవరైన పిరికివారైనట్లయితే, భీరువులుగ బ్రతుకుతున్నట్లయితే, వారు నిరంతరం బాధపడుతూనే ఉంటారు

ప్రశ్న: మరుజన్మలో మళ్ళీ బాధ ననుభవిస్తారా?

చైత్యపురుషసత్తా అనుభవాలకు లోనయ్యే ఒక నిర్దిష్ట ప్రణాళికతో ప్రవేశిస్తుంది. అనుభవాల ద్వారా నేర్చుకొని అభివృద్ధి సాధించాలని దాని ఉద్దేశ్యం. అలాంటప్పుడు ఆ కార్యం నెరవేరకపూర్వమే నీవు నిష్క్రమిస్తే దానిని నిర్వర్తించడానికి నీవు మళ్ళీ రావలసి ఉంటుంది. అప్పుడు పరిస్థితులు మరింత గడ్డుగా నుండవచ్చు. ఆ మాదిరిగ ఒక జన్మలో నీవు తప్పించుకున్నదంతా మరుజన్మలో పునరావృత మౌతుంది. అప్పుడు అది మరింత కష్టతరమైనదిగా నుండవచ్చు. వాటిని ఈ విధంగా తప్పించుకొని వదలకున్నా, జీవితంలో తారసిల్లే కష్టాలను అధిగమించవలసి వస్తే, మనం సాధారణంగా 'పరీక్ష' అనే దానిలో ఉత్తీర్ణులం కావలసి ఉంటుంది. దానిలో ఉత్తీర్ణులం కాకపోయినా లేక దానిని తిరస్కరించినా, దానిలో జయమొందక వెళ్లిపోయినా, మరో సమయంలో అందులో ఉత్తీర్ణత పొందాలి. అప్పుడు అది పూర్వం కన్నా కష్టతరమౌతుంది.

మీకు తెలుసు, ఇప్పుడు మనుషులు అత్యధికంగా అజ్ఞానులుగా ఉన్నారు. వారి భావనాపరంపర ఈ విధంగా ఉంటుంది; జీవితం ఉంది, ఆ పైన మరణం ఉంది; జీవితమంతా కష్టాల పుట్ట. ఇక మరణం ఒక శాశ్వత ప్రశాంతత. కాని అసలు పరిస్థితులు అలా ఉండనే ఉండవు. సాధారణంగా ఒక వ్యక్తి అజ్ఞానపూర్వక అస్పష్ట ఉద్రేకంలో నిర్హేతుకంగా ప్రాణాలు వదిలినప్పుడు అతడు తిన్నగా ఉద్రేకాలతో

నిండిన అజ్ఞానభూయిష్టమైన ప్రాణికలోకంలోకి అడుగిడతాడు. అప్పుడు ఏ కష్టాలనైతే అతడు తప్పించుకోజూచాడో అవి అన్నీ దేహము ఇవ్వగలిగిన రక్షణ కరువై అతని ముందు ప్రత్యక్షమౌతాయి. కారణం, ఎప్పుడైనా నీకు నిద్రావస్థలో భయానకమైన స్వప్నం వస్తే, అనగా ప్రాణిక లోకమందు దుందుడుకుగ వ్యవహరించినట్లనిపిస్తే, దానికి చికిత్స నిన్ను నీవు నిద్ర నుండి మేల్కొలుపుకోవాలి. అనగా నీ దేహంలోకి వెంటనే పునః ప్రవేశించాలి. కాని నీ శరీరం నాశనమొందినపుడు నీకు రక్షణ నీయ గలిగిన శరీరం ఉండదు. ఆ కారణంగ నీ అంతట నీవు ఒక నిరంతర భయానక స్వప్నావస్థలో స్థిరపడిపోతావు. ఆ స్థితి అంత సంతోషకరంగా నుండదు. ఆ భయానక స్వప్నావస్థను తప్పించుకోవాలంటే నీవు చైత్యపురుషసత్తా ఎరుకను కలిగి ఉండాలి. ఆలాంటి చేతనలో నీవు ఉన్నట్లయితే, ఏ విషయాలు కూడ నిన్ను కలవరపెట్టవని రూఢిగ చెప్పవచ్చు. నిజానికి అది ఒక అజ్ఞానభూయిష్టమైన అస్పష్ట కదలిక. అంతేగాక నేను చెప్పినట్లుగ, అది నిర్విరామకృషిని ఆటంకపరిచే ఒక గొప్ప పిరికితనం.

*

తన ప్రాణాన్ని 'అంతం చేయటానికి' తనను తాను చంపుకునే మూఢుడితో ప్రారంభమై (ఇది నిజానికి అన్ని మూఢతలలోకి అత్యంత మూఢమైనది; మనిషి స్థితిని మరింతగ దిగజార్చేది) నిర్వాణం వరకు (ఎక్కడైతే మనిషి తాను తప్పించుకోగలనని ఊహించుకుంటాడో) కొనసాగేదంతా ఏ మాత్రం విలువ లేనిది. అది నానా స్థాయిలకు చెంది ఉంటుంది గాని వెరసి విలువ లేనిది.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

374. నీవు 'మృత్యువు' అని పిలిచేది అసలు ఏమిటి? దైవం చనిపోగలడా? ఓ మృత్యువుకు భీతిల్లేవాడా, నీ వద్దకు వచ్చినది మృత్యుసూచకమైన భయం గొలిపే కపాల చిత్రాన్ని వినోదానికై ముసుగులా ధరించి వచ్చిన జీవితమే సుమా!

శ్రీఅరవిందులు

మరణసమయం ముందే నిర్ణయింపబడుతుందా?

మనిషి జీవితానికి చాలా ముఖ్యమైన వస్తువు అతని చేతన. బాహ్యాజీవనమంతా దాని నిర్ణయమే. మృత్యువు విషయంలో కూడా అంతే. కొన్ని బాహ్యాపరిస్థితులవలన నీకు మృత్యువు ఆసన్నమవుతున్నట్లు కనిపించవచ్చును. కాని నీవు కనుక పైస్తర ములలోకి ప్రవేశించి వాటిని క్రిందికి దింపుకొనినయెడల, బాహ్యాపరిస్థితులు నిన్నేమీ చేయలేవు. ఒక వేళ అది అతిమానసస్తరమే అయినట్లైతే దాని ప్రభావము వలన నీ జీవితస్వరూపమే మారిపోతుంది.

— సంపాదకుడు

ప్రశ్న: మరణసమయాన్ని వేగిరపరచనూ లేము, ఆలస్యమూ చేయలేమని మీరన్నారు. దీని అర్థం మనిషి పుట్టినప్పుడే అతని మరణసమయం కూడ నిర్ణయింపబడి ఉంటుందనా?

నిర్ణయం భౌతికచైతన్యానిది: మరణసమయం ముందే నిర్ణయింపబడదు. అది వేరేస్థాయిలో జరుగుతుంది. మనిషి మరణించటానికి ఒప్పుకున్నప్పుడే అతను మరణిస్తాడని నేను ఎక్కడో వ్రాసినట్లు జ్ఞాపకం. అది నేను ఇక్కడ చెబుతున్నదానికి వ్యతిరేకం. అయితే ఇదే సత్యం. ఈ విషయం నీకు ఇంతకుముందే చెప్పా ననుకుంటాను. ఏమైనా ఇది కూడా నేనెక్కడో వ్రాసిపెట్టాను. మరణం విషయంలో రెండు భిన్నాభిప్రాయా లున్నవి. ఇంతకు ముందు నేను సాధారణ భౌతికపరమైన అభిప్రాయం వెల్లడించాను. అది భౌతికచైతన్యానికి చెందినది.

మన జీవితము అనేక అస్తిత్వముల సంపుటి[1] అని నేనదివరకే మీకు చెప్పినట్లు గుర్తు. ఒక్కొక్క అస్తిత్వము ఒక్కొక్క స్తరమునకు చెందినదై దానిచే నియంత్రింపబడుతుంది. అనగా మన భౌతిక అస్తిత్వము భౌతిక నియంత్రణ స్తరముకు కట్టుబడి ఉంటుంది; అటులనే ప్రాణిక, మానసిక విభాగములు. ఊర్ధ్వ మానసికము, చైత్యము అయా లోకము (స్తరము) ల న్యాయములను పాటిస్తాయి. ఉన్నత అస్తిత్వానికి అతిమానస అస్తిత్వానికి వాటి వాటి నియంత్రణములు (ఈ విషయములను గురించి నేనింతకు ముందరే రాసినట్లు గుర్తు). ఉదాహరణకు భౌతిక పరిస్తితుల

---

[1] ... there are, as it were, different 'layers of determinisms' in our being

వలన నీ మృత్యుఘడియలే వచ్చినయ్యనుకో; కాని అప్పుడు నువ్వు ఉన్నతలోక (అది అతిమానసలోకమే కావచ్చు) సంపర్కమును పొంది, దాని ప్రభావము వలన ఈ భౌతిక ఘటనను అనగా మృత్యువును నివారించగలవు[2]. ఈ భౌతికపరిస్థితుల వలన నిశ్చయింపబడిన మృత్యువును మార్చి దాన్ని తిప్పికొట్టవచ్చు.

రెండు రకముల దృక్పథాలు: ఆ వ్యాసంలో నేను ఇది చెప్పలేదు. అక్కడ నేను కేవలం భౌతికదృక్పథాన్నే వెల్లడించాను. అక్కడ నేను కొంతమంది మనుషులను గురించి చెప్పాను. వారు కేవలం భౌతికచైతన్యం (అనగా శారీరక, ప్రాణిక, మానసిక చైతన్యముల సంపుటి) లోనే నివసించి 50 సంవత్సరాల వయస్సు రాగానే మరణించాలని భావిస్తూనే 87 సంవత్సరాల వరకు బ్రతికారు. అటువంటి మనిషి నొకణ్ణి నేనెరుగుదును. దీనికి పూర్తిగా భిన్నమైన ఉదాహరణ మరొకటి ఉంది. అతడు తాను చేయవలసిన పనులు చాలా ఉన్నాయి కాబట్టి తొందరగా మరణించకూడదనీ, చాలాకాలం బ్రతకాలనీ కోరుకుంటూ ఆరోగ్యం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకొని కూడా మరణించాడు. కొందరి విషయంలో పరస్పర వైరుధ్యాలు కనిపించినా అవి వాస్తవము కావు. వీటన్నిటికి వివరాణాత్మకమైన సమాధానాలు దొరుకుతాయి. ఎలాగంటే వారి పరిస్థితులు కొన్ని భౌతికసూత్రాలకు లోబడే ఉంటాయి. అక్కడ నేను కేవలం భౌతికదృష్టినే తెలియజేసాను.

ఉన్నతజ్ఞానం ప్రమేయం: ఉన్నత నిర్ధారిత అస్తిత్వాన్ని నీవు ఆహ్వానించకపోతే నీవేదీ మార్చలేవు. అటువంటి జోక్యంవలననే నీవు నీ నిర్ధారితో భౌతిక అస్తిత్వాన్ని మార్చుకోగలవు. నీవు భౌతికచైతన్యంలోనే స్థిరంగా వుంటూ నీ నిర్ధారిత భౌతిక అస్తిత్వాన్ని మార్చుకుందామంటే కుదరదు. మొదటి ప్రపంచంయుద్ధ సమయంలో నేనెరిగిన ఒక కుర్రాడికి తుపాకీగుండు తగిలి మరణిస్తాడని ఎవరో చెప్పారట. (యుద్ధంలో మరణం తరచుగా జరిగేదే.) అంతేగాక అతనికి దాదాపు మరణతేదీని కూడ అందించారు. దీనివలన ఆ కుర్రాడు తీవ్రంగా బాధపడి దీర్ఘకాలపు సెలవు తీసుకుని ప్యారిస్ చేరాడు. అతడు రక్షణవ్యవస్థలో అధికారియైనందున అతని జేబులో ఎప్పుడూ పిస్తోలు ఉండేది. అతడొక రోజున ట్రాముబండి నుండి దూకి క్రిందపడిపోయాడు. జేబులోని పిస్తోలు పేలిపోవడంవలన అక్కడికక్కడే మరణించాడు!

---

[2] ఇది హైకోర్టుకిగాని, సుప్రీమ్‌కోర్టుకిగాని అప్పీలు చేసుకొనటము వంటింది..

అంతే, మరణం తప్పించుకోలేక పోయాడు!

ఉన్నతస్తరముల సంపర్కము: నేను ఇటువంటి ఉదాహరణలను ఎన్నైనా చెప్పగలను. అయితే ఇక్కడ మరణం ఒకే స్థాయికి — భౌతికస్థాయికి — పూర్తిగా పదార్థపరమైన దైహిక, మానసిక, ప్రాణిక స్థాయిలకు చెందినది. ఉన్నత జ్ఞానము, ఉన్నత స్తరముల స్పర్శ, అట్టి ఉన్నతస్తరములు భౌతికస్థాయిలోకి దిగిరావటం మాత్రమే ఈ పరిస్థితులను మార్చగలదు. ఈ విధంగా అతిమానసస్థాయిని శాశ్వతంగా భౌతికజీవనంలోనికి తీసుకురాగలిగితే భౌతికజీవనం పరిణామం చెందగలదు — అంటే పూర్తిగా మారిపోతుంది. అయితే ఆ నిబంధనకు లోబడి మాత్రమే — అనగా అతిమనస్సు భౌతిక అస్తిత్వంలోనికి దిగిరావటం వలననే — భౌతికజీవనంలో సంపూర్ణపరిణామం సంభవించగలదు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. కె. వేంకటేశ్వరరావు

(CWM Vol. 6, pp. 47-49)

మనం మరణానంతరం ఏమవుతాము?

ఆత్మ శరీరాన్ని ధరించి భూలోకంలోకి వచ్చి భౌతిక, ప్రాణిక, మానసిక ముడిపదార్థాలతో ఇక్కడ మనుగడ సాగిస్తుంది. ఈ ముడిపదార్థాలన్నీ మరణానంతరము వాటి వాటి లోకాలలోకి వెళ్లిపోతాయి. మనుష్యగతమైన అనుభవాలను జీర్ణించుకునేందుకై ఆత్మ తన లోకమునకు పోయి మళ్ళీ సమయం వచ్చినప్పుడు జన్మ ఎత్తుతుంది. శరీరాన్ని ధరించినప్పుడే అది వృద్ధిచెందగలదు. భూలోకమే ఆ అభివృద్ధికి క్షేత్రము. అందుకని 'చచ్చిపోతే పీడ విరగడైపోతుంది. సమస్యలు తీరిపోతాయి' అని అను కోవటం చాలా పొరపాటు. నీవు చచ్చిపోతే ఏమీ సాధించలేవు. ఈ జన్మలో ఏ స్టేషన్‌వరకు వెళ్ళావో సరిగ్గా అక్కడనుండే నీ మలిజన్మ మొదలవుతుంది. అందుకనే ఈ మానవజన్మ చాల విలువైనది. ఈ అవకాశాన్ని జారవిడువకూడదు.

— సంపాదకుడు

మరణానంతర 'జీవితం': మృత్యువు గురించి, తర్వాత జరిగే తతంగాన్ని గురించి, అనంతరం కొత్త దేహం ఎలా పొందుతారనేదానిని గురించి నన్ను అడిగారు.

ఈ విషయం విచారిస్తే చాలా గ్రంథమే ఔతుంది. ఏ రెండు సందర్భాలు ఒకేలా ఉండవు. వ్యక్తి బ్రతికి ఉండగా తనకు ఏమైనా ఎలా సంభవమో, అలాగే మరణానంతరము కూడా. ఇలా నిజాలు చెప్పుకుంటూపోతే సిద్ధాంతీకరించినట్లు ఉంటుందిగానీ ఈ సమస్యని పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలే బహిర్గతమౌతవి.[1]

అంతిమ ఘడియలలో జీవునికి దేహంమీద ఉన్న వైఖరిపై తన చావు ఆధారపడి ఉంటుంది. ఆ వైఖరి తప్పనిసరిగా తన అంతరంగ పరిపక్వత, సమైక్యతలతో ముడిపడి ఉంటుంది.

*

ప్ర: 'మృత్యులోక' మంటే ఏమిటి? ఈ ప్రశ్న ప్రతి మతానికి రకరకాలుగా చర్చనీయాంశమే. గ్రీకులకు ఇది పడవ ప్రయాణంసో దాటి చేరుకునే 'ఎలీషియమ్'. సరే స్వర్గాలు నరకాలు గురించి చెప్పనే అక్కర లేదు.

ప్రాణిక లోకాలు: వ్యక్తి మరణానంతరం తన భౌతికచైతన్యం భూభౌతిక ప్రాణికప్రాంతం (వాతావరణం) లోనికి సాగిపోతుంది. ఈ ప్రాంతాన్నే సాధారణంగా మృత్యులోకం అంటారు. ఈ లోకం చీకటిలోకం. పంచభూతాత్మకమైన దుష్టకామనలు. హానికరమైన భ్రష్ట శిథిలరూపాల కాలవాలమీ లోకం. ఇవి మనిషిని పీల్చి పిప్పిచేసే భూతపిశాచాల లాంటివి. మానవునికి మృత్యువు ఒక హఠాత్సంఘటన. అంతిమ అఘాతం. (ఏ కొద్దిమందికోగాని, స్పృహతో కూడిన ఇచ్ఛామరణం సిద్ధించదు).

శరీరమే రక్షణకవచము: మరణించిన జీవునినుంచి వైదొలగిన భౌతిక ప్రాణికమే (ఆసూక్ష్మ) దుష్టజీవాలకి జీవనోపాధి. వ్యక్తి బ్రతికి ఉన్నంతవరకు ఇవి అతని దరిచేరవు. శరీరం అతనికి రక్షణకవచంలా పనిచేస్తుంది. భయానకమైన పీడకలలు వచ్చి మెలకువ వచ్చాక హమ్మయ్య! అనుకుంటాం. జీవుని శరీరబంధం విడిపోనంతవరకు అవి అతని జోలికిరావు. కాగా, మరణించిన సమయంలో ఆప్తులైనవారు మృతుని దగ్గర ఏకాగ్రతతో ప్రేమపూర్వకంగా మృతునిగూర్చి భావిస్తూ ఉంటే, ఆ సమ్యగ్భావనలు మృతుని ప్రాణిక జీవనానికి ఆశ్రయము, రక్షణ కల్పిస్తాయి. అలాకాక శత్రువులు చుట్టూచేరి ఉంటే అతని ప్రాణికం దుష్టశక్తుల దాడికి లోనవుతుంది. అదొక భరింపరాని అవస్థ[3]. దుష్టశక్తులు మృతుని గాఢభౌతికచైతన్యాన్ని మాత్రమే

---

[1] పూర్తి ప్రసంగం కోసం *CWM* Vol. 8, pp. 33338; Vol. 3, pp. 14446; Vol. 4, pp. 19192, 204 05; Vol. 5, pp. 3336, 13040, 21518, 26169, 26169; Vol. 7, pp. 8687 చూడండి

స్పృశించగలుగుతాయి. అవి ఉన్నత చైతన్యశక్తుల జోలికి పోలేవు.

చైత్యజీవుని వృత్తాంతము: ఏ శక్తుల దాడికీ వశం కాకుండా ఉండి, అన్నిటికీ అతీతంగా ఉండేది జీవాత్మయే. ఇది స్వేచ్ఛాజీవి. ఎక్కడికి కావాలంటే అక్కడికి పోగలదు; సామాన్యంగా జీవుడు మృతిచెందాక ఆత్మ లోకాలలో విశ్రాంతిగా ఉంటుంది. ఆ దివ్యానంద సమాధిలో గతజన్మ అనుభవాలను అంతర్లీనం చేసుకుంటూ ఉంటుంది. ఈ సమాధిస్థితి తర్వాత మరో క్రొత్త జన్మకోసం క్రిందికి దిగుతుంది. జీవాత్మనేదీ స్పృశించలేదు; దాని స్పృహ ఎవ్వరికోగాని ఉండదు. అలాటివారికి గతజన్మ తాలూకు భౌతిక, ప్రాణిక, మానసిక అనుభవాలు ఎరుకలో ఉంటాయి. ఇది సాధ్యపడేది జీవనము జీవాత్మతో అనుసంధానమై ఉన్నప్పుడే! అలా కాకపోతే మృతుని గతజీవనానుభవాలు చెదిరిపోతాయి. మిగిలేది దీపకళికలా జీవాత్మ ఒక్కటే.

ఇదీ మృత్యువును గురించి నిబంధనావళి. ఇదంతా సామాన్యమానవుల మరణానంతరం జరిగే తతంగం. ఇకపోతే, ఉన్నత ఆధ్యాత్మికమానవుల విషయంలో ఈ నియమావళి సడలిపోతుంది. కొంతమంది (మహానుభావులు) ఉంటారు. గొప్ప సంయోజనశక్తిపరులుగా ఉంటారు. దేహదాసులుకారు వారు. ఆలాటివారు ఈ ప్రమాదాల నధిగమించటం కోసం ప్రాణికస్థాయిలో రక్షణమార్గాలు, వారధులు ఉంటాయి. మృతిచెందగానే వారికి ఆశ్రయమిచ్చి రక్షణ కల్పించే మండలాలు ఉంటాయి. ఈ ఆధ్యాత్మిక పురోగతి ఊహించుకున్నంత మాత్రాన సిద్ధించదు. పాటించవలసిన కఠోర ఆధ్యాత్మిక నియమాలు ఉన్నాయి. ఈ భూమి మీద మనిషిగా (పశువునుంచి) పరిణామం చెంది పుట్టింది ఆధ్యాత్మిక దివ్యజీవిగా బ్రతకటానికే! అలా బ్రతకటల్లేదు కాబట్టే ఈ లోకంలో ఇంత అల్లకల్లోలం. అలా బ్రతుకుతే ఎంత బాగుంటుంది!

అనువాదం: క|రా వెంకటేశ్వర్లు

(CWM Vol. 8, pp. 333-37; Vol. 9, pp. 268-70; Vol. 6, pp. 54-57)

---

[3] మరో చోట మదర్ ఈ విధంగా చెప్పారు. ప్రాణిఖ, శారీరకములు విడిపోక పూర్వమున్న ఆఖరి చేతనాస్థాయి చాలా ముఖ్యము. చివరి క్షణాలలో అతని చేతనాస్థాయి — అతని ఆఖరి కోరిక అనండి, ఆశ అనండి. ఆశయము లేక ఆకాంక్ష అనండి — అతని మరణానంతర యాత్రకి చాల ముఖ్యము. ఆ విషయంలో అతని చుట్టూవున్న అనుచరుల, బంధుమిత్రుల బాధ్యత చాల ఉన్నది. వాళ్లు అతనినే అంటిపెట్టుకొని తమవైపుకు లాక్కొన్నట్లయితే అతనికి తెగతెంపులు చేసికొని వెళ్లటం చాలా కష్టమవుతుంది. అలా చేసే బదులు తన ఉన్నతచేతనలోనికి ప్రవేశించేందుకు అతనికి సహాయపడితే మంచిది.

అమల్ కిరణ్‌గారి తల్లి మరణానంతరం శ్రీమాతతో వారి సంభాషణ

(అమల్ కిరణ్‌గారి కథనం)

శ్రీమాత: అత్యంత ఆసక్తికరమైన విషయం ఒకటి ఉంది. మొదట్లో మీ తల్లిగారి గురించి నాకు వ్రాసినప్పుడు, ఆమె ఆత్మయొక్క ఇచ్ఛను ఈడేర్చగలిగే ఒక నిశ్చయాత్మకమైన శక్తిని ఉపయోగించి చూశాను. మీ తల్లిగారి పరిస్థితి మెరుగుపడటం మొదలైందని తెలిసింది. దీని వలన ఆమె ఆత్మకు వెళ్లిపోవాలనే కోరిక లేదని తెలియవచ్చింది. ఈ విషయాన్ని మరింత సమగ్రంగా పరిశీలిస్తే ఆమె మరో రెండు మూడేండ్లు దీర్ఘకాలిక వ్యాధితో గడుపుతారని, అది ఏమాత్రం స్థిమితమైన కాలం కాదని తేలింది.

చాలా రోజుల తరువాత నీ నుండి సమాచారం అందినప్పుడు నేను మరలా కొంత పరిశీలించాను. ఆ సమయంలో నేను నా గదిలోకి వెళ్లి అటూ ఇటూ పచార్లు చేస్తున్నప్పుడు ఒక అసాధారణ సంఘటన జరిగింది. ఉన్నట్లుండి దివ్యసంకల్పం దిగి వచ్చింది. ఈ సంకల్పం మామూలుగ జోక్యం చేసుకోదు. వ్యక్తి చైతన్యాన్ని ప్రతిపాదిస్తాడు. కాని దివ్యసంకల్పం క్రియాత్మకం కాదు. ఈ విధంగా దివ్యసంకల్పం దిగిరావడం చాలా అరుదు. ఇది ఆ దేవదేవుని ప్రత్యక్ష చర్య. సరే, అది మీ తల్లి గారి ఆత్మను గొనిపోయే ఉద్దేశంతో దిగివచ్చింది. ఇక మీ తల్లిగారి ఆత్మ ప్రతి ఘటించుటకు బదులు వెంటనే సమ్మతించింది. ఇష్టపూర్వకంగా ఆ పరమాత్మ సంకల్పానికి తనకుగా తాను అర్పించుకుంది. అది ఒక చక్కటి చర్య అని నేనంటాను. ఆత్మ చలనంతో కూడిన మానవ సహజ చలనం అక్కడ చోటు చేసుకుంది. అది ఒక ప్రేమభరిత చలనం. తాను తన అనారోగ్యంతో మనుషులను అమితంగా కష్ట పెట్టానని, విసిగించానని, ఇక పైన వారిని కష్టపెట్టదలచుకోలేదని, విసిగించదలచు కోలేదని దాని భావము.

ఇక ఆమెకు మరణమాసన్నమైంది. ఆమె ఆత్మ ఒక్క ఉదుటున నా హృద యంలోకి దుమికి విశ్రమించడానికి విశ్వాత్మలోకి ప్రవేశించింది. మధ్యంతర లోకాల గుండా సాగే పయనంలో ఎక్కడా ఏమాత్రం కష్టపడటంగాని, ఆగిపోవటంగాని జరుగలేదు. ఇందుకు కారణం ఆమె ఆత్మ ఎంతో స్వచ్ఛందంగ, ఎంతో సంబరంగ

ఆ దివ్యసంకల్పానికి సమ్మతించింది. ఆ కారణంగా దివ్యసంకల్పం ఆమె ఆత్మను దాని గమ్యానికి నేరుగా గొనిపోయింది.

అమల్ కిరణ్: అమ్మ మిమ్ములను ఎల్లప్పుడు జ్ఞాపకం చేసుకుంటుండేది. మీ పేరు తప్ప ఆమె పెదవులపై వేరొకటి ఉండేది కాదు. ఎప్పుడైనా దేనిని గురించి ఆలోచిస్తున్నారని అడిగితే ప్రియ మాతను గురించి అని అనేది. డాక్టర్ల వద్ద కూడ మీ గురించి ప్రస్తావించేది. మీ చిత్రాన్ని, శ్రీఅరవిందుల చిత్రాన్ని తన గుండెలపై ఎల్లప్పుడూ పెట్టుకునేది.

శ్రీమాత: అదే కారణం, ఆమె ఆత్మ అంత ఇష్టపూర్వకంగా, అంత తొందరగా తనను తాను ఆ పరమాత్మకు అర్పించుకోగలిగింది.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

మృత్యుభీతిని జయించటమెలా?

అసలు మృత్యువంటే ఏమిటి? మృత్యువు శరీరానిదే కాని దానిలో అధివసించే ఆత్మది కాదు. ఆత్మ అవినాశి. సమస్త ప్రాణికోటిలోని జీవము ఏకము. దాని రూపాలు అనేకము. మరణాన్ని జయించదలచుకున్నవారు ఈ విషయాన్ని మరచిపోకూడదు. తమ చైతన్యాన్ని ఈ శాశ్వతమైన జీవపదార్థంతో అనుసంధించుకోవాలి. ఇది మొదటి మెట్టు. ఈ భయాన్ని జయించేందుకు పలుమార్గాలు కలవు. ప్రతిమనిషి తన ప్రకృతి కనుగుణమైన విధానాన్ని అనుసరించవచ్చును. 'మృత్యువు అనివార్యము కదా! మరి దానిని గురించి బాధపడటమెందుకు?' అని తార్కికబుద్ధి చెపుతుంది. తర్కము కాకుండా హృదయావేశము ప్రధానంగా కలవారైతే, వారి హృదయకుహరంలోని చైత్యపురుషుణ్ణి వేటాడి పట్టుకుని ఆత్మశాశ్వతత్వాన్ని గురించిన అభిజ్ఞతిని పొంద వచ్చు. కొంతమంది దైవం మీద గాఢమైన భక్తికలవారు — దేవుని పాదాలచెంతనే శరణాగతిని పొందుతూ ఉంటారు. అట్టివారు దైవసంరక్షణలో నిర్భయంగా కాలం గడుపుతూ ఉంటారు. మృత్యువును లెక్కచేయరు. మరికొంతమంది యోధులుం

టారు. వారి నరాలలో క్షత్రియరక్తం పారుతూ ఉంటుంది. వారు మృత్యువును గురించి సచేతనంగా పోరాటం సలిపేందుకు వెనకాడరు.

— సంపాదకుడు

మానవుని ప్రగతిపథంలో ఎదురయ్యే అవరోధాలకెల్లా మొత్తం మీద చెప్పాలంటే భయమే అతి తీవ్రమైనది తేల్చవచ్చు. ఈ భీతి బహుముఖి, బహురూపి. తనకు తానే విఘాతం. అంతే కాదు. సాధారణంగా హేతువుకు అందనిదీ, తర్కానికి లొంగనిదీను. ఒక్కొక్కప్పుడు అకారణంగానే ఈ భీతి ఆవరిస్తూ ఉంటుంది.

భయంకే భయం: రకరకాల భయాలన్నిటిలోకి మృత్యుభయం చాలా బలమైనది. ఇది వదిలేది కాదు — అలా వెంటాడుతూనే ఉంటుంది. ఈ మృత్యుభీతి అవచేతనలో బాగా నాటుకుని ఉంటుంది. దీన్ని పోగొట్టుకోవటం అంత సులువు కాదు. ఎందుకంటే ఇది అనేక విభిన్న అంశాల అల్లిక జిగిబిగితో గూడుకట్టుకుని ఉంటుంది. ఆత్మసంరక్షణ, ఏదైనా కొత్తదాన్ని చూస్తే దడ, అనుకోని హఠాత్సంఘటనలవల్ల కలిగే ఆవేదన, ఇవన్నీ మృత్యుభయానికి తోడుదొంగలు.

'మరణమేమీ తప్పనిసరి కాదు — కొన్ని నిబంధనలను పాటించినట్లైతే దానిని జయించవచ్చును' అనే విశ్వాసం అన్నిటికంటె ప్రధానమైనది. ఇది శరీరంలోని కణకణాలలో నిక్షిప్తమై ఉంటుంది. అయితే ఈ విజయాన్ని సాధించడానికి భయమే ఓ పెద్ద అవరోధము. ఎందుకంటే — దేనిని గురించి భయపడతామో దాన్ని సాధించడం అసాధ్యము. మృత్యువంటే భయపడి బెదిరిపోయేవారిని భయమే జయిస్తుంది.

మరి ఈ భయాన్ని అధిగమించడం ఎలా?

దీనికి అనేక పద్ధతులు చేపట్టవచ్చు. అయితే ఈ సాధన మనకు సులువుగా ఉండడానికి తొలుత కొన్ని ప్రాథమిక భావనలు అవసరం.

జీవితమొకటే — రూపాలు అనేకం: మొట్టమొదటిదీ, అతి ప్రధానమైనదీ అయిన భావన ఏమిటంటే — 'ఈ జీవితం అనేది ఒకటే! దానికి నాశనం లేదు' అని తెలుసుకోవడం. 'రూపాలు మాత్రం అనేకం. అవి అన్నీ క్షణభంగురరాలూ, బుద్బుదప్రాయాలూనూ' అనే ఎరుక మనస్సులో శాశ్వతంగా నాటుకుపోవాలి. అన్ని రూపాలకు అతీతమై స్వతంత్రంగా ఉండే శాశ్వతజీవితంలో ప్రతీవారూ సాధ్యమైనంతవరకు సారూప్యం సాధించాలి. సమస్యలను సమర్థవంతంగా

ఎదుర్కోడానికి అవసరమైన మానసికభూమిక దీనివల్ల ఏర్పడుతుంది.

భయాలన్నిటికీ అతీతంగా ఉండాలన్న విషయం ఆత్మకు అవగతమైనప్పటికీ, మన శరీరంలోని కణకణాలలో భయబీజం ప్రచ్ఛన్నంగా ఒదిగే ఉంటుంది; అదృశ్యంగా ఉంటూనే తనంతట తాను బహిర్గతం అవుతూ ఉంటుంది. ఇది హేతువాదానికి అందదు. సాధారణ మానసికజ్ఞానం దీన్ని కనిపెట్టలేదు. అంతరాంతరాల్లో, అంధకారంలో ఉండే దీనిని జాగ్రత్తగా పసిగట్టి దానిపై వివాదరహితమైన విజ్ఞానాన్ని ప్రసరింపజేయాలి.

జీవానికి మరణం అనేది అసలు లేనే లేదు. రూపాలు మాత్రమే రద్దవుతూ ఉంటాయని కదా మనం తెలుసుకున్నాం. అయితే ఈ రద్దే భౌతిక మనస్సుని భయకంపితం చేస్తుంది. విచారసాగరంలో ముంచుతుంది. అభివృద్ధిచెందే దిశలో నిత్యం రూపం మారే ఈ చర్యను ఏదీ ఆపలేదు. ఈ అభ్యుదయ పరిణామమే మృత్యువును తప్పనిసరి కాకుండా చేస్తుంది. అయితే దీన్ని సాధించడం చాలా కష్టం. దీన్ని సాధించాలంటే కొన్ని నియమాలు ఉండి తీరాలి. వాటిని బహుకొద్దిమంది మాత్రమే సాధించగలరు. అంటే మృత్యభయాన్ని అధిగమించడానికి అనుసరించతగ్గ విధానం వ్యక్తిలక్షణాన్ని బట్టి, మానసిక్థితిని బట్టి ఉంటుంది. ఈ విధానాలను ప్రధానంగా నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. మళ్లీ ప్రతీ రకంలోను అనేక విభాగాలు. అయితే ప్రతివ్యక్తి తన చికిత్సావిధానము తనే తయారుచేసుకోవాలి.

హేతువాదం: మొదటి పద్ధతి కార్యకారణ సిద్ధాంతానికి సంబంధించినది. ప్రస్తుత ప్రపంచ పరిస్థితిలో మృత్యువు అనివార్యమని, పుట్టినవారు గిట్టక తప్పదని, దాని సమయం ఆసన్న మైనప్పుడు అది వచ్చి తీరుతుందని, ఆ ఘడియవస్తే, ఒక్క క్షణం ఆగడానికి వీల్లేదని ఎవరైనా చెపుతారు. మరణాన్ని కోరుకుంటూ దానికోసం ఎదురుచూసేవారు ఎంత తొందరపడినా లాభం లేదు. ఆ క్షణం కోసం ఆగవలసిందే! అలాగే మృత్యువు అంటేనే భయపడేవారు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అది హఠాత్తుగా వచ్చి తీరుతుంది. కాబట్టి మరణఘడియ మనకు తెలియకపోయినా కూడా కచ్చితంగా నిర్ధారణ అయ్యే ఉంటుంది. ఏవో కొన్ని అతీతశక్తులు కలిగివున్న వారు తప్ప మానవమాత్రులు ఎవరూ దాన్ని మార్చలేరు.

మరి, అటువంటప్పుడు, మనం తప్పించుకోలేని దాని కోసం భయపడ్డం అవివేకమని ఈ హేతువాదమే మనకు స్పష్టంగా తెలియజేస్తుంది కదా! మరెందుకు

బెడద? మనం చేయగలిగిందల్లా ఒక్కటే ఒక్కటి — మరణం అనే విషయాన్ని అంగీకరించి, ఎప్పుడు ఏది జరుగుతుందోనన్న విచారం ఏమాత్రం లేకుండా, ఏ రోజుకి ఆ రోజే, ఏ క్షణానికి ఆ క్షణమే మన శాయశక్తులా జీవయాత్రను కొనసాగించుటయే. హేతువాదసిద్ధాంతం ప్రకారం నడచుకొనే మేధావులు ఈ విధానాన్ని అనుసరిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ఆత్మావలోకనం: ఆవేశపరులకు మాత్రం హేతువాదం అంత లాభసాటి కాదు. కాబట్టి వారి విధానాన్ని వారే నిర్ణయించుకోవాలి. ఇటువంటివారు ఆత్మావలోకనం అనే రెండో విధానాన్ని ఆశ్రయించవలసి ఉంటుంది.

అన్ని ఆవేశాలకు అతీతంగా మనలో నిరామయమై శాంతిమయమైన అంతరాత్మ లోలోపల ఓ కాంతి నిత్యం దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ఉంటుంది. అదే నీ చైత్య భానుడు. ఆ కాంతిని తెలుసుకోవడానికి కృషిచేయాలి. ఆ తరువాత దాని మీదే ధ్యాస నిలుపుకోవాలి. ఆ కాంతిని తెలుసుకోవడానికి కృషిచేయాలి. ఆ తరువాత దాని మీదే ధ్యాస నిలుపుకోవాలి. ఆ కాంతి నీ అంతరంగంలోనే ఉంది. ప్రగాఢమైన ఆకాంక్షకు దృఢమైన దీక్షను జతచేస్తే దానిని నీవు తప్పక కనుక్కోగలవు. దాన్ని కనుక్కోగలిగావో ఇక అక్షయమైన అనుభూతిస్థాయికి నువ్వు ఎదగగలవు. ఇంతవరకు ఉన్నది, ఇక ముందు కూడ ఉండబోయే శరీరానికి పూర్తిగా అతీతంగా, స్వతంత్రంగా ఉంటావు. నీ అనుభూతులు ఇక దానిపై ఆధారపడి ఉండవు.

నీ ఉనికిని అభివ్యక్తీకరించే ఓ తాత్కాలిక పరికరం మాత్రమే ఈ శరీరం అనిపిస్తుంది. మరణం అంటే లయము కానే కాదు. అది కేవలం ఓ మార్పు మాత్రమే — అని నమ్ముతావు. దాంతో భయాలన్నీ వెంటనే మటుమాయమైపోతాయి. అప్పుడు నిరామయమైన పరిశుద్ధమైన స్వేచ్ఛామానవునిగా నువ్వు నీ మనుగడను సాగించగలవు.

శరణాగతి: ఇది మూడో పద్ధతి — దేవునిపై భక్తివిశ్వాసాలు ఉన్నవారికి, వారి ఇష్టదైవం కోసం తమను తాము సమర్పించుకొనేవారికి అనువైనది. అటువంటివారు సంపూర్ణంగా దైవంలో భాగమే అయిపోతారు. వారి జీవితంలోని అన్ని సంఘటనలు దైవనిర్ణయాలే! వారు వాటిని పూర్తి విధేయతతో మాత్రమే కాకుండా కృతజ్ఞతతో కూడా స్వీకరిస్తారు. అటువంటివారు తమకు సంభవించేవన్నీ తమ ఇష్టదైవానికే సంభవిస్తున్నవని అనుకుంటారు. వారికి తమ దైవంపట్ల అనూహ్యమైన ప్రగాఢవిశ్వాసం

ఉంటుంది. అంతేకాదు, వారు వారి ఇష్టదైవంతో వైయక్తికమైన సంబంధాన్ని కూడా కలిగి ఉంటారు. తమ అభీష్టాన్ని ఆ దైవానికి పూర్తిగా అర్పిస్తారు. జీవనసంఘటనలకు, ఆఖరికి మరణానికి సైతం లొంగకుండా పూర్తి స్వతంత్రంగా ఉంటూ భగవంతుని అద్భుతమైన ప్రేమను, రక్షణను వారు అనుభూతిచెందుతూ ఉంటారు.

సంపూర్ణ శరణాగతిభావంతో తమ ఇష్టదైవం పాదాలచెంతనే ఉన్నట్లు వారు నిత్యం అనుభూతి చెందుతారు. భగవంతుని కరకమలాలలో ఊయలలూగుతూ పూర్తి రక్షణను అనుభవిస్తారు. ప్రశాంతం, ఆహ్లాదం, ఆనందం ఆవరించుకుని వున్న అటువంటి మహానుభావుల మనస్సులో భయానికి తావు ఎక్కడిది? అయితే అటువంటి యోగాన్ని ఎంతమంది సాధించగలరు?

సాహసం: ఇక మిగిలింది — అఖరిది. పుట్టుకతోనే క్షత్రియ లక్షణాలు కలిగివుండేవారు — తమ జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా స్వీకరించలేరు. శాశ్వతంగా ఉండడం తమ హక్కు అనేది వారి నరనరాల్లో జీర్ణించుకుపోయి ఉంటుంది. ఈ భూలోకజీవితం సంపూర్ణమని, శాశ్వతమని వారు భావిస్తారు. మరణం అనేది ఒక వ్యసనం అని భావించడం వారి నైజం. ఆ వ్యసనాన్ని జయించాలన్న ధ్యేయంతోనే తాము జన్మించినట్లు వారు వ్యవహరిస్తారు.

అయితే దొంగచాటుగా దాడి జరిపే అతిక్రూరమైన సైన్యంతో నిరాశాపూరితమైన పోరాటాన్ని వారు ఈ కృషిలో జరపవలసి వస్తుంది. నిరంతర పోరాటం నిత్యం క్షణక్షణం జరపవలసి వస్తుంది. ఎటువంటి పరిస్థితులకైన తలవొగ్గని సాహసం కలవారే దీన్ని చేపట్టాలి. ఈ పోరాటానికి చాలా పార్శ్వాలు ఉంటాయి. పరస్పరం కలిసిపోయి ఒకదానికి ఒకటి దోహదపడే అనేక స్తరాలపై ఈ పోరాటం ఉంటుంది.

మృత్యుభయాన్ని జయించేమార్గం మరోటి ఉంది. అయితే అది బహు కొద్ది మందికి మాత్రమే సాధ్యమౌతుంది. బ్రతికి వుండగానే మృత్యుసామ్రాజ్యంలోకి సాహసంగా ప్రవేశించి అక్కడ నుండి తిరిగివచ్చి మళ్లీ భౌతిక శరీరంలోనే ప్రవేశించాలి. ప్రాపంచిక జీవితాన్ని తిరిగి కొనసాగించాలి. అయితే అటువంటిదానిని సాధించాలంటే — వారు ఉపాసకులై ఉండాలి.

(CWM Vol. pp. 82-87)

*

ఒకవేళ ఏదైనా కారణం వలన ఈ శరీరాన్ని వదిలేసి మరో శరీరాన్ని ధరించాల్సి

వచ్చిందనుకోండి. అటువంటప్పుడు శోకంతో ఏడ్చి రాగాలుపెట్టే బదులు సంతోషంగా, వైభవంగా ఒక శుభకార్యోద్యుక్తుడవై ఎందుకుండకూడదు? మృత్యువును ఒక శుభ మంగళంవలె భావిస్తే బాగుంటుంది. అలా కాకుండా పాత జీవితాన్నే అతుక్కొని ఉండి కనీసం కొన్ని నిమిషాల తరబడి అయినా దాన్ని పొడిగిద్దామనుకొనేవాళ్లు — అట్టివాళ్లు ఆత్మజ్ఞానం లేనివారన్న మాట. మృత్యువంటే ఏమిటి? అది ఒక సాధనమే కదా! మరి దాన్ని ఒక అవకాశముగా మనమెందు కనుకోకూడదు? మనిషికి ఎరుక కలిగితే, దానిని ఒక పసందైనదానిగా మలచుకోవచ్చు — అన్నింటి మాదిరిగా, బహు సుందరమైనది. మృత్యువంటే ఏమాత్రం భయం లేకుండా, ఏ మాత్రం ఆవేదనపడకుండా నిరంతరం దాన్ని గురించే ఆలోచించకుండా ఉన్నవారు, చాల ధైర్యంగా, మరణ మాసన్న మైనప్పుడు తెలెత్తుకుని చిరునవ్వుతో ఇదిగో — 'నేను సిద్ధంగానే ఉన్నాను' అని దాని నాహ్వానించగలరు.

అటువంటివారు వారి జీవితాల్ని చాల ఉపయోగకరంగా గడపగలరు. "నేను ఎన్నాళ్లు ఉండాల్సివస్తే అన్నాళ్లు ఉంటాను. నా లక్ష్యాన్ని సాధించేందుకు ఒక క్షణం కూడా వృథా చేయకూడదు". అట్టివారు సమయమాసన్న మైనప్పుడు ఉత్సాహంగా ఉంటారు. ఎందుకని? వారు భోగభాగ్యములను లెక్కచేయరు. వారికి కావలసింది జీవితలక్ష్యమును సాధించుటయే. జీవితంలోని ప్రతిచర్య దానికి అంకితం చేయుటయే. వారి జీవితానికి ఇది తప్ప వేరా కారణం లేదు. అన్నింటిలోను ఈ లక్ష్యాన్నే చూడగలరు. ఉనికికి ఈ కారణమే ఉన్నదని గ్రహించగలరు. వారు ఎప్పటికీ ఈ హీనమైన భౌతిక జీవితస్థితిలోకి దిగజారరు.

కాబట్టి గుర్తుంచుకోవలసిన విషయాలు — మృత్యువును ఎప్పుడూ కోరుకోకూడదు. మృత్యువంటే ఏమాత్రం భయపడకూడదు. అన్ని పరిస్థితులలోను నిన్ను నీవు అధిగమించాల్సిందే!

అనువాదం పి. నాగేశ్వరరావు, ఆర్. ఎల్. ఎన్. శాస్త్రి

(CWM Vol. 4, pp. 355-56)

నిత్య యౌవన జీవితం

ఎప్పుడు నీవు అభివృద్ధి చెందుట ఆగిపోతుందో, ఎప్పుడు నీ అభ్యున్నతి అణగారిపోతుందో, ఎప్పుడు నిన్ను నీవు ఉద్ధరించుకొనుటను నిలిపివేస్తావో, ప్రయోజనం పొందుట, పెరుగుదల ఆపివేస్తావో, నిన్ను నీవు పరివర్తన గావించుకొనుటను మానుకుంటావో, అప్పుడే నీవు నిజంగా ముదుసలివై పోయావన్న మాట. అనగా శిథిలావస్తకు జారిపోతున్నావన్న మాట.

పడుచు ముదుసలు లుంటారు. అలాగే ముసలి పడుచులుంటారు. నీవు నీలో ఈ అభ్యున్నతి జ్యోతిని, ఈ పరివర్తనా జ్యోతిని నిలుపుకున్నట్లయితే, మెలకువతో ముందడుగు వేయుటకై సర్వమును త్యజించుటకు సంసిద్ధుడవైనట్లయితే, మెలకువతో ముందడుగు వేయుటకై సర్వమును త్యజించుటకు సంసిద్ధుడవైనట్లయితే, ఒక వినూత్న ప్రగతికి, ఒక ఆధునిక అభ్యున్నతికి, ఒక అపూర్వ పరివర్తనకు సదా ఉన్మీలుడవై ఉండగలిగితే, అప్పుడు నీవు నిత్య యౌవనుడవన్న మాట. ఇంతవరకు సాధించినదానితో సంతృప్తిని చెంది, కర్మాచరణను విస్మరించి విశ్రమించినా, నీవు చేరవలసిన గమ్యాన్ని చేరుకున్నావు గనుక, నీ ప్రయాస ఫలితాలను అనుభవించుట తప్ప మిగిలిందింకేమీ లేదనే భావన కలిగినా, నీ దేహంలో సగభాగం సమాధి గతమైందన్న మాటే. అది జరావస్థకు చేరువైనట్లే, నిజమైన మృత్యువును సమీపించినట్లే.

ఇంకా చేయవలసి ఉన్నదానితో ఇంతకు పూర్వం చేసినదానినంతా పోల్చి చూస్తే అది ఏమీ లేదు, అంతా శూన్యం అని తెలుసుకోవాలి. వెనుకకు చూడకు, ముందుకు చూడు; అన్ని వేళలా ముందుకే చూడు; ఎల్లప్పుడూ ముందుకు సాగిపో.

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

375. పాంచభౌతికంగా అజరామరస్థితిని పొందగలిగి, ప్రకృతి సహజమైన అనివార్యతకు బదులు ఇచ్ఛామరణం పొందగలిగే మార్గం ఒకటి ఉంది. కాని, శతాధిక సంవత్సర పర్యంతం ఒకే రకమైన దుస్తులు ధరించడానికిగాని లేక ఒక ఇరుకైన మార్పులేని వసతిగృహంలో చిరకాలం బంధింపబడి ఉండడానికి గాని, ఎవరు మక్కువ కనపరుస్తారు?

శ్రీఅరవిందులు

SUFI WISDOM

I died from minerality and became vegetable;
And from vegetativeness I died and became animal.
I died from animality and became man.
Then why fear disappearence through death?
Next time I shall die
bringing forth wings and feathers like angels;
After that, soaring higher than angels ---
what you cannot imagien,
I shall be that

--- Mevlana Jelalu'ddin Rumi

నేను మట్టిగా నశించి, మొక్కగా అయ్యాను.
మొక్కగా నశించి జంతువుగా మారాను
జంతువుగా మరణించి మనిషిగా మారాను.
మరి మృత్యువంటే భయమెందుకు?
ఈసారి మరణిస్తే దేవతలవలె రెక్కలు కట్టుకుంటాను.
అప్సరసలకంటె ఎత్తు ఎగురుతాను.
ఇంకా నీ ఊహకందని రూపాన్ని ధరిస్తాను.

మెవ్లానా జలాలుద్దీన్ రూమి